శ్రీరస్తు.

శ్రీవిశ్వేశ్వరాయనమః

# కాశీమజిలీకథలు

## ఎనిమిదవ భాగము

ఇది

శ్రీ గోదావరీతీరాలంకారంబగు రాజమహేంద్రవర

పురంబున నివసించియున్న

మధిర సుబ్బన్న దీక్షితకవిచే

రచియింపఁబడి

వారిపుత్రుఁడగు మధిర కొండయ్యశాస్త్రిచేఁ బ్రచురింపఁబడినది.

నాల్గవ కూర్పు 1250 ప్రతులు.

కాకినాడ:

సట్టినుట్టు శేషగిరిరావు పంతులుగారి స్వకీయ

శ్రీ బాజ్జిప్రెస్ యందు ముద్రింపఁబడినది.

1937

[రిజిష్టరు కాపీరైటు.]

[వెల రు. 1—12—0.

చ. ఇరువురు రాజులైరి మఱియిద్దరు రాజుల కల్లురైరి యొ
క్కరుఁడలరాజమిత్రుఁడనఁగాఁదగె నొక్కఁడు యక్షకన్యకం
బరిణయమయ్యె శ్రోత్రియకుమారిత నొక్కఁడు పెండ్లియాడె నీ
ధరఁదగుసప్తమిత్రచరితంబు విచిత్రకథాస్పదంబుగన్.

ఆర్యులారా! ఈభాగమునకుఁ గథానాయకులైన దత్తక చారాయణ గోనర్దీయ కుచుమార ఘోటకముఖ సువర్ణనాభ గోణికాపుత్రులేఁడ్వురును లోకప్రసిద్ధులగు కామశాస్త్రప్రవర్తకులు పాంచాలుఁడు రచించిన కామశాస్త్రమును క్లుప్తపఱచి యేడ్వురునుబంచుకొని తలయొక యధికరణమును వ్రాసిరి. వీరు మహాపండితులైనట్లు వీరురచించినగ్రంథములే చాటుచున్నవి. వాత్స్యాయన సూత్రవ్యాఖ్యానకర్త దత్తకునిగుఱించి యిట్లువ్రాసెను.

గద్య మాధురో బ్రాహ్మణః పాటలీపుత్రే వసతిం చకార. తస్యోత్తరే వయసి పుత్రోజాతః తస్యజాతమాత్రస్య మాతా మృతా. పితాపి, తత్రాన్యస్యై బ్రాహ్మణ్యై తం పుత్రత్వేన దత్వా కాలేన లోకాంతరంగతః బ్రాహ్మణ్యపి మమాయం దత్తకఃపుత్ర ఇత్యనుగతార్థమేవ నామచక్రే స తయాసంవర్థితః కాశీంగత్వా అచిరేణైవ కాలేన సర్వావిద్యాః కలాశ్చ అధీతవాన్. వ్యాఖ్యానశీలత్వాద్దత్తకాచార్య ఇతి ప్రతీతిముపాగతః ఏకదాచ తస్యచేత స్యేవ మభవత్. లోకయాత్రా పరాష్ట్రీయాస్తి సాప్రాయశో వేశ్యాసుస్థితేతి. తతో వేశ్యాజనం పరిచయపూర్వకం ప్రత్యహముపాగమ్య తథాతామభివేద. తతోసా వీరసేనాప్రముఖ గణికాజనే నాభిహితఃఅస్మాకంపురుషరంజనముపదిశ్యతామితి. తన్నియోగాద్వైసికంపృథక్చకారేతి అపిచయక్షేణశప్తో దత్తకః స్త్రీబభూవ పునశ్చకాలేన లబ్ధవరః పురుషోభూత్ తేనోభయరసజ్ఞేన దత్తేన పృథక్కృతమితి.

దత్తకునిజన్మభూమి పాటలీపుత్రనగరము తండ్రిమాధురుఁడు చిన్నతనమునందె తల్లిమృతినొందగాఁ దండ్రివానిని మఱియొక కాంతకు పెంచుకొనసిచ్చెను. దానంజేసి యతనికి దత్తకుఁడను పేరువచ్చినది.

దత్తకుఁడు కాశిలో ననేకశాస్త్రములు చదివి దత్తకాచార్యుఁడని పేరు పొందెను. మఱియు లోకయాత్ర సేయఁదలంచి వేశ్యాజనమువలన దద్విశేషములు దెలియఁగలవని తలంచుచుఁ దఱుచు నాఁడియిండ్లకుఁ బోవుచుండును. ఒకచో యక్షునిచే స్త్రీగా శపింపఁబడి తిరుగఁ గొంతకాలమునకు బురుషుఁడయ్యెనఁట. దానఁ జేసి దత్తకుఁ డుభయరసజ్ఞుఁడని ప్రసిద్ధి జెందెను. పురుషులరంజింపఁజేయు విధానము బోధింపుమని తన్ను వేశ్యాజనము ప్రార్థింప వైశికప్రకరణము రచించెనని వాత్స్యాయనసూత్రవ్యాఖ్యానకర్త వ్రాసియున్నాడు. ఇతనిగుఱించి మఱియొక గ్రంథమున మఱియొకరీతిగా వర్ణింపఁబడియున్నది.

ఏది యెట్లైనను నీయేడ్వురుమిత్రులు ఒక్కగ్రంథమునే పంచుకొని యట్లు తలయొక యధికరణమును వ్రాయుటచే నేకకాలికులని చెప్పకతప్పదు. తక్కినవిషయముల నిజానిజంబులఁ దెలిసికొనుటకు సృష్టించిన బ్రహ్మదేవుఁడుగవలసియున్నది. ఇందలి కథాచమత్కారమునే పరిశీలింపవలయునని చదువరులఁ గోరుచున్నాను.

వీరేడ్వురు కాశిలో విద్యలఁబూర్తి జేసి పండితులతోఁ బ్రసంగించి విజయమందనుత్సుకత్వము చెందుచు భోజునియాస్థానమునఁ బెక్కు పండితులున్నారనివిని మధ్యదేశవిశేషంబులం జూచుచు సంవత్సరము నాఁటికాపీటికి జేరుటకునిశ్చయము జేసికొని తలయొకదారిఁ బయలుదేరిరి. అందుదత్తకుండు ఒకమార్గంబునంబడిపోవుచు దారితప్పి యొక యర్ధరాత్రంబున యక్షశైలంబునకుఁబోయి తత్క్రీడా విశేషంబులఁ జూచిచూచి యతనిచే స్త్రీగాఁ శపింపబడియెను. ధారానగరముచేరువఱకు నాఁడుతనము రాకుండునట్లును సంవత్సరముగాఁగానే శాపాంతమగునట్లును నతనిచేవరంబువడసి యప్పురంబునకుఁ బోవుచుండ రాజపుత్త్రికయొక్కగుఱ్ఱము కళ్ళెము త్రెంచుకొని పారిపోయి యూదత్తు నెక్కించుకొని యుద్యానవనములోఁ బ్రవేశించినది. అంతలోనతం డాఁడుదియయ్యెను. మొదటఁజూచినవారలతని బురుషుఁడనియుఁ దరువాత జూచినవారు స్త్రీయనియు వాదించిరి. దత్తుండు స్త్రీపురుషరూపములతో నాపీట గావించినచర్యలు కడునాశ్చర్యకరములుగా నుండును. భోజరాజకాళిదాస వియోగసంయోగకథలును గోఁడకొప్పు

త్రుఁడు పాటలీపుత్రనగరవాస్తవ్యురాలగు రతినూపురయను వేశ్యపుత్రికలు చిత్రసేనారతిమంజరుల వెంటఁబెట్టికొని ధారానగరము జేరినకథయు శ్రోతవ్యముగానుండును. కుచుమారుఁడు సరస్వతియను రాజపుత్రిక నరువదినాలుగువిద్యలలో నోడించి రాజ్యముతోఁగూడ నా చేడియం బరిగ్రహించినకథయు భూతోచ్చాటన గావించి మదయంతిని బెండ్లియాడిన గోనర్దీయునికథయు ముందుగాఁ జదివితీరవలయును. చారాయణుఁ డుత్తరదేశారణ్యసంచారముగావించి లోకోత్తరరూపగాన కళాలలితయగు యక్షవనితం బరిణయంబొంది ధారానగరము జేరి మిత్రులంగలిసికొనిన చమత్కారము విస్మయముగలుగఁజేయక మానదు.

ఘోటకముఖుఁడు భోజుని వెంటఁ దిరిగితిరిగి రాధయను వృద్ధ నాశ్రయించి వరాహద్వీపమున కేగి యామె మనుమరాలిఁ బెండ్లియాడి మిత్రులం గలిసినవిషయము సొంపుగావర్ణింపఁబడి యున్నది. ఇందుచింతామణి లీలాశుకుఁడు మదాలసకౌశికుఁడు లోనగువారియుపకథలు చాలగలవు. పెక్కులువ్రాయనేల ఏకథలెట్లున్నవని నిరూపించుటకుఁ జదువరులలే ప్రమాణము—పదార్థములు వడ్డించి రుచులడుగనేల ?

ఇందు విశేషించి చతుష్షష్టికళలు అరువదినాలుగు విద్యల యొక్కపేరులు(వైశికప్రకరణము) వ్రాయబడినవి. వానింజదువుటకు విసుపుగలవారు విడిచిచదువవచ్చును. కథాసందర్భమునకు లోపముండదు.

## 2-3-4 కూర్పులపీఠిక.

ఈముద్రణమందు మార్పులేమియును జేయలేదు. కాకితములు మంచివని చదువరులే గ్రహింతురు. ఈకాశీమజిలీకథలు ఇప్పటికిఁ పది భాగములు ముద్రించితిని. దీనితోఁ బూర్తియైనదికాదు. పండ్రెండవ భాగముతో గ్రంథము బూర్తిజేయఁదలంచికొంటిని (11-12భాగములొకతూరియే ముద్రించి ప్రకటింతుము.) సాధ్యమైనంతత్వరలో వెలువడగలవు. వీనిగుఱించి యిచ్చినపండితాభిప్రాయములు చాలగలవు. దైవానుగ్రహమున 12 భాగములు పూర్తికాబడినది.

శతావధాని చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు

బ్రి॥ శ్రీ॥ గురువరులగు
మధిర సుబ్బన్నదీక్షితులవారి సముఖమునకు. } కడియము. 15—9—26

శిష్యుఁడు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి శతావధాని యనేక నమస్కార పూర్వకముగా వ్రాసికొను విజ్ఞాపనము.

గురువరా! తాము కొలఁది దినములనాఁడు దయాపూర్వకముగ నొసఁగిన కాశీమజిలీలు అను పేరుగల భవద్విరచితగ్రంథమునందలి కొన్ని భాగములను నాకొసఁగుచువీనినిజదివి యభిప్రాయమును దెలుప వలసినదియని సెలవిచ్చియున్నారు తదేకదృష్టితోఁ దద్గ్రంథమునందలి కొన్ని కథలనుజదివితిని. ఇవి కేవలకథలవంటివే కాక వ్యాకరణాదిశాస్త్ర సంప్రదాయమునందేమి యలంకారాదులయందేమి మనప్రాచీనకావ్యములకించుకయుఁ దీసిపోక పాఠకులకు మంచిసాహిత్యజ్ఞానమలవఱుచుటకుఁ గడుంగడుఁ దగియున్నట్లు గ్రహింపఁగల్గితిని. సూత్రప్రాయముగా వ్రాసిన యీయభిప్రాయమునందలి సారమును పాఠకలోకము గ్రహింపకపోదని విస్తరింపక యింతతో ముగించుచున్నాఁడను. ఇవియే నానమస్కారములు.

చిత్తగింపుఁడు. ఇట్లు

భవద్విధేయుఁడు

శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి

## సంస్కృత ప్రాకృతాది బహుభాషా విశేషజ్ఞులగు శ్రీమాన్ యమ్. ఎ. మానవల్లి రామకృష్ణకవిగారిచ్చిన యభిప్రాయము.

విద్యాగంధములేని స్త్రీబాలపామరజన సామాన్యమును నిరంతరరాజ్యభార ఖిన్నులగు ప్రభువులను వ్యవహారక్లేశసాగరతరంగితాంతరంగులగు శ్రీమంతులను ఉపదేశపరచ చింతనాగ్రి శ్రమములేకయే కేవలము హృదయైక వేద్యమై రసభావబంధురముగా క్షణకాలము సంహ్లాద సముద్రమున దేలించి ధర్మానుష్ఠానమున నెలకొల్పి యాత్మవిద్యాపారంగతులగాఁ జేయఁజాలినది కథావినోదమేయని మహర్షులు దాని జతుష్షష్టి విద్యలలోఁబరిగణించి యనుశాసించి యభివృద్ధిపఱిచిరి. ఇట్టి కథావినోదము వినోదమాత్రఫలజనకముగాక ధర్మాదిసాధనోపాయ మహత్తనుంబగుట సర్వజనవేద్యమే. కేవలము రాజనీతిప్రతిబోధకము పంచతంత్రాదికథలును విప్రలంభసంభోగ శృంగారనామ స్వాధాభూతరసరాజ రహస్యపరమార్థ విచారమనోభిరామంబగు బృహత్కథా నిబంధనంబును ధర్మలోకలవసాధిత బృహద్ధర్మ సంస్థానాది ధర్మనూత్నపరిబోధన చమత్కారంబగు దశకుమారకథావిస్తరంబును ఏకకథారసపరిపూర్ణంబై సాహిత్య విద్యాధిదేవతావిలసితంబగు కాదంబరియు కేవలము ధర్మప్రధానంబగు పురాణజాతమును ఏకదేశగస్యప్రస్తావములై యగుచున్నవి. మఱియుఁ గాల కౌటిల్యమున భిన్నదేశభిన్నాచార సంక్రమణంబునంజేసి చిరకాలావధిం బహుపురుషాంతరంబులంగాని తెలిసికొనగాని సదాచారధర్మానుష్ఠాన తారతమ్యంబు నెఱుఁగలేక యవిశ్వాస మూఢమగు చిత్తంబు శుద్ధింబరక్రియా సాధనోపాయమగ్నంబగుచు పురాణగాథావిచారణావధానంబులేక తత్తరించుచుండ తీర్థోపాయంబులలో సులభమై పతిష్ఠమై బహుధర్మప్రతిపాదకంబయి నానారసభావ సమగ్రభాజనంబయి సమస్తపురాణగాథాకథాసారవిరాజితంబై బహుకళాసుగమ్మవినోదదక్షంబై కథాసంవిధానచాతురీనిరంతరోత్తరోత్తరకథాస్వాదనోత్సేక సంభావికంబయి విలసిల్లు కాశీమజిలీలకథా నిబంధనము సర్వజనచిత్తాకర్షకంబనుటకును సందియములేదు. ఈనిలోరసాభావపుష్టియు గథాసంధానకౌశలము చుండఁ జతుర్వర్గపురుషార్థకంబులగు మహాకవివాఙ్మయములోని నవరసములు సాధారణకథాకథనధోరణిలో వెదజల్లబడియుండుటచే నిది పండితులకును గావ్యకర్తలకును గూడ బ్రతిభోన్మేషకారణంబులని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును ఇందు బారమార్థికులకుఁదప్ప సామాన్యులకుఁ దెలియని శంకరాద్వైతాచార్యచరిత్రము లతిరసవంతముగా బరమార్థబోధకంబుగ సుధాధోరణిగా గూర్పబడినవి.

విశ్రాంతి చింతావినోదులకు జన్మజీవనతరణోపాయంబగు తీయనియానపథంబు నాలెనుండు నీగ్రంథరాజమెంత పెద్దదియై పెరుగనున్నను విసుగులేక యుత్తరోత్తర సంపుటపఠనమున సిల్లును పేచియుందురని నిశ్శంకముగాఁ జెప్పవచ్చును. ఇందు కాదంబరీకథాసంపుటము ప్రౌఢసాహిత్యరచనాబంధురంబై రసభావవస్తుపూర్ణంబై యించుక కఠినమయ్యును సాహిత్యజ్ఞానసోపానాధిరోహణమునకై నిర్మింపబడిన యీకథా

సంపుటములలో నిప్పటికిది యున్నతస్థాన మలంకరించుచున్నది. చతుర్థస్థాపు సంపుట కథావిన్యాసము లీగ్రంథకర్తకుఁ గథానిర్మాణ చతుర్ముఖత్వమును దప్పక యొసంగుచున్నది. బ్రహ్మశ్రీ మధిర సుబ్బన్నదీక్షితులవారి గ్రంథరచనామూలంబున గుణాఢ్యాదిమహాకథ కీర్తిప్రతినిధియగు శాశ్వతఖ్యాతి సంపాదించిరని మాయభిప్రాయము వీనియభ్యుదయపరంపర సర్వేశ్వరుం డొనఁగూర్చుఁగాక యని మాప్రార్థనము.

ఇట్లు

మానవల్లి రామకృష్ణకవి.

రాజమహేంద్రవరమున డిస్ట్రిక్టుమునిసిఫ్ పదవిలోనుండు బ్రహ్మశ్రీ శ్రీమాన్ మ. కృష్ణమాచార్యులవారు ఎం, ఏ, ఎం, ఎల్, పి, హెచ్, డి. బిరుదాంకితులు ఈక్రింది యభిప్రాయము నాంగ్లేయభాషలో దయచేసి యొసంగిరి.

శ్రీమత్పండిత మధిర సుబ్బన్నదీక్షితులవారిచే రచింపఁబడిన "కాశీమజిలీకథ" లను పేర నొప్పు కథాసమూహ మింత కాంధ్రదేశమంతయుఁ జక్కఁగా దెలిసినదే కావున నేను బ్రశంసింపవలసిన యావశ్యకత లేదు. ఆగ్రంథముల కిడిన పేరులనామము పవిత్రము మనకుఁ బవిత్రమైన భావమును హృదయమున నుత్పాదింపఁజేయుటయే కాక పూర్వకాలమున రాకపోకలకు మనకువలె సౌలభ్యములు లేకుండియుఁ గ్లేశసహిష్ణులైన మన పెద్దలు గాలినడకతో పుణ్యపట్టణమైన కాశీని దర్శించిరాలంగా భక్తిశ్రద్ధలు వహించియుండిరను నాశ్చర్యమును గలిగించుచున్నవి. జనసమూహముల నాహ్లాదింపఁ జేయుటకుఁ గథాకథనము మనహిందూదేశములో నతిప్రాచీనవిద్యయే. దానికి పెక్కు విధముల ప్రయోజనములుగలదు ఈకథలు ధర్మపరాక్రమముల తత్త్వప్రభావముల నుపదేశించుటయే కాక అప్పటి దీర్ఘకాలమార్గాయాసమును యాత్రికసంక్లేశమును దొలఁగించుచుండును మతవిషయమునను ఆధ్యాత్మికవిషయమునను విశ్వాసములేక శంకాకళంకితమగు నేటికాలమున స్వభాషలో శులభశైలి వ్రాయఁబడిన యీకథలు హిందూదేశమున నాఁడయగు వేదశాస్త్రపురాణాది విద్యాప్రపంచమున నేది యేని శ్రేష్ఠమో శాశ్వతస్మరణీయమో దానినెల్లఁ దప్పక బునరుజ్జీవనముచేయుచున్నవి. ఇవి యారబ్యయామినీ వినోదకథలలోని చమత్కృతిప్రభావము చూపుచున్నను, శబ్దరచనయందును భావములయందును అశ్లీలధర్మసాంకర్యాది దోషములులేక భాసిల్లుచున్నవి. కథలకిచ్చినపేరును సంవిధానధోరణియు సమస్తవిషయసంగ్రాహకమగుటచే యట్లే కొనసాగుచుండినయెడల నిదితప్పక హిందూపురాణగాథాకోశమై సర్వవాఙ్మయమున కాదర్శమైయొప్పుననుట యసాధ్యము గాదు.

యమ్. కృష్ణమాచారి.

శ్రీ ర స్తు.

# కాశీమజిలీకథలు

ఎనిమిదవభాగము.

**142 వ మజిలీ.**

## సప్తమిత్రచరిత్రము.

క॥ శ్రీమత్కాశీనగర। స్వామి రమాప్రాణనాథ వాణీ ధవ సు
త్రామాదిదేవ మకుట। భ్రామిత మణినికరకిరణ భాసిత చరణా!

దేవా! యవధరింపు మమ్మణిసిద్ధుం డయ్యనంతరంబున గథాకథనలాలసుండై యున్నంత నగ్గోపకుమారుం డరుదెంచి.

"శ్లో॥ జామాతైవ స్నుషాభవత్"

అల్లుఁడే కోడ లయ్యెను.

అని చదువుచు మహాత్మా! వింతలఁ జూడ నేఁడీ గ్రామము లోనికిం బోయితిని. రచ్చబల్లపైఁ గూర్చుండి కొందఱు విద్వాంసు లీశ్లోకపాదముం జదువుచుఁ దద్భావము గ్రహింపలేక వితర్కించు చుండిరి.

ఉ॥ అల్లుఁడు కోడలెట్టులగు ♦ నంచు వచింప గొందఱందు నా
నిల్లరికంపుటల్లుఁడు గ్రహింపఁగఁ గోడలివంటివాఁడె యా
సల్లుఁడు కోడలయ్యెనని ♦ యర్థముచెప్పఁగఁ గొంద ఱొల్లరై
రల్లన వాదమయ్యెఁ దెలి ♦ యంబడదయ్యెఁ దదర్థ మేరికిన్. (1)

స్వామీ ! అల్లుఁడు గోడలగుట చిత్రము కాదా ? దానిభావంబు వివరింపుఁడు. తెలిసికొని యాపండితులకుం జెప్పెద. మఱియు నీగ్రామమునం గలవిశేషంబుల సాంతముగాఁ జూచి వచ్చెద ననియడిగిన నయ్యతిపతి రత్నప్రభావంబునఁ దదుదంత మాకలించుకొని గోపా ! యీశ్లోకపాదమువలన నద్భుతకథాసందర్భగర్భితం బగుసత్త్రమిత్రచరిత్ర మనునుపాఖ్యానము స్ఫురించుచున్నది. అది నీ వింతకుమున్ను విన్నకథలకన్నఁ జాల చమత్కారముగా నుండు నవహితుండవై యాలకింపుము.

— ద త్తు ని క థ. —

సీ॥ తెలితమ్మిపూవురే ♦ కులమించు సోగక
న్నులు మోమునకువింత ♦ చెలువుగూర్ప
నరచందరుని మేల ♦ మాడునెన్నుదుట ది
ద్దిన విభూతులబ్రహ్మ ♦ తేజమెసఁగ
నీలాలవిమలువ వ ♦ న్నియకుందనమువంటి
యొడలిచాయకుఁగొత్త ♦ సొబగుఁగొలుప
బహువిధ శాస్త్రామ్నాయ ♦ పఠనచిహ్నితము లై
యోష్ఠముల్ దీప్తి సం ♦ యుక్తి నెసఁగ
గీ. నవనిఁ గ్రుమ్మరవచ్చిన ♦ యతనుఁడో జ
యంతుఁడో కుబేరపుత్రుఁడో ♦ యబ్జుఁడో వ
సంతుఁడో యనఁదగి బ్రహ్మ ♦ చారి యావ
నాంకురాలంకృతాంగ కుం ♦ డైనవాఁడు.

ఒకానొక బ్రాహ్మణ కుమారుండొక మహారణ్య మధ్యంబున వసించి యిట్లుతలంచెను.

ఆహా ! నేను గాశీపురంబునుండిబయలుదేరి యిరువది దినములైనది. మొదటనాలుగైదు పట్టణము మాత్రము గడచితిని. తరువాత

నీమార్గమంతయుఁ గాంతార భూయిష్ఠము యొప్పుచున్నది. ఎన్నిదిన ములు నడచినను నీయడవికిఁదుదిమొదలు గనఁబడకున్నది. తెచ్చిన యాహారపదార్థము లైపోయినవి. యెన్నినాళ్ళు ఫలములుదిని సంచరింతును. ఎన్నిరాత్రులు చెట్టుకొమ్మలసందునఁ బండుకొందును ? వెనుక టివలెనే పొద్దు గ్రుంకకపూర్వ మేచెట్టోయెక్కక నేఁడు దాపునఁ బెరపి కనంబడుటచే గ్రామముండునని యాసతోఁ బొద్దుపోవువఱకు నడచితిని. ఇప్పు డంధకారబంధురంబై లతాగుల్మాదులచే నావృతమై మన్నును మిన్నును దెలియకున్నవి ఏమిచేయుదును ఈ రేయిఁ గ్రింద వసించితినేని మృగములు హింసింపకమానవు. ఇది మనుష్యులు సంచరించు మార్గముగాదు. తెలియక నీత్రోవంబడితిని. భవితవ్యమెట్లున్నదో తెలియదు. అని విచారించుచు నలుమూలలు పరికించుచుండెను.

అల్లంతదవ్వులో నెత్తుగానొక దీపమతని చూపులకు మిరిపెము గలుగఁజేసినది. ఒకమారు తళుక్కుమని మెఱయుచు నొకసారి మినుకుమినుకుగాఁ గనంబడుచు నొకతేప నదృశ్యమై యంతలోఁగనంబడుచున్న యాదివ్య తేజము పరీక్షించి యతండు వెఱఁగుపాటుతో నాహా ! జనసంచార శూన్యమగు నీయడవినడుమ నీదీపముండుటకుఁ గారణమేమి? ఆతేజమున్నతావు పర్వతమో ప్రాసాదమో కావలయును. క్రీడాసౌధంబు గట్టించుకొని యివ్వనములో నెవ్వరైన నివసించియుండిరేమో ? జనులుండిసంగాని దీపముండదు. శ్రమమైననగుంగాక ఈ రేయి నాదీపమున్న తావునకుంబోయి చూచెద నేమైనను సరే యని నిశ్చయించుకొని యతం డాదీపమును లక్ష్యముగాఁజేసికొని యాదెసకు నడుచుచుండఁ గ్రిమోన్నత భూమివలన నది యొకకొండయని తెలియఁబడినది.

చేతులతో దానుచు గంటకపాషాణబాధం దప్పించుకొనుచు

నల్లనల్లన నెగఁబ్రాకుచుండెను. ఆతేజము దాపున నున్నట్లుండి యెంతసేపు నడచినను నట్లే కనంబడుచుండును. అకటకట చీఁకటిలో ధైర్యమే సహాయముగా నతండా దీపమువెలుఁగు ననుసరించి క్రమో న్నతంబగు నన్నగం బెగ ప్రాఁకిప్రాఁకి పెద్దతడవునకుఁ దన్నికటంబుఁ జేరెను. సాంద్రశిలాఘటితకుట్టిమంబగు సమతలంబుచేరి యతండు దానువచ్చిన దెసంబరికించుచు ఝల్లరీధ్వానభీకరంబగు నంధకారంబు గాక యొండుగానక గుండెపైఁ జేయివైచుకొనుచు అన్నన్నా! తేజో లక్ష్యంబునంగానక యీకటికిచీఁకటిలో నీప్రదేశంబుఁజేర శక్యమా? దైవమే నన్నిందుఁజేర్చెను. ఇందలి ప్రసూనముల వాసన లపూర్వ నాసాపర్వము గావించుచున్నవి. మండలాధిపతి యెవ్వండైనఁ గ్రీడా శైలముగాఁ జేసికొని యిందు విహరించుచున్నవాడా? ఔను. సందియ ములేదు. అది విద్యుద్దీపప్రభ. గుహాంతరమున నమర్పఁబడియున్నను గవాటదర్పణంబునం బ్రతిఫలించి దీప్తిజాలంబు పైకి విరజిమ్ముచున్నది.

ఇందు మహారాజులో దేవతలో వసియించియుండిరి. గుహా మందిర కవాటంబులు తెఱవఁబడియున్నవి. లోనికింబోయి వింతలం జూచెదంగాక యని తలంచుచు మెల్లమెల్లన నడుగులిడుచుఁ బొంచి పొంచి చూచుచు నాగుహాలోనికిఁ బదిబారలు పోయెను. ప్రక్కగా ద్వారముగల యొకగది కనంబడినది. దానికవాటము లించుక చేరవే యఁబడియున్నవి. లోపల మణిదీపములు వెలుగుచుండెను. అప్పు డత్యంత సాహసముతో నతండు తలుపులు త్రోయక మెల్లగా వివర ములనుండి లోపలికిఁ దొంగిచూచెను.

దివ్యాలంకారశోభితంబగు నక్కందరమందిరాభ్యంతరమున రత్నపర్యంకమున నొక యక్షుండు యక్షిణి నక్కునంజేర్చుకొని ముద్దాడుచుండెను.

యక్షిణి—మనోహరా! మన వియోగకాలము సంవత్సరమే

యైనను యుగాంతరము లైనట్లున్నది. అబ్బా! ఆమాట దలంచుకొనిన మేనుజల్లుమనుచున్నది. కుబేరునికేమి యపరాధముఁ జేసితిమని యట్టి శాపమిచ్చెను.

యక్షుఁడు—కుబేరుండొకనాఁడొక సౌరనారీమణిని వరించి యమ్మింరచుఁబోఁడిం దీసికొనిరమ్మని నాకు నియమించెను. నేనింటికి వచ్చి భవదీయాధరసుధారసపాన మత్తుండనై యావృత్తాంతముమఱచి యందుఁ బోయితినిగాను. క్రీడాభిరతి సఱుగలేదని మొఱఁగి విరహాతురుండై రాజరాజు చిత్రకూటపర్వతంబునఁ బండ్రెండు మాసములు వసించి యలకాపురంబు జేరకుండునట్లు శిక్షవిధించెను.

యక్షిణి—అదియా? కారణము ఆహా? ఆమహాపత్సముద్రము నెట్లుతరించితిమో తెలియదు. పోనిండు మనమిల్లును వాకిలిని విడిచి యెంతకాలమిం కుండవలయును.

యక్షుఁడు—ఆధూర్తకుబేరుని సేవసేయుట నాకిష్టములేదు. అందుండిన నేవియో లేనిపోనిపనులు సెప్పి తప్పులుగణించుచుండును. ఈగుహాంతర మత్యంతరమణీయమై యున్నది. మనయింటనున్న వస్తుసముదాయమెల్ల నిందుతెచ్చితిమిగదా? ఇది యేకాంత ప్రదేశము. క్రీడాయోగ్యమైయున్నది. ఇందేయుందము.

యక్షిణి—పోనీమనము మఱియొక దేవతానగరమునకుఁబోయి సుఖింపరాదా ? యీ యరణ్యములో వసింపనేల?

యక్షుఁడు—కుబేరశాపంబున దేవలోకనివాసమున కర్హత పోయినది. పగలెల్ల భూసంచారముసేయుచు విశేషములం జూచివచ్చి రాత్రుల నీ కౌఁగిలింపుచుందును. ఇదియేమి? సుఖింపఁదగిన నెలవు.

యక్షిణి—మనోహరా! విశేషములనిన జ్ఞాపకమువచ్చినది. నేఁడు సాయంకాలమునఁ బదిలముగా మూటగట్టికొని వచ్చితిరి. అదియేమి?

యక్షుఁడు—ఓహో! నీకు మంచిసంగతి చెప్పుట మఱచితినే. వినుము అది మన చరిత్రము మేఘసందేశమను గ్రంథము ఒకగ్రామములో విద్యార్థులు వల్లించుచుండఁ దిరోహితుండనై దాపునకుఁబోయి యాగ్రంథమంతయు భూర్జపత్రములమీఁద వ్రాసికొని వచ్చితిని మొదటి శ్లోకము వినుము.

శ్లో॥ కశ్చిత్కాంతా విరహగురుణాస్వాధికారాత్ప్రమత్తః
శాపేనాస్తంగమిత మహిమావర్ష భోగ్యేణభర్తుః।
యక్షశ్చక్రేజనకతనయాస్నాన పుణ్యోదకేషు
స్నిగ్ధచ్ఛాయాతరుషువసతింరామగిర్యాశ్రమేషు॥

యక్షిణి—అవును. ఇప్పుడు మీరు చెప్పిన శాపవిధానమంతయు దీనిలోనున్నది. మేఘసందేశమననేమి?

యక్షుఁడు—నేనప్పర్వతముపైఁ గుబేర శాపగ్రస్తుండనై యున్నంత మేఘోదయమైనది. ఆ మేఘముచేత నీకు సందేశమంపితిని. అందులకే దానికాపేరు పెట్టెను.

యక్షిణి—ఏదీ మఱియొకశ్లోకము తీసి చదువుఁడు?

యక్షుఁడు—నీకుస్పష్టముగాఁ దెలియగల దీశ్లోకమువినుము.

శ్లో॥ తత్రాగారం ధనపతిగృహా నుత్తరేణాస్మదీయం
దూరాల్లక్ష్యంసురపతిధను శ్చారుణా తోరణేన।
యస్యోపాంతే కృతకతనయః కాంతయా వర్ధితోమే
హస్తప్రాప్య స్తబకనమితో బాలమందారవృక్షః॥

అని నేను మేఘునితో మనయింటిగురుతులు చెప్పితిని.

యక్షిణి—మనయిల్లు కుబేరుని యింటికుత్తరముగా నున్నట్లును మనదొడ్డిలో గుత్తులచే వంగియున్న మందారవృక్ష మున్నట్లు మీరు చెప్పుచుండ నతఁడువినెనా? లేక యెప్పుడైన మనయింటికి వచ్చి చూచెనాయేమి? ఆకవికెట్లు తెలిసినది? మీరు మేఘునితోఁ జెప్పుచుండ నాప్రాంతమందుండి వినెనేమో?

యక్షుఁడు—చాలుచాలు అమ్మహారణ్యమధ్యమునకు మనుష్యులు రాఁగలరా ? ఆకవి దైవశక్తిగలవాఁడఁట వినుము ఇంతకన్న రహస్యమైన విషయము వర్ణించెను.

యక్షిణి—ఏదీ ? చదివి వినిపింపుఁడు.

యక్షుఁడు—

శ్లో॥ భూయ శ్చాహ త్వమపి శయనే కంఠలగ్నా పురా మె
నిద్రాం గత్వా కిమపి రుదతీ సుస్వరం విప్రబుద్ధా
సాంతర్హాసం కథిత మస కృత్పృచ్ఛత శ్చ త్వయా మె
దృష్ట స్స్వప్నే కితవ ! రమయ న్కా మపి త్వం మ యేతి।

నీవల్ల నాఁడురాత్రి నిద్రబోవుచు లేచి వెక్కి వెక్కి యేడ్చుచుండ నేను గారణమేమని పలుమారడుగ నీవునవ్వుచు వంచకుఁడా! మఱియొక కాంతతో నీవు రమించుచున్నట్లు స్వప్నములోఁ గనంబడితివి అందులకని చెప్పితివి. ఈరహస్యము మనయిరువురకుఁగాక యొరులకుఁ దెలియదు. నేనది యానవాలుగా నీతోఁజెప్పుమని మేఘునితో పలికితిని ఆమాటయే యాకవి వర్ణించెను.

యక్షిణి—మీ రేమన్నను సరియేకాని మీరా మేఘునితోఁ జెప్పుచుండ నాకవి వినెను. లేనిచో యెట్లువ్రాయఁగలఁడు.

యక్షుఁడు—అయ్యో ! నీకుఁ జెప్పినం దెలియకున్న దేమి ? ఆపర్వతమందు మనుష్యు లెవ్వరును లేరు. నేనొక్కండ నేయుంటిని అతండు మహర్షితుల్యుఁడు త్రికాలవేదియనిచెప్పిరి ?

యక్షిణి—మహానుభావుండైన యాకవీంద్రుని పే రేమి యో తెలిసికొంటిరా ?

యక్షుఁడు—ఈగ్రంథమందే వ్రాయబడియున్నది. మహాకవి కాళిదాసకృతే మేఘసందేశే ! అని

యక్షిణి—ఆతఁ డెందుండును ?

యక్షుఁడు—భోజునియాస్థానకవియఁట ఆ నృపతిచేత—

యక్షిణి—భోజుఁడన నెవ్వఁడు?

యక్షుఁడు—ఆతనికీర్తి కిన్నరులు పాడుచుండ వినలేదా? మఱచితివి కాఁబోలు! ధారానగరాధీశ్వరుఁడు మహావదాన్యుఁడు.

యక్షిణి—అట్టి పుణ్యాత్ములంజూచి వచ్చితిరా ?

యక్షుఁడు—చూడలేదు. ఎప్పుడో పోయెద.

యక్షిణి—ఆగ్రంథమంతయుఁ జదివి వినిపింపరా ?

యక్షుఁడు—ఇప్పుడు పొద్దుపోయినది. రేపు వినిపించెద నేదీ? ఆహా! అనిపలుకుచు యక్షుండాయక్షిణితో శృంగార లీలా తరంగితాంతరంగుండై యనంగ క్రీడలనానందించి యక్షిణితన్ననుస రించి రా వాయుసేవకై యీవలకువచ్చుచు ద్వారదేశంబుననున్న యా విప్రకుమారునిం గాంచి భయసంభ్రమలజ్జాలోలచేతస్కుడై యక్షిణి దిగ్గునలోనికింబోవ యక్షుండతని నదలించుచుఁ జేయిపట్టు కొనియోరీ! నీవెవ్వండవు? ఇం దేలవచ్చితివి ? దొంగవలెనిం దుఁబొం చుంటివేల? నిజముచెప్పుము. అని యడిగిన భయపడుచు నతండు నమస్కరించి యిట్లనియె.

గీ॥ దత్తుఁడనువాఁడ మాధురాత్మజుఁడ నేను
పాటలీపుత్రనగర సంభవుఁడనంచుఁ
జదివితినిగొంత యొజ్జలసముఖమందుఁ
గడమవిద్యలఁదెలియ నుత్కంఠగలిగి.

ఉ॥ శ్రీకరజాహ్నవీవిమల శీకరపూతతటస్థితోరువి
ద్యాకరసుప్రసంగనినదాంచితమద్రికుమారికాకృపా
లోకనభావితేష్టవర లోకము శాశ్వతవిశ్వనాథలిం
గైకపవిత్రభూమి యమృతాశినివాసము కాశికేగితిన్.

అందు మహామహోపాధ్యాయ బిరుదమువహించి పదినేం ఘందిశిష్యులకుఁబాఠముఁజెప్పుచున్న శ్రీమేందుప్రఁడనుపా[illegible]

ద్ద కరిగి నమస్కరించి యెదుర నిలువంబడియున్న నన్నుఁ జేరంజీరి నీవె వ్వండ వేమిటికి వచ్చితివని యడిగిన మదీయోదంత మెఱింగించి విద్యార్థినై వచ్చితిని. విద్యాదానంబు గావింపుఁడని కోరికొంటి నతండు నాచదివిన విద్యలం బరీక్షించి సంతసించుచుఁ దన విద్యార్థులలో నాతో సహాధ్యాయుఁడుగా నుండ నెవ్వఁడు సమర్థుఁడోయని శిష్యులనెల్ల నాతో బ్రసంగింపఁజేసెను. అందఱుఁ గాందిశీకులైరి. మఱియు వారిలో,

క॥ చారాయణుండు మఱి కుచు
మారుడు ఘోటకముఖుండు మఱిగోనర్దీ
యోరుమతి గోణికాసుతుఁ
డారయఁగ సువర్ణ నాభుఁడనువిప్రసుతుల్.

సమానవయో రూపమనీషాకౌశలురగు నీ యార్వురుమాత్రము నాతోఁ బ్రసంగింప నిలువంబడిరి. ఆయొజ్జలు సంతసించుచు నయ్యార్వుర నాకు సహాధ్యాయులుగాఁ జేసి యచిరకాలములో సమస్తవిద్యాపారంగతులఁ గావించెను. మేమేడ్వురము సహాధ్యాయులైనది మొదలొక గడియయైన విడిచియుండలేక యేకదేహమట్లు మెలఁగుచు నత్యంతమైత్రితో విద్యలఁ బూర్తిజేసి దేశపర్యటనలంపటులమై తల కొకదారిం బోయి నానాదేశవిశేషంబులఁజూచుచు సంవత్సరమునాఁటికి కాశీనగరంబునం గలసికొనునట్లు నియమము చేసికొంటిమి. నే నొక మార్గంబునఁబడి పోవుచు దారితప్పి యిమ్మహారణ్యము జేరి నేఁటిరాత్రి తేజోలక్ష్యంబున నిక్కడకు వచ్చితిని. మీరు యక్షదంపతులని మీమాటలవలనం దెలిసికొంటి ననుగ్రహించి దారియెఱింగించిఁ బోవువాఁడ నభ్యాగతుఁడ గాపాడుఁడని ప్రార్థించినవిని కనుఁగవ నంపుగసార యక్షుం డిట్లనియె.

క॥ మిగులంజదివియు నాలియు
మగఁడును గ్రీడింపఁబూంచి మర్మంబులఁ జూ

వేళ మంచిదికాదు. చెడుదారింబడితిని నడుమ దండకారణ్యములే
కాని మంచి జనపదం బొక్కటియుఁ గనంబడలేదు. ఇది యేదేశమో
తెలియదు. ఈదారి యెక్కడికిఁబోవునో చెప్పువారులేరు. యక్షశాప
ప్రవృత్తి యెట్లు పరిణమించునో యెఱుగను తనశాపం బమోఘమని
యతండానతిచ్చి యున్నవాఁడు ఆయూరికిఁబోవకున్నఁ దప్పునా ?
కానిమ్ము కానున్నది కాకమానదు. అని యాలోచించుచు మార్గము
దెసఁ దనచూపులు వ్యాపింపజేసెను.

అప్పు డామార్గములో నేదియో మృగము దనదెసకుఁ బరుగెత్తి
కొని వచ్చుచున్నట్లు కనంబడినది. జడియుచు నతం డాచెట్టుపై కెక్కి
కొమ్మలసందున నణగి యుండెను. అంతలో జీనుగట్టినగుఱ్ఱ మొకటి
వచ్చి యాచెట్టుక్రిందనే నిలువంబడినది. దానినిఁజూచి దత్తుంసు సంతో
షాయత్తచిత్తుఁడై ఔరా ! దీని నడవిమెకమనుకొని జడిసితిని.
కల్యాణ లక్షణోపేతమగు నీవీతి యేనృపసూతిదో కావలయును.
అనర్ఘములగు కనకమణినికరములచే నలంకరింపఁబడియున్నది. ఇది
ఖలీనము ద్రెంచికొని పారిపోయి వచ్చినది. ఈప్రాంతమందేదియో
నగరమున్నదికాఁబోలు అని తలంచుచు మెల్లన నాచెట్టుదిగి యాగుఱ్ఱ
మును మచ్చికచేసి జూలుదువ్వుచు మోమున వ్రేలగట్టిన బంగరుపట్టి
కం బరీక్షించి రుక్మిణియను విలాసముండుట తెలిసికొని యక్కజమం
దుచు నిది స్త్రీలెక్కు తత్తడి యందులకే జీను విలక్షణముగా నున్నది.
ఏది యేమైనను నడువలేక బడలియున్న నాకీయశ్వమును సర్వేశ్వరుఁ
డే తెచ్చియిచ్చెను. దీని నెక్కి యెక్కడికో పోయెద నేదియూరొకటి
కాఁగలదని నిశ్చయించి క్రిందికి వ్రేలాడుచున్న కళ్ళెముపట్టుకొని
వీపుపైఁ జరచుటయు నదికదలక బెదరక త్రోక నాడించుచు సకిలిం
చినది —

అతం డది శుభసూచకమని తలంచి త్రిప్పున నెగసి దానిపై కెక్కి-

కళ్ళెములాగి మడమలతో నించుకగొట్టి యదలించినంతనాగంధర్వంబు అక్కలుగలదివోలె నతిజవంబునం బరుగిడుచు నాస్కందిత ధోరతికాది గతివిశేషములంజూపుచు వచ్చినదారిం బోవుచుండెను. దత్తుండు కళ్ళెము బిగలాగి యీహయరయం బుడుపవలయునని యెంత ప్రయత్నించినను నదియాగినదికాదు. మహావేగముగాఁ బోయిపోయి రెండు గడియలలో భోజరాజ రాజధానియగు ధారానగరము సమీపోద్యానవనంబు జేరినది. అని యెఱిగించి, వేళ యతిక్రమించుటయు మణిసిద్ధుం డవ్వలికథ దరువాతి మజిలీయం దిట్లు చెప్పఁ దొడంగెను.

## 143 వ మజిలీ.

### భోజుని కథ.

భోజరాజునకు నలువురు భార్యలని వెనుక తచ్చరిత్రంబునఁ జెప్పియుంటిని కదా. వారినల్వురయందు సమాన ప్రీతిపత్తిగలవాఁడైనను లీలావతిచేయు నుపచారములంబట్టియుఁ దొలుత నడవులఁ బెక్కిడుమలంబడి తన్నొడయనిగాఁ బడసినదగుటయు నామెయంతఃపురమునఁ దఱుచుగా వసించుచుండును. ఆసాధ్వీరత్న మత్యంత భక్తివిశ్వాసములతో భర్తనారాధించుచుండెను. భార్యలకంటెఁ బుత్రులకంటెఁ గాళిదాసకవియం దాభూభర్త కధికప్రీతి కలిగి యున్నది. ఆకవి శిఖామణింజూడ నొక యామ మెడమైనచో యుగాంతరములైనట్లు చింతించుచుండును. సభయందేకాక యాహారవిహారశయనాసనములయందుఁగూడ నతండా పండితునవిడిచి యుండనేరఁడు. తాను లీలావతి యంతఃపురమునకుఁగూడ కాళిదాసుం దీసికొనిపోవుచుండును. అయ్యంబుజాక్షియు బ్రత్యక్షముగా నాకవితో సంభాషింపదుగాని భర్తృసమక్షమున వానిపట్లతోఁగూడ సమయోచితములైన యుపచారములఁ గావించుచుండెను. పసదుమసియు మడుపులందిమ్మనియు శయ్యఁగల్పిం

పుమనియు రాజే యామెకు నియోగించుచుండెను. భోజుండు తనకు జేసిన దానికన్న నాకవికిఁ జేసిన యుపచారమువలన మిగులఁ బ్రీతుండగు చుండెను. లీలావతియు భర్తమతి ననుసరించియే కాళిదాసునకు నుపచారములు చేయుచుండెను.

ఒకప్పుడు భోజునకు దేహములోఁ గొంచె మస్వస్థత గలుగుటయుఁ గాళిదాసునితోఁగూడ సంతతము లీలావతి మందిరమందే వసించి యుండెను. ఆయునికి యితరకవులకు నితరరాజభార్యలకుఁగూడ నసహ్యసూయల జనింపఁ జేసినది—

పండితులు కాళిదాసుగౌరవము జూడలేక యోహోహో! రాజెంత యవివేకియయ్యెను! జారశిఖామణియై సర్వదా పరస్త్రీ లంపటుండగు కాళిదాసుని లీలావతి యంతఃపురమునకుఁ దీసికొనిపోయి యేయవరోధము లేకుండ నామెచే నుపచారములు జేయించుచున్నాఁడఁట. ఎంత ప్రీతిగలిగినను నేక్షత్రియుండైన నిట్లు కావించెనా? వట్టి యమాయకుండై స్త్రీయంత్రమున దగుల్కొనెనని యాక్షేపింప మొదలు పెట్టిరి—

రాజభార్యలు లీలావతి గౌరవమును సహింపక యొకనాఁడు గుమిగూడి తమ పరిచారికలచే నిట్లు పలికించిరి.

ఒకతె—అయ్యో! లీలావతి చర్యలన్నియును నాకు రాజరత్నము జెప్పినది. భోగముదానికన్న నతిశయించినదఁట. కాళిదాసునకు మడుపులందించుటయు విసరుటయుఁ బన్నీరు జల్లుటయులోనగు నుపచారములన్నియు నామెయే చేయునట. ఇఁకఁ జెప్పనేమియున్నది. ఈ విషయమై రాజు వట్టి వెఱ్ఱివాఁడై పోయెను

మఱియొకతె—మడుపుల చేతికందియ్యదు. నోటికే! ఆకవికి గంధము పూయుచుండఁ బలుమాఱు మూచితినని నాకు చకోరాక్షి చెప్పినది. అంతప్రీతియున్నఁ బరిచారికలచేతఁ జేయింపరాదా? ఏ రాజభార్యయైన నిట్టివిరుద్ధకర్మముల కంగీకరించునా?

వేఱొకతె—సరి సరి. నీ కసలు తెలియులేదు. (చెవులో) గజయాన చెప్పినది.

ఇంకొకతె—ఆఁ! ఆఁ! ఏమీ! అబద్ధమేమో?

వేఱొకతె—అబద్ధమా! దానికేకాదు. అయ్యంతఃపుర పరిచారికల కందఱకును దెలియును. రహస్యములేదు. హేరాళమే.

ఇంకొకతె—రాజుగారి కిష్టమేనా? సహించుచున్నారా?

వేఱొకతె—ఆమె యాయనకేదియో మందు వేసినది. రాజు మందమతియై వారెట్టి శృంగారలీలలఁ గావించుకొనినను జూచుచు సంతోషించును.

రాజభార్యలు—(నగు మొగములతో) ఛీ! రండలారా! ప్రేలకుఁడు. మాయెదుట మాయక్క నాక్షేపించిన నూరకుందుమా? ఆమె తెలివిగలది. మగని వశపరచుకొన్నది. అంతియకాని మఱియొకటిగాదు.

పరిచారికలు—అమ్మా! నోరుమూసిన లోకమును మూయుదురా? దేశమంతయుఁ జెప్పికొనుచునే యున్నారు. మీయక్కను మేమెక్కళ్ళమే యాక్షేపింపలేదు.

భార్యలు—ఆమాట రాజుగారికిఁ దెలియునట్లు మీయంతఃపురము న వ్యాపింపఁజేయుఁడు. అంతియెకాని మాయెదురఁ బలుకవలదు.

అని రాజభార్యలు పరిచారికల కుపదేశించిరి. వారంపు క్రమక్రమముగా లీలావతి పరిచారికలకడను శుద్ధాంతములయందు నామాటలే యాక్షేపించుచుండిరి. ముగ్గానుగ్గిగా రాజుగారి చెవింబడినది—

మొదట నతం డాప్రవాదము సరిగా లెక్కచేయలేదు. మఱియొకనాఁ డొక పత్రిక యాతని తలయూపినూపఁబడినది. దానిని విప్పి చదువ నిట్లున్నది.

శ్లో॥ ఘృతకుంభసమానారీ । తప్తాంగారసమఃపుమాన్
తస్మాద్ఘృతంచవహ్నించ । నైకత్రస్థాపయేస్స్బుధః॥

రాజా ! నీవు బుద్ధిమంతుఁడవయ్యు మిత్రలోభంబునంజేసి స్త్రీ నెట్లు కాపాడవలయునో తెలిసికొనలేకున్నావు. కాళిదాసకవి యెంత జారుఁడో నీ వెఱుఁగవా ? అతఁ డంతఃపురద్రోహము జేయుచున్నాఁడని లోకమంతయుఁ జెప్పికొనుచున్నది. నీకిష్టమున్న భూములిమ్ము. గ్రామములిమ్ము. ద్రవ్యమిమ్ము. అంతియగాని యవమానకరముగా సంతతము నంతఃపురమందుంచికొని భార్యచే మర్యాదను మీఱిన యుపచారములఁ జేయింపరాదు. జతుకాష్టం బెంతగట్టిదైనను నిప్పు వేడిసోకిన మెత్తబడకుండునా ? కర్తవ్యమాలోచించుకొనుము అని యున్న యుత్తర మారాజు మువ్మాఱుచదివెను. అది యెవ్వరు వ్రాసినదియును పేరు లేదు.

అందలివిషయములు నిర్మలమైన యతనిమనస్సును గలుషపఱిచినవి. ఇంచుక యాలోచించి యతం డాహా ! మహానుభావుండగు కాళిదాసు మిత్రద్రోహము సేయునా ! చేయఁడు. పురుషుని మనంబు చంచలమగుట చేయఁతలంపు గలిగియున్నను లీలావతి మహాసాధ్వి. తుచ్ఛపురుషుల కిష్టపడునా ? నాయందుగల యనురాగమంతయు మట్టుపరచి పరచింత వహించునా? వట్టిది. వట్టిది. మేరువు చలించినను నయ్యంబుజాక్షి మది చలింపదు. గిట్టనివా రెవ్వరో యిట్టికల్పనఁ జేసిరి, అని నిశ్చయించి యాకళంకము మనసునుండి త్రోసివేసి యథాగతము గానే సంచరించుచుండెను.

మఱియొకనాఁడు లీలావతి స్వయముగా నంటఁజేసి భర్తకు వడ్డించినది. కాళిదాసకవి దాపుననే పైడిపువ్వులపీటపైఁ గూర్చుండి రాజుతో వినోదముగా మాటలాడుచుండెను. పెట్టుచున్న సెనగపప్పును జూచి రాజు,

శ్లో॥ ముద్గదాళీగదవ్యాళీ కవీంద్రవితుషాకథం।

రోగములం బోగొట్టెడు నీపెసరపప్పునకుం బొట్టేమిటికిం దీయవలయును. కవీంద్రా! చెప్పుము. అనియడిగినం గాళిదాసు

శ్లో॥ అంధోవల్లభసంయోగే జాతా విగతకంచుకా॥

అన్నమరుభర్తలోం గలసికొనుటచే నది విగతకంచుకయైనది. అనగా రవికలేనిదియైనదనియుం బొట్టులేనిదియనియు శ్లేషించి సమాధానము జెప్పెను. ఆచమత్కారసమాధానము గ్రహించి లీలావతి యించుక నవ్వినది. ఆనవ్వే యానృపాలుని హృదయాంబుజమునకు వెన్నెల యైనది.

అతండు మొగమునుముడుచుకొని యాత్మగతంబున నయ్యో ! స్త్రీసమక్షమం దీతండింత నిర్భయముగా నిట్టి యుత్ప్రేక్షప్రకటించెనే! లీలావతి యదివిని సిగ్గుపడక సంశయమువిడిచి నవ్వినది. ఇది యెంత యనుచితమైనపని. దీనింబట్టిచూడ లోకాపవాదము కొంతసత్యమేమో యని భ్రమకలుగం జేయుచున్నది.

శ్లో॥ న స్త్రీణా మప్రియః కశ్చి త్ప్రియో వాపి న విద్యతె।
గావ స్తృణమి వారణ్యే ప్రార్థయంతి నవం నవం॥

స్త్రీలచిత్త మిట్టిదని దేవుండే తెలిసికొనలేడన నాకెట్లు శక్యమగును. అని యనేకవిధంబుల నాలోచించుచు మఱికాళిదాసుతో మాటాడలేదు. కోపదృష్టుల భార్యనిరీక్షించుచుండెను. వెనుకటివలెం గాళిదాసకవియుం దానుంగూర్చున్నసమయంబున నామెవచ్చి యుపచారములం జేయంబూనిన నవ్వలంబొమ్మని తీక్షణముగాం బలుకును. ఈరీతిం గొన్నిదినములు గడచినవి. ప్రచ్ఛన్నముగా వారిచర్యలు పరీక్షించుచుండెను.

ఒకనాండు లీలావతి తనపనికత్తెనుబిలిచి నీవుపోయి యాగదిలో నిప్పు డెవ్వరుండిరో చూచిరమ్ము. రాజుగారొక్కరే యున్నచో వడిగా

వచ్చి చెప్పుము. ఆయనతోఁ గొన్నిరహస్యములు మాటాడవలసియున్నదని చెప్పిన నాపరిచారిక పోయి తొంగిచూచినది.

అందొకశయ్యపైఁ గాళిదాసకవి యవ్వలిమొగంబై పండుకొని నిదురించుచుండెను. భోజుఁడు వేరొకపీఠముపైఁ గూర్చుండి పరిచారిక తొంగిచూచివెళ్లుట పరికించి శంకాకళంకితమతియై మెల్లగా నవ్వలకుదాఁటి చాటునఁ గూర్చుండెను.

పరిచారిక పోయి యయ్యగారొక్కరే పండుకొనియున్నారని రాజభార్యతోఁ జెప్పినది. అప్పుడాయిల్లాలు దివ్యమణిభూషాంబరంబులు ధరించి యుపహారంబులఁ గైకొని మెల్లగా నాగదిలోనికిఁబోయి యొకశయ్యపై ముసుంగిడికొని పండుకొనియున్న కాళిదాసుం జూచి భర్తయనుకొని యామంచముపైఁ గూర్చుండి మనోహరా ! లెండు. ఈఫలాహారముల భుజింపుఁడు. నాపై గోపమువచ్చినదా యేమి? వెనుకటివలె మాటాడుట మానివేసిరేమి? కవిరాజు రాఁగలఁడు వేగలెండు మీతోఁ గొంత ముచ్చటింపవలసియున్నది. అని పలుకుచు ముసుఁగు లాగినది. కాళిదాసనిగ్రహించినది.

సిగ్గుపడుచు దిగ్గునలేచిపోయినది. రాజు గవాక్షవివరములనుండి యంతయుం జూచుచుండెను. కవిరాజు రాఁగలఁడు అనుమాటలో రాజురాఁగలఁడు అనుమాటమాత్రమే వినంబడినది. తన్నుఁ జూచి వెళ్లిపోయినదని నిశ్చయించెను. మెల్లన నాపడగది దాపునకుఁబోయి యేమనుకొనుచుండునో యని పొంచియుండెను. అప్పు డత్తరుణి పనికత్తెతో తొత్తా ! తిన్నగాఁజూడక యబద్ధము చెప్పెదవా ? ఎంత ప్రమాదము. ఎంతప్రమాదము. చీ చీ అశ్రద్ధబుద్ధిని నిన్ను శిక్షింపవలయునని మందలించుచున్నది.

ఆమాటలు విని రాజు ఇప్పుడు తెలిసినది. నాయునికి యాపనికత్తెకుఁ దెలియక యాతఁడొక్కఁడే యున్నాడని చెప్పినదికాఁబోలు.

ఇప్పుడు నన్నుంచుఁజూచి మందలింనుచున్నది. వేశ్యాలంపటుఁడగు నాకవి నంతఃపురమునకుఁ దీసికొనివచ్చి చనువుజేయుట నాదేతప్పు. వనితయు లతయు దాపుననున్న వానిపైఁ బ్రాకునని శాస్త్రములు చెప్పి యుండలేదా? నాబుద్ధి సురిగినది. ఈయపకీర్తి లోకమంతయు వ్యాపించియున్నది కాఁబోలు అయ్యో ! నేను వట్టి మూఢుఁడనై పోయితిని. అని తలంచుచుఁ గోపోద్దీపితమానసుఁడై యప్పుడ కాళిదాసు నొద్దకుబోయి పెడమోముతో నీవు నాదేశమునుండి యిప్పుడే లేచి పోవలయును. అని పలికి యజ్జనపతి యవ్వలకుఁ బోయెను.

ఆమాటవిని కాళిదాసు నేనేమితప్పుజేసితిని? నన్నెందులకుఁ బొమ్మంటివి? అని యేమియునడుగక మహాప్రసాదమని యుచ్చరించి యప్పుడే లేచి కట్టుగుడ్డలతో నెక్కడికో పోయెను. పిమ్మట నతం డంతటితో వదలక యాంతరంగిక పరిచరులఁ గొందఱంజీరి లీలావతి నొరులెఱుంగకుండ నర్ధరాత్రంబునం దీసికొనిపోయి మహారణ్యములో విడిచి రమ్మని నియమించెను. దైవప్రతికూలదినములలో మంచియంతయుఁ జెడ్డకిందఁ బరిణమించునుగదా ? —అనియాలోచింగించి మణిసిద్ధుండవ్వలికథ పైమజిలీయందుఁ జెప్పఁదొడంగెను.

---

## 144 వ మ జి లీ

శ్లో॥ సతాం హి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః॥

మిత్రుని గళత్రమును వెడలఁద్రోయించినది మొదలు లక్ష్మీదాసీ పతి హృదయమున స్థిమితముచెడిపోయినది. సభకుఁ బోవఁడు ఇతరులతో మాటాడుటమానివేసెను. ఏదియో ధ్యానించుచు నొక్కఁడు గూర్చుండును. వారి విషయమై పరిజను లేమనుకొనుచున్నారో యని

చాటుచాటుగాఁబోయి వారిమాట లాలించుచుండెను. ఒకచో నిరు వురు పనికత్తెలిట్లు మాట్లాడుకొనుచుండ నాలించెను.

ఒకతె—కనికీ! నిలునిలు. ఎందు బోయెదవు? చేసినపని సాఁగి నదికదా? కానుక లందితివా?

కనికి—బాపీయా! తొందరగాఁ బోవలసిన పనియున్నది. కాను కలా? ఒడలంతయు బంగారమైపోయినది.

బాపి—అట్లనుచున్నావేమి? వారు కానుకలీయలేదా? నీతల్లి యీయేటితో ఋణవిముక్తుల మగుదుమని చెప్పినదే.

కనికి—చేతిలో వేసికొనితాని యేపనియుం జేయరాదు. ఆపం డితులిచ్చిన పత్రిక రాజుగారి మంచముపై వైచితిని. అదిచదివికొనియే కాళిదాసుపై ననుమానముగలిగి మొదటఁ గొన్నిదినములు మాటా డుట మానివేసిరి. పిదప నయ్యనుమానము బలపడిన పిమ్మట లేవఁ గొట్టిరి. అది నేను జేసినపనివలన గాదఁట.

బాపి—మఱియెవ్వరు చేసినపనివలన?

కనికి—లీలావతిపనికత్తియ బుచ్చివెంకి చేసినదఁట.

బాపి—అది యేమిచేసినది?

కనికి—అమరించినదానిలో వేలుపెట్టినది. మఱేమియు లేదు. వినుము. లీలావతి యాగదిలో నెవ్వరున్నారో చూచిరమ్మనఁగాఁ గాళి దాసు పండుకొనియుండ రాజుగారని చెప్పినది. ఆమాటనమ్మి యామె వెళ్ళి కాళిదాసుముసుఁగు లాగినది. రాజుగారదిచూచి యిరువురను.

బాపి—మెల్లగాఁ జెప్పుము. భార్యను లేవఁగొట్టెనా

కనికి—బాబో అది బ్రహ్మరహస్యముసుమీ! ఎవ్వరితోనైనఁ జెప్పెదవుగాక.

బాపి—నా కామాత్రము తెలియదనుకొంటివా? నానమ్మ కను మీయమ్మకుఁ దెలియును. అందులకే మొదటి రహస్యము చెప్పినది.

కనికి—అందులకే నేనునుం జెప్పితిని. మొదట నేను జేసిన పనివలన రాజుగారికి బాగుగా ననుమానముగలిగి యున్నది. చివరపని బుచ్చినెంకికి మాటదక్కినది. కానుకలన్నియు దానికేనచ్చినవి.

బాపి—రాజుగారికి నిజము తెలియఁజేయుదునని బెదరింపలేక పోయితివా?

కనికి—దానంతట యదే బయలఁబడఁగలదు. మహాపతివ్రత నడవ్రులపాలు సేసినందులకు ఫల మనుభవింపకపోవుదురా?

బాపి—(నవ్వుచు) అంతయెఱిగినదానవు మొదట నీవేలపూను కొంటివి?

కనికి—గొప్పవారికి నీతియుండవలెఁగాని మనకేమి? నేను గాకున్న మఱియొకతె సిద్ధపడును.

బాపి—అవును. ఆమాటయు నిజమే. అదిగో యెవ్వరో వచ్చుచున్నారు. పదపద. అని మాట్లాడికొని యిద్దఱు నిష్క్రమించిరి.

ఆమాటలన్నియు దైవికముగా రాజుగారి, చెవినిబడినవి. వారిద్దఱు నిరపరాధులని యతని హృదయమునందు బాగుగా నచ్చినది. ఏమిచేయుటకుఁ దోఁపక గదిలో మంచముపైఁ బండుకొని వారిచర్యల దలంచుకొనుచు నేఁడువఁ దొడంగెను. కొంతసేపునకు లేచి లీలావతి నడవికిఁ దీసికొనిపోయిన పరిజనుల రప్పించి యోరీ! నాప్రియురాలి నేమిచేసితిఁ? ఎందువిడిచితిరి? తిరుగా నాకావర్తమాన మేమియుం జెప్పితిర కారేము?

అని యడిగిన వాండ్రు దేవా! దేవరదర్శనార్థము నాఁడే వచ్చితిమి కావలివారలు లోపలికిఁ బోనిచ్చిరికారు. మీయాజ్ఞానుసారము మత్తుమందు నాసనజూపించి పైమఱచియుండ యామె సందలముపైఁ బండుకొనఁబెట్టి మన నగరమునకు కుత్తరముగానున్న మహారణ్యమునంబడి యెల్లవారువఱకుఁ బెద్దదూరము పోయితిమి. సూర్య

కిరణములు సోకినంత నామెకు మెలకువవచ్చినది. మేము చోరులమను కొనినది. వస్తువులన్నియుం దీసికొని తన్ను భర్తతోఁ జేర్పుఁడని మిక్కిలి దైన్యముతోఁ బ్రార్థించినది. మేము దుఃఖించుచు నందల మొకచో దింపి మీయాజ్ఞాపత్రికం జూపితిమి. చదివికొని హా! ప్రాణేశ్వరా! యని పలుకుచు నేలంబడి మూర్ఛిల్లినది.

మేముచేయు నుపచారములవలనఁ బెద్దతడవునకు లేచి నలు దెసలు జూచి ఆ? స్వామీ! నాకిది స్వప్నమా? ఇట్టి పాడుస్వప్నము వచ్చినదేమి? నేనీ యడవి కెట్లువచ్చితిని? నాజీవితేశ్వరుఁడు నన్నీయడ విలో విడిచిరమ్మని మీకు నియమించెనా? ఛీ ఛీ యెంతమాట పలికి తిరి! ఆదయాశాలి సుగుణఖని నిరపరాధిని నన్నేమిటికి విడుచును? నే నేమితప్పుచేసితిని? అది వట్టిబూటకము. కలలోవార్త. మీమాట యుఁ గలలోనిదేయని పలికిన మేము తిరుగాఁ దమశాసనము చదివి వినిపించితిమి. అబ్బా! అప్పు డాతల్లిపడినదుఃఖమును మేము చెప్పఁ జాలము. పెద్దయెలుంగున నడవిప్రతిధ్వను లిచ్చునట్లు శోకించినది. మాకుఁగూడ నేడుపువచ్చినది. తన్నుఁ జంపి పొండని మమ్ముఁ బ్రతి మాలినది. మేమేమని యూరడింపము? విడువలేక విడువలేక మెట్టకే మేము బయలుదేరివచ్చుచుండఁ దమకిమ్మని యీపత్రికలో నేదియో వ్రాసియిచ్చినది. చూచుకొనుఁడని యది చేతికిచ్చిరి. అత్యంతాసక్తి తోవిప్పి యతండిట్లు చదివెను.

సీ. ప్రాణేశ యడవిలోపల నన్నువిడిపించి
నందుల కెద జింతనొందనేను
బంధువిహీననై బలవంతముగ మేను
విడుతు నట్టడవి నంచడలనేను
సర్వసంపదల శాశ్వతసుఖంబనుభవిం
పగలేదటం చింత వగవనేను

క్రూరసత్వంబులుక్కున మీఁదబడి యొడ
ల్విదలించునని పలవింపనేను

గీ. ఎప్పుడో చావునిక్కంబె యెఱిఁగిచూడ
నస్థిరంబులె దేహసౌఖ్యములు దెలియ
“దుష్టనని” కానఁద్రోసినందులకు మిగుల
వగతుఁజింతింతు విలపింతు వనటఁగాంతు.

శా. మీపాదంబులె నమ్మి దైవమని మిమ్మేకొల్తు నెల్లప్పుడే.
నేపాపంబునెఱుఁగ భూతనివహంబే సాక్షియో నాథ! నా
కీపై వచ్చెడు జన్మజన్మముల కీరే భర్తలై సత్కృపం
గాపాడన్ ఘటియింపు మంచెద జగత్కర్తం బ్రశంసించెదన్.

ఆపద్యములం జదివికొని యతండు నేలంబడి మూర్ఛిల్లి యొక్కింత తడవునకుఁ దెప్పిరిల్లి యున్మత్తవికారముతో ఓకీ! మీరామెందీసికొనిపోయి యెన్నిదినములైనది యెఱింగింపుఁడని యడిగినవాండ్రు దేవా! పదియేనుదినంబులైనదని చెప్పిరి. ఏమీ? ఇంతియే? నాకు యుగాంతరములైనట్లున్నది. కానిండు నేనాయడవికి వచ్చెద నాప్రియయురాలినెందు విడిచితిరో చూపింపుఁడని పలుకుచు నెవ్వరికిఁ జెప్పక యశ్వశాలకుఁబోయి యొకగుఱ్ఱమునకు జీను గట్టించి యెక్కి వాండ్రవెంట నమ్మహారణ్యమున కఱిగెను.

ఆదూతలు మహారాజా! ఇందాందోళికమును దింపితిమి. ఇందు మీశాసన మెఱింగించితిమి. ఇందు గుఃఖించినది. ఇందు మీకు పద్యములు వ్రాసియిచ్చినదని యాయాగురుతు లెఱింగించుచుఁ దచ్ఛాసనంబున నక్కాననంబంతయు నామెను వెదకిరి. ఎందు నామె జాడ కనంబడినదికాదు.

అప్పుడా ఱేఁడు మిక్కిలి పరితపించుచుఁ దాను వచ్చుదనుక రాజకార్యములన్ని మంత్రులేఁ జక్కఁబెట్టుఁడని శాసనము వ్రాసియిచ్చి

వాండ్రి నింటికిం బంపివేసి తానాయరణ్యమంతయుం దిరుగుచునమ్మదవతిని వెదక మొదలు పెట్టెను. హా ప్రేయసీ! యని కేకలు పెట్టుచుం దొల్లి శ్రీరాముండు సీతను గుఱించి పలవరించినట్లు పరితపించుచు నమ్మించుఁబోఁడి బలవన్మరణము నొందినట్లు నిశ్చయించియొక్కచెట్టు క్రిందఁ జదికిలంబడి యిట్లు తలంచెను.

అయ్యో! పరమపతివ్రతాశిరోమణియగునిల్లాలింజంపించితిని మహానుభావుండైన కాళిదాసు నవమానించితిని. వారిర్వురు నిర్దోషులని యిప్పుడు నాహృదయమే చెప్పుచున్నది. నేను మహాపాతకుండ నైతిని. నాకీ పాపమెట్లుపోవును. నాకు నిష్కృతిగలదా? ప్రాయోపవిష్టుండనై ప్రాణంబుల విడిచెదను. అని కృతనిశ్చయుండై యాచెట్టు క్రిందఁ గూర్చుండి నలుమూలలు చూచుచుండ నుత్తరపుఁ దెసనుండి యొక బ్రాహ్మణుఁ డాచెట్టుక్రిందికే యరుదెంచి యాతపక్లేశము నివారించుకొనఁ జెమ్మట లార్చుకొనుచు నందున్న యారాజుంజూచి వెఱుఁగుపడుచుఁ బల్కరించుటకు వెఱచి యూరక యాతనివంక చూచుచుండెను.

అప్పుడు భోజుం డతనింజూచి దీనస్వరముతోఅయ్యా! మీదే యూరు! ఎందుఁబోవుచున్నారు? అని యడిగిన నతం డిట్లనియె. నేనొకబ్రాహ్మణుండను. నాపేరు ఘోటకముఖుఁడందురు. భోజమహారాజుగారిం జూడ ధారానగరంబున కరుగుచున్నాఁడను. కాశీలోఁ జదివితినని తనవృత్తాంత మంతయును జెప్పెను.

ఆమాటలువిని రాజు నమస్కరించుచు నార్యా! భోజునితో మీకేమిపనియున్నది? అని యడిగిన సౌమ్యా! అతండు పండితకల్ప భూజుండని కాశీలో విని మే మేడ్వురము సహాధ్యాయులము వారిం దర్శింప నిశ్చయించి వేఱువేఱుమార్గములనాయూరికిఁ బోవుచుంటిమి. నామిత్రులీపాటికి తత్పురంబునకుఁ బోయియుందురు. నాకు దారిలో

సంతరా[illegible] అని చెప్పి[illegible]యె.

అయ్యా! ఈయడవిలో నెం[illegible]ైన నె[illegible]నంబడినదా! యని యడిగిన నతండు సౌమ్యా! కనంబడినది. ఆమె మూలముననే నాకు జాగైనది. అని చెప్పుటయు నతండులేచి ఆర్యా! ఎందుఁ గనంబడినదో చెప్పుము. నన్నచ్చటికిఁ దీసికొనిపొమ్మని బ్రతిమాలిన బ్రాహ్మణుం డిట్లనియె.

నే నొకదారింబడి వచ్చుచుండ నొకచోఁ జెట్టుకొమ్మకుఁ బైట చెరఁగు తగిలించి మెడ కురిఁబోసికొని చావఁ బ్రయత్నించుచున్న యొకచిన్నది నాకన్నులం బడినది. కన్నులుమూసికొని చేతులు జోడించి దైవమును ధ్యానించుచున్నది. తటాలున నేనప్పుడుపోయి యుఱి బిగియకుండ గట్టిగఁ బట్టికొని స్వామీ! నీవెవ్వతెవు? బలవన్మరణము నొందు చుంటివేమిటికి? ఇది పాపకృత్యముకదా ! నీకేమి యాపదవచ్చినది? నిన్నుఁజూడ గొప్పదానవువలెఁ దోచుచున్నావు. నీయుదంత మెఱింగింపుమని యడిగిన నాచేడియ గన్నులుదెరచి నన్నుఁజూచి ఆర్యా! నీకు నమస్కారము. నన్ను విడువుము. నావృత్తాంత మడుగకుము. పట్టు వదలుము. అని బ్రతిమాలినది.

నేను—తల్లీ! నీవృత్తాంతము నాకుఁ జెప్పుము. నన్ను బుత్రినిగా భావింపుము. బలవన్మరణము నొందఁగూడదని యెంతయో బ్రతిమాలితిని. నామాటలచే మరణోద్యోగము మానినదిగాని తనవృత్తాంతము చెప్పినదికాదు. అప్పుడు నే నామెనేమియుఁ బల్కరింపక తెరపికిఁ బోవుదము రమ్ము. మీయూరికిఁ దీసికొనిపోయెదను. అని పలుకుచు నుపలాలించి యొక దారింబెట్టి నడపింపసాగితిని.

నే నామెవంకఁ జూచుచు రమ్మనిచీరుచు నిలువంబడి పరికించుచుఁ గొంతదూరము తీసికొనిబోయితిని. ఆదారి నొకమాంత్రికుఁడు భల్లూకములను కోఁతులను కుక్కలను మెడకుఁద్రాళ్ళుదగిలించి నాజా

లకులఁ జేతనిడికొనివచ్చుచు మాకెదురుపడియెను. వాని చేతిలోనున్న దుష్టజంతువులనుఁ జూచి నేను జడియుచు నాయిల్లాలిని దరికిరమ్మని మార్గమునకోరగా నిలువఁబడి నాఁడవ్వలికి బోవునని నిరీక్షించుచుంటిమి. ఆదుర్మార్గుఁడాచిన్నదాని మొగము మొగాడిగఁ జూచుచు నామెను తన డాపునకురమ్మని యంగుళితో సంజ్ఞఁగావించెను. ఆమె వాని మొగమే చూడలేదు. తరువాత నాతండా చిన్నదాని డాపునకు వచ్చి నీ వెవ్వతెవు? ఎందు బోవుచుంటివని యడిగిన జడియుచు నా యువతి నామాటునకు రాఁదొడంగినది.

నే నడ్డమునిలిచి అయ్యా! మాజోక్యము నీ కేటికి ? నీదారినీవు బొమ్ము. ఈమె నాకు సహోదరి. మేము బ్రాహ్మణులము. నేనుండ నాఁడుదానిం బల్కరించెద వేమిటికి? అని చెప్పితిని. అతండు నామాటలు విని తలయూచుచు బాపురే! బాపనయ్యా! నిలునిలు. అనిపలుకుచు నొకకుక్క గొలుసువిప్పి నాపైకుసిగొల్పెను. అది మొఱుగుచు వచ్చి నాపైఁబడినది. నాకు ధైర్యముచాలక పారిపోయితిని. కుక్క నన్ను తఱిమి కాలుకఱచినది. నేలంబడితిని. మేను వివశమునొందినది. పిదప తడవునకుఁ దెలివివచ్చినది. నలుమూలలు చూచినంత నందెవ్వరును గనంబడలేదు. ఆమెకొఱకు పెద్దదూరము తిరిగితిని. ఏజాడయుఁ దెలియలేదు. తిరిగితిరిగి విసిగి మఱలమార్గంబునంబడి నడుచుచుంటిని. ఇదియే వృత్తాంతమని చెప్పెను.

ఆకథవిని భోజుండు హా! ప్రేయసీ ! నీకెట్టి యిడుమలాదెచ్చి పెట్టితిని నేనుమిగుల పాపాత్ముండఁగదాయని దుఃఖించుచుఁ గొంత సేపటికి ధైర్యముదెచ్చుకొని మాంత్రికునుద్దేశించి ఛీ ! దురాత్మా ! ఎవఁడవురా నీవు ! కాంతారముల సంచరించుచు సాధుజనులకు బాధ గావింపుచుంటివి? నాకన్నులంబడిన నిన్ను బ్రదుకనిత్తునా ? ఈరాజ్యమెవ్వనిది ? ఇట్టిఘోరకృత్యములు జరగుచుండఁ బరీక్షింపకుండునే ?

ఈపాతక మాభూపతిం జెందదా? అన్నన్నా ! చేతఁ గరవాలము లేక పోయెగదా? పండితప్రవరా ! పరోపకారపారీణు నిన్నావంచకుండు కుక్కచేఁ గరపించెనా? ఏదీ ! నీవ్రణము. అయ్యో ! దానికోఁతలు లోతుగా నేదిగినవి. గాయమింకను బచ్చిగనే యున్నది. వాఁడెందే గనో నాకు జూపుము. అని పలుకుచుండ ఘోటకముఖుఁడు ఓహో ! ఈతం డెవ్వఁడో గొప్పవాఁడు. తేజశ్శాలి. పరాక్రమసంపన్నుఁడు. శ్రీరాముండువలె భార్య నడవికనిపి పిమ్మటఁ బశ్చాత్తాపము జెంది యయ్యిందువదనను వెదకుచున్నవాఁడు. నిక్కము దెలిసినది. ఆచిన్నది వీనిభార్య. పాపము ఆమెను వాఁడు చెరఁబట్టఁబోవ బలవన్మరణము నొందకమానదు. ఈదంపతులకిఁక కలయికదుర్ఘటమే. ఈతనివెంటఁ బోయి కులశీలనామంబులం దెలిసికొనెదంగాకయని తలంచుచు నతం డానృపతికిట్లనియె.

అయ్యో ! నేను వారినిమిత్తము పెద్దదూరము తిరిగి వెదకితిని. ఎందునుగనంబడలేదు. ఆకౄరునినోసటఁ బెద్దకుంకుమబొట్టున్నది. గడ్డముపెంచెను. జడలుముడివేయఁబడియున్నవి. వాఁడీపాటికి జనప దంబులకుఁ బోవఁగలఁడు. నేను వాని గురుతుపట్టఁగలను. మనమీయ డవి విడిచి గ్రామములమీఁదుగాఁబోయి వెదకుదము. కనంబడక యెందు బోగలఁడు. అనియుపదేశించిన సంతసించుచు నారేఁడు ఘోట కముఖునితోఁ గూడ వానివెదకుచు దేశసంచారము గావించెను.

అని యెఱిఁగించి మణిసిద్ధుండు తదనంతరోదంతం బిట్లుచెప్పఁ దొడంగెను.

## 148 వ మజిలీ.

### —♦ రు క్మి ణి క థ. ♦—

భోజరాజునకుఁ గంధర్వపుత్రికయగు కమలయను భార్యయందు జిత్రసేనుఁడను కుమారుఁడును రుక్మిణియను కుమార్తెయునుదయించిరి.

గంధర్వదౌహిత్రియగు నారాజపుత్రికసౌందర్యం బనన్యసామాన్యంబై యున్నదని వేరె వర్ణింపనవసరములేదు. ఆమె విహరించుటకై యాపట్టణంబును జేర్చియే గొప్పయుద్యానవనమొకటి నిర్మింపఁబడినది. ఆ తోటలోఁగల పుష్పజాతులు నందనవనములోఁ గూడ లేవని చెప్పవచ్చును. వాని చుట్టును గొప్పప్రహరి గట్టఁబడియున్నది. సంతతము ఆరుక్మిణి యాయుద్యానవనమునందె విహరించుచుండును. ఆనిష్కుటములోనికిఁ బురుషు లెవ్వరుం బోరాదు. పోయినచో శిక్షింపఁబడుదురు. రుక్మిణికి యౌవనోదయమగుచున్నది. ఆతోటలోనే యాందోళిక యాటపాటలు ఘోటకవిహారములులోనగు క్రీడలు గావింపుచుండును రేవతియను చెలికత్తియ యత్తన్వికి హృదయస్థానమై యున్నది. ఒక నాఁడారుక్మిణి యుద్యానవనములో సఖులతో నాడియాడి సాయంకాలమున స్వారివెడల వేడుకపడి రేవతింజీరి సఖీ! పరిచారిక గుఱ్ఱమును దీసికొనివచ్చినది కాదేమి? నేఁడు వాహ్యాళి లేదనుకొనినదా యేమి? అనియడిగిన రేవతి దేవీ! పరిచారిక యథాకాలమునకే తత్తడినాయత్తముజేసి తీసికొనివచ్చినదఁట. అది యకారణముగ బెదరి కళ్ళెము బట్టుకొని యెంతలాగినను నిలువక రెక్కలుగలదానివలె నెగిరి కళ్ళెము గ్రించుకొని యెక్కడికో పారిపోయినదఁట. దానికొఱకై పెక్కండ్రు రాజభటులు పరుగిడిపోయిరి. దాని జాడ యేమియుం దెలియలేదు. ఆమాట చెప్పుటకే నీదాపునకువచ్చితిని. నీవేదియో పుస్తకము జదివికొనుచు నాదెసజూచితివికావు. ఇఁక వాహ్యాళికిఁ బ్రొద్దులేదు. రేపు గావింపవచ్చును. మిగుల దీక్షగాఁజూచుచున్న యాపొత్తములోని చిత్రములేమని యడిగిన రాజపుత్రిక రేవతికిట్లనియె.

ఈపుస్తకములో మిక్కిలి చమత్కారములగు విషయము లున్నవి. ఇది రహస్యగ్రంథము. దీనిపేరు చెప్పకూడదు. ఇది స్పష్టముగా నర్థము గాకున్నది. చూడుమని యాపుస్తకము రేవతి కందిచ్చినది.

రేవతి యాపుస్తకము విప్పి పేరుచదివి చిఱునగవుతోఁ దలయూచుచు నందంతయు బరిశీలించి వయస్యా! నీవిప్పుడు దీనిఁజదువవలసినదే. వ్యాఖ్యానమున్నను గూఢముగానున్నది. దీనిం గురుముఖముగాఁ జదివికొమ్ము. అని పలికిన రుక్మిణి యిట్లనియె.

రేవతీ! దీనిం బురుషులయొద్దఁ జదువరాదుగదా? శాస్త్రపాండిత్యముగల స్త్రీలు మనకెక్కడ దొరకెదరు? తెలిసినంత మనమే గ్రహింపవలెను. నీవుకూడ విమర్శించి చూచుమనుటయు నది బాగు బాగు నీకంటె నాకెక్కువ పాండిత్యముగలదా? తిన్నగాఁ జూచిన నీకేయర్థమగును. లేనిచో బండితులనడిగి తెలిసికొనివచ్చెదనని పలికిన రుక్మిణి చాలుచాలు! మాటవరుసకంటె నీమాట యెవ్వరికైనం జెప్పెదవుసుమీ? సిగ్గు సిగ్గు అని యాపుస్తకము పుచ్చుకొని యింటికిబోవుదము బండికట్టింపుము. అని యాజ్ఞాపించినది. అశ్వశకటము సన్నద్ధమైనదని విని రాజపుత్రిక రేవతికైదండ గొని మేడదిగివచ్చి బండి యెక్కఁబోవుసమయంబున సశ్వరక్షకురాలు వచ్చి నమస్కరించుటయు రుక్మిణి, నేఁడు నీకతంబున వాహ్యాళి చెడిపోయినది. గుఱ్ఱమేమిటికి బెదరినది? మచ్చికచేయుటలేదా యేమి? అని యడిగిన యాపరిచారిక అమ్మా! ఆబాడబమిట్టి యాగడమెన్నడును జేయలేదు. ఊరక బెదరి యెవరో లాగికొనిపోవునట్లు పారిపోయినది. నిలుప నాశక్యమైనది కాదని చెప్పుచుండఁగనే యదిగో భర్తృదారికగుఱ్ఱము వచ్చుచున్నదని వనపాలికలు కేకలుబెట్టిరి. ఆమాటలు విని యందఱు నామార్గము దెసకు దృష్టులు వ్యాపింపజేసిరి. అంతలో నొక చక్కని [illegible]వరాలు జీనుపైఁ గూర్చుండి కళ్లెము లాగుచుండ సాహాయం బతిరయంబున బరుగెత్తికొనివచ్చి రుక్మిణి యెక్కుచున్నబండి ప్రక్క నిలుచుంబడినది. రుక్మిణి యక్కలికిం జూచి యక్కజమందుచు జవ్వనీ! నీవెవ్వతెవు? యివ్వారువ మెక్కడ గనంబడినది? దీనిందెచ్చి మాకి

చ్చితివి కావున నెచ్చెలివైతివి. రమ్ము రమ్ము. నీవృత్తాంతము చెప్పుము. అని పలికిన నక్కలికి యతిలాఘవంబున నాగుఱ్ఱమును దిగినది.

రాచపట్టి యామెచెట్టంబట్టుకొని యందున్న రచ్చపైఁ గూర్చుండఁబెట్టినది. అప్పుడా చిన్నది, రాచకన్యతో రమణీమణీ! నాపేరు చారుమతియండ్రు. నేనొక వేశ్యాపుత్రికను. కన్నవారు చిన్నప్పుడే గతించిరి. బంధువులచేఁ బోషింపఁబడి విద్యాభ్యాసలాలసనై కాశీపురంబున కరిగి యందు బహువిద్య లభ్యసించితిని. దేశవిశేషంబులం జూడ వేడుకబడి తిరుగుచుంటి. నేఁడు నేనీ పట్టణమునకు వచ్చుచుండ నా కెదురుగా నీతురగము పరుగిడివచ్చుచుండెను. అదివి నెక్కవలెనని పట్టెక్కితిని. ఆచెట్టుక్రిందికే వచ్చి యిది నిలువంబడినది. ఉత్తమాశ్వమని గ్రహించి దీనిపైకెక్కి లగాములో కాలుపెట్టితినో లేదో యొక్కపరుగున నిక్కడికిఁ దీసికొనివచ్చినది. దీనిపై నెట్లు నిలువంబడితినో తెలియదు. ఆ వేగమునకు మేను వివశమైపోయినది. ఇదియే నావృత్తాంతము. నిన్నుఁజూడ రాజపుత్రికవలెఁ గనంబడుచుంటివి. నీపేరేమి? ఏమహారాజు కూఁతురవు? ఈనగర మెయ్యది? నీయుదంత మెఱింగించి శ్రోత్రానందము గావింపుము. అనుటయు రాజపుత్రిక సఖురాలు రేవతి యిట్లనియె.

ఈమె సకలనృపకిరీటమణినీరాజితచరణసరోజుండగు భోజభూభుజుని కూఁతురు. [illegible]. ఇది ధారానగరము. ఇది యీమె విహరించు నుద్యానవనము, అని యెఱింగించినఁ జారుమతి యామాటవిని వెఱగుపాటుతో నోహోహో! నేఁడెంత సుదినము నే నెంతధన్యురాలను నాయభీష్టము దీర్ప నీయశ్వము సర్వేశ్వరుని యనుమతినే యిక్కడికిఁ దీసికొనివచ్చినది. సకలకల్పభూజాయితగు భోజమహారాజుయశము కాశీదేశమంతయు వ్యాపించియున్నది. అట్టి

రాపట్టితో నాకు మైత్రిగలిగినది. నావంటిధన్యురా లున్నదియా! అని పొగడుకొనుచుండ వారించుచు రుక్మిణి యిట్లనియె.

చారుమతీ! నీమాటలచేతనే నీవఖండపాండిత్యధురంధరురాలనని తెలియఁబడుచున్నది. నీవంటి యాప్తురాలు దొరకుట దుర్ఘటము. ఈవాఱువము నిన్ను నాచేరువకుఁ దీసికొనివచ్చుట నాభాగ్యముగాని నీభాగ్యమా! నీవు నాయొద్దఁ గొంతకాలము వసింపవలయును. నిన్ను నాహృదయంబునం బెట్టికొని కాపాడెదను. నన్ను శిష్యురాలిగాభావించి నీకువచ్చిన విద్యయంతయు నాకునేర్పుము. సంతతము నాయంతఃపురమునందే వసింపుము. నాభాగ్యమే నీభాగ్యము. నాభోగమే నీభోగము అనిపలుకుచు నేస్తమభిలషించిన విని చారుమతి యిట్లనియె.

రాజపుత్రీ! నీవు నాకుఁ బ్రియురాలవై మెలంగెదననిన సంతసింపనా? నీయిష్టమెట్లో యట్లేకావించెద. మఱియొకటివినుము నేను గణికనైనను కులవృత్తినివిడిచితిని. మీవారెవ్వరైన నన్ను విటకత్తెనుగా భావింతురేమో. అంతల కంగీకరించుదానఁగాను అనుటయు రుక్మిణి నవ్వుచు పువ్వుఁబోడీ! నాయంతఃపురమునకుఁ బురుషులువత్తురా? నాకెట్టియవరోధమో నీకు నట్టియవరోధమే. సంశయింపకుము. రమ్ము. అని చేతిలోచెయ్యివైచి బండియెక్కించుకొని తనప్రక్కను గూర్చుండబెట్టుకొనినది. రేవతియెదురుగాఁ గూర్చుండినది.

అప్పుడు కొందఱుపరిచారికలువచ్చి దేవీ! రాజభటులు ద్వారదేశమునఁ గోలాహలము సేయుచున్నారు. నీగుఱ్ఱమెక్కి యెవ్వఁడో పురుషుఁడు లోపలికివచ్చెనట వానింబట్టికొని దండింతురఁట. ఈవలకుఁ బంపుమనుచున్నారు. సెలవేమి? అనవుడు రుక్మిణి చాలుఁ జాలు వాండ్రవిమర్శనము జక్కఁగానున్నది. గుఱ్ఱమెక్కివచ్చినది యాఁడుదో మగవాఁడో తెలియకున్నారు. పోపొమ్మనుము. అనిగద్దించి బండితోలించుకొని తనయంతఃపురమునకరిగినది. ఆరాత్రి రుక్మిణి చారుమతితో నిష్టగోష్ఠీవినోదముతోఁ దృతిగా వెళ్లించినది.

మఱునాఁటియుదయంబున భోజకుమారుఁడు చిత్రసేనుఁడను వాఁడు రుక్మిణి యంతఃపురమునకువచ్చి యొక్కచోఁ గూర్చుండి చెలియలింబిలిచి సహోదరీ! నిన్నసాయంకాలమున నీగుఱ్ఱమెక్కడికో పారిపోయినదనియు దానినెక్కి క్రొత్తవాఁడొకఁడు నీయుద్యానవనమునకు వచ్చెననియు వానిని బండిలో నెక్కించుకొని రాజభటులను గద్దించి నీవంతఃపురమునకుఁ దీసికొనివచ్చితివనియు నందున్నకావలివారలు సెప్పుచున్నారు. మంత్రిలావిషయము నీవలనం దెలిసికొని రమ్మని నన్నునియమించిరి. అందలియథార్థమేమనియడిగిన రుక్మిణి భయమభినయించుచు అన్నా! కాశీపురనివాసిని చారుమతియను వేశ్యారత్నము మనయూరునకువచ్చుచు దారిలో నెగురుపడినగుఱ్ఱమెక్కినది. అదియెంతనుబోక నాయుద్యానవనమునకుం దీసికొనివచ్చినది. అచిన్నది మిక్కిలి చదివినదఁట. ఆమెవలనఁ గొన్నివిద్యాసాంప్రదాయములఁ దెలిసికొనఁదలంచి నాశుద్ధాంతమునకుఁ దీసికొనివచ్చితిని కావలివారలామెను మగవాఁడని బొంకుచున్నారు. కావలసిన నామె నిందుదీసికొనివచ్చి చూపెదఁ జూడుమనిపలుకుచు లోనికిఁబోయి చారుమతిపాణిఁ బాణింగీలించి ముచ్చటలాడుచు నచ్చటికిఁదీసికొనివచ్చి యీమెయే చారుమతి. ఈమెయేనిన్న నాగుఱ్ఱమెక్కి నాయుద్యానవనములోనికి వచ్చినమచ్చెకంటియని యెఱింగించెను.

అప్పుడా రాజకుమారుఁ డాజవరాలి మేని[illegible] కన్నులకుమిఱుమిట్లుగొల్ప ముకుళితనయనుండై మోహ[illegible] యొక్కింతతడవు ధ్యానించి మదినుప్పొంగుచు [illegible] సౌందర్యాతిశయం బా[illegible]నక చూచుచుండెను. రుక్మిణి చారుమతి సఖీ! ఈతఁడు నాసోదరుఁడు చిత్రసేనుఁడు; విద్వత్ప్రియుండు. కొంత చదివినవాఁడు. కొదవవిద్యలు నీయొద్ద నేర్చుకొనఁగలఁడు. మఱియు మాయుద్యానవనరక్షకులు నీవు మగవాఁడవని నివేదించిరఁట. అందలి

నిజము దెలిసికొనవచ్చునని యొంచింగించుటయుఁ జారుమతి యారాజ సుతునకు నమస్కరించి యోరగానిలువంబడినది.

చిత్ర—క॥ నారీ! నీపే రేమది?

చారు—చారుమతి యటండ్రు

చిత్ర—నీకు జననం బెచటో?

చారు—వారాణసి.

చిత్ర—కులమెయ్యది?

చారు—వారాంగన నేను.

చిత్ర—కన్యవా?

చారు—అవు దేవా!

చిత్ర—గీ॥ విద్యలే మభ్యసించితివి?

చారు—నరనాథపుత్ర! శ్రీకాళిదాసాదిభూరికవిశిఖామణుల చేత విఖ్యాతిఁగనిన మీకడను జదివితిననుచుఁ జెప్పికొనఁగనశమె?

[క॥ నారీ నీపే రేమది?
చారుమతియటండ్రు నీకుఁజననం బెచటో
నా వారాణసి కులమెయ్యది?
వారాంగననేను కన్యవా? అవు దేవా.
గీ॥ విద్య లేమభ్యసించితివి నరనాథ
పుత్ర కాళిదాసాదిభూరికవిశి
ఖామణులచేత విఖ్యాతిగనిన మీక
డను జదివితిననుచు జెప్పుకొనఁగ నశమె.]

చిత్ర—క॥ లలనావతంసమా! నీకులవృత్తిని సేవగించుకొంటివి మేల్ పెండిలియాడెదవా!

చారు—యేమో! తెలియదు. విధిపంపులకు విధేయులము గదా?

రాజకుమారునిచిత్తము తదాయత్తమగుటఁ జిత్తభవునిసాయక పరివేశమున కవకాశమిచ్చినది. తదీయసంభాషణామృతము గ్రోలుట. మేను వివశమైపోయినది. మోహమగ్గలమగుటయు నోడ లెఱుంగక సాత్వికవికారములతో వచ్చినపనియేమియో మఱచి యారాజకుమారుఁడు వికారముగా మాటలాడుచుండుటఁ దెలిసికొని రుక్మిణి అన్నా! ఇఁక నీవిందు మసలరాదు. వేగఁబొమ్ము. చారుమతీ! లోపలికిఁబోవుదము రమ్మని యామెనంతర్భవనమునకుఁ దీసికొనిపోయినది.

అప్పుడా నృపనందనుం డేమిచేయుటకుం దోచక రుక్మిణిపలికిన మాటలవడువున నందునిలువక చిత్తచాంచల్యముతో నిజనివాసమునకుం బోయెను.

అంతఃపురమునఁ జారుమతి రుక్మిణితో సఖీ! నీయన్న యెట్టి ప్రశ్నలు వైచెనో చూచితివా? ఎట్టివికారములఁ బ్రకటించెనో పరికించితివా? యౌవనవిలాసములు కడు విపరీతములుగదా? అనుటయు రుక్మిణి సఖీ! పోనిమ్ము వానిగణింపకుము. అతండు నీవ్రతం బెఱుంగకపోవచ్చును. నీరూపమందంత మహిమయున్నదని యామె మనసు చిన్నవోకుండ సవరించి మాటాడినది. పిమ్మట నాదినమందే మంచి సమయ ముపలక్షించి చారుమతి రుక్మిణీ! నీవిప్పుడు నావలనఁ దెలిసికొనవలసినవిద్య లేమియో పేర్కొనుము. ఇప్పుడే ప్రారంభింతమని యడిగిన నమ్మగువ యేదియో యాలోచించుచుండెను. అప్పుడు రేవతి చెలీ! మఱచితివా? నిన్న నుద్యానవనములోఁ జూపినపుస్తకము పాఠము జెప్పించుకొనుము. అందలి విషయములు మనకు సుస్పష్టముగాఁ దెలియలేదు. అని జ్ఞాపకము సేయుటయు స్మృతి నభినయించుచు నాయించుఁబోఁడి యాపుస్తకము దెప్పించి యారెమొప్పలకు ప్పకుఁ జూపుచు దీని నాకు సాంతముగాఁ బాఠము జెప్పుమని కోరినది. చారుమతియు నుపన్యాసపూర్వకముగా నిట్లు చెప్పఁదొడంగెను.

శ్లో॥ పక్వాన్నమివ రాజేంద్ర సర్వసాధారణా స్త్రియః
తస్మా త్తాసు న కుప్యేత న రజ్యేత రమేత చ॥
మద్యపానా న్నివృత్తిశ్చ బ్రాహ్మణానాం గురోస్సుతాం
పరస్త్రీభ్యశ్చ లోకానా మృషే రౌద్దాలకే రపి॥
తతః పితు రనుజ్ఞాతా ద్గమ్యాగమ్యవ్యవస్థయా
శ్వేతకేతు స్తపోనిష్ఠ స్సుఖం శాస్త్రం నిబద్ధవాన్॥

పూర్వకాలంబునఁ బరస్త్రీగమనము నిషేధముకాదు. స్త్రీలు పక్వాన్నమువంటివారు. అందరును సమానముగా ననుభవింపఁదగిన వారు. ఇది గమ్య ఇది యగమ్యయని విధినిషేధములులేవు. మఱియు బ్రాహ్మణులు మద్యమాంసములు దినువారు. గురుపుత్రికం బెండ్లి యాడువారు. అట్టి దురాచారములన్నియు నిషేధించి పరమతపోని ష్ఠుండగు నుద్దాలకమహర్షి కుమారుఁడు శ్వేతకేతుండనువాఁడు తండ్రి యనుజ్ఞచే (నపరదారాంగచ్ఛేత్) పరస్త్రీగమనము నిషేధించుచు సహస్రాధ్యాయములతో నొప్పుచున్న యొకశాస్త్రమును రచించెను. నాఁటినుండియు నాదురాచారము లన్నియు నశించినవి.

మఱియు నాగ్రంథవిషయంబులే క్లుప్తపరచి బభ్రుపుత్రుఁడగు పాంచాలుండను పండితుండు నూరధ్యాయములుగా సాధారణ సాం ప్రయోగిక కన్యాసంప్రయుక్త భార్యాధికారిక పారదారిక వైశికోపని షాదికములను సప్తాధికరణములుగల యీగ్రంథమును రచించెను. ఇం దలి విషయంబులు సర్వజనానుష్ఠేయంబులని యోఁచించి మఱియు,

ఇందు సూ—శతాయుర్వై పురుషో విభజ్య కాల మన్యోన్యా నుబద్ధం పరస్పరస్య అనుపఘాతుకం త్రివర్గం సేవేత॥

పురుషుఁడు తన యాయువును విభజించుకొని ధర్మార్థకామ ముల నొకదానివలన నొకదానికి బాధకములేకుండ ననుభవింపవలసిన దని చెప్పఁబడియున్నది. చూచితివా

రాజపుత్రి—సఖీ! పురుషుఁడు తనయాయువునెట్లు పంచుకొన వలయునో చెప్పుము.

చా—వినుము. బాల్యము, యౌవనము కౌమారము వార్ధక్యము, నాలుగు భాగములుగాఁ జేసికొని

సూ॥ బాల్యే విద్యాగ్రహణా దీనర్థాన్॥

బాల్యంబున విద్యాగ్రహణాదికమగు నర్థముల సంపాదింప వలయును.

రాజ—బాల్యమన నెన్నియేండ్లవఱకు?

చారు—ఆషోడశాద్భవేద్బాలః అనియున్నది. పదియాఱేండ్ల వఱకు బాలుఁడనఁబడును.

రాజ—తరువాత

చారు—సూ॥ కామంచ యౌవనే॥ యౌవనమునఁ గామ మనుభవింపవలయును.

రాజ—తరువాత,

చా—సూ॥ స్థావిరే ధర్మం మోక్షంచ॥ ముసలితనమున ధర్మమును గుఱించి యత్నింపవలయును.

రాజ—సఖీ! నాకిందొక సందియము గలుగుచున్నది. యౌవనమునందుఁ గామమేకాని యర్థధర్మముల నార్జింపఁగూడదా?

చారు—నవ్వుచు నీ సందియ మీగ్రంథకర్తయే తీర్చె నాకర్ణింపుము. సూ॥ అనిత్యత్వాదాయుషో యథోపపాదం సేవేత। అనఁగా జీవిత మస్థిరమగుట నెప్పుడేది సిద్ధమగునో యప్పుడు ధర్మార్థముల సంపాదింపవలయునని శాస్త్రకారులే చెప్పియున్నారు.

రాజ—సూ॥ తిర్యగ్యోనిష్వపి స్వయంప్రవృత్తత్వాత్ కామస్యనిత్యత్వాచ్చ న శాస్త్రకృత్య మస్తీత్యాచార్యాః॥

శ్లో॥ వినోపదేశంసిద్ధోహి కామోనాఖ్యాత శిక్షితః।
స్వకాంతా రమణోపాయె కో గురుర్మృగపక్షిణాం॥

చారుమతీ! నిన్నేను గొన్ని యెఱిఁగియు నెఱుంగని శంకలు

చేయుచుంటి పరిహాసింపకేమి. త్రివర్గములో ధర్మార్థములకు శాస్త్ర మావశ్యకముగాని కామమునకు శాస్త్రపాఠమేల? కామము జంతువులకు నిత్యమైనదికాదా? పశుపక్ష్యాదికములకు స్వకాంతారమనోపాయ మెవ్వఁ డుపదేశించుచున్నాఁడు ?

చారు—తరుణీ! వినుము. సూ॥ సంప్రయోగపరాధీనత్వాత్ సచ స్త్రీ పురుష యోనుపాయ మపేక్షతే॥ కామము సంప్రయోగపరాధీనమైనదగుట నుపాయ మపేక్షించుచున్నది. అయ్యుపాయంబు శాస్త్రపఠనంబునంగాని లభింపదు. పశుపక్ష్యాదు లావరణశూన్యములగుట ఋతుకాలమందె సంయోగాపేక్షగలవగుట వానికి శాస్త్రావశ్యకము కాన్పింపదు. మనుష్యులకు గమ్యాగమ్య వివక్షయు సంతోషావసాన ప్రతీకారములు గలుగుటంబట్టి శాస్త్రమావశ్యకంబై యున్నది.

రాజపుత్రి — సూ॥ నకామాన్ చరేత్॥ పాండురాజు రావణుఁడు మొదలగు కాముకులు విశేషకామంబునఁ జెడిపోయిరికాదే. సామాన్యకామంబునఁదృప్తిఁబొందక విశేషకామంబునకేల ప్రయత్నింపవలయును?

చారు—రావణాదు లధర్మకామంబునం జెడిపోయిరి. ధర్మార్థహాని కాకుండఁ గామమును బ్రవర్తింప జేయవలయునని శాస్త్రము ఘోషించుచున్నది. ఇందులకే శాస్త్రపాఠము. మఱియొక విశేషము వినుము.

సూ॥ శరీరస్థితిహేతుత్వా దాహారసధర్మాణోహికామాః అజీర్ణాదిరోగ జనకంబైనను నాహారము శరీరస్థితికి హేతువగునట్లు కామముగూడ హేతువేయగుచున్నది. మఱియు,

సూ॥ ఫలభూతాశ్చ ధర్మార్థయోః॥ ధర్మార్థములయొక్క సేవ సుఖముకొఱకే కదా అట్టిసుఖము కామమే.

రాజపుత్రి—(నవ్వుచు) ధర్మార్థములయొక్క సేవ కామము నిమిత్తమా ఈమాటకుఁ బ్రాజ్ఞులు సమ్మతింతురా

చారు—సందియమేలా వినుము.

శ్లో॥ ధర్మమూలస్స్మృత స్స్వర్గస్తత్రాపి పరమాస్త్రియః।
గృహస్థ ధర్మో దుర్వారో నరాణాందైవ యత్నజః॥
హితాశ్చాపత్యసంతానై స్త్రియస్త్విహ పరత్రచ
పరం సంప్రత్యయో భోగః ప్రకర్షార్థాయ వై స్త్రియః॥

స్వర్గము ధర్మమూలకమైనది. అందుఁగూడ స్త్రీలే ముఖ్యులుగాఁ జెప్పబడిరి. ధర్మయత్నజనితంబగు గృహస్థధర్మము దుర్వారమైనది సంతానలాభమువలన స్త్రీలు ఇహపరసుఖముల నొసంగుచున్నారు కావున స్త్రీభోగము ప్రకర్షార్థమునకు గారణమగుచున్నది.

రాజపుత్రి! స్త్రీ దోషప్రశంస మీమాటలకు బ్రతికూలమగునేమో

చా — అబ్బో నీవు చాల చదివితివిగదా. పశువులు మేయునని చేలు జల్లుకొనుట మానుదురా? భిక్షుకులు వత్తురని పాత్రలు సంపాదింపకుందురా? స్త్రీదోషముల వివరించి స్త్రీలఁబరిగ్రహింపకుఁడుట దూష్యముకాదా?

రాజ — (నవ్వుచు) చారుమతీ! "నాపరదారాన్ గచ్ఛేత్" అని శాస్త్రములు ఘోషింపుచున్నవిగదా? ఈ గ్రంథకర్త పారదారికప్రకరణమెందులకు వ్రాయవలెను.

చారు — మంచిశంకయే చేసితివి వినుము. ఇది పాపకృత్యమని యెఱింగియు లోకప్రవృత్తి యిట్లుండునని తెలుపుటకై యిందు వ్రాసిరి. మఱియుఁ బారదారికప్రకరణ మెఱింగినవాఁడుగాని స్వదారను రక్షించుకొనఁజాలఁడు. అని గ్రంథకర్తలేవ్రాసికొని యున్నారు. చూడుము.

శ్లో॥ భార్యాధికారికమిదం కథితం సమాసాద్
వక్ష్యామి సంప్రతిపరప్రమదాభియోగం।
ఆయుర్యశోరిపు రధర్మ సుహృత్ప్ర చాయం
కార్యో దశావిషయ హేతువశాన్న కామాత్॥

పారదారిక ప్రకరణము తప్పక చేయఁదగినదని విధించలేదు. ఇది పాపకృత్యమని తెలుపుచు లోకప్రవృత్తి యిట్లుండునని దశాప్రకరణపద్ధతి ననుసరించి చెప్పితిని. కాని విధియని కాదని యాచార్యులే వ్రాసికొనిరి చూచితివా ?

రాజపుత్రి—సూ॥ తదంగ విద్యాః పురుషోధీయేత॥ దీని బురుషులే చదువవలయునని విధిగనంబడుచున్నదే? స్త్రీలు చదువవచ్చునా?

చారు—సూ॥ ప్రాగ్యౌవనాత్ స్త్రీ యౌవనోదయము కాక మున్ను చదువవలయునని చెప్పఁబడినది.

రాజ—ఇసిరో యౌవనము రాకమున్న యీగ్రంథము జదివిన నీకేమి తెలియును ? శుకపాఠ మేయగును.

చారు—ప్రత్తాచ పత్యురభిప్రయాత్.

పెండ్లియైన తరువాత స్త్రీ పతియనుమతి వడసి చదువవచ్చునని యాచార్యులే వ్రాసియున్నారు.

రాజ—సూ॥ యోషితాంశాస్త్రగ్రహణస్యా భావాదనర్థకమిహశాస్త్రే స్త్రీశాసనమిత్యాచార్యాః స్త్రీలు శాస్త్రగ్రహణవిహీనలగుట నిందుఁజెప్పబడిన విషయంబులు గ్రహింపజాలరు. అప్పుడీ శాస్త్రమువలనఁ బ్రయోజన మేమియున్నది ?

చారు—సూ॥ ప్రయోగగ్రహణంత్వాసాం ప్రయోగస్యచ శాస్త్రపూర్వకత్వాదితి వాత్స్యాయనః॥

స్త్రీలకు శాస్త్రగ్రహణము లేకపోవుగాక సంప్రయోగము శాస్త్రపూర్వకమగుట స్త్రీల కుపదేశింపఁదగియున్నది. కావున నిది నిరర్థకము కానేరదు. శాస్త్రమే లేనిచో విధి యెట్లు తెలియఁబడును. ఎట్లుపదేశింతురు.

రాజపుత్రి—సరే. శాస్త్ర మావశ్యకమని యొప్పుకొనిన యెడల

ఎక్కడనో కాని శాస్త్రజ్ఞులు లేరుగదా ? సంప్రయోగము సర్వజన విషయమైనది. ఈరెంటికి సామరస్య మెట్లుకలిగెడిని ?

చారు — శాస్త్రజ్ఞుఁడు దూరమందున్నను పారంపర్యముగా వ్యాపింపక మానదు.

మఱియు సూ॥ సంత్యపిఖలు శాస్త్రప్రహత బుద్ధయో గణికా రాజసుహిత్రోహ్య మహామాత్రసుహితరశ్చ.

వేశ్యాంగనలు రాజపుత్రికలు సామంతుల కూఁతుండ్రు ఈ శాస్త్రమెఱింగినవారుందురు. వారివలనఁ జదివికొనవచ్చును.

రాజ — అట్టివాండ్రు దొరకుట దుర్ఘటముగాదా. నేఁడు మా పూర్వపుణ్యమువలన నీవు లభించితివి కావున నింతవిస్రబ్ధముగా నడుగు చుంటిని. వీని నెట్టివారివలన గ్రహింపఁదగినది.

చారు — విశ్వాసముగల స్త్రీవలన నీసాంప్రదాయరహస్యము లతో నభ్యాసమువలనఁ బ్రయోగింపఁదగిన చతుష్షష్టికళను దెలిసి కొనవలయును.

రాజ — విశ్వసింపఁదగిన వారెట్టివారో చెప్పుము.

చారు — ప్రవృత్తపురుషసంపర్కముగల తనతోఁ బెరిగినదాసి పుత్రిక సఖురాలు. పినతల్లి. వృద్ధదాసి. భిక్షుకురాలు అక్క యిట్టి వారు విశ్వసింపఁదగినవారు.

రాజపుత్రిక — చారుమతీ. చతుష్షష్టికళలు పలువిధంబుల నొప్పు చుండునని చెప్పుదురు. వానిభేదంబుల వివరింతువే. అనుటయుఁ జారు మతి పుస్తకమువిప్పి యిట్లు చెప్పుచున్నది.

శాస్త్రాంతరమున నరువదినాల్గు మూలకళలని చెప్పఁబడి యున్నవి. అందుఁ గమశాస్త్రీయము లిరువదినాలుగు గీతము నృత్యము, వాద్యము, కౌశలలిపిజ్ఞానము, ఉదారవచనము, చిత్రవిధి, పుస్తకమ్మ, పత్రిచ్ఛేద్యమ్ము, మాల్యవిధి, గంధయుక్త్యాస్వాద్యవిధానము.

రత్నపరీక్ష, సీవనము, రంగపరిజ్ఞానము, ఉపకరణక్రియ, మానవిధి, అజీవజ్ఞానము, తిర్యగ్యోనిచికిత్సితము, మాయాకృతపాషండ సమయజ్ఞానము, క్రీడాకౌశలము, లోకజ్ఞానము, వైచక్షణ్యము, సంవాహనము, శరీరసంస్కారము, విశేషకౌశలము. 24

ద్యూతాశ్రయములు 20.

ఆయుఃప్రాప్తి, అక్షవిధానము, రూపసంఖ్య, క్రియామార్గణము, బీజగ్రహణము, నయజ్ఞానము, కరణాదానము, చిత్రాచిత్రవిధి, గూఢరాశి, తుల్యాభిహారము, క్షిప్రగ్రహణము, అనుప్రాప్తిలేఖస్మృతి అగ్నిక్రమము, ఛలవ్యామోహనము, గ్రహదానము, ఉపస్థానవిధి, యుద్ధము, రుతము, గతము, నృత్తము ఇవి యిరువది.

శయనోపచారికములు 16.

పురుషభావగ్రహణము, స్వరాగప్రకాశనము, ప్రత్యంగదానము, నఖదంతవిచారము, నీవీస్రంసనము, సంస్పర్శనానులోమ్యము, పరమార్థకౌశలము, హర్షణము, సమానార్థాతాకృతార్థత, అనుప్రోత్సాహనము, మృదుక్రోధప్రవర్తనము, సమ్యక్క్రోధనివర్తనము, క్రుద్ధప్రసాదనము, సుప్తపరిత్యాగము, చరమస్వాపవిధి, గుహ్యగూహనము.

ఉత్తరకళలు 4.

అశ్రుపాతముతో రమణునికి శాపమిచ్చుట, స్వశపథక్రియ, ప్రస్థితానుగమనము తిరిగితిరిగి చూచుట, ఇవి మూలకళ లనఁబడును.

చతుష్షష్టికళలను బలువురు పలువిధంబులఁ జెప్పుచుందురు వాత్స్యాయనోక్తములు పాంచాలోక్తములు శాకపాకములు సేయుటకు నలంకరించుకొనుటకుఁ జాలభాగ ముపచరించును. కవిత్వము అవధానములు ఇంద్రజాలములులోనగు విషయములు వర్ణింపబడియున్నవి పాంచాలోక్తములు కేవలము క్రీడాయోగ్యములు. శాస్త్రప్రశంస, శస్త్రాస్త్రనైపుణ్యము అశ్వగజాదిశిక్షణములు ప్రకటింపఁబడినవి. పెక్కేల వాని నెఱింగినవారి కెందుఁబోయినను విజయమే కలుగును.

అరువదినాల్గువిద్యలు.

1 గీతం॥ స్వరగము, పతగము, లయగము, చేతోవధానగమని గానము, నాలుగువిధములు.

2 వాద్యం॥ ఘన వితత సుషిర కాంస్య తంత్రీప్రభృతుల వల నంగలుగునది.

3 నృత్యం॥ విభావానుభావాదుల వలన వ్యక్తమగునది.

4 ఆలేఖ్యం॥ రూపప్రమాణవర్ణికా సాదృశ్యాది షడంగము లతో విగ్రహములు వ్రాయుట.

5 విశేషకచ్ఛేద్యం॥ భూర్జాదిపత్రములు ఛేదించి తిలకముగ గర్ణపత్రములుగ రచించుట.

6 తండులకుసుమబలివికారాః॥ నానావిధంబులగు తండులము లచే గాను దేవాది భవనమునం దలంకరించుట పుష్పములతోఁ గూర్చి శివలింగాదుల నర్చించుట.

7 పుష్పాస్తరణం॥ శయనగృహాదులయందుఁ బూవులచే శయ్యాదుల గల్పించుట

8 దశనవసనాంగరాగః॥ కుంకుమాదిరంజకములచే నోష్ఠాదులు రంగులు వైచికొనుట.

9 మణిభూమికాకర్మ॥ గ్రీష్మకాలంబునఁ జల్లదనంబునకై మరకతాది మణులచే వేదికలు గల్పించుట.

10 శయనరచనం॥ రక్త విరక్త మధ్యస్థాభిప్రాయముల ననుసరించి యాహారపరిమితింబట్టియు శయ్యలరచించుట.

11 ఉదకవాద్యం॥ నీటియందు మురజాదులవలె వాయించుట.

12 ఉదకాఘాతః॥ హస్తయంత్రములవల్ల నుదకముల విరజిమ్మి కొట్టుట ఈరెండును జలక్రీడాంగములు.

13 చిత్రాశ్చయోగాః॥ ఇంద్రియపలితీకరణాదులైన చిత్రయోగములు ఇవి యితరుల వంచించుటకు నుపయుక్తములు.

14 మాల్యగ్రథన వికల్పాః॥ విచిత్రములుగా దండలు గట్టుట.

15 శేఖరకాపీడనయోజనం॥ అనేక రూపములుగా శిఖలముడుచుట, వానియందు మాలికలు గూర్చుట, ఇవిరెండును నేపథ్యాంగములు.

16 నేపథ్యప్రయోగాః॥ దేశకాలానుగుణ్యముగా వస్త్ర మాల్యాభరణాదులచే శోభకొరకు శరీరమలంకరించుట.

17 కర్ణపత్రభంగాః॥ దంత శంఖాదులచేఁ గర్ణపత్రములు జేసి యలంకరించుట.

18 గంధయుక్తిః॥ స్వశాస్త్ర విహితప్రపఞ్చా, ప్రతీతప్రయోజనైవ।

ఆశాస్త్రమందు విధింపబడిన రీతిగలది. (పరిమళవస్తునిర్మాణము) దీనిప్రయోజనము సర్వప్రసిద్ధము.

19 భూషణయోజనం॥ మణిముక్తాప్రవాళాదులచే పేరులు కట్టుట, కటకకుండలాదులు చేయుట ఇవి నేపథ్యాంగములు వస్తురచన కాని శరీర మలంకరించుటగాదు.

20 ఇంద్రజాలాః॥ ఇంద్రజాలశాస్త్రప్రభవములగు యోగములు సైన్యదేవాలయాదులఁ జూపించుట ఇవి పరమోహనార్థములు.

21 కౌచుమారాశ్చయోగాః॥ కుచుమారునిచేఁ జెప్పబడిన సుభగంకరణాద్యుపాయయోగములు.

22 హస్తలాఘవం॥ సర్వకర్మలయందు లఘుహస్తత్వము.

23 విచిత్రశాఖ యూషభక్ష్యవికారక్రియాః॥ భక్ష్యభోజ్యశాకాదులరుచు లుప్పతిల్లునట్లు వండుట.

24 పానక రస రాగాంసవ యోజనం॥ గుడతింత్రిణీకాదులచేఁ బానకమును దాక్షామోచాఫలాదులచే మద్యమును మధురముగా వండుట

25 సూచీవానకర్మాణి॥ సూదితో జేయఁదగినపనులు బంతులు తివాసులులోనగునవి యల్లుట.

26 సూత్రక్రీడా॥ దారము త్రెంపికలుపుట రంగులుగాఁజూపుటలోనగు వినోదము లెఱుంగుట.

27 వీణాడమరుక వాద్యాని॥ వీణాడమరుకాదులు మనోహరముగా వాయించుట.

28 ప్రహేలిక॥ ఇది కావ్యప్రసిద్ధము పరవ్యామోహనము నిమిత్తముపయోగము. గూఢముగానుంచబడిన అర్ధముగల కావ్యవిశేషము

29 ప్రతిమాలా॥ శ్లోకముల యంత్యమాక్షరములు జదివిన శ్లోకమగుట

30 దుర్వాచకయోగాః॥ శబ్దార్థములచేఁ దెలియబడక చదువ శక్యముగాని యక్షరోపశ్లేషములుగల శ్లోకములు రచించుటయుఁ జదువుటయు

31 పుస్తకవాచనం॥ శ్లోకములఁ బదములుగాను బదములశ్లోకములుగాను సంగీతముగాఁ జదువుట.

32 నాటకాఖ్యాయికాదర్శనం॥ నాటకములు పదివిధములు.

శ్లో॥ నాటక మంకో, వీధీ, ప్రకరణ,మీహామృగో, డిమో, భాణః॥
వ్యాయోగ సమవాకారో, ప్రహసనమితి. ఈదశ విధనాటకములు రచించుట.

33 కావ్యసమస్యాపూరణం॥ శ్లోకసమస్యపూర్తి చేయుట.

34 పట్టికావేత్రాసన వికల్పాః॥ పేముచే మంచములును పీఠములు లోనగు నుపకరణములు రచించుట.

35 తలకర్మాణి॥ అప్రద్రవ్యార్థములైన కుందకర్మలు.

36 తక్షణం॥ శయనాసనాద్యర్థములగు వర్ధకి కర్మలు.

37 వాస్తు॥ విద్యాగృహకల్పనకుపయోగించువిద్య.

38 రూప్యరత్నపరీక్షా। దీనారముల యొక్కయు నవరత్నముల యొక్కయు గుణదోషముల నెరుఁగుట. ఇవి వ్యవహారాంశములు.

39 ధాతువాదః॥ మృత్ విప్రస్తరరత్న ధాతువులయొక్క పాకశోధన మేళనాదుల నెఱుంగుట.

40 మణిరాగాకరజ్ఞానం॥ స్ఫటికాదిమణులకు రంగులు గలుగఁ జేయు విధం బెరుంగుట. పద్మరాగాదిమణులు పుట్టుచోటు దెలియుట.

41 వృక్షాయుర్వేదయోగాః॥ వృక్షలతాదుల దోహదముల నెఱుంగుట.

42 మేషకుక్కుటలావక యుద్ధవిధిః। సజీవ ద్యూతాదివిభుల నెఱుంగుట.

43 శుకశారికాప్రలాపనం॥ శుకశారికాదిపక్షులకు మాటలు నేర్పుట. సందేశములు పంపుట లోనగు విషయంబు లెరుంగుట.

44 ఉత్సాదనే సంవాహనే కేశమర్దనే చ కౌశలం॥ తలయంటుటయు, గాళ్ళుపట్టుట లోనగుపనులయందు నేర్పు. ఇది పరుల నారాధించునిమిత్తము.

45 అక్షరముష్టికాకథనం॥ గూఢాక్షరములతో శ్లోకములు రచించుట. దీనికే యక్షరముద్రియని పేరు.

46 మ్లేచ్ఛితవికల్పాః॥ సాధుశబ్దములతో గూడినదైనను నక్షర వ్యత్యాసంబున నస్పష్టార్థంబగు పదంబులు మ్లేచ్ఛితకములని చెప్పంబడును. అట్టిశబ్దములతో శ్లోకములు రచించుట.

47 దేశభాషాలిపిజ్ఞానము॥ సకలదేశభాషా లిపివిశేషములం దెలిసికొనుట.

48 పుష్పశకటికా॥ పూవులునిమిత్తముగాఁ జేసికొను శకటిక రచించుట.

49 నిమిత్తజ్ఞానం॥ శుభాశుభశకున మెఱుంగుట.

50 యంత్రమాతృకా॥ విశ్వకర్మ ప్రోక్తములైన సజీవ నిర్జీవ యంత్రములు చేయువిధానము నేర్పుట. బండ్లు నోడలు మొదలగు నవి యంత్రములతో జేయుట.

51 ధారణమాతృకా॥ ఏకసంథగ్రాహిత్వము. ఒకసారి వినిన దానిని జెప్పుట.

52 సంపాఠ్యం॥ కల్పిజనుస్తుట అనగా దానెవ్వాను జనునసిదాని నొకరు జనువుచుండ వానితో నేకరుపు బెట్టుట.

53 మానసి॥ ఒకరు మనసులో దలచుకొని న్యంజనములు మాత్రము పద్మదళాకృతులుగా వ్రాసినంత నతడు తలంచికొనిన శ్లోకఛందోగణాదులు తప్పకుండ వ్రాయుట. ఇది కవిత్వచమత్కృతి విషయము.

54 కావ్యక్రియా॥ సంస్కృత ప్రాకృతాపభ్రంశ కావ్యములు రచించుట.

55 అభిధానకోశః॥ అడిగిన వృత్తములరచించుట.

56 ఛందోజ్ఞానం॥ పింగళాది ప్రణీతములగు ఛందస్సుల నెఱుంగుట.

57 క్రియాకల్పః॥ కావ్యాలంకారముల నెఱుంగుట. ఈమూ డును గావ్యాంగములు.

58 ఛలితకయోగాః॥ ఒకరూపమును మఱియొకరూపముగా మార్చి పరుల వ్యామోహపెట్టె యోగములు నెఱుంగుట.

59 వస్త్రగోపనాని॥ చిన్నది పెద్దదిగాను, పెద్దది చిన్నదిగాను వస్త్రములు ధరించుట.

60 ద్యూతవిశేషాః॥ నిర్జీవద్యూతక్రీడల నెఱుంగుట.

61 ఆకర్షక్రీడా॥ పాచికలనాడుట ఇదియుద్యూతక్రీడలలోనిది.

62 బాలక్రీడనకాని॥ బాలుర కుపయోగించు నాటవస్తువుల రచించుట.

63 వైనయికీనాం జ్ఞానం. గజాదిశిక్షణము.

64 వైజయికీనాం వ్యాయామికీనాంచ విద్యానాం జ్ఞానం విజయాచారశాస్త్రములు విజయ ప్రయోజనములగు శస్త్రవిద్యలు మృగయాప్రయోజనములగు విద్యలు తెలిసికొనుట

ఈయరువదినాలుగువిద్యలు నీశాస్త్రమున కవయవములై యొప్పు చున్నవి. వీనికే యంగవిద్యలనిపేరు.

## పాంచాలకథితచతుష్షష్టికళలు.

1 స్పృష్టక విద్ధక ఉద్ఘృష్టక పీడనక లతావేష్టిత వృక్షాధిరూఢ తిలతండుల క్షీరనీరములు (8)

2 నిమితక స్ఫురితక ఘట్టితక సమ తిర్యక్ ఉద్భ్రాంత పీడిత అవపీడితకములు. (8)

3 ఛురితక అర్ధచంద్రిక మండల లేఖా వ్యాఘ్రనఖ మయూర పదక శశప్లుతక ఉత్పలాపత్రికములు. (8)

4 గూఢక;: ఉచ్చూనక, బిందు, బిందుమాలా, ప్రవాళమణి, మణిమాలా, ఖండాభ్రిక, వరాహచర్వితములు (8)

5 ఉత్ఫుల్లక, జృంభితక, ఇంద్రాణిక, సంపుటక, పీడితక, వేష్టితక, బాడబక, భుగ్నకములు (8)

6 సీత్కృత, హింద్కృత, స్తనిత, కూజిత, రుదిత, ఘూత్కృత, ధూత్కృత, ఫూత్కృతములు (8)

7 కీల, కర్తరి, విద్ధ, సందంశికాదిభేదములు. (8)

8 మంధనమాల:—అవమర్దన, పీడితక, నిర్ఘాత వరహాఘాత, వృషాఘాత, చటక, విలసిత, సంపుటములు (8)

ఈ యరువదినాల్గుకళలు పాంచాలకథితములై యొప్పుచున్నవి. ఇవియన్నియు ప్రాయికముగ స్త్రీలు గ్రహింపదగియున్నవి వినుము.

శ్లో॥ యోగజ్ఞా రాజపుత్రీచ మహామాత్రసుతా తథా
సహస్రాంతః పురమపిస్వవశేకురుతే పతిం॥

శ్లో॥ కలానాం గ్రహణాదేవ సౌభాగ్యముపజాయతే
దేశకాలౌ త్వవేక్ష్యాసాం ప్రయోగస్సంభవేన్నవా॥

అని చతుష్షష్టి కళాభేదంబుల నెరంగ నెఱింగించుటయు రాజపుత్రి చారుమతిని మిక్కిలి కొనియాడుచుఁ దల్లక్షణంబు లన్నియు వినుచుండెను. (అని యోజించి)

## 143 వ మజిలీ.

### గోణికాపుత్రునికథ.

గోపా ! విను మాదత్తకాదిమిత్రులలో నొకండగు గోణికాపుత్రుండు నియమించికొనినప్రకారము శుభముహూర్తంబునఁ గాశీపురంబునుండి బయలుదేరి దక్షిణాభిముఖుండై యరుగుచుఁ గ్రమంబున ననేక జనపదంబుల తిక్రమించి యందలివిశేషములు పరికించుచు నొకనాఁడొక చెట్టునీడం గూర్చుండి యాతపసంజాతక్లేశంబు వోకార్చుకొనుచున్న సమయంబున నొకబ్రహ్మచారి యాదారింబోవుచు నామ్రానునీడంజేరియున్న గోణికాపుత్రుంగాంచి నమస్కరించుటయు నతండు నీవెవ్వండ, వెందలివాఁడ, వెందుఁబోవుచున్నవాఁడవని యడిగిన నావటుం డిట్లనియె.

అయ్యా ! నాదొక పల్లెటూరు కాపురము. నాపేరు గోమఠుండందురు బ్రాహ్మణుఁడ, దరిద్రుఁడనై ముష్టియెత్తుకొనుటకై యీప్రాంతగ్రామముల కరుగుచున్నాఁడ నని చెప్పిన నతండు నవ్వయము నీకుఁ బెండ్లియైనదా? విద్యాభ్యాస మేమైన జేసితివా? అని యడిగెను.

చిన్నతనమునందే తలిదండ్రులు గతించిరి. సంసారము మీఁదఁబడినది. ముష్టియెత్తుకొని సంసారము నడుపుచుంటిని. చదువుకొనుట కవకాశము గలిగినదికాదు. విద్యాధనశూన్యుండ నగు నాకుఁ బిల్ల నెవ్వరిత్తురు? శుద్ధబ్రహ్మచారిని బాబూ! అని చెప్పిన గోణికాపుత్రుండు అయ్యయ్యో! విద్యాభ్యాససమంజసమగు కాలంబు పోయిన పిదప బిచ్చమునకై వెచ్చబెట్టుచుంటివే! ఒక్కపొట్టకై యీముష్టియేమిటికి? ఇప్పుడైనఁ గాలము మిగులలేదు. బిచ్చముమాని చదువుకొనుమని పలికిన వటుం డిట్లనియె.

అయ్యా! నావంటివాండ్రందఱు విద్వాంసులైనచో లోకము నిలువనే నిలువదు. ఇప్పుడు నాకుఁ జనువువచ్చునా? పెండ్లినిమిత్తమై యీబిచ్చమెత్తియే నాలుగు డబ్బులు ప్రోగుచేసితిని. అందులకే ప్రయత్నము జేయుచుంటిని బాబూ! మీవైపునఁ బిల్లలెవ్వరైన నుండిరా? అని యడిగిన గోణికాపుత్రుండు చిఱునగవుతోఁ బిల్లల కేమికొదవ? కావలసినంతమంది కలరు. కాని, పెండ్లియాడినచో నీకష్టము వాయునా? అనుటయు వటుఁడు సందేహమేల?

గీ॥ భార్యయుండిన వనమైనఁ బట్టణంబు
కాంతలేకున్న గృహమైనఁ గాననంబు
ఆలులేకున్న విధినైన నధముఁడండ్రు
భార్యమూలము గృహమని పలుక వినరొ!

గీ॥ ఎంతకష్టపడిన నింటికివచ్చి యి
ల్లాలి మొగము జూచినపుడె తొలఁగు
నిది యెఱింగికాదె ఋషులు వసిష్ఠాదు
లును సభార్యులగుచు వినుతిగనిరి.

క॥ ఒడలంటఁ గాళ్ళు పిసుకఁగ
గడివెడువేనీళ్ళ నీయఁ గంచము వెట్టన్
బడకయమర్పఁగఁ జెలికి
విడె మీయఁగ భార్యగాక వేరొకతగునే.

మహాత్మా! నాకుఁ జక్కనిభార్యతోఁ గాపురము సేయవలయునని చాలముచ్చటగా నున్నది. నీతేజముజూడ మహావిద్వాంసుఁడవు వలెఁ గనంబడుచుంటివి. నీకు శుశ్రూషగావింపుచు నీవెంటవత్తు. నాకుఁ బెండ్లి గావింపఁగలవా? అని యడిగిన గోణికాపుత్రుఁడు అట్లే రమ్ము. మంచికన్యక నరసి వివాహముసేసెద నింతియేకద! అని యంగీకరించెను. గోమనుం డింటికిఁబోక యక్కడనుండియే యతనివెంటఁ

బోఁదొడంగెను. ఇరువురుంగలిసి పోవుచు నొకనాఁడు విపులయను నగ్రహారమున కరిగిరి.

జా ర క థ.

అందు సోమశర్మయను దైవజ్ఞుఁడు గలఁడు. అతనికిమడిమాన్యములు చాలకలవు. జ్యోతిషములో నట్టిపండితుఁడు లేడని వాడుక వడసెను. అతండు తనజాతకమునుజూచికొని యంతర్దశలు సూక్ష్మదశలు ప్రాణదశలు గట్టిగుణింపుచుండఁ జిరకాలమున కతనికొక యాఁడు పిల్లపుట్టినది. ఆజన్నిగట్టాపట్టికి జాతకర్మాదివిధులు నిర్వర్తించి సంతోషముతోఁ బంచాంగముజూచి పుట్టినవేళగుణించి లగ్నముగట్టి గ్రహబలముజూచి యేమియుంజెప్పక చిన్నవోయియున్న భర్తంజూచి వెఱపుతో భార్య యిట్లనియె.

ప్రాణేశ్వరా! మనపట్టి పుట్టినవేళ మంచిదేనా? ఆయుర్భాగ్యము లెట్లున్నవి? పంచాంగముజూచి వెలవెలఁబోవుచుంటి రేల? అనియడిగిన పత్నికిఁబతి యిట్లనియె. సాధ్వీ! నీకూఁతున కాయువు భాగ్యమును బాగుగనే యున్నది. అందులోపములేదు. కాని, స్త్రీలకు నుండఁదగని దోషమేదికలదో, దేనివలనఁ నన్నిగుణములు దూషితములగునో దేనివలన గులముచెడునో దేనివలన బంధువులతోఁ దలవంపుగలుగునో యట్టిజారత్వగుణముల నీబిడ్డ చెడ్డదైపోవును ఇట్టిది పుట్టకపోయినను దీరిపోవునుగదా! నిష్కలంకమగు మాకులము కలంకిత మగునని చింతించుచుంటి. అనవుఁడు పకాలుననవ్వి యవ్విప్రపత్ని యిట్లనియె.

సరిసరి. ఇదియా మీవిచారము. చాలుచాలు. జ్యోతిషము జదివినందులకు మంచిలాభమేకలిగినది. శోధించి పరీక్షించిచూడ స్త్రీలలో జారిణి కానిదెవ్వతె? వీలుకుదరమి నందఱునుండొడ్డవారుగే మీరుచదివికొంటిరేకాని లోకానుభవము లేనివారు. ఏదియో యని వెఱచితిని. కానిందు ఇది బ్రతికి బట్టగట్టినప్పుడు చూచుకొందములెండు,

అని పలికి భర్తనూరడించినది. పిమ్మటఁ దనతలిదండ్రులతో నామాట పరిహాసముగా ముచ్చటించినది. వారునవ్వుచు నాబాలికనెత్తుకొని నప్పుడెల్ల జారజారయని ముద్దులాడఁదొడంగిరి.

దానంజేసి యాబాలిక కాపేరేహాఢియైనది. అందఱును జార జారయని పిలుచుచుండురు. క్రమంబున నాబాలికారత్నము దినదిన ప్రవర్ధమానయై పదియేఁడులు ప్రాయము వచ్చునప్పటికి మనోహర రూపంబునఁ బ్రకాశింపుచుండెను. అప్పుడాబాలికకు వివాహముచేయ వలయునని తలిదండ్రులకు తలంపుగలిగినది. తదీయకులరూప విద్యావి శేషముల విని యెవ్వరేని యయ్యిందువదన నడుగవచ్చి జారయను పేరు విని కారణమేమని యడిగిన సోమవర్మ నిజము మఱుఁగుపెట్టక యదార్థము చెప్పుచుండును. ఆమాటవిని అక్కటా! కోడలు వ్యభిచ రించినఁ గులముచెడును. అపకీర్తివచ్చును. సొమ్మునూట దేవుఁడెఱుం గును. నీపిల్ల మాకక్కరలేదని వచ్చినవారెల్ల నిదిగో మఱలవత్తుమనిచెప్పి యేగుచుందురు కాని, యొక్కరైన నంగీకరించినవారు లేరు. మఱి రెండేఁడులు గతించినవి. అప్పుడు——

శ్లో॥ దృష్టి స్సాలసతాం బిభర్తి నశిశుక్రీడాసుబద్ధాదరా।
శ్రోత్రే ప్రేషయతి ప్రవర్తిత సఖీసంభోగ వార్తాస్వపి।
పుంసామంకమపేతశంక మధునా నారోహతిప్రాగ్యథా।
బాలా నూతనయావనవ్యతికరానష్టభ్యమానా శనైః॥

మ॥ అలసత్వంబుజనింపఁ జూపులను బాల్యక్రీడలందాదరం
బెలమింబూనను వీనులొగ్గి విను నిర్వృత్తప్రియాభోగవా
ర్తలు కాంతల్ దమలోనఁ జెప్పుకొనఁ బూర్వాంబున్వలెన్ బూరుషా
వళిమేనంటదు జంకి బాలిక నవప్రాయంబునైఁబ్రోకగాఁ?

ఆకన్యవార్త దేశమంతయు వ్యాపించుటచే నెవ్వరు నాకన్య నడుగరైరి. ఒకనాఁడు సోమవర్మభార్య భర్తతో వైదికోత్తమా

మనకు భాగ్యభోగ్యములు చాలగలిగియున్నవి. ఒక్కఁతయు కూతురు అదియు విద్యారూపములచే హృద్యమైయున్నది. అట్టిపుత్రికకు వివాహము గావింపలేకుంటిమి ఇది స్వయంకృతాపరాధము. దాని మీరు జారిణియని వెల్లడింపకపోయినచో నీముప్పువచ్చునా? లోకములో నెందఱుకన్యకలు గలరు. అందఱు పతివ్రతలేయగుదురా? కన్యకతండ్రి యెవ్వఁడైన నిట్లుచెప్పుకొనునా? అయ్యయ్యో! మీరు నట్టియమాయకులైపోయితిరి. పిల్లకు యౌవనము పొడసూపుచున్నది. వరుఁడెవ్వఁడు దొరకకున్నవాఁడు. రజస్వలయైనచో గొంపనట్టేటిలోఁ గట్టికొనవలసినదేకదా? ఇప్పుడైన నడుగవచ్చినవారి కాగుట్టు చెప్పనని యొట్టుపెట్టుకొనుఁడు. ఇంతలకు మాయన్న మిమ్ముఁబెద్దగా నిందించుచున్నాఁడని మందలించిన నాలించి యావిరించికుల వతంసమిట్లనియె.

ఓసీ! దోసమెఱింగి చేసికొనినపిమ్మటఁ బుత్రికను నిందింపరని చెప్పుచుంటిని. పోనిమ్ము బ్రహ్మసూత్రముతోడు ఇక నెవ్వరికిం జెప్పనని శపథముచేసెను. అడుగవచ్చినవారికెల్ల నాగ్రామస్థులు వారింటికి వెళ్ళకమున్నె యీవృత్తాంతము చెప్పుచుందురు.

గోణికాపుత్రుండును గోమఠుండును నయ్యగ్రహారము ప్రవేశించినతోడనే జారనడుగవచ్చినవారనినిశ్చయించి గ్రామస్థులుకొందఱు వారిం జేరి మీరు సోమవర్మకూఁతు నడుగవచ్చితిరి కాఁబోలు. ఆపిల్ల మంచిదికాదుసుఁడీ యనిమాకథ యంతయుఁజెప్పిరి. గోణికాపుత్రుఁడు నవ్వుచు గోమఠునిమొగము జూచెను. ఆర్యా! నేను పెండ్లికి మొగము వాచి యుంటిని. విద్యాధనమనీషాశూన్యుండ నగు నాకు గన్యక నెవ్వరిత్తురు? సోమవర్మకూఁతురు జారయైన నగుంగాక. కులరూపవిద్యావిభవంబుల నొప్పుచున్నదిగదా? స్త్రీసంపర్కరాహిత్య దుఃఖితస్వాంతుండనగు నాకాపిల్ల నిప్పింపుఁడు పెండ్లియాడెదనని యడిగిన గోణికాపుత్రుం డిట్లనియె.

గోమతా! పెండ్లియాడు సంతోషమే కాని రాబోవు ననర్థ మేమియుఁ దెలిసికొనకున్నావు. వినుము.

సీ. భార్య జారిణియైన బంధువుల్ నవ్వేరు
రెగతాళి సేయుఁదా నింటిదాసి
యెక్కసక్కెములాడు నెదురింటివాల్లంటి
యక్కయు జెల్లెలు వెక్కిరింతు
జనకుండు నపయోజకుఁడంచు నిందించుఁ
దల్లి వెంగలియంచుఁ దల్లడించు
నన్నదమ్ములు వట్టి యధముఁడంచు గణింతు
రెఱిఁగినవారెల్ల నెత్తిపొడుతు
గీ. రహహా మఱియంతకన్న జాడ్యంబుగలదె
కులట బెండ్లాడి యిడుమలఁ గుడుచుకంటె
బ్రహ్మచారిగనుంటయే పరమసుఖము
లేదు వానికి నేతంట మీఁద నింట.

ఈనిందలన్నియు సహించి కాపురము చేయుదునంటివేని,

సీ. మనపిచ్చి మగనితో మాటాడనేరదు
చెప్పినపని శ్రద్ధఁ జేయదెపుడు
భర్తకోపింప దర్పముసూపి మెటికలు
విరచు దుఃఖించి కాపురముదిట్టు
బ్రతికూలముగనె సంభాషించు నేప్రొద్దు
పతిగుణంబులఁ బ్రతిహతి నచించు
వినుతించు ధవుఁడు కాదనువారలను భర్త
నిందించువారి మన్నించి పలుకు
గీ. నకట! పుంశ్చలియైన యిల్లాలితోడఁ
గాపురము సేతకంటెను గనులుమూసి

యేటిలోఁబడి చచ్చుటయే సుఖంబు
గోమతా ! గేస్తునకుఁ బ్రతికూలమగుట.

అని చెప్పినవిని గోమతుండు మహాత్మా ! మగవాఁడుసమర్థుఁడై పరికింపుచుండ నాఁడుదియెట్లు వ్యభిచరింపఁగలదు.

క. భూవిబుధవతంసమ ! చెడు
తోవల బోకుండ మదవతుల నెప్పటికిం
గావఁగరాదో పతులకు
నీవనెదవో యెల్లవారనిరో యిబ్భంగిన్.

క మిన్నులపైఁ బోవకుగద
యిన్నేలనెకద మృగాక్షి యెటకేగిన నా
సన్నయెఱిఁగి వల్లభుఁడా
సన్నస్థితిగదలనీక సకేఁగావఁడొకో.

అనుటయు గోణికాపుత్రుఁడు నవ్వుచుఁ గానిమ్ము. ఇప్పు డింత యేల? ముందు విచారించుకొందమని పలికి తిన్నగా సోమశర్మగారింటికింబోయిరి. సోమశర్మభార్య వారింజూచి బ్రహ్మచారులని తెలిసికొని పడుచు నడుగవచ్చిరని నిశ్చయించి పుత్రిక నలంకరింపఁ బరిచారికల నియమించినది. వారికిఁ బాదములు గడిగికొనరజతకలశముతో నుదకములు తానే తీసికొనిపోయి యిచ్చినది. కాళ్ళుగడిగికొని గోణికాపుత్రుండు సోమశర్మగారూరనున్నారా ? అనియడుగుటయు నా మె యూరనున్నారు. స్నానార్థమై తటాకమునకరిగిరి. ఇప్పుడే వత్తురు. పెరటిలో నుష్ణోదక మున్నది. స్నానము చేయుఁడు అనిబలవంతముగా వారి నుష్ణోదక స్నానము జేయించినది. ఇంతలో సోమశర్మ యింటికి వచ్చెను. భార్య వారిరాక పతి కెఱిఁగించినది.

సోమశర్మ వారితో నార్యులారా ! మీ రాకచే మేము కృతార్థులమైతిమి. మాయిల్లు పవిత్రమైనదని స్తుతియించుచుఁ బైడిపువ్వుల

పీటలపై మడిపుట్టములిచ్చి కూర్చుండఁబెట్టెను. అతనిభార్య పీతాంబర ధారిణియై యలంకరించుకొని మంచిపదార్థములుజేసివడ్డించినది. వారు తృప్తిగాభుజించిరి భోజనానంతరము తాంబూలములు వైచికొనుచు గోణికాపుత్రుఁడు సోమవర్మతో నార్యా! మీకుఁ బిల్లలెందరని కుశలప్రశ్న చేసెను. అప్పుడు సోమవర్మ పట్టీ! యిటురాయని కేక పెట్టెను. దివ్యాలంకారభూషితయై యా బాలికవచ్చి తండ్రిమ్రోల నిలువంబడినది. తద్రూపలావణ్యాది విశేషంబులఁజూచి గోమకుండు "మోహావేశముతో నీచిన్నది మిక్కిలి చక్కనిది. స్థితిగలది. నగలేమి యును పెట్టనక్కరలేదు. గోణికాపుత్రుఁడు తానే పెండ్లియాడఁడు గదా! అయ్యో! నన్నేవలదని తానెట్లు స్వీకరించును. ఏమో! నన్ను మోసపెట్టుట కట్లనెనేమో! ఆహా! ఇది జారిణియైన నగుఁగాక! యొక్కరేయి దీనితోఁగూడినం జాలదా నాకంతయోగము పట్టునా? అని పలువిధములఁ దలపోయుచుండెను."

అప్పుడు సోమవర్మ కూఁతునొడిలోఁ గూర్చుండబెట్టుకొని అయ్యా! యిదియొక్కరితయే నాకుఁగూతురు. లేకలేక కలిగినది.ఇదియే పెండ్లికూఁతురు. అని పలికిన విని గోణికాపుత్రుఁడు బాలా! నీపేరేమి? చదివితివా? అని యడిగెను. సిగ్గుచే నాకన్నె యేమియు సమాధా నము చెప్పినదికాదు. పిమ్మట నతఁడు మీపుత్రికకు జాతకమున్నదా? అని యడుగుటయు బిక్కనుండి భార్య వలదు వలదు అని సంజ్ఞచేయుచుండ వినిపించుకొనక సోమవర్మ మందస్వరముతో నున్నదని చెప్పెను. ఏదీ చూతము తెప్పింపుఁడని యడిగిన నతఁడు లేచి లోపలికిఁబోయి జాతకముతీయుచుండ భార్య యడ్డమువచ్చి మగనిఁదిట్టి మీ మూలమున నా బిడ్డకిఁక బెండ్లి కానేరదు. జాతకము లేదని చెప్పరాదా? అప్పుడే యీ యూరిలో నెవ్వరో యీ మాట వారి చెవిఁ బడవేసియుందురు. కానిచో దొలుతనే జాతక మడుగనేల?

చీ! చీ! యీపాడుగ్రామమున వసించుటకంటె హైన్యములేదు. ఈ సంబంధముదాటిన నిఁక పెండ్లికాదు జాతకములేదని చెప్పుడు. అవ్వలికిఁ బొండని కసరిపంపినది. సోమవర్మ మరలవచ్చి అయ్యా జాతకమిప్పుడు కనంబడలేదు. అందలి విషయంబులు పిమ్మట మీకు విన్నవించెదను. మీరు త్తమకులజులని మీయాకారములే చెప్పుచున్నవి. మిమ్ముఁ జూచినదిమొదలు మావాండ్రకు మీతో సంబంధముచేయ వలయునని యున్నది. మీ యభిప్రాయమేమి? అని వలికెను.

అంతలో సోమవర్మభార్య యోరగానిలువంబడి అయ్యా! యీయూరిలోనివారెల్ల మాకు విరోధులు. వారిమాట లేమియుమీరు నమ్మవలదు. మాపిల్ల చాల గుణవంతురాలు. రూపముచూచితిరిగదా. పదివేల వెలగల నగలున్నవి. ఇంతకన్నఁ జెప్పవలదిలేదు. కొన్ని యిబ్బందులచేఁ బెండ్లికిఁ గాలము మీరినది. దీనికిఁ బదియేండ్లు మొన్ననే వెళ్ళినవి. గోవగానెనుగుటచే నట్లున్నది. మీకీయవలయునని యున్నది. తప్పక పెండ్లియాడి సుఖింపుఁడని పలికిన విని నవ్వుచు గోణికాపుత్రుఁడిట్లనియె.

అమ్మా! నేనిప్పుడు వివాహమాడను. ఈతఁడు నా శిష్యుఁడు వీని నిమిత్తమె మీపిల్ల నడుగవచ్చితిని మీరన్నట్లీయూర నెవరో కొన్నిమాటలు జెప్పిరి. కాని, యవి పరిగణించువారము కాము. వీఁడు పాత్రుఁడు మీపిల్లను వీనికిచ్చి పెండ్లిచేయుఁడు. ఇతండను మోదించు చున్నాఁడు. మీ యింట నిల్లరికముండఁగలఁడన్న చెప్పెనో లేదో యరగా యిల్లాలు బాబూ! ఎవ్వరైననుంచిదే. మాయింట నుండువానినే మేము గోరుచుంటిమి. మీరు కోరిక తీర్చితిరి. సంతోషించితిమి. కాని లగ్నము వ్యవధిలేదు. రేపే మంచిముహూర్తమున్నదని చెప్పిరి. తరువాత బంధువులందరు వత్తురుగాక. తప్పక రేపు వివాహముగావించుట కంగీకరింపవలయు నటునిటు మీరే పెండ్లిపెద్దలని చెప్పిన సంతసముతో నతం డంగీకరించెను.

సోమవర్మ యూరిలో నెవ్వరిం బిలువక బంధువులరప్పింపక మఱునాఁడు గుడిలో గోమఠునకు జారనిచ్చి వివాహము గావించెను. అప్పటికి వారిప్రాణములు గూటంబడినవి. అప్పుడు గోమఠునికిఁ గల యానంద మీపాటిదని చెప్పుటకు శేషునకు శక్యముగాదు. వివాహ మైన నాలుగుదినముల కొకనాఁడు సోమవర్మ గోణికాపుత్రునితోఁ బుత్రికావృత్తాంత మెఱిగించుటయు నతఁడు నవ్వుచు నిట్లనియె.

అయ్యా! మీరు వైదికోత్తములు. లోకవ్యవహారములంతగాఁ దెలిసినవారుకారని తోచుచున్నది. మీ రహస్యములన్నియు మేము వింటిమి. వినియే చేసికొంటిమి వినుండు.

శ్లో॥ భృశమనురాగః పత్యావపత్యవాత్సల్య మతివయస్త్వంచ।
వ్యతికరనిర్వేదిత్వం ధర్మాపేక్షానకస్యాశ్చిత్॥

పతియం దనురాగము సంతానప్రీతి, వయసుమీరుట దుఃఖ ప్రాబల్యము, ఈమొదలగు కారణములచే స్త్రీ వ్యభిచరించదు. కాని కేవలము ధర్మాపేక్షచేతగాదు. అని కొక్కోకుండే చెప్పియున్నాఁడు. మీరు నోటివట్టముచే నీముప్పు తెచ్చిపెట్టుకొంటిరి. పోనిండు మీయల్లుఁడు గట్టివాఁడు. భార్యం గాపాడుకొనఁగలడు. అని యుపన్యసించిన విని సోమవర్మ యతనిం గౌఁగిలించుకొని యప్పుడు తనమదిఁగల దుఃఖముపోయినదని స్తోత్రము గావించెను.

గోణికాపుత్రుండు గొన్నిదినములుమాత్రి మందుండి భార్యను గాపాడుకొనువిధానము గోమఠునకు బోధించి తదామంత్రణంబువడసి ధారానగరాభిముఖుండై యరిగెను. గోమఠుండత్తవారింట రాజోపభోగము లనుభవించుచు సుఖంబుండెను. జారయును,

సీ. వీధిబోవుచు వింతవిటుఁ డెవ్వఁడేని ది
యాన్యనిపాటబాడఁ దా నాలకించు
సొగసైన పొరుగింటిమగవాని గోడసం

దులనుండి యల్లన తొంగిచూచు
నాయివారమునకై యరుదెంచువారల
నూరిలో వింతలం గోరియడుగు
జనకుతో మాటాడం జనుదెంచు యువకుల
కడ నోయారంబు లేర్పడ నటించు
గీ. తనదుచెంతకువచ్చు కామినుల వారి
మగల వేపాటివనుచు సోయగములడుగు
యౌవనోదయమందె యా పూవుంబోండి
రతులెఱుంగకమున్నె యా రాజవదన.

ఆచిహ్నంబులన్నియుం బరిశీలించి గోమఠుండు మామగారికిం జెప్పి వలసినంతద్రవ్యము దీసికొని భార్యను వెంటబెట్టుకొని తనదేశము నకుంబోయి యొక మహారణ్యమధ్యంబున సమున్నత ప్రాకారాంతరమున గొప్పమేడ గట్టించి భార్యతో నందుం బ్రవేసించి యినుపపంజరములోని చిలుకనువలెం గదలనీయక యాయళికుంతలనుం దానే విద్యాబుద్ధులు గఱపుచు నుపలాలించుచుండ నాయండజయానకు నిండుజవ్వనము పొడసూపినది. అప్పుడు.

క. తలయంటి దువ్వి జడ బూ
వులుముడుచుచుఁ జలువవలువ బొలుపుగఁ గట్టుచుఁ
దిలకము దిద్దును తా న
య్యలివేణి నలంకరించు నతఁ డవ్వేళన్.

మఱియొకసుముహూర్తముజూచి యతండు తరుణీ! నీకుం జెప్పెడువారలెవ్వరును లేరు. నేఁడు కేళీమందిర విలాసంబులన్నియుం జెప్పెదంగాక, చక్కఁగా గ్రహించి యనుదినమట్లు కావింపుచుండవలయు.

సీ. మొగమున మసిబూసి మొలను జింపిరిగుడ్డ
సెరిజుట్టుకొని తల విరియఁబోసి

మండెడుకుంపటి మస్తకంబునదాల్చి
యొకచేత బెత్త మింకొకకరమున
వేపకొమ్మధరించి వికటాస్యమొప్పంగ
హుంకారమొనరించు చుగ్రఫణితి
కరతు మిగ్రింగుకు నిలుకదలకుమని పల్కు
చును నాధుశయ్య దాపునకుఁ బోయి

గీ. మూడుసారులు వలగొనిమూఢ! యిందు
బండుకొనియుండు నీవని పట్టుదాన
మఱలఁజనుదెంచి యని యంత పెఱటికేగి
తెరపి నావేషమంతయుఁ దీసివైచి.

వేడినీళ్ళ జలకమాడి నూత్నభూషాంబరంబులు ధరించి వచ్చి నన్నుఁ గలసికొనవలయు. ఇదియే ప్రతిదినము గావింపఁదగు క్రీడాముఖాంగమని యెఱిఁగించి దగ్గరయుండియట్లు కావింపఁజేసి యాచేడియతో క్రీడింపుచుండెను. లోకజ్ఞానమేమియు నెఱుంగనిదగుట నమ్మగువ యదియ యాచారమని నమ్మియట్లు కావించుచుండెను. మఱికొన్ని దినంబులు గతించినవి.

## రత్నవర్తకులకథ.

ఒకనాఁడు గోమఠుండు గృహసంబారమ్ములఁ దెచ్చుటకై ప్రాంతమందలి గ్రామంబునకరుగుచు భార్యతో నోసీ! నేనూరికిఁ బోయి రాత్రికేవచ్చెదను. తప్పనేని ప్రొద్దునవత్తు తలుపులువైచికొని భద్రముగానుండుమని పలికి యతండరిగెను. అది మొదలామదిత విరహాతురయై జన్మలగ్నఫలంబునంజేసి పరపురుషసంగమాభిలాష హృదయంబున దీపింపఁ జక్కగా నలంకరించుకొని యాహా! నేఁడీరాత్రిలోపల నెవ్వఁడేని పురుషుఁడిక్కడకు రాఁగూడదా. అయ్యో! నాకీనిర్బంధవాసమేమిఁటికి. మాయూరిలోనుండిన స్వేచ్ఛగా సంచరింతునుగదా.

కానిమ్ము. మేడయెక్కి చూచుచుండెద. సాయంకాలములోపలఁ బెరువరి యెవ్వడైన నీదారిబోకుండునా; అని తలంచి మేడగోడ యెక్కి రాజమార్గ ముపలక్షించుచుండెను. అప్పుడు,

చ. నలువురు రత్నవర్తకు లనంతధనాఢ్యులు దాక్షిణాత్యుల
వ్వలిపురి సంతకేగుచు జనంబున మార్గముదప్పి మారుత్రో
వల నటకేగుదెంచి కడుభాసిలు నాయిలుసొంపు విస్మయం
బలరఁగఁజూచుచుండఁ గని యాసఖ వారల సంభ్రమంబునన్.

ఆహా! నేఁడు నాయదృష్టము ఫలించినది. వీరినలువురతో నేఁటి రాత్రి నాలుగుజాములు క్రీడించి నన్నుఁ బీడించుచున్న పంచశరుం గృతార్థుం గావించెద. నేఁటికి నాపతి వచ్చువేళ మిగిలిపోయినది. అని తలంచి యమ్మించుఁబోఁడి పంచమస్వరంబున నోహో! తెరువరులారా! ప్రొద్దుగ్రుంకఁబోవుచున్నది. దాపున గ్రామమేదియును లేదు. ఇచటు రండు. సుఖనిద్రజెంది రేపు పోవుదురుగాక యని కేకలు వైచినది. బాటసారు లామాట లాలించి మోముయెత్తి యుత్తలోదరింగాంచి యీగేస్తురాలు మనలరమ్మని చీరుచున్నది. భోజనసదుపాయము చేయక మానదు. ఈరాత్రి యిందుఁబండుకొని ప్రొద్దున పోవుదమని యొకఁడనిన మఱియొకఁడు నట్టడవిలో నొంటిగానున్న యీవాల్గంటిదరికి విచక్షింపక పోవరాదు. అది భూతమో దయ్యమో పిశాచమో బ్రహ్మరాక్షసియో తెలియదు. అనుటయు నింకొకఁడు సీ! నీవెప్పుడు నిట్లే పలుకుచుందువు. చంద్రబింబమువలె నొప్పుచున్న యాచిన్నదాని మొగము చూచితివా? దయ్యము బ్రహ్మరాక్షసి యిట్లుండునా? గొప్పవారు జనసంపర్కము సహింపక వివిక్తదేశమున మేడలు గట్టుకొని సుఖింతురు. ఉపకారమునకై మనలఁ బిలుచుచుండ లేనిపోని శంకలు చేయుచున్నావు. చాలుచాలు. పోవుటయే కర్జమని పలికెను.

నాల్గవవాఁడు సుందరీ! మేమంతః వచ్చుచున్నాము. తలుపులు

తీయింపుమని కేకలు పెట్టెను. అప్పుడా బోటి వేగవచ్చి కవాటములు తెరచినది. పదుచువారల నలువురం జూచి తలయూచుచు లోపలకుఁ దీసికొనిపోయి యొకగదిలోఁ బ్రవేశింపఁజేసినది. తృటిలో వంట జేసి వారికి భోజనము పెట్టినది. భోజనానంతరము వారిదాపున నిలువంబడి తాంబూలము నములుచు తెరువరులారా! మీరెవ్వరు? ఎందుఁబోవుచున్నారు? ఈపడుచుతనములో మీభార్యలను విడిచి తిరుగుట ధర్మమా? మీవిరహమున వారెంత వగచుచున్నారో! నాభర్త నేఁటి యుదయముననే యూరికిఁ బోయెను. ప్రొద్దునరాఁగలరు. ఒక్కనాటికే నాకెంతయో దుర్భరముగా నున్నది. ఒంటిగా బరుండుటవాడుక లేదు. మీలో నెవ్వఁడో యొకఁడు ధైర్యశాలి నాపడకటింట సహాయముగా నుండగలఁడా? యని యడిగినఁ గులుకుచు నావర్తకులు మేనుల సాత్వికవికారంబులు పొడమాప స్మరానుతాపముతో జవ్వనీ! నీవెవ్వతెవు? నీభర్త యెందుఁబోయెను? ఒంటిగా మీరిందుండ నేల నీవృత్తాంత మెఱింగింపుము. ఒక్కఁడుగాదు. నలుగురమువచ్చి నీపక్కం బండుకొనియెదమని పలికిన విని యాకలికి యిట్లనియె.

ఇది నాపూర్వపుణ్యము. నలువురం జూచుభాగ్యము నాకు లేదు. తలిదండ్రుల కెడమైతిని నేనిందు వచ్చినతరువాతఁ బరపురుషులఁ జూచియెఱుంగను. నాపుణ్యమువలన నాపతి యూరికేగుటయు మీరు వచ్చుటయుఁ దటస్థించినది. నా వృత్తాంతము చాలగలదు. పిమ్మటఁ జెప్పెదంగాక. నిద్రమానుకొని మీనలుగురు నొకసారి రావలదు. జామున కొకఁడు రండు. ఎవ్వనికి గష్టముండదు. అందఱకు సుఖంబగునని సూచించినది.

వారిలో వయసుకాఁడు తటాలునలేచి నేను ముందువచ్చెద. బడకగది చూపుమని చొరవగాఁబలికిన నవ్వుచు నాజవ్వని వానిఁ దన పడకటింటిలోనికిఁ దీసికొనిపోయి మంచముపైఁ గూర్చుండఁబెట్టి క్షణ

కాల మందువసింపుము. నేనిప్పుడే వచ్చెదనని పలికి యవ్వలికిబోయినది. మంచముపైఁ గూర్చుండి యావర్తకుఁడు నాకీదివసం బెంతసుఖమైనది. అచ్చరవంటి మచ్చెకంటితో పచ్చవిల్తుని కేళిఁ గూడఁ గల్గుచున్నది. ఈజెంత యెంతపోరిడయో కాక యింతలోఁ గ్రొత్తవానిఁ గూడ యత్నించునా? నేను మంచిపనిఁ జేసితిని. రమ్మనఁగనే వాం డ్రాలోచించుచుండిరి. సాహసించి రాఁబట్టి తొలికలియకలు నాకు లభించుచున్నవి. నేను ధన్యుండ నని తలంచుచు నాచంచలాక్షి రాక నిరీక్షించుచుండెను.

వాకిటిగదిలోనున్న ముప్పురు నాజవ్వని పలుకులు తలపోయుచు నయ్యో! మనబుద్ధులింత సురిగిపోయినవేమి? వానికున్న సాహసము మనకు లేకపోయెనుగదా! పాప మాపైదలి వచ్చి మీలో నెవ్వఁడో యొకఁడు రావలయునని కోరినదికాని వానిపేరుపెట్టి పిలిచినదా? మన దేతప్పు. ఆచొరవయే వానికా తెఱవం గూడ జేసినది. ఆకాంత మనకుఁ గూడ వంతులు సూచించినది. కాని నాఁడంతటితో విడువఁడు. మనపని వట్టిదే. వాఁ డెప్పుడువచ్చునోయని నిద్రలేక గడియలు లెక్కపెట్టుకొనుచు నిందుఁ బరితపింపవలసినవారమే. అని విచారించుచు నిద్రబోక వానిరాక చూచుచుండిరి.

ఆజారయు, బెరటిలోనికిఁబోయిఁ వాడుకపరికారము చిమ్మిఁగుస్త గట్టుకొని మసిబూసుకొని మండుచున్న కుంపటి నెత్తిపై బెట్టుకొని బెత్తము వేపరొట్టయు గరంబులధరించి హుంకారపూర్వకముగ"—

క. కరచెద మ్రింగెదఁ బొడిచెద
విరిచెద నిలునిలుమటంచు వెలఁది పడక మం
దిరమున కరుదెంచెను భీ
కరవేషముతోడ దానిఁగని యుతఁడాత్మన్.

అమ్మయ్యో! ఇది బ్రహ్మరాక్షసి; యెఱుఁగక మోసపోయితిని

లేకున్న నొంటరిగా నీయడవిలో నింత చక్కనిచిన్నది వసించునా? వాఁడు చెప్పుమనే యుండెను. ఈవిసరు నామీఁద బడినది. వారును మ్మువ్వురు దీనివేషముజూచి యీపాటికిఁ బారిపోయి ప్రాణములు దక్కించుకొని యుందురు. నాకే చావుగూఁడినది. నేఁడు మృత్యుదివసంబని యెఱుంగక లేచినవేళ మంచిదని ముఱిసితిని. అన్నన్నా! దైవమెంతలో దీన్నరానికష్టములు గలుగఁజేసెను. అక్కటా! విధీ! నీకంటికి నేనొక్కడను గనంబడితినా? ఈబ్రహ్మరాక్షసి నామైబడి బలవంతముగఁ జంపుసుగాఁబోలు. కటకటా! నాభార్య పోవలదనుచుండ నిల్లు బయలుదేరితిని. ఇది రమ్మనినతోడనే యాలోచించక తటాలున నేనే రావలయునా? వారవెప్పుడును గూడదు. నామూటలో లక్షవెలగల రత్నములున్నవి. అవియన్నియు వాండ్రు తీసికొనిపోవుదురు కాబోలు! నా భార్యకిత్తురా? ఈయరు. ఇది వారింగూడ భక్షింపక విడుచునా? ఏమో ముందు నేను జిక్కితినిగదా. అని తలపోయుచుఁ గదలకమెదలక నిట్టూర్పువిడువక దానిదెసఁజూడక యొంటిప్రాణముతోఁగూర్చుండెను.

అప్పు డప్పడఁతి బెడిదపునుడువు లడర ముమ్మారు మంచము వలగొని యిదిగో! వచ్చి నీపనిపట్టెదఁ గూర్చుండుమని పలుకుచు బెరటిలోనికి బోయినది. ఆయంతరమునసవర్తకుఁడు మంచము మెల్లనదిగి తొంగితొంగిచూచుచుఁ జప్పుడుకాకుండ నడిచి పొంచిపొంచి యల్లన వర్తకులున్న గదిలోనికింబోయెను.

వానిరాక నిరీక్షించుచుఁ గన్నులమూయక యాదెసం జూచుచున్న మువ్వురువర్తకులు వానింజూచి లేచి ముందు నేనుబోయెద నేనుబోయెదనని ముందర కడుగు వేయఁబూనిరి. అప్పుడతండు వారి నాటంకపరచుచు నోరుఁమూసి మెల్లగా నిది యాఁడుదికాదు. బ్రహ్మరాక్షసి. ఇందుండిన మనలనందఱఁ జంపఁగలదు. అని సంక్షేపముగా జెప్పెనో లేదో యెవనికివాఁరే యేమాటయుం బలుకక యేమూటయుం

బూనక యుపవస్త్రమైన దాల్పక ముల్లెలువిడిచి తలుపులు దెరచు కొని యొకరికొకరు జెప్పక కాలికొలఁదిని బారిపోవఁ దొడంగిరి.

ఆముద్దియ యాసన్నవిని వికటవేషముతోనే పారిపోవువారి వెంటపడి యోహో! సుందరులారా! పారిపోయెద రేల? రంభుర ుఁడు మీనిమిత్తమెంతయో యాసపడితిని. నాయభిలాష తీర్పకపోవచ్చునా? ఇప్పుడేమి వచ్చినది? అని కేకలుపెట్టుటయు వాండ్రు తిరిగిచూచి అమ్మయ్యో! దానివేషము భయంకరముగానే యున్నది మనలఁ దరుముకొని వచ్చుచున్నది. చంపునేమోకదా? అని తలంచి ముల్లనక చెట్టనక గుట్టనక శక్తికొలఁది పారిపోవఁదొడంగిరి.

జారయుఁ గొంతదూరముపోయి పిలిచి నిరాశజెంది వెనుకకు మరలి తలుపులన్నియువైచి శయ్యపైఁ బండుకొని దుఃఖించుచు నెట్టకే తెల్లవార్చినది. వర్తకులు తెల్లవారువఱకు పరుగిడి పరుగిడి సూర్యోదయమున కొకపల్లెజేరి వెనుకకుఁ దిరిగిచూచి అమ్మయ్యా! ఇప్పటికి బ్రతికితిమని తలంచుచు, నంతలో మూటలమాట జ్ఞాపకమునవచ్చుటచే నయ్యో! అయ్యో! నాలుగులక్షల వెలగలరత్నములమూటలుపోయినవే! దరిద్రులమైపోతిమి. ఇళ్ళకు బోయి యేమిచేయుదుము? భార్యాపుత్రుల నెట్లు రక్షించుకొందుమని యందున్న చెరువుగట్టునగూర్చుండి దుఃఖించుచుండిరి.

అప్పుడు సూర్యోదయమైనది. గోమఠుఁడు సామగ్రిఁగొని యింటికిఁబోవుచుఁ దటాకతీరమున నుపవస్త్రములులేక కట్టుగుడ్డలతో గూర్చుండి విచారించుచున్న వర్తకులఁజూచి శంకించుకొనుచు దాపునకుఁబోయి మీరెవ్వరు? చింతించుచుంటి రేల? ఒక్కనికిం బైగుడ్డలు లేవేమి? అని యడిగిన వారిలోనొకఁడు జరగినకథ యంతయుఁ జెప్పి రత్నపేటికలు పోయినవని యేడువఁ దొడంగెను.

అప్పుడతండు గోణికాపుత్రుఁడు చెప్పిన యుపాయము సఫలమైన

దని సంతసించుచు వర్తకులారా! మీరు ప్రాణములు దక్కినవని సంతసింపక మాటలుపోయినవని విచారించెద రేమిటికి? మీ పెండ్లాముల పెడతాళ్ళు గట్టివి కనుక, బ్రతికివచ్చితిరి. అది బ్రహ్మరాక్షసి. పగలు దివ్యరూపంబునఁ గనంబడుచు మార్గస్థుల భ్రమపెట్టి శృంగారచేష్టల వెలయింపుచు లోపలికిఁ బిలిచి చీఁకటిపడినతోడనే వారిం గడతేర్చుచుండును. దానిబారి తప్పించుకొని మీరెట్లు వచ్చితిరో వింతగా నున్నది. రత్నములకాసపడి యాదెసకుఁ బోవుదురుచుఁడీ! ప్రాంతములఁ గాచికొనియుండి మీఁదఁబడి చంపఁగలదు. అని యెఱింగించిన విని వర్తకులు బాబూ! నీపుణ్యము. మంచిమాట తెలిపితివి. మావాఁడో కఁడు సొమ్మునకాసపడి పదుగుర వెంటఁబెట్టుకొని యక్కడకిఁ బోవలయునని చెప్పుచున్నాఁడు. బ్రతికియుండిన సొమ్ము వేరొకరీతి సంపాదించుకొనఁగలము. అని పలుకుచు వారు మఱియొక మార్గమునఁ దమదేశమునకుం బోయిరి.

గోమఠుండును వేగముగా నింటింకింబోయి భార్యనుబిలిచెను. ఆమె వచ్చి తలుపుదీసినది. అమ్మగువమొగముఁజూచి కన్నులఎఱ్ఱగా నున్న వేమి? నిద్రపట్టలేదా? అని యడిగిన నప్పుడఁతి బుడిబుడిదుఃఖ యభినయించుచు మనోహరా! మీవియోగంబున రాత్రి నేను పడిన పాటులు దైవ మెఱుంగును. అదిభయమో, విరహమో, పరితాపమో తెలియదు. కన్నులు మూతపడినవికావు. అని యేమేమో చెప్పుచుండ నతండు ఔను. నేనామాటయే యనుకొనుచుంటిని. ఇఁక నెన్నఁడు నిన్ను విడిచి పోవను. పోయినను రాత్రికిఁ దప్పక రాఁగలను. అని యూరడఁబలికెను. భార్య వంటచేయుచున్నసమయంబున నిల్లంతయు వెదకి వర్తకులమూటలు దాచినచోటు తెలిసికొనియెను. రాత్రిభోజనానంతరమున జార నాడుకపరికారము ప్రారంభకృత్యములు నిర్వర్తించిజలకమాడి నూత్నాంబరధారిణియై కలియనచ్చినంత నతండు భా

ర్యహృదయాంతరమునఁ జెవినిడి యామె డెందము తనతో నేదియో చెప్పుచున్న ట్లిట్లభినయించెను.

ఊఁ ఊఁ. తరువాత వర్తకులు నలుగురా? ఊఁ. సాయంకాలమున నీదారింబోవుచున్నారా? ఊఁ. మేడగోడయెక్కి కూర్చుండి వారిని బైకి రమ్మనిపిలిచినదా? ఊఁ. పిమ్మట అందఱు లోపలికివచ్చిరా? ఆనక చావడిగదిలోఁ గూర్చుండఁబెట్టినదా? ఊఁ. తృప్తిగా భోజనముపెట్టినదీ! తరువాత. వారిలో నొకని ముందుగాఁ బడకగదిలోనికిఁ దీసికొనిపోయి మంచముపైఁ గూర్చుండబెట్టినదియా ఊఁ. తరువాత మొకటివికార వేషము వేసికొని వచ్చి స్నానార్థమై పెరటిలోనికిఁ బోయినదా? తిరు గానచ్చునప్పటికి కావర్తకులు మూటలువిడిచి పారిపోవుచుండిరా? ఆ. వెనుకకొంతదూరము పోయిరమ్మని పిలిచినదీ. ఊఁ. వాళ్ళురాలేదూ? అయ్యో! పాపము తరువాత వారినిమిత్తము చింతించుచుఁ బెల్లవాళ్ళు నిద్రపోలేదూ! మఱివారిమూట లేమిజేసినది! చిన్నగదియటుకపై దాచినదా? సరే? అని యామెహృదయము తనతో నాసక మంతయు జెప్పినట్లభినయించెను.

అప్పుడాజార వెల వెల పోవుచుండును. రండా! నేను లేనప్పుడు నీవుగావించిన దుష్టచర్యలన్నియు నీడెందము చెప్పినది. వింటివికదా? అట్లుచేసితివా? లేదా. నిజముచెప్పుము అనుటయుఁ గన్నీరుగార్చుచు రామ రామ. నే నేమియు నెఱుఁగనని బొంకినది. ఛీ ఛీ. రంకులాడ ఇఁకనీబొంకులు నిలువవు. నిజముచెప్పెదవా? లేదా అనిపెనిమిటిచేతి త్రాటితోవీపుపై నాలుగుదెబ్బలు కొట్టెను. బాబో రక్షింపుము. రక్షింపుము అని మొఱపెట్టుచు యథార్థముజెప్పి యీతప్పు మన్నింపుము. ఇఁకెన్నడు చేయను. అని పాదంబులంబడి ప్రార్థించినది. అతఁడు మొదటితప్పుగా మన్నించి విడిచిపెట్టెను. యథాప్రకారమే నాగు గ్రీడింపుచుండిరి. మఱినాలుగుదినము లఱిగిననెనుక ప్రాగ్జ్యోతి

యతండు భార్యతో నేనూరికి బోయి సాయంకాలమునకుఁ దప్పక వచ్చెద నింటిలో జాగ్రతగానుండుమీ యనిచెప్పి యదిచూచుచుండ నవ్వలికిఁబోయి వేరొకమార్గంబున లోపలికివచ్చి పడకటింటియటుకపై గూర్చుండెను.

జారయుఁ బెందలకడభోజనము జేసి శయనగృహమునకుఁబోయి మంచముపై గూర్చుండి రవిక నూడదీసి హృదయాంతరము గ్రుద్దుచు పాడుహృదయమా! నారహస్యములన్నియు వెల్లడింతువా? నాకంటె నీకాయనదగ్గిరచుట్టమా? నిన్నేమిచేయుదునే చూడుము? ఇంకొకసారి చెప్పినఁ జీల్చి పారవేయుదును. నాప్రాణము యెఱుఁగవుగాక యని, పది గుద్దులుగుద్దినది. తనకేనొప్పి పెట్టినది. ఇఁకబుద్ధిరాఁగలదని నిశ్చయించి వెండియు రవికతొడుగుకొని గృహకృత్యములు గావించుకొనుచుండెను.

గోమతుండట్లో భార్యకుఁదెలియకుండ నిలుదాటి యూరినుండి వచ్చినట్లు సాయంకాలమున నింటికివచ్చెను. భార్య పెందలకడ వంటజేసి భోజనముపెట్టినది. క్రీడాదియుందు వెండియు నతండామదవతి హృదయంబునఁ జెవినిడి ఆ ఆ. ఏడ్చెదవేమి? ఊరుకో ఏమిచేసినదో చెప్పుము. నిన్ను గట్టిగాఁగ్రుద్దినదా? నాతోఁ దనరహస్యము చెప్పినందులకా? ఆ. ఏమన్నది? నాకంటె ఆయనదగ్గిరచుట్టమా! అనినదీ! ఇఁక జెప్పితివేని చీల్చి పారవేసెదనని గుద్దినదా! ఊ తరువాత, నొవ్వ గుద్దినదేమి? బాధగానున్నదా? కానిమ్ము మందలింతునులే. ఊరుకో. నీకేమిభయములేదు. అని యభినయించి పలుకుచుండ జారభయపడుచు "నిఁకదీనిముందర నారహస్యములు నిలువవు. చేసినపని చెప్పకమానదు." అనితలంచి యతండుదండింపఁబోవఁ బాదంబులఁబడి యిఁకెన్నడు తప్పుచేయను. చేసితినేని హృదయమే చెప్పునుగదా? ఈసారిపరీక్షించి చూడుఁడు మీరుచేసిన శిక్షకుఁ బాత్రురాలనగుదునని శపథము

జేసినది. ఆతండు తలపంకించుచు జాగ్రత నీరంకులు నీబొంకులు నాకడఁ బనికిరావు ఈమాటు ఏపాటితప్పు జేసినను నీహృదయము జెప్పినను నిన్నుగట్టిగా శిక్షింతుఁజుమా ? యని పలికి యొప్పించి మన్నించెను.

అది మొదలాముదిత తన హృదయమునకు వెఱచి యడకువగా మెలంగుచుండెను. భార్యకుబుద్ధికుదిరినదని నిశ్చయించి సోమసుందరు మఱికొన్ని దినములఱిగిన వెనుక భార్యను బుట్టినింటికిఁ దీసికొనిపోయెను సోమవర్మయు భార్యయు వారిని మిక్కిలి సంతోషముతో నాదరించిరి. తల్లియు సఖురాండ్రును రహస్యముగా జారతో భర్త నిన్నిష్టముగాఁ జూచుచున్నాడా? కాపురమనుకూలముగా నున్నదియా ? విశేషము లేమనియడిగిన విని యవ్వనిత తన రెండుచేతులతో హృదయమును జూపుచు అవ్వ? అని నోరుమూసికొని యిదియున్నది. మాటాడకుండు వారితోఁ జెప్పఁగలను. అని సంజ్ఞ చేయుటయు నాసన్న వారికేమియుం దెలిసినదికాదు. అప్పుడు తల్లి మఱియు మఱియుం దర్కించి యడిగిన నోరు మొత్తుకొనుచుఁ జెవులో "నే నేమిజేసినను నాహృదయము నామగనికిఁ జెప్పఁగలదు." మీ రేమియు నన్నడుగవలదు. నాకాపుర మనుకూలముగానే యున్నది. అనిచెప్పినది.

ఆమె యావార్త సోమవర్మ కెఱింగించుటయు నతండు గ్రహించి యల్లుఁడుచేసిన నియమమున గూఁతురు బుద్ధిగలిగి వర్తించు చున్నదని మెచ్చుకొని వారిం దమయింటనుంచుకొని కాపాడుచుండెను.

శ్లో॥ సకృదపికులటాభి ర్యోగినీభిక్షుకాభిః
నటవిటఘటితాభి స్సంస్పృ జేన్నాలికాభిః।
రుచిరమిదమముష్మై పథ్య మేతన్న వేత్తి
ప్రతిదినమపిభర్తు ర్భోజనేచ్ఛాంవిదధ్యాత్ ॥

జార భర్త బోధించినప్రకారము కులటలతో యోగినులతో

భిక్షుకులతో నటులతో విటులతో మూలికావైద్యులతో నెన్నఁడును మాటాడునది కాదు వాంఛ్రిదూతకృత్యముల నిర్వర్తించి పతివ్రతల నైనఁ జెడుతోవలఁ దింపఁగలరు. మఱియు భర్తకేదియిష్టమో తెలిసి కొని భోజనసదుపాయము జేయుచుఁ బతివ్రతలలో నగ్రగణ్యయై యొప్పునది. స్త్రీలు సహజముగా దోషదూషితులైనను నడవడికచేఁ జక్కఁబడుదురు.

గోమఠుఁడు గొన్నిదినము లత్తవారింటనుండి భార్యగుణము జక్కఁబడినదని నిశ్చయించి మామగారికిఁజెప్పి తనకత్యంతోపకారము గావించిన గోణికాపుత్రుంజూడ ధారానగరంబునకుఁ బయనంబై పోయెను.

అనియెఱిఁగించి యాసిద్ధుండు తదనంతరావసథంబునఁ దదనంతరోదంతం బిట్లుచెప్పందొడంగెను.

## 144 వ మజిలీ.

### రతినూపురకథ

పాటలీపుత్రమను నగరంబు మగధదేశమునకు రాజధానియై జగద్విదితంబై ప్రకాశించుచున్నది. ఆపట్టణంబు దత్తునకు జన్మభూమి యగుట మునుపటికే చెప్పియుంటిసిగదా మఱియు నాపురంబున రతినూపుర యను వేశ్య కాపురము సేయుచుండెను. విద్యారూపవైభవంబుల ననవద్యయగు నగ్గణికారత్నము కొంతకాల మేకపరిగ్రహయై కొంతకాల మనేకపరిగ్రహయై కొంతకాలమపరిగ్రహయై మిక్కిలి ధనమార్జించి నది. కుబేరులవంటివారల బోగులఁ జేసి సాగనంపినది. భూములుమిద్దెలు మేడలు చాల సంపాదించినది. సంతానముగలుగుటఁ కెడమైనది. వ్రతములు దానములు ధర్మములు సంతానాభిలాషఁ బెక్కుగావించినది. కడచిన వయసున నొక విప్రునివలన నేవ్రత ప్రభావముననో దానికిరువురు పిల్లలుపుట్టిరి. వేశ్యల కాఁడుపిల్లపుట్టుట రాజులకుఁ బట్టభద్రుఁడుపుట్టి

నట్లేకదా? వారికిఁజిత్రసేనయనియు రతిమంజరియనియుఁబేరులుపెట్టినది. త్రిజగన్మోహనరూపంబునఁ బ్రకాశించు నాబాలికలకుఁ గ్రమంబున సంగీత సాహిత్యాది విద్యలు నేర్పించినది. వీణాగాన పరిశ్రమలో భూలోకములో వారినిమించినవారు లేరని వాడుకవచ్చినది. బంగారమునకుం బరిమళమబ్బినట్లు ఆబిబ్బోకవతుల చక్కఁదనమును యౌవనము మెఱుఁగుబెట్టినది.

శ్లో॥ యౌవనే సత్వజాస్త్రీణా మలంకారాస్తువింశతిః॥ యౌవన సంబంధములగు హావభావాద్యలంకారము లిరువదియు వారినలంకరించినవి తదీయ సౌందర్య విద్యావిశేషంబులఁ దెలిసికొని వారింజూడవలయుననియు మాటాడవలయుననియు ననేక విటశిఖామణులు ప్రయత్నించిరి. కాని, వారట్టియవకాశమీయక రాజస్త్రీలవలె నంతఃపురముననే మెలఁగుచుండిరి.

యౌవనవతులగు పుత్రికల నిప్పుడ వేశ్యావృత్తిలోఁ బ్రవేశపెట్టిధనమార్జింపవలయునని తలంచి యొకనాఁడు రతిసూపుతనపుత్రికలకు వైశికధర్మము లిట్లు బోధించినది. బిడ్డలారా! మీరు మనోహర రూపవిద్యానవద్యలై యొప్పుచున్నారు. మీనిమిత్తమై విత్తేశునివంటి యాఢ్యులు బడికాపులై తిరుగుచున్నారు. మీరు వేశ్యాధర్మముల నాక్షేపించుచు విటుల మొగము జూడక కులస్త్రీలవలె నొదిగి యొదిగి మెలఁగుచున్నారు. వైశికప్రకరణ మొకటిమన నిమిత్తముగ విద్వాంసులచే వ్రాయఁబడినది. దాని మీకుపదేశింతు. అంతయు చెప్పువఱకు నడ్డుపడి శంక జేయక వినుండు.

కాముకులకు శరీరమిచ్చి యర్థార్జనము చేయుట వేశ్యాకుల ధర్మమై యున్నది. కులస్త్రీలు రాగాసక్తలు. వేశ్య లర్థాసక్తలు. గణిక, రూపాజీవ, కుంభదాసి యని వేశ్య మూఁడువిధములఁ జెప్పఁబడుచున్నది. దేవగృహతటాకాది పుణ్యకార్యంబులు చేయుచు నొక్కనికే

పతిగాఁ బరిగ్రహించి ధనమార్జించునది గణిక యనంబడును. రూపమున గృహవస్తుప్రాగల్భ్యము. సౌందర్యము సామాన్యమైనను వస్తుప్రాగల్భ్యముగలది రూపాజీవయనంబడును. రాజస్త్రీలకడ సంచరించు దాసులు కుంభదాసులనంబడుదురు. నట శిల్పికారులభార్యలు భర్తృమరణానంతరము వేశ్యావృత్తి వహింతురు. వారిని శిల్పికారిక లని పిలుచుచుందురు. వీరిలో గణికయే యుత్తమురాలు.

మఱియు నాత్మస్తుతిపరుఁ డ్యాగశీలు గురుశాసనాతిక్రముఁడు స్వతంత్రు ధనికుఁ బ్రచ్ఛన్నకాముని బతిగాఁ బరిగ్రహింపవలయు. కాంతుననుసరించి కృత్రిమరాగము స్వాభావికరాగమువలెఁ బ్రకటింపవలయును. కామపరులగు పురుషులు వేశ్యల కపటములు నమ్ముదురు. నాయకునిచేఁ బ్రార్థింపబడియు తొందరపడి యంగీకరింపకూడదు. నాయకుని శీలము రాగమునక్తత దాతృత్వము లోనగు గుణంబులు బరీక్షించి యంగీకరింపవలయు. వానిరంజింపఁ జేయుటకు ననేకోపాయంబులుగలవు. వానిలోఁ గొన్నిటివివరించెద నాలింపుఁడు.

సీ. సందేశమాలించి జాగుసేసినవిటు
కడకు దానేపోయి యడుగవలయు
నలరఁ దాంబూలమాల్యాను లేపనము లిం
టికినచ్చినట్టి నాయకునకీయ
వలయు మండన పరివర్తనంబులు సేయ
దగు బ్రియుం డనురక్తిఁదగులుకొనఁగ
సాంప్రయోగికమును సాకూతముగను సూ
చింపఁగాఁదగుగమ్యు చిత్తనురసి

గీ. ప్రీతిదాయకములగు వాగ్రీతులొప్పఁ
జెలఁగి క్రీడల విటుని రంజింపవలయు
సక్తగాకుండ దా నతిసక్తయైన
యట్లునటియింపవలెఁ గపటాత్మ వేశ్య.

గీ. వేశ్యమాత యెప్పుడు విటునితోఁ జనువుగా
మాటలాడఁదగదు మఱియు నతఁడు
బెదరునట్లుకూఁతుఁ బిట్టునిందింపంగఁ
దగును దొరకె మంచితగులమనుచు.

సీ. పయనమేగెడునట్టి ప్రియుఁజేరి వగచుచు
వేగరమ్మని యొట్టు పెట్టవలయు
నాలసించిన విరహాగ్ని కీలలమ్రగ్గి
యొడలు బాసెదనంచు నుడువవలయు
విటునాప్తులెఱుఁగ నెప్పటికివచ్చు ప్రియుండ
టంచుఁదాశకునంబు లడుగవలయుఁ
బ్రియుని మిత్రులఁజూడ రయముగా నతఁడు రా
వలెనంచు వ్రతములు సలుపవలయు

గీ. నతఁడువచ్చినపిదపఁ జిత్తార్తిదెలిపి
యోజశ్రీకామదేవుని పూజసలిపి
మ్రొక్కులెల్లను జెల్లించి మురియవలయు
వల్లభుఁడుజూచి నమ్మువిభ్రాంతిబడగ.

క. సరసున కాపద గలిగిన
వరుసనలంకారములను వర్జింపఁదగుఁ
బరుసమగుమాట లెన్నఁడు
వరుసన్నిధినాడఁతగదు వారాంగనకున్.

గీ. విటునికవసర మగునట్టి వేళలందుఁ
దనదునగలీయఁదగు నమ్ముకొనుడటంచు
సారధనుఁబొటఁ గార్యంబు దీరనంత
దాసికిబ్బడిసీయక మానఁడతఁడు.

సీ. కంటిరే? యీరత్నకలిత కంకణమెంత
సొగసైనదోయంచుఁ జూపవలయు
మీయుంగరము కెంపునీయంగుళికిసొంపు
గలిగింపవలెనంచుఁ దెలుపవలయు
నీవాహనము మనమెక్కి యూరేఁగ వే
డ్కలుపుట్టెనన్ని చేరిపలుకవలయు
నీవల్వగట్టి మీతో వేడుకలఁగూడ
మనసయ్యెనని బ్రీతిమాలవలయు
గీ. విక్రియంబునకవినచ్చు వేళలెఱిఁగి
వలదు పోనిందు నేఁడు ద్రవ్యంబు చేత
గొరఁతగాఁబోలు రేపైనఁ గొనగవచ్చు
ననుచు సూచింపఁ దగువిటు నంతికమున.
ఇది సక్తునికిఁజ్ఞేయు తెరంగింక విరక్తుప్రికారం బెట్టిదనిన.
గీ ఇంగితాకారచేష్టల నెఱుఁగఁదగు వి
రక్తుసతిఁడిత్తునన్న యర్థంబుకొరఁత
గా నొసంగుచునిత్య మీఁగలది రేపు
రేపుమఱచితినని భ్రమజూపుచుండు.
గీ. ఒకటిసెప్పిచేయు నొక్కటి ప్రియురాలి
శతృకోటితోడ సలుపుమైత్రి
వెరుక విడిచినట్టి వేశ్య దూతికలతో
మంతనంబులాడు మఱియు మఱియు
సీ. భర్తకిష్టముగాని పనులఁ గావింపుచు
నతనిముందర నిందలాడవలయు
ధనము భేదించి మర్దించి లోష్టమువాని
దెసఁజూచుచును మూతిద్రిప్పవలయు

నధికవిద్యావంతులైన వారిగణించి
దూషింపవలయు నాధూర్తయశము
పరిచారికలమీదఁ బన్నిదోషములెత్తి
పొడుపుమాటల సూటిబొడుపవలయు
గీ. రతుల కవకాశమీక రుగ్మతవచించి
వలపు గాడిదయొక్కటి కలనుమాకు
నదలదెన్నన్న సిగ్గులేనిది యటంచు
దిట్టవలెఁదల్లిచేత మొత్తింపవలయు.
క. మెల్లగవిటులకుగల ధన
మెల్లనునమ్మించి లాగియేపున వానిన్
వెళ్ళఁగొట్టఁగ మఱితన
తల్లిం బురికొలుపవలయు దర్పంబొప్పన్.

బిడ్డలార! వినుండు.

శ్లో॥ పరీక్ష్య గమ్యో స్సంయోగ స్సంయుక్త స్యానురంజనం।
రక్తా దర్థస్య చాదాన మంతేమోక్షశ్చ వైశికః॥
గీ. తెలిసి విటుశీలమతనితోఁ గలసికొనుట
కలిసి రంజించుటతని శృంగార కలన
రక్తుఁడగువానివలన నర్థములు గొనుట
చివర విటుగెంటుటిదియె వైశికమనంగ.
క. ఈ వైశికవిధు లెఱిగిన
చో విటులం గపటవృత్తి జొనుపుమ హసా
జీనలు ధన మార్జింతురు
ప్రావీణ్యముతోన సక్తభానంబలరన్.

అని యెఱింగించి మఱియు నపరిగ్రహానేక పరిగ్రహ ప్రసక్తుల
జెప్పుట కుద్యమించుచున్న తల్లి నాక్షేపించుచు నమ్మిం మఁజాఁ

లిరువురు అమ్మా! నీ యుపన్యాస మింతటితో విరమింపుము. సీ! సీ! వేశ్యావృత్తి యెంతగర్హితము. ఈధనంబంతయు నీవిట్లేసంపాదించితివి గాఁబోలును. అయ్యయ్యో! మేమిట్టి కులంబున బుట్టితిమేమి?

చ. ఖలుఁడును జాతిహీనుఁడు వికారిగురుక్షయరోగి కుష్టుఁడు
ర్గలితుఁడు కుంటి గ్రుడ్డి చపలక్రియుఁడున్ మలినాంగుఁ డెవ్వఁడే
గలియఁగవత్తు విత్తమిద్దైకొనుఁ డన్న ముదంబు జెంది వే
శ్యలు తమదేహమమ్ముదు రహో! యతినీచమికేది జూడఁగన్?

గీ. లలిత మణి భూషణాంబరామల ధరించి
నెరయఁబైవన్నె లెన్నేని నెరపితుచ్ఛ
విటులు పెక్కండ్రు భోగించి విడిచినట్టి
గణిక యుచ్ఛిష్టపాత్రంబుగాదె తల్లి!

ఉ. మేడలుగల్గనీ! పసిసమృద్ధి లభింపగనీ! సి[illegible]
గూడగనీ! ప్రసిద్ధిపడ గోటికిఁ దాపడ గత్తనీ! నిజం
బాడెదమో శుభాంగి! వినుమా! గణికాజనజీవనంబు సీ
పాడుసుమీ! క్రిమిక్షుధలపాలుసుమీ! తుదిఁదత్ప్రతీకముల్.

గీ. కాపురంబులెన్నో మాపినిందలమోపి
బొంకులాడి ధర్మములనువీడి
కపటవృత్తి విటులఁగలసి జోగులఁజేయు
పడపుబోంట్లు యమునిభటులుగారె?

ఉ. దేహము శాశ్వతంబనుచుఁ దెల్లముగాఁగ నెఱింగికేని యీ
మోహమదేల గల్గు నిహమున్ బరముల్ దలపోసినన్ వరా
రోహకు భర్తయుండఁదగు రూఢిగనొక్కని మంచివాని స
ద్రోహమునీవ నెన్నుకొని తుష్టి వహింతుము మేము తల్లిరో!

అనిపలికిన విని రతినూపుర కోపరస మిశ్రితమగు చిఱునగవుతో వెఱ్ఱిబిడ్డలారా! పెండ్లియూసు తలంపులిూకేల గల్గినది? ఇది యే

వ్వరియుపదేశము? అయ్యయ్యో! కులపాలికలుబహు నియమములం జూచు చుండియు మీకీసంకల్ప మేలబుట్టినది? వినుండు—

సీ. అత్తమాటలకు నోరెత్తి యుత్తరమీయఁ
దప్పు వేరొకతప్పు జెప్పకున్న
మఱఁదులకడనిల్చి మాటలాడుట తప్పు
ఆఁడుబిడ్డల కెదురాడఁదప్పు
మామముంగటనుండ మసలుట యొకతప్పు
బావగారికిఁ గనంబడుటతప్పు
ఎఱుఁగక మొగసాలకఱిగినిల్చినఁదప్పు
నగుచుఁబల్కుటపల్కి నగుటతప్పు

గీ. జడనుజుట్టుట చెంపకొప్పిడుట వ్రేలు
ముడి ఘటించుట జిన్నిబొట్టిడుట మెఱుఁగు
వలువగట్టుట సిగను దండలనుజుట్టు
టెక్కుడగుతప్పు మగనాలికెపుడు ముప్పు.

గీ. ఇన్నితప్పుల నెట్లో సహింపవచ్చు
గాని భర్త యతిక్రోధుఁడైన యపుడు
తెఱవ పడుపాటులల బ్రహ్మదేవుఁడెఱుఁగు
వలను మగనాలితనము శత్రులకునైన

అనుటయుఁ గూఁతుం జూచి అమ్మా! నీవింత యవివేకమతి వగుట వింతగానున్నది. పెండ్లియాడుచున్న కులస్త్రీలెల్ల నియమములం గనుచుందురా?

సీ. అత్తచిత్తమెఱింగి యాఁడుబిడ్డమనంబు
గనుపెట్టి మామనైఖరిగ్రహించి
తోడికోడండ్రచేతో నిధానముగాంచి
మఱఁదులహృదయాభిమతముదెలిసి

భావగారితలంపు పరికించి చుట్టాల
గౌరవంబుగణించి కార్యమెఱిఁగి
ప్రాణేశుకడుపులోపలఁ బాడుకొనివంశ
మర్యాదలెల్ల నెమ్మదివహించి
గీ. ధర్మగతినొప్పు సాధ్వీవతంసమునకు
నూడిగంబులుసేయరే యున్నహితులు
నర్ధదేహమొసంగఁడే యరసిభర్త
వరములీయరె వచ్చి దేవతలుప్రీతి.

తల్లి—పుత్రికలారా! లోకానుభవము లేనివారగుటచే మీ రిట్లనుచున్నారు. వినుండు.—

క. గాథల్ పెక్కేటి సం
బోధింపగ నెల్లకాలము సజీవుండై
నాథుండు బ్రదుకునే భువి
వైధవ్యవ్యథభరింపవశమే చెపుడా
గీ. నేల బండుకొనుచు మాలికాగంధతాం
బూలముఖ్యభోగములను వదలి
విధవ యోగివలె వెలయంగవలెనఁట
కామమును జయింప గలరె సతులు.

పుత్రికలు— అమ్మా! నీవు శాస్త్రజ్ఞానములేనిదానవగుట నిట్లనుచున్నావు పూర్వకృతసుకృతదుష్కృతము లనుభవింపక యెట్టివారి కిందీరదు. పెండ్లియాడినను నాడకున్నను బ్రారబ్ధమవశ్యభోక్తవ్యము. నీమతము మాకభిమతముగాదు కులవృత్తి మేమనుసరింపము. అది నిరయద్వారము. అని తిరస్కరించి పలికిరి. అందు మఱియుఁ జిత్రసేన

గీ. చదివితిని చిన్నతనమున ముదముగమర
దత్తకుండను మాధురాత్మజునితోడ

హాని సౌందర్య మక్కజమైనదగుట
నపుడె తలంచితి నతనిఁ బెండ్లాడ మతిని.

బడియుండెమే మొండొరుల వరించుకొంటిమి. అతండిప్పుడు కాశీపురంబునఁ జదువుచున్నాడని వింటి నేనందుఁబోయి బాల్య స్నేహం బెఱింగించి యతనిఁబతిగా వరించెద నీమైశ్వర్యము నాకక్కర లేదని పలికినది.

రతిమంజరియుఁ జిత్రసేనచెవిలో నేదియో చెప్పి యక్కవాఁడే నాభర్త యిది గురూపదిష్టము. అట్లుకావించెదనని యుపన్యసించినది. రతినూపుర వారిమాటలాలించి చిన్నవారలు మీకేమియుం దెలియదు పో. పొండు అని మందలించి యవ్వలికిఁ బోయినది.

అని యెఱింగించి మణిసిద్ధుండు వేళయతిక్రమించుటయు నవ్వల కథ దరువాతమజిలీయందు జెప్పందొడంగెను.

## 145 వ మజిలీ.

### చిత్రసేనా రతిమంజరులకథ.

గురుఁ డెఱింగించిన శుభదివసంబున వేకువజాముననలేచి రతి మంజరి జలకమాడి ధవళమణిభూషాంబరంబులు ధరించి మాల్యాను లేపనాదివాసన నలుదెసల నావరింపఁ గైసేసికొని యక్కా! నా భాగ్య మెట్లున్నదియో తెలియదు భర్తనునిరూపించు సమయమగుచున్నది. ఇప్పుడపోయి వీధితలుపుతీసినతోడనే మనయాలుగుపైఁ దొలుతనెవ్వఁడు గనంబడునో వానినే ప్రాణేశ్వరునిగాఁదలంచి యీపుష్పదామంబు వానిమెడలో వైచెదను. అట్లే దేశికుం డుపదేశించెను.

మఱి నంబెవ్వరునులేనిచో నేమిసేయుదగినది. అనుదలికిన చిత్ర సేన చెల్లీ! మహాత్ములవచనముల కన్యథాత్వముండదు. సద్గోపనార్య ములగు వారిమాటలననుసరించిపోయిన మంగళములుచేకూరుకమూనక్క వేళయగుచున్నది? పదపద అనిచెప్పినది. ఆత్మౌత్సుక్యత్వముతో రతి

మంజరి మనుపమఝంకార ముఖరితంబగు మంజరీదామంబు హస్తంబు నంబూని యడుగులుతడఁబడ వీధిద్వారము దాపునకుంబోయి రెండు చేతులు జోడించుచు భగవంతుని ధ్యానించుచుఁ దలుపులనఁగవాటము లదెరచినది. అప్పటికిఁ జీకటు లంతరించినవి. దెసలు దెల్లబడుచుండెను.

క. మేలిజలతారు రతనపు
శాలువ నైఁ గప్పికొని లసన్ముఖతేజ
శ్శాలి యొక భూసురాత్మజుఁ
డాలోకోత్సవము జేసె నయ్యంగనకున్.

మనోహరరూపలక్షణంబులఁ బ్రకాశించు నవ్విప్రకుమారుఁ జూచి యపారసంతోషపారావారవీచికలం దేలియాడుచుఁ జంచల దృగంచలంబులతనిపైఁ బ్రసరింపఁజేసినది. ద్వారదేశంబున నిలువంబడి రెప్పవాల్పక తన్నీక్షించుచున్న యావంచలాక్షిం జూచి జగన్మోహనం బగు తద్రూపవైభవంబున కచ్చెరువందుచు నతండు

క. తరుణీరత్నమ ! యీమం
దిర మెవ్వరిదో వచింపు నేనప్పుణ్యా
కరుల యభిధానమును విని
మురిపంబందెదనటన్న ముసిముసినగవుల్.

నెలయింపుచు నన్నెలయాలిపట్టి పురుషోత్తమా ! యీయింటి వారు మీకేమియుపకారము జేసిరని పొగడుచుంటిరి? మీరెవ్వరు? ఇం దెప్పుడువచ్చితిరి? మీకులశీలనామంబులు వినిపింపుఁడు. పిమ్మట నీదివృత్తాంతము నెప్పెదనని పలికిన నప్పలుకుల కలరుచు నతండు.

సీ. పరమేశ్వరుని యాస్యపంకేరుహంబు సం
భవకారణంబు మావంగడంబు
సింధుశైలకన్యకాధీశ వాసంబు కా
శీపురంబనని మాకాపురంబు

దత్తకాములు బుధోత్తము లాద్యులును సహా
ధ్యాయులు మిత్త్రసత్తములు నాకు
నఖిలరాజాధిరాజాస్థానకవిశిఖా
మణులెల్లఁ బ్రతివాదిగణము నాకు

గీ. బ్రోవుచుంటిని నేనిప్డు భోజరాజ
రాజధానికిఁ గవిరాజ రంగభూమి
కంబుజాయతనేత్రి! నెయ్యమున నన్ను
గోణికాపుత్త్రుఁడంద్రు మత్కులజులెల్ల.

క. మాదత్తకునకు నీపుట
భేదన ముదయస్థలంబు ప్రియమని మాచేఁ
బైదలి! వచ్చితి రాతిరి
మోదించితి నిందు నిద్రఁబొంది సుఖముగాన్.

తెలియవా! తెలివరుల కోరులనడుగకయే ప్రవేశించి సుఖింప నిరవేసుపరిచిన యీభవనకర్తలు పుణ్యమూర్తులుగారే. వారిం గైవారంబుసేయరాదే నిన్నరాతిరి యదభ్రాభ్రఘోషభీషణంబై నాసారధారాపాతసంజాతవాత ప్రభూతంబై యొప్పు శీతోపద్రవంబు బోఁకార్పనీశరణంబు నాకుశరణంబయ్యె నీయాదంత మోకింగింపుము దీవించి యేగెదనని పలికినంత నాకాంతావతంసం బంసంబుల నెగసనైమమసం దువచ్చుచున్న చిత్రసేనునకుఁ బదియడుగు లెదురువోయి చిఱునగవ్వుంత్రో

ఉ. దత్తునిమిత్త్రుఁడంట విబుధప్రవర ప్రవిగీతభూరి వి
ద్వత్తముఁడంట పూతవసుధావిబుధాన్వయ జాతుఁడంట లో
కోత్తరరూపభాసురవయో రుచిరుండొకపండితోత్తముం
డుత్తరదేశవాసి యదియుండె గృహాంగణమందు చూసుమా.

వానిపేరు గోణికాపుత్త్రుఁడంట గురుకృపాపాత్త్రురాల నగుట నను కూలవాల్లభ్యంబు లభించినది నీవునచ్చి చూఁడి మాటాడుము అని చెప్పిన

విని దత్తకనామాకర్ణనంబునం బెద్దు పెరిగిన సంతోషముతో వచ్చి యచ్చోటం జూచినది. అతండప్పుడు నగుమొగముతో బోటీ! నా మాట కుత్తరంబిచ్చితివి కావు? ఈయుల్లెవ్వరిదని యడిగిన జిత్రసేన మందహాసముసేయుచు

క. అతను శరజాలధారా
హతులం బరితృప్తులైన యధ్వగుల మనో
రతుల నెతమాన్పు నియత
వ్రతుపీసదనాధిపతుల పత్రిపులనఘా.

ఈపైదలి మదీయసోదరీరత్నంబు అభీష్టవరలాభంబపేక్షించి యిం దువచ్చినది. ఈయుదయంబునం దొలుత సుముఖులగు మీముఖంబు జూచినది కాయసిద్ధి తప్పక పడయగలదు. దీనిఁబరిగ్రహింపుఁడు. అనిప లుకుచుఁ జెల్లెలికిఁ గనుసన్నఁజేయుటయు నగ్గజయాన సిగ్గువిడిచి దిగ్గునఁ దదంతికంబునకుంబోయి తుంటవిల్కాని తూపులననోపు క్రేఁగంటి చూపుల నతనింసూచుచుఁ జేతనున్న పుష్పమాలిక సవరించుచు

క. మాలిక యిది నాహృదయము
పోలిక మీఁదెంద మందుఁబోలు పొందెడు నా
కేలిక గైకొనిరతి నా
కేలికవగుమింక నాశ్రయింతుఁ గవీంద్రా.

అని పలుకుచు నాపూవుదండ నతనిమెడలో వైచినది. అప్పు డతండు విభ్రాంతస్వాంతుఁడై మోహహా! యీమోహనాంగి నీవే నాభర్తవని నామెడలో బుష్పదామంబువైచినది ఇది స్వప్నమా? సత్యమా? నామొగంబెఱుఁగని యిమ్మగువ యిట్లుచేయుటకుఁ గారణ మేమి? నేను మఱియొకండ ననుకొన్నదా? ఔరా? స్త్రీమోహమెంత వింతమైనది. దృఢంబగు నాయంతరంగంబు తరంగమువలెఁ జంచలిం చుచున్నదే. ఔను.

శ్లో. ఏతాశ్చలద్వలయ సంహతిమేఖలోద్ధ
ఝంకార నూపుర రవాహృత రాజహంస్యః।
కుర్వంతి కస్యచ మనోవివశం తరుణ్యో
విత్రస్త ముగ్ధహరిణీ సదృశైః కటాక్షైః॥

దివ్యాలంకారశోభితలై మనోహర రూపలక్షణలక్షితలగు నం బుజాక్షులు ముగ్ధహరిణీసదృక్షములగు కటాక్షములచే నీక్షించిన నెవ్వని మనము వివశముగాకుండెడిని? అని పండితులు సెప్పియున్నారు కాదా! అని యాలోచించుచుఁ జలించినహృదయమును గుదురుపర చుకొని అగుసగు దెలిసినది. ఇది వేశ్యాగృహమని శ్లేషోక్తులచే నా యోషామణి సూచించినదికాదా. వీరిరువురు వేశ్యాపుత్రికలు నాప టాటోపంబుజూచి కపటవిటోపచారములం జేయుచున్నారు? వీరి మాటలువినఁ జదివికొన్నవారివలె నున్నారు. కానిమ్ము అనితలంచి

శ్లో॥ ఛన్నకామ సుఖార్థాజ్ఞ స్వతంత్రా హంయు పండితాః
సక్తేవ రంజయే దాఢ్యా న్నిస్వా న్మాతాత్రి వివాసయేత్.

ఛన్నకాముఁడు సుఖార్థుఁడు. అజ్ఞుఁడు. స్వతంత్రుఁడు. అభిమాని నపుంసకుఁడు. ధనవంతులగు వీరిని, సక్తులవలెరంజింపఁజేసి ద్రవ్యమంతయు లాగివేసి దరిద్రులైనంత దల్లిచే లేవఁగొట్టింపవలయును. వినుము మీమణీ! ఇదిగదా? మీకులధర్మము నేను వారిలో నొక్కండనుంగాను మీకపటకృత్యములు నాకడ నుపయోగింపవు. మఱియొకసత్తు నాశ్రయించుకొనుఁడు మీరావించిన యపూర్వ సత్కారమున కానందించితి దీవించి యేగెదనని పలికిన విని రతిమంజరి లజ్జావిలోలనయనాంచలయై యాలోచింపుచుండఁ జిత్రసేన యిట్లనియె.

ఆర్యవర్యా! మేము వేశ్యాపుత్రికలమగుట వాస్తవమే? కులవృత్తి విసర్జించితిమి కులపాలికావృత్తి ననుష్ఠింపఁదలంచికొంటిమి. వినుండిది నాచెల్లెలు దీనికిరతిమంజరియని మాతల్లి పేరుపెట్టినది. నేఁటియున

యమున నీవేదికపైనున్నవానిఁ బతిగాఁజేసికొమ్మని దీనికొకదేశికుం డుపదేశించెను. తదీయపురాకృత సుకృతవిశేషంబునం జేసి మిమ్మింముఁ జూడఁగాంచినది. యభీష్టము ఫలించినది. మాకు మొదటనుండియుఁ బండితులఁ బతులగాఁ జేసికొనఁదలంపుగలిగియున్నది. మీరానతిచ్చిన మీమిత్రుఁడు దత్తకుఁడు నేను నొకబడిలోఁజదివికొంటిమి. ఆయనకుఁ జిన్నతనమునందే తల్లిచనిపోయినది. తండ్రియగు మాధురుండు దాను బెనుపలేక యొకయిల్లాలికిఁ బెంచుకొననిచ్చి యొందేని పోయెనట. అందులకే యాయనకాపేరువచ్చినదని యొకప్పుడు బడిలోఁ జెప్పికొనుచుండ వింటిని. పెంపుడుతల్లి వానినిఁజాల గారాముగాఁ బెనుచుచుఁ జదువులో మిగుల శ్రద్ధచేసినది.

నిత్యము బడివేళకు మాయింటికిఁ దీసికొనివచ్చుచుండునది. మే మిరువురము నాచిన్న త్రోపుడుబండిలోనెక్కి పాఠశాలకుఁ బోవుచుండుము మమ్ముఁజూచి రాచబిడ్డలవలెనుంటిమని చూపరులు మెచ్చుకొనుచుండిరి. దత్తుఁడు మిక్కిలి చక్కనివాఁడు నాకంటె రెండేండ్లు పెద్దవాఁడు. ఆయనను బావబావయనిపిలుచు దానను, నన్నుఁ బెండ్లామనిపిలుచుచు హాస్యములాడువాఁడు ఎప్పుడు కలిసి మెలిసి తిరుగువారము నేను వారింటికో యాయన మాయింటికో వచ్చుచుందుము. ఒకరి నొకరు చూడక క్షణమోర్వలేక పోవువారము.

ఆయన చిన్నబడివిడిచి పండితులయొద్ద శాస్త్రములు చదువుట కారంభించినతరువాత మాస్నేహమున కంతరాయము రాఁజొచ్చినది. అప్పుడు నూచెల్లెలు పినతల్లియొద్ద నుండుట వారిస్నేహము దానికిఁ గలిగినదికాదు. ఆయనఁ గాశికిబోవునప్పుడు నేను గ్రామములోలేను. తరువాతవచ్చి చాల విచారించితిని స్నేహమునకు దూరము లేదుగద నా స్వాంతమెప్పుడు వారిమీదనే యున్నది. నేనాయన పెండ్లియాడ నిశ్చయించుకొంటిని. మీరు దీనింబరిగ్రహించి మమ్ము వెంటఁ బెట్టికొని

పొందుము. మీయిద్దరికి మేము బరిచర్య సేయుచుందుము మాతల్లి మమ్ముఁ గులవృత్తిలోఁ బ్రవేశపెట్టఁ దలంచుచున్నది. మా కంగీకారములేదు.

శ్లో॥ జయంతితే సుకృతినో రససిద్ధాఃకవీశ్వరాః।
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయం.॥

కవీంద్రులకు మహారాజులు సాటిరారు. అట్టివారికి భార్యలగుట కంటె భాగ్యమేది? మా యభిమతము సెల్లింపుఁడని కోరినవిని గోణికాపుత్రుండు ముసిముసి నగవులు నగుచు నిట్లనియె.

చిత్రసేనా! నీవు మా దత్తునికి మిత్రురాలవగుట నాకును విస్రంభపాత్రురాలవైతివి. నీయుదంతమువిని సంతోషించితిని మఱియు దివ్యోపభోగయోగ్యంబులగు భాగ్యంబులువిడచి యాచ్ఞాలబ్ధ విభవులమగు మమ్మేల పరిగ్రహింపఁదలచుకొంటిరి? యీ సంకల్పము విరమింపుఁడు గుణాధికునివరించి యేకచారిణీ వృత్తంబునుబూని సుఖంపుఁడు మావెంటవచ్చి యిడుమలంబడ లేరని యించుక వైమనస్యంబు సూచించుటయు రతిమంజరి యతని పాదంబులంబడి.

చ. కపటపు వైశికోక్త విధికై వడి దుష్టలమంచు మమ్ము ని
ష్కృప విడనాడకయ్య పరికింపుము మాదగుచిత్తబుద్ధి మి
మ్మపరిమితానురాగరతనై వరియించితి భర్తగాఁగ ధీ
నిపుణ! పరిగ్రహింపుము వినీతగతిం బరిచర్య జేసెదన్.

అని ప్రార్థించి తల్లికినిఁ దమకుంజరిగిన సంవాదప్రకారం బంతయు నెఱింగించిన నాలించి యతండు తద్వాక్యంబులు సత్యంబులుగా నిశ్చయించి యంగీకారము సూచించె మఱియు

మ. సకలాలంకరణాభిరామ విలసత్సౌందర్య తేజోవిలా
సకళా శోభితమూర్తికన్య యభిలాషస్ఫూర్తి మోహించి కో
రికదెల్ప న్వలదంచు నాతఁడు నిరాకరింపఁగ గాంగేయుఁడా
శుకుఁడా? వాయుతనూజుఁడా స్మరవిదూషుండా? విరక్తుండగాన్.

అప్పుడంతులతని గంధమాల్యాను లేపనాదులచే నలంకరించి మహానందముతో మేడమీదికిఁ దీసికొనిపోయెను. అవ్వార్త పరిచారికలవలనఁ దెలిసికొని రతినూపుర కోపావేశమునఁ గూఁతుండ్ర దనచెంతకు రప్పించి యిట్లుమందలించినది.

ఉ. పుత్రికలార ! యేలయిటుపూనితి రక్కట? వంశధర్మ చా
రిత్రములెల్ల మీకు విపరీతములయ్యెనె? మేలుమేలు లో
కత్రియసన్నుతాకృతిఁ బ్రకాశిలు మీరిటు బోడిబాపలన్
బాత్రులటంచుఁ గైకొనిన బక్కన నవ్వరె విన్నవారిలన్.

గీ. తిరుగుఁ డిటుమీఁద నిల్లిల్లు తిటిపమెత్తు
నరుగఁ గలరిఁక మూసివాయనములందఁ
దినుఁడు తృప్తిగ శ్రాద్ధభోజనము లెపుడు
బోడిబాపనవారిఁ బెండ్లాడి మీరు.

అక్కటా! చక్రవర్తులకుఁ బ్రియురాండ్రఁగాఁ జేసి యింద్రభోగము లనుభవింపఁ జేయవలయునని తలంచికొంటి. మీనొసట బాపన దాసరులంబెండ్లియాడి ముష్టియెత్తికొనునట్లు సృష్టికర్త వ్రాసియుండ నేనెట్లుతప్పింతు? అయ్యయ్యో ! కులస్త్రీలు మనలంజూచి ముచ్చట పడుచుండ మీరు పెండ్లి పెండ్లియని పలవరించుచుంటిరేల ? ఇప్పు డెవ్వనినో మేడయెక్కించితిరట. వాని నిప్పుడే గెంటింతును జూడుఁడు ఆ గోచిపాతరాయనితో నంమ గూర్చుండి కులుకుచుమను కొనుచుంటిరి కాఁబోలు నిదియంతయు నాస్వార్జితము గడియ నిలువనీయను మీ నగలన్నియు నింకఁ బెట్టిపొండు నాయాజ్ఞోల్లంఘనమునకు సైరించు దానగానని మందలించినవిని యాసుందరు లలుక మొగంబునందోలక తల్లీ! నీ వెందఱి యిండ్లో కూలిచి సంపాదించిన ద్రవ్య మనుభవించుట మహాపాతకము. మేముదాని కాసింపము. ఇవిగో నీ నగలు. ఇవిగో నీ వస్త్రములు. అనిపలుకుచు నాక్షణము దానిముందటవైచి జల్తారుచీరలు

విడిచి సామాన్యపు పుట్టములు ధరించి తల్లితో మఱేమియుం జెప్పక మేడమీఁదికింబోయి గోణికాపుత్రునకత్తెఱంగంతయు నెఱింగించిరి.

అతండు వారి సాహసమునకు వెఱగుపడుచు సత్కృతుండై యాంగడికింబోయి వస్త్రమాల్యానులేపనాదులం గొనివచ్చి వారికిచ్చెను. నూత్నకుసుమమాలాలంకృతలై యక్కాంతలు వింతసోయగంబుసం బ్రకాశించిరి. నాఁటిరాత్రియే యాగణికాపుత్రికలు గోణికాపుత్రుని తోఁగూడ నొరులకుఁ దెలియకుండ బయలుదేరి ధారానగరాభిముఖముగా నడిచిరి.

అని యెఱింగించి యయ్యతిపంచాస్యుండు కాలాతీతమగుటయు నవ్వలికథ తదనంతరావసథంబున నిట్లు చెప్పందొడంగెను.

## 146 వ మజిలీ.

### —♦ మతంగయోగిని కథ. ♦—

గీ. అఱుతఁ గరములఁ జెవుల రుద్రాక్షమాలి
కలు వెలయ భూతిమైఁ బూఁతగా నలంది
దండకుండ్యజినంబులఁ దాల్చి సిద్ధ
రాలొకర్తుక కాషాయచేల కలిత

పాటలీపుత్రనగర రాజమార్గంబున బోవుచుండ నయ్యోగినిం జూచి సాష్టాంగమెరగువారును జేతులుజోడించువారును దాసోహమనువారును నోరసిల్లిపోవువారునై బ్రజలు తద్రూపాటోపంబు జూచి తపస్సిద్ధురాలని తలంచి వెనువెంటఁ బోవుచుండిరి.

ఆమె వారివారి నమస్కారములు మాత్రమందికొని యెవ్వరినంక జూడక యెవరితో మాటాడక తిన్నగా రతిమంజరయింటికిఁ బోయినది సంతతము వీణాగాన ముఖరితంబై యొప్పుచుండెడి యాయిల్లు నిశ్శబ్దంబై యుండుటకు వెఱగుపడుచు నాసిద్ధురాలు కాశీసీ నామస్మరణము గావించుచు లోపలికిఁబోయినది.

రతినూపుర మంచముపైఁబండికొనియామె రాకజూచి తటాలున మంచముడిగ్గి పాదంబులంబడి నమస్కరింపుచు శోకగద్గదస్వరముతో నశ్రువులచే బాదములు దడుపుచు దల్లీ ! నా కూఁతుండు నన్నువిడిచి లేచివెళ్ళెఁ. నాయవస్థ యేమిచెప్పుదునని విచారించుటయు నబ్బురపాటుతో వారునిన్నేల విడిచివెళ్ళిరి? యెక్కడికిఁబోయిరి? ఎఱింగింపుమనుటయు నదిబోడిబాపనవానిం దీసికొనిపోయిరని యావృత్తాంతమంతయుం జెప్పినది. ఆకథవిని యాయోగిని మనంబున నించుకవిన్నదనంబుదోప నొక్కింతసేపూరకుండి వారేదెసకుఁబోయిరో యెఱుంగుదువా ? అనియడిగిన నావేశ్య అమ్మా ! నేను గోపోద్రేకంబున నావిషయమేమియు విమర్శించితినికాను. ఏమూలకుఁబోయిరో నాకుఁ దెలియదని యుత్తరము జెప్పినది.

అప్పుడు యోగిని నిట్టూర్పునిగుడించుచు నోసీ ! నేనిప్పుడు నీకూఁతుండ్రఁ జక్రవర్తికి భార్యలంచేయు తలంపుతో వచ్చితిని. నారాకనిష్ఫలమైపోయినది. వినుము మహాపురనగరాధీశ్వరుఁడు విపులుఁడనురాజు నవరసరసికుఁడు తేజశ్శాలి రూపంబునమన్మధుఁడే యని చెప్పదగు. మార్గవశంబున నే నానగరంబునకుంబోయి రాజదర్శనము గావించితిని.

అతఁడు నన్ను భక్తిపూర్వకముగా నర్చించి మీయభీష్టమేమన్నియడిగెను. దేశపర్యటనమే మాకృత్యము నీసద్గుణంబులు జనులు బొగడవిని యుత్సుకత్వముతో నిన్నుఁ జూడవచ్చితి నాకేకోరికయులేదు. సజ్జనులేనాకు మిత్రులు నీరాజ్యమునాకుఁ బూజ్యముకాదు. నీసాధుత్వమునకు మెప్పువచ్చెనని స్తుతియించిన నతం డుబ్బుచు నన్నుఁగొన్ని దినంబులంనుండి సద్గోష్ఠి జేయుచుండుమని కోరికొనియెను.

నేనంగీకరించి యాఱుమాసములందుంటిని. అప్పుడప్పుడుపోయి యాతనికి మంచిమాటలు సెప్పుచుంటిని. అతనికిఁ జవ్వనయునకోలఁది పరిహాసవచనములు ప్రియలుచుండెను.

ఒకనాఁడతండు స్త్రీప్రశంసమీద దేవీ ! నీవు సర్వదేశములు తిరుగుచుందువు. సర్వావయవసుందరుల నిందుముఖుల నెందైనం జూచితివా ? కవివర్ణనమే కాని యట్టి స్త్రీలు లేరనియే నా యభిప్రాయమని యడిగిన నేనించుక యాలోచించి చిఱునగవుతో మహారాజా ! నాకీ ప్రసంగముతోఁ బనిలేదు కాని మీ రడిగితిరి కావునఁ జెప్పుచుంటి వినుండు పాటలీపుత్రనగరమున రతినూపురయను వేశ్యగలదు. దానికిద్దరు కూఁతుండ్రు. వారి యవయవములన్నియు మొలచినట్లు పోసినట్లు దిద్దినట్లున్నవి. చక్కదనం బొక్కటియే కాదు. సంగీతమో ? సరస్వతియైన నంతమాధుర్యముగా వీణఁ బాడలేదు. వారి సుగుణంబులు గణనాతీతములు విటులఁదుచ్ఛులుగాఁ జూచుచుందురు. అబ్బబ్బా ! ఆ లావణ్యము సురగరుడోరగాదిత్య విద్యాధరాది యువతులకు లేదని శ్లాఘింగాఁ జెప్పఁగలను. ఇప్పుడా లలనలు ముకిపెంపు పరువమున సానబట్టిన రత్నముల వలె మెఱయుచున్నారు.

నరేంద్రా! నేనవధూతనై నగుదుంగాక. చెప్పవలసినమాట జెప్పకమానను. నీకు వారు తగినవారు. వారికి నీవుదగుదువు. వారితో నిన్ను సంఘటించినప్పుడుగదా పరమేష్టినిఁ జతురాననుండని పొగడ దగినది. అని యూరక నీబిడ్డలఁ జక్కఁదనముం గొనియాడితిని.

నామాటలు విని యాభూకాంతుండు విస్మితస్వాంతుండై ఏమీ ? వారకాంతలే యంత చక్కనివారు! వారన్యాక్రాంతలైరా! లేదా? చెప్పుమనవుఁడు నేనిట్లంటి దేవా ! పరవశలైన [illegible] పుమీకడ నేమిటికి నుతింతును ?

వారిప్పటి కెవ్వరిని వరింపలేదు. సరిపడిన పురుషులు దొరకవలదా? గుణాధికులఁ గాని వరింపరు. అని చెప్పినవిని యామహీభర్త తటాలున లేచివచ్చి నా పాదంబులంబడి దేవీ ! నీవు యోగినివయ్యును

భోగినీ ప్రవృత్తులు లెస్సగా నెఱుంగుదువు ? వైరాగ్యంబునంగాక శృంగారంబునంగూడనీకభినివేశము గలిగియున్నది. మహాత్ములులోకోపకారమునకై పాటుపడుచుందురు. త్రికరణంబుల భూతప్రీతి గోరువారే యుత్తములు. నన్ను నీశిష్యునిగా భావించి యానించుఁబోఁడుల నాకుఁ బెండ్లిగావింపుము. నీయుపకార మెన్నటికి మఱువనని ప్రార్థించెను.

నాకు నీకూఁతుండ్రయందుఁగల యనురాగముచే గహీఁతకృత్యమైనను నౌత్యమున కనుమోదించితిని. తదామంత్రణంబు వడసి యిక్కడకుఁ బరమోత్సాహముతో వచ్చితిని. ఏమిలాభము ? నాప్రయాసమంతయు వ్యర్థమైనది. అని పలికిన రతిసూపుర, దేవీ! నాకూఁతుండ్రు దాసరులై యాహారం దిరుగునట్లు నొసట వ్రాసియుండఁ జక్రవర్తి కెట్లు భార్యలగుదురు? కోరికోరి చివరకు విభూతిరాయలఁ గోరిరి. అదియే నామనం బెటియుచున్నది, నేనేమిచేయుదును ? నీకు శక్తియుండిన వారిని వెదకిపట్టి తీసికొనివచ్చి యాతేనికిఁ గట్టిపెట్టుము. నీవు నిజముగాఁ దలంచినపనియేల కొనసాగకుండెడిని ? అని కోరిన విని యాయవధూత శిరఃకంపమున నంగీకారము సూచించుచుఁ గొన్నియానవాళ్ళు తీసికొని బయలుదేరి వారల జాడలు దెలిసికొనుచు గొన్నినాళ్ళు దేశసంచారము గావించినది. కాంతలు కనకమువంటివారు కాంతాకనకంబు లొంటిగా లభించెనేని యనుభవింపవలయునని యెట్టివారికిని బుద్ధిపుట్టక మానదు. అని తలఁచి గోణికాపుత్రుండా గణికానందనలఁ బురుషవేషమువైచి ధారానగరంబునకుఁ దీసికొనిపోవుచుండెను. మహాపురంబున నొకసత్రంబున వారు బసజేసియుండగా మతంగయోగిని యక్కడికి బోయి నలుమూలలు వెదకుచుండెను.

చిత్రసేన యామెంగురుతుపట్టి గోణికాపుత్రునితో నార్యా ! యీయోగిని యప్పుడప్పుడు మాయింటికి వచ్చుచుండునది. మాతల్లికి

షినెయందద్ జాలభయభక్తులు గలిగియున్నవి. ఆమె బంధనగా నిక్క
ణికి వచ్చినదేమో యని చెప్పిన నతండు నవ్వుచు నాయోగిని దెసకుఁ
బోయి దేవి ! నీవెవ్వరి నిమిత్తమిట్లు వెదకుచుంటివి? పని యేమనియ
డిగిన నామె బాబూ! మొన్న నీయూర రాజసభలో సంగీతము పాడిన
గాయకులిందున్నారని వింటిని. వారిం జూడవచ్చితి నెందున్నారో
చెప్పఁగలరా ? యని యడిగిన నతండిట్లనియె.

నీవు సంగవర్జితురాలవు. సంగీతము శృంగార రసదీపకము.
అట్టిగాన ప్రసక్తితోఁ నీకుఁ బనియేమి? వైరాగ్యప్రవృత్తికి ధర్మమా?
అని యడిగిన నామె చిఱునగవుతో బాబూ ! నాదబ్రహ్మము పరబ్ర
హ్మబోధకమైనది. సంగీతము వినుచుండ నాడెందము పరబ్రహ్మ
మందు లీనమగుచుండును. అందులకే నారదమహర్షి సంగీతప్రియుండ
య్యెను. నేను బుడమిఁగల గాయనగాయనీమణుల సంగీతములు పె
క్కులు వినియుంటిని. పాటలు వినుటకే నేను దేశాటనము చేయుచుం
టిని. ఈదేశాధిపతి విపులుఁడు సాయంసుఁ గురుభక్తిగలవాఁడు మొన్న
వారికడ వీరేమో పాడిరఁట. ఆగాన మతఁడూరక మెచ్చికొనుచు
న్నాడు. నేనప్పుడు గ్రామములో లేను నాతోఁ బెద్దగా వర్ణించి
చెప్పుచు వారీసత్రంబున నున్నారని యెఱింగింప నిందువచ్చితిని వారు
మీరేనా? అట్లైన నేను ధన్యురాలనే! ఇంచుకపాడి శ్రోత్రానందము
గావింతురా మిమ్ము దీవించి యేగెదనని కోరిన నతండు చిత్రసేనుంజీరి
కొంచెముసేపు పాడుమని సంజ్ఞజేసెను.

పురుషవేషముతోనున్న యాచిన్నది ముసి ముసి నగవులతో
వీణశ్రుతి వేసి తంత్రుల నాలపించుచు గంఠనాదముతోఁ గలిపి హాయి
గాఁ బాడినది. అప్పుడాయోగిని గంతులువైచుచు నోహోహాహా
ఎంతకాలమున కిట్టి సంగీతము వింటిని. నేఁటితో నాచెవుల తుప్పు
వాసినది. ఇట్టిసంగీతము పాటలీపుత్రనగరంబున రతినూపురపుత్రికలు

పాడుచుండ వింటిని. మఱియెక్కడ వినలేదు. ఇంత మనోహరముగాఁ బాడువారరుదు. అని స్తుతియించుచు మఱియొకపదము మఱియొకగీతము అనికోరుచు, నత్తన్వి పాడుచుండ శిరఃకంపను చేయుచు నాలించినది. అప్పుడు గోణికాపుత్రుడు సాక్షేపముగా నవఘూతా ! నీచిత్తము పరబ్రహ్మయత్తమైనదా? తురీయానంద మనుభవించితివా? ఇఁక చాలునా? అని యడిగిన నామె బాబూ! నేనెన్నినాళ్ళు వినినను వినఁగలను, ఇందులకు నాకుఁదృప్తి లేదు. నిద్రాహారములు విడిచి వినగలను. అనుటయు నతఁడు నవ్వుచు నీవు వినఁగలవుగాని పాడువారికి నోపిక యుండవలదా? ఇప్పుడు వేదాంతివిగదా యని యితఁడుపాడెను గాని యిఁక యూరకపాడఁడు విత్తముజూపినంగాని వీణ విప్పడు ఇఁక నీదారిని నీవుబొమ్ము. అనుటయు నామె యిట్లనియె.

బాబూ ! నేనోరుల నెప్పుడు కష్టపెట్టను నానిమిత్తమె పాడ నక్కరలేదు. మీరు పాడినప్పుడే విని యానందించెద మీతోవచ్చుట కంగీకరింతురా? అనిన నతండు నీవు మాతో రావలదు. నీదారిని నీవు బొమ్ము. నీవు యోగినివి మేము భోగులము అని కచ్చితముగా నుత్తరము జెప్పెను.

అప్పుడా యోగిని యించుకసిగ్గుపడుచు దిగ్గున విపులునొద్దకుఁ బోయి మహారాజా ! వాండ్రు రతినూపురపుత్రికలే. పురుషవేషములు వైచి తీసికొనిపోవుచున్నాఁడు. ఆబ్రాహ్మణుఁడు కడుగడుసు వాఁడు. నన్నుఁ దమతోరావద్దని నిరసించెను. పాపము రతినూపుర యిరువురఁ గూతుండ్రను మీకిచ్చుటకు సిద్ధముగానున్నది. ఇప్పుడు మనముచే యందగినపని యేమని యడిగిన విపులుండిట్లనియె.

దేవీ ! నీవు వారింగలసికొని పురుషుఁడువినకుండ మదీయప్రార్థనవిద్యాలీలానులఁబొగడి కార్యమెఱింగించి తీసికొనిరమ్ము. నీవు చెప్పిన దప్పకవత్తురనియే నాభిప్రాయము రానినాఁడు వేరొక తెరు వాలో

చింతము నీవన్నిటం బ్రౌఢురాలవు. నీకు మేము చెప్పనక్కరలేదు కార్య భారము నీదేయనిపలుకుచు దారిభత్యముసకని కొన్నిదీనారము లామె చేతిలోఁబెట్టి చేయవలసినకృత్యములు బోధించి యంపెను.

గోణికాపుత్రుం డాయూరువిడిచి దేశవిశేషంబులఁ జూచుచు మెల్లగాఁబోవుచుండుటంబట్టి పదిదినములలో నొకగ్రామములో నా యోగినీ వారింగలిసికొనినది. అతండామెను బల్కరింపక మూరుమొగ ము వెట్టుటయు నామెయే విద్వాంసుడా! నాపైనీకుఁగోపమా? నే నేమిపాపము జేసితిని. తలఁచితలఁచి నిలువలేక క్రిమ్మర మీపాటవిను టకై వచ్చితిని. ఒక్కసారిపాడింపవా? అనుటయు నతండు నీకేమియుఁ బనిపాటలులేవు ఎవ్వరోయింతభిక్షమిడినఁదృప్తిగాభుజింతువు. సంగీతము విన కేమిచేయుదువు? పో. పొమ్ము. ఇందుపాడువారులేరని గద్దించి పలికిన నలుగక యామె బాబూ! నీవు నన్నుఁదిట్టినను నొప్పుకొందు కొట్టినను నంగీకరింతు. పాడించినంజాలని బలుకుచు వారినివిడువక వెనువెంటఁదిరుఁగుచుండెను. ఒకనాఁడు గోణికాపుత్రుఁ డెందోపోయి న నాయవకాశము కనుపెట్టి యాయోగిని వారితో నేకాంతముగా నిట్లనియె.

బిడ్డలారా! మిమ్ము నేను గురుతుపట్టితిని. మీరు రతిసూపుర పుత్రికలు. మీరుగన్నొమ్మెఅంగివచ్చితిరి. మీనిమిత్తము మీతల్లిమంచము పట్టినది పెద్దదానినేడిపించుట మీకుఁదగదు. అది యట్లుండె మీకొక శుభోదర్కమెఱింగింపవచ్చితిని. వినుండు విపులుఁడను మహారాజుకడ మీవిద్యారూపశీలాదులఁ బొగడితిని అతండు మిమ్ము జేపట్టుటకు సిద్ధ ముగానున్నాఁడు అతనియైశ్వర్యమంతయు మీయధీనము చేయఁగలఁడు నాతోరండు మిమ్మతనితోఁ గలిపెద. ఈముష్టిపాటునివెంటఁ బడితిరేల? ఇదియేటియూహా! అనిపలికిన విని చిత్రసేన చురచురంజూచుచునిట్లనియె.

ఓసీ! దుష్టయోగినీ! ఇదియా? నీవేదాంతము! వేషమునకే

యవధూతవా ? రాజునొద్ద దారుపుకత్తెవై తిరుగుచుంటివా? చాలు చాలు ఇఁకనీతోమాటాడఁ దగినదానవుకావు. ఛీ. పొమ్ము రతినూపుర యెవ్వతె? విపులుఁడెవ్వఁడు? మేము నీవనికొనినవారముకాము భ్రమసితివి నీదారిని నీవుబొమ్ము. మాకవిఁపుస్సినికి నీపైఁ గోపముపెద్ద. నీగుణమతఁడప్పుడే గ్రహించెను. ఈమాటవిన్న నిన్ను శిక్షించునని పలికినఁ దెలతెలపోవుచుఁ బూఁబోఁడులారా ! మీసుఖముగోరి యిట్లంటి మీకిష్టము లేకున్నఁ బోనిండు నాకేల ? కాని మీరు చేయుచున్నపని చాలతప్పుపని వినుండు తల్లికిఁదెలియకుండ దాని యాస్తియంతయు దొంగిలించుకొని మారువేషములువైచికొని యొకబాపనయ్యను దగులుకొని పోవుచున్నారు. మీరు దండనార్హులు. మీతల్లి రాజునొద్ద మీపైనభియోగము దెచ్చినది మిమ్ముఁగట్టించి బలవంతమున దీసికొనిపోయెదఁ జూడుఁడు అని బెదరించుచు నాయోగినియేగినది. చిత్రసేన గోణికాపుత్రుండు వచ్చినతరువాత యోగిని యాడినమాటలన్నియుం జెప్పినది.

అతండాలోచించి మనమిఁక నీదేశము విడిచిపోవలయును. విపులుఁడు మిమ్మువలచియున్నాఁడు కామాంధులు యుక్తాయుక్తశూన్యులు. ఏమిచేసినం జేయఁగలరు. అని పలుకుచు నిలుకడమాని హుటాహుటి పైనంబులు సాగింపుచుండెను.

ఒకనాఁడు చిత్రసేన వేశ్యాజనప్రవృత్తిని గర్హించుచు మాకులములో సద్గుణంబులచేఁ బేరుపొందినసుందరు లెవ్వఁరైనం జనించిరా? యని ప్రస్తావవశంబున నడిగిన గోణికాపుత్రుండు నవ్వుచు మీరుపుట్ట లేదా ! మీకన్ననుత్తము లెవ్వరనిపలికిన నక్కలికి చాలుచాలు మామాటయే చెప్పవలయునా పరిహాసమాడక నిజముచెప్పుఁడని ప్రార్థించిన నతండు చింతామణియను వేశ్య లీలాశుకుండను బ్రాహ్మణుని భర్తగా వరించి ముక్తినొందినకథ జగద్విఖ్యాతమైయున్నది మీరు విన

లేదా? అని నొడివిన సప్పడఁతి యక్కథ మేమె ఱుఁగ మెట్టిదో చెప్పుఁ డని కోరిన నతండిట్లు చెప్పెను.

అని యొఱింగించి

## 147 వ మజిలీ.

### చింతామణికథ.

గీ. కలదు చింతామణీ నామకలిత లలిత
రూపయౌవన శీల విద్యాపరీత
యనవగతపాప గణికాన్వయ ప్రదీప
యపహసితభోగ సువిరాగ యాప్రియాగ.

గీ. చదివినది చాలశృంగార శతకములను
తెలిసినది కామతంత్ర ప్రదీపికలను
అరసినది సత్కళారహస్యములఁ బెక్కు
కాంత పరువమొకింతయై గ్రమ్మినపుడ.

వైశికప్రయోగ ప్రకారమంతయుం బఠించినదైనను చింతామణి పూర్వజన్మవాసనా విశేషంబునం జేసి దుష్ట విటజాలంబులఁ దజ్జాలంబునఁ దృప్తిఁబొంది యౌవనోదయంబున నేకచారిణీవ్రతంబనుష్ఠింపందలంచి యనుకూల ప్రియాన్వేషణ తత్పరయై యున్నంత.

గీ. సకలవేదపురాణశాస్త్ర ప్రవీణ
ధీవిసర్జితగురుఁడు వర్ధితయశుండు
శ్రోత్రియుఁడు కృష్ణమిశ్రుఁడన్ సోమయాజి
కాపురముసేయు నాప్రయాగమున మున్ను.

ఆహితునకు నడివయసున నొక కుమారుం డుదయించె మారసదృశుండగు వాని యాకారలక్షణంబు లుపలక్షించి సంతసించుచు నతండు శ్రీశుకుండు విలాసార్థమై జన్మించెనను నర్థంబు సూచింప నాశిశువునకు లీలాశుకుండను నామకరణము గావించెను. అయ్యభిఖ్య

విహారకీరార్థ ప్రబోధకంబులునై యొప్పాటుంజేసి తదాశయంబున కన్య ధాత్వంబు సంఘటిల్లినది.

కృష్ణమిశ్రుఁడు చిరకాల జనితుండగు నాకుమారు నపారప్రీతి పూర్వకముగాఁ బెనుచుచు మహావిద్వాంసునిజేయు తలంపుతో యుక్త కాలంబున వానిఁజదువనేసి యొజ్జలనింటికి రప్పించి విద్యజెప్పించుచుండెను. ఆబాలున కాటలయందుఁగల యాసక్తి చదువునందుఁ గుదిరినదికాదు.

లీలాశుకుండు మిక్కిలి చక్కనివాఁడు బ్రహ్మతేజము వాని మొగమునందొలుకుచుండును. ఎట్లైన వానికి విద్యాగంధమంటింప నుత్సహించి తండ్రి వాఁడాడుకొనుచుండఁ బుస్తకంబులఁ గైకొని వెను వెంట దిరుగుచు గురువులచే విద్యగఱపించుచుండెను. యముఁడు కృతాకృతంబుల విచారింపఁడుగదా! ఆబాలునకుఁ బండ్రెండేఁడులు నిండకమున్నె కృష్ణమిశ్రు నాత్మీయనగరాశ్రయుం గావించుకొనియెను.

తండ్రి కాలధర్మంబు నొందినపిదప లీలాశుకు నదలించువారు లేమింజేసి యప్పటికి చదివిన చదువెంతయో యంతటితోనే సమాప్తమైనది. అతండు శృంగారలీలల నెఱుంగుటకై కావ్య నాటకాలంకార గ్రంథముల విమర్శింపుచుండును. మఱియు

సీ. సొగటాలపాళి హెచ్చుగనాడునే ప్రొద్దు
చదరంగమాడ రచ్చలకుఁబోవు
పెండేసి పెద్దయై పెనఁగెడుఁ జెడుగుడి
కోడిపందెముల నెక్కుడు ప్రచారి
బంతులాటకు మేలుబంతియై తగుఁబన్ని
దములఁ గాకితము లెత్తడుములాడు
గోతికొమ్మచ్చులఁ గొమ్మదాసరి మొన
గాఁడు జూదరులకు వాఁడనంగ

గీ. గొర్కె-వేసుక కాండ్రతోఁ గూడికొనుచు
నిల్లువాకిలి విడిచి తానెపుడు వేసు
కలకుఁ గ్రీడకు వాదవాదలఁ జరించు
శైశవానంతరమున లీలాశుకుండు.

కులాచారంబు మట్టువెట్టి దురాచారంబులకు లోనై లీలాశుకుండు విటనటగాయకాదులు మిత్రులై వర్తింప నాయూరిలో నంత యాకతాయ లేడని పేరుపొంది తిరుగుచుండ మఱిరెండేఁడులు గతించినంత వాని మాతయు మృత్యుదేవత వాఁతంబడినది. ఎప్పటికేని యిల్లు చేరిన మందలించు తల్లియుం గడతేరిన నడ్డుచెప్పువారు లేక నతండు మఱియుఁ గొడెకాండ్రంగూడి సంచరింపుచుండ ననినయనిధానమగు యౌవన మతనిమేనఁ బూర్ణముగా నావేశించినది.

గీ. అద్దమున నాత్మముఖబింబ మరసి వేడ్క-
తోడ నూనూగు మీసాల దువ్వికొనుచు
మొగము చిట్లించి కనుబొమ్మ లెగరవైచు
మరుఁడు తనకీడుగాడని మదిఁదలంచు.

పెద్దల ప్రసిద్ధివిని పిల్లనిత్తుమని యెవ్వరైన వచ్చినచో విరక్తుండుపోలె వారికిట్లు సమాధానము జెప్పును.

సీ. దుష్టసంసార పాథోధిముంపఁగఁ బద
స్థగితమౌ పెద్దప్రస్తరము పత్ని
భవకూపమునఁ గూలఁబడఁ దోయదిగియంగఁ
గట్టిన కన్నులగంత కాంత
సంసృతిగహన సంచారంబునకు దారి
గానీయని యంధకార మింతి
భవ బంధనాగార పాతంబునకుఁ గాళ్ళ
ఘటియించు మేటిశృంఖల నెలంత

గీ. ఆలు లేకున్న లేదపత్యం బపత్య
రహితుఁడే సంగరహితుండు మహి ననక్త
చిత్తుని సుఖంబె సుఖము చర్చింపఁ గానఁ
జానఁ బెండ్లాడి పొరటిల్లఁజాల నేను.

గీ. కామముడిపికొనఁగ గణికలు లేరొకో
కడుపుచిచ్చు మాన్పఁగా ధరిత్రి
వంటపూటి యింటివారుండఁ బెండిలి
యాడి పెద్దగొడవ గూడనేల ?

అని పలుకుచు విసర్జితదార పరిగ్రహుండై లీలాశుకుండు చిత్తానువర్తులగు మిత్రులం గూడికొని యప్పురంబునంగల వారాంగనల గుణదోష తారతమ్యంబులు నిరూపించుచు

సీ. తారావళి సురూపతా రాజితయె కాని
తాటక బాబురో దానితల్లి
నాగరత్నము చూపునకు రూపసియె కాని
సరసకళా విలాసములు లేవు
కనకాచలంబు యౌవనముబింకమె కాని
లలితసౌందర్య పేలవము లేదు
పూఁబోఁడి చాతుర్యపుం బొమ్మయే కాని
కపటవర్తనల టక్కరిపిసాళి

గీ. పేరుపొందిన వారశృంగారవతుల
కేదియో లోటుగలదెన్న నిప్పురమున
నల్ల చింతామణీవారిజాస్య వేశ్య
పిద్ద చింతామణి యటంచుఁ జెప్పనొప్పు.

ఉ. దానికి దల్లి లేదు విటతండముఁబీలిచి పిప్పి జేయ వి
జ్ఞాన కళాపరిపూర్ణ విలసద్ఘనచిత్త స్వతంత్రురాలు ప్రి

జ్ఞానయ భాసమాన బుధసన్నుత సంపదమానదేవతా
నీనమనోనిధాన సురధేను సమానసుదాన చూడఁగన్.

క. గుణవంతురాలు చింతా
మణి జాతికివేశ్యగాని మహితజ్ఞాన
పరిణతమతి యనుచు నెల్లరు
గుణుతింతురు ద్రవిణసక్తగాదది మఱియున్

దానియందు వేశ్యాధర్మంబొక్కండును లేదు. విస్రంభపాత్రురాలు. దానిఁగళత్రంబుగా స్వీకరింపవలయునని హితులతో నాలోచించి లీలాశుకుండొకనాఁడు సాయంకాలంబున లలితాంబర మాల్యగంధాలంకారంబులం బట్టించుకొని దానియింటికింజని ముందుఁ దన కులశీలమర్యాదలం దెలుప మిత్రులనియోగించుటయు వారు లోపలికింజని చింతామణింజూచి యిట్లనిరి.

క. లీలాశుకుఁడను బ్రాహ్మణ
బాలుఁడు నినుఁగోరి వచ్చె బహుధనవిద్యా
శీలవయో రుచిరుండతఁ
డేలికొనుము వాని గృహసమేతముగ సఖీ.

గీ. తల్లిదండ్రులులేరన్న దమ్ములితర
బంధువులులేరు లేదర్ధభాగభార్య
యందఱును నీవయైవాని నాదరింప
వలయుఁ దద్ధన మెల్ల నీవశముజేయు.

తద్రూపాతిశయంబు సూచి నీపేమెచ్చుకొందువు. నీవాకిటనిలిచియున్నవాఁడని యెఱిఁగించిన నాలించి యగ్గణికామణి యంతకుమున్న యాచిన్నవాని యుదంతంబు వినియున్నదగుట నంగీకారము సూచించినది. వారుపోయి యాతనిందీసికొనివచ్చుటయు వాని యందంబు డెందంబున మెచ్చికొనుచులేచి కొన్నియడుగు లెదురుపోయి నమస్క

రించి సగౌరవంబుగా దోడ్తెచ్చి పర్యంకోపవిష్టుం గావించి యుపచారంబులఁ జేయుచుండె. అంపుల కతండానందించుచు తానుదెచ్చిన కనకమణి భూషాంబరాదు లొసంగి తన యాశయంబెఱింగించుటయు నమ్మించుఁబోఁడి గొన్ని నిబంధనలం గోరికొనినది. అతండియ్యకొని శుభముహూర్తంబున కన్నెఱికము గావించెను.

క. ఇదిపగ లిది రాతిరియని
మదిఁదెలియక యెల్లపనులు మఱచి సదాయ
మ్మదవతి సదనము వదలక
మదనక్రీడలనె బ్రహ్మానందముగ నెంచున్.

శ్లో॥ సంసారే పటలాంతతోయ తరళే సారం యదేకం పరం
యస్యాయంచ సమగ్ర ఏషవిషయగ్రామప్రపంచో మతః।
తత్సౌఖ్యం పరతత్వ వేదనమహానందోపమం మందధీః
కో వావిందతి సూక్ష్మమన్మథకళా వైచిత్ర్యమూఢో జనః

లీలాశుకుండు చింతామణితోఁగూడఁ దత్వజ్ఞానానందముతో సమముగు మన్మథకలావైదగ్ధ్యసౌఖ్యం బనుభవింపుచు స్నానసంధ్యాది కర్మముల విసర్జించి తదధ్యాసన ధ్యానములవలనఁ దృప్తిఁబొందక సంతతము తనమనంబందే లగ్నంబైయుండ నొండుదెలియక చింతామణి నారాధింపుచుండెను. చింతామణియు వేలయాలైనను జ్ఞానవతి యగుట లీలాశుకుఁడు తనయెడఁ బ్రకటించు మోహాతిరేకంబున కచ్చెరువందుచు స్నేహమునకుం దగిన ప్రీతింజూపుచుఁద్రికరణంబుల నతనినే ప్రధానపురుషునిగా నెంచుకొనుచు నతని యాస్తియంతయుఁ దనవశము చేసికొనియు బ్రాహ్మణ ద్రవ్యంబని తాననుభవింపక దాఁచి విహితముగా నేకచారిణీ వృత్తమునఁ దదీయచిత్తంబు సంతోషాయత్తంబు గావింపుచుండెను.

ఒక యేకాదశినాఁడు చింతామణి ప్రాంతమునందలి విష్ణ్వాలయ

మునఁ బురాణము సెప్పుచుండ నరిగి శ్రద్ధాభక్తి పూర్వకముగా నాలింపుచుండె నంత.

శ్లో॥ శ్రాద్ధాత్పరతరం నాస్తి శ్రేయస్కర ముదాహృతం ।
నసంతి పితరశ్చేతి కృత్వా మనశి యో నరః ॥
శ్రాద్ధం నకురుతే తత్ర తస్యరక్తం పిబంతితే ॥

సూ॥ పిత్ర్యాన్ యజేత పితృభ్యోదద్యాత్ ॥

క. పితరులఁ గొలువంగాఁదగు
బితరుల కీయంగవలయుఁ బిండోదకముల్
పితృసేవ కన్నఁబరము
వ్రతమిలలేదొకటి శుభకరంబు తలంపన్.

క. పితరులు లేనేలేరని
మతిఁదలఁచుచు నాబ్దికంబు మానునొ యెవఁడా
కితపుని రక్తము పితృచే
వతలా త్రింబిల్తు రతి పిపాస దలిర్పన్.

గీ. తల్లిదండ్రుల మృత తిథిధర్మబుద్ధి
బ్రాహ్మణార్చనసేయని బాలిశుండు
వర్ణితుండగు జీవచ్ఛవంబటంచు
కల్మషములంటు వాని మొగంబు గనిన.

అని పౌరాణికుండు జెప్పిన విని చింతామణి డెందంబున నేదియో విచారం బుదయింప నల్లన యింటికింబోయి తననిమిత్తమై వాకిటఁ గాచికొనియున్న లీలాశుకుంగాంచి హస్తగ్రహణము సేసి లోనికిం దీసికొనిపోయి పర్యంకోపవిష్టుం గావించి యతని మొగంబున వేఁడిచూపులు వ్యాపింపఁజేయుచు నిట్లనియె.

చిం—లీలాశుకా! నీవుతలిదండ్రుల యాబ్దికములు బెట్టుచుంటివా?

లీలా—ఇప్పుడామాట నడుగుటకుఁ గారణమేమి?

చిం—కారణముగలిగియే యడిగితిని. పెట్టుచుంటివా? లేదా?

లీలా—నాలుగైదు వత్సరములనుండి పెట్టుటలేదు.

చింతా—ఎందువలన?

లీలా—తీరికలేక

చింతా—అయ్యయ్యో! నీకుఁ దద్దినము పెట్టుటకే తీరుబడి లేకపోయినదా?

లీలా—నీవు చూచుచుండలేదా భోజనముచేయు సమయముఁ దక్క తక్కిన కాలమెల్ల నీయొద్దనేకాదా వసియించుచుంటిని?

చింతా—నాయొద్దకువచ్చినదిమొదలు మానివేసితివికాఁబోలు

లీలా—అవును.

చింతా—హరి హరీ! యెంత పాపాత్మురాలనైతిని. నీవును నేనుంగూడ రౌరవములో వసియింపదగినదే!

లీలా—నేఁడు పురాణములో విన్నమాట లివియామేమి?

చింతా—అవును. ఈమాటలేవింటిని. తద్దినముమానినవాఁడు మహాపాపాత్ముఁడంట జీవచ్ఛవమంట వాని మొగముజూచిన పాపము వచ్చునంట.

లీలా—ఇదియా నీకుఁగలిగిన భయము. చాలుఁజాలు. ఇవి మా బాపనయ్యలు విత్తములాగుటకై వ్రాసిన వ్రాఁతలు.

చింతా—నీ వంటి మహానుభావములు పుట్టుటచేఁ గులగౌరవ ముగూడ చెడిపోవఁగలదు. ఏటిమాటలాడెదవు?

లీలా—ఆరిన దీపమునకుఁ జమురువోసిన నెంతలాభమో మృతునకుఁ దద్దినము పెట్టుటయు నట్టిదే.

చింతా—నాస్తికవాదములు నా కంగీకారములుకావు నీ కా తిథులెప్పుడో తెలియునా?

లీలా—ఇప్పుడు జ్ఞాపకములేదు.

చింతా—నీకుఁగాక మఱియెవ్వరికైనం దెలియునా ?

లీలా—కొన్నిదినములు పెట్టించెఁగావున మా పురోహితునకు జ్ఞాపకముండవచ్చును.

చింతా—ఆయనను రేపు సూర్యోదయము కాకపూర్వ మిక్కడికిఁ దీసికొనిరావలయును. అంతవఱకు నీతో మాటాడను. అని పెడమోము పెట్టుకొని పోయి వేరొకగదిలోఁ బండుకొనినది. లీలాశుకుండును

క. ఎక్కడి హరివాసరమిది
యెక్కడి పౌరాణికోక్తియిది నాకయయో?
యెక్కడ వచ్చెను విఘ్నము
చక్కెర విలుకాని కేళిసలుపక యుండన్.

గీ. తద్దినము బెట్టమంచు నీముద్దుగుమ్మ
నన్ను వేపునుగాఁబోలు నిన్నదీని
గుడికిఁ బోనిచ్చుటయెతప్పు విడువదింక
జేసినందాక తన్నిష్ఠ మాసిపోను.

అని విచారించుచు నెట్టకే తెల్లవారినంత నతండతిరయంబునఁ బురోహితు నింటికిం బోయి బ్రతిమాలికొని వెంటనే యతని నావాల్గంటి యింటికిం దీసికొనివచ్చెను. చింతామణి బురోహితునికి నమస్కరించుచుఁ గూర్చుండఁజేసి అయ్యా! మీలోఁదద్దినము పెట్టనివాని కేమిశిక్ష విధింతురని యడిగిన నతండు వానిం గులములో వెలివేయుదురు వాని సహపంక్తి బ్రాహ్మణుండెవ్వఁడు భుజింపఁడని చెప్పిన నావేశ్య మీశిష్యుండట్టి పనిచేయుచుండ నేమిటికి మందలించితిరికారు? శిష్యుని పాపము గురునంటునని యెఱుంగరా? అని యడిగినఁ బురోహితుండు తరుణీ! అతండు నాకుఁ గనంబడి మూఁడేండ్లైనది. తద్దినము పెట్టుచున్నాడో లేదో యెవ్వరికిఁ దెలియును? వాఁడు నీయధీనములో నుండెం

గావున నాపాపము నీకుఁ జెందునని పరిహాసమాడెను.

అప్పుడుచింతామణి పశ్చాత్తాపముగాంచుచు నతనితలిదండ్రుల తిథులెప్పుడని యడుగుటయు నతండు పది దినములలోఁ దండ్రితిథియు మూఁడుమాసములలోఁ దల్లితిథియు వచ్చునని నిరూపించిచెప్పెను. ఆతిథులువ్రాసికొని చింతామణి పురోహితునితో అయ్యా! గతమునకు నేమియుం జేయఁజాలము. మాలీలాశుకునిచేతఁ దప్పక తద్దినముపెట్టింప వలయును. సరిపడినద్రవ్యమిప్పుడే యిచ్చుచున్నాను. యథావిధిగా జరిగింపుఁడు లోపమేమియు రానీయవలదని ప్రార్థించినఁబురోహితుండు సంతసించుచు నాఁడు చేయవలసిన నియమములన్నియుం దెలిపి వలసినంత ద్రవ్యము దీసికొని దానిం దీవించుచు నింటికింబోయెను.

పిమ్మటఁ జింతామణి లీలాశుకుంజూచి చిఱునగవుతోఁ బురోహితునిమాటలు వింటిరిగదా? ఆబ్దికంబునకుఁ బూర్వాపరదివసంబులు నాబ్దికమునాఁడును మూఁడునాళ్ళు మీరు మాయింటికి రాఁగూడదు. కడు నియమముగా నుండవలయు జ్ఞాపకముంచుకొనవలయుననిపలికిన నతం డిట్లనియె.

అమ్మయ్యో? మూఁడుదినములు నిన్నుఁజూడక తాళఁగలనా? నాతండ్రితద్దినము నేను బెట్టెదనోలేనో చెప్పలేనుకాని వెంటనేనీవు నా తద్దినముపెట్టింతువని చెప్పఁగలను. ఆబ్దికముమానినదోసము నిన్నంటుటసంశయముకాని బ్రహ్మహత్యాదోషము తప్పకనిన్నంటఁగలదు. అని వికటముగాఁబలికెను. ఆవిషయమిరువురకుఁ బెద్దసంవాదము జరగినది.

చివర కతనిచేఁ దద్దినమునాఁడుమాత్రము రానని యొప్పించునప్పటికిఁబ్రొద్దుక యుపవాసము చేయవలసివచ్చినది. గండమునకు వెరచినట్లాబ్దికము సమీపించినకొలఁది యతండు దిగులు పడుచుండెను. పూర్వదివస నియమ మాచార్యుని కప్పగించెను, పరదివస నియమము భోక్తల కర్పింపఁదలంచెను,

నాఁడు కోడి కూసినది మొదలు చింతామణి లీలాశుకుని లేపుటకుఁ బ్రారంభించినది. ఊ. ఉ. అనిమూల్గుటయేకాని యతండు సూర్యోదయమైన గడియవఱకు లేవనేలేదు. అదిపోదునగా లేచి దంతధావనాది నిత్యకృత్యములు దీర్చికొనునప్పటికి జాముప్రొద్దెక్కినది. అప్పుడు చింతామణి కోపదృష్టితో నీవు తండ్రికడుపు చెడఁబుట్టితివి? నీతండ్రి యుత్తమశ్రోత్రియుఁడఁట. ఎంత జెప్పినను వివేకము గలుగదేమి? ఉదయముననే స్నానము సేయవలయునఁట పదిగంటలైనది. దంతధావనమేలేదు. కడుపులోఁ బుట్టవలయుంగాని చెప్పినబుద్ధి యేమాత్రమునిలుచును. అదిగో పురోహితుఁడు బాలునంపినాడు. వంటయైనదఁట పదపద. అని నిర్బంధించిపలుకగా నెట్టకేయువస్త్రము వైచుకొని చేతంగఱ్ఱబూని పాదరక్షలలోఁ గాళ్ళుపెట్టి చింతామణీ యిదిగో పోవుచున్నాను కోపము సేయుకుము అనిపలుకుచు బయలుదేరినంత నాకాంతవానిచెంతకువచ్చి విప్రకుమారా! నేను జెప్పినమాటలు జ్ఞాపకమున్నవియా! నేఁడు మాయింటికి రావలదుసుమీ? వత్తువేని నీమొగమెన్నఁడును జూడను. జ్ఞాపకముంచుకొమ్మనిపలికి సాగనంపినది. అతండు కొంతదూరముపోయి యేదియోమఱచితినని మరలవచ్చి యచ్చిగురాకుఁబోడింజూచి పల్కరించుటయు నిలువనీయక పదపద ప్రొద్దెక్కినదని గెంటితలుపువైచినది.

వెనుక వెనుక తిరిగిచూచుచు బలవంతమున మెరకకుఁబోవు ప్రవాహమునలెఁ బురోహితునింటికరిగెను. అతం డతనినిమిత్తమై యెదురుచూచుచుండెను. అయ్యో! నీతండ్రి యాహితాగ్నిహోమము లెక్కువగాఁ జేయవలసియున్నది. ఇంత ప్రొద్దెక్కించితివేమి? భోక్తలు వచ్చి రెండుగడియలైనది ఎప్పటికిఁదేలును? అని పలికినవిని లీలాశుకుండు గురువరా? మంత్రములో నేమియునులేవు. తంత్రిమాచార్యకల్పితము బ్రాహ్మణులుభుజించినంజాలు నీవులెస్సగాఁ బెట్టించితివని చింతా

మణితో, జెప్పెదనులే? వేగము నెరవేర్పుమని బ్రతిమాలికొనుచు నూతియొద్దనే స్నానము జేసి యమంత్రకముగా నర్చించి భోక్తలచేతిలో నాపోశనమ నడ్డించెను. చింతామణిచే దక్షిణ యధికముగా నీయఁబడుటచే భోక్తలు మిక్కిలి యానందముతో భుజించిరి. భోజనానంతరము భోక్తలకు దక్షిణతాంబూలాదులు పురోహితుఁడే యిచ్చి సత్కరించెను.

తరువాత లీలాశుకుండు పదినిమిషములలో భోజనముచేసి పురోహితుని వీధియరుగుమీఁదఁ గూర్చుండి యిట్లు ధ్యానించెను. అయ్యో నేఁడెట్లు ప్రొద్దుగ్రుంకును? ఎట్లుతెల్లవారును? చింతామణి మొగము చూడక యింతకాలమెట్లు సహింతును. దానింజూచి యుగాంతరము లైనట్లున్నది. అక్కటా? నాపాలిటి కీతద్దినమెక్కడ వచ్చినది? ఆనాఁడు పాడుపురాణము వినకపోయినను దానికీసంకల్పము పుట్టక పోవును. అని యనేకప్రకారములఁ జింతించుచుఁ గొంతసేపందువసించి యట్టెలేచి దాని యింటిదెసఁకుబోయి దూరముగా నిలువంబడి యావంక జూచుచుండెను.

అంతలో సాయంకాలమైనది. చీఁకటిబలిసినకొలఁది వానికి పరితాపమధికమగుచుండెను. ఆయావీధుల సంగడులవెంటఁ దిరుగుచు నారాత్రి పదిగడియలెట్లో వేగించెను. క్రమంబున వానికివిరహవేదన దుర్భరమైనది. మనంబున ననేక సంకల్పములుదయించినవి. ఏదో తెంపుచేసికొని తటాలునలేచి పురోహితునింటికిం బోయి వంటకంబుల గొన్నియడిగి మూటగట్టుకొని తిన్నగాఁ జింతామణియింటికిం బోయెను.

ఆయింటితలుపులన్నియు మూయఁబడి యున్నవి. పరిజనుల దాదుల సఖురాండ్రఁ బేరుబెట్టి పెద్దయెలుంగునంబిలిచెను. ఎవ్వరును మాటాడిరికారు. అప్పుడతండు మిక్కిలి యుద్రేకముతో నాయింటి చుట్టును ముమ్మారుతిరిగి పెరటిలో బసువులసాల కలిసియుండుట దెలిసికొని యదిపరీక్షించిచూచెను. అప్పుడొక తెల్లత్రాచు చూరెలుకల

భక్షించుటకై గోడనంటి చూరుపెండకై యెగఁబ్రాకుచుండెను. అది యతనికంటికి వ్రేలాడఁగట్టిన తెల్లనిజనపనారత్రాడువలెఁ గనుపట్టెను రజ్జుసర్పభ్రాంతికిమారుగా నిక్కడసర్పరజ్జుభ్రాంతి గలిగినది. తత్వవేత్త చిత్తమాత్మయందే లగ్నమై తదితరమెట్లుంగ నట్లాలీలాశుకుని హృదయంబు చింతామణియందే వ్యాపించియున్నది. అతనికి సర్వము చింతామణివలెనే కనంబడుచున్నది.

తనకొఱకుభగవంతుఁ డాత్రాడు వ్రేలాడఁగట్టించెనని సంతసించుచు నతండు వంటకములమూట నడుమునకుబిగించి యాసరోప్తిత్తరకాయంబు రెండుచేతులంబట్టుకొని కాళ్ళు గోడకుబిగియఁజన్ని రివ్వున పైకెగిరి యెలిసి యెక్కి లోపలధుమికెను.

ఆనిడుపని యొడలునలిగి సగముతెగి యతనిచేతికివచ్చినది. అతండది విమర్శింపక యందుఁబారవైచెను. ఉత్తరకాయము తెగిపోయినను నాభుజగము పెండెనంటిపట్టికొని బొటబొట రక్తముగారుచుండ నట్లె వ్రేలాడుచుండెను. తోకతెగినను పెండెపట్టువదలినదికా దాపామెంతగట్టిదియో చూడుఁడు.

తనకట్టినగుడ్డలు మఱకలగుటయుఁ గనుపెట్టక యాజన్మికట్టు కామాంధుఁడై లోపలియావరణములన్నియు నతిక్రమించి తిన్నగాఁ జింతామణిబండుకొనియున్న లీలామందిరమున కరిగెను.

అప్పుడావారకాంత తల్పాంతరమునఁ బండుకొని నిద్రబోక లీలాశుకుని మోహాతిశయమును గుఱించి వితర్కింపుచుండెను.

లీలాశుకుండు మెల్లగాఁబోయి దానిమంచముదాపున నిలువంబడియెను. ఆచిగురుఁబోఁడి హటాత్తుగాఁజూచి యట్టెలేచి ఛీ! ఛీ! నీచా! నీచెడుగుబుద్ధి వదలితివికావు? నీకుఁ దలుపులెవ్వరుతీసిరి? లోపల కెట్లువచ్చితివి? నీకుఁ జెప్పినబుద్ధులన్నియు నేగంగ గలిపితివి? యెక్కరాత్రియేతాళలేవా? రేపెక్కడికిఁ బోవుదును కుట్టులబొం

తకై యింత నలవంతయేమిటికి ? ఇదిమోహముగాదు. పాతకవ్యాహము. నీకతంబున నేనుగూడ నిరయంబు బొరయవలసివచ్చును. అని యూరక నిందించుచుండ దానిపాదంబులకు శిరంబుసోక మ్రొక్కుచు నిట్లనియె.

చింతామణీ ! నీవన్నమాటలన్నియు జ్ఞాపకమున్నవి. నాస్వాంతమెంతబలవంతమున మరలించుకొందమన్నను మరలినదికాదు. నేనేమి చేయుదును. నీపాదములతోడు. వేయుచెప్పను. నీమొగము చూడక యఱనిమిషము తాళజాల. చంపినంజంపుమని పలికిన యాకలికి వెడగు నవ్వొదవ వెఱ్ఱిపాఱుఁడా! నీకింతమోహమేల కలుగవలయు. వస్తుతత్వము విచారింపకున్నావు. పో. అవ్వలిగదిలోఁ బండికొనుమని మందలించుటయు నతండు.

చింతామణీ ! నీకొఱకిదిగో పిండివంటకములు దీసికొనివచ్చితిని. ఇందాక నానోటికొక్కటియు రుచించినదికాదు. నీవుతినిన నా మనసు చల్లఁబడును. భక్షింపుమని పలుకుచు నామూటవిప్పి దానిముందరబెట్టి దీపము వెలుగునఁ దానికిఁ జూపించెను.

చింతామణి యా వెల్తురున మూటయందును బుట్టమునందును రక్తపుమఱకలుచూచి అబ్బురపాటుతో అయ్యో ? యీరక్తమెట్లు వచ్చినది ? ఇందుఁబాముకూసపు శకలములున్నవేమి ? అని యడుగుచుండ నతండు విమర్శించి చూచి అగునగు తెలిసినది గోడప్రక్కను వ్రేలాడుచున్నది త్రాడనుకొంటిని. త్రాచుపాము కాఁబోలు. మెత్తగా నుండుటచే సంకోచమందితిని యాత్రొందరలోఁ బరిశీలింపలేదు. అని చెప్పుటయుఁ జింతామణి యురముపైఁ జేయివైచుకొని అక్కటా? అది పగపట్టి కఱచినదేమో? యెక్కడనో చూపుమని దీపముదీసికొని బయలుదేరినది.

అతండాకలికి నెలిసి యొద్దకుఁ దీసికొనిపోయె. బొటబొట రక్తము గారుచుండ నాసర్పము పూర్వకాయమట్లే వ్రేలాడుచుండెను.

దానిం బ్రాడనుకొని యూతగాఁబూని యెలిసి దిగివచ్చితినని యతం డెఱింగించెను. అప్పుడా మోహనాంగి కనేకోహలు జనించినవి. మాని స్పషీ యూహా? కామాంధుల కేమియుఁ గనంబడ దన్నమాట సత్యము నాయుపచారములచే వీని తగులము బలముగుచున్నది. వీని కీజన్మమున వివేకము గలుగదు. ఆజ్యముఁబోసిన నగ్ని చల్లారునా? వీని మూలమున నేనుగూడఁ జెడిపోవుచుంటినని ధ్యానించుచుండ నతండు

సీ. చచ్చినది పాము గాత్రంబు సగము తెగుట
నంపులకుఁ జాతపడెదేల ? యంబుజాస్య
రమ్ము లోపలికేద విచారమ్ము మాని
పుష్పశరకేలి నాకు సమ్మోదమిమ్ము.

ఆమాటవిని యాబోఁటి యేమియుమాటాడక తటాలున మరలి లోపలకిఁ బోవుచుండ నతండు వెంట నడుచుచు వాల్గంటీ ! కోపము వచ్చినదా? నేనేమిచేయుదును. నాసంతాపమట్లున్నది. నీవుపేక్షించితి వేని యీరాత్రిశరీరము నిలువదు. అని యడ్డమువచ్చి పాదంబులంబట్టి బ్రతిమాలికొనుటయు నది పదపద తల్పంబునం గూర్చుండుము. స్నానముచేసి వచ్చెదననిబలికి యయ్యువతి యవ్వలికి బోయినది.

లీలాశుకుండును సంతసముతోఁ గేళీమందిరమున కఱిగి పర్యంకమునఁ గూరుచుండి యాతురతతో నిమిషము యుగమువలెఁ దలఁచుచు దానిరాక నీక్షించుచుండె నప్పుడు.

ఉ. నాసనలుప్పతిల్లఁ జెలువంబగు తళ్కు జనింప మేచునం
బూసిన యంగరాగమది వోవఁగ బూడిదరాచికొంచు సం
త్రాసముపుట్ట నెంముకలురంబున వ్రేలఁగ నెల్లవస్తువుల్
దీసి దిగంబరత్న వికృతిం బ్రకటింపుచుఁ గాత్రమయ్యెడన్.

వికృతరూపముతో వచ్చి యతనియెదుట నిలువంబడి

క. లీలాశుక ! ఇటుచూడుము
హేలా లీలావిలస లెట్లున్నవో కో

తోలుం బొమ్మకు నవరం
ధ్రాలుంగల దానికింత తహతహ యేలా ?

గీ. మది విచారింపుమయ్య మర్మములనెఱిఁగి
వస్తుతత్వంబు దెలిసినవానికిట్టి
మోహమేటికిఁ గల్గెడు పొలఁతులకును
లో లొటారంబు బయటఁ దళ్కులునుగాను.

క. మలమూత్ర పూరితంబై
తలఁపనరోచకము జేయుఁ తనువిదిమాయా
బలమున విడువని మోహము
గలిగించుం దెలియ దోలుకట్టియకాదే.

కరుణించి విరించి మేదో మాంస రుధిరాస్థిపుంజమునకుఁ బైన మృదువగు నీచర్మముంగప్పెను కాని, కానిచో నీ మేనసంతతము స్రవించెడు నెత్తురుంబీల్ప మూఁగికొను కాకగృధ్రంబులఁ దోలికొన లేక దేహధారులు క్లేశబాహుళ్యంబు చెందకుందురా! నీవిట్టియపవిత్ర గాత్రంబు చరిత్రంబు దెలియక మూఢుండవై ధాత్రీసురకర్మముల వీటి బుచ్చి యిహాముత్రఫలంబుల తెరువెఱుంగక భ్రష్టుండవై పోవుచుంటివి ఇప్పటికైనం బుద్ధిదెచ్చుకొని దేహతత్వంబెఱింగి కామంబుడిపికొని భగవంతు నారాధింపుమని పలుకుటయు బురాకృత సుకృత వాసనా విశేషంబునం జేసి యప్పలుకులతనిచెవుల కమృతబిందువులవలె సోకి మనోగతంబగు కామసంకటంబును గ్రసియించుటయు నతండయ్యం గన యంగకంబులు సవితర్కంబుగాఁ బరిశీలించి యసహ్యంబు జని యింప నుమియుచు గన్నులు మూసికొని తటాలునలేచి దల్పంబుడిగ్గ నుఱికి యగ్గణికారత్నంబు పాదంబులంబడి

శా. తల్లీ ! నీకు నమస్కరింతు నిదిగో తథ్యంబు నీసూక్తులం
జల్లారెన్ స్మరతాపమెల్లఁ గడు నాశ్చర్యంబుగా బుద్ధి భా

స్లిల న్నెమలినంబు చూపితివి సీ. సీ. తుచ్ఛభోగమ్ము లే
నొల్లన్ నీదయసంఘటిల్లెను సుబోధోత్సాహవై రాగ్యముల్.

సీ. అతివరో! మోహతోయధి మునింగెడునన్ను
తెప్పవై తెప్పునం దేల్చినావు
కాంతరో! నిరయ లోకద్వారమును జేరు
నను మరల్చితి స్వర్భువనము దెసకుం
గాఢాంధకార భీకరమగు నామది
వెలిగించితివి జ్ఞాన వితతదీప్తి
గ్రుడ్డినై చెడుత్రోవ గూడిపోం గనులిచ్చి
లేపిచక్కని త్రోవంజూపినావు.

గీ. అహహా? నీవంటియాప్తుం డెందైనంగలండె
తల్లివైనను గురువైన దైవమైన
నీవె నాకింక నేంటితో నీకునాకు
వదలెంగాముక సంబంధవిధివశూట!

క. నిను జ్ఞానవంతురాలని
వినుతించెడు జనులమాట విననైతిం దమిన్
గనుగొంటి నేండునీమే
ధను జూపుము నాకునొక్కదారిం గృపాకర్న.

అని ప్రార్థించిన విని చింతామణి యత్యంత సంతోషభూషిత స్వాంతయై యోహో? మత్సంకల్పాచు గుణ్యముగా నేండు వీనికి విరక్తి గలిగినది. యుపదేశించుటకిదియ సమయమని తలంచి.

ఆ. కలండునాకు గురువు గంగాతటంబున
జపము జేసికొనెను సంతతంబు
ఆతనికడకుంబోయి యడుగుము ముక్తికిం
దెరువెఱుంగం జెప్పుం దెల్లముగను.

సోమగిరియనుపేర నొప్పారు నయ్యతీశ్వరుం డాపన్నరక్షకుండ గుట నీకుమ్మ్యాలించెదు సతనిచరణంబులుశరణంబులుగా వేడికొనుము ఇప్పుడపొమ్మని యుపదేశించి గురుతులెఱింగించుటయు లీలాశుకుండు మఱుమాటపలుకక చింతామణిపాదంబులు కన్నులకద్దికొనుచు నాక్షణమునందే త్రివేణికరిగి యయ్యతిపతిని వెదకిపట్టుకొని పాదంబులంబడి ప్రణమిల్లుచు నిట్లనియె.

సీ. పరిభవించితిని భూసురవర్యాన్వయంబున
విశ్రుతుండగుకృష్ణమిశ్రునకును
చదివితి వేదశాస్త్రపురాణముల బాల్య
మునను త్తమాచార్యముఖముగాఁగ
నిరసించితి విరక్తిఁబఱిణయం బాడంగ
గార్హస్థ్యధర్మ మక్రమమటంచుఁ
జేపట్టితిని పుష్పచాప చాపలమున
జింతామణీ వారకాంత సతిగ
గీ. తదుపదేశప్రభావ జాతప్రబోధఁ
దుచ్ఛభోగేచ్ఛ హేయమై తోప నిప్పు
డాశ్రయింపఁగవచ్చితినయ్య! తావ
కాంఘ్రిపద్మద్వయంబు దయానిధాన.

అని తనయుదంతమంతయు నెఱింగించినవిని యమ్మహాయోగి తద్వివేకోదయంబునకుఁ బురాకృతంబకారణంబని నిశ్చయించినవ్యక్త భక్తిపరిసక్తంబగు మహామంత్రిబొంబుపదేశించి శ్రద్ధాలుండవై దీనిం జపింపుము కృతార్థుండవయ్యెదవని యానతిచ్చుటయు లీలాశుకుండా మంత్రమునకుఁ జింతామణియనుపేరుపెట్టి గట్టిపట్టున గంగాతీరంబునం గూర్చుండి నిద్రాహారములుమాని తదేకదీక్షగా నామంత్రంబుజపించు చుండె మఱియు

క. పది దినములలో లోకా
స్పదఁడా పరమాత్మ నాకుఁబ్రత్యక్షుండై
ముదమొదవింపకయున్నఁ
వదలెద బ్రాణముల దేహవాసనపోవన్.

అనికృతనిశ్చయుండై జపించుచుండ దశదివసావసానంబున భక్త సులభుండగు నాజగదీశ్వరుండు

గీ. శిఖినెమలిపింఛ మొప్పంగఁజిన్నిబొజ్జ
బసిఁడిగజ్జెలమొలత్రాడు మిసిమిజూప
మురళి బాడుచు నల్లనిముద్దుబాలుఁ
డొకఁడు జనుదెంచి యాతనినికటమునకు.

పదకటంబులు ఘల్లుమనిమ్రోయ నృత్యంబుగావించుచువచ్చి లీలాశుకుని చెవులో మురళీనాదామృతము జొనుపుటయు నతండదరిపడి కన్నులట్టెదెరచి కురంగట నెవ్వరింగానక మరలఁగన్నుల మూయుటయు నాలీలాబాలకశిఖామణి యతనిచెంత బలువింతలఁ జూపుచుండెను.

అప్పుడాలీలాశుకునకు, బ్రాక్తనజన్మాభ్యస్తములగు విద్యలన్నియుఁ గంఠస్థమ్ములగుటయు భక్తివివశుండై నిరంకుశకవితాఘోరశచేఁదనమ్రోలనిలచి యనేకలీలలగనుపరచుచున్న ముద్దుకృష్ణుని యాకారంబు కనంబడిన విధంబువర్ణించుచు నాలుగువందలశ్లోకములురచించి స్తుతియించెను. వానికే శ్రీకృష్ణకర్ణామృతములనిపేరు.

తనకుఁదొలుత నాలీలాకిశోరంబు దర్శనమిచ్చినతోడనే యీక్రిందశ్లోకమును రచించెను.

శ్లో॥ చింతామణి ర్జయతు సోమగిరిర్గురుర్మే
శిక్షాగురుశ్చభగవాన్ శిఖిపింఛమౌళిః
యత్పాదకల్పతరు పల్లవశేఖరేషు
లీలాస్వయంవర రసం లభతేజయశ్రీః.

చింతామణి యుపదేశంబునఁదనకు భగవంతుని దర్శనమైనదని సంతసించుచు మొట్టమొదటఁ జింతామణినే స్మరించి యామహానుభావురాలు సర్వోత్కృష్టురాలై యుండుగావుత అని కొనియాడెను. తరువాత మంత్రోపదేశము గావించిన సోమగిరి యతీశ్వరునిఁ దలచెను. అటుపిమ్మటఁ దనకుఁగనంబడిన శిఖిపింఛమౌళిని శ్రీకృష్ణు నభినందించె తనకు దర్శనమిచ్చి కన్నులందెరచి చూచినంత సదృశ్యుఁడైన శ్రీకృష్ణుని గుఱించి యీశ్లోకమురచించె.

శ్లో. పునః ప్రసన్నేన ముఖేందుతేజసా
పురోవతీర్ణస్య కృపామహాంబుధేః।
తదేవ లీలా మురళీరవామృతం
సమాధి విఘ్నాయ కదాను మే భవేత్.

ముఖచంద్రచంద్రికలు ప్రసన్నములై యొప్ప నాముంగల నిలిచిన దయాసముద్రుండగు నాలీలాడింభకుఁడు వెండియు మురళీరవామృతముచే నాతపోవిఘ్న మెప్పుడు గావించునోయని పొగడెను. మఱియు లీలాశుకుండు శైవుండై విష్ణుభక్తినిరతుండై నట్లీక్రిందిశ్లోకము వలనఁ దెలియఁబడుచున్నది.

శ్లో. శైవా వయంనఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం తథాపి।
చేతో మదీయ మతసీ కుసుమావభాస
స్మేరాననం స్మరతి గోపవధూకిశోరం.॥

మేము పంచాక్షరీజపపరులైన శైవులమైనను నాచిత్తము గోపకుమారునియందే వ్యాపించుచున్నదిగదా అని చెప్పుకొనెను.

శ్లో. శంభో ! స్వాగత మాస్యతా మిత ఇతో వామేన పద్మాసన
క్రౌంచారే కుశలం సుఖం సురపతె విత్తేశ నోదృశ్యతె
ఇత్థం స్వప్నగతస్య కైటభజితః శ్రుత్వా యశోదా గిరః
కిం కిం బాలక జల్పసీతి రచితం ధూధూకృతం పాతునః.

శంకరా! నీకుస్వాగతమా విరించీ! నీవీ యెడమప్రక్కను గూర్చుండుము కుమారస్వామి! కుశలమా ఇంద్రా! సుఖముగానుంటివా? కుబేరా! కనిపించుటలేదేమి? అని శ్రీకృష్ణుండు నిద్రలోఁ బలుకుచుండఁ బలవరింతలను గొని యశోద ధు. ధు. అని బలికినది.

శ్లో. కాళిందీ పులినోదరేషు ముసలీ యావ ద్గతః ఖేలితుం
తావ త్కార్పరికం పయః పిబ హరేవర్ధిష్యతే తేశిఖా।
ఇద్ధం బాలతయా ప్రతారణపరాః శ్రుత్వా యశోదాగిరః
పాయాన్న స్వశిఖాం స్పృశన్ ప్రముదితః క్షీరేర్ధపీతేహరిః.

వత్సా! మనబలరాముఁడు ఆడుటకై కాళిందీతటమున కెంతలోఁ బోవునో ఆలోపల నీవీగిన్నెలోని పాలన్నియుఁ ద్రాగితివేని నీజుట్టు రెండుబార లెదుగునని తల్లిపలుకగా గిన్నిలో పాలు సగముత్రాగి జుట్టెదిగినదేమోయని చూచుకొను శ్రీకృష్ణుఁడు నన్నురక్షించుగాక.

శ్లో. పీఠే। పీఠనిషణ్ణబాలకగళే తిష్ఠన్ సగోపాలకః
యత్రాంతస్థితదుగ్ధ భాండ మవకృష్యాచ్ఛాద్య ఘంటారవం।
వక్త్రోపాంతకృతాంజలిః కృతశిరః కంపంపిబన్యఃపయః
పాయాదాగతగోపికానయన యోగం డూషపూతాలంకృత్

ఒకపీటపై మఱియొక ముక్కాలుపీటవైచి యందొక బాలకుని నిలువఁబెట్టి వానిమెడమీఁద నిలువంబడి యుట్టికిఁగట్టిన గంటమోగకుండ నానిపట్టి దుగ్ధభాండమువంచి తలద్రిప్పుచుఁ బాలుగ్రోలుచుండ నింతలో గోపికవచ్చి యదలింపబోవుటయు దానిగన్నులు గనంబడకుండ నోఁటిలోనిపాలు దానికన్నులలోఁ గండూషముజేసి పారిపోయి నబాలుఁడు నన్ను రక్షించుఁగాక.

శ్లో. రామోనామ బభూవ హుం తదబలా సీతేతి హుం తౌ పితు
ర్వాచా పంచవటీ తటె విచరత స్తస్యాహరద్రావణః।
నిద్రార్థం జననీ కథా మితిహరే హుంకారతశ్శృణ్వతః
సౌమిత్రె క్వ ధనుర్ధనుర్ధను రితివ్య గ్రాగిరః పాతునః॥

శ్లో॥ శాంతేన ముగ్ధ చపలేన విలోకనేన
మన్మానసే కిమపి చాపలముద్వహంతం
లోలేన లోచన రసాయన మీక్షణేన
లీలాకిశోర ముపగూహితు మత్సుకోస్మి.

అని యెఱింగించి తదనంతరచరిత్రము పై మజిలీయందుఁ జెప్పుచుండెను.

## 147 వ మజిలీ.

### —అగ్నిశిఖునికథ.—

చిత్రసేనా! చింతామణీ సదుపదేశంబునం గాదే లీలాశుకుండు పరమభక్తాగ్రేసరుండై శ్రీకృష్ణదయాపాత్రుండయ్యె నక్కాంత కులకాంతాతిశయనయస్ఫూర్తిఁ బేర్వొందినది సౌశీల్యంబు సహజంబు గాని కులానుగతంబుగాదని యెఱింగించినవిని చిత్రసేన పరమానంద భరితహృదయయై మహాత్మా! చింతామణి యుదంతము మిక్కిలి సంతసము గలుగఁజేసినది. మఱియు లీలాశుకుండు విరక్తుండై యరిగిన తరువాతఁ జింతామణి యెట్లు ప్రవర్తించినది ? వారిరువురు మఱల నెన్నఁడైనఁ గలిసికొనిరా? తదనంతర వృత్తాంత మాలింప వేడుకయగుచున్నది. వివరింతురే? యని యడిగిన నప్పుడమివేల్పిట్లనియె.

బాలా! లీలాశుకుండు మహాభక్తుండైన పిమ్మటఁ దిరుగాఁ జింతామణి యింటికిరాలేదు. చింతామణియు నతండుత్తమవ్రతుండై భగవంతు నారాధించుచుండెనని విని సంతసించుచుఁ దన్నుఁజూచి యతండు చాంచల్యమందు నేమోయని యెన్నఁడు నతని దాపునకుఁ బోయినదికాదు. మఱియులీలాశుకునకు విరక్తి గలుగఁ జేయఁదలంపుతో నాటిరాత్రి వేసిన వేసమే వేసముగా తిరుగా దివ్యమణిభూషాంబరాదుల ధరింపలేదు. మేనికి నాఁడుబూసినబూడిదయే బలపరచి కాషాయాంబర ధారిణియై ప్రాగ్భవప్రబోధోద్భావంబునఁ దనయాస్తియం

తయు సద్గిసాత్కృతముగా వించినాఁడు. సుతసువిరక్తుఁడై క్రుమ్మరుచుండెను

అగ్నిశిఖుండను యతీశ్వరుఁడా ప్రయాగమున వ్యాసమఠము లోవసించి కుతపకాలమందనుక గంగాజలంబులఁ దపంబు జేసికొనుచుఁ బిమ్మట మఠమునకువచ్చి కందమూలాదులు దిని యాఁకలి యడంచు కొనుచు నాత్మావలోకనమునఁ గాలము గడుపుచుండెను. చింతామణి యొకనాఁడా యోగిచెంతకుఁబోయి పాదంబులంబడి మహాత్మా ! నాకు విజ్ఞాన ప్రవృత్తి యెఱిఁగింపుఁడని వేడుకొనునది బాహ్య ప్రచారము లేనివాఁడగుట నతనికి దానిమాట వినంబడలేదు. తనమనంబున ధ్యానించుచున్న విషయానుగుణ్యముగా.

శ్లో. యాం తేమతిస్సాగతిః.

అని చదివెను. ఆశ్లోకమువిని చింతామణి మహాత్మా ! నేను జ్ఞానాతీతమైన విజ్ఞానప్రవృత్తి యెట్టిదో యెఱింగింపుఁడని కోరఁగాం టిని. దేహాంతమందు మనసెట్టి గతి ననుసరించునో యట్టి గతివచ్చునని యుత్తరము చెప్పితిరి? నాప్రశ్నమున కీయుత్తరము సరిపడలేదు లెస్సగా విచారించి సదుపదేశము గావింపుఁడని వేడికొనినది. ఆమాటయు నయ్యతికి వినంబడలేదు. తనతలంపున

శ్లో. ప్రారబ్ధంభోగతో నశ్యేత్.

అను శ్లోకపాదమును చదివెను. అప్పుడవ్వారాంగన అయ్యో ఈ మాటలు వాడుకగా నందఱు చెప్పుకొనునవియే ఇవి నాకుఁ గ్రొత్తలుకావు. విధింపఁబడిన కర్మఫలం బనుభవమూలమునఁగాని నశింపదు. అతీతజ్ఞాన ప్రకారం బెఱింగింపవలయుఁగాని సామాన్య వాక్యములు నాకవసరములేదని పలికినది. దానియునికియు మాటలుం గూడ నతండెఱుంగఁడు తానేదియో మనంబున ధ్యానించుచు

శ్లో. బుద్ధిఃకర్మానుసారిణీ

అని మఱలఁ జదివెను. అప్పుడు చింతామణి అయ్యాగారూ !

మీమాటలలో నొకదాని కొకటి సందర్భముగాలేదు. నామాట విను పించుకొనకుంటిరా ? మీరు విజ్ఞానసంపన్నులని విని మీవలన నతీత జ్ఞానవిశేషం బెఱుంగు తలంపుతో వచ్చితిని. మీరు సామాన్యులు చెప్పుమాటలే చెప్పుచుంటిరి ? తగుసమాధానము చెప్పుడని ప్రార్థించినది. అదియేమియు నతండెరుంగక కన్నులు మూసికొనియె.

శ్లో. యోగినాంభోగినామపి

అని చదివినంతం జింతామణి యయ్యతి తన్నవమానించెనని యభిమానము జెందినది. తోడనే క్రోధోదయమైనది. అసూయ దానింబెని వైచికొనియె. యుండుంగదా ? నిర్మలమైన చింతామణి చిత్తమును గ్రోధాదులు స్వాయత్తమును జేసికొనినవి. ఎట్లైన నయ్యతీశ్వరుని వంచింపవలయునని యన్నెలంతకు సంకల్పము జనించి మఱి పల్కరింపక యింటికింబోయినది.

ఉ. దానము ధర్మముల్ జపము తర్పణముల్ శుచివృత్తి స్నానసం
ధ్యానియమంబు లెన్నియయినం బొనరింపంగ వచ్చుగాని వి
ద్యానిధులైన యోగయుతులైన మహామునులైన జన్మలో
మానసమంటియున్న యభిమానము వీడంగలేరు ధారుణిన్.

## —♦ మాతంగునికథ. ♦—

ఆప్రయాగమున కుత్తరముగా గ్రోశదూరములో నొక మాలపల్లెకలదు. అందు మాతంగుఁడను పుల్కసుఁడు మాలినియనుభార్యతోఁ గాపురముచేయుచుండెను. వాఁడు నిత్యము సూర్యోదయ కాలమున గంగలోమునిఁగి రవిబింబమునకు మ్రొక్కి యింటికివచ్చి పట్టెవర్ధనములుపెట్టి తనగుడిసెలో నొకమూలవేదికపై దేవతగా నిలిపియున్న మట్టి విగ్రహమును బూజించి పిమ్మటఁ గులవృత్తిజేసికొనుచుండును.

వాని పెండ్లాము మాలినియు వాని చిత్తవృత్తి ననుసరించి నిత్యము శుచిగా వాఁడు గంగకుఁబోయి వచ్చులోపల గుడిసెయుఁ

జుట్టువేదికయు నలికి ముగ్గులు పెట్టుచుండును. కోడి, కుక్క, పంది లోనగు నీచజంతువుల నాప్రాంతము చేరకుండఁ గాపాడుచుండును. పంచములలో సంతానశూన్యులుండుట యరుదు. ఆపల్లెలో మాతంగుఁ డొక్కఁడే యనపత్యుఁడు ఒకనాడు మాలిని మగనితో నాథా! మన కులము వారందఱికి సంతతి పూర్తిగాఁ గలిగియున్నది. ఇందు మనమే బిడ్డలులేనివారము. నీవు కులవిరుద్ధముగా స్నానము జపము పూజలు సేయుచుండుటచేఁ బిల్లలు గలుగలేదని యెల్లరు చెప్పికొనుచున్నారు. తండ్రితాత లెఱుంగని యీనియమంబులు మనకేల? ఇదిబెడిసికొట్టిన దేమో మానివేయరాదా ? అని యుపదేశించిన మాతంగుఁడిట్లనియె.

ఓసీ! వెఱ్ఱిదానా! మనము పెట్టిపుట్టలేదు. చేసికొనక యేదియు రాదు. స్నానము పూజయు బిడ్డల కడ్డుపెట్టునా ? మన కులమువారు తెలియనివారగుట నట్లనుచున్నారు ఆమాటలఁ బాటింపకుము. యోగముండిన మానదని సమాధానముజెప్పెను. హిందూమతములో నెట్టి యల్పులకైన వేదాంతము సహజముగానుండును. ప్రారబ్ధమన నెట్టిదో యెఱుఁగని వారైనను నాపదలు వచ్చినప్పుడు ప్రారబ్ధమని పలుకుచుందురు.

మఱియొకనాఁడు మాలిని మాలనితో నాథా ! మొన్న నొక నూనిగుడ్డలవాఁడు కిన్నరమీటుచుబిచ్చమునకై మనయింటికివచ్చెను. తోడికోడలి నిర్బంధమునఁ బిల్లలు కలుగుదురా? అని వానికడనడిగి తిని వాఁడు మంత్రములఁబాడుచు నాచేయిచూచి నీకుగాలిసోకి పిల్లలు గలుగకుండ నడ్డుపెట్టుచున్నది. రచ్చరేకు గట్టికొనినం బుట్టుదురు. కుంచెడు ధాన్యమిచ్చినచోఁ దాయెత్తిచ్చెదనని చెప్పెననొప్పుకొనక రే పురమ్మని యంపివేసితిని. ఇందులకు మీరేమందురు. తాయెత్తు గట్ట కొనవచ్చునా? అని యడిగిన మాతంగుఁడు నవ్వుచు బిచ్చగాండ్రమా టలు నమ్మరాదు. నీకుఁ గావలసిన నూరిలోనికిఁబోయి గొప్పవారల

డిగి మంచి రచ్చరేకులఁదెచ్చి యిచ్చెదఁ దొందరపడకుమని బుజ్జ గించెను.

నిత్యము భార్య వేపుచుండ మాతంగుఁడొకనాఁడు గంగాస్నానము చేసి నామములుదిద్ది నిత్యపూజచేసికొని రక్షరేకు నిమిత్తమై త్రివేణికిఁ బోవుచుండ దారిలో నొకమాలదాసరి యెదురుపడి మాతంగా యెందుఁబోవుచున్నావని యడిగెను.

మాతం—దాసరీ! నీవు దేశములు తిరుగుచుందువు? పెక్కండ్ర నెఱిఁగియుందువు? నాభార్యకు గాలిసోకినదఁట రచ్చరేకు నిమిత్తమై యరుగుచుంటిని. అట్టి వారెవ్వండిరో చెప్పఁగలవా ?

దాసరి—రచ్చరేకా? నేనేకట్టఁగలను ఎక్కడికో పోవనేల?

మాతం—నీమాట యటుండనిమ్ము. త్రివేణిలో జపము చేసికొనుచున్న బైరాగుల నడిగిన నీయరా ?

దాసరి—కాదు. కాదు. అట్లైన నేనొక్కటి సెప్పెదవినుము. ఈపట్టణములోఁ బల్లపువీధిని చింతామణియను బోగమామెగలదు. ఆమె ఇరక్తిజెంది, నగలు గుడ్డలు ఆవులు ఎడ్లు గుఱ్ఱములు అడిగినవారికెల్ల బంచిపెట్టి జేగురుగుడ్డగట్టికొని బూడిద బూసుకొని తిరుగుచున్నది. ఆమె మా తెలిసినదంట అక్కడికిఁ బొమ్ము. నీకీబూతియియ్యఁగలదు. అని యుపదేశించిన సంతసించుచు మాతంగుఁడు గురుతులు తెలిసికొని తిన్నగాఁ జింతామణి యింటిముంగలకుఁబోయి వీధి నిలువంబడి జింతామణిగారో యని పెద్దకేకపెట్టెను.

ఆకేకవిని చింతామణి వాకిటకువచ్చి వానింజూచి నీవెవఁడవు? నన్నేమిటికిఁ బిలిచితివని యడిగెను. దాని యోగినీవేషముజూచి మాతంగుఁడు దండములుపెట్టి తల్లీ ! నేను నీదాసుండ మాతంగుఁడను వాఁడ నాకుఁ బిల్లలులేరు. నా భార్యకు గాలిసోకి యడ్డుపెట్టుచున్నదఁట, రచ్చరేకుకొఱకై వచ్చితిని నీవు గొప్పదానవంట నాకీయుపకా

వ్యాసమఠంబునకుఁబోయి యగ్నిశిఖునిగుఱించి వితర్కించిన నతండు పరమపదించినట్లు తెలిసినది.

అప్పుడప్పడఁతి మిక్కిలి పరితపించుచు నాహా ! నేను మహాపాపాత్మురాలను. మహానుభావుండైన యతీశ్వరునిఁ బుక్కసునియింట బుట్టఁజేసితిని నాప్రాజ్ఞత్వంబు గాల్పనా ? ఛీ ఛీ ! నేనొకమానిసినే. నన్నతం డవమానించెనని యీసుబూనితిని. కోపము పాపమునకుఁ బ్రాపుగాదే ప్రమాదము జరగినదని యనేకప్రకారములఁ బరితపించుచు తదుత్పత్తి ప్రకారంబు దెలిసికొననెలలు లెక్కపెట్టుచుండెను.

ఒకనాఁడామాతంగుఁడు వాకిటనిలువంబడి చింతామణిగారూ! మాయాఁడుది బాధపడుచున్నది. వచ్చిచూడుఁడని కేకపెట్టెను ఆమాట విని యాఁబోటి సంభ్రమముతో నప్పుడే వానివెంట మాలపల్లెకరిగినది. అప్పటికామాలిని ప్రసవమై గడియయైనది. మగశిశువుగలిగెను పాలు త్రాగుటలేదని తల్లిదుఃఖించుచున్నది.

చింతామణి మాలెతప్రక్కలోనున్న బాలకునెత్తికొని ముద్దాడుచు నాకారలక్షణంబులు పరీక్షించి యయ్యతియే యిట్లుపుట్టెనని నిశ్చయించి

చింతామణి—శ్లో॥ కస్త్వంబాలక ! బాలుఁడా! నీవెవ్వఁడవు?

శిశువు—బాలికే! యతిరహం, బాలామణీ ! నేను యతిని

చింతా—కస్మాదిదం జన్మతే, నీవిందేమిటికి జనించితివి ?

శిశువు—వక్ష్యేపూర్వము పానహా విధివశాత్ప్రాప్తోస్మిగృష్ణాన్ మఠం। ప్రాప్తోస్మీతిమతిం విధాయసితరాం సంత్యక్తదేహోస్మ్యయం। చ్చండాలస్యసుతో స్మ్యహం తదబలే యాం తెమతిస్సాగతిః॥

చెప్పెదవినుము నేను బూర్వజన్మంబున వేసవిలో గంగనుండి మఠమునకుం బోవుచు చండాలుడుంచిన పాదుకలలోఁగాళ్లుంచి వానికి ఋణస్థుండనైతినని తలంచుచు దేహమును విడిచితి దానం జేసి వానికిఁ

బుత్రిండనై యుదయించితిని. ప్రాణోత్క్రమణసమయంబున బుద్ధి యెట్లుండునో యట్టి జన్మమే సంప్రాప్తించునని శాస్త్రములు చెప్పు చున్నవిగదా?

అని యాబాలుండు చింతామణి కుత్తరముచెప్పి కేకమని యేడ్వఁ దొడంగెను అప్పుడది కన్నీరుఁగార్చుచుఁ దండ్రీ! నీవుద్రపవిత్రు లని పాలుగ్రోలుట మానితివా? అయ్యో! నిన్ను శ్వపచునింటఁ బుట్టఁ జేసితి నేనెంత పాపాత్మురాలనో? విధికృతంబనతిక్రమణీయమని విచారించుచుండ మాతంగుఁడు అమ్మా! వీఁడు బ్రతుకునా? నీవుగూడ గన్నీరు విడుచుచుంటివేమి? నిజము జెప్పుము. దేవతలకు మీకుగట్టుము. తల్లీ! వీనిభారము నీదని దానిపాదములంబడి వేడికొనియెను.

చింతామణి మాతంగా! వీనికేమియుభయములేదు. మీశిశువునకుఁ దల్లిపాలుపడవు. ఆవుపాలు కావలయును నేనువోయి తీసికొని వత్తు వెఱవకుమనిపలికినవాఁడు తల్లీ! ఆవుపాలు మాయింటనేయున్నవి. త్రాగింపుమని గిన్నెతో నావుపాలు దెచ్చియిచ్చెను. దానింబోసినఁ ద్రాగఁడయ్యెను. అప్పుడా పుల్కసదంపతులు గోలునవేడ్చుచుండ వారించుచుఁ జింతామణి యాలోచించి తానొకబ్రాహ్మణగృహంబున కరిగి యాచించి యావుపాలుతెచ్చి పోసిన నవ్వుచు నాబాలుండు గుటుగుటుగునఁ ద్రాగెను.

ఆమావుపాలె మఱునాఁడు పోసినఁ ద్రాగడయ్యె నప్పుడు చింతామణి గ్రహించి దినమునకొక విప్రగృహంబునకరిగి యాచించి తెచ్చి తానేస్వయముగాఁ బోయుచుండ గ్రోలుచుండెను మాతంగుఁడు వారాంగన తనయందలి ప్రేమచే ననుదినమువచ్చి యాబాలున కుపచారములు సేయుచున్నదని తలంచి దానిం దల్లిగా గురువుగా దైవమునుగానెంచి స్తుతియింపుచుండును.

ఆబాలుండు దినదినాభివృద్ధి వడసి నవ్వుటయు దోర్లుటయు

గూర్చుండుటయు బ్రాకుటయు దప్పటడుగులిడుటయు మాటాడుటయు లోనగు బాలక్రీడలఁజూపుచుండ నమ్మాతంగదంపతులు బ్రహ్మానందము నొందుచుండిరి. ఆశిశువునకు యుక్తకాలమున నన్నప్రాశనము చేయ వలయునని తలంచిరి. చింతామణియాలోచించి బ్రాహ్మణగృహంబు నుండి పాయసము దెచ్చిపెట్టినదికాని యామాణవకుఁడు నోరెత్త డయ్యెను.

అయ్యాశయముగ్రహించి చింతామణి వానికిఁ బండ్లుపెట్టనల వాటుచేసినది. ఫలములు పాలుగాక యాడింభకుండు మఱియేదియుఁ దినఁడు కావున నాయాహారమే చింతామణి పెట్టుచుండెను. ఆశిశువు నకుఁ జింతామణియనియే నామకరణము జేసియున్నారు. వానినెప్పుడు బయటకురానీయక సంతతము లోపలనేయుంచి వాని యాటపాటల బంగారుమూటలవలె నెంచుచు మిక్కిలి సంతోషముతోఁ గాలము గడుపుచుండిరి. చింతామణియు నిత్యమువచ్చి వానిసంరక్షణ గనుం గొనుచుం బోవుచుండెను

ఆమాతంగునకుఁ బ్రయాగములో నెలకొకరాత్రి గస్తుదిరుగ వలసినవంతుకలదు. ఆవంతునాఁడు వాఁడుగస్తుదిరుగనిచో సందులకై వానికిచ్చిన మాన్యము లాగికొందురు. కావున వాఁడేయూరికేగినను గస్తువంతునాఁడు తప్పక యూరిలోనుండితీరును.

ఒకనాఁడుఅగత్యమైన పనివచ్చినమాతంగు డూరికిఁబోయి గస్తు వంతునాఁడు రాత్రికింటికి రావలయునని బయలుదేరెను దారిలో గంగానదిపొంగి వానిపయనమున కాటంకము గలుగఁజేసినది. కాలా తీతమగుటచే రేవుదాటించు నావయుం దొరకినదికాదు. మాన్యము పోవునని వాఁడుమిక్కిలి పరితపించుచు నవ్వలియొడ్డున బరుండెను.

ఇంటికడ మాతంగుభార్య మాలినియు దీపములు పెట్టువఱకు దనమగఁడు వచ్చుననునాసతోనుండి చీఁకటిపడినంత నిఁక రాఁడని నిశ్చ

యించి మాన్యముపోవునని విచారించుచు నవ్వలికిఁబోయి మగనిజాడ చూచి కేకవెట్టుచు మరల నింటికి వచ్చుచు నించుకసేపు కూర్చుండి యంతలోలేచి పొరుగింటికేగి చూచుచు నడుగుచుఁ దొట్రుపడుచుండెను. ఆయారాటముజూచి యాబాలుండు అమ్మా! నేఁడు నీవిట్లు బాబాకోఁ బరితపించుచుంటివేల? నేఁడురాకున్న రేపురాఁడా? అనియడిగినఁ బుత్రునెత్తుకొని ముద్దాడుచు మాలిని నాయనా! నీతండ్రి నేఁటిరేయి నీవీటిలో గస్తుతిరుగవలసి యున్నది. ఏకారణముచేతనో రాలేకపోయిరి. మూఁడుతరములనుండి గస్తుమాన్యము మనకు జరగుచున్నది. నేఁడాపనిచేయకున్న నామాన్యములాగికొందురు. అందులకై విచారించుచుంటినని యావృత్తాంత మెఱింగించినది.

పిల్లవాఁడు—అమ్మా! గస్తు అననేమి?

తల్లి—బాబూ! ప్రజలు నిద్రించుచుండ రాత్రి నాలుగు జాములు నాలుగువీధులకుంబోయి డప్పువాయించుచు నింటిలో దొంగలుదూరి వస్తువులు దొంగిలింతురు. జాగ్రతగా మేలుకొనియుండుఁడో యని కేకపెట్టవలయును. దీనికే గస్తు అనిపేరు.

పిల్లవాఁడు—తల్లీ! ఈమాత్రముపని నేనుజేయలేనా? నన్ను నియోగింపరాదా! విచారించెదవేమిటికి?

తల్లి—అయ్యో! తండ్రీ! నీవిదివఱకిల్లు కదలిమెఱుఁగవు చీఁకటిలోఁ గ్రొత్తవీధులకుఁబోయి ప్రజల నెట్లు ప్రబోధింతువు? జడిసికొంటివేని భూతములు సోకును మాన్యముపోయినం బోవుగాక నీకా పనివలదు.

పిల్లవాఁడు—అమ్మా! నాకేమియుభయములేదు. డిండిమము వాయింపఁగలను. ఏవీధులకుఁబోవలయునో గురుతులు చెప్పుము పోయెదంగాక.

తల్లి—పట్టీ! నీకట్టియూహ యుండినచో డప్పుతీసుకొని నీ వెంటవచ్చి వీథులం జూపెద బిగ్గరగాఁ గేకవేయఁగలవా

పిల్లవాఁడు — నీవు నాతోనుండి వీధులం జూపుమంతియచాలు నేను బ్రజలఁ బ్రబోధింపఁగలను.

అనిపలుకుటయు సంతసించుచు మాలిని యారాత్రి గోట లోఁ బదిగంటలు గొట్టినతోడనే కుమారుని నొకచంక నెత్తుకొని యొక చంక డప్పుదగిల్చికొని బయలుదేరెను. అమ్మా! నేనడువఁగలను దింపుము. దింపుము. నీవుమోయఁజాలవని కొడుకుపలుకుచుండ జిన్నినాయనా! నీవునాకుభారమగుదువా? నిన్ని రాత్రినిల్లుకదల్చుటయే తప్పు పైగాఁ జీఁకటిలో నడిపింపనా? నీతండ్రిపినిన నన్నుబ్రతుకనిచ్చునా? అనిపలుకుచుఁ దొలుతఁ గోటకుఁ దూరుపునసున్న వీధికిఁదీసికొని పోయి యొకచోదింపి తానేడప్పువాయించుచుఁ బ్రజలుమేలుకొనునట్లు కేకవేయుమని కుమారునికిబోధించినది. ఆపాజ్ఞుండు

శ్లో॥ కామః క్రోధశ్చ లోభశ్చ దేహే తిష్ఠంతి తస్కరాః
జ్ఞానరత్నాపహారేణ తస్మాజ్జాగృధజాగృథ.

ఓజనులారా! కామక్రోధలోభమోహాదు లారువ్వురు దొంగ లీదేహమను గేహంబునఁ దిఱుగుచున్నారు. వారు జ్ఞానరత్నమును హరింతురు కాచికొనియుండుఁడో! అని పెద్దకేకపెట్టెను.

బాబూ! నేనుజెప్పినట్లుకాక వేరొకరీతిజదివితివేల? ఈచదువు నీకెట్లువచ్చినది? క్రొత్తమాటలు సెప్పఁగూడదు. దొంగలు పదునురు మేల్కొనియుండుఁడని కేకవేయుమని తల్లిపలికిన నామాటయేచెప్పితి నని కుమారుఁడు సమాధానమిచ్చెను.

మాలిని యాబాలకుని రెండవజామున దక్షిణపువీధికిఁ దీసికొని పోయి యొకచోనిలువంబెట్టి తాను డిండిమము గొట్టుచుఁబ్రజలఁ గేక వేయుమని బోధించినది. ఆమాణవకుండును

శ్లో. మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధుః సహోదరః
అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాజ్జాగృధజాగృధ.

తల్లి దండ్రులు అన్నదమ్ములు భార్యాపుత్రాదులు ధనగృహ పశ్వాదులన్నియు నస్థిరములు క్షణభంగురములు వానినమ్మియుండక నిత్యమగువస్తువుం దెలిసికొనుటకై మేలుకొనియుండుఁడో ! అనిమరల కేకపెట్టెను.

పుత్రా ! క్రొత్తమాటలాడుచున్నావు. రాజుగారివలన మాట వచ్చునుజుమీ! ఇఁక నీవారీతి పలుకవలదని మందలించిన దల్లికిఁ బుత్రుఁడివి ప్రాతమాటలేయని సమాధానము చెప్పెను.

మూఁడవజామున మాతంగిని గుమారుఁ బడమరవీథికిఁ దీసికొనిపోయినది. అందతండిట్లు కేకపెట్టెను.

శ్లో॥ జన్మదుఃఖం జరా దుఃఖం జాయాదుఃఖం పునఃపునః
సంసార సాగరందుఃఖం తస్మాజ్జాగ్రృథజాగృథ।

జాయా పుత్రాది సంగభంగురంబై జన్మ జరామరణ వ్యాకులంబై యొప్పు సంసారసాగరము దుఃఖప్రదమైనది. దీనిందాటు తెరువరయుచు మేలుకొనియుండుఁడో యని కేకపెట్టెను.

నాలుగవజామున నుత్తరపువీధికింబోయి యందు.

శ్లో॥ ఆశయా బద్ధ్యతెలోకో కర్మణా బహుచింతయా।
ఆయుక్షీణం నజానాతి తస్మాజ్జాగ్రృథ జాగృథ ॥

లోకమున తనకాయువు దినదినముక్షీణించుచున్నదని తెలిసికొనలేక పెద్దయాసచేఁ గట్టఁబడి గొప్పగొప్ప పనులుచేయుటకుఁ బ్రయత్నించుచుండును మృత్యుదేవత యెప్పుడోవచ్చి గుటుక్కున మ్రింగివైచును కావున నావిషయమై యప్రమత్తులై మేలుకొనియుండుఁడో యని కేకపెట్టెను. తల్లియునట్లుచెప్పినంతుల కేమిమాటాడునోయని వెఱచుచుఁ గుమారు నెత్తికొని యింటికిఁ బోయినది.

ఆపట్టణపురాజు మొదటిజామునఁ జల్లగాలి సేవింపదలంచికముగా

నుప్పరిగపై వసించి యామాతంగబాలుఁడుచదివిన మొదటిశ్లోకమును విని వెరగుపడుచు నిద్రబోక తక్కినమూడుజాములయందును జదివిన మూడుశ్లోకములు చెవియొగ్గియాలించి యాహా! ఇది యేమివింత గస్తు తిరుగు పుల్కసునకీ వైరాగ్యశ్లోకము లెట్లువచ్చినవి ? అని సంశయిం పుచు మఱునాఁడుదయమున రాత్రిగస్తుతిరిగిన మాలవానిదీసికొని రమ్మని రాజభటునొకనిం బంపెను.

రాజసేవకుఁడు మాలపల్లెకుఁబోయి రాత్రిగస్తుతిరిగిన వాఁడెవఁ డని యడుగుచు మాతంగునియింటికిం బోయెను. మాతంగుఁ డూరి నుండి యప్పుడేవచ్చి రాత్రిజరిగినపనులు భార్యచెప్పుచుండ నాలింపు చుండెను. రాజభటుడట నిలువఁబడి రాత్రి గస్తుతిరిగినవాఁడెవఁడురా? యిటురా. అని కేకపెట్టెను. మాతంగుడు జడియుచు బాబూ ! నేను నేనని యెదుటకుఁబోయెను. నీమూలమున నాకర్మము మూడినది నిన్ను వెదకుచు నీమాలపల్లెయంతయు దిరిగితిని. పదపద. రాజుగారి సెలవైనదని పలికిన వాఁడు గడగడలాడుచు బాబూ! ఎందులకో తెలి యునా? అని యడిగెను.

భాంచోత్ అది నాకేమియుఁదెలియదు నడువుమని వాని వెంటఁ బెట్టికొని రాజసభకుఁ దీసికొనిపోయెను. సేవకుఁడు వాని నెదుర నిలు పం బెట్టి దేవా! వీఁడే రాత్రిగస్తుదిరిగినమాలఁడని యెఱిగించుటయు నారాజు వానిఁబరిశీలించిచూచి రాత్రి గస్తుతిరిగినవాఁడవు నీవేనా అని యడిగెను. సిత్తము సిత్తము మాప్పభో ! నేనే యని వాఁడుత్త రము చెప్పెను.

రాజు—నీ వెంతకాలమునుండి గస్తుతిరుగుచుంటివి ?

మాతం—ఏలికా! నలువదియేండ్లనుండి తిరుగుచుంటిని.

రాజు—నీవు రాత్రి గస్తుతిరిగితివా ? నిజము చెప్పుము. చెప్ప కున్న దండింతుఁజుమీ?

మాతం—(గడగడ వడంకుచు) సామీ! తప్పు జేసితిని మన్నింప వలయు. నేటియాటంకమున నేను రాత్రి నింటికిరాలేకపోయితిని. మాన్నెము పోవునని మాయాఁడుది బిడ్డనెత్తుకొని రాత్రిగస్తుత్రిప్పినదఁట తండ్రీ! ఇదియే నిజము. వాఁడేమితప్పుజేసెనో తెలియదు. లేక లేక యొక్కఁడే కలిగెను. ఆసిచ్చు నాకు విధించి వానింగాపాడుఁడు అని యేడ్చుచు నేలంజాగిలిబడి నమస్కరించెను.

రాజు—(నవ్వుచు) రాత్రి గస్తుతిరిగినవాఁడు నీకొడుకా? వాని కెన్ని యేండ్లున్నవి?

మాతం—బాబూ! ఎనిమిదేండ్లికను వెళ్ళలేదు.

రాజు—నీవు వాని నిటకుఁదీసికొనిరా. పో పొమ్ము.

మాతం—తండ్రీ! ఆసిచ్చు నాకువిధింపుఁడు. వాఁడు కుఱ్ఱవాఁడు. ఎఱుఁగనివాఁడు. తప్పుమన్నించి రక్షింపుడు. అని కన్నీరుగార్చుచు వేడుకొనియెను.

రాజు—మాశిక్షలు పడువాడుకాడు. మమ్మే వాఁడే శిక్షించును. పోయి తీసికొనిరా.

అనిపలికిన నేదియో చెప్పుకొనఁబోవుటయు మాటాడనీయక రాజభటుఁడు పదపద అని గెంటుకొనిపోయెను. వాఁడు దిగులుమొగముతో నింటికింబోయి పెండ్లాముపైఁ జిరాకుపడుచు ఛీ! నీమూలమున నింతముప్పు వాటిల్లినది. మాన్నెము పోయినంబోవుఁగాక కన్నులుదెరవని బాలునిం దీసికొనిపోయి యర్ధరాత్రిము గస్తుత్రిప్పింతువా! రాజుగారు నీనిమాటలు వినెనుగాఁబోలు గట్టికోపమేవచ్చినది. వాఁడుమమ్మే శిక్షించునని వెటకారములాడిరి. అనిచెప్పిన భార్య గోలునఏడ్చుచు బిడ్డంగౌఁగిలించుకొని బాబూ! నేజెప్పినట్లు కేకవేయక యేదియోచదివితివి? రాజుగారికిఁ గోపమువచ్చినదఁట. నీకు శిరచ్ఛేదము చేయింతురఁట వింటివా! అనిపలికిన విని కుమారుఁడు నవ్వుచు నిట్లనియె.

తల్లీ ! నేనేమితప్పుచేసితినని రాజునాకుశిరచ్ఛేదము చేయించును? నేనన్నమాటలు నీవువినలేదా ! వెఱవకుఁడు అనికుమారుఁడు ధైర్యము గఱపుచుండెను.

తల్లిదండ్రులిద్దరు వానిఁగౌఁగిలించుకొని దుఃఖించుచుండిరి. అప్పుడు రాజకింకరుండు వాకిటనిలువంబడి మాతంగా! నీకుమారుఁడు రాక జాగుచేయుచున్నాఁడేమి? ఆలసించిన రాజుగారికిఁ గోపమురాదా వేగమురమ్మనియదలించిన సిత్తము సిత్తమనుచు నిదిగోవత్తున్నామని పలుకుచు మాతంగుఁడు.

గీ. నెండిమురుగులు కంటెయు వింతచెలువు
గొలుపగజ్జెల మొలత్రాటఁ గోచిపెట్టి
చుంచుమవ్వి మొగంబునఁ జుక్కదిద్ది
ముద్దుబాలునిఁ గైసేసి మోహమునర.

చంకవెట్టుకొని యాబంటువెంటవాఁడా నృపతియొద్దకుఁబోయెను. వానిభార్యయు నింటనుండలేక వారిపజ్జన యరిగినది. అట్లా శ్వపచదంపతు లక్కుమార శేఖరునెత్తుకొని కొలువుకూటంబునకుఁ బోయి రాజునెదుర నిలువంబెట్టి బాబా! వారే పబుపువారు జోహారు సేయుము అని పలుకుచు మ్రొక్కించుటయు

ఉ. బాలకుఁజూచిచూచి నరపాలశిఖామణి భూరివిస్మయా
లోల మనస్కుఁడై భళిర లోకములేలఁగఁ జాలువీఁడు చం
డాలకులంబునన్ బొడముట ల్విపరీతముగాదె సత్తప
శ్శీలవనోరు విఘ్నమది చేకురునేయతికో తలంపఁగన్.

కానిచో నుపనిషత్ప్రతిపాదకంబులగు నట్టిశ్లోకంబులెట్లుచదివెడిని? వీఁడుకారణజన్ముఁడు. పాప మేతపోధియో విధిబద్ధుండై వీనియింటఁబుట్టెనని వితర్కించుచు సింహాసనముడిగ్గి వానిచెంతకరుదెంచి సాదరముగా మాణవకోత్తమా! రాత్రి గస్తుతిరిగినవాఁడవు నీవేకాదా?

యని యడిగిన నేమియు మాటాడక శిరఃకంపమునఁ సంగీకారము సూచించెను.

నీవేమి చదివికొంటివి? యుపాధ్యాయుఁ డెవ్వఁడు? అనియడిగిన నాబాలుఁడేమియు మాటాడక యూరకుండెను. ఏమియుఁజదువుకో లేదని వానితండ్రి సమాధానము సెప్పెను.

రాజు—మాతంగా! నీకుఁ బిల్లలెందఱు?

మాత—దేవా! వీఁడొక్కఁడే. సింతామణికృపచేఁ గలిగెను

రాజు—చింతామణి యెవ్వతె?

మాత—బోగమామిడ. మా తెలిసినది బాబూ!

రాజు—ఏమిసెప్పినది?

మా—ఎవ్వఁడో రుసి గంగలో సెపము చేసికొనుచుండగా నుండువేసవిని పాదరచ్చలు దారిలోనుంచమని చెప్పినది. అట్టుసేసితిని వీఁడుగడుపునఁబడియెను.

రాజు—వీఁడు మాంసము తినునా?

మా—దేవా! మాంసముగాదు అన్నమునుతినఁడు పాలుద్రాగడు సింతామణిగారే పాలు పండులు తెచ్చిపెట్టుచుండును. తండ్రీ! ఇంతే సత్తెము.

ఆమాటలువిని యారాజు మిక్కిలి విచారించుచు నప్పుడపసిండి పళ్లెరమున వేయుదీనారములు బోసికొని యాబాలునకుఁ గానుకగా నర్పించుచు బాలకా! వీనినీకుఁ బారితోషికముగా నిచ్చితిని నీవురాత్రి గస్తుతిరిగినందులకు గైకొనుమనిపలికి యర్పించుటయు నామాణవకుఁడు ఆపళ్లెరము రెండుచేతులతోఁగ్రహించి అమ్మా! వీనినేను మోయఁజాలను గైకొనుమని పలుకుచు వారికందిచ్చెను.

చండాలదంపతులు పరమానందభరిత హృదయులై యాపళ్లెర మందుకొని మొహిరీల మూటగట్టుకొనిరి రాజు వారికింటికి బోవుటకు

సెలవిచ్చెను. బాలకునితోఁగూడ వారింటికి బోయి బాలునకు దృష్టి దీసి పండుకొనబెట్టిరి. అంతలోఁజింతామణి యచ్చటికివచ్చి యావృత్తాంతమంతయువిని ముక్కుపై వ్రేలిడికొనుచు మాతంగుడా! ఎంత పని చేసితిరా ? అనిపలికిన వాఁడు అమ్మా ! మేము మొదట జడిసితిమి కానిరాజుగారు నాకుమారుని మెచ్చుకొని కానుకలిచ్చిరి. చూచితివా! ఇదియంతయు నీ యనుగ్రహమనిపలికి యానందించుచుండెను.

మాతంగదంపతులు పుత్రప్రేమదలంచి చింతించుచు, యతిసత్తముని బాధవిముక్తునిదలంచి సంతసించుచుఁజింతామణి యా బాలుఁడెందున్నవాఁడని యడిగిన మాతంగి అమ్మా ! మా కుమారుఁడుగొప్ప కానుకలదెచ్చెనని మా పల్లెవాండ్రందఱు కంటగించుచుఁ జూడ వచ్చుటంజేసి దృష్టితగిలి మేనికివేకిసోకినది దిగనుడిచితిమి. ఆగుడిసిలోఁ బండుకొనఁ బెట్టితిమి నిద్రించుచున్నాడని చెప్పినవిని చింతామణి తొందరగా లోపలికిఁబోయి బాబూ ! బాబూ ! నిద్రించుచుంటివా ! అయ్యో ! యెక్కడినిద్ర యోగనిద్రయా యేమి ! మాటాడవేమి ! అనియెంతపిలిచినను బలుకలేదు.

మహాత్మా ! స్వస్వరూపము వహించితివా! అకటా! నీవలన మంచి మాటలు వినవలయునని యెంతయో యాసతో నుంటిని. ఈ కంటకురాలితో నిఁక మాటాడవా అని దుఃఖించిన విని మాతంగదంపతులు అట్లడలుచుంటివేల? ముద్దులనాయన లేవలేదా? అని యడుగుటయుఁ జింతామణి తెలిసినదైనను గన్నీరుగార్చుచు నింకెక్కడి ముద్దుల నాయన మీనాయన పరమపదించె. వానిచే నేదియు స్వీకరింపవలదని చెప్పలేదా? రాజువానికిచ్చిన కానుక లేలపుచ్చుకొంటిరి? మీ ఋణముతీరిపోయినది. వానిదారివాఁడు పోయెనని చెప్పినది.

గుండెలు బాదుకొనుచువచ్చి యాచండాలదంపతులు వానిఁ జూచి గతాసుండగుట తెలిసికొని వానిపయింబడి పెద్దయెలుంగున

నేకువఁదొడంగిరి. చింతామణియుఁ బ్రాహ్మణురాలయ్యు దేహావాసనంజేసి వారితోఁగూడఁ గొంతసేపువిలపించి పిమ్మటవారి నూరడించుచు నతండు మహర్షి యనియుఁ బాదరక్షలమూలమున మీయింటబుట్టెననియు మీ ఋణముతీర్చుకొని ముక్తుండయ్యెననియు నావృత్తాంతమంతయు నెఱిఁగించి వారికిశోకోపశమనముగావించినది. వాండ్రును తనుపదేశబలంబున విరక్తిజనింప నిల్లువిడచి తీర్థయాత్రి సేవించి ముక్తులైరి.

చింతామణియు నామహాత్ముండు చెప్పిన నాలుగుశ్లోకములయందును బ్రస్థానత్రియమందుఁగల తాత్పర్యముండుటంబట్టి వానినే స్మరించుకొనుచు మహాయోగినియై దేశపర్యటనము గావించుచు ముక్తురాలయ్యెను.

చిత్రసేనా! వేశ్యయైనను జింతామణి వైరాగ్యబుద్ధిచే నెట్లు వర్తించెనో చూచితివా? ఎటువంటిజ్ఞానవంతురాలయ్యెనో తెలిసికొంటివా! అని గోశికాపుత్రుఁడు చింతామణి యుదంతమెఱింగించిన విని యాగణికాపుత్రిక లిరువురు పరమానందపూర్ణహృదయులై యతని నగ్గించిరి.

అని యెఱింగించునంత సమయాతీతమగుటయు మణిసిద్ధుండవ్వలికథ యనంతరపుమజిలీయం దిట్లు చెప్పఁదొడంగెను.

## 148 వ మజిలీ

### ఘాకినీదేవతకథ.

ఒకనాఁడు మతంగయోగిని యిరువురు రాజభటులతో నొక మార్గంబునంబడిపోవుచు నిట్లు సంభాషించినది. దూతలారా! మన మహారాజుగారి దేశావసానము సమీపించుచున్నది. వాండ్రిపాటి కీదేశము దాటిపోవుదురేమో? అన్యదేశమున మనము వారింబట్టి కొనవచ్చునా? అని యడిగిన రాజకింకరులిట్లనిరి. దేవీ! మన మితరదేశమున వారింబట్టికొనరాదు. అందున్న యధికారులకు మనరాజశాసనము

జూపి వారివలన మఱియొకశాసనము వడసి యప్పుడు వారింబట్టికొన వలయును. వెనుకటి గ్రామస్థులు జెప్పిన మాటలంబట్టి వారింకను మ నదేశము దాటిపోవఁజాలరు. నీవు నడువజాలమింజేసి యింతయాలస్య మగుచున్నది. మేమైనచో నీపాటికే వారింగలసికొందుము. వేగమునడు వుము. అని పలుకుచు నారాజపరిశోధులు యోగినితోఁగూడ తొందరగాఁ బయనము సాగించుచు జామున్ప్రొద్దువేళకు ముందరపల్లెఁ జేరిరి.

అందలి వారిఁజూచి పురుషవేషములు వైచికొనిన యిరువురు చక్కని స్త్రీలతో నొకబ్రాహ్మణుఁ డీదారింబోవుచున్నాడు. మీకుఁ గనంబడెనా? అని యడిగినవారిద్దరు ఓహో! వారుస్త్రీలా? పురుషు లనుకొంటిమి ఇంతకుముందే యీయూరుదాటిపోయిరి. బండిమీఁద బోవుచున్నారని చెప్పిరి.

అప్పుడు రాజభటులా గ్రామాధికారులకు రాజశాసనము దె లియఁజేసి కొందఱి మనుష్యుల సహాయముగాఁ దీసికొని వడివడిగపో యి క్రోశదూరములో వారింగలసికొని బండికడ్డముగానిలువంబడి నిలు వుఁడు నిలువుఁడని యదలించినవిని గోణికాపుత్రుఁడు బండిదిగి ముంద రికి వచ్చి మీరెవ్వరు? మమ్మాపెదరేల! అని యడిగిన రాజభటు లిట్లనిరి.

పాటలీపుత్రవాస్తవ్యురాలగు రతినూపురయనువేశ్య తనపుత్రి కల మిక్కిలి వెలగల మండనములతోఁ దనకు దెలియకుండ నీవు తీసి కొనిపోవుచుంటివని నీపై నీదేశప్రభువగువిపులునియొద్ద నభియోగముదె చ్చినది. నీయపరాధము విమర్శించుటకై మిమ్ముఁబట్టి తీసికొని రమ్మని మాఱేఁడాజ్ఞాపత్రిక వ్రాసియిచ్చెను. ఇదిగో చదివికొమ్ము. అని పలికి యా శాసనపత్రిక నిచ్చిరి. దానింజదివికొని గోణికాపుత్రుఁడు మంద హాసము గావింపుచు మీఱేని న్యాయాధిపత్యము స్తుత్యమై యున్నది ఇదియంతయు మతంగయోగిని కావించిన కల్పితము. కానిండు రాజ

శాసనమునకు బద్ధులము కావలసినదే అట్లివత్తుము పదుఁడు అని పలికి, బండివానితో వెనుకకుఁ ద్రిప్పుమని నియమించెను.

అంతలో మతంగయోగిని యక్కడకువచ్చి వారిం జూచి దొం గలు దొరకిరా? కాదండు. వీరిం బదిలముగాఁ దీసికొనిపోవలయు రూ పులుమార్చి తిరుగుచున్నారని గంభీరముగఁ బలికినది గణికాపుత్రిక లాయోగినిం జూచి యోసీ! మాయావినినై కపటయోగవతినని గుర్తిమ్మఱుచున్న నీవు మోసకత్తెవు కాని మేము కానేరము. మేమెవ్వ రిసొమ్మును దీసికొన్నిరాలేను. మమ్ము రాజన్యాయముగా శిక్షింపఁ బూనిన దైవములేడా? కపటముచేసి చెప్పినట్లు చేయలేదని నీవే యిట్టి కల్పితము చేసితివి. కానిమ్ము. అని ఏమేమో నిందింపఁబూనిన యో గిని రాజభటులఁ బురికొలిపినది.

వాండ్రు క్రోధముఖులై యదలించుచుఁ జాలుఁజాలు మాటా డకుఁడు ఇంటికడ సుఖముండలేక తల్లిమాట వినక బోడిబాపనవానిఁ దగిలికొనిపోవుచు నేమేమో యరచెదరేల? పదుఁడు పదుఁడు. మీపా టులు ముందున్నవి. ఇప్పటికైన వీనిని విడిచి మీతల్లి సెప్పినట్లు వింటి రేని బ్రతికిపోవుదురు. అని విచ్చుకత్తులు చేతంబూని బెదరించిరి గోణి కాపుత్రుండు వారిమాటల కడ్డమువచ్చి మీ రేమియుఁ జెప్పనవసర ములేదు. రాజునొద్దకువచ్చి వారికిఁ దోచిన మాటలఁ జెప్పుదుము. అన్యాయముండిన శిక్షించుఁగాక యపరాధులమని తోచిన దండించుఁ గాక మీ కాగొడవలేమిటికి? పదుఁడని యుపన్యసించెను.

ఓహో! బాపనవాఁడు పోగరెక్కి కూయుచున్నాఁడు. తాన పరాధియని యెఱుఁగఁడు ఇదియెట్టి నేరమో తెలిసికొనకున్నాఁడు పారిపోవఁగలఁడు చేతులకు నిగళములు దగిలింపుఁడు. అని యదలింపు చుండ వారికిఁ దోడువచ్చిన గ్రామాధికారులతఁడు మహాపండితుఁడని తెలిసికొని యతఁడు పారిపోవకుండ తాము పూటకాపులుగా నుందు మని బోధించి యెట్టకే విడిపించిరి.

తరువాత వారి వీణాదిగానసాధనము లన్నియు నందలిపల్లెలోఁ బడవైచి వేశ్యాపుత్రికల నిరువురను యోగినిని నొకబండిలో నెక్కించి గోణికాపుత్రుని వెనుక నడిపించుచు విచ్చుకత్తులఁ జేతులఁబూని ముం దొకఁడు వెనుక నొకఁడు నడుచుచు మహాపుర నగరాభిముఖులై పో వుచుఁ గొన్ని పయనంబులు సాగించిరి.

ఒకనాఁడొక యరణ్యమార్గంబునం బోవునప్పుడ మతంగయో గిని రాజభటుల రహస్యముగాఁ జీరి దూతలారా! రాజు మీతో నేఁ జెప్పినట్లు చేయుమనికదా ఆజ్ఞాపించెను. ఈప్రాంతమందు ఢాకినీదేవి యాలయమున్నది. అమ్మహాదేవిని దర్శించి సేవించి యరుగుదము గాక. మనము దలఁచినకార్యము సఫలము గాఁగలదని నియమించిన వా రంగీకరించి యాదారినే బండిని నడిపింపఁజేసిరి. అమ్మవారి యాల యము కొంచెము దూరములో నుండఁగ బండియాపించి యోగిని రాజభటులతో నేకాంతముగా నిట్లు చెప్పినది.

నేను మహారాజు నిమిత్తమై యీగణికలలో నొకదానింగూర్ప నింతప్రయత్నము చేసితిని అతండు పెద్దదాని దాను స్వీకరించుట కును రెండవదానిని నాకిచ్చుటకు నంగీకరించెను. నేను ఢాకినీదేవతను జిరకాలమునుండి యారాధించుచుంటిని చక్కని వేశ్యాపుత్రిక నొక దానిం బలియిత్తునేని యమ్మవారు నేను గోరినవరము లీయఁగలను. అందులకే నేనీ విశ్వప్రయత్నము చేసితిని. మీ దయవలన నా మనో రథము దీరఁగలదు వినుఁడు మీకంటె రాజు నా కెక్కుడు చుట్టము కాఁడు మీకును నాకును నుపకారముగ నాలోచించితిని. ఈబ్రాహ్మ ణుఁడు చాలగట్టివాఁడు రాజునొద్దకుఁ దీసికొనిపోయినఁ దనపాండిత్యము చూపి తేనిమతి ద్రిప్పఁగలఁడు కావున నిప్పుడే మనయభీష్టము దీర్చు కొందము. పెద్దదాని మీయిరువురు తీసికొనిపొండు. రంభవంటిదాని

పొందుగాంచి యానందింపుడు రెండవదానిని నాకిండు అమ్మవారికి బలియిచ్చి కోరికలంబడసెద నిట్లుచేయుడు. అని యేమో బోధించిన వాండ్రు తలయూచి యాలోచించి చిత్రసేనసోయగము దలంచి యను మోదించిరి. వాండ్రు మీసములుదువ్వుచు బండిదగ్గరకువచ్చి బాప నోడా! యీ యాండువాండ్రు మువ్వురు నీదాపుననున్న యమ్మవారి గుడికింబోయి వత్తురు. బండివాండును నీవు నిందుండుండు.

వారు వచ్చినతరువాత నవ్వలపోవుదమని పలికిన గోణికాపుత్రుండు మేము మాత్రమురాంగూడదా? ఢాకినీదేవిమాకు సేవ్యురాలు కాదా! అని యడిగిన కింకరులు మగవారంతుం బోరాదు మీరిందే నిలువవలయుననుటయు నతండు మీరు మగవారుకారా? మీరెట్లు పోయెదరు? అని యడిగెను.

బాగు బాగు. మాకాజ్ఞాపింప నీవెవ్వండవు? పాఱుండవుగదా యని సంకెళ్లువైవక విడిగాందీసికొనిపోవుచుండం బాగరెక్కిపోయితివే మేము కావలివారము పోవచ్చును. మీరు రారాదు. నిలునిలుమని పలుకుచు నదలించి గట్టిత్రాళ్ళచే నతని నొకచెట్టునకుంగట్టి కదలకుండ బారిపోవకుండ జూచుచుండుమని బండివానికి నియమించివాండ్రాయాండువారిం దీసికొని యమ్మవారి గుడియొద్దకుం బోయిరి.

పిమ్మట గోణికాపుత్రుండు బండివానితో నోరీ! యీరాజభటులు కడుదుర్మార్గులు. ఆసుందరుల మానభంగముగావింప మనల నిందునాపి వారిందీసికొనిపోయిరి. మనయెదుట నక్రమముజరగుచుండ నూరకుండుట ధర్మముగాదు. నీకుమాత్రము ధర్మాధర్మ వివేచనము లేదా? నీవు జూచుచునేయుంటివి. ఆబాలికలు యోగినియు గుజగుజలాడుచు, గపటముచేయుచుండలేదా! నీవిప్పుడొకయుపకారము సేయవలెను. నాకట్లుల విప్పుము. మనమిరువురముపోయి వారినదలింతము. గుఱ్ఱెక్కుడుప్రాణము లెప్పుడుపోయినను పోవునవియేకదా. అబలలకు

నన్యాయము జరుగుచుండఁ గన్నులారఁజూచుచుండుట నీతియా ? అని వానికి జాలిపుట్టునట్లుపన్యసించిన విని యాబండివాఁడు సాహసముతో నాతనికట్లులన్నియుఁ ద్రెంపి పారవైచెను.

అప్పుడు గోణికాపుత్రుఁడు బండివాని వెంటఁబెట్టికొని వీరావేశముతో నారసింహమంత్రము జపించుచు నాఢాకినీదేవిగుడి దాపునకుఁ బోయెను.

విశాలశాఖలచే దిగంతములనావరించిన వటతరువుక్రింద పృథుశిలానిర్మితమగు నాలయములో ఢాకినీదేవి యొప్పుచున్నది. నాలుకజ్వాలికవలె వ్రేలాడ దంష్ట్రాకరాళవదనయగు నాదేవివిగ్రహము చూచువారికి వెఱపుగలుగక మానదు. మెడఁ గపాలమాలికయు హస్తంబుల నసిగదాతోమరాద్యాయుధంబులును వెలయ సింహాసనమున నాసీనయై యొప్పుచుండెను.

శక్తిగుడిమ్రోలనున్న నేలయంతయు నరులచే బలులొసంగిన జంతువులరక్తముచే సిక్తమై యట్టకట్టఁబడియున్నది. మఱియు నట్టిఢాకినీదేవి కట్టెదుటఁ గాలుసేతులుగట్టఁబడి మెడనుగట్టినవేపరొట్ట మోము దమ్మికి మెత్తనిపానుపై యొప్పు సాష్టాంగముగాఁ బండుకొనఁబెట్టిన రతిమంజరియు రతిమంజరికంఠము త్తరింపఁ గత్తిపైకెత్తి శక్తిదెస దృష్టులు వ్యాపింపఁజేసి ధ్యానించుచు నేయగమకించు మతంగయోగినియువారి కన్నులఁబడిరి.

అప్పుడు గోణికాపుత్రుఁడు రౌద్రావేశముతో నొడలెఱుఁగక నారసింహము జపించుచు నొక్కడుగులోఁబోయి యోగినియెత్తినకత్తి నట్టెపట్టుకొనిలాగి యోసీ ద్రోహురాలా ! యెంతపనిచేయుచుంటివి ? నీవంటి పాపాత్మురాలెందైనంగలదా? నీవెత్తిన కత్తియే నీకుమిత్తియైనది. నీవారాధించినదుర్గకే నిన్ను బలియిచ్చుచుంటిని. నీయభీష్ట దేవతల స్మరించుకొనుము.

అని యెడమచేతితోఁ దచ్ఛిరోజములు బట్టి లాగుటయు న య్యోగిని పెద్దయెలుంగున చచ్చితి చచ్చితి నన్ను జంపుచున్నారు. రండోయని రాజకింకరులఁగుఱించి యాక్రోశించినది.

అయ్యాక్రందనము విని యనతిదూరములోఁ జిత్రసేనను బల వంతపెట్టుచున్న రాజభటులు పటురయంబు శక్తిగుడి నికటంబున కరు దెంచిరి. వారింజూచి గోణికాపుత్రుండు యోగినినివిడిచి మదపుటేను గపైగవియు సింగంబు కొదమయుంబోలె కరవాలంబు నవలీలఁ దిప్పుచు ముప్పిరిగొను కోపముతో గుప్పవారిపై కురికెను. తోడనే బండివాఁడును రెండవవానిపయింబడియెను.

నిరాయుధులగు నాయోధు లాయసిధారలకు వెఱచి యందు నిలువక వెన్నిచ్చిపరవఁదొడఁగిరి. వారాబాటుల విడువక వెన్నంటి తరిమి కొనిపోయి నూఱడుగులలోఁ గలిసికొని యసిధారల వారల తలల నరికివైచిరి. రాజప్రణిధులు శమనలోకాతిథులైన వెనుక గోణికాపుత్రుఁడాప్రాంతమంత వెదకి యొడలెఱుఁగక యొకచో నేలంబడియున్న చిత్ర సేనంగాంచి శోకగద్గదకంఠుండై కలకంఠీ! లెమ్ము లెమ్ము. దైవము నీయిక్కట్టుతొలగించెను. శత్రువులు నాశనమైరి. నేను నీమిత్రుండ గోణికాపుత్రుండని పిలిచినంత నమృతమువర్షించునట్లు మురియుచు బోగముపట్టియట్టెలేచి యతనింగాఁగలించికొని మహాత్మా! ఎట్లువచ్చి తివి? శత్రువులెట్లుహతులైరి? అయ్యో! మనకెట్టిచిక్కుదినములు వచ్చినవి. మమ్మందుఁగట్టినప్పుడే మాకు దెలివిదప్పినది. రతిమంజరిని శక్తికిబలియిచ్చు యోగినికప్పగించి యాపాతకులు నన్నుదూరము గాఁ దీసికొనివచ్చి మచ్చికగా నేమేమో ముచ్చటించిరి. కాని యా మాటలేమియు నాచెవింబడలేదు. వివశనైపడిపోయితిని. ఇప్పుడు మీమాట వినినంత స్మృతివచ్చినది. నాముద్దుచెల్లెలు బ్రతికియున్నదా? అనియడిగిన గోణికాపుత్రుండు దానికిపెద్దగండము దాటినది. శక్తికి

బలియియ్య కత్తియెత్తి యేయబోవునంతలో నేనుబోయి బట్టుకొంటిని. అరనిమిషముదాటిన నాబోంటి జమువీటికరుగవలసినదే పైనదైవము లేడా అనిపలికినవిని యక్కలికియులికిపడి అయ్యో! నాసోదరి నాదరింపక విడిచివచ్చితిరా ? ఆదుష్టురాలు మఱల నేమిచేయునో పదుఁడని నొడివి వడివడివారితో నమ్మవారిగుడికడకుఁ బోయినది.

రతిమంజరి యట్టెపండుకొని బాహ్యాప్రచారములేక యంత రాత్మ నీశ్వరునర్చింపుచుండెను చిత్రసేన దానిస్థితినరసి యురమునఁ గరంబిడి అమ్మయ్యో యెట్టియాపదదాటినది. తల్లీ ! చెల్లీ ! లెమ్మ లెమ్మ. తల్లికడుపున వెండియు బుట్టితివి. అనిపలుకుచుఁ జేతులాని దానిలేవనెత్తి విలపింపఁదొడంగినది. అప్పుడు రతిమంజరి కన్నులందెరచి అక్కా ! మీరిక్కడికెప్పుడువచ్చితిరో నేనెఱుంగనుసుమీ? నాకాళ్లు సేతులుగట్టి మెడకువేపరొట్టగట్టి బలవంతమున నేలఁబండికొనఁబెట్టిరి. అంతవఱకు నెఱుంగుదును. పిమ్మటనేమయ్యనో తెలియదనిపలుకుచు దనకట్టులువిప్పుచున్న గోణికాపుత్రునికి నమస్కరించి కన్నులనశ్రువులు విడిచినది.

అప్పుడతండామచ్చెకంటిం గుఱిచ్చియెత్తి కన్నీరుతుడుచుచు మనము భగవదాజ్ఞకు బద్ధులము సంసారనాటకమునకతండ సూత్రధారుఁడు. జీవులకుఁగీడుమేళ్లు క్రమోపగతములు రెండుగడియలక్రిందట మనము మహావిపత్సముద్రములో మునిఁగియుంటిమి ! ఇప్పుడు మబ్బువిడినట్లు మనయాపదలు పటాపంచలైపోయినవి. కపటయోగిని లక్ష్మణుఁడు శూర్పణఖనుఁబోలె ముక్కుచెవులుగోసి విరూపనుజేసితీని అదియిందునిలువక యెందోపారిపోయినది. రాజభటుల నిద్దరను మేమిద్దరము క్రుద్ధులమై యీకత్తులచేఁ గడతేర్చితిమి? ఇంతకు నీబండివాఁడు నాకుమంచిసహాయముగావించెను. నాకట్టులవిప్పి తోడునీడై శత్రుసంహారముగావించెను. కత్తిద్రిప్పుటలో వీనికిఁగలనైపుణ్యము

నకులునకులేదని చెప్పఁగలను. ఎప్పుడు నేర్చెనో తెలియదనిపలికినవిని బండివాఁడు కత్తిక్రిందబెట్టి చేతులుకోడించుచు మహాత్మా! నేనేసాధనము నెఱుఁగను. బండితోలుటతప్ప వేరొకపని నాచేతగాదు నేనువట్టి పిరికివాఁడను రాజభటులఁజూచి గజగజలాడుచుందును. అదియేమి మహిమయో తెలియదు మీకట్టులువిప్పినప్పుడే నామేన నేదియో యావేశమైనది. మీరాయోగినిపైకురికినప్పుడు, నామేను పొంగిపోయి నది. ఏనుగంతబలమువచ్చినది. తటాలునఁబోయి యందున్నకటారిం గైకొని గిరగిరదిరుగుచు నాభటునెట్లువేసితినో యెఱుఁగను. ఇప్పుడే నాయావేశముడిగినది. నేజేసినపనితలంచికొన నాకే యబ్బురముగా నున్నదని యాశకటచోదకుఁడు చెప్పెను.

అప్పుడు చిత్రసేన గోణికాపుత్రునితో నార్యా ! మీరుమా త్రము కత్తిసాధనముచేసియున్నారా! యోధులపైఁబడి యెట్లుపరిమా ర్చితిరి ? ఇది వింతగానున్నదే యనియడిగిననతండు ఇది మదిష్టాభీష్ట దేవత నారసింహ ప్రభావంబుగాక యొండుగాదు. నన్నువాండ్రుగట్టి నప్పుడే సకవచంబుగా నరసింహమంత్రంబు జపించితిని అమ్మహాత్ముం డావేశించి మాచేనిట్టిపనిగావింపఁజేసెనని యెఱింగించెను. పిమ్మట వారుమువ్వురు నొండొరుల నూరడించుకొని యాయమ్మవారిగుడికిఁ బోయి యెదురనిలువంబడి చేతులుజోడించి పెక్కువిధంబుల స్తుతియిం చిరి. అందుమఱియు గోణికాపుత్రుఁడు

శా. దేవీ ! నీనికటంబుసేరుటఁ గడుందీర్పంగ రానట్టి మా
యావళ్లెల్లఁ దొలంగె నిప్పుడు ప్రహర్షాపారవారాశిఁదో
లాపీచీతతి నూగుచుంటి మహితుల్ పంచత్వముం బొందిరం
బా ! విశ్రాంతిగ నీకురూపమిటఁ బ్రత్యక్షంబుగాఁజూచి సం
సేవింపందొరకొన్న మాకిచట నేసిద్ధుల్ ప్రసాదింతువో ?

అని భక్తివివశుఁడై కన్నులుమూసికొని ఛాకినీదేవత ననేక

ప్రకారంబుల గొనియాడుచుండ నతనిచెప్పులకు విద్వాంసుఁడా! నీవచిరకాలములో మిత్రులంగలసి యత్యంతసంతోషంబులం జెందకలవు అనుమాటలు వినంబడుటయు నతఁడు గన్నులందెరచిచూచి యామాటలాడిన వారిఁగానక దేవీప్రోక్తంబుగాఁదలంచి యమ్మించుబోఁడుల కత్తెరం గెఱింగించె నప్పుడు చిత్రసేన యిట్లనియె.

ఆర్యా! ఇందలిశిలాశాసనము జదివిజూచితిని. మనోహరరూపయౌవనద్యోతినియగు వారయువతింబలియిచ్చినవారి కీదేవికోరినవరంబుల నిచ్చునఁట. అందులకే యాయోగినిపలుమారు మాచెంతకువచ్చి ఢాకినీదేవియొద్దకుఁ దీసికొనిపోయెదనని చెప్పునది. దైవము దానికిబ్రతికూలుఁడై యుండ గోరికయెట్లుతీరును. విపరీతము జరగినది. దానిం జంపక విరూపంజేసి విడిచితిరి. శూర్పణఖ రావణునికిఁబోలె నిది యారాజునకుబోధించి మఱలఁ జిక్కుదెచ్చిపెట్టునేమో ? వేగమీదేశము దాటిపోవుట లెస్సయని యుపదేశించుటయు నతండామాటల కంగీకరించెను. బండివానికిఁజెప్పి వారుబండియెక్కి హుటాహుటి పయనంబుల నాదేశముదాటి యొకనాఁటిరాత్రికి ధారానగరంబు సేరిరి. అని యెఱిగించి తరువాతికథ పైమజిలీయందిట్లు చెప్పందొడంగెను.

## 146 వ మజిలీ

### దత్తకశాపవిముక్తి కథ.

చారుమతియు రుక్మిణియు నెప్పుడు నొక్కమంచముమీఁద నే పండుకొనుచుందురు. ఒకనాఁటిరాత్రి యిరువురు పండువెన్నెలలోఁ బూవుపానుపునఁబండుకొని ప్రొద్దుపోవువఱకు విద్యావిషయంబుల ముచ్చటించుచుండిరి. రుక్మిణిసూత్రవిషయంబులన్నియు స్మరణకుఁదెచ్చికొని సఖీ! చారుమతీ! నీవంటి విదుషీమతల్లివలనఁగాని యీ సాంప్రదాయములు తెలియఁబడునా; మొదటఁజూచిన నీపుస్తకమేమియుం దెలిసినదికాదు. ఇప్పుడంతయుం గరతలామలకముగా నున్నది. ఇందులకు

దగిన పారితోషికము నీకిచ్చుటకు నాయొద్ద నేమియులేదు. ఇదిగో ప్రీతిపూర్వకముగా నిన్నాలింగనము సేసికొనుచుంటిని. ఈపరిష్వంగమే మన ప్రేమానుబంధమును దృఢపరచుఁగాక యని కౌఁగలించుకొనుచు జెక్కులుముద్దుపెట్టుకొన్నది.

చారుమతియుఁ బ్రత్యాశ్లేషముగావించి రాజపుత్రీ! నీసౌందర్య చాతుర్యాది విశేషంబుల కనుగుణుండగు భర్తలభించి యతనితో నతను క్రీడలఁ దేలుచున్నప్పుడు నన్ను స్మరింతువుగాక. నాఁడుగదా నాయుపదేశమునకు ఫలము. అని యుత్తరము చెప్పినది. ఆబోఁటి సిగ్గు పెంపున నేమియు మాటాడినదికాదు. అట్లు వారు పెద్దతడవు సంభాషించుకొనునంతలో నన్యోన్యాలింగితాంగలై నిద్దురవోయిరి.

నాఁటి యపరరాత్రంబున రుక్మిణికి మెలకువవచ్చినది. తనపైఁ జేయివైచుకొని నిద్రించుచున్న చారుమతిచేయియుఁ బాదంబులు బరువుగాఁదోచుటయు రాజపుత్రిక మెల్లగలేచి యందొక చక్కని పురుషుండు పండుకొని యుండుటంజూచి యబ్బురపాటుతో అహా! ఈ మోహనాంగుఁ డెవ్వఁడు? చారుమతి యేమైనది? ఈసుందరు నాయుం దరఁ బవ్వళింప జేసి తానెందో డాగియున్నదా? వీని నీశుద్ధాంతమున కెట్లు తీసికొనివచ్చినది? తలంచికొన నేదియు సరిపడకున్నది? కానిమ్ము. ఏదియైనను వీనిమేనిసంపర్కము నాకుఁ గలిగినదికదా? వీఁడే నాభర్త కావలయును. ఆహా! వీని సౌందర్య మెంతచూచిన తనివి తీరకున్నవి. చారుమతి నాకు మంచి యుపకారము గావించినది. వీని లేపి నీవెవ్వఁడవు? ఎట్లువచ్చితివని యడుగుదునా? అయ్యో! ఊరక వీనికి సుఖనిద్రాభంగము సేయనేల? తెల్లవారదా తొందరయేల? అనితలంచుచు వానినాపాదమస్తకముగాఁ బరీక్షించి యుత్తమ పురుష లక్షణంబులుండుట గ్రహించి యమ్మించుబోఁడి వేరొకమంచముపైఁ బండుకొని ధ్యానించుచుండ నంతలో నిద్రపట్టినది.

పిమ్మట నాపురుషునకు మెలకువవచ్చినది. నలుమూలలు సూచు చు నాహా! నేటితో నాకు యక్షశాపము సమాప్తినొందినది. సంవ త్సర మైనది కాఁబోలు. జరగిన చర్యలన్నియు నాకుస్వప్నప్రాయములు గానున్నవి. ఇప్పుడీ రాజపుత్రిక నిద్రించుచున్నది లేపి నావృత్తాంత ముజెప్పి యేగుదునా ? ఏమో? దానికేమి కోపమువచ్చునో ? స్త్రీలు చపలహృదయలుగదా ? చెప్పకపోవుటయే లెస్స చీకటియుండగనే యొరులెరుఁగకుండ నీశుద్ధాంతము దాటిపోవుటమంచిది. దీనిసౌంద ర్యమునూచి విడిచి పోవలయునని మనసురాకున్నది. ఇదిలేచి నాయం దనురాగముచూచించిన మేలగు లేకున్న ప్రమాదమగు నప్రత్యక్ష మగు పరబుద్ధినమ్మి యిందుంట నీతికాదు అని తలచుచు నాదత్తకుండు తెలతెలవారుచుండ నంతర్భవనములుదాటి యవ్వలికింబోయెను.

సింహద్వారమునఁ గాచియున్న భటులతనింబట్టికొని నీ వెవ్వఁ డవు ? అంతఃపురమున కెట్లుపోయితివి ? ఇది గొప్పతప్పితము నీకథ జెప్పుమని యడిగిన నతండేమి చెప్పుటకుం దోచక తబ్బిబ్బుపాటూ డెను అప్పుడతని నపరాధిగాభావించి బద్ధుంజేసి నారాజభటులు భోజుండు కాళిదాసుందీసుకునిరా దేశాంతరమరిగియున్న కతంబున నప్పుడు రాజకార్యముల విమర్శింపుచున్న రాజపుత్రుఁడగు చిత్రసేనుని మేడ కుం దీసికొనిపోయి యయ్యపరాధ ప్రకారమంతయుఁ బత్రికాముఖం బున నతనికిఁ దెలియఁజేసిరి.

రాజపుత్రుండు మంచముపై బండుకొని యొక బ్రాహ్మణ మిత్రుండు ప్రక్కంగూర్చుండి మంచిమాటలు చెప్పుచుండ నాలిం చుచు దండనాథుండు పంపిన పత్రికనువిప్పి చదివి విసువుతోప మిత్రమా! దండనాథుఁ డపరాధి నెవ్వనినో తీసికొనివచ్చెను. నీవుపోయి విమర్శించి రమ్ము నా కోపిక లేదని యాచీటి నతనిపైఁ బడవైచి తాన వ్వలి మొగంబై పండుకొనియెను.

ఆ బ్రాహ్మణపుత్త్రుండా పత్రికనందుకొని వాకిటకువచ్చి రాజపురుష వేష్టితుండగు దత్తకుంజూచి సంభ్రమాశ్చర్యములతో నాప్రాణమిత్త్రుండు దత్తకుండా? అయ్యో! శుద్ధాంతమునకేమిటికి బోయితివి? అని యడిగిన నతండు గోణికాపుత్త్రుండా! ఔరా? యెంతచోద్యము అని పలుకుచు నతనిం గౌఁగలించికొని మిత్త్రుఁడా! వీండ్రు నన్నూరక నిర్బంధించివారు అపరాధమేమియుఁ జేయలేదు. దారి తెలియక లోపలికి గొంచెము దూరముబోయితిరిగి యప్పుడేవచ్చితిని. అని చెప్పినవిని గోణికాపుత్త్రుఁడు చాలు చాలు. ఈతఁడా? అపరాధి ఇతఁడు రాజపుత్త్రుని మిత్త్రుఁడు పో. పొండని యదలించిన రాజకింకరులు మారుమాట పలుకనేరక యవ్వలికి పోయిరి. పిమ్మట దత్తకుండు గోణికాఁపుత్త్రుని హస్తము గైకొని మిత్త్రమా! నీవెప్పుడు వచ్చితివి? రాజావలంబన మెట్లుగలిగినది? మనమిత్త్రులలో నెవ్వరైన వచ్చియుండిరా? విశేషము లేమని యడిగిన నతండిట్లనియె.

నేను శుభముహూర్తంబునఁ గాశీపురంబు బయలువెడలి పూర్వదక్షిణముగాఁ బోవుచు నొకయగ్రహారంబున గోమదండను బ్రాహ్మచారికి వివాహముగావించి యటఁగదలి యనేక జనపదంబులు జూచుచు నీ జన్మభూమియగు పాటలీపుత్త్రనగరంబున కరిగితిని అందు రతినూపురయను వేశ్యయింటి కతిథిగా బోయితిని. దాని పెద్దకూఁతురు చిత్రసేన బాల్యంబున నీతోఁ జదివికొనినదఁట నిన్నేగాని పెండ్లియాడనని నియమము చేసికొనినది. రెండవదియగు రతిమంజిరి నన్ను వరించినది. వారిరువురు సర్వైశ్వర్యములువిడిచి నాతో బయలుదేరిరి. మార్గమధ్యంబున మతంగయోగిని ఒన్నికకపటంబునంబడి ప్రాణసంకటంబగు నిడుమలం గుడిచితిమి. దైవకృప నావెతల నతిక్రమించి యొకనాఁటిరేయికి నీ యూరుచేరితిమి. పురవిశేషములఁ దెలియని వారమగుట నాఁటి రేయినూరి బయిలనున్న సత్త్రములోఁ బఢుకొంటిమి. ఆరాత్రి నాకు

గాఢముగా నివ్రిపట్టినది. తెల్లవారి చూచువఱకు నాతరుణు లిరువ్రురును వాకిట దింపిన బండియు బండివాఁడును గూడఁ గనంబడలేదు.

అప్పుడు మిక్కిలి పరితపించుచు నీ నగరమంతయు వెదకితిని. వారిజాడ యేమియుం దెలిసినదికాదు. క్రిమ్మరమేము వచ్చినదారి కొంతవఱకు వెదకితిని. కార్యము లేకపోయినది. అది దైవకృతముగాఁ దలంచి పరితపించుచు మఱల నీనగరమునకువచ్చి దేవాలయ గోపుర సత్రకుడ్య భాగంబులు పరీక్షించితిని. మన మిత్రులెవ్వరువచ్చిన చిహ్నము లేమియుఁ గనంబడలేదు. ఇందూరకుండ నేలయని యొకనాఁడు ప్రాతఃకాలమునఁ బండితవేషముదాల్చి రాజదర్శనార్థమై నగరి కరిగి తీని భోజభూపతి దేశాంతరమరిగియున్న కతంబున నతని పుత్రుండు చిత్రసేనుండు పండితుల నాదరించుచున్నవాఁడని విని యతండున్న నెలవునకుఁబోయి కొన్నిశ్లోకములు రచించి స్తుతియించితిని.

రాజపుత్రుండప్పుడొక మంచముపైఁ బండుకొని యుండెను. తనకు దేహములో స్వస్థతలేదనియు నిప్పుడు మీకవితాచమత్కృతి వినుటకు సమయముగాదనియుఁ బలుకుచుఁ గొన్ని దీనారములు నాకుఁ గానుకగా నిప్పించెను. వానిని నేనందుకొనక రాజపుత్రా! నేను విత్తార్థినై రాలేదు. మీసంస్థానమున విద్వాంసులుండిరని విని ప్రసంగింప వచ్చితిని. వాద పారితోషిక మిప్పింపుఁడు మఱియు మీదేహకృశత ముఖపాండిమముజూడ మీరోగము శరీరజన్యము కానట్లు తోచుచున్నది. ఇది శరీరజకృతమగుట నిక్కువము. ఆవ్యాధికిమందు నేనెఱుంగుదునని పలికినంత నానృపసూనుండు తెలిసికొని చెంతనున్న వారి నవ్వలికిం బొమ్మని నన్నుఁదనప్రక్కఁ గూర్చుండ బెట్టికొని యిట్లనియె.

మహాత్మా! నీవు నావ్యాధి గ్రహించితివి. దీనిబాధ యిట్టిదని చెప్పఁజాలను. ప్రతీకారమెట్లు? ఔషధమేమి? అని యడుగుటయు నేను మెల్లగా నీవెవ్వతెంజూచి యీవిరాళిం గుందుచుంటివి? అది

యేమిటికి లభ్యముకాలేదు? చెప్పుమనుటయు నతండిట్లనియె. చారుమతి యను వేశ్య నాహృదయ మాకర్షించినది. అది త్రిభువన యువతి జనా తీతసౌందర్యంబునం బ్రకాశించుచున్నది. అందరానిఫలమై నాసహోదరి యంతఃపురమున వసించియున్నది. దానిం జూచినది మొదలు నన్నీ వ్యాధి బాధించుచున్నదని యావృత్తాంతమంతయు నెఱింగించెను. ఆ మాటవిని నేనాపడంతి నొకసారి నాకన్నులంబడునట్లు చేయగలరా? అని యడిగిన నతండాలోచించి యట్లొకావించెదఁ దగినతంత్రమాలోచింపుఁడు. అని పలికి నాకుఁ దగిన నెలవు నిరూపించి యంపించెను.

కాశినుండి యొకపండితుండు వచ్చెననియు నతనికి సంస్థానకవులకు రేపుప్రసంగముజరుగుననియు నంకులకుఁదగిన మధ్యవర్తి లేడనియు నీయొద్దనున్న చారుమతి మహావిద్వాంసురాలని వింటిమికావున నాపూవుఁబోఁడిని మధ్యవర్తినిగానుంచి జయాపజయంబులు నిరూపించుటకై కోరితిమి కావున సభవేళకుఁ బంపవలయునని మాతండ్రి చెల్లెలికిఁ జీటివ్రాసి యంగీకరించినట్లు ప్రత్యుత్తరము దెప్పించుకొని యా వార్తఁ దమపండితులకుఁ దెలియఁజేసెను.

మఱునాఁడు యథాకాలమునకు సభకూడినది. అయ్యాలగము లోనే యొకదెసఁ దెరగట్టించిరి. రాజపుత్రికతోఁ గూడఁ జారుమతి యా తెరలోఁ జేరినది. యవనికాముఖంబునం గూరుచుండి మా వాదము లాలించినది. నాకును సంస్థానవిద్వాంసులకు రెండుగడియలు ప్రసంగము జరగినది. మధ్యవర్తిని చెప్పకుండఁగనే తామోడిపోయినట్లొప్పుకొని యాపండితులు నన్ను స్తుతిజేసిరి.

అప్పుడా యువతియే రోసమెక్కి రాజపుత్రిక ప్రోత్సాహమున వాదమునకుఁ బూనికొనినది. మాయిద్దరకుఁ బెద్దతడవు ప్రసంగము జరగినది. వయస్యా! నీతో నేమనిచెప్పుదును. మనమెన్ని చదివితిమో యదియు నన్నిచదివినది. మనయుపాధ్యాయులే దానియుపాధ్యాయులని

తలంచెదను. నేను వేశినశంకలన్నియు నదిసమాధానము చెప్పినది. దాని శంకలు నాకుసులువుగానే బోధపడినవి. మావాదమున జయాపజయంబు లెవ్వరును నిరూపింపక లేకపోయిరి. అది నన్ను నేనుదానిని స్తుతియించుచు నంతటితో సభముగించితిమి. మిత్రమా! దానిమొగము జూడ నీమొగముజూచినట్లే యున్నది. పెక్కేల ప్రసంగము గూడ యుక్తిప్రయుక్తులతో నీవుచేసినట్లే చేసినది. రాజపుత్రునకు దానివిద్యాప్రౌఢిమజూచినతరువాత మఱియు విరహపరితాప మధికమైనది. మఱునాఁడు నేనుబోయినంత ఆర్యా! మీరన్న కార్యము తీర్చితిని. ఇఁక నా కార్యము గావింపవలయును. ఏమితంత్రమాలోచించితిరి? అనియడిగిన నేను నిట్టూర్పునిగుడించుచు రాజపుత్రా! అయ్యంబుజనేత్రి నాతంత్రములకు లోఁబడునదికాదు. ప్రతితంత్రములు దానికిఁదెలియును. నా మిత్రుఁడు దత్తుఁడనువాఁడు నేఁడోరేపో రాఁగలఁడు అతఁడుమంచి ప్రౌఢుండు వాఁడు తృటిలో వశవర్తినిఁ జేయఁగలఁడని చెప్పితిని. అతండు నీయాగమన మభిలషించుచున్నాఁడు దైవికముగ నేఁడేవచ్చితివి ఇదియేనావృత్తాంతము. ఈకారణమున రాజపుత్రునితో మైత్రిగలిసినది. గడియగనంబడక పోయితి నేని పదివర్తమానములు పంపును. చాల మంచివాఁడు చూతువుగాని రమ్ము అనిపలికి గోణికాపుత్రుండు దత్తుని లోపలికిఁ దీసికొనిపోయి రాజపుత్రునకుఁజూపుచు నితఁడే నామిత్రుఁడు దత్తుఁడు అని యతనియాగమనప్రకారమంతయుఁ దెలియఁజేసెను.

అప్పుడు రాజపుత్రుండు విస్మయముతో లేచి నమస్కరించుచు మహాత్మా! మీప్రభావ మిదివఱకే వినియుంటిని. మీదర్శనమైనది. నామనోరధము సఫలముగాఁగలదు. నన్నుమిత్రునిగాఁ బుత్రునిగా భావించి కాపాడుము కడమసంగతులన్నియు నీతఁడే యెఱింగించును. అని పలికి శయ్యపైఁ బండుకొనియెను. తరువాత గోణికాపుత్రుఁడు వెండియు చారుమతివృత్తాంతమంతయు నతనికెఱింగించెను. దత్తకుఁడా

కథవిని కనుబొమ్మలెగరవైచుచు ఆ! ఏమీ! ఆగణిక యంతనిపుణిక యా? వేశ్యలకు వ్రతముకూడనా? ఔరా! ఎంతచోద్యము వెలయాలట పురుషులఁజూడదఁట మీరుదాని టక్కులలోఁ జిక్కితిరి. సీ! సమయమునకుఁ బనికిరాని మీచదువేమిటికి? అనిమిత్రు నాక్షేపించుచు రాజపుత్రా! నీవిఁకకుందకుము. రేపురాత్రికి నానాతి నీశయ్యఁజేరునట్లు చేసెదను నాప్రజ్ఞ జూడుము అనుటయు నతండు తటాలున లేచి వచ్చి దత్తునిగౌఁగిలించుకొని వీఁడు నీమిత్రుఁడు కనికరింపఁబాత్రుడు. సిగ్గువిడిచి చెప్పుచుంటిని. ఆవాల్గంటి కంటికిఁగట్టినట్లు సర్వదా కనఁబడుచుండును. నీవిప్పుడాడినమాట జెల్లించుకొని నీయాప్తుని బ్రతికించుకొమ్ము అని వేడికొనియెను.

దత్తుఁ డతనిమంచముపైఁ గూర్చుండి యతనిచేయిఁ బట్టుకొని యుపలాలించుచు మిత్రమా! నీవాత్రపడకుము. అయ్యంబుజనేత్రి నొకసారి నాకగపడునట్లుచేయుము. నీకోర్కదీర్తునని చెప్పెను రాజపుత్రుఁడాలోచించి యొకచీఁటివ్రాసి చెల్లెలియంతఃపురమునకుఁ బంపెను. దానికిఁ బ్రత్యుత్తరమిట్లు వచ్చినది. సహోదరా! క్రొత్తపండితునితోఁ బ్రసంగింప జారుమతిం బంపమని వ్రాసితివి. ఆయన్నుమిన్న మొన్నటి నుండి కనంబడుటలేదు. ఆసుందరి యెందుఁబోయినదో తెలియకున్నది. వచ్చినవెంటనే పంపఁగలను. ఇట్లు మీప్రియసహోదరి రుక్మిణి.

రాజపుత్రుఁ డాయుత్తరముచదివి నాలుకగోసిన మూగవలె మాటాడక దత్తునిమొగము జూచెను. అతండతని దైన్యము గ్రహించి రాజనందనా! మిమ్మాసుందరి వెఱపించుటకు నందే డాగియుండును. ఎందుబోఁగలదు? నేఁడుగాకున్న రేపాయెను. మేమిందేయుండెదము గదాయని పలికినఁ జిత్రసేనుఁడు ఇది నాప్రారబ్ధముకాఁబోలు. అనివగచుచు వచ్చుచు బోవుచుండుఁడని చెప్పి వారినెలవున కనిపెను.

గోణికాపుత్రుండు దత్తునితనబసకుం దీసికొనిపోయి చారుమతి

విద్యాప్రతాపములం గూర్చి పెద్దగాఁ బొగడుచుండ దత్తుఁడు నవ్వుచుఁ జూచినంగాని నమ్మనని యుత్తరము చెప్పెను.

మఱునాఁడు వాడుకప్రకారము నగరికరుగుచు గోణికాపుత్రుం డు దత్తునితో మిత్రమా! నీవు రాజపుత్రునొద్దకు వత్తువా? అని యడిగిన నతండీనగరవిశేషములం జూడఁబోయెద. నీవే పోయిరమ్ము. రాజపుత్రునితోఁ జెప్పుము. అని పలుకుటయు గోణికాపుత్రుండట్లు కావించెను.

దత్తుండును రుక్మిణీ విరహాపరితాపము చిత్తంబుత్తలపెట్ట నావీటిలోని యంగళ్ళవెంట దిరిగితిరిగి యందొకదేవాలయము గోపురద్వారమునఁ గూర్చుండి యచ్చటివింతలం జూచుచుండెను. అంతలో నొక పరిచారిక యాప్రాంతములందిరుగుచు నతనియొద్దకువచ్చి యెగాదిగఁ జూచి తనచేతనున్న చిత్రఫలకము పరికించి మఱల నతని మొగము నూచి తలయూచుచు స్వామీ! మీదేయూరని యడిగినది.

అతండు దానివంక జూచి నీవుచిత్రలేఖనా! యేమి? నన్ను సవితర్కముగాఁ జూచుచుంటివేల? నాకులగోత్రనామములతో నీకేమిపని? అనియడిగిన నాజవ్వని నవ్వుచు మీరనిరుద్ధులైనచో నేనుజిత్రలేఖనే. పనియుండియే మిమ్ముఁ బలుకరించితిని. ఈచిత్రపటమును జూడుఁడు? మీప్రతిబింబము కాదా? అనుటయు నతండు దాని బరికించి యిది నాయాకృతియే దీనివ్రాసిన యాకృతులెవ్వరు? అని యడిగిన నాపరిచారిక మెల్లగ మీరెప్పుడైన భోజరాజపుత్రికయగు రుక్మిణి యంతఃపురమునకు వచ్చితిరా?

దత్తకుఁడు—(నగుమొగముతో) శుద్ధాంతమునకు నే నెట్లు రాఁగలను?

పరిచారిక—పోనీ చారుమతి నెఱుంగుదురా?

ద—ఎఱుఁగుదును ఆమెయే నేనుగాఁ గొన్నినాళ్లు మెలంగితిని.

పరి—మిమ్మొకొమ్మ మాభర్తృదారిక యంతిపురికిఁ దీసికొని వచ్చి విడువలేదా ?

ద—విడిచినదేమో జ్ఞాపకములేదు.

ప—అబ్బా! మీకునమస్కారము నిజమేదియో యెఱింగింతురు!

ద—ఎఱింగించిన ఫలమేమి ?

ప—ఫలము చూపుదును కాదా !

ద—దారితప్పి మీయంతఃపురమునకు వచ్చితి ననుకొనుము. అందుల కేమందువు ?

ప—మఱల నామెకొకసారి నేత్రపర్వము గావింపుమని.

ద—అది యెట్లుశక్యము ?

ప—(చెవిలో) ఇటునటుయని యేదియో జెప్పినది. అతఁడంగీకరించెను. పరిచారిక యతని యనుమతివడసి యంతఃపురమున కరిగి యావృత్తాంతమంతయు రుక్మిణి కెఱింగించినది.

రుక్మిణియుఁ బరిచారికయగు రేవతిచెప్పిన మాటలు విని పరమానంద సంభృతహృదయయై మనోహరమణిభూషాంబరధారిణియై నాఁటిసాయంకాలమునఁ బెందలకడ నశ్వశకటమెక్కి రేవతి తోడరాఁ గేళీవనంబున కఱిగినది భర్తృదారిక నేఁడు వేగమువచ్చినదని తొందరపడుచు వనపాలికలు పీఠాదికముల సవరింప వారిదెసం జూడక నితర విశేషము లేవియు బరిశీలింపక నాచంపకగంధి తిన్నగాఁ గేళీసౌధంబునకుంబోయినది.

పుష్పపాలికలు మాలికలుగుత్తులులోనగు పూవుటెత్తులఁ గానుకలగాఁ దీసికొనివచ్చి మూఁగి యందియుఁడు నందుకొని వారినందఱ దూరముగాఁ బోవునట్లు పనులునియమించి రేవతితో సౌధాంతరమున వసించి యేకాంతమాడుచు నాపురుషునితో నేమనిచెప్పితివి? ఏమని యుత్తరమిచ్చెను ? మఱలనొకసారి చెప్పుమని యడిగిన నాపడఁతి యిట్లనియె.

దేవీ ! యాంచతురుండు నన్ను వేసి వేసి చివరకు యథార్థము జెప్పెను. చారుమతిమాట యేమియుఁ జెప్పలేదుకాని తాను స్త్రీవేషముతో నీయుద్యానవనమున సాయంకాలమున వచ్చుటకంగీకరించెను నన్ను ద్వారమునొద్దఁ గాచికొనియుండుమనియెను. ఈచిత్రఫలక మతనిదే. స్పష్టముగాఁ జూచితినని యాకథయంతయు నెఱింగించిన మేను పులకింప నా కురంగనయన వేళయైనది. నీవు గుమ్మముదాపునకుఁ బోయి కాచికొనియుండుము. నీవు లేకున్న జిక్కుపడఁగలఁడు. క్రొత్తవాఁడుగదా ? యని రేవతికి నియమించి యతండువచ్చిన తరువాతఁ దాను గావింపవలసిన కృత్యములగుఱించి యాలోచించుచుండెను.

రేవతియుఁ దోటగుమ్మముదాపునకుఁబోయి యతనిరాక కెదురుచూచుచుండెను. సూర్యుండపరగిరిశిఖర మలంకరించు సమయమున నొకరమణీమణి యాద్వారముదాపునకు వచ్చినది.

ఆయువతీమతల్లినిఁ జారుమతిగాఁ దెలిసికొని రేవతి యబ్బురపాటుతో నోహో ! మోహినీ! క్రొత్తదానవువలెఁ జంకుచుంటివేమి? యెందుబోయితివి. రాజపుత్రిక యిందేయున్నది. రమ్ము. నీవియోగమున మిక్కిలి పరితపించుచున్నదని పలుకుచుఁ జేయిపట్టుకొని లోపలికిఁ దీసికొనిపోయి రుక్మిణికడఁ జేర్చినది.

రుక్మిణి యాముద్దియంజూచి దద్దరిల్లుచు నద్దిరా! మాపుణ్యము సఖీ ! నన్నెంతమోసము జేసిపోయితివి ! యీనాలుగుదినములు దుర్దినములైనవిగదా ? యని పలుకుచు గాఢాలింగనము జేసికొని మంచముపైఁ గూర్చుండఁబెట్టికొని యెక్కడికిఁబోయితివో చెప్పుమని గట్టిగా నిర్బంధించుటయుఁ జారుమతి నవ్వుచు జవ్వనీ ! నేనిఁక నీకడ నుండనోప. మీయన్న నన్నుఁగన్నది మొదలు మదనవేదనంబొదలుచు ననేకవార్తల నంపుచున్నాఁడు. ఆపత్రిమాదమెఱుఁగి నీ కెఱిఁగించిన బోనీ

యనని నాఁడు చెప్పకయే తప్పించికొనిపోయితిని. అక్కటా ! స్నేహా నుబంధము కడుచిక్కనిదికదా ? కాశికింబోవలయునని తలంచియుఁ గాళ్ళురాక యిందు నీరాకపిని మఱియొకసారి చూచిపోవలయునని వచ్చితిని. కన్నులు చల్లబడినవని పలికిన విని రుక్మిణి యిట్లనియె.

సఖి నన్ను వియోగసాగరంబున మునుంగఁజేసి యేగితి వది యట్లుండె నాపక్క నెవ్వనినో పరుండఁబెట్టిపోయితి నతండెవ్వఁడు? అంతలో స్మృతినభినయించుచు రేవతీ! యీయుత్సవములో నామాట మఱచిపోయితివిగదా ? నీవుపోయి ద్వారమున వేచియుండుమని దాని నియోగించి మఱియు నామెతో నేనది స్వప్నమనుకొనుచుఁ గొంత సేపు తొట్రుపాటు చెందితిని. అతనిరూపు కన్నులకుఁ గట్టినట్లుండుటఁ జిత్రఫలకమువ్రాసితి నిదిగోచూడుము. నీవలె నతండును తెల్లవారక పూర్వమే యెందో పోయెను.

అది యింద్రజాలమో స్వప్నమో నిజమో తెలియకున్నది. ఆపురుషుఁడెందైనఁ గనంబడునేమోయని రేవతిచేతికాచిత్రఫలకమిచ్చి పట్టణమంతయుఁ ద్రిప్పించితిని. నీయొద్దదాచనేల ? ఆతండొకచోటఁ గనంబడి యాఁడువేషముతో నీయుద్యానవనమునకు వత్తునని చెప్పెనఁట అందులకే మేము పెందలకడవచ్చితిమి వానినిమిత్తముబంపిన నీవు గనంబడితివి. ఇప్పుడు వెండియు రేవతి యందులకేపోయినది. ప్రియ సఖీ ! యిఁకనాకుఁ గొదవయేమియున్నది. నీవేవచ్చితివిగదా ? ఆపురు షునివృత్తాంతము చెప్పుమని గడ్డముబట్టుకొని బ్రతిమాలికొన్నది.

చారుమతి నవ్వుచు నతండొక దివ్యపురుషుఁడు నీకట్టివాఁడు భర్తగానుండిన బాగుండుననితలంచి తారతమ్యపరీక్షకై నీప్రక్కఁబరుం డబెట్టితిని. నీవు జూచుకొంటివిగదా? నీకనుకూలుఁడనితోచెనా? సౌం దర్యమెట్లున్నది ? చెప్పుమనియడిగిన నాపడఁతుక అబ్బా! యీమాట లకేమి ? సఖీ ! వాఁడెందువోయెనో చెప్పుము. అనుకూలుఁడనితోచి

యేకాదా నీవు వాని నాపఱిక్కఁబరుండఁబెట్టితివి. నీకంటె నేనెఱింగిన దాననా? వానింజూపుమని మఱియును బలవంతపఱచెను.

అట్లున్మత్తాలాపము లాడుచుండఁ బకపక నవ్వుచు జారుమతి యూరక తొందరపడియెద వేమిటికి? యీరేయి నిందువత్తునని యతం డే చెప్పెనుగదా! రానప్పుడు మాత్రముగాని వానింగూడిన నిఁక నాతో మాటాడవేమో? వాఁడువచ్చిన నేమిచేయుదువు? నిజము చెప్పుము? అని యడిగిన నమ్మగువ సిగ్గుతోఁ బోనిమ్ము నేనేమియు మాటాడను. అంతకును నీదేభారము అని యూరకొన్నది. అంతలోఁ జీకటిపడినది. రేవతి యరుదెంచి దేవీ! నియమించిన సమయము దాటి నది. ఇఁకరాడు. అది కపటపుపలు కేమోయని నివేదించినది. రుక్మిణి దైన్యముదోప నంతయు నీమెలోనున్నది. మనము వెఱ్ఱిపడుచుంటిమి. ఈమె సెలవులేక యాపురుషుండు మనచెంతకువచ్చునా? అంతుల కీమెనే యారాధింపవలయుననిపలుకుచు నామెచైదండఁగొని బండి యెక్కించి యంతఃపురమునకుఁ దీసికొనిపోయినది.

ఇంటికిఁబోయినదిమొదలావాల్గంటి యొండుతలంపులేక చారు మతితో సఖీ! ఆపురుషుడెవ్వడు? ఎక్కడనుండితీసికొనివచ్చితివి? ఎక్కడికిఁబంపితివి? అతండు స్త్రీవేషముతో వత్తునని నమ్మించి యేటికి రాలేదు? అందునీపోరితాసహము కొంతయుండవచ్చును. మొదటఁ గావలివారలఁదప్పించి యెట్లులోపలికిఁ దీసికొనివచ్చితివి? నీవుసర్వదా మాయొద్దనేయుండుదాననవే! యవ్వలికెట్లుపోయితివి? తలంచికొన నేమియు సందర్భముకలియుటలేదు నీశిష్యురాలిం గనికరించి నిక్కము వక్కాణింపుము. దాచనేల? ఆ దివ్యపురుషునిఁ జూచినది మొదలు నామదినేదియో పరితాపము జనించుచున్నది నీపాదంబులకుమ్రొక్కెద నీబాధ వోగొట్టుమని యమ్మగువ కాళ్లంబడి గట్టిగా నిర్బంధించినది.

అప్పుడు చారుమతినవ్వుచులేవనెత్తి కౌఁగిటఁజేర్చుకొని చెక్కులు

సవరింపుచు మానినీ ! వానిం జూపించిన సంతసింతువా ! ఏమి చేయు దువు ! ఇప్పుడే మఱలం దీసికొనివచ్చెద నేమి పారితోషికమిత్తువో చెప్పుము. అతండు దివ్యుండని చెప్పలేదా? వానిరాకకుం గోటలు నగడ్తలు నాటంకములుకావు. అదియోగశక్తియని పలికిన సక్కలికి మఱియు విరహాతురయై నీవు వాని నిప్పుడు తీసుకొనివత్తువేని నిత్యము నీ పాదసంవాహనము గావించుచుండెద నింతకన్న వేరేమిచ్చినను నీకు సంతసము గానుగద. నాదేహము నీకర్పించెద నీకు దాసురాలినై యుండెదనని చెప్పినవిని యాచారుమతి కానిమ్మ ఎట్లైన నీయభీష్టము తీర్చుట ముఖ్యము ఇప్పుడే రప్పించెదం గన్నులుమూసికొమ్ము. తెరచినం బ్రమాదముసుమీ? యని చెప్పిన నప్పుడతి కరతలములం గన్నులపైం గప్పికొని గట్టిగా మూసికొన్నది.

అప్పుడు చారుమతి

గీ. దివ్యపురుష ! రమ్మ ! ధృతివాయ రుక్మిణీ
రమణి నిన్నుఁగూర్చి రక్తయగుచు
విరహబాధఁ జెంది పరితాప మందెను
గరుణ వేగవచ్చి కావుమయ్య.

అని చదువుచుఁ దన స్త్రీవేషముదీసి తొంటిపురుష వేషమును ధరించి యందున్న పుష్పమాల్యాను లేపనాదుల నలంకరించుకొని రుక్మిణి ప్రక్కంగూర్చుండి సన్నని యెలుంగుతో అబ్బా! యీచారుమతి పలుమారు రప్పించి వేపుచున్నది గదా! యీమెమాట నతిక్రమించుటకు మనసొల్లకున్నది చారుమతీ! నీవు వెళ్ళుచుంటివి? నన్నేమిచేయుమనియెదవు ! అదియా ! సరేపొమ్ము. అనిపలుకుచున్న సమయంబున నిలువలేక రుక్మిణి కన్నులం దెరచినది. చారుమతియందు లేదు. నాంటిరాత్రి తన ప్రక్కఁబండుకొనియున్న పురుషుఁడతఁడే తనమోహటఁబ్రత్యక్షమయ్యెను. అప్పుడామె మేనసాత్త్విక వికారములన్నియుఁబొడసూపినవి

సిగ్గుచేఁ గొంతసేపేమియు మాటాడినదికాదు. తలవంచికొని యేదియో ధ్యానించుచు నోరచూపులనతనిఁ జూడఁదొడంగినది. అప్పు డా పురుషుఁడు మందస్వరముతోఁ దలోదరీ ! బెదరెదవేల ? నన్ను రప్పింపుమని చారుమతి నెంతయో ప్రార్థించితివఁటకాదా ! సన్నిహి తుఁడనైన నాతో మాటాడవేమి ? నీకామితమేమియో చెప్పుము. నే నిందు మసలరాదు వేగఁ బోవలయుననుటయు నారమణి యెట్టకే సిగ్గుదిగమ్రింగి యిట్లనియె.

మనోహరా ! మీరును జారుమతియు నింద్రజాలవిద్యల నెఱిం గిన ప్రోడలు. మీ రాకపోకలు గ్రహించుట దుర్ఘటముగా నున్నది. ఇంతలో జారుమతి యెందుబోయినది? మీ రెక్కడినుండి వచ్చితిరి ? మొదట నాకెఱుఁగకున్న నాప్రక్కంబరుండఁబెట్టిన యభిప్రాయమేమియో చెప్పినచో నామనోరథ మెఱింగెదు. నామాట యడుగుటకే మిమ్ము రప్పింపుమని ప్రార్థించితినని చెప్పిన నతండు మేలు మేలు. ఆమాట యామెనడుగవలయుంగాని నన్నడుగనేల? ఆమె యభిప్రాయమునకు నేనెట్లు సమాధానము చెప్పువాఁడ? అని యుత్తరమిచ్చిన నమ్మత్తకా శిని మఱల నిట్లనియె.

బాగుబాగు మీరేమిటికివచ్చితిరో మీకే తెలియదా? అట్లైన నామెనడిగెద రప్పింపుఁడు లేకున్న మిమ్మిప్పుడే యంతఃపురావరోధాప రాధమునకు బద్ధుఁజేయించెద నేమి జెప్పెదరని యడిగిన నతండు నవ్వుచు నిదివఱకే భవదీయ మంజులవాఙ్నిగళ బద్ధుండనైతిని మఱల బద్ధుఁజేయ నేమిబాధము అని యీరీతి వారిరువురు గొంతసేపు పరి హాస వచన రచనలతోఁ గాలక్షేపముచేసిరి.

ఆసంవాదములో పలువరుసతీరు కనుదమ్ములసొంపు, చెక్కుల గుఱుతులు స్వరమాధుర్యములోనగు విషయంబులన్నియు బరీక్షించుచు వాఁడు ద్వారపాలురాడినమాటల స్మరించుకొనుచుఁ దనయన్న

యంతఃపురమునకువచ్చి యడిగిన సంగతుల జ్ఞాపకము జేసికొనుచు చారుమతివేషముతో నాపురుషుఁడు తన్ను మోసముచేసెనని నిశ్చయించుకొని యతని మొగము పలుమారు చూచిచూచి యా నిశ్చయము దృఢపరచుకొని సంతసము పట్టఁజాలక గుభాలున నతనిచేయిఁబట్టుకొని అమ్మ నేజెల్ల? చారుమతీ ! నన్నెంతమోసము జేసితివి? నీ మాయలన్నియు నాలోచించుచునే మాటాడుచుంటిని. దొంగతనము బయలైనది ఇఁకనీగుట్టుదాగదు అంతయు నేనేచెప్పెదవినుఁడు మీరు నా గుఱ్ఱమెక్కి యాఁడువేషముతో నాయుద్యానవనమునకు వచ్చితిరి. నాఁటనుండియుఁ దెలియకుండ మెలఁగితిరి. ఇఁక నిలువలేక బయల్పడిరి. మీరు రేవతితోఁ జెప్పినట్లుగా స్త్రీవేషము వైచికొని యాతోటకు వచ్చితిరి. చారుమతియనుకొని భ్రమసితిమి. ఇక్కడ మీకపటమంతయు నభినయించితిరి. తెలిసికొంటినా! ఇఁక నాకువెఱపులేదు. చనువుగలిగి యున్న వారగుట నాయిష్టమువచ్చినట్లు మాట్లాడవచ్చును. అమ్మా! నా గుట్టులో మీగుట్టుచెప్పరా! అనిపలికి యతనిం గౌఁగిలించుకొన్నది.

అతఁడును తమినిలుపలేక తదనుగుణక్రీడా విశేషములచే నమ్మదవతిని నానందసాగరమున ముంచివైచెను.

సీ. ఇది లతావేష్టితం బిది క్షీరనీరంబు
  నమితక స్ఫురితక సమము లివియ
యిది యర్ధచంద్రిక యిది శశప్లుతకంబు
  మణిమాల యిది బిందుమాలయిదియ
యిది భుగ్నకంబిది యింద్రాణికమిది
  తకవేష్టితక సంపుటకము లివియ
యిది వృషాఘాతకంబిది మంథనవరాహ
  ఘాతనిర్ఘాత ప్రేంఖితకములు.
గీ. భ్రమరకంబిది సందంశ భావమిదియ
  యిదియ స్తనితంబు కూజితంబిదియ రుదిత

మఱచు నెఱింగించెఁ దత్త క్రియావిశేష
గతుల జూపుచు రతుల నాయతిఁగ నపుడు.

మున్నుతానా యువతి కెఱింగించిన శాస్త్ర లక్షణంబులకు లక్ష్యంబులు సూపుచు నత్తన్వితోఁ బరమానంద మనుభవించెను అని యెఱింగించునటకు.

## 150 వ మజిలీ.

### —◆ యక్షిణీగానము కథ. ◆—

తెల్లవారక పూర్వమే రుక్మిణి యంతఃపురమునకుఁ దిరుగాఁ జారుమతివచ్చిన దనువార్త రాజపుత్రునకుఁ దెలిసినది. అతండప్పుడ యయ్యంతిపురికిఁ గ్రొత్త కావలి వారల నియమించి సెలవులేనిదే యెవ్వరి నవ్వలకుఁ బోనీయవలదని శాసించి వెంటనే దత్తకాములఁ దీసికొనిరమ్మని యొక పరిచారకునిఁ బంపెను.

గడచిన సాయంకాలమునుండియు దత్తకునిజాడ దెలియక కుండుచున్న గోణికాపుత్రుండా దూతతో రాజపుత్రునియొద్ద కరిగెను. చారుమతి రుక్మిణి యంతఃపురమునకు మరలవచ్చినదఁట. మనమిత్రుఁడు దత్తుఁడేమయ్యెను? అతని ప్రతిజ్ఞఁజూపింపవలసిన సమయమువచ్చినదని మదనోన్మాదంబునఁ బలికిన రాజపుత్రుని మాటలవిని గోణికాపుత్రుండు విన్ననగు మొగంబుతో దేవా! అతండు నిన్ననొకపనిమీఁద నూరికిఁ బోయెను. రెండుమూఁడు దినంబులలో రాఁగలఁడు. ఆమెరాక వానికిఁ దెలిసినఁ బోకుండునుగదా? యని చెప్పినవిని రాజపుత్రుఁడు సరి. సరి. ఏదియో యంతరాయము వచ్చుచునేయున్నది. మీరతండెందుండెనో యక్కడికేపోయి శీఘ్రము తీసికొని రావలయును. జాగుసేయకుఁడు పొండు. కనంబడ లేదని తిరుగావచ్చిన ననుమతింప, నిదియే మీరు నాకుఁ జేయునుపకారమని పలికి వానినంపివేసెను.

అతండింటికిఁబోవుచు నక్కటా! ఇతని యిక్కట్టు మిక్కుటము

గానున్నది. చారుమతి ధీరమతి. ఔపనిషత్స్త్రీయలకు వశపడునది కాదు. తప్పవెుఱుంగక దత్తుండాడినమాటల కానపడి యారకయుట్టూ ట లూగుచున్నాండు. దత్తుండుమాత్రమువచ్చి యేమిచేయంగలండు ? అతండు వారస్త్రీల పటుండు. ఏ వేశ్యయింటికిం బోయెనో తెలియదు. ఎట్లో వానివెదకి తీసికొని పోవలయునని యాపట్టణమంతయు వెదకెను కాని యతండు గనంబడలేదు.

మఱికొన్ని దినంబులు గడచినంత నొకనాఁడుదయంబున దత్తకుండా నెలవునకువచ్చెను. అతనింజూంచి గోణికాపుత్రుండు నిక్షేపము దొరకినట్లు సంతోషించుచు మిత్రమా ! ఇదియేమికర్మము. మాతోం జెప్పక యెక్కడికిం బోయితివి? రుక్మిణి యంతఃపురమునకుం జారుమతి మఱల వచ్చినదంట. రాజపుత్రుండు నీకొఱకు వర్తమానముపై వర్తమానము పంపుచున్నాండు. నీవులేక నే నక్కడికిం బోయిన మండిపడుచున్నాండు. నీ నిమిత్తమై పట్టణమంతయు గాలించితిని. ఎందుపోయితివి? పద పద. రాజకుమారుని కన్నులంబడినం గొంతపరితాప మడంగగలదని పలుకుచు నతని వెంటం బెట్టికొని యప్పుడే రాజభవనమునకుం బోయెను.

రాజపుత్రుండు దూరమునందే దత్తునిం జూచి మేనుప్పొంగ నెదురుపోయి యాలింగనముచేసికొని మిత్రమా ! దయ తప్పినదియా యేమి? ఇన్నినాళ్ళెందు బోయితివి? నీకొఱ కెదురు చూచువఱకు కన్నులు కాయలు కాచుచున్నవిగదా? రుక్మిణి యంతఃపురికిం దిరుగాం జారుమతి వచ్చినది. నీమాట చెల్లించుకొనవలసిన సమయమువచ్చినది ఇంక వర్తమానములతోం బనిలేదు. మనమిప్పుడే యక్కడికిం బోవుదము. ఏదియో మిషపన్ని చారుమతిని నీకన్నులంబడం జేసెదను. చాలునా? అని యడిగిన నతండు అంతియచాలు ఆప్రోయాలి నీకు వశ్యురాలిగాం జేయకున్న నన్నీపేరునం బిలువవద్దు అనిమరల శపథము జేసెను

అప్పుడతండు శారికం జీరి నీవు ముందుగా రుక్మిణియంతఃపురమున కరిగి పండితునొకని వెంటఁబెట్టుకొని నేనక్కడికి వచ్చుచున్నానని యుఁ జారుమతిని రుక్మిణిని ముందరిచావడిలోఁ గూర్చుండుమనియుఁ జెప్పుము. పొమ్మని దానినంపి తాను దత్తునిమాత్రము వెంటనిడికొని యారాజపుత్రుఁడు రుక్మిణియంతఃపురమున కరిగెను

రుక్మిణి శారికవలన నావార్త విని యన్నను ముందరిచావడిలోఁ గలిసికొని నమస్కరించినది. అతండత్యంతసంభ్రమముతోఁ గాశినుండి మాకొకపండితుఁడు వచ్చెను. చారుమతి యతనితోఁగొంచెము ప్రసంగింపవలసియున్నది. ఆసుందరి యెందున్నది? అని యడిగిన నప్పుడతి విన్ననగు మొగంబుతో నన్నా! నీవు పలుమారు చెలువను గుఱించి వితర్కించుచుంటివని తెలిసి యామె యిందునిలుచుటకు వెఱచి నిన్న నుద్యానములోనుండియే నాకుఁజెప్పక యెక్కడికో పోయినది. తిరుగా నాలుగుదినములలో రాఁగలదు. వచ్చినతోడనే నీకుఁదెలియఁజేసెదనని చెప్పుచుండగనే యారాజపుత్రుని మొగము వెలవెలబారినది. ఒక్కింతసేపు ధ్యానించి చాలు చాలు రుక్మిణీ! దాని కీటకమ్ములు నీమూలముననేవచ్చినవి సభలలోనాడెడు వెలయాలికి నంతఃపురవాసమేల? నీకతంబునంగాదిదానిబలవంతముననైనఁ దీసికొనిపోకుందునా? విద్వాంసురాలనియుఁ బండితులతోఁ బ్రసంగించునని వేడుకపడి పలుమారు తత్ప్రసక్తిఁ దెచ్చితిని. లేకున్న దానిగొడవనాకేల? ఈసారి వచ్చినవెంటనే నాకుఁ దెలియఁజేయవలయుంజుమీ? తప్పితివేని నాయానయని యొట్టుబెట్టి యామెచేననిపించుకొని మొగసాలనిలువంబడియున్న దత్తునితో నావర్తమానముజెప్పి నిజనివాసంబున్న కటిగెను.

దత్తుఁడు రాజపుత్రా! ఆకనకగాత్రి వచ్చినవెంటనేవత్తు నాకిప్పుడనుజ్ఞయిమ్మని యడిగిన నతండు చాలు చాలు. నిన్నుఁ బోనీయను. దానిరాకయెప్పుడో దెలియదు. సర్వదా నీవు నాయొద్ద నుండవలయు

నని గట్టిగా నిర్బంధించెను. అతం డేమాటయుఁ జెప్పుటకు శక్యమైనది కాదు. భోజనసమయములం దప్ప సంతతము దత్తుఁ డా రాజపుత్రునొద్దనే వసియించి యిష్టాలాపములచేఁ గాలక్షేపము జేయుచుండెను.

ఒకనాఁడు రాజపుత్రుఁడు దన యిరువురుమిత్రులతోఁ గూడుకొని వేడుకలు ముచ్చటించుచున్న సమయంబున నమాత్యుం డరుదెంచి వినయ వినమితోత్తమాంగుండై భర్తృదారకా! తండ్రిగారు కాళిదాసమహా కవిం దీసికొనిరా దేశాంతరమరిగినది మొదలు మీ రస్వస్థులైయున్నారు. మీవ్యాధి దినదినాభివృద్ధి వహించుచున్నదిగాని తఱుగుట లేదు. ఇది పితృవియోగజన్య దుఃఖంబు గావచ్చును. రాజుగారు కొలఁదిదినములలో వత్తురనువార్తలు వచ్చుచున్నవి. మీరు విచారింప నవసరములేదు. మఱియు మనస్సంతోషప్రదాయకములగు వినోదములఁ జూచుచుండినచో మీవంత శాంతించును. ఉత్తరదేశమునుండి వచ్చిన యొకవాల్గంటి మనవీఁటినాటకశాలలో మొన్న సంగీతము పాడినది. వేనవేలుజనులు పోయిమూఁచిరి. దానిగానము దేవగానమని స్తోత్రములు చేయుచున్నారు. అత్తరుణి నేఁటిరాత్రి మరల సంగీతము బాడునఁట. చాటించుచున్నారు. మీ రాప్తులతో వచ్చి తద్గానసారస్యము గ్రహించి యానందింపఁ గోరుచున్నాము. అని యొఱింగించిన నారాజనందనుం డనుమోదించి నాఁటిరాత్రి నియమితకాలంబునకు మిత్రులతోఁ గూడుకొని నాటకశాలకుం బోయి నిర్దిష్టవిష్టరంబున నుపవిష్టుండై యావిద్రుమోష్ఠిరాకకెదురుజూచుచుండెను.

యథాకాలమునకే గంట మ్రోగినది. తెర లాగఁబడినది. దివ్యమణిభూషాంబరముల ధరించి యొకమించుఁబోఁడి రంగాంగణ మలంకరించుచు సభ్యులకు మ్రొక్కి సమంచితవిపంచికాతంతువుల మ్రోగించుచు,

శ్లో. అనంత విద్యాకలిత ప్రభావం
భావే ధరాదేవ కులప్రదీపం

భజేహ మాదా జితపాపలోభం
సువర్ణనాభం మమజీవనాథం.

అని ప్రార్థించి యద్భుతగాంధర్వమున సభాసదుల హృదయంబులు నీరుగావించినది. పాడినరీతిపాడకుండ రెండుయామములుదనుక సంగీతవిద్యాపాటవము చూపి శ్రోతల గానామృతప్రవాహంబున ముంచివేసినది. మంగళగీతములు పాడినంత తెర వేయఁబడినది. సభ్యులకరతాళధ్వనులు స్తుతివాక్యనినదములతోఁ గలిసికొని నింగిముట్టినవి.

రాజపుత్రుఁడు మిత్రులతో నింటికిఁబోయి నిద్రబోక యాసంగీత ప్రశంసయే గావింపుచు దత్తునితో మిత్రమా! అది చారుమతి యనునాసతోఁ బోయితిని. సువర్ణనాభుఁడను బ్రాహ్మణుని భార్యయైనట్లు తెలమైనది. చారుమతిగూడ నిట్లు బాడఁగలదుసుమిూ! యనిపలికిన నవ్వుచు దత్తుం డిట్లనియె.

రాజపుత్రా! నీ వది చారుమతిగాదని యప్పుడే నిశ్చయింప వలదు. వేశ్యకువిటుఁడే ప్రాణనాథుఁడగును. సువర్ణనాభుఁ డట్టివాఁ డగునేమో. రేపు వాడినాటకశాలకుంబోయి పూర్వోత్తరమంతయుఁ దెలిసికొనివచ్చెద ననుజ్ఞయిమ్ము. అనుడు నతండు; నీవు వెళ్లిన మఱలరావు. నిన్ను విడువను. అది చారుమతిగాదు. అని పలికినవిని దత్తుండు మిూకడ శపథము జేసినతరువాత రాకపోవుదునా? నాఁడు నా కావిధము దెలియక యూరికిఁబోతిని. రేపు తప్పక వారి తెరగరసి వెంటనే మిూకడకు వత్తునని నవ్వఁబలికి తదానతి నింటికిఁ బోయెను.

సువర్ణనాభునిపేరువినినది మొదలాపండితులకతండు తమమిత్రుఁడేమోయని భ్రాంతిగలిగినది. మఱునాఁడుదయంబున దత్తుండు గోణికాపుత్రు రాజపుత్రునొద్దకుఁ బంపి తాను సువర్ణనాభునివార్త నారయుటకై నాటకశాలకుం బోవుచు దారిలోఁగనంబడిన సత్రములోఁ బలికిఁబోయి తత్కుడ్యభాగములన్నియుఁ జూచుచుండెను.

తాఁరు వ్రాసిన వ్రాఁత క్రిందనే సువర్ణనాభుఁడు తా నా నగరమునకు వచ్చినట్లుగా వ్రాసి మఱల నాదివసమునందు వచ్చి చూచెదనని కూడ తెలియపఱచెను. ఆసమయము దత్తుఁడు వచ్చు సమయము నొక్కటియే యైనది. దత్తుఁ డక్కడ నుండగనే సువర్ణనాభుఁడు వచ్చెను. దత్తుఁ డతని గురుతుపట్టలేకపోయెను. అతనిది వెనుకటివేషముగాదు. దివ్యరత్నభూషాంబరములు దాల్చియున్నాఁడు. వెనుక శుద్ధశ్రోత్రియు వేషముతో నుండువాఁడు. దత్తుఁ డిప్పుడు విలాసపురుషుఁడే. దత్తుని గుఱుతుపట్టి సువర్ణనాభుఁడు మిత్రమా! వచ్చితివా! అని కౌఁగలించుకొని యెన్ముఁ డితఁడే సువర్ణనాభుఁడని గ్రహించి దత్తుఁడు ప్రత్యాశ్లేషము గావించుచు వయస్యా! నీ నిమిత్తమే వచ్చుచుంటిని. నీ వ్రాఁత యిప్పుడే చూచితిని. నిన్న నాటకశాలలో జరిగిన సంగీతసభకు వచ్చి నీపేరు వింటిమి. ఆగాయనీరత్నము నీకళత్రమైనట్లు స్తుతిగీతమునుబట్టి గ్రహించితిమి. అట్టికలకంఠి నెట్లుపరిణయమైతివి? నీవు వారణాశీపురంబు విడిచినది మొదలెందెందు సంచరించితివో నీయుదంతమెఱిఁగింపుమని యడిగిన నతఁడొక రమ్యప్రదేశమునఁ గూర్చుండి యిట్లు చెప్పఁదొడంగెను.

## సువర్ణనాభుని కథ.

మిత్రమా! నేఁడు మిమ్మందఱ విడచి యుత్తరభూములఁ జూడవలయునని యభిలాషజనింపఁ దొప్పునఁ జలికివెఱవక కష్టముల సహించుచు నేనును గుచుమారుండును గొన్నిపయనంబులు సేసితిమి. కుచుమారుండు సుకుమారుండగుట కష్టములకోర్వఁజాలక వెనుకకు మఱలిపోయెను. నేనుత్తరాభిముఖుండనై పోయిపోయి మహారణ్యదుర్గములగు పర్వతమధ్యముల సంచరించుచుఁ దీసికొనిపోయిన యాహారపదార్థములు సరిపోయినవెనుక ఫలములచే నాకలి నడఁచికొనుచు మఱికొన్ని దినంబులకు నాకులుదిని యాకలి దీర్చుకొనునలవాటు జేసికొంటిని. పర్ణములు జీర్ణములైనకొలఁది నా మేనికి మంచిబలము గలిగి

నది. అమృతపానంబుచేసిన ట్లాకలియే కలుగునదికాదు. తృప్తిగా భుజించినట్లె యుండునది. రోగవికారము లేమియును లేవు. దేహమున వింత కాంతి మెఱయఁజొచ్చినది. అప్పుడు నే నద్దియో యమృతతుల్యమైన యోషధిని దింటినని నిశ్చయించి మిగుల ధైర్యముతో నదులదాటి యేరు లతిక్రమించి పర్వతములెక్కి యెక్కడనే పెక్కుదూరమరిగితిని.

వయస్యా! జనసంచారశూన్యములగు నమ్మహాకాంతారాంతరముల సంచరించుచున్న నా కొక సిద్ధుండుగాని యొక యతీశ్వరుండు గాని, యొక తపస్విగాని గనంబడలేదు. దేవతామహిమ యేమియుఁ గానుపింపదు. కొండలు నేఱులు తరులతాగుల్మాదులుగాక మఱేమివిశేషము గోచరము గాలేదు. తత్ప్రదేశమంతయు మంచుగడ్డలచే నావృతమై యున్నది. మట్టమధ్యాహ్నమునఁగాని సూర్యప్రకాశమే యగపడదు. మఱియును-

సీ. ఘనశైలతుంగశృంగము లెక్కినప్పు డా
కసము జేరినయట్లు గానుపించుఁ
బాతాళమునఁ ద్రొక్కఁబడినట్లు దోచుబల్
తెగువ లోయలలోన దిగినయపుడు
పెనుసముద్రమున మున్గినయట్లు భ్రమదోచు
మంచువర్షము గ్రుమ్మరించునపుడు
కాంతారమే భూమియంతయు ననఁగఁ దో
పించుఁ గానలసంచరించు నపుడు

గీ. అంధకారమయంబులై యఖిలదిశలు
కాటుకలుబూసినట్లు భీకరములగుచు
బేఱుకొనియుండ నిఁకఁ దెల్లవారదనుచు
వెఱపుజనియించు నొక్కొకవేళలందు.

అట్టికష్టంబులఁబడుచుఁ దిరుగుచుండ నొకనాఁడొక కొండశిఖ:

రముమీఁద నిలువఁబడి దారికై నలుమూలలు చూచుచుండ నా ప్రాంత మం దెవ్వరో సంగీతము పాడుచున్నట్లు మనోహరనినాదము వినంబడినది. ఆపాటవీతెంచినదెసకుఁ జెవియొగ్గి విని యాగానస్వాన మమృతకల్పమై సంతసముగలిగింప నానందపరవశుఁడనై యాగాంధర్వ మమానుష మని నిశ్చయించి యందుఁబోవసమకట్టి యాశృంగముచుట్టును దిరిగితిని. ఎక్కుట కెందును మార్గ మగపడినదికాదు. బొంగరమువలె వట్రువై యున్నది. దూరదూరముగాఁ జిన్న చిన్న రుప్పలుమాత్రమున్నవి.

దుర్గమంబగు నాగిరికూట మెక్కుటకుఁ బదిదినములాలోచించితిని. ఏయుపాయము దోచినదికాదు. అందువసింప ననవరత మాగానస్వానము వినంబడుచునే యున్నది. భగవంతునిధ్యానించుచుండ నొక యుపాయము దోచినది. అందలి మ్రానులవలనఁ గొంతనారఁదీసి యది త్రాడుగాఁజేసి యుచ్చుగట్టి యెగరవైచి దూరముగానున్న మొక్కల మొదళ్ళకుఁదగిలించుచు దానింబట్టికొని యెగఁబ్రాఁకుచు నీరీతి మూఁడు దినముల కాకొండశిఖర మెక్కఁగలిగితిని.

దత్తకా! ఆమూఁడుదినములు నేనుపడినకష్టికి మేరలేదు. రాత్రిపడినతోడనే కదలకనిలువంబడియున్న రుప్పనంటి కూర్చుండి తెల్లవారువఱకు జాగరముజేసితిని. కన్నుమూతపడినఁ జేయిపట్టువదలి క్రిందికిజారిపడుదును. ఒకసారి త్రాడుపట్టుకొని యెగఁబ్రాకుచుండఁ జెట్టునకుఁదగిలించిన యుచ్చుముడి వదలినది. జారి క్రిందకుదొర్లితిని. దైవవశమున నొకరుప్పకొమ్మ చేతికిఁదొరకుటచే నాగితినికాని లేనిచో గ్రిందఁబడినం దలవేయిముక్కలై పోవును. చచ్చినఁజత్తుఁగాక. గిరిశిఖర మెక్కి యాపాటఁబాడినవారలం జూడకమాననని నిశ్చయించి క్రమ్మఱ వెనుకటిరీతినే యుచ్చువైచుచు మూఁడుదినముల కెక్కఁగలిగితిని.

ఆహా! విశాలసమతలంబైన యాశృంగంబున శృంగాటకంబు నంబోలె మనోహరతరులతావితానవేష్టితమైన పద్మాకరమొండు నేత్ర

పర్వముగావించినది.

ఆసరోవరము చుట్టును మలచిన శిలలచే సోపానములు గట్టంబడియున్నవి. ఫలకుసుమదళప్రధానములగు తరులతాగుల్మాదులు శ్రేణులుగాఁ జుట్టును వెలయుచున్నవి. జలఖగముల నాదములు శ్రోత్రపర్వము సేయ కైరవకల్హారపరిమళచోరకములగు మందవాయువులు మార్గశ్రమంబు బోకార్ప భృంగనాదంబు లాలించుచుఁ దత్తీరవిశేషంబులు చూచుచుఁ దటాకంబునకుఁ బ్రదక్షిణము గావించితిని.

ఒకదెస నాజలాకరంబున కల్లంతదవ్వులో నొక సిద్ధాయతనంబు ముఖమంటపమున నొకచిన్నది వీణ పాడుకొనుచున్నది. చూచి విస్మయపడి మెల్లన దాపునకుఁబోయి యెదురుగా నిలువంబడితిని. ఆమె సంగీతము తొందరలో నన్ను విమర్శింపలేదు. కొంతసేపటికి విస్మయముగ్ధుఁడనైయున్న నన్నుఁజూచి యుద్ధరిపడి యట్టెలేచి దేవభాషతో—

చిన్నది—కస్త్వం—నీ వెవ్వఁడవు?

నేను—మహీసురేంద్రనందనోహం. సువర్ణనాభ ఇతిమాంజల్పతి. "నేనొక బ్రాహ్మణపుత్రుండ, సువర్ణనాభుఁడని నన్నుఁ బిలుతురు."

చిన్నది—కిమర్థమాగతోసి. "ఎందులకై యిక్కడికి వచ్చితివి?"

నేను—భవాదృశ సుదృగ్దర్శనార్థం దేశాన్ పర్యటామి. మీవంటి విద్వాంసులఁ జూచుటకై దేశములు దిరుగుచుంటిని.

చిన్నది—ఇహాతవకిమస్తి—ఇక్కడ నీకేమియున్నది?

నేను—త్రిలోకదుర్లభవస్తుదర్శనమేవ. గమనఫలంమమ.

చిన్నది—అహా! బాలాతావ. ఏకాంతవనాంతవనివాసినాం కాశతా నామంత్రిక మాగంతవ్యం వా? ఏకాంతవనస్థలములందుండు స్త్రీలకడకు రావచ్చునా?

నేను—విద్యాపాత్రకారణాత్. నోచేన్మాదృశానాం ద్రష్టుం శక్యం.

వా. ఏతత్ప్రదేశం.

చిన్నది—కోవావిధిః

నేను—అఘటిత ఘటనాసమర్థః పూర్వసుకృత మంగళవిధిః.

అనియిట్లు మేము కొంతసేపు సంవాదము గావించితిమి. పిమ్మట నాకొమ్మ నాకతిథిపూజఁ గావించి భక్షింపఫలములఁ దెచ్చియిచ్చినది. వానిందిని తృప్తుండనై విశ్రాంతివడసిన పిమ్మట నల్లన నామెతోనిట్లుఁబోయి వినయముదోప నిట్లంటి.

దేవీ! ఇది మనుష్య సంచారశూన్యంబైన దేవభూమియగుట నీ విందుండుటచే దేవకన్యవని తెల్లమగుచున్నది. సురగరుడోరగ విద్యాధరాదులలో నీవు జనించిన కులమెయ్యది? నీ పేరేమి? ఒక్కతెవ నీ విందుండఁ గారణమేమి? నీయుదంతం బెఱింగించి నన్ను నీకృపాపాత్రుం గావింపుము. పదిమాసములనుండి యీయరణ్యములలో దిరుగుచుండెడి నాకు నేఁటికి సాఫల్యము గలిగినది. నేను కృతార్థుఁడనైతిని. మనుష్యులలో నధికుండనని నీవు నాతో సంభాషించుటచేతనే గర్వపడుచుంటిని. నా విద్యయు సఫలము నొందఁగలదని తాత్పర్యత వినయవిశ్వాసములతో నడిగిన నా చిన్నది. మందహాసము గావింపుచు నిట్లనియె.

—♦ సువర్ణపదికకథ. ♦—

భూసురోత్తమా! వినుము. నా కాపుర మలకాపురము. నేనొక యక్షకన్యకను. నా పేరు సువర్ణపదిక యందురు. మేమిరువురము అక్కచెల్లెండ్రము. మాయక్కపేరు రత్నపదిక. ఆమె భర్తతో నలకాపురంబునఁ గాపురము సేయుచుండఁ నే నా పెద్దయొద్దనే పెరుఁగితిని. మేమిద్దర మొక మునివలనఁ జనించితిమఁట. మాతల్లి నా చిన్నతనమునందే మృతినొందినది. మా యక్కయు బావయు నన్ను గారాబముగాఁ బెంచుచుండిరి.

కుబేరుండొక నెపంబున సంవత్సరము భార్యతో వియోగము గలుగునట్లు మా బావనుశపించెను. ఆశాపం బతికష్టంబున ననుభవించి సంవత్సరాంతమున నింటికివచ్చి యందుండ నిష్టములేక కాపుర మెత్తివైచి భార్యతోఁగూడ భూలోకములో నొకానొక పర్వతకందరమున వసించెను. ఆ దంపతులు నన్నుఁగూడ రమ్మని నిర్బంధించిరి. కాని నా కిష్టములేక యందేయుండి సంగీతవిద్య నేర్చుకొనుచుంటిని. నా యసహాయత బరీక్షించి కుబేరుని వంటవాఁడొకండు తన్ను వివాహమాడుమని నన్ను నిర్బంధించెను. నేనుఁ గొంతచదివినదాన నగుట నామూర్ఖునిఁ బెండ్లియాడనొల్లక నాయనమ్మకుఁ దెలియఁజేసితిని.

అతం డంతటితో విడువక పలుమారు నన్నంటులకై వేధింపం దొడంగెను. దాని నపరాధిఁగా నెంచి కుబేరునికిఁ దెలియఁజేసితిని. మా కుటుంబముపైఁగల యీసునం జేసి యారాజరాజు నా మొరవిచారింపఁ డయ్యెను. ఆ బానిసకాని రాయిడికి నేనందు నిలువలేక మాయక్కయున్న యిక్కయెఱుంగక తలపోసి తలపోసి యొక వృద్ధయక్షుని యుపదేశంబున నీ శిఖరప్రదేశంబున కరుదెంచి యిందుఁగల యిందుశేఖరుని లింగం బారాధించుచుంటిని. నాఁటితుది నేఁటిదనుక మఱియే పురుషుండు నిందురాలేదు. నీ వృత్తము బ్రాహ్మణుండవని తోచుచున్నది. చంద్రశేఖరుండు స్వప్నంబున సాక్షాత్కరించి నీకుఁ బండితుండు బ్రాహ్మణుఁడు భర్తయగునని యానతిచ్చియున్నవాఁడు. అమ్మహాత్ముని వాక్యమున కన్యథాత్వ మెట్లుకలిగెడిని? నీవు పండితుఁడవేని నిన్ను బెండ్లియాడెదనని పలుకుచు గొన్నివిద్యలలో నన్నుఁ బరీక్షించినది.

అన్నిటికిని సమాధానము చెప్పితిని. అప్పుడు మెచ్చుకొనుచు నామెడలోఁ బుష్పదామంబువై చినది. నాకప్పటియానందము చెప్పుటకుఁ దగినమాటలు రావు. మహానందసాగరంబున మునింగి యయ్యంగన మెడలో వేరొకపుష్పదామంబువై చితిని ఇరువురము పూవుల తలం

బ్రాలుగా నిరజిమ్మికొంటిమి. ఇరువురము గలిసికొని మన్మథకళాకౌశలంబులమీఁఱ క్రీడాపరవశులమై నూఱహోరాత్రంబులు గడియవలె వెళ్ళించితిమి. ఆప్రమదారత్నమువలనఁ గొన్నిసాంప్రదాయములు దెలిసికొని సాంప్రయోగికప్రకరణము వ్రాసితిని.

అట్లాసుందరీరత్నముతో నాలుగునెలలందువసియుంచి యడవిఁ గాసిన వెన్నెలవలె నావిన్నస్త్రీభోగభాగ్యంబులు జూచి యానందించు మిత్రులు దూరమందుండుట తలంచి యమ్మించుఁబోఁడిం బ్రార్థించి భూలోకసంచారమున కనుజ్ఞవడసితిని. ఆచిన్నది యక్షకాంతయైనను గుబేరశాపంబునంజేసి దేవతాశక్తి వెలితిపడియున్నది. భూమియం దెక్కడనో తనయక్క యున్నదికావున నామెం జూచువేడుక దీపింప నాతో దేశసంచారముచేయుట కంగీకరించినది. మేమిరువుర మాగిరిశిఖర మతికష్టమున దిగి కొండలోయల దాటి యరణ్యంబు లతిక్రమించి మెట్టల మీఱి క్రమంబున నాఱుమాసములకు జనపదంబులు సేరితిమి.

ఆయరణ్యములు దాటునప్పు డాకోమలిపడినవెత లేతాదృశములని చెప్పఁజాలను. ఎట్లో సహించి నాతోవచ్చినది. నడుమనడుమఁ బట్టణంబుల సభలఁగావించుచు ద్రవ్యముపార్జించితిమి. మన మనుకొనినకాలము దాటినది మీరీయూర నుందురో లేదో యని సందియముతోనే వచ్చి పాండిత్యవేషము విడిచి సంగీతప్రసంగంబున విత్తము సంపాదించుచుంటిమి. ఇదియే మావృత్తాంతము. నిన్ననే యీసత్రంబున మేడపై మీ్రవాఁతఁ జూచితిని. నిన్న పాడినది నీమిత్రునిభార్య సువర్ణపదిక. నిన్నుఁ బొడగంటి కృతకృత్యుండనైతిని. తక్కిన మనమిత్రులు గనంబడిరా? విశేషము లేమియని యడిగిన నతండు నివ్వెఱఁపడి భళిరా దైవనియోగము. ఎంతసంతోషవార్తవింటిని. నేఁ డెంతసుదినము. ఆహా నీయదృష్టము. అని కొనియాడుచుఁ దనవృత్తాంతము కొంతకొంత చెప్పి యతనికి సంతోషము గలుగఁజేసెను.

పిమ్మట సువర్ణ నాభుండు నాటకశాలకుం బోదము రమ్ము. సువర్ణపదికం జూతువుగాక. ఆచిన్నది నాతోఁగాక యొరులతో మాటాడదు. దేవభాషగాక యేభాషయు రాదు. అని పలుకుచుఁ జేయిపట్టుకొని యచ్చటికిఁ దీసికొనిపోయెను. అప్పుడా చిన్నది పార్వతీపూజఁ గావించుచున్నది. దత్తకుం జూపుచు "దేవి ! ఏషఏవ మమ మిత్రః దత్తకః పండితశిఖామణి" అని చెప్పినంత నాకాంత యత్యంతసంభ్రమముతో లేచి నమస్కరించినది.

దత్తకుం డత్తలోదరిం దీవించుచుఁ బ్రస్తావవశంబున మీాయక్కయు బావయునున్న యిక్క నే నెఱుంగుదునని చెప్పెను. ఆమాట విని యాబోఁటి తత్తరపాటుతో మహాత్మా ! వారెందున్నవారో వేగము చెప్పుడు. వారింజూడ నాకుఁ జాలవేడుక గలిగియున్నది. మీాకు మంచి సుకృతము రాఁగలదని బ్రతిమాలుకొనినంత నతండు విమర్శింపక తెరువెఱింగింపుచు గురుతులు సెప్పి యందలి పర్వతగుహాయందు వసియించి యున్నవారని యెఱింగించెను.

ఆవృత్తాంతము సెప్పుచుండఁగనే చిత్తచాంచల్యము గలిగినది. మదిలో వికారముదోఁప నిలువుం డిప్పుడేవత్తునని యచ్చోటువెడలి యెక్కడికో పోఁదొడంగెను. కొంతసేపటికి స్త్రీయైపోయెను. అతనికి వెనుకటిస్మృతి యించుకయు లేక, యెందుఁబోవలయునో తెలియక యలవాటుచొప్పున రుక్మిణి విహరించు నుద్యానవనముదెసకుఁ బోవుచుండెను. ఆయుద్యానపాలురు చారుమతి చారుమతి యని కేకలు వేయుచు నామె యెవ్వరికిఁ జెప్పకయే వెళ్ళిపోయినదని వినియున్నవారగుటఁ గొందఱు పరుగునఁబోయి రాజపుత్రునకుఁ దెలియఁజేసిరి. ఆవార్త విని రాజపుత్రుం డత్యంతసంభ్రమముతో గుఱ్ఱపుబండియెక్కి దత్తకాదులకు వర్తమానముచేసి యతివేగముగాఁ బోయి యుద్యానవనములోఁ బూవులుగోయుచున్న చారుమతింగాంచి పంచశరవిద్ధహృద

యుండై సిగ్గువిడిచి దిగ్గన బండిదిగి తానొక్కరుండ యావేదండగమన
యొద్దకుఁ బోయి చేయిపట్టుకొని—

మ. లలనా! యేమిటి కిట్లు నీవు లలితాలంకారశూన్యాంగవై
చెలులంగూడక యొంటిఁ గ్రుమ్మఱుచు గాసిం జెందె దాత్మీయకో
మలదేహప్రభ గంద; రమ్ము నిను సన్మానింతుఁ గైసేయు ము
జ్జ్వలమాణిక్యవిభూషణావళుల నిష్టంబైన చందంబునన్.

క. వెరపించుటకా? ననుఁ బ
ల్మరు నీ విటు డాగి డాగి మఱి గాన్పింపం
దొరకొంటివి? మేల్ నీ నే
ర్పరితన మెల్లం గ్రహింపఁబడె విడు మింకన్.

ఉ. ఏపడఁగంగ నన్నలరతీశ్వరుఁ డుద్ధతిమై లతాంతపుం
దూపులఁ జిత్త మెల్లఁ బలుతూటులువారఁగఁ గొట్టుచున్నవాఁ
డోపఁగఁజాల నిఁక శరణువొందెద నన్గరుణించి నామనం
తాపము వాయ వాతెఱసుధారసము ల్దయసేయుమీ సఖీ.

చ. గణికవుగాని నీవు కులకాంతవు గావదిగాక యొక్కనిం
గణుతిమొనర్ప భర్తగను గైకొన నద్భుతరూపసత్కళా
గుణమణివంచు నిన్ను మదిఁ గోరితి రాజసుతుండ నేనికా
రణమున నన్నుఁ గైకొనక తాపిడిఁబెట్టెద విట్లు చెప్పుమా?

అని యనేకవిధంబులఁ బ్రతిమాలుటయు నాకురంగనయనయు
నయనాంచలంబుల నతని నిరీక్షించుచు నిట్లనియె.

క. రాకొమరుఁడవో మారుఁడ
వో కన నలకూబరుండవో చంద్రుఁడవో
నా కేమియెఱుక నన్నుం
జేకొనెదవటంచు నెవరు సెప్పిరి నాతోన్.

గీ. గణికనైనను మఱి కులకాంతనైన
వనిత కొకభర్త యుండంగవలయుఁ గాదె

యందు నరనాథనందనుం డబ్బుచుండ
నోడఁబడమి కేను సన్యాసినో మహేశ !

అని యంగీకారము సూచించుటయు నారాజనందనుం డమం దానందకందళితహృదయారవిందుండై యయ్యిందువదన నక్కునఁ జేర్చి చెక్కులు ముద్దుపెట్టుకొనుచు మేనం బులకాంకురములు బొడమ బండి యెక్కించి యంతఃపురమునకుఁ దీసికొనిపోయెను.

అని యెఱింగించి-

## 151 వ మజిలీ.

### —♦ కుచుమారుని కథ. ♦—

కుచుమారుండు దత్తకాదిపండితులేశ్వరలో నొకఁడు. దత్తుని కంటె రెండేండ్లు చిన్నవాఁడు. మిక్కిలి చక్కనివాఁడు. విద్యలలో దత్తునితో సమానుఁడు. అతనికి మహారణ్యసంచారము గావించి యోషధీవిశేషముల సంగ్రహింపవలయునని చిన్నతనమునుండియు నభిలాష గలిగియున్నది. ఈమిత్రులలో నొకఁడగు సువర్ణనాభునికి నట్టియభిలాషయే కలదు. వారిరువురు శుభముహూర్తంబునఁ గాశీపురంబు బయలువెడలి యుత్తరదేశారణ్యమార్గంబులంబడి పోయిరి.

కుచుమారుండు మారుఁడువోలె సుకుమారుం డగుట దుస్తర ప్రస్తర హిమానీ కంటక దుర్గమంబగు కాంతారమార్గంబున నడువ నోపక యొకనాఁడు నేలం జదికిలంబడి వయస్యా! నీ బలవంతమున నింతదూరము వచ్చితిని. మంచుగాక మన కేవిశేషము గనంబడలేదు. ఇఁక మనము మఱలి పురవిశేషంబులం జూచుచు నియమితకాలమునకు ధారానగరంబునకుఁ బోయి మిత్రులం గలిసికొందము. ఇఁక నే నడుగు నడువఁజాలను. ముందుఁజూడ మహారణ్యభీకరములై హిమచ్ఛన్నములగు పర్వతశిఖరములు గనంబడుచున్నవి. పోవఁజాలమని పలికిన విని సువర్ణ

నాభుండు నవ్వుచు నిట్లనియె.

మిత్రమా! నిన్ను రావలదని మొదటనే చెప్పితిని. నేనీయర ణ్యాంతము చూడక మఱలువాఁడనుకాను. ఈయరణ్యము నాయంతమే చూచెనేని చింతయే లేదు. ఇంక వ్యవధి చాల యున్నది. బ్రతికియుం డిన నియమితకాలమునకు నేను ధారానగరమునకు వచ్చువాఁడ. నీవిం దుండి క్రమ్మఱ దేశములమీఁదుగాఁ బొమ్మని చెప్పిన విని కుచుమూరుం డనేకవిధముల నతని వెనుకకు రమ్మని బ్రతిమాలికొనియెను కాని యతం డంగీకరింపలేదు. సౌహార్ద్రవిశేషంబున సువర్ణనాభుని బలుమారాలిం గనములు చేసికొని విడువలేక విడువలేక విడిచి దక్షిణాభిముఖుండై యరుగుచు నొకనాఁడొక కోయపల్లె సేరి యందున్నవారిలోఁ బెద్దవా నిం జేరి యోరీ! ఇక్కడికిఁ గాశీపురం బేదెసగానున్నదియో చెప్పఁగ లవా? ధారానగరమునకు మార్గము దెలియునా? పాటలీపుత్రనగ రముపేరు వింటివా? అని యడిగినవాఁడు స్వామీ! ఆపేరులేవియు నేనెఱుఁగను. కాశియని మాపెద్దలు సెప్పుచుందురు. చచ్చినతరువాతఁ బుణ్యము సేసినవా రందుపోవుదురని చెప్పికొనియెదరు. ఆదారు లేమియు నాకుఁ దెలియవని చెప్పెను.

మా కాపురము కాశీపురమె. అది యీభూమిమీఁదనే యు న్నది. చచ్చినతరువాతఁ బోవునది స్వర్గము. అది మీఁదుగానున్నదని వానితో ముచ్చటించుచు నోరీ! మీయడవిలో నాశ్చర్యకరములైన విశేషము లేమైనంగలవా? మహర్షులుగాని యోగులుగాని సిద్ధులుగాని యెందైనఁ దపముచేసికొనుచున్న వారిం జూచితివా? జ్ఞాపకముచేసికొని చెప్పుమని యడిగిన వాఁడు బాబూ! లేకేమి? ఇక్కడికిఁ బదిదినముల పయనములోఁ బడమరగా నొకరుసి గలఁడు. ఆయన కెన్నియేండ్లున్న వియో యెఱిఁగినవారు లేరు. పెద్దపులులు సింగములు మొదలగు మెక ములాయనచెప్పిన పనులు చేయుచుండును. ఆయనయున్న యడవి

నలువదియామడయున్నది. ఆనడుమనున్న యేమెకమైన మనుష్యులజో లికిరావు. బాబో! ఆయన ప్రభావము సెప్ప నాతరముకాదు. ఎప్పుడు పర్ణశాలలో ముక్కుమూసికొని శపముజేసికొనుచుండునని గొప్పగా వర్ణించుచుఁ జెప్పెను.

కుచుమారుఁడత్యుత్సాహముతో నాకథవిని యోరీ! ఆయన పేరేమియో యెఱుంగుదువా? ఇప్పుడున్నవాఁడా అని యడిగిన వాఁడు సామీ! పేరు నాకుఁదెలియదు. మాబోఁటులతో మాటలాడునా? మే మేదేని యాపదవచ్చినప్పుడు ఆయనఁ దలఁచికొని మీాదులు గట్టు దుము. మాకోరికిలు తీరుచుండును. అందుఁబోయి మ్రొక్కులు చెల్లిం చుకొందుము. మే మేది తీసికొనిపోయినను వారి గుడిమ్రోల నిడవ లసినదే. దాని నాయన చూడనేమాడఁడు. నిరుడు మాపల్లెనుండి మ్రొక్కులు తీసికొనిపోయితి. అప్పటికి బ్రతికియున్నవాఁ డని యెఱిం గించెను.

కుచుమారుని కతనిఁ జూడవలయునని మిక్కిలి యుత్సాహము గలిగినది. ఆతనిగుఱించి పలుమా రడిగినమాటయే యడుగుచు వాఁడు సెప్పినమాటలఁబట్టి యాసిద్ధుండు మహానుభావుండని నిశ్చయించెను. మార్గమడిగి తెలిసికొని మఱునాఁ డుదయకాలంబున బయలుదేరి యాదారిఁ బోవుచుండెను. తేనె ఫలములు దుంపలు లోనగు పదార్థ ములుదిని యాకలి యడంచుకొనుచుఁ బదియేనుదినములు నడిచి గురు తుగా సిద్ధాశ్రమమున కరిగెను.

వృక్షలతాగుల్మాదులు వాడియున్నవి. ఫలములు రసహీన ములై యెండిపోవుచున్నవి. కుసుమములు వాసనాశూన్యములై రాలి పోవుచున్నవి. పూర్వము మిక్కిలి శోభాస్పదముగా నున్నదని చూచిన వారికిఁ దోఁచకమానదు. కుచుమారుం డాగురుతులు పరికించి కోయ వాఁడెఱింగించిన సిద్ధవన మదియేయని నిశ్చయించి విశేషములు

చూచుచు దానువినిన యానవాళ్ళ ననుసరించి పోయి పోయి యొక తటాకము చెంత కరిగెను.

ఆజలాకరము మనోహరములగు సోపానములచే వెలసియున్నది. జలము పసరెక్కి నాచుగట్టినది. మెట్లన్నియుఁ బాచుపడినవి. జలకుసుమము లేమియును లేవు. సారవిహీనమగు నక్కాసారంబు శోభ విమర్శించి కుచుమారుం డీయరణ్యమంతయుఁ దేజశ్శూన్యమై యున్నది. కోయవాఁడెఱింగించిన సరస్సిదియే కావచ్చును. అదిగో తూరుపుగాఁ గనంబడుచున్న మఱ్ఱిచెట్టు సిద్ధుని యునికిపట్టుకావచ్చును. అందెవ్వరును లేనట్లు తోఁచుచున్నది ఇది తప్పక సిద్ధుని వనమే. అందుపోయి చూచెదంగాక యని తలంచుచు నావటవిటపినికటమునకుఁ బోయెను.

దానిక్రింద నొక పర్ణశాల పాడువడి యున్నది. కృష్ణాజిన కమండలువులశకలము లక్కడక్కడ పడియున్నవి. సిద్ధుండు పరమపదించెననియు దానం జేసి శోభాశూన్యంబై యున్నదనియు నిశ్చయించి యతం డాప్రాంతభాగములు సంచరించుచు నేవిశేషమును గానక కొంతసేపా చెట్టుక్రిందఁ గూర్చుండి ధ్యానించుచు మోమెత్తి యుత్తరశాఖాచ్ఛాయంబుఁ బరికించెను.

ఆవృక్షాగ్రమునుండి యవ్వనప్రమాణంబు చూడ సంకల్పము పుట్టినంత నతం డట్టెలేచి యతికష్టమున నా చెట్టెక్కి మధ్యశాఖావసానమున నిలువంబడి నలుమూలలు పరికించిచూచెను. ఆ వనమంతయు నతనికిఁ గనంబడినది. శోభావిహీనమైయున్నది. సిద్ధుని మరణమునకు వగచుచు నతండు క్రమ్మఱ వృక్షావరోహణము గావింపుచు కోటరముల శాఖాంతరములఁబరిశీలించుచుండెను. స్కంధోపరిభాగంబున నొక కోటరమునకు బిరడాయున్నట్లు తోఁచుటయు నతం డాబిరడా పట్టుకొని లాగెను సులభముగా నూడివచ్చినది. లోపల మందసమువలె నున్నందునఁ జేయిపెట్టి తడవిచూచెను. ఒక తాటియాకులపుస్తక మతని

చేతికి దొరకినది

సంతోషముతో నా పుస్తకమునువిప్పి యందుండియే చదివెను. దేవనాగరలిపి పురాతనమైయున్నది. స్పష్టముగా నక్షరములు తెలియ మిం జేసి చెట్టుదిగి పసరుఁవ్రాసి చూచెను. చదువుటకు నీలుగానుండెను. అందనేకవిషయములు వ్రాయఁబడియున్నవి. అందు ముందుగా సిద్ధుని స్వీయచరిత్రము అనుశీర్షికచూచి యిట్లుచదివెను.

—♦ సిద్ధుని స్వీయ చరిత్రము. ♦—

గోదావరీతీరమునఁ బర్ణశాలయను నగ్రహారము గలదు. అందు శ్రీధరభట్టను బ్రాహ్మణుఁడు గలఁడు. అతనికిఁ బ్రాయముమీఱిన తరువాత మహీధరభట్టను కుమారుఁ డుదయించెను. తండ్రి పుత్రు నుచితకాలమునఁ జదువవేసెను. ఆబాలుం డెనిమిదేఁడుల ప్రాయము వాఁడై బడిలో నుపాధ్యాయులయొద్ద నామలింగానుశాసనమును నిఘంటువును జదువుచు నందు,

శ్లో॥ అణిమా మహిమాచైవ గరిమా లఘిమాతథా
ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వంచేతి సిద్ధయః ॥

అనుశ్లోకమును జదివి దాని కర్థమేమని గురువుగారి నడిగెను. అతండవి యష్టసిద్ధులు తపస్సాధ్యములు మహాయోగులకుఁగాని పొందశక్యములుగావు. వానియర్థబోధావసరము నీకిప్పుడు లేదు. అని యొజ్జలు సెప్పుటయు మహీధరభట్టునకు వానివిశేషములెట్టివో తెలిసికొనవలయునని యభిలాషగలిగినది. పలుమారాశ్లోకమునే చదువుచుండును. మఱికొంతకాలమునకే వానితలిదండ్రులు పరమపదించిరి. పిమ్మట మహీధరభట్టు గ్రామమునువదలి దేశములు తిరుగుచు నొకనాఁడొక పండితు నాశ్రయించి మున్ను తానువర్ణించిన శ్లోకమునుజదివి దాని యర్థమును వివరముగాఁ జెప్పుమని వినయముగాఁ బ్రార్థించెను.

ఆపండితుఁ డాతనిం జూచి నవ్వుచు నీకీసిద్ధులసంపాదింపవలయునని

యభిలాషయున్న దా? అట్లైనఁ జెప్పెదనాలింపుము. అణిమ=పరమాణు ప్రమాణుఁడై వసించుట, మహిమ=బ్రహ్మవిష్ణ్వాదులకంటెఁ బెద్దవాఁడై యొప్పుట, గరిమ=బ్రహ్మాండమువలె భారముగానుండుట, లఘిమ=మేరువంతయుండియు దూదివలెఁ దేలికగానుండుట, ప్రాప్తి=తలఁచినంత నే వలసినపదార్థములు తనయొద్దకు వచ్చునట్లు చేయుట, ప్రాకామ్యము=ఎక్కడికిఁబోవలెనన్న నక్కడికిఁబోవుట, ఈశత్వము=దేవతలకు నైత నధిపతిగానుండుట, వశిత్వము=దేవతలు మనుష్యులేకాక పశుపక్షి మృగాదులు తనకువశమై పరిజనులవలె నుపచారములు సేయుట.

అష్టసిద్ధులనఁగా నివియని యర్థము సెప్పినవిని మహీధరభట్టు స్వామీ! యీసిద్ధు లెట్లు సాధ్యమగునని యడిగిన నతఁడు,

శ్లో॥ యద్దుష్కరం యద్దురాపం యద్దుర్లభ్యంచ దుస్తరం।
తత్సర్వం తపసాప్రాప్యం తపోహి దురతిక్రమం॥

చేయుటకుఁ బొందుటకు దాటుటకు నేదిశక్యముకాదో అది తపంబున శక్యమగును. తపముచేయుటమాత్రము కష్టము. అనియెఱింగించి తపంబుసేసి వీనిం బడయుమని పరిహాసముగాఁ బలికెను. వాని కాసాధనముల సాధింపవలయునని సంకల్పము జనించినది.

అతండదేపయనముగా నుత్తరదేశారణ్యములు కొండలు గుహాలు లోనగు దుర్గమప్రదేశంబులు దిరుగుచుఁ గనంబడినబైరాగికెల్లఁ దనసంకల్ప మెఱింగించుచు నీవా? తపంబుగావించువాఁడవని పరిహాసింపఁబడుచుఁ దిరిగితిరిగి యొకనాఁ డొకకొండగుహాలోఁ దపంబుచేసి కొనుచున్న యవధూతంజూచి యాయనతోఁ దనసంకల్పము సెప్పక యూరక శుశ్రూష గావింపుచుండెను.

ఉపచారపరిగ్రహ మూరకపోవదు. ఒకనాఁ డాయవధూత మహీధరభట్టుంజూచి యోరీ! నీ వెవ్వఁడ వేమిటికి నన్నిట్లాశ్రయించుచుంటివి? నీయభీష్ట మేమని యడిగిన నతండు సంతసించుచు నమస్కార

పూర్వకముగాఁ దనసంకల్ప మెఱింగించి యయ్యభిలాష తీర్పుఁడని వేఁడుకొనియెను.

ఆదయాళునకు వానియం దక్కటికము గలిగినది. ఒకమంత్ర ముపదేశముగావించి జపించుపని విధానమంతయు నెఱింగించెను. అతం డాకొండగుహాయందే వేఱొకచోట వసించి యామంత్రము జపించు చుండెను. దృఢనిశ్చయునకుఁ గార్యసాఫల్యము గాకుండునా?

నిద్రాహారములుమాని తదేకదృష్టిగా నామంత్రము జపించు చుండఁ బదిసంవత్సరములు గతించినవి. అప్పటి కొకదేవత ప్రత్యక్షమై నీ కేమికావలయునని యడిగిన నతండు ఎనిమిదవసిద్ధియగు వశిత్వ మిమ్మని కోరికొనియెను.

అబ్బో! ఎక్కడివశిత్వము? ఈతపంబు దానికిఁ జాలదని పలికి యాదేవత యంతర్ధానము నొందినది. వెండియు నతండు తపంబు సేయ మొదలుపెట్టెను.

మఱియైదుసంవత్సరములకు మరల నాదేవత ప్రత్యక్షమై నీ కేమి కావలయునని యడిగి వెనుకటిరీతినే వశిత్వమును గోరుటయు నావేల్పి యఁజాలనని చెప్పిపోయినది. ఈరీతి నైదుసంవత్సరముల కొకసారి వచ్చి యడుగుచు నతండుకోరినది యీయఁజాలనని చెప్పిపోవుచుఁ జివరకు నలుబదియేం డ్లత్యంతదీక్షతోఁ దపముసేసిన యామహీధరభట్టున కాదేవత కాకోరిక తీరుపక తప్పినదికాదు.

వశిత్వసిద్ధి లభించినపిమ్మట మహీధరభట్టునకు వైవాహికాభి లాషయంతయు నుడిగినది. అస్థిరములని తెలిసినపిమ్మట మహాత్ములు తుచ్ఛభోగముల నభిలషింతురా? అతిప్రయత్నమునఁ గాశికిం జని గంగఁ దెచ్చి తోటనూరమడిలోఁ జల్లువెంగలి యుండునా? అతండు భక్తిజ్ఞాన వైరాగ్యములతో నాత్మవేత్తయై గిరిశిఖరంబున నీయుపవనంబు గల్పించు కొని యుష్యగమ్ము లూడిగములు సేయ నీవటవృక్షముక్రిందనున్న పర్ణశా

లలోఁ దపంబు గావించుకొనుచున్నాఁడు- అతఁడే నేను.

అనియున్న యాచరిత్రమును జదివి కుచుమారుండు కనుల నానంద బాష్పములుగ్రమ్మ నోహో! యామహానుభావునిఁ జూచుభాగ్యము నాకుఁ బట్టినదికాదు. అతం డీనడుమనే పరమపదించినట్లున్నది. ఆహా! ఎట్టివారికి నెంతకాలము బ్రదికినను మరణము తప్పదుగదా? అని తలంచుచు మఱియుఁ బసరువ్రాసి యాపుస్తకములోనున్న విశేషముల మఱికొన్నిటిని బరిశీలింపఁగలిగెను.

అం దోషధీవిశేషముల తెఱఁగును మూలికాప్రయోగములవలన మనుష్యుల మృగములఁ బక్షులఁ జేయువిధానము కవిత్వప్రశంస లోనగువిషయములు వ్రాయఁబడియున్నవి. అవి తపస్సాధ్యములైనను దన యస్థిమాలనుధరించినవారికిఁ బ్రసన్నములగునని యాపుస్తకమునందే వ్రాయఁబడియున్నది. అప్పు డతం డతని యస్థు లందెందైన నున్నవియేమోయని యాతటాకముచుట్టును దిరిగిచూచెను.

ఒకవంకఁ దటాకమునీటిప్రాంతమున మేదోమాంసరుధిరశూన్యంబైన సిద్ధుని యస్థిపుంజము గనంబడినది. అప్పు డతండు పరమసంతోషముతో నాకళేబరము చెంతకుఁబోయి విమర్శించి కపాలము భిన్నమై యుండుట తిలకించి యతండు యోగమార్గంబున శరీరము విడిచెనని నిశ్చయించి వెండికడ్డీలవలె మెఱయుచున్న యాయస్థుల నీటిలోఁ గడిగి ముఖ్యమైనవాని నేరి త్రాఁటితో మాలికగాఁగట్టుకొని మెడలో వైచికొనియెను. అప్పు డతనిహృదయమున ననేకవిషయములు స్ఫురించుచుండెను. చిరకాలము తపంబుసేసినంగాని లభింపని వశిత్వవిద్య కుచుమారుని కరనిమిషములో లభించినది.

పశుపక్షిమృగాదులలో నేదిగనంబడినను బిలిచినంతనే వచ్చి శిష్యుండువోలె నుపచారములు సేయుచుండును. అయ్యడవిలో నేయోషధిపేరుపెట్టిపిలిచిన నాయోషధి కదలుచుఁ దనస్వరూపము తెలియ

జేయును. అట్టిపరీక్షలు చూచి కుచుమారుఁ డటఁగదలి దక్షిణాభిముఖుండై యరుగుచుండెను.

అని యెఱింగించి వేళ యతిక్రమించుటయు మణిసిద్ధుం డవ్వలికథ పైమజిలీయందుఁ జెప్ప మొదలుపెట్టెను.

## 155 వ మజిలీ.

### —♦ సరస్వతి కథ. ♦—

కుచుమారుం డొకనాఁ డొకయగ్రహారమున నొకబ్రాహ్మణుని యింటి కతిథిగాఁ బోయెను. ఆగృహస్థు భుజించునప్పుడు కుచుమారు నితో అయ్యా! మీరూపము దర్శనీయము. మీ తేజము విద్యాధిక్యము సూచించుచున్నది. ఎందుఁబోవుచున్నారు? మీజన్మభూమి యేది? అని ప్రస్తావోచితముగా నడిగిన నతండు తనకాఁపురము కాశీపురమనియు మిత్రులతోఁ దాను సమస్తవిద్యలం జదివితిననియుఁ బండితకల్పభూజుం డగు భోజభూభుజుని యాస్థానవిద్వాంసుల జయింప ధారానగరంబున కరుగుచున్నాననియుఁ దనయుదంత మాద్యంత మెఱిఁగించెను.

అప్పు డాబ్రాహ్మణుఁడు వెఱఁగుపాటుతో అయ్యా! మీ రంత వారైనచో నంతశ్రమపడి ధారానగరమున కరుగ నేల? అరిగి యందలి పండితులఁ బరాజితులఁ గావించితి రేని యారాజేఁడు వేలిచ్చును లక్షలిచ్చునుగాని తనరాజ్య మీయఁడుగదా? మీకంతవిద్యలలో గట్టితనము గలిగియున్నచో సులభముగా రాజ్యలక్ష్మిం జేపట్టుతెఱఁ గెఱింగించెద నాకేమి పారితోషిక మిత్తురు? అనుటయుఁ గుచుమారుండు నవ్వుచు నార్యా! మీ యుపదేశంబున నాకు రాజ్యమే వచ్చినచో మీరును గొంత ఫలభాక్కులు కాకపోరు. వాక్కులతో నేమిప్రయోజనము? అని యుత్తరమిచ్చెను.

అప్పు డాగేస్తు వినుండు. హిరణ్యగర్భుండను నృపాలుండు పురందరపురమును రాజధానిగాఁ జేసికొని యాదేశమును బాలించుచున్నాడు. ఆనగర మిక్కడ కిరువదియామడ దూరములో నున్నది. ఆరాజు

మిక్కిలి వదాన్యుఁడు. భోజరాజువలెఁ గవీంద్రులఁ బండితుల నాదరించును. ఆనృపతికిఁ బురుషసంతతి లేదు. సరస్వతి యను నొకకూఁతురు గలదు. ఆమెచరిత్రమే వినవలసినది. ఆయువతి నిరతిశయసౌందర్యంబునం బ్రకాశించుచున్నదని చెప్పుట యొకగొప్పమాట గాదు. సారస్వతవైభవ మంతయు నామాసవతి యధీనమై యున్నది. చతుష్షష్టికళలు బాలరామాయణమువలె నావటమై యున్నవి. ఆఱుశాస్త్రములు తలక్రిందుగా నేకరువుపెట్టఁగలదు. వేయేల? ఆయువతి విద్యలలో సరస్వతి యని చెప్పఁదగినది. చివరమాట వినుఁడు. ఆబోఁటి విద్యలలోఁ దనపరీక్ష కాగినవానిఁగాని యొరుని బరిణయమాడనని శపథము చేసి యున్నది. అనేక రాజకుమారులు శస్త్రాస్త్రనిపుణులు విద్యాధనరూపప్రాభవోపేతులు వచ్చి యచ్చిగురాకుఁబోఁడిం గ్రహింపఁ బ్రయత్నించిరి.

విద్యలలోఁ బరీక్షించి యయ్యంబుజాక్షి యెవ్వరిం బరిగ్రహించినదికాదు. ఎవ్వనికిం గనంబడదు. మీరు సమర్థులేని యారమణీమణితోఁ బ్రసంగించి గెలిచి తద్రాజ్యలక్ష్మితోఁగూడ నాచేడియం బాణిగ్రహణము సేసికొనుఁడు. కావలసిన నాకుమారుని శంబరుఁడనువానిని మీకుఁ దోడుపంపెదనని యెఱింగించిన విని కుచుమారుండు మందహాసశోభితవదనారవిందుండై మహాత్మా! బ్రాహ్మణాశీర్వాద మమోఘమైనది అష్టైశ్వర్యము నన్నందునట్లు దీవింపుఁడు. భాగ్యోదయంబు దైవాయత్తంబు. అంతఁబోయి ప్రయత్నించి చూచెద. సరస్వతినైన నెగ్గి గెలువఁగలనని నాకు ధైర్యము గలదు. అని పలికినవిని యుబ్బుచు నాయజమానుం డిట్లనియె.

కుచుమారా! నీయాకారతేజోవిశేషంబు లుపలక్షింప నీయందుఁ బ్రభుత్వచిహ్నంబులు బొడకట్టుచున్నవి. నీవు తప్పక రాజపుత్రిక యిచ్చినప్రశ్నములకు సమాధానము చెప్పఁగలవు. ఆరాచపట్టిం జేపట్టఁగలవు. రాజ్యాధిపత్యము వహింతువుగాక యని యాశీర్వ

చనపురస్సరముగా సంభాషించెను. తదీయరాజ్యప్రాప్తివలనఁ దనకుఁ గూడఁ గొంతలాభము గలదను సంతసముతో నాయజమానుం డాకుచుమారుని మార్గగమనశ్రమము వాయ నాలుగుదినములు దనయింట నుండుమని ప్రార్థించెను. శంబరుఁడను తనకుమారు నాతని కుపచారములు సేయ శిష్యునిగా నియమించెను.

కుచుమారుండు నాలుగుదినము లాయగ్రహారమున వసించి యాయాసముఁదీఱుచుకొని శుభముహూర్తమున బయలుదేరి శంబరుఁడు శిష్యుండై తోడరాఁ గొన్నిపయనంబులకుఁ బురందరపురము ప్రవేశించెను. సరస్వతీపరిణయలాలసులగు విద్వత్ప్రభుకుమారులచే నా నగరము నిండియున్నది. ఎక్కడవినినను నామె విద్యాతిశయము గుఱించి జరగు సంవాదములే. ఏవీధికిఁబోయినను రాజపుత్రు లామెకు సమాధానము చెప్పలేకపోయిరను వార్తలే. అట్టివిశేషము లాలించుచు నాపట్టణపువీధులఁ దిరిగి తిరిగి కుచుమారుండు ప్రకటనలఁ జదివి చదివి తిన్నగాఁ బ్రధానపురుషులయొద్దకుఁ బోయి, అయ్యా ! వినుండు.

చ. ప్రచురము చేసినట్టి నృపుపట్టి సరస్వతివార్త నాలకిం
పుచు నిట కేగుదెంచితిని భూసురుఁడం గుచుమారుఁడం గళా
నిచయములెల్ల నార్జనన నృత్యము సేయుచునున్న వాక్కుభృ
త్కుచ యొనరించుప్రశ్నములకుం దగునుత్తర మిత్తు నిత్తఱిన్.

క. వాదింతు నే సరస్వతి
తోఁ దులగా నామసర్వతోముఖవిద్యా
వైదుష్యము గనుపింప ని
వేదింపుఁడు నాదురాక వెలఁదుక కనిసన్.

అమాత్యులు నవ్వుచు,

గీ. వలదు, పోవయ్య ! మాసరస్వతిని గెలువఁ
దరమె నీ కిది యడియాస తగదు తగదు

ఇటుల వాక్రుచ్చి యెంతెంతలేసివార
లిటఁ బరాజితులైరో నీ వెఱుఁగ వకట!

సీ. నేపాళదేశావనీపాలనందను
బహుకళాన్వితు సిగ్గుపఱచి పంపె
సకలశాస్త్రజ్ఞ దర్పకతుల్యు మగధభూ
పతిపుత్రుఁ దృటిఁ బరాజితు నొనర్చె
సంగీతశాస్త్రప్రసంగదక్షుని బాండ్య
జననాథసుతుఁ బదార్చకునిఁ జేసె
నఱువదినాల్గువిద్యల నెఱింగినప్రోడ
గౌడభూపాత్మజు నోడఁబుచ్చె

గీ. మఱియు నెందఱినో కళామహితులైన
నృపకుమారుల మారసన్నిభులఁ బెదవి
గదపకుండఁగఁ జేసె వాక్కులనఁ గలన
నలిపి సామాన్యయే సరస్వతి కుమార!

నీ కీవెఱ్ఱి యేలపుట్టినది? మఱియొక చోటంగూడఁ బరపతి లేకుండఁ జేసికొనుచున్నావు. వైదికుఁడా! రాజ్యకాంక్షుంజేసి యాసపడి వచ్చితివి. ఇది గెలుపుసిరికాని గంపసిరికాదు. నీయభిలాష సరియైనది కాదు. వచ్చినదారిం బొమ్ము. మఱియొక దేశాధిపతికడ నీపాండిత్యప్రకర్షము చూపుమని హేళనముగాఁ బలికిన నగుచుఁ గుచుమారుం డిట్లనియె.

అయ్యా! నేను మీరాజపుత్రికచారిత్రము తెలియక వచ్చినవాఁడనుగాను. ఈప్రపంచకములో నామెను మించినపండితుఁడు లేడనియా మీయాశయము. తాడితన్నువాని తలదన్నువాఁడు మఱియొకఁ డుండునని తెలిసికొనుఁడు.

ఆహా! బహుసంవత్సరములు గురుకులవాసము సేసి కాశీపురంబున విద్యాభ్యాసంబుగావించి మహాపండితులమని పేరుపొంది దిగ్విజయ

ముసేయ బయలువెడలిన మాబోటివా రంతఃపురమునుండి యేరికడనో నాలుగుమాటలు నేర్చికొన్న బోటులతోఁ బ్రసంగింపలేకపోయినచో నిఁక విద్యాపరిశ్రమమునకు ఫలమేమి? సరస్వతినైనం బ్రతిఘటింపఁజాలు నాకడనా? ఈవెడమాటలకు నేనించుకయు వెఱవను నే నాతెలవ యిచ్చిన ప్రశ్నలకు సమాధానము సెప్పలేకపోయితినేని మీరు నియమించినశిక్షకుఁ బాత్రుండ నగుదునని శపథము చేసెను.

అయ్యా! మీరు గెలువుఁడు, ఓడుఁడు, మా కింతయేల? మాట వరుస కంటిమి. మీ రట్టివారు కావచ్చునని హెచ్చరించుచు నతండు వసింపఁదగిన నెల వేరుపఱిచి తదీయకులశీలవిద్యావిశేషంబులు వ్రాసి సరస్వతియంతఃపురమున కనిపిరి.

సరస్వతియు మంత్రులంపిన పత్రికం జదివికొని చిఱునగవుతో సౌరా ఈపాఱుం డెవ్వఁడో బీరములు పెక్కులు పలికెనే? చెప్పినంత చేయువారుండరు. బ్రాహ్మణుల నవమానించుట నాయభిమతము కాదు. వా రేదియో కొంత చదివియే యుందురు. కాని మదీయవిద్యావాద ప్రకార మెఱుంగక యప్పనికిఁ బూనికొనుచున్నాఁడు. కానిమ్ము. బ్రాహ్మణసత్కార మిహపరసాధనము గదా? అని తలంచి వేయు న్నూటపదాఱు లిచ్చి యాపండితు నంపవలయునని మంత్రులకుఁ దిరుగా వ్రాయించి యంపినది.

సచివు లాకానుకలు ప్రత్యుత్తరముతోఁగూడఁ గుచుమారు నొద్ద కనిపిరి. ఆమె వ్రాసినపత్రికయుం దిట్లున్నది. బ్రాహ్మణులు వంద నీయులు. వారినోడించుట నా కిష్టములేదు. నాచరిత్ర మెఱుంగక సాహసించి ప్రసంగింపవచ్చినందులకు సంతోషించి యీకానుకల నంపితి. వీనిం గైకొని నన్నాశీర్వదింప వేఁడుచున్నదాన.

సరస్వతి.

ఆపత్రికం జదివికొని కుచుమారుండు స్మేరాంకూరవిభాసితాన

నుండై మఱియు నిట్లు వ్రాసెను.

మ. నను వాదంబున నోడఁబుచ్చినపు డానందంబుతోఁ బిల్చి హే
ళనగా బీరము లింతమాత్రమున కేలా? విప్ర! మేల్ తెల్లమ
య్యెను పాండిత్యము బ్రాహ్మణుండవగుటన్ హీనంబుగాఁ బంపరా
దని కాన్కల్ దయచేసినన్ గొనెద గాదా? మీఁద నేఁ డేటికిన్.

మ. ప్రకటింపంబని లేదు మీ కటులు దర్పంబొప్ప నాయిచ్చు స
ర్వకలాప్రశ్నల కుత్తరం బిడినవిద్వాంసుండె మత్ప్రాణనా
యకుఁ డంచున్ మృషలయ్యె నా పలుకు లాహా! యిప్డు మీరిచ్చు కా
నుకలం గైకొన నేజితోస్మి యనిసన్ బోనుం జలేజాననా!

అని వ్రాసి యాపత్రికతోఁగూడఁ గానుకలఁ బ్రధానులకడ కంపివేసెను. వా రావార్త సరస్వతికిఁ దెలియఁజేసిరి. సరస్వతి మిక్కిలి యీసుబూని ఏమీ! కులగౌరవము మన్నించినందులకు నతం డిట్లవమానపఱచునా? కానిమ్ము. ఆపాటుఁడు వ్రాసినట్లు పిమ్మటనే యెత్తి పొడిచెదంగాక యని యాలోచించి కొన్నిపుష్పంబులఁ గుచుమారు నొద్ద కనిపినది.

మాల్యగ్రథనవికల్పః అను 14 విద్యలోఁ బ్రశ్నమడిగినదని నిశ్చయించి కుచుమారుం డాపూవుల నెల్ల విచిత్రములైన మాలికలగాను బంతులగాను మండనములుగాను నన్నిటియందుఁ దనపేరు వింత రంగులపూవులతోఁ గనంబడునట్లు కట్టి వానిని బ్రధానిముఖముగా రాజపుత్రికయొద్ద కనిపెను.

ఆపుష్పదామంబులం బరిశీలించి యచ్చెరువందుచు మెచ్చుకోలుగా పాటుతో నోహో! ఈమహీసురుండు నాయభిప్రాయము గ్రహించెను. చతుష్షష్టికళాపాండిత్య మున్నట్లు తోఁచుచున్నది. పెరవా రీవింతమాలి కలఁ గట్టఁజాలరు. అని సంతసించుచుఁ గొన్నిరత్నములను కృత్రిమరత్న ములను బంపి వెలగట్టుఁడని నియమించినది.

కుచుమారుండు మణులకు వెలగట్టి యందలిదోషంబులఁ దెలియఁజేయుచు గాజరత్నములఁ జిదియఁగొట్టి తచ్ఛకలములతో రాజపుత్రికనొద్ద కనిపి (3 వ) రూప్యరత్నపరీక్షా అనువిద్యయందుఁ దనకుఁ గలపాండిత్యము దెలియఁజేసెను. అప్పు డాచిన్నది మేను ఝల్లుమన నయ్యారే! యీపారుం డపారకళాప్రవీణుండువలెఁ దోఁచుచున్నది. ఇదివఱ కింతబుద్ధిమంతుఁడు వచ్చియుండలేదు. భగవంతుండు నాకు భూపతిఁ బతిఁజేయక భూసురవరుని వరునిగాఁజేయ నిశ్చయించుకొనియెనా యేమి? అయ్యో! ఆపారుఁడు రూపంబున నెట్టివాఁడో తెలిసికొనలేను. కానిమ్ము. అఘటితఘటనాసమర్థుఁడు పరమేశ్వరుని సంకల్పమెట్లున్నదియో తెలియదని యాలోచించుచుఁ దనయొద్దనున్న ముద్దుచిలుక నొకదాదిచేత నతనియొద్ద కనిపి దానికి విద్దెలు గఱపుమని నియోగించినది.

"43 శుకశారికాప్రలాపనం"అనువిద్యయందుఁ దన్నుఁ బరీక్షించుచున్నదని తెలిసికొని కుచుమారుఁ డాచిలుక నందుకొని ముద్దువెట్టుకొనుచుఁ బతంగపుంగవా! నీ వామె రామచిలుకవా? ఆమె నీ కేమి విద్యలు నేర్పినది? ఏదీ? మీ రాజపుత్రిక సందేశము దెలుపుము. పలుకుము. అని యెంత చెప్పినను మాటాడినదికాదు. అప్పు డాదాది అయ్యా! దీని మా రాజపుత్రిక విదేశములనుండి తెప్పించినది. ఎంతప్రయత్నించినను దీని కొకమాటయు వచ్చినదికాదు. మంచిమాటలు నేర్పుఁడని మిమ్ముఁ గోరుచున్నదని చెప్పుటయు నతండు ఇప్పుడు నీ వింటికిం బొమ్ము. మాటలు నేర్పి రేపు మీభర్తృదారికయొద్ద కనిపెదనని పలికి యా పరిచారిక నంపెను.

పిమ్మట నతండు తనకు సిద్ధునివలన సంప్రాప్తించిన విద్యామహిమచే దాని నొకసారి దువ్వి తనమెడనున్న యస్థిమాల దానిమేనికిఁ దగిలించి యుపదేశించినంత నాశుకప్రవరం బాశుకవిత్వముతోఁ

జెప్పిన విద్యనెల్ల స్వరగ్రాహిణీయంత్రమునలె నాకర్షించుచు నుచ్చరించుచుండెను.

చతుష్షష్టికళలు దానికిఁ బ్రసాదించి కుచుమారుండు మఱునాఁడా చిలుక నాకలికి యంతఃపురమున కనిపెను.

ఇంపులగు పలుకులు పలుకుచుఁ దనదెస కరుదెంచిన రామచిలుకం జూచి యబ్బురపాటుతోఁ దనచేతిపై కెక్కించికొని యమ్ముద్దుగుమ్మ ముద్దుచిలుకా! సుద్దులేమైన నేర్చికొంటివా? అని యడిగిన నాశుకవరం బమ్మా! నేను ముద్దుచిలుకనో ముద్దుచిలుకనో యిటుమీఁదఁ దెలిసికొనఁగలవు. నేను కుచుమారుని శిష్యుండనైతిని. అమ్మహాత్మునిచే శిక్షింపఁబడితిని. నన్నే విద్యలలో నడిగెదవో యడుగుము. వాదమునకు రమ్ము. అతండే నేను అనిపలికిన విని యక్కలికి యులికిపడి ఔరా! పలుకనేరని యీకీర మెన్నిమాటలాడినది? అతండు మిగుల బ్రౌఢుండగును. దీనిం బ్రలాపించి చూచెదంగాక యని తలంచి యిట్లనియె.

కీరమా! నీవు కుచుమారుని ఛాత్రుండవగుట మాకుఁబ్రతివాదివైతివి. ఏదీ! చతుష్షష్టికళలపేరులు సెప్పుము చూతము నీపాండిత్యము. అనుటయు నాచిలుక యౌరా! కుచుమారుని శిష్యుండనఁట. అఱువదినాలుగువిద్యలపేరులు సెప్పవలయునఁట. ఇది యెంత తేలికప్రశ్నము. అమ్మా! పేరులేకావు. ప్రతివిద్యయందును బ్రసంగించి జయమందెదఁ జూడుము. అని ధిక్కరించిపలుకుచు వానిపేరులు 1 గీతం, 2 వాద్యం, 3 నృత్యం, 4 ఆలేఖ్యం, 5 విశేషకచ్ఛేద్యం మొదలగు 64 ను వైనయికీన వైజయికీన వ్యాయామికీనాది విద్యాగ్రహణం. అని యేకరువుపెట్టినది.

ఆయుపన్యాసమువిని యక్కలికి చిలుకా! యెంతవక్తవైతివి? బాపురే! ఎంతపండితురాలవైతివి? అని మెచ్చికొనుచు ముద్దువెట్టుకొని మఱియు నాయుశాస్త్రములయందును బ్రహేళికలయందును బరీ

క్షించి తదీయనిరాఘాటపాండిత్యప్రకర్షము దెలిసికొని చేతులుజోడించి శుకరాజమా! మీయందు త్రిభువనైకవిద్వత్ప్రవరుండు, నన్ననుగ్రహింపఁ జతురాననుం డీయవతారముఁ జనువెంచెను. కానిచోఁ జెప్పిన మాట యొకటియైన నుచ్చరింపనేరని నీవు తమయుపదేశంబున గంగాప్రవాహమువలె నాశుధారాకవిత్వముతో శాస్త్రముల నిట్లు గురిపింప నేర్తువే? ఆతండే నాకు భర్త. ఆతండే నాహృదయేశ్వరుండు. ఆయనతోఁ బ్రతికూలముగాఁ బలికి తిరస్కరించినందులకు క్షమింప వందనశతంబు లర్పించుచున్నదాన. ఇదిగో యీహారమును దీసికొనిపోయి నీవు నాకుమారుగా వారిమెడలో వైచిరమ్ము. పొమ్ము. నాయెడ విశ్వాసముంచుము. అని ముత్యాలహార మొకటి దానినోటి కందిచ్చినది.

హంస తామరతూడుంబోలె నాపేరు ముక్కునం గైకొని గ్రక్కున నెగిరి యాఖగవరంబు రయంబునఁ గుచుమారునొద్ద కరిగి యాతోడవతనిమెడలోవైచి యందుజరగినవృత్తాంతమంతయు నెఱింగించినది.

ఆబుధుం డాకథ విని యాపత్రరథమును ముద్దుపెట్టుకొనుచుఁ బతగేంద్రమా! తొల్లి నలదమయంతులకు హంసయుంబోలె నీవు మాకు దూతికాకృత్యము నెఱవేర్చుచుంటివి. వెండియు సరస్వతియొద్దకుం బొమ్ము. ఆమెపేరు నురంబునఁ దాల్చితినని చెప్పుము. విశేషములఁ దెలిసికొనిరమ్ము అని పలుకుచు నాచిలుక నాశుకవాణినొద్ద కనిపెను.

కుచుమారుండు శంబరునియం దత్యంతవాత్సల్యము జూపుచు నెప్పటికథ నప్పుడు వానికిఁ జెప్పుచు నొకనాఁ డీక రాజ్యలక్ష్మితోఁ గూడ సరస్వతి దనకుఁ దక్కఁగలదని నివేదించెను. అప్పుడు శంబరుఁడు అయ్యా! మాతండ్రియుపదేశంబునం గదా మీ రిందు వచ్చితిరి. రాజ్యము వచ్చినపిమ్మట నావిశ్వాసము మీకుండునో యుండదో తరువాత నాతో మాటాడుదురో మాటాడరో యని యడిగినఁ గుచుమారుండు నవ్వుచు శంబరా! యీరాజ్యము శాశ్వతమా? రాజ్యపదము నన్నం

టదని యెఱుఁగుము. అదియునుంగాక దీనికి భాగస్వాములు నామిత్రు లార్వురు గలరు. వారితో నాలోచించి నీకును దగినయుద్యోగమును గలుగునట్లు చేయించెద సందియపడకుము. అని పలికెను.

ఆమాట విని శంబరుఁ డాత్మగతంబున నౌరా! వీఁ డెంతగర్వముగా మాటాడెను? వీని కీయుపాయము మాతండ్రి చెప్పకున్న నీ యైశ్వర్యము లభించునా? ఆవిశ్వాస మించుకయు లేక యీరాజ్యము నెక్కడనోయున్న మిత్రులకుఁ బంచిపెట్టునంట. వారినడిగి నా కేదియో యిచ్చునంట. ఇట్టి తుంటరిం జంపినం దప్పులేదు. వీనిప్రాణములు నాచేతిలో నున్నవి. వీనిం గడతేర్చి నేనే కుచుమారుండనని ప్రకటించెద. సరస్వతియు రాజ్యము నాకే దక్కఁగలదు. ఇఁక సరస్వతి విద్యాప్రశంస చేయదు. పెండ్లియాడినతరువాతఁ దెలిసికొనిన నేమిచేయఁగలదు? ఉత్తరప్రత్యుత్తరములు పత్రికామూలమున జరగుట యాచారము. గుఱుతెఱింగినవారు లేరు వ్రాసినవ్రాఁతయంతయు నాదేగదా! మహారాజ్యవైభవ మబ్బుచుండ బ్రహ్మహత్యకు వెఱవఁ బనిలేదు. అవసరమునుబట్టి యింద్రుండంతటివాఁడు గావించెను. అని నిశ్చయించి నాఁటిసాయంకాలముదనుక యుపాయ మాలోచించుచుఁ దగినసన్నాహము గావింపుచుండెను.

నాఁటిరాత్రి భుజించినతరువాత మంచముపైఁ బండికొని తాంబూలము నమలుచుఁ గుచుమారుండు శంబరుం జీరి వత్సా! నేఁడు నీ మొగముజూడ వేఱొకరీతిగా నున్నది. ఆనందించుసమయంబున విన్నబాటేమిటికి? ఈపెండ్లికిఁ బెత్తనమంతయు నీదేకదా. నీతలిదండ్రులు నీబంధువులు పెండ్లివారు. నీయానందమే నాయానందము. నామిత్రులు దూరమందున్నారు. ఇందులకు ముఖ్యుఁడవు నీవేయని పలికిన విని శంబరుఁ డాత్మగతంబున అబ్బో! అప్పుడే యీరండాపుత్రుఁడు రాజ్యము సరస్వతియుఁ దనకుఁ దక్కినవని యుబ్బుచున్నాఁడు. ఎక్కడ

నోయున్న మిత్రులకు రాజ్యము పంచునట. నాకును నాతలిదండ్రులకును భోజనముసేయుటకై పెండ్లిపెత్తన మిచ్చునట. వీనిం బరిభవించిన తప్పులేదు. అని తలంచుచుఁ బ్రకాశముగా నార్యా ! నేఁడు నాకు దేహములో నస్వస్థతగానున్నది. అందుల కిట్లుంటినని సమాధానము చెప్పెను.

అట్లైనఁ బెందలకడఁ బండికొనుము. అని వానితో ముచ్చటించి కుచుమారుండు గాఢముగా నిద్రబోయెను. ఆయన గుఱ్ఱువినంబడిన తోడనే లేచి శంబరుం డంతకుమున్ను సంగ్రహించియుంచిన పాషాణము మెల్లగ నెత్తి గుభాలున యతని నెత్తిపై వైచి చేతనమును బాయఁజేసి యప్పుడే యాశవము నెత్తికొనిపోయి యూరోటకందకములోఁ బాఱవైచి తానే కుచుమారుండనని ప్రకటింపుచుండెను.

శ్లో॥ వాంఛాసజ్జనసంగతౌ పరగుణే ప్రీతిర్గురౌ నమ్రతా
విద్యాయాం వ్యసనం స్వయోషితి రతిర్లోకాపవాదాద్భయం
భక్తిశ్శూలిని శక్తిరాత్మదమనే సంసర్గముక్తిఃఖలై
రేతేయేషువసంతినిర్మలగుణాస్తేభ్యోమహద్భ్యోనమః॥

దుర్జనుల సంసర్గ గలిగినంత నెప్పటికైన ముప్పు వాటిల్లునని శాస్త్రములు చాటింపుచున్నవిగదా ?

అని చెప్పునప్పటికిఁ గాలాతీతమగుటయు నంతటితో విరమించి యవ్వలికథ పైమజిలీయం దిట్లు చెప్పఁదొడంగెను.

## 156 వ మజిలీ

### — శంబరునికథ —

గీ. ప్రాణ మర్పించుటకు నోడంబడునుగాని
బలిమి యజమానుని రహస్యవాచకంబు
నెఱుఁగఁజెప్పఁడు పరులకు నెంతయైన
నాత్మవిస్రంభపాత్రుఁడై నట్టిదూత.

రాజపుత్రిక చిలుకచేఁ బంపిన కుచుమారుని సందేశము విని ప్రహర్షపులకితగాత్రయై దాని నత్యంతప్రీతిపూర్వకముగా నాదరించుచు మఱికొన్నిమాటలం జెప్పి మఱునాఁడుదయంబునఁ గుచుమారునొద్ద కనిపినది. ఆరామచిలుకయు తీవ్రముగ నెగిరి కుచుమారునిబస కరిగి యందున్న శంబరుంజూచి విస్ఫుటాక్షరములతో అయ్యో! మాగురువులు కుచుమారు లెందున్నవారు ఎఱింగింపుఁడని యడిగిన నతండు నేనే కుచుమారుండ మఱచిపోయితివా? చిలుకా! నీకొఱకై నేరేఁడు పండ్లు తెచ్చి యుంచితిని. తినుము. నీరాక వేచియున్నాను. అని పలికిన విని చిలుక యిట్లనియె.

అయ్యో! మీదయయుండిన నేరేఁడుపండ్లకుఁ గొదవలేదు. పరిహాసము విడిచి వారెందుండిరో చెప్పుఁడు.

మిమ్ము నేనెఱుంగనిదానను గాను. మీరాయనమిత్రులు మొదటినుండియు మిమ్ము నేనిందుఁ జూచుచుంటి. రాజపుత్రిక సందేశమొండు జెప్పవలసియున్నది. వేగ మాయన యెందుండిరో చెప్పుఁడని యడిగిన వాఁడు మది దిగులుపడ శుకమా! రాజపుత్రికాసందేశ మేదియో నాకుఁ జెప్పుము. నీకు మంచిపండ్లుపెట్టెద ననవుడు నది అయ్యో! భార్యాభర్తలనడుమ నొడువు లొరుల కెఱింగింపవచ్చునా? మీయెఱుంగని ధర్మము లున్నవియా? అది తప్పుపనియని పలుకుచుండఁ దటాలున దానిం బట్టికొని ఓసీ! పులుగా! నీరాజపుత్రిక చెప్పినమాట లేవియో చెప్పుము. లేకున్న నీగొంతువు పిసికి చంపెదఁ జూడుమని కాళ్లొకచేతఁ గంఠ మొకచేతం బట్టికొని చెప్పెదవా? చంపనా? చెప్పెదవా? చంపనా? అని యెన్నిసారులడిగినను గిలగిలఁ గొట్టికొనినదికాని నిజము చెప్పినదికాదు.

ఆచిలుకయుండినఁ దనగుట్టు బయలగునని తలఁచి యాదుష్టుండు జాలిలేక యాశుకముకంఠము నులిమి చంపి పారవేసెను. పిట్టప్రాణ

మన నెంత, ఆహా! గుడిమ్రింగినవానికి గుడిలోని లింగ మేమూలకు లెక్క, అనినట్లు కుచుమారుఁజూపిన క్రూరుసకుఁ జిలుకనుజంపు టొక యబ్బురమా?

నాఁడు రామచిలుక తిరుగాఁ దనయొద్దకు రామింజేసి పరితపించుచు సరస్వతి సారసికయను సఖురాలిం జేరి యోసీ! యాశుకము నాసందేశము దీసికొనిపోయి మఱల వచ్చినదికాదు. కారణము తెలియదు. ఆపండితకంఠీరవుఁడు తనయొద్దనే యుంచుకొనెనా? ఏదియెట్లైన నీవొకసారి వారియొద్దకుఁ బోయి చిలుకమాట తెలిసికొని తదాకారంబు చిత్రఫలకమున వ్రాసికొనిరమ్ము ఇదివఱకు వారి రూపమెట్లున్నదియో విచారింపలేదు. చిలుక నడుగవలయుననుకొని మఱచిపోయితిని. నీవు పోయివచ్చిన నన్నియుం దెలియఁగలవని నియోగించుటయు నది యతఁడున్న నెలవునకు గురుతులడిగి తెలిసికొని తిన్నగాఁ బోయి వాకిట నిలువంబడి కుచుమారుండున్న నెల విదియేనా? అని యెవ్వరినో యడుగుచుండ విని శంబరుఁడు తలుపుతీసికొనివచ్చి అవును. ఇదియే యాతఁడున్న నెలవు. నేనే కుచుమారుండ నీ వెవ్వతెవని యడిగెను.

సారసిక నమస్కరించినది. లోపలికిఁ దీసికొనిపోయి కూర్చుండుమని నియమించి దానిం బెద్దగా గౌరవించి నీవు వచ్చినపని యేమని మఱల నడిగెను. అయ్యా! నేను సరస్వతి సఖురాలను సారసికయనుదాన. మీ రామెతో నిదివఱ కుత్తరప్రత్యుత్తరములను జరపుచున్న కుచుమారులు మీరేనా వారు లోపలనున్నారా? అని యడిగిన నతండు నవ్వుచు జవ్వనీ! నీతో నేను బరిహాసమాడుదునా? మీ రాజపుత్రికను విద్యలలో జయించి పెండ్లియాడఁ దలఁచికొన్నవాఁడ నేనే యని మఱల నుత్తరముచెప్పెను.

సారసిక స్వామీ! మారాజపుత్రిక మీయొద్దకు నిన్న రామచిలుక నంపినది. అది తిరుగవచ్చినది కాదేమి? మీయొద్దనే యుంచు

కొనిరా? అని యడిగిన నతండు పాప మాచిలుక నిన్నవచ్చి మచ్చికతో నాతో ముచ్చటించుచుండెను. నేను వేఱొకపనిమీఁద లోపలికిఁ బోయి వచ్చునంతలోఁ బొంచియున్న యొకపిల్లి తటాలున దానిగొంతుపట్టుకొని యీడ్చికొనిపోయి చంపినది. అందులకే విచారించుచున్నవాఁడ. దానికి విద్యలన్నియు నుపదేశించితిని. మాకు దూతికయై వార్తలం దెలుపుచున్నది దాని కాయువు సరిపడిన మన మేమిచేయఁగలము అని చెప్పెను.

అమ్మయ్యో! యెట్టిమాటవింటిని? పలుకులు కళలు తెలిసికొనినపిదప మాభర్తృదారికకు దానియం దెంతయో ప్రేమకుదిరినది. ఈమాట వినిన మిక్కిలి పరితపింపఁగలదు. మహోత్సవసమయమున నీవిచార మామెను బాధింపకమానదు. అని పలుకుచుండ నామాట మఱుగుపడునట్లు మఱియొకప్రస్తావము దెచ్చుచు సారసికా! ఇదిగో మీరాజపుత్రిక పంపిన ముత్యాలహారము చూచితివా? కుచుమారులు మీరేనా? మీరేనా? అని పలుమారడిగితివి. ఈహార మది కానిచో నేను మఱియొకఁడ నగుదును. అని పలికెను.

అప్పు డది యతఁడు కుచుమారుండు కాడని నిశ్చయించుకొని మొగంబున విన్నదనంబుదోఁప సరస్వతియొద్ద కరిగెను.

ఆచిన్నది కొన్నియడుగు లెదురువచ్చి మచ్చెకంటీ! అచ్చటివిశేషము లేమి? ఆవిద్వచ్ఛిఖామణిం గంటివా? మాట్లాడితివా? రూపము వ్రాసికొనివచ్చితివా? ఎట్లున్నది? చిలుక యేదీ? అని యడిగినఁ గన్నుల నీరుగ్రమ్మ తొలుతఁ జిలుకవార్త దెలిపినది. అందులకై పెద్దతడ వమ్ముద్దుగుమ్మ విచారించినది.

వారించుచు సారసిక సఖీ! నీ వాతఁడు గొప్పవిద్వాంసుఁడని మురియుచుంటివికాని నామది కంత నచ్చలేదు. అదియేమియోకాని వానిరూపము చిత్రఫలకమున వ్రాయ బుద్ధిపుట్టినదికాదు. ఊరక తిరిగి

వచ్చితిని. అనుటయు సరస్వతి ఏమీ! వానిరూప మసహ్యముగానున్న దియా? అనియడిగిన సారసిక వాని మొగంబున నాకేమియుఁ దేజము గనంబడలేదు. దరిద్రదేవత నాట్యమాడుచున్నది. అని చెప్పిన సరస్వతి యిట్లనియె. "విద్వత్సు దారిద్ర్యతా" అనియుండలేదా? ఎట్టైనను జదివికొనినవాని మొగము తేజోవంతముగా నుండవలయు నది నీవు గనిపెట్టలేకపోయితివి. పోనిమ్ము. "విద్యారూపం కురూపాణాం" రూపహీనులకు విద్యయేరూపము. వెండియు నీ వీచిలుక నాయనయొద్దకుఁ దీసికొనిపోయి దానికివలెనే దీనికిఁగూడ విద్యోపదేశము గావింపుమని కోరుము. అని యొకచిలుకను బత్రికతోఁగూడ సారసిక చేతి కిచ్చి యంపినది.

సారసిక యాతనియొద్ద కరిగి నమస్కరించిన ముసిముసినగవులు వెలయింపుచు శంబరుఁడు యోషామణీ! విశేషము లేమి? ఈచిలుక యెక్కడిది? అనియడిగిన నది రాజపుత్రిక యిచ్చినపత్రిక యతని కిచ్చి ఆర్యా! ఈచిలుకను సకలకళాభూషితం జేయుమని యాకె కోరుచున్నది. కనుకటిచిలుకనుగుఱించి చాల విచారించినది. దీనిం బ్రజ్ఞాన్వితం గావించినచో నావిచార మాకెను బాయఁగలదు. అంతయు నీపత్రికలో నున్నది. చదివికొనుఁడు. అని పలికిన విని యతండు మఱిదిగులుదోప నా పత్రిక నిటునటు ద్రిప్పి విదేశలిపితోనుండుటచేఁ జదువలేకపోయెను.

## 47 కళ దేశభాషాలిపిజ్ఞానము.

అది వాని కేమి తెలియును? చదివినట్లు చివరంటఁజూచి పత్రిక మడిచి మొగంబునఁ గోప మభినయించుచుఁ జాలుఁజాలు సారసికా! ఇదియా? రసికత. అస్తమానము మా కిదియేపనియా? మావిద్యల వృథగా వినియోగించుట నా కిష్టములేదు. ఒకమాటు పరీక్షించినది తగు సమాధాన మిచ్చితిమి పలుమారడుగుటకు నాకెకుఁ దీరికయున్న దేమీ? మాకుఁ దీరికలేదు. ఈచిలుకకు నేను విద్య లీయనని చెప్పుము. ఇదిగో యాకె ముత్యాలహారము తీసికొనిపొమ్ము. ప్రకటనఁజూచి

విద్యావిషయముగాఁ బ్రసంగించితిని. గెలుపునొంటి నంతియచాలు. నన్నుఁ బెండ్లియాడుట కామె కిష్టములేకున్న మానివేయమనుము. జయింపఁబడితి నని పత్రిక వ్రాసియిమ్మనుము. పొమ్ము అని పలుకుచు నాహారము దానిముందరఁ బారవైచెను.

సారసిక రసికాగ్రేసరా! కోపపడియెద రేమిటికి? పత్రికలోఁ జిత్రములైనవిషయములు వ్రాసినదిగదా? చిలుకకు విద్యలు చెప్పక పోవుదురుగాక. ఆమెకుఁ బ్రత్యుత్తర మేమిటి కియ్యరు? అది మిమ్ములఁ బరీక్షించుటకాదు. అభిలాష దెలుపుట. నా కాలిపి తెలియదు. ఏమని వ్రాసినదో చదువుఁడు. అని యడిగిన వాఁడు ఓహో! నే నామాత్రము దెలియనివాఁడను గాను. నాకు దేశభాషాలిపిజ్ఞాన మున్నదో లేదో యని విదేశలిపితో వ్రాసినది. ఇంతకన్నఁ బరీక్ష యేమున్నది? అని పలికెను.

పోనిండు. మీ కఱువదినాలుగువిద్యలు వచ్చుంగదా? మీరు మఱియొకలిపితో మఱియొకభాషతోఁ బ్రత్యుత్తరము వ్రాసి యామెనే పరీక్షింపుఁడు. అందులకుఁ గోప మేమిటికి? అదియుచుంగాక మీరహస్యము లితరులకుఁ దెలియకుండ నీలిపితో వ్రాసిన దనుకొనరాదా? అని సమాధానము జెప్పిన నమ్మాణవకుఁ డిట్లనియె.

సారసికా! ఆమాట లేమియు నాకడఁ జెప్పకుము. పరీక్షకే యడిగినది. అందులకే నాకుఁ గోపమువచ్చినది. వేయిజెప్పుము. నేను బ్రత్యుత్తర మీయను. హారము దీసికొనిపొమ్ము. అని మొండివాదము సేయఁబూనెను. సారసిక యాలిపి వానికిఁ దెలియదని గ్రహించినది. వానిమాట లసందర్భములుగానుండుట కుచుమారుం డతఁడగునో కాఁడోయని సందియము హృదయమునఁ బొడమినది.

సంశయడోలాయితహృదయసారసయై సారసిక యిపుడే వత్తునని చెప్పి యప్పుడే సరస్వతియొద్దకుఁ బోయి మౌనమున విన్నఁదనము దోఁప నిట్లనియె.

సఖీ! ఆతండు నీవు వ్రాసినలిపి యెఱుంగినవాఁడుగాఁ దోఁపలేదు. పైపెచ్చు మాటడిగినందులకుఁ బెద్దకోపముఁ జెందెను. నీవు పెద్దలతో నాలోచింపకుండఁ దొందరపడి నీవే భర్తవని హారము నంపుదువా? ఆతండు వట్టిమూర్ఖుఁడువలె గనఁబడుచుండెను. మాటాడుటయే తెలియదు. శాస్త్రపరిశ్రమ చేసినట్లే తోఁచదు. అని యక్కడజరిగిన సంవాదమంతయు నెఱింగించినది.

సరస్వతి సీ! అసహ్యపుమాటలాడకుము. మొగమునఁ గళలేదనియు వక్తృత్వమే యెఱుఁగఁడనియు మూర్ఖుఁడనియుఁ బలుకుట నీయుపరిజ్ఞతలోపముగాక మఱియొకటికాదు. సర్వదేశభాషాలిపిజ్ఞానునకు నాలిపి తెలియదనుట సమంజసము గాదు. పలుమారడిగితివని కోపము వచ్చి యట్లనెను. పోనిమ్ము మఱేమియు నడుగవలదు. ఈశ్లోకముచూచి ప్రత్యుత్తరము వ్రాసి యిమ్మనుము. స్వదేశలిపితోనే వ్రాయుచుంటినని పలికి యొకశ్లోకము వ్రాసియిచ్చి యంపినది.

శ్లో॥ భో! రూపనిర్జిత మహేంద్రకుమార మార
శ్రీరాట్కుమార కుచుమార! మురు క్తిజాలైః
యత్త్వామనాయికథితో త్తరరూపభేదం
తత్ క్షంతు మర్హసి జితాస్మి భవత్కలాభిః॥

ఆశ్లోకము తీసికొనిపోయి సారసిక శంబరున కిచ్చినది. ఆతం డాశ్లోకము జదివియుఁ దదర్థావబోధనము చేసికొనలేక తలఁ గంపించుచుఁ బ్రత్యుత్తర మిమ్మని కోరుచున్నసారసికతో నేను దీని కిప్పుడు ప్రత్యుత్తరమీయను. వెనుకనుండి పంపెదను నీవు పొమ్ము. అని కచ్చితముగాఁ బలికి లోపలికిఁ బోయెను.

సారసికయుఁ జిన్నబుచ్చుకొని సరస్వతియొద్దకుఁ బోయి సఖీ! నీవు నన్నుఁ దిట్టినను దిట్టెదవుగాక; వానిం భర్తగాఁగోరుట యవివేకము. వాఁడు వట్టిమందుఁడు. బాగుగా నాలోచించుకొనుమని పలికినది.

అదియే మందమతియని సరస్వతి తలంచినది.

సారసిక యరిగిన వెనుక శంబరుండు అయ్యో! నేను దెలివితక్కువ పని గావించితిని తిరుగాఁ బరీక్షింపరనియు సరస్వతినిఁ బెండ్లియాడ వచ్చుననియుఁ దలంచితిని. నా ప్రయత్న మంతయు వ్యర్థమైనది. వీరికిఁ దెలియకుండఁ బారిపోవుటయే లెస్స. ఇంకుండిన నాగుట్టు బయలుకాక మానదు. అని యాలోచించుచుండ మంగళవాద్యములు వినంబడినవి. ఆధ్వని విని శంబరుండు వాకిటకు వచ్చెను.

మంత్రిసామంతపురోహితాదులు ముందు నడువ మనోహరాలంకారభూషితమగు భద్రగజం బొండు వచ్చుచుండెను అది యెవ్వరి నిమిత్తమో యని యాలోచించుచుండ నందు నిలువంబెట్టి కుచుమారుం డెందేయున్నవాఁడు. వారిబస యిదియే యని కొందఱు పలికిరి. కుచుమారుం డెందుండెనని యడిగిన నేనే కుచుమారుండనని శంబరుఁడు తెలియఁజేసెను.

అప్పుడు మంత్రు లతని సకలాలంకారభూషితుం జేసి యాయేనుఁగుపై నెక్కించి యూరేగింపుచుం దీసికొనిపోయి యొక దివ్యసౌధంబునం బ్రవేశపెట్టిరి. ఆసంతోషములో నతండు పారిపోవు మాటయే మఱచిపోయెను. పరిజను లతనికి రాజోపచారములు సేయుచుండిరి కాని వానికి సంతోషముమాత్రము లేదు. ఎవ రేమన్నను బెదరుతో మాట్లాడుచుండును. అని యెఱింగించునంత వేళ యతిక్రమించినది.

## 157 వ మజిలీ.

### — పల్లెవాండ్ర కథ. —

పురందరపురమునకుఁ గ్రోశముదూరములో నొకపల్లె గలదు. అందున్నవాండ్రందఱు పల్లెవాండ్రే. వాండ్రు వలలువైచి చేపలఁ బట్టియు నోడలఁ ద్రోసియుఁ దమకు జీవనమే జీవనాధారముగాఁ గాలక్షేపము చేయుచుండిరి. ఆపల్లెలోనివారికెల్ల నొకపురోహితుఁడు

గలఁడు. వా రాపురోహితు నడుగక క్రొత్తవలవేయుటగాని క్రొత్తయోడ నీటిలోఁ ద్రోయుటగాని నీటిలోనియోడల బాగుచేయుటకుఁ దీరము జేర్చుటగాని చేయరు.

ఒకనాఁడు నల్వురుబెస్తలు పురోహితునొద్దకుఁ బోయి జోహారు సేయుచు స్వామీ! మేము పెద్దవల నొకదాని నల్లుకొంటిమి. దాని నుపయోగించుటకు మంచివేళ నెప్పుడని యడిగిన నాబ్రాహ్మణుఁడు పంచాంగముజూచి యంకెలువైచి లగ్నముగట్టి నాఁటియర్ధరాత్ర మనుకూలముగా నున్నదని తెలియఁజేసెను.

స్వామీ! పురందరపురము కోటయగడ్తలోనికిఁ గ్రొత్తనీరు వచ్చినదని తెలిసినది. అది మిక్కిలి లోతుగలది. అందు గొప్ప గొప్ప చేఁపలున్నవని చెప్పుచున్నారు పగ లందు వలవేయనీయరు. ఈరాత్రి మేము పోయి మీరుసెప్పినవేళకు వల వేయుదుము. ముందుగా నందులోఁ బడ్డవస్తువు మీదేను. దాన వచ్చినసొమ్ము మీకిత్తుము. అని మ్రొక్కికొని వాండ్రు పురోహితుని సెలవుతీసికొని నాఁటిరేయి పెందలకడ భోజనములుసేసి వల మోచుకొనిపోయి చుక్కగుఱుతు చూచుకొని కోటవెనుక మారుమూలగానున్న కందకములో జే పరమేశ్వరా! అని పలుకుచుఁ గొత్తవల శుభాలున నాపరిఖలో వైచిరి. నూఱుగజముల త్రాడు మునిఁగినది.

గీ. తల్లి! భాగీరథీ గంగ దండమమ్మ
వరుణదేవర మమ్ముఁ గాపాడవయ్య
నీటివేలుపులార మన్నింపు డిపుడు
కృపను వలనిండఁ జేఁప లెక్కింపరయ్య.

అని పాడుచుఁ ద్రాడు లాగుట ప్రారంభించిరి. బరువుగాఁ దోఁచినంత గంతులువైచుచు,

ఒకఁడు—శా. గంగానమ్మకుఁ బప్పుపానకము లీగాఁ దెప్పగట్టింప నాదిం గావింపవలెఁ సరాసరిగ

మఱియొకఁడు—నంతేకాదురా ఇంటి కేగం గొట్టింపఁగ నా గణేశునకు ఓంకాయల్

ఇంకొకఁడు—బలే బాపనయ్యాం గాదందువురా ?

వేరొకఁడు—సెబా సదియే ముఖ్యాం బాదితీర్పంగఁ

అందఱు—జెప్పంగా నేటికి వారిదే ముడుపు ప్రాప్తం బిందు ముమ్మాటికిన్.

శా. గంగానమ్మకుఁ బప్పుపానకము లీగాఁ జెప్పఁ గట్టింప నా
డిం గావింపవలెన్ సరాసరిగ నంతేకాదురా యింటి కే
గం గొట్టింపఁగ నా గణేశునకు ఓంకాయల్ బలే బాపన
య్యాం గాదందువురా సెబా సదియు ముఖ్యాం బాది దీర్పంగఁ జె
ప్పంగా నేటికి వారిదే ముడుపు ప్రాప్తం బిందు ముమ్మాటికిన్.

అని యీరీతి వాండ్రు మాటలాడికొనుచు సంతసముతో నాజాలము లాగి యొడ్డున దులిపిరి.

బాబో శవమురో శవమురో యని భయపడుచు నలువురు వలవిడిచి దూరముగాఁ బరుగిడిరి. అల్లరిజేసిన రాజభటులు పట్టుకొందు రని యాలోచించి గడితుంట వెలిగించి మెల్లగా దాపునకుఁ బోయి యాశవమును బరీక్షించి చూచిరి. దానిమెడకు రాయి గట్టఁబడియున్నది.

అందొకఁడు ఒరే పాపము వీని నెవ్వరో తల నలియఁగొట్టి మెడకు రాయిగట్టి చచ్చెననితలంచి యింతకుముందే యీకందకములోఁ బారవేసియుందురు. వీనియాయువు గట్టిది. యూపిరి యాడుచున్నది. వీనిం బ్రతికించిన మనకు మంచిపున్నెము రాగలదు, వీని మెడలో దండెములున్నవి. భేమ్మఁడు కాఁబోలుననిన మఱియొకఁడు నవ్వుచు మన కిందు మొదటదొరకినవస్తువును మనభేమ్మడికిత్తుమని చెప్పివచ్చితిమిగదా. ఈ భేమ్మడి నాభేమ్మడి కిత్తము అనుటయు వేరొకఁడు సరిసరి, వీనినిచ్చిన నాయన యేమిచేసికొనును ? పైపెచ్చు తెగులుకుదురువఱకు తిండిపెట్ట

వలయును. అనిన నింకొకఁడు వీనిమెడలో నేదియో మాలికయున్నది చూడుఁడు అని పరీక్షించి ఇసిరో యెముకలు ఎముకలు. వీఁడెవఁడో దరిద్రుఁడు. చిన్నమెత్తుబంగారమైన మేనలేదే అని పరిహసించెను.

ఎట్లైనను బేమ్మడిని రక్షించుట పుణ్యముగదా. మన మీవల వైచినచో నీపాటికి వీఁడు కడతేఱియేయుండును. మనము వీనిం దీసికొని మనబేమ్మడికి కప్పగింతము. స్వస్థపడువరకు నాయనచే నుపచారములు సేయింతము. అందులకైన సొమ్ము మనమేయిత్తము. కుదిరిన తరువాత నంతయు వీనియొద్దఁ బుచ్చుకొందము అని నిశ్చయించుకొని యానలువురు వలమడతబెట్టి యందు వానిం బరుండఁబెట్టి యుయ్యాలవలెఁ గొయ్యకుఁ దగిల్చి నలువురు మోసికొనిపోయి పురోహితునింటికిం జని కేకపెట్టిరి.

ఆయన వచ్చి తలుపుతీసి యిదియేమియని యడిగెను. వాండ్రు నవ్వుచు మీకు ముడుపు తీసికొనివచ్చితిమి కైకొనుఁడు అని పలికిన నప్పాఱుండు దీపముదెచ్చి చూచి యితఁడెవ్వఁడు? అని యడిగిన వాండ్రు జరగినకథయంతయుం జెప్పిరి. అయ్యో! వాని నాకేమిటికి? బ్రతుకునో బ్రతుకఁడో ఈగొడవ నాకేల? తీసికొనిపొండు అని పలికినఁ బెద్దవాఁడు సామీ! మీ కింత దయలేదేమి? మీకులమువానికి కూకూడు బెట్టిన నొప్పుకొందురా? మీ రుపసారములు సేయుఁడు, అందులకైనసొమ్ము మే మిచ్చుచుందుము. బాగుపడినపిమ్మటఁ గూలిపనియైనం జేసి మనరుణము తీర్చకుండునా? పోనిండు. తీర్చనిచో మన దాసుండని పిలువఁబడుచుండును. అని యుపదేశించి యావిప్రు నంగీకరింపఁజేసెను.

లోపలికిఁ దీసికొనిపోయి మంచముపైఁ బరుండఁబెట్టిరి. మంట వైచి తడియార్చిరి. నలిగి రక్తముగారుచున్న తలకుఁ జేఁపపొట్టుతోఁ గలిపినూరిన వేపాకు పట్టువైచిరి. విధిపరిపాకము కడువిచిత్రమైనదికదా!

ఆపదలు గలుగఁజేయుటయు వానిం బోఁగొట్టుటయు భగవంతునిపనియై యున్నది. అందులకే "భయకృద్భయనాశనః" అని భగవంతునిఁ బొగడి యున్నారు. వారియుపచారమువలన నారోగి మఱునాఁ డుదయమునకు బాగుగా నూపిరి విడుచుచుండెను. బెస్తలు సంతసించుచు నామంచము విడువక మఱియు ననేకములగు చికిత్సలు సేయుచుండిరి. మూఁడు దినములవఱకుఁ గన్నులు తెఱవలేదు. నాలుగవనాఁడు కనులఁదెఱచి దాహమిమ్మని సూచించెను. పాలు దాహమిచ్చిరి. పిలిచినఁ బలుకలేదు.

ఆవుపా లాహారముగా నిచ్చుచుండ మఱినాలుగుదివసముల కతనికి స్మృతిగలిగినది. అప్పుడు పల్లెవాండ్రు అయ్యా! మీ దేదేశము? కందకములోఁ బడియుంటి రేల? మి మ్మెవ్వ రిట్లు చేసిరి? మీవృత్తాంతము సెప్పుఁడని యడిగిన నతండు మందస్వరముతో నా కిప్పు డేమియు జ్ఞాపకములేదు. మీరు నన్ను బ్రదికించితిరి. మీకు నేను దాసుండనై యుండెదననిమాత్రము సెప్పెను.

పల్లెవాండ్రు సొమ్మిచ్చుచున్నవారు కావునఁ బురోహితుఁడు వానికి నుపచారములు చక్కఁగాఁ జేయుచుండెను. క్రమంబున మెదడు పూడికొనుటచే నతనికిఁ బూర్వపువ్యక్తి గలుగఁ బ్రారంభించెను. తన్ను శంబరుండు నిద్రించుచుండఁ దల నలియఁగొట్టి కందకములోఁ బారవైచెనని తెలిసికొనియెను. పల్లెవాండ్రుచేసిన యుపచారములగుఱించి యూరక స్తుతియించుచుండెను.

తెలిసినతరువాతనైనఁ దనభంగపాటు వాండ్రకుఁ జెప్పలేదు. కూర్చుండుటకు శక్తిగలిగినప్పుడు పల్లెవాండ్ర కేమియుపకారము చేయుదునని యాలోచించుచుండును. పల్లెవాండ్రు ఆయననిమిత్తమై చెక్కలకును వేరులకును బసరులకుఁ దిరుగుచుండుటచేఁ దమవృత్తి సేసికొనుటకవకాశము గలిగినదికాదు.

ఆరోగినిమిత్తమైన ఋణము నలుగురు సమముగాఁ బంచుకొన

వలసియున్నది. ఒకనాఁడు నలువురు నాఋణవిభేద మేర్పఱుచుకొనుట లో నొకఁడు స్వకుటుంబమునిమిత్తము తెచ్చిన పంచదార నారోగికైన వ్యయపట్టికలో వ్రాయుటచే వారిలోవారికిఁ దగవు వచ్చినది. వారా విషయమై కలహించుచు నిజము తెలిసికొనుటకై పురోహితునింటికి వచ్చి యామర్మ మాయనతోఁ జెప్పికొనిరి.

ఆకలహప్రకారమంతయును విని యారోగి వారినెల్లరఁ బిలిచి బాబులారా! మీరు నాకొఱకుఁ జాలశ్రమపడుటయేకాక సొమ్ముకూడ సెలవుచేసిరి. అందులకుఁ గృతజ్ఞుఁడనగుటయేకాక మీకైన ఋణమున కిబ్బడి యిచ్చివేయుదును. ప్రస్తుత మంతకన్నఁ జెప్పఁజాలను. బ్రతికియుం డిన మిమ్ముల సమానులలో నత్యధికులఁ జేయుదునని చెప్పుట ముఖ ప్రీతిమాట యగును. లేచి తిరుగుటకుఁ గొంచెముశక్తి వచ్చుచున్నది. కొలఁదిదినములలో మీఋణము తీర్తును. మీరు నానిమిత్తమై తగవు లాడవలదని గడ్డములు పట్టుకొని బ్రతిమాలుకొనియెను. వా రంగీక రించి వెనుకటిరీతిగా మైత్రితో మెలఁగుచుండిరి.

ఒకనాఁడు కొందఱువర్తకు లాపల్లెకు వచ్చి తమకు నొడనడుపు టకై చదివికొన్నపల్లెవాఁడు కావలయును. వానికిఁ దగినవేతన మిత్తుము. మే మొకయేటిరేవు గుత్తకొంటిమి. అందు దాటు మార్గస్థులకడఁ బుచ్చికొనిన సొమ్ము నమ్మకముగాఁ బద్దులువ్రాసి యప్పగించవల యును. అందలి యధికారమంతయు వాని కిచ్చివేయుదుము. నదియొడ్డు ననే కాపురముండవలయునని యానిబంధనము లన్నియుఁ దెలియఁజేసిరి.

అట్టిపనికిఁ దగినవాఁ డొక్కఁడు నందు లేడు. పురోహితునింట నున్న బ్రాహ్మణుఁడా వార్త విని నే నప్పనులన్నియు నమ్మకముగాఁ జేయు దును. నాకు మొత్తముగాఁ గొంతవిత్త మీయవలయును. నెలనెలకు వేతనములోఁ గొంత దీసికొనుచుండవలయునని తన సామర్థ్యమంతయు నక్కజమందునట్లు వారికిఁ దెలియఁజేసెను.

ఆబేహారు లతఁడుకోరిన సొమ్మిచ్చుట కొప్పుకొనిరి. అతఁడు పల్లెవాండ్రం జేరి తననిమిత్తమై వాండ్రువ్రాసిన విత్తపు పట్టికం దీసికొని దాని కిబ్బడిగా వర్తకులచేత వారి కిప్పించెను. వాండ్రు మిగుల సంతసించుచుండ నోరీ! మీరు నాకుఁ బ్రాణదానము గావించితిరి. నే నేమిచ్చినను మీయుపకృతికి సరిపడదు. ఇప్పుడు చెప్పరాదు కాని నే నొకప్పు డీదేశమునకు రాజను గావచ్చును అప్పు డేమైన నుపకారము సేయఁ జాలుదునేమో యని పెద్దగా వాండ్రం బొగడి పురోహితుని గీర్తించి వారి వలన నామంత్రణంబు వడసి వర్తకులవెంట నేటియొడ్డునకుఁ బోయెను.

అది గొప్ప రేవు. బాటసారులు వేలకొలఁది నిత్య మారేవు దాటి పోవుచుందురు. ఆయిజారాదారు బాటసారులవల్ల సొమ్ము సేకరించుటకును పద్దులు వ్రాయుటకును నావికులకెల్లఁ దగినపనులు సెప్పుటకును నాబ్రాహ్మణునకు సర్వాధికార మిచ్చి యుందుఁ గాపురముండునట్లు చేసెను.

అతఁడు మార్గస్థులవలనఁ గాసైన బీరువోకుండఁ గైకొనుచు బాటసారుల కాటంకములేకుండ వెంటవెంటనే యోడల నడిపించుచు సత్యమైనలెక్కలు వ్రాసి యానెలలోఁ దనయజమానుని కెక్కుడు లాభము చూపించెను. అతనిసత్యప్రవర్తనము దెలిసికొని గుత్తదారుఁడు వేతన మభివృద్ధిచేసి యన్నిపనులు నతనిమీఁదనే వదలివైచెను.

మఱికొన్నిదినములు గడిచినంతఁ గొందఱువిద్వాంసు లారేవు దాటుటకై యక్కడికి వచ్చి సొమ్ముపుచ్చుకొనుచున్న యావిప్రుం జూచి అయ్యా! మేము పండితులము. పురందరపురమున కరుగుచుంటిమి. తన్నగరాధీశ్వరునికూఁతురు సరస్వతి కుచుమారుండను సూరిసత్తముని వివాహమాడుచున్నది. అమ్మహోత్సవమునకుఁ బండితులనెల్ల రమ్మని శుభలేఖలు వ్రాసిరి. మేము దూరమునుండి వచ్చుచుంటిమి. మమ్మూరకయే రేవు దాటింపవలయునని కోరుచు నాశీర్వచనశ్రుతి యొకటి చదివి

యర్థము చెప్పిరి.

అందు స్వరభేదము అర్థస్ఖాలిత్య ముంచుట నవ్వుచు నాబ్రాహ్మణుఁడు ఆవిపరీతము వారికిఁ దెలియఁజేసి గంభీరోపన్యాసపూర్వకముగ సత్యార్థము జెప్పి యప్పండితులనెల్ల విస్మయసముద్రములో ముంచివైచెను.

అప్పుడు వారు అయ్యా రే! నీయుపన్యాసము విన చతుశ్శాస్త్ర పాండిత్యముగలవాఁడవుగాఁ దోఁచుచున్నావు. ఈయల్పాధికార మేల వహించితివి? మాతోఁ బురందరపురమునకు రమ్ము. అందుఁ బెక్కు విద్వత్సభలు జరుగును. జయమందినవారికి గొప్పకానుక లిత్తురఁట. మఱియు గోసర్ధియుఁడను విద్వత్ప్రభువుగూడ నానగరమునకు వచ్చుచున్నాఁడు. అనేకవిశేషములు జరగఁగలవు. ఈహైన్యజీవన మేమిటికి? రమ్మని పలికిన విని యతండు కుచుమారుఁడు బ్రాహ్మణుఁడుగదా? రాజపుత్రిక నెట్లు వివాహమాడుచున్నాఁడు? వానికిఁగూడ రాజ్యము గలదాయేమి? యనియడిగిన నాభూసురు లిట్లనిరి.

అయ్యా! అది పెద్దగాథ యున్నది. సరస్వతి మహాపండితురాలు. తన్ను విద్యలలో నోడించినవానిం బెండ్లియాడెదనని శపథము చేసినదఁట. కుచుమారుం డోడించెను. తక్కినవిషయములన్నియు మనకేల? అని సంక్షేపముగాఁ దెలియఁజేసిరి.

అట్లు వారు మాట్లాడుకొనుచుండఁగనే గుత్తదారుఁ డొకచీటి నాబ్రాహ్మణునొద్ద కనిపెను. జయపురాధీశ్వరుఁడగు గోసర్ధియుఁడను మహారాజు మనరేవుదాటి పురందరపురమున కరుగునఁట. పెక్కుసిబ్బందితో వచ్చును కావునఁ దగిననావల నియమించి కడుమర్యాదగా వారిం దాటించి మాట దక్కింతురని నమ్ముచున్నాను. రేపు సూర్యోదయసమయమునకే వత్తురు కావున సర్వము సిద్ధము చేయించవలయును.

అనియున్నచీటిం జదివికొని యాబ్రాహ్మణుఁడు దండనున్న పం

డితులతో నార్యులారా! ఆగోనర్దీయుఁడు క్షత్రియుఁడా? అని యడిగిన వారు నవ్వుచు క్షత్రియుఁడుకాఁడు. బ్రాహ్మణుఁడే. మహావిద్వాంసుఁడు. మంత్రశాస్త్రములో నాయనకుఁ జాలినవాఁడు లేఁడు. జయపురాధీశ్వరునిపుత్రికను బట్టినభూతమును వదల్చి యామెం బెండ్లియాడి యాదేశమునకు రాజయ్యెను. అని సంక్షేపముగా నాతనివృత్తాంతము చెప్పిరి. అతని కంతకంటె నప్పుడు తెలిసికొనుట కవకాశము గలిగినదికాదు.

ఆవిద్వాంసుల నూరకయే రేవుదాటించి యేనుఁగులు గుఱ్ఱములు లోనగు జంతువులు దాటుటకుఁ దగిన యోడలఁ బెక్కు నియమించి నావికులనెల్ల నాయత్తముగానుండుమని యానృపతిరాక కెదురుచూచుచుండె. అమ్మఱునాఁడు యథాకాలమునకే గోనర్దీయుఁడు సపరివారముగా వచ్చి యందు విడిసెను. రాజభటులు కొందఱు తొందరగా నేటియొద్దకు వచ్చి గుత్తదారెవ్వఁడు? నావలసిద్ధపఱిచెనా? యని యడిగిరి.

బ్రాహ్మణుఁడు లేచి అన్నియు సిద్ధముగా నున్నవి. అవి యేనుఁగులు దాటునవి, అవి గుఱ్ఱములకు, నవి మనుష్యులకు, నది రాజుగారి కని వేఱువేఱ నిరూపించిచూపించెను. రాజభటులు సంతసించుచు అయ్యా! మీరొకసారి మారాజుగారియొద్దకు రండు. కర్తవ్య మెఱింగింతురని పలికిన వల్లెయని యావిప్రుండు వారివెంట గోనర్దీయుచెంతకరుగుచుండెను. అప్పుడే యేనుఁగును దిగి నదీతీరమునకు విహారార్థమై గోనర్దీయుఁడు వచ్చుచుండెను. ఇరువురు దారిలోఁదారసిల్లిరి.

రాజభటులు వంగి సలాముచేయుచు మహారాజా! యీతఁడే నావికాధిపతి. మంచినావల పెక్కు సిద్ధపఱచియుంచెను. దేవరదర్శనార్థమై తీసికొనివచ్చితిమని పలికిరి. అప్పు డతం డాపాఱు నెగాదిగా చూచి విస్మయముతో నీపేరేమి? మీ కాపుర మెందు? జన్మభూమి యేది? అని యడిగిన నావిప్రుండు నవ్వుచు నాపేరు కుచుమారుఁడందురు. అని చెప్పుచుండఁగనే యారాజు ఓహోహో! మిత్రుఁడా!

నన్ను గురుతుపట్టలేకపోయితివా ? గోనర్ద్రీయుఁడనని బిగ్గరగా కౌఁగిలించుకొని యానందాశ్రువులచే నతనిం దడుపుచు అయ్యో ! నీవిట్లు చిక్కిపోయితివేమి ? రూపము చాలా మారియున్నది. ఈనావికాధిపత్య మెక్కడ సంపాదించితివి ? నీవు పురందరపురాధిపతికూఁతురు సరస్వతిని విద్యలలో నోడించి యామెం బెండ్లియాడుచుంటివని పత్రికలలోఁ జూచి యక్కడికే పోవుచుంటిని మఱియు యాకుచుమారుఁడెవ్వఁడు ? ఇది వింతగానున్నదే. నీవృత్తాంతమంతయు నెఱింగించుమని యడిగెను.

అందున్నవారెల్ల రాజుగా రావిప్రునితోఁ జనువుగా మాటాడుచుండుట చూచి విస్మయము జెందుచుండిరి. కుచుమారుండు గోనర్ద్రీయుని కైదండఁగొని యొకవిజనసైకతస్థలమునకుఁ దీసికొనిపోయి యందుఁ గూర్చుండఁబెట్టి ముందు తనకథ యిట్లు చెప్పెను.

వయస్యా ! భగవత్సంకల్పము కడు చిత్రమైనది. మనతలం పొక్కటియును సాగదు. ఉత్తరదేశారణ్యములు సూడవలయునని సువర్ణనాభునితోఁ గొంతదూరము పోయితిని. ఆబాధ కోర్వలేక మఱలి దైవవశంబున సిద్ధాశ్రమవిశేషములఁ దెలిసికొని నూతనవిద్య సంపాదించి సరస్వతిని వాదములో నోడించి వరింపఁబడితిని. శంబరుండు దుష్టుండని యెఱుఁగక గుట్టుచెప్పితిని. వాఁడు సూడుపట్టి నన్నుఁ దలఁ జిదియఁగొట్టి కందకములోఁ బారవైచెను. 'ఆయుర్మర్మాణిరక్షతి' అను శాస్త్రమువలనఁ బల్లెవాండ్రవలన నేను రక్షింపఁబడితిని. వాండ్రు నాకుఁగావించిన యుపచారములు జన్మములో మఱువఁదగినవికావు. దయార్ద్రహృదయు లన్నికులములలో నుందురుగదా? పాపము వారునా నిమిత్తము కొంతబుణము జేసిరి. ఆబుణము కొంతతీర్చి యిం దీయుద్యోగములోఁ బ్రవేశించితినని తనయుదంత మాద్యంత మెఱింగించెను.

అప్పుడు గోనర్ద్రీయుఁ డతనిఁ గౌఁగిలించుకొని వెక్కి వెక్కి

యేడ్చుచు నయ్యయ్యో! యెంతయాపదదాటినది? క్షణముదప్పిన నిన్నీజన్మమునకుఁ జూచుట తటస్థింపకపోవును గదా? ఆహా మహానుభావులు పల్లెవాండ్రు. వారినెల్ల నిటు రక్షింపుము. వారిగేహములెల్ల బంగారుమయము గావించెదను. నిన్నగాధహ్రదమునుండి పైకిలాగిన జాలము నొకసారి నాకన్నులం బెట్టింపుము. దానిపై బంగారుతీగెలతో నల్లించి కులదేవతవలెఁ బూజించుచుందును. అని మఱియు నలుకదోప నిన్నుఁ జంపఁబూనిన యాదుష్టుం డాకృతఘ్నుఁడు ఆపాపాత్ముఁ డిందే యున్నవాఁడా? వాని నిప్పుడేపోయి శిరచ్ఛేదము గావించెద నాన తీయుము అని దుఃఖోన్మాదంబునం బలుకుచున్న గోవర్ధియునూఱడించుచుఁ గుచుమారుండు తనయుత్తరీయమున నతని కన్నీరు దుడుచుచు వయస్యా! నేను బ్రతికితినికాదా? విచారించెదవేమిటికి? ఈయడిల్లుము శంబరుని కాలమే శిక్షింపఁగలదు. వానితండ్రి గావించిన సహాయమునకై విశ్వాసము హృదయంబున బాధించుచున్నది. అందులకై వాని నేమి చేయుటకు మనసు రాకున్నది. అది యట్లుండె. నీ వీరాజ్య మెట్లు సంపాదించితివి? నీవృత్తాంతము జెప్పుమని యడిగిన నతండు కన్నులం దుడిచికొనుచు నిట్లనియె.

మిత్రమా! నీపాటు వినిన దుఃఖ మాగినదికాదు. దుర్జనులఁ జేరనిచ్చిన విపత్తు గలుగకమానదు. నిన్నట్లు పరాభవించి తానే కుచుమారుండనని ప్రకటించుచున్నవాఁడు గాఁబోలు. అయ్యో! తొందరపడి తెలియక సరస్వతి వానిం బెండ్లియాడదుగదా? నీవు చెప్పినమాటలు విన నారమణి యసామాన్యప్రజ్ఞ కలదిగాఁ దోఁచుచున్నది. మఱలఁ బరీక్షింపక యంగీకరింపదు. కానిమ్ము దైవసంకల్పము మార్ప మన తరమా? ఇఁక నావృత్తాంతము జెప్పెద నాలింపుమని యిట్లు చెప్పచుండెను.

అని యెఱింగించునంతఁ గాలాతీతమైనది. తరువాత వృత్తాంతము పైమజిలీయం దెఱింగించెద.

## 158 వ మజిలీ

### గోనర్దీయుని కథ.

మ. నగముల్ ధూళిగ ధూళి శైలముగ సాంద్రంబు న్వ్వాలాసస్థలం
బుగఁ జెప్పన్ సుగభీరవార్ధిగఁ దృణంబు న్సారవజ్రాయుధం
బుగ వజ్రంబు దృణంబుగాఁగను హిమంబు న్వహ్నిగా వహ్ని మం
చుగఁ గావించెఁడు నద్భుతాచరణదక్షుం డీశ్వరుం డెప్పుడున్.

మిత్రమా! అఘటితఘటనాసమర్థుండగు భగవంతుని విలాసములు కడు చిత్రములు. వినుము. మనమందఱ మొకసారియే కాశీపురంబు విడిచితిమి. నేను బశ్చిమదిక్కుగాఁ బోయిపోయి యనేకపురనదీపక్కణారణ్యములు చూచుచు నందందుఁగల వింతలఁ బరికించుచు రెండు నెలలు గడపితిని. అలోపలఁ జెప్పఁదగిన విశేష మేదియు నాకుఁ గనంబడ లేదు.

ఇఁక ధారానగరంబుమార్గంబు పట్టి పోఁదగునని నిశ్చయించుకొని యొకగ్రామములో నామార్గ మడిగి తెలిసికొని దక్షిణాభిముఖుండనై పోవుచుంటిని. పుడమి తెరపికన్న నడవిగలదేశమే యెక్కువగా నున్నదని తలంచెదను. నేనుబోవుదారి నరమృగపక్షిశూన్యంబగు నొకమహారణ్యములో దింపినది. ఎన్ని దినములు నడిచినను నాయడవికిఁ దుదిమొదలు గనంబడలేదు. ఎన్ని దినములు నడిచితినో యేదిక్కునకుఁ బోవుచుంటినో తెలియక దిగ్భ్రమ జెంది తిరిగినచోటే మరలఁ దిరుగుచుంటిని.

కందమూలఫలాదులచే నాకలి యడంచుకొనుచుంటిని గాని క్రమంబున మేనిలో బలము తరుగుచుండెను. ఇఁక నాయరణ్యము దాటి పోవఁజాలనని యధైర్యము గలిగినది. మిత్రదర్శనము లభింపదని విచారించుచుంటిని. అక్కాంతారములో మరణము నాకు విధి విధించెనని నిశ్చయించుకొంటిని. నాకు మొదటినుండియు నడవులనిన భయము.

అందులకే మీతో నుత్తరదేశారణ్యములకు రమ్మనిన రానైతిని. నీవును గొంత యరణ్యసంచారశ్రమ మనుభవించితివి కావున విస్తరించి చెప్పనవసరము లేదు.

ఒకనాఁడు చీఁకటిపడునప్పటి కొక రావిచెట్టుక్రిందఁ జేరితిని. అది సమతలమగుట నాతరుమూలము పవిత్రమని తలంచి యందు శుభ్రపఱచుకొని,

శ్లో॥ మూలతో బ్రహ్మరూపాయ మధ్యతో విష్ణురూపిణే।
అగ్రత శ్శివరూపాయ వృక్షరాజాయ తే నమః॥

అని నమస్కరించుచు నాతరుమూలమునఁ బండుకొని వృక్షములలో నశ్వత్థవృక్ష మైతినని చెప్పిన భగవద్గీతావాక్యమును స్మరించుకొనుచు నాతరురాజమునే భగవంతునిగాఁ దలంచుచుఁ దచ్ఛాఖల యందుఁ జూట్కులిడి ధ్యానించుచుంటిని. అప్పటి యథాస్థితిఁ దలంప మేను గంపమునొందుచున్నది. చూడుఁడు. నాఁడమావాస్య. కొంచెము మబ్బుకూడ పట్టినది. మహాంధకారము వృక్షచ్ఛాయలతో మిళితమై యిది తెరువు ఇది యడవి ఇది మిన్ను అను భేదము తెలియక కన్నులు మూసికొనినను దెఱచినను నొకవిధముగానే కనంబడఁజొచ్చినది. ఝల్లరీ ధ్వానములచేఁ జెవులు బీటలువాఱుచుండెను. నిద్రబట్టక యొంటిప్రాణముతో నాచెట్టుక్రిందఁ బండుకొనియుంటిని. అర్ధరాత్ర మైనప్పుడు,

గీ. భైరవాట్టహాసభంగి భీకరముగ
బొబ్బపెట్టికొనుచు భూత మొకటి
భూరివాతఘాతమునఁబోలెఁ గొమ్మలు
బొదల నాద్రుమాగ్రమునకు నుఱికె.

మేను ఝల్లుమన నాభూతంబు నాపైఁబడి ప్రాణంబు పీల్చుచున్నట్లుగాఁ దలంచి మేను వివశమునొంద నందుఁబడియుండి యంతలోఁ దెలిసికొని యోహో! తెలిసినది. రావిచెట్టుపై బ్రహ్మరాక్షసు

లుండునని చెప్పుదురు. తద్భయంకరధ్వన్యంతరమున వేదఘోషము వినంబడుచున్నది. తప్పక యిది బ్రహ్మరాక్షసియే. ఇంక నాయాయుర్దాయము గడియలలోనున్నది. అంత్యకాలమున వేదోచ్చారణ గావించుట ముక్తిప్రదంబని ధైర్యముదెచ్చుకొని నే నధికోత్సాహంబునఁ జెట్టుక్రిందఁ గూర్చుండి సడుముగట్టుకొని పదస్వరానుస్వారభేదములు లేకుండఁ దత్స్వరానుసారముగా,

సీ. సంహిత నున్నతస్వరమునఁ బఠియింప
స్వస్తి జెప్పితి సమస్వరముగదుర
వరపరాయితము నేకరువు వెట్ట నతండు
కలిపి చెప్పితిని సక్రమముగాఁగఁ
బదము వల్లింపఁ దప్పక నేను గవు లందు
కొని సమంబుగఁ జెప్పితిని పదంబు
క్రమము జెప్పిన నేను గ్రమము చెప్పితి జట
నుచ్చరింపఁగ జట నుచ్చరించి
గీ. తిని ఘనఁ బఠింపఁ జదివితి ఘనను దులగ
నుపనిషత్తులఁ జదువంగ నుపనిషత్తు
లనె పఠించితి శ్రుతులెల్ల ననువదింప
ననువదించితి సమముగా నతనితోడ.

అట్లు కవులు తప్పకుండ-ముందరివాక్యము లందిచ్చుచు సమముగా స్వస్తి చెప్పుచుంటిని. నాకంఠధ్వని విని యాభూతంబు క్రిందికి చూచి ఎవఁడవురా? నీ విట్లు వెఱపులేక నాతో సనముగా వేద ముచ్చరింపుచుంటివి? అని పెద్దకేకపెట్టి యడిగెను.

అప్పుడు వెఱపుడిపికొని మొండిసాహసముతో అయ్యా! నా వృత్తాంతము వినవలయును. నేను గోసర్దియుఁడను బ్రాహ్మణుఁడ. కాశిలో సమస్తవిద్యలుం జదివితిని. అందు నాకుఁ గ్రొత్తవిద్యఁ గఱపు

నుపాధ్యాయుండు దొరకమి నూత్నవిద్యాభ్యాసలాలసత్వంబుతో నా పట్టణంబు విడిచి పెక్కుదేశములు దిరిగితిని. ఎందుఁబోయిన నెవ్వరుఁ గనంబడలేదు.

ఇక్కడి కుత్తరముగాఁ బదియోజనములలో నొకయగ్రహారము గలదు, నేనక్కడికిఁ బోయి నాకువచ్చిన విద్యలఁ బేర్కొని క్రొత్తవిద్యఁ గఱపువా రెవ్వరైన నీయూర నుండిరా ? అని యడిగితిని. ఒక బ్రాహ్మణుఁడు నన్నుఁజూచి యోయీ! నీవు చిఱుతవాఁడవైనను ననేకవిద్యల యందుఁ బాండిత్యము సంపాదించితివి. నీకంటెఁ జదివికొన్నవారీయగ్రహారమున లేరు. ఇక్కడికి దక్షిణముగాఁ బదియోజనములదూరములో మహారణ్యము గలదు అందొక రావిచెట్టు నాశ్రయించి యొక బ్రహ్మరాక్షసుఁ డున్నవాఁడు. అతనికి రానివిద్యలు లేవు. నీ వక్కడికిఁ బొమ్ము క్రొత్తవిద్య నుపదేశింపఁగలఁడని యెఱింగించిన సంతసించుచు నక్కడికిఁ బోవు మార్గ మెట్లని యడిగితిని.

అప్పుడు మఱియొకవిప్రుఁడు నామాట విని అయ్యో! వెఱ్ఱిపారుఁడా! అక్కడికిఁ బోయెదవుచుమీ ? ఇతఁడు పరిహాసమున జెప్పెను. మనుష్యగాత్రముల గారిముక్కలవలె విఱుచుకొనితినియెడు బ్రహ్మరాక్షసుఁడు నీకు విద్యోపదేశము చేయునా ? వలదు వలదు. మఱియొకదేశమున కరుగుమని యుపదేశించెను.

ఆహా! సర్వవిద్యాపారంగతుఁడైన యాయన నన్నేమిటికిం జంపును ? శిష్యరికము గావింప విద్యోపదేశ మేల చేయకుండెడిని ? చచ్చినఁ జత్తుఁగాక నందుఁ బోవకమాననని సంకల్పించుకొని వారికెవ్వరకిం జెప్పక గుఱుతులుజూచుకొనుచు వెదకి వెదకి తిరిగి తిరిగి యతికష్టమున నేఁటిసాయంకాలమున మీయింటి కతిథినై వచ్చితిని. మత్పూర్వకృతసుకృతవిశేషంబున మిమ్ముఁ బొడఁగంటి. ఇఁక కృతకృత్యుండ నగుటకు సందియము లేదు. ఏమిచేసినను లెస్సయే. క్రొత్తవిద్య లుపదేశించిన సంత

సమే. కానిచో నన్ను భక్షించి నీయాఁకలి యడంచుకొనుము. ఎట్లైన ను జరితార్థుఁడనే యని వానికి జాలివొడమున ట్లుపన్యసించితిని..

నాయుపన్యాసము విని యాభూతం బోహో హా! యెంత మాట పలికితివి? విద్యాభ్యాసముచేయ నన్నాశ్రయింపవచ్చిన నిన్నుఁ జంపుదునా? ఎంతబ్రహ్మరాక్షసుండనైనను బుణ్యాపాపవివక్షత తెలియ దా? నీస్వల్పదేహమున నాయాఁకలి యేమాత్ర మడంగఁగలదు? అది యునుంగాక,

శ్లో. బాలోవాయదివావృద్ధోయువావాగృహమాగతః।
తస్యపూజావిధాతవ్యా సర్వస్యాభ్యాగతో గురుః॥
ఉత్తమస్యాపివర్ణస్య నీచోపిగృహమాగతః।
పూజనీయో యథాయోగ్య స్సర్వదేవమయోతిథిః॥

బాలుండైనను వృద్ధుండైనను తనయింటి కతిథిగావచ్చినచోఁ దప్పక వానిఁ బూజింపవలయును. ఎల్లరకు నభ్యాగతుండు గురువువంటి వాఁడు. మఱియు నీచకులుండైనఁ దనయింటి కతిథిగావచ్చిన వాని గూడ యథాయోగ్యముగాఁ బూజింపవలయును. అతిథి సర్వదేవమ యుండై యుండును అని శాస్త్రములు ఘోషింపుచుండ నిన్నుఁ జంపు టకు నాకు నో రెట్లువచ్చును? శరణాగతుండవైన నీయభీష్టము దీర్ప కున్న నాపాప మెట్లుపోఁగలదు? నన్నుఁ దరింపఁజేయుటకే నీ విక్కడికి వచ్చితివి. నీతో సంభాషించుటచే నాపూర్వోదంతమంతయు నంతఃకరణ గోచర మగుచున్నది. నాయోపిన యుపకారము గావించి నే నీజన్మము నుండి విముక్తిఁ బొందెదనని పలికిన విని నే నాత్మగతంబునఁ దిరుగా జన్మించినట్లు తలంచుచు మహాత్మా! నీపూర్వజన్మవృత్తాంత మెట్టిది? ఏమి కారణంబున నిట్టిరూపము వహించితివి? వినుటకుఁ బాత్రుఁడనేని నీవృ త్తాంత మెఱింగించి నన్నుఁ గృతార్థుఁ గావింపుమని మిక్కిలి వినయము తోఁ బ్రార్థించితిని. అతండు చెట్టుపైఁగూర్చుండియే తనవృత్తాంత మిట్లు

చెప్పఁదొడంగెను.

## —♦ దేవభూతికథ. ♦—

కుమారనగరంబున విష్ణుభూతియను బ్రాహ్మణుఁడు గలఁడు. అతఁడు వేదవేదాంగములు నెఱింగిన శ్రోత్రియుఁడు అగ్నిష్టోమాది క్రతువులుసేసిన యాహితాగ్ని; అభ్యాగతుల నర్చించిన యన్నదాత. అనూచానసంపత్తి గలిగి యథాన్యాయంబుగ గార్హస్థ్యధర్మంబులు నడుపుచుండఁ గొండొకకాలంబునకు సప్రజావ్రతనియమంబునఁ గులపావనుఁడనై కుమారుఁడనై నే నుదయించితిని. నాకు దేవభూతియని పేరుపెట్టెను. నేను మిక్కిలి చక్కనివాఁడనని చెప్పికొనుటకు సిగ్గగుచున్నది. నా కైదేఁడులు వచ్చినదిమొదలు మాతండ్రి నాకు విద్యగఱపించుటకుఁ బెద్దయత్నము గావించెను. పదుగురు గురువుల నియమించి యన్ని విద్యలు పాఠములు సెప్పించుచుండెను. నాబుద్ధి మిగుల సూక్ష్మమైనది. నాగ్రహణధారణశక్తికి నుపాధ్యాయు లచ్చెరుపడఁజొచ్చిరి. నాలుగు వేదములు నారుశాస్త్రములు, పాఠములు జెప్పుకొంట నచిరకాలములోఁ దండ్రికంటె గొప్పపండితుండనై తినని వాడుకపొందితిని. మా తండ్రి కొలఁదికాలములో స్వర్గస్థుఁడయ్యెను. పిమ్మటఁ జెప్పునదేమున్నది?

శ్లో॥ యౌవనం ధనసంపత్తిః ప్రభుత్వ మవివేకితా ।
ఏకైకమప్యనర్థాయ కిముయత్రచతుష్టయం॥

యౌవనము, ధనము, ప్రభుత్వము, వివేకశూన్యత, ఈనాలుగు గుణములలో నేది గలిగినను నసర్థమునకుఁ గారణమగుచున్నది. నాలుగు నొకచోటనే యుండినచోఁ జెప్పఁదగినదేమి? యౌవనమదము విద్యామదము రూపమదము ధనమదము నన్నాశ్రయించినవి. నావంటివాఁడు పుడమిలో లేడని గర్వపడుచుంటిని. పండితులు వచ్చిన సత్కరింపక తృణప్రాయముగాఁ దలంచి యవమానించి పంపుచుంటిని. అభ్యాగతుల విద్యాగంధరహితులని పరిహాసించి పూజింపనైతిని. మాతండ్రిగారివాడుక

క్రమంబున సంతరించిపోవుచుండెను. దుర్వ్యసనములపాలై విద్యార్థులకు విద్యలు గఱపలేదు. సంతతము క్రీడాసక్తుండనై తిరుగుచుంటిని.

నాకు మాతండ్రియున్నప్పుడే శుద్ధశ్రోత్రియునిపుత్రిక నొక దానిం గట్టిపెట్టిరి. అది కాపురమునకువచ్చినది కాని దానికి శృంగారమునం దభినివేశ మేమియును లేదు.

క. మడికచ్చ పెద్దబొట్టును
నడికొప్పును బెట్టికొనుచు నవ్వ విభూషల్
దొడకగ పూర్వాచారపు
నడవడి వర్తించుఁ బెద్దనాఁతియవోలెన్.

నామదికి దానివేషభాషావిశేషము లేమియు సంతోషము గలుగఁజేయకున్నవి. నేనును కామసూత్రము, కందర్పచూడామణి, అనంగరంగము, రతిరహస్యము, నాగరవల్లభము, నాగరసర్వస్వము, కామరత్నము, మన్మథసంహిత, మనసిజసూత్రము, కాదంబరీస్వీకరణసూత్రము, కాదింబరీస్వీకరణకారిక, నర్మకేళీకౌతుకసంవాదము, రతిమంజరి, కామతంత్రము, రతికల్లోలిని, పంచసాయకవిజయము, స్మరదీపిక, లోనగు కామశాస్త్రములు నెన్నియో చదివితిని. కొన్నిటికి వ్యాఖ్యానములు రచించితిని. నాభార్య కీవిలాసము లేమియు నవసరములేదు. నాచక్కఁదనమునకు నావిద్యకు సార్థక మేమి? అని సర్వదా విచారించుచుందును.

నామిత్రులు కొందఱు వేశ్యాలంపటుఁడవుకమ్మని నాకు బోధించిరి. వేశ్యల వలపులు సహజములు కామిం జేసి యందులకు నాబుద్ధి యొడంబడినదికాదు. సహజానురాగము గలిగి దివ్యరూపకళావతియగు లావణ్యవతితోఁ గూడనివానిజన్మ మొకజన్మమా? అని సర్వదా తలంచుచుందును. నాలోపమునకు నేన వగచుచు సంకల్పశతములచే సుందరస్త్రీసంభోగ మనుభవించుచుఁ గొన్నిదినములు గడిపితిని.

మాప్రక్క నొక్క శ్రోత్రియబ్రాహ్మణుఁడు కాపురము సే

యుచుండెను. ఆయనకుమారుఁడు వేదమంతయు గట్టిగా వల్లించినాఁడు ఇతరవిద్య లేవియు రావు అతనికిఁ జంద్రముఖియను భార్య క్రొత్తగాఁ గాపురమునకు వచ్చినది.

చంద్రముఖి మిక్కిలి చక్కనిది. నాసంకల్పానుగుణ్యములైన లక్షణములన్నియు నాపొన్నికొమ్మయం దున్నవి. చంద్రబింబమువంటి మొగము, తెలిసోగకన్నులు, బారెడేసి నల్లవెండ్రుకలు, ముత్యాలకోవవంటి పలువరుస, అద్దమువంటి చెక్కులు, సన్నదినడుము, పలుచనిదేహము, బంగారమువంటి దేహచ్ఛాయయుఁ గలిగి లావణ్యపూర్ణములైన యంగకములతో నొప్పుచున్న యాయొప్పులకుప్పం జూచి నే నువ్విళ్లూరుచుంటిని.

భగవంతుఁ డెపుడు నసదృశసంఘటనమే చేయుచుండును. వేదజడునకుఁ జక్కనిభార్యం గూర్చి నాకు వట్టిమొడ్డిదానిం గట్టిపెట్టెను. ఆచంద్రముఖియే నాభార్యయైనచో సంవత్సర మొకగడియవలె వెళ్లించుచుఁ సంతసింపకపోవుదునా ? అని దానింజూచినప్పుడెల్ల తలంచుచుందును.

చంద్రముఖి క్రొత్తగాఁ గాపురమునకువచ్చినది. అత్తమామల చాటున నాఁడుబిడ్డలసందున మెలఁగవలయును. ఇల్లు కదలుటకు నవకాశము లేదు. అట్టియువతి నా కెట్లులభ్యమగునని తలంచినను నాయుత్సుకత్వము వదలినదికాదు. నాచదివిన గ్రంథములన్నియు విమర్శించి దానిగుఱించి యనేకతంత్రము లుపయోగించితిని.

కొన్నిదినములకుఁ జంద్రముఖిమామగారు కాలముచేసిరి. అత్తగారు మూలబడినది. ఆఁడుబిడ్డ లత్తవారింటి కరిగిరి. చివరకుఁ జంద్రముఖియే యింటికి యజమానురాలయ్యెను. కాల మెంతలో మాఱినదో చూడుము. స్వతంత్రము వచ్చినతరువాత నేదోపనిమీఁద మాయింటికిఁ బలుమారు వచ్చుచుండును. కొన్నిదినములు నన్నుఁజూచి తొలఁ

గుచుండునది. క్రమక్రమముగాఁ జనువు గలుగఁజేసి నేనే పల్కరించుటకుఁ బ్రారంభించితిని.

ఒకనాఁడు మాయింటి కెందుకో వచ్చి నాభార్యతో మాటాడుచుండ నోసీ! చంద్రముఖిం జూడుము, దానిముఖము కలకలలాడుచుండ లక్ష్మి తాండవమాడుచున్నది. దానియొప్పు దానియొయ్యారములో నీ కొకటియైన లేదుగదా! ఆహా దానిమగనియదృష్టము! అని పొగడుచుండ ముసిముసినగవు నవ్వుచు వెళ్లిపోయినది.

చంద్రముఖిమగఁడు దధ్యయనసంపన్నుఁడగుట నేను వానియింటి కప్పుడప్పుడు పోయి వేదములోఁ దెలియనివిషయము లడుగువాఁడుంబోలెఁ బదమో క్రమమో యడుగుచుందును. ఆసమయమునఁ జంద్రముఖి యేదియో పనికల్పించుకొని పదిసారులు నాకంటఁబడునది.

ఓయీ! మనమిద్దఱ మొక్కయీడువారము. ఇరువురకు సంతానము లేకపోయినది. అందులకుఁ గొన్నితంత్రము లున్నవి యాచరింతమా? అని పలికినఁ జంద్రముఖిభర్త నావిలాసము లెఱింగియున్నవాఁడగుట రానినవ్వు ప్రకటించి నా కవసరములేదు. నీవే కావించుకొనుమని యుత్తర మిచ్చువాఁడు.

మఱియొకనాఁడు చంద్రముఖిభర్తకు సొమ్మవసరమువచ్చి తొట్రుపడుచుండఁ జూచి చంద్రముఖి మీరు దేవభూతికి మిత్రులుగదా? పోయి యప్పడుగుఁడు. ఈమాత్రము సహాయము చేయఁడా! అని ప్రోత్సాహపఱచుటయు నతం డిష్టములేకున్నను గార్యావసరమునుబట్టి నాయొద్దకువచ్చి తనయవసర మెఱిఁగించెను.

అప్పుడు నేను మిగుల సంతసించుచు రెండుగడియలలో నొకఁడు కొంతసొమ్ము తీసికొనిరాఁగలఁడు. నా కొకచోటికిఁ బోవలసిన యగత్యమున్నది. నాభార్యతోఁ జెప్పి పోయెదను. నీభార్యను గడియతాళి పంపుమని చెప్పితిని. అతం డింటికిఁబోయి రెండుగడియ లైనతరువాత

భార్యను మాయింటికిఁ బంపెను. నేనింటిలోనే డాగియుంటిని. నాభార్య పెరటిలో నూతిలో నీరు చేదుచున్నది.

చంద్రముఖి వచ్చి మెల్లగా అక్కా! అక్కా! అని నాభార్యం బిలిచినది. నేను, దలుపు తీసితిని. లోపలకు వచ్చినది. మాయక్క యెందున్నదని నన్నడిగినది. దొడ్డిలోనున్నదని, ఆపనియేదియో నాకుఁ జెప్పరాదా? అని యడిగితిని. మీ రెఱుంగనిదికాదు. మీతమ్మునికి సొమ్మిత్తునని చెప్పి నన్నుఁ బంపమంటిరఁట కాదా! ఎఱుఁగనట్లడుగు చుంటిరేల? అని యెత్తిపొడిచినది.

నాకు మోహ మగ్గలమగుచుండెను. మేను సాత్త్వికవికార మందినది. కంపముతో నేను జంద్రముఖీ! నీకు బనులేల? కావలసినంత ద్రవ్యము తీసికొనివెళ్ళుము అని రూపాయిలసంచి ముంగలవైచితిని. నే నంతయాసగలదానను గాను మీ రిత్తుమన్నవిత్తమే కొనిపోయెద లెక్క బెట్టి యిండు. అని చిఱునగవుతోఁ గ్రేఁగంటిచూపులు నాపై వ్యాపింపఁ జేసినది. ఆచూపులే మరునితూపులై నామేపడఁగించినవి. అప్పుడు తమినిలుపలేక నేను గాఢముగా నయ్యంగనను బరిష్వంగము జేసికొంటిని.

అదియే నాజన్మావధిలో ననుభవించిన మొదటిసుఖము. చంద్రముఖి లజ్జావిశేషంబునంజేసి యంగీకారసూచకమైన యంతరాయము కొంత గలుగఁజేసినది. అదియు నాకుఁ జాల యింపుగా నుండెను.

నాభర్త వాకిటఁ గాచియున్నాఁడు వేగఁ బోవలె నాలస్యమైన ననుమానము జెందును సొమ్మిచ్చి పంపుఁడు అని బ్రతిమాలికొనినది. వెంటనే సొమ్మిచ్చి యంపితిని. మా కది స్వల్పకాలముగాఁ దోఁచినది కాని చంద్రముఖికై వేచియున్నమగని కది దీర్ఘకాలమైనది. అతండు భార్యతో వలుకుచు నింతయాలసించితివేల? అనియడిగిన నామె బాగుబాగు, ఒకరి

చేతిలోనుండి సొమ్ము సులభముగావచ్చునా ? మనకున్నతొందర వారి కుండునా ? ఆయనభార్య మడిగట్టికొని నీరుతోడుచున్నది. చే యూరు కొనుపఱకు నుపేక్షించితినని బొంకినది.

శ్లో॥ అనుచిత కార్యారంభ స్స్వజనవిరోధో బలీయసా స్పర్థా
ప్రమదాజన విశ్వాసో మృత్యోర్ద్వారాణి చత్వారి॥

తగనికార్యమున కారంభించుట, బంధుజనవిరోధము, గొప్ప వానితో స్పర్ధ, ఆఁడువాండ్ర నమ్మట ఈనాలుగుపనులు మృత్యుముఖ ములని చెప్పుదురు. విప్రవరా ! పైచర్యలఁ జెప్పనేల ? మాయిరువురు మనసులుగలసినవి. సాంకేతికము లేర్పడినవి. నిత్యముగలసికొనుచుంటిమి.

అపారస్మారవికారములతో నోడ లెఱుంగనికూటములచేఁ జతు ష్షష్టికళానైపుణ్యముమీఱ మమ్మంటియున్న మనోభవుం గృతార్థుం గావింపుచుంటిమి.

ఆహా ! ఆమోహనాంగి శృంగారలీలాచాతుర్యము లేమని చెప్పుదును. కామసూత్రము లన్నియుం జదివినప్రోఢ క్రీడ లెట్లుండునో మీకుఁ దెలియదా ? క్రమంబున భయము విడచితిమి. సిగ్గు వదలితిమి. మర్యాద వీటిబుచ్చితిమి. చంద్రముఖి మాయింటికో నేను దానియింటికో పోయిచూచినంగాని యేపనిచేయుటకుం బూనము. లోకాపవాదము నకు జంకక తెగించి మెలఁగఁజొచ్చితిమి.

జనులు మాచేష్టలఁ గొన్నిదినములు చాటుగాఁ జెప్పికొనుచుం డిరి. కొన్నిదినములు రచ్చల నిందింపుచుండిరి. చివరకు మాయెదుట నే నిందింపమొదలుపెట్టిరి. ఎవ్వరినీతులు మామది కెక్కినవికావు. చంద్ర ముఖిమగఁడు కొన్నిదినము లనుమానముజెంది మాయింటికిఁ బోవల దని నిర్బంధించెను. కాని మాటవినక ధిక్కరించి వచ్చుచునే యుండు నది. నన్నుఁ దనయింటికి రావలదని యొకనాఁడు నాతోఁ బలికిన వెక్క రించివచ్చితిని. అతనిమాట లక్ష్యపెట్టక మేము స్వేచ్ఛావిహారంబుల

మెలఁగుచుండ గ్రామమంతయు హల్లకల్లోలముగాఁ జెప్పికొను చుండిరి.

ఒకనాఁడు చంద్రముఖి రాత్రి మాయింటికి వచ్చి తిరుగా నింటికి పోయినదికాదు. పోకుంటివేమని యడిగిన మనోహరా! నామగఁడు వేదజడుఁడు. అతనిమాట యటుండనిండు. నాయత్తగారును బంధువులును బెట్టురట్టునకు మేఱలేదు. వచ్చినరట్టు రానేవచ్చినది. ఇఁక రహస్య మేమి యును లేదు. వ్రతముచెడినను సుఖము దక్కవలయును. పగలుమాత్ర ము మిమ్ము విడిచియుండనేల? ఇఁక నే నింటికిఁ బోవను. ఇందే యుం డెదనని చెప్పిన నే నంగీకరించితిని.

మఱునాఁడు వాఁడుక ప్రకారము వారింటికిఁ బోలేదు. జాముప్రొ ద్దెక్కినది. వంటవేళ మిగిలినది. దానియత్తగారు మాయింటికివచ్చి నా భార్యతోఁ జంద్రముఖి మీయింట నున్నదా? అనియడిగిన లోపలగది లో నున్నదని సంజ్ఞచేసినది. లోపలికివచ్చి నాకడనున్న చంద్రముఖిం జూచి ఏమేరండా! నీవింత సిగ్గువిడిచి సంచరించుచుంటివి? కాపురము వదలుకొంటివా? అని యేమేమో దుర్భాషలాడినది.

చంద్రముఖి నాకుఁ గాపురమక్కఱలేదు. ఇఁక మీయింటికి రాను. మఱియొకకోడలినిఁ జేసికొమ్ము. అని మూఁడేమాటలు చెప్పి యూరకొన్నది. అప్పు డామె పోయి కాపురు గరణమును వెంటఁబెట్టి కొనివచ్చి యిది నీకు నీతికాదని నాకుఁ జెప్పించినది. పదుగు రేకమై వచ్చిన నే నేమిసేయుదును? అధికారులమాట ద్రోయలేక చంద్రముఖికిఁ జెప్పి బలవంతమున వారింటి కనిపితిని. చెప్పిపెట్టినబుద్ధి యెంతవఱకు నిలు చును? మఱియొకనాఁడు చంద్రముఖి నాయొద్దకువచ్చి మనోహరా! ఈగ్రామస్థులందఱు నాలోచించుకొని మనల శిక్షింపఁజూచుచున్నారఁట. మనమిఁక నిందుండిన మాటదక్కదు. మనము విదేశమునకు లేచిపోయిన హాయిగా సుఖింపవచ్చును. ఏరట్టును గలుగదని బోధించిన నందులకు

నే నంగీకరించితిని. అప్పుడు చంద్రముఖి మఱియొకమాటఁ జెప్పినది.

నాభర్త బ్రదికియున్నచో గ్రామస్థుల వెంటఁబెట్టుకొని మనవెంట దఱిమికొనివచ్చి మనలం బట్టించి రట్టుజేయఁగలఁడు. కావున వానిం గడ తేర్చిపోవుటయే లెస్స. మన కేయాటంకము నుండదని చెప్పిన నే నొప్పి కొని యప్పని యెట్లుసేయవలయునని యడిగితిని. నేఁ జెప్పెదనుకాదా? అని యొకనాఁటిరాత్రి భర్తను నిద్రబుచ్చి నాయొద్దకు వచ్చి మనోహరా! ఇదేసమయము; గాఢనిద్ర బోవుచున్నాఁడు. తల్లి దూరముగానున్నది. కత్తి తీసికొనిరమ్మని యుపదేశించినది. ఆహా ! మోహావేశ మెట్టిదో విచారింపుము.

గీ. తల్లిఁ దండ్రి నన్నఁ దమ్మునిఁ బుత్రుని
ప్రాణనాథు నెట్టిబంధునైన
జారవాంఛజేసి చంపుదు రంగనల్
వృజినమునకు నింత వెఱవ రెపుడు.

సకలవిద్యలు జదివిన నేనైన నించుక వివేకించితినా ? ఎల్లకాల మట్లే యుండుననుకొంటిని. సీ ! కామాంధులకు యుక్తాయుక్తవివేక మించుకయు నుండదు. చంద్రముఖి యట్లుచెప్పినంతనే నూరియుంచిన కత్తిదీసికొని దానివెంట వారింటికింబోయి నిద్రావ్యామోహంబున నొడ లెఱుంగక గుఱ్ఱుపట్టుచున్న యాశ్రోత్రియబ్రాహ్మణుని కంఠముపై నొక్కవ్రేటువ్రేసి గతాసుం జేసితిని. ఛీ, ఛీ, నావంటిపాపాత్ముం డెందైనం గలఁడా? అట్లు వానింజంపి చంద్రముఖిం గ్రుచ్చియెత్తి ముద్దాడుచు ప్రేయసీ ! మనకంటకము వదలినది మన మింక పోవచ్చును. లెమ్ము, లెమ్ము. వస్తువులు సవరించియుంచితివిగదా ! అని పలికితిని.

అది యంతకుముందే ప్రయాణమైయున్నది. అప్పుడు మే మిద్దఱము నొరులకుఁ దెలియకుండ నగలు మూటఁగట్టికొని యాచీఁకటిలో నిల్లువిడిచి యూరు దాటి యుత్తరాభిముఖముగాఁ బోవఁదొడంగితిమి.

ఉత్తమబ్రాహ్మణుని జంపినపాతక మూరకపోవునా? మావెంటఁ దరిమి కొనివచ్చినది. కొంతదూరముపోయినంతఁ గృతాంతకింకరులవంటి తస్కరులుకొంద రెదురై మమ్ము నదలించిరి. నేను బెదరక మాటలీయక వారి నెదిరించితిని. వారిలో నొకఁడు సుడ్డుకఱ్ఱతో నానెత్తి పఠేలుమన బ్రద్దలుగొట్టి చంపి చంద్రముఖిని చేరఁదీసికొనిపోయెను.

అప్పుడు నాకు బ్రహ్మహత్యాపాతకము ప్రత్యక్షమై నన్నావేశించి బ్రహ్మరాక్షసుని గావించినది. నేను జంద్రముఖితో ననుభవించినసుఖంబు కడుస్వల్పము. మహాత్మా! నరమృగపశుపక్షిసలిలరహితమగు నీయరణ్యమున క్షుత్పిపాసలు బాధింపఁ బెద్దకాలము బాధపడితిని. పడుచుంటిని. నేనుబడిన యిడుము లిట్టివని చెప్పుటకు శక్యములు కావు. మహావిద్వాంసుఁడవగు నీదర్శనము చేయుటచే నా కీపూర్వోదంతమంతయు నేఁడు జ్ఞాపకమువచ్చినది. ఇదియే నావృత్తాంతమని యెఱింగించుటయు నేను విస్మయముజెందుచు భూతేంద్రా! పారదారికక్రియయం దట్టిశక్తి యున్నది. నీవుకాదు ఎవ్వరైన నాసమయమం దట్లు కావించితీరుదురు. అని యుత్తరముజెప్పితిని.

అప్పు డాభూతపతి ఆర్యా! నీవు నావలన విద్యలు గ్రహింపవలయుననిగదా వచ్చితివి? నీ కేవిద్యరాదో చెప్పికొనఁదగినవిద్య యేదియో పేర్కొనుము. అని యడిగిన నేను మహాత్మా! అది మీరే చెప్పవలయును. నేను జదివినవిద్య లివియని వానినెల్లఁ బేర్కొంటిని. అప్పు డతం డురముపైఁ జేయివైచుకొని ఔరా! నీవెంతవాఁడవు! నయమే నిన్నుఁగూడ భక్షించితినికాను. ఇంతకన్నఁ బెద్దపాప మనుభవింపవలసి వచ్చును. ఆహా! నీపాండిత్యము! నీకువచ్చిన విద్యలలో నాకు సగమైన రావే? నేను నీ కేవిద్య జెప్పఁగలను? అని నన్ను మెచ్చికొనుచు గోనర్దీయా! నీకొక మహోపకారముసేసి నేను గృతకృత్యుఁడఁ గాఁదలంచికొంటిని. నీదర్శనమువలన నీయరణ్యము దాటి దేశసంచారము సేయు

సామర్థ్యము గలిగినది. నీ కుపకారముసేసితినేని పాపవిముక్తుండ నగుదు నని తలంచుచుంటినని నాచెవులో నేదియో రహస్యము చెప్పి యీమూపముగా నీకు రాజ్యవైభవముగలుగునట్లు చేసెదననియు సాయము చెప్పెను.

రాజ్యముమాట పిమ్మటఁ జూచికొనవచ్చును, నేఁటికి బ్రతికితిని గదా? అని సంతసించుచు నాబ్రహ్మరాక్షసు ననేకస్తోత్రములు చేసితిని. అంతలోఁ దెల్లవాఱుసమయమైనది. అప్పు డాబ్రహ్మరాక్షసుఁ డారావి చెట్టుకొమ్మలు గలగలలాడఁ జప్పుడుసేయుచు నెగిరి యెక్కడికో పోయెను. నేనును బ్రతుకుజీవుఁడా! అని యటఁగదలి దక్షిణాభిముఖముగాఁ బోయిపోయి కొన్నిదినము లాయడవి గడచితిని. అని యెఱింగించి యవ్వలికథ తరువాతిమజిలీయందుఁ జెప్పఁచుండెను.

## 159 వ మజిలీ.

### —♦ మదయంతికథ. ♦—

శ్లో॥ నాకాలె మ్రియతె జంతు ర్విద్ధశ్శరశతైరపి
కుశాగ్రేణైవ సంస్పృష్టః ప్రాప్త కాలోనజీవతి.॥

నూఱుబాణములచేఁ గొట్టినను కాలముమూడనివాఁడు చావఁడు, కాలమువచ్చినవాఁడు దర్భగ్రుచ్చికొనినను చచ్చును

అనునట్లు అయ్యడవినుండియు బ్రహ్మరాక్షసునినోటినుండియు నాయుశ్శేష ముండఁబట్టి యీవలఁ బడితిని.

శ్లో॥ ధనాశా జీవితాశాచ గుర్వీ ప్రాణ భృతాంసదా॥

ప్రాణధారులకు జీవితాశయు, ధనాశయు, నన్నిటిలో గొప్పవి కదా? నేనంతటితోవిడువక బ్రహ్మరాక్షసుం డెఱింగించినవిషయంబు పరిశీలించుటకై కొన్నిదినము లాప్రాంతదేశములు దిరిగితిని. నీవలెనే నేనును నొకనాఁ డొకయగ్రహారములో నొకవిప్రునింటి కతిథినై భుజించుచున్న

సమయంబున మఱియొక్క బ్రాహ్మణుం డరుదెంచి నాతో భుజించుచున్న గృహమేధిం జూచి ఓయీః నీతండ్రిగారు జయపురమునుండి వచ్చిరా? ఏమిజరిగినది? భూతోచ్చాటనము గావించిరా? కానుక లందివచ్చిరా? అనియడిగిన నతండు కానుకలవలెనేయున్నది చావుదప్పించుకొని వచ్చి మాకన్నులం బడియెను. అదియే పదివేలు. ఆయన నేటికి మూఁడులంఘణములు. ఆగదిలోఁ బండికొనియున్నారు. చూడుము అని చెప్పెను.

ఆమాటలు విని నేను అయ్యో! భూతోచ్చాటన మనుచున్నారదేమి? ఎందలివార్త? అనియడిగిన నాగృహమేధి యిట్లనియె. ఈదేశమునకు రాజధాని జయపురము. అప్పురాధిపతికి మదయంతియను కూఁతు రొక్కతియే చిరకాలమునకుఁ గలిగినది. ఆచిన్నది రూపంబునను విద్యలను శీలమునను మిక్కిలి పేరుపొందియున్నది. సమారూఢయౌవనయై సానబట్టినరత్నమువలె మెఱయుచున్న యాతరుణీరత్నమునకు వివాహము చేయవలయునని తండ్రి ప్రయత్నించి నానాదేశరాజకుమారులచిత్రఫలకములఁ దెప్పించుచుండెను.

అదియట్లుండ రెండునెలలక్రిందట నయ్యిందువదన నిద్రబోవుచుండ భూతమో బ్రహ్మరాక్షసుఁడో తెలియదు. ఆమెమీఁదఁబడి యావేశించెనఁట. అదిమొద లమ్మదవతి నిద్రబోవదు. ఆహారము తినదు. ఊరక కేకలుపెట్టుచుఁ గనంబడినవారినెల్ల నెత్తికుక్కవోలెఁ గఱచుచు గీరుచు బాధింపఁదొడంగినదఁట.

కొన్నిదినములు గదలకుండ నదిమిపట్టికొనుచుండిరఁట. మఱి కొన్నిదినములు పట్టుకొనలేక కట్టిపెట్టిరి. అందులకును వశముగాకున్న నొకగదిలోఁ బెట్టి తలుపువైచి కాచుచుండిరఁట. ఆభూత మెంతగట్టిదో తెలియదు. ఆరాజు పుడమింగల మాంత్రికులనెల్ల రప్పించెను. మాతండ్రిగారు భూతవైద్యములోఁ బేరుపొందియుండిరి; ఆయనకుఁగూడ ర్మానము రాఁగా నక్కడికి వెళ్ళిరి. మాంత్రికులందఱు కలిసి యాలో

చించి నలువదిదినములు నారసింహము జ్వాలాముఖి ఉగ్రభైరవము బాలాబగళాముఖి మొదలైనమంత్రములు జపించుచుఁ బద్మములు ముగ్గులుపెట్టి హోమములు సేసిరఁట. తరువాత నొకదినమున భూతోచ్చాటనము చేయుటకు నిశ్చయించుకొని యక్కుటిలకుంతలకు జట వేయుటకై పసుగురుమాంత్రికులు సాహసించి తలుపుతీసికొని హుంఫటుస్వాహా మారయ మారయ, ఛింది ఛింది అని యుచ్చరించుచు నాచిన్నదియున్న గదిలోనికిఁ బోయిరఁట. వారిలో మాతంగ్రిడిగారు మొదటివాఁడు.

బాబూ! ఇఁకఁ జెప్ప నేమియున్నది. ఆభూతముగూడ మారయ మారయ తాడయ తాడయ ఛింది ఛింది హుంఫటుస్వాహా— అని కొందఱం జఱచినది. కొందఱు గీరినది. కొందఱం జీరినది. అప్పుడు మాంత్రికులు మొఱ్ఱోయని యఱచుచుఁ గాయములెల్ల గాయములుపడి రక్తముగారఁ దలుపులువైచి యీవలఁబడువఱకు బ్రహ్మాండమైనది. వారిలో మాతంగ్రిడిగారితొడఁ గఱచినది. కండ లూడివచ్చి పెద్దగాయము పడి రక్తముగారుచుండెను. జ్వరము వచ్చినది. మూఁడుదినము లొడలెఱుంగక మంచముపైఁ బడియుండిరఁట. ఇతరమాంత్రికులును మంచముపట్టిరఁట. వారియవస్థఁజూచి యెల్లవారు నవ్వఁజొచ్చిరఁట. మాతంగ్రిడిగారికి బాధ యెక్కువైనందున సవారిపై నెక్కించి మాయింటికిఁ బంపివైచిరి. నేఁటికి మూఁడులంఘనములు.

ఆయుశ్శేషముండుటచే బ్రదికిరి కాని యది చావవలసినగాయమే. పెద్దపులియైన నంతలోతుగాఁ గఱవలేదు. ఆకుందరదన కాశక్తి యెట్లు వచ్చినదో తెలియదు. అని యాభూతవృత్తాంతమంతయుం జెప్పెను.

నే నాకథ విని మిక్కిలి వేడుకచెందుచు భుజించినవెనుక గదిలోనికిం బోయి యాభూతవైద్యుం జూచితిని. ఊరక మూల్గుచుండెను. గాయము మానుపట్టినదికాని చాలలోతుగా దిగియున్నది. తిరుగా నే నాయనతో నచ్చటివిశేషము లేమని యడిగితిని.

అతంపు అయ్యో! నాజన్మాంతములో నిట్టిభూతమును జూచి యెఱుంగను. నూఱువ్వరము మండలముదినములు మహామంత్రములు జపించి తంత్రములు తీర్చితిమి. వాని నించుకయును గణించినదికాదు. నాగాయ మొకలెక్కా? ఒకమాంత్రికుని శిరముపై గ్రుద్దినది. తలంచి కొనిన నిట్టిబాధలోఁగూడ నవ్వువచ్చుచున్నది. ఆమాంత్రికుఁడు దెబ్బ దినిన కుక్కవలె నఱచుచు ముక్కునుండి రక్తముగార నీవలకుఁ బాఱి పోయి వచ్చెను. ఒకని గుండెకాయకండలు పీకినది. వారిద్దఱు చావుబ్రదుకులమీఁద నున్నారు. ఇఁక భూతవైద్యులమని పేరుపెట్టుకొనినవాఁడెవ్వఁడు నందుఁ బోవఁడు. పాప మారాజుగారుమాపరాభవమునకుఁజాల వగచుచున్నారు. ఆచిన్నదానిప్రాణములు దీయక యాభూతము వదలదు.

ఆభూతమును వదల్చి యాచిన్నదానిని నిరామయుం జేసినవానికే రాజ్యముతోఁగూడ నాచేడియ నిచ్చి వివాహముగావింతునని తిరుగాఁ బ్రకటించినారఁట. ఆభూతమును బ్రహ్మదేవుఁడు వదల్పలేఁడు. రాజ్యము కాదు మూఁడులోకములిచ్చినను నసాధ్యమైనపని యెవ్వరుసేయఁగలరు? అని యాభూతవైద్యుఁ డచ్చటివృత్తాంతము క్రమ్మఱ నెఱింగించెను.

అయ్యుదంతము విని నిరంతరసంతోషభూషితస్వాంతుండనై యటఁగదలి కతిపయప్రయాణంబుల జయపురంబున కరిగితిని. మిత్రమా! అప్పు డాపట్టణమంతయుఁ బాడుపడినట్లున్నది. ఎవ్వఁడును గడపునిండఁ గుడుచుటలేదు. గృహము లలంకారశూన్యములై యున్నవి. ఎవరికివారే యాయాపద తమకువచ్చినట్లుగా విచారించుచుండిరి. లేచినతోడనే పౌరులెల్లఁ గోటలోనికిఁ బోయి రాజుగారితోపాటు విచారించుచు సాయంకాలమున కింటికి వచ్చుచుండిరి. నృపతియు రాజ్యకార్యము లేమియు విచారింపక సంతతము పుత్రికారోగనివారణోపాయమే యాలోచించుచుండెను. నేను గ్రామమంతయుఁ దిరిగితిరిగి కోటసింహద్వారమునొద్దకుఁ బోయితిని. అందొకచో నీప్రకటనపత్రిక వ్రాయఁబడి యున్నది.

సీ. బగళాముఖీమంత్రపారాయణుని పండ్లు
　　　　డులియఁగొట్టెను మోము డొప్పవడఁగ
నుగ్రభైరవునిమంత్రోపాసకుని మేని
　　　　యెముకలు విఱుగంగ నెగిరి తన్నె
నారసింహోపాసనాదక్షునూరువు
　　　　కఱచి రక్తము గారఁ గాయపఱచె
జ్వాలానృసింహమంత్రాలాపనిరతుని
　　　　తలగుద్దె బ్రహ్మరంధ్రంబు పగుల
గీ. నాంజనేయరతున్ గుండె లవియఁ బొడిచె
గణపతిప్రియు పొట్ట వ్రక్కలుగఁ జీల్చె
ఛండికారాధకునిఁ గాలఁ జదిమి యడఁచె
భూపసుత నాశ్రయించినభూత మకట!
శా. ఏతద్భీకరదారుణక్రియలచే హింసారతిం బొల్చు నా
భూతంబు న్వదలించి మత్సుత యథాపూర్వంబుగా నంచిత
శ్రీతో నొప్పఁగఁ జేసినట్టిద్విజు ధాత్రీరాజ్యసంయుక్తజా
మాతృస్థాన మలంకరింపఁగను సన్మానింతు సత్యంబుగన్.

ఆప్రకటనపత్రికం జదివికొని నేను మందహాసము గావించుచు నందున్న రాజపురుషులతో నే నాభూతోచ్చాటనము గావింపఁగలనని చెప్పితినో లేదో వేగురు నాచుట్టును బ్రోగుపడి అయ్యా! తమ రెవ్వారు? ఏదేశము? ఏమిచదివికొంటిరి? అని యూరక యడుగుచుండ నందఱికిఁ దగినసమాధానము చెప్పుచు భూతమును వదలింతునని గట్టిగా శపథము జేసితిని.

అప్పుడు రాజపురుషులు నన్ను నగరిలోనికిఁ దీసికొనిపోయి రాజుగారియెదుటఁ బెట్టి మదీయప్రతిజ్ఞాప్రకారం బెఱింగించిరి.

రాజు—(నమస్కరించుచు) మీ రేయూరు?

నేను—కాశీనగరము.

రాజు—బ్రాహ్మణులా?

నేను—అవును.

రాజు—ఏమి చదివికొంటిరి?

నేను—నాలుగు వేదములు నాలుశాస్త్రములు నలువదినాల్గు విద్యలుం జదివికొంటిని.

రాజు—(విస్మయమభినయించుచు) మీా రాకోటముంగలి ప్రకటనపత్రికం జదివికొంటిరా?

నేను—చదివికొనియే యిక్కడికి వచ్చితిని.

రాజు—ఇదివఱ కిట్టిభూతము నెందైన వదలించితిరా?

నేను—లేదు. ఇదియే మొదటిప్రయత్నము.

రాజు—(పెదవివిఱచుచు) ఈభూతము విద్యలకు సాధ్యముకాదు.

నేను—ఆమాట నే నెఱుంగుదును.

రాజు—మీాకు భూతవైద్యమునందుఁ బ్రవీణత గలదా?

నేను—లేకున్న నిం దేలవత్తును?

రాజు—మీారు చిన్నవారలు, తెలియక వచ్చితిరని నే నభిప్రాయము పడుచుంటిని.

నేను—అట్టియభిప్రాయము పడ నవసరము లేదు.

రాజు—మీాప్రాణహానికి నేను బూటకాపును కానుసుండీ. బాగుగా నాలోచించుకొని దిగుఁడు. ఊరక కాలసర్పమునోటఁ జేయినిడకుఁడు.

నేను—వెఱపులేదు. ఆలోచించుకొనియే వచ్చితిని.

రాజు—ఎన్ని దినములకుఁ గుదురుతురు? ఏతంత్రము ప్రయోగింతురు?

నేను—ఎన్నోదినములా? అయిదునిమిషములు; తప్పిన రెండు గడియలు.

రాజు—ఏమీ! మీకింతసామర్థ్యము గలదా? మహాత్మా! నేటిసాయంకాలములోపున నాబిడ్డను నాతో మాటాడఁజేయుదువా?

నేను—సాయంకాలమువఱకు నేల? రెండుగడియలలో మాటాడింతును.

రాజు—అంతుల కేమిసన్నాహము కావలయును తండ్రీ!

నేను—ఏమియు నక్కఱలేదు. ఆచిన్నది యెందున్నదో చూపుఁడు. నే నక్కడికిఁ బోయెదను.

రాజు—అయ్యో! లోపలికే పోయెదరా? అమాంతముగా మీఁదఁబడి చంపునుచుఁడీ! నాకు భయమగుచున్నది.

నేను—నాకులేనిభయము మీ కేలా? ఆచిన్నదియున్నగది చూపుఁడు. చూపుఁడు. అని యడిగితిని.

నామాటలు విని యాభూపాలుం డపారసంతోషముతో నార్యా! రెండుగడియలలో నాకూఁతురితో సంభాషింపఁజేసితి వేని నిన్నిప్పుడే రాజ్యపట్టభద్రుం జేసి యల్లునిగాఁ జేసికొనుచున్నాను. అని పలుకుచు నాపాదములకు సాష్టాంగనమస్కారములు గావించెను.

భూపా! లెమ్ము లెమ్ము. నా కీరాజ్యప్రాప్తికొఱ కే యాభూతంబు నీకూఁతుం బట్టినది. ఆలస్య మేలచేసెదరు. గది చూపుఁడని యడిగితిని.

అమ్మహారాజు దండహస్తులైన రక్షకభటుల నాప్రాంతమందుఁ గాచియుండునట్లు నియమించి నన్నాగదియొద్దకుఁ దీసికొనిపోయి బీగము తీయించి జడియుచు దూరముగాఁబోయి తొంగిచూచుచుండెను. అప్పుడు నేను గొంతయట్టహాసము గావించితిని. స్నానముచేసి విభూతి రుద్రాక్షమాలికాలంకృతసర్వపరిలీకుండనై చేత బెత్తముబూని హుంకారపూర్వకముగ గొళ్లెముదీసి తలుపులుత్రోసి లోపలకుఁ బోయితిని.

ఆచిన్నది తలవిరియఁబోసికొని శల్యావశిష్టయై మంచముపైఁబడి యున్నది. నన్నుఁ జూచినతోడనే గాండ్రుమని పెద్దపులివలె నఱచినది.

నాకు మేనఁ గంపము జనించినది కాని యంతలో ధైర్యము దెచ్చికొని యామెదెసఁ జూచుచు గోడకుఁ జేరఁబడి చూచుచుంటిని

అప్పు డా రాచపట్టి యట్టెలేచి పిడికిలిపట్టి రావణునిమీఁదికిహను మంతుఁడువోలె నామీఁదికి వచ్చుచుండెను. అప్పుడు నేను జేతులుజోడించి నమస్కరించుచు నీశ్లోకము జదివితిని.

శ్లో॥ భూతేంద్ర తవశిష్యోహం గోనర్దీయాభిధానకః
పూర్వోదిత వరందేహి దేవభూతె నమోనమః॥

దేవభూతే! అని సంబోధించి నేను బలికినంత నాకాంత నన్నెగాదిగఁజూచి యందె నిలువంబడి నమస్కరించుచు మహాత్మా! నేఁటికి వచ్చితివా? ఇంతయాలసించితివేల? నీకొఱకే యింతయట్టహాసము గావింపుచుంటిని. ఇఁక నీ నీరాజ్యముతోఁగూడ నీరాజపుత్రికం బెండ్లియాడి సుఖింపుము. నీకుఁగావించిన యుపకారవిశేషంబునం జేసి నేను గూడఁ బాపవిముక్తుండ నయ్యెదనని పలుకుచు నాబ్రహ్మరాక్షసుఁ డాయంబుజాక్షిని విడిచి యింటిపైకప్పు విడఁదన్ని పెంకులు జలజలరాల నాకసమువంకఁ బోయెను.

అప్పుడు రాజపుత్రిక యొడలెఱుంగక నేలం బడిపోయినది. నేను దలుపులుదీసికొని యీవలకువచ్చినంత నాప్రాంతమందుఁగాచి చూచుచున్నరాజు నాకడకువచ్చి మహాత్మా! ఏమిజరిగినది? అని యడిగిన భూతము వదలినది నీపుత్రికం జూచికొమ్మని పలికితిని.

అందుఁబడియున్న యాయన్నుమిన్నుం జూచి దుఃఖముతో దాపునకుఁ బోయి అమ్మా! మదయంతీ! అని పిలిచెను. ఆకలికి కన్నులందెఱచి దాహమిమ్మని సంజ్ఞ చేసినది.

అప్పు డా రాజు నన్నుఁ గౌఁగిలించుకొని మహాత్మా! నీవు మనుష్యమాత్రుఁడవు కావు. నన్నుఁ దరింపఁజేయ నరుదెంచిన భగవంతుఁడవు. కాని చో దారుణక్రియాచరణదక్షుండగు నీబ్రహ్మరాక్షసుని వదలింప

శక్యమా ? నేను గృతకృత్యుండ ధన్యుండ. ఇప్పు డీబాల దాహమడుగు చున్నది యీయవచ్చునా ? అని యడిగిన నేను వేడినీళ్ళ జలకమాడింపుడు. పథ్యపానాదులు యథాయోగ్యముగా నడిపింపుఁడు అని చెప్పితిని. అంతలో నాశుభవార్త తల్లియు బంధువులు విని గుంపులుగా నచ్చటికివచ్చి యచ్చిగురాకుఁబోఁడిం జూచి మీఁదఁబడివిలపింప మొదలుపెట్టిరి.

అవ్వరారోహ చిరాకుపడి రోదనసేయవలదని సూచించినది. అప్పు డందఱు నన్ను దైవముఁబూజించునట్లు పూవులచేఁ బూజించిరి. పిమ్మట నాకొమ్మను జలకమాడించి నూత్నాంబరభూషణాదులచే నలంకరించి లఘ్వాహార మొసంగిరి. ఇంచుక స్మృతిగలిగి మాట్లాడుట ప్రారంభించినతరువాతఁ దల్లి మెల్లగాఁ దలచిక్కుఁ దీర్చుచు అమ్మా ! నీవుజేసిన క్రియలు దారుణములు. నీ కిట్టిబల మెక్కడనుండివచ్చినదో తెలియదు. ఆవిషయములు నీకేమైన జ్ఞాపకమున్నవియా ? అని యడిగినదఁట.

ఆచిన్నది అయ్యో ! నా కేమియుం దెలియదు. నాఁటిరేయి మంచముమీఁదఁ బరుండి నిద్రించుచుండ గుభాలున నెవ్వఁడో వచ్చి మీఁదఁ బడినట్లైనది. నాశరీరము బ్రహ్మాండమంత లావైనట్లు తోఁచినది. అంతవఱకు జ్ఞాపకమున్నది. తరువాత నేమిజరగినదో యెఱుఁగను. ఏమేమి చేసితిని ? అని సిగ్గుతో నడిగినఁ దల్లి యాచేష్టలన్నియుం జెప్పినది. గోవర్ధియుఁడను మహానుభావునివలన విముక్తినొందితివి. అతఁడే నీకు భర్తయని చెప్పినదఁట. అయ్యయ్యో ! నేను నిష్కారణము మాంత్రికులైన బ్రాహ్మణోత్తముల సంకటపఱచితినా? కటకటా! వారు మిక్కిలి బాధపడుచున్నారుకాఁబోలు ! తల్లీ ! పాపము వారికి మాతండ్రిగారు తగినచికిత్సలు చేయించిరా? నాపడినబన్నముకన్న వారియిడుములు విన్న నా కెక్కుడు పరితాపముగానున్నది. అని వగచుచుండఁ దల్లి వారించుచు పట్టీ ! నీ వెఱుంగక చేసినదాని కెవ్వరికిఁ గోపముండును ? మీతండ్రి వారికిం దగినసాహాయము చేయించిరి. నీ వందులకు విచారింపఁబనిలేదు.

అని యోదార్చినది. కొలఁదిదినములకే యాకలికి యథాప్రకారము మారునిమూలికివలె మెఱయఁదొడంగినది.

అప్పుడు నాకు వారు చేయునుపచారము లిట్టివని చెప్పఁజాలను. ప్రజలెల్ల నన్ను భగవంతుఁడనియె తలంచుచుండిరి. రాజున కల్లుఁడనై రాజ్యమున కధిపతినిగానైయున్న నన్ను ప్రజలు మన్నించుట విధియైనను సహజానురాగములు గలిగియుండుట స్తుత్యమైయున్నది.

మఱియొకనాఁడు మదయంతి తనసఖురాలిచే నీక్రిందిపద్యము వ్రాసి యంపినది.

చ. హరునిశరాసనంబు దునియల్ పొనరించి వసుంధరాసుతం
బరిణయమయ్యె రాఘవుఁడు పార్థుఁడు మున్నలమత్స్యయంత్రముం
బరిగొని ద్రోవదిం బడసె మామకభూతభయంకరార్త్రి స
త్కరుణ నడంచి తొలి యొసఁగంబడె నన్నుఁ బరిగ్రహింపుమీ!

ఉ. ప్రీతి మహోపకార మొనరించెఁగదా! నను నాశ్రయించి యా
భూత మభూతపూర్వపరిపూర్ణకళావిభవాభిరామవి
ఖ్యాతయశోధురంధురుఁడవై తగు నిన్నిటఁదెచ్చి యిచ్చె నా
హా! తటిదార్భటీభయదమై జల మిచ్చు ఘనంబువైఖరిన్.

తదనుగుణ్యములైన శ్లోకములు వ్రాసి నే నంపితిని. ఇట్లు మే మొండొరుల మత్యంతప్రేమానుబంధప్రకటీకరణపత్రికాప్రేషణంబుల నానందింపుచుండఁ గొండొక శుభముహూర్తంబున నమ్మహారాజు నా కామదయంతి నిచ్చి మహావైభవంబున వివాహంబు గావించె. వయస్యా! మదయంతీసౌందర్యచాతుర్యకళావిశేషంబు లిట్టివని చెప్పుట కిది సమయముకాదు. మఱియొకప్పు డెఱింగింతు. తొలుత ననంగసామ్రాజ్యపట్టాభిషిక్తుండనై యాలావణ్యవతితో ననన్యజనసామాన్య శృంగారలీలాసౌఖ్యాంభోనిధి నోలలాడితిని. అనంతరము తద్రాజ్యపట్టభద్రుండ నైతి. రెండునెలలు పాలించితి నింతలోఁ గుచుమారుండను

మహావిద్వాంసుండు స్వకీయనిరవద్యవిద్యాసంపత్తి నుంకువగా నిచ్చి పురందరపురాధిపతికూఁతురు సరస్వతిని వివాహమాడుచున్నాఁడు. అను వార్తఁ బండితులవలన విని అట్టికళాప్రవీణుఁడవు నీవేయని నిశ్చయించి కొని సంతసముతో నాయుత్సవముఁ జూడఁ బయలుదేరి యందుఁ బోవుచుంటిని. ఇంతలో నీవు గనంబడితివి. అదియే పదివేలు. అని గోనర్ద్దియుఁడు తన వృత్తాంతమంతయుఁ గుచుమారుని కెఱింగించుచు మిత్రమా! ఈరాజ్యము నాయొక్కనిదే కాదు మనమేమ్వురము పంచికొనవలసినవారమే. మనమిత్రులీపాటికి ధారానగరము చేరియుందురేమో? మన మిప్పు డందుఁ బోవలయునా? కర్తవ్య మేమి? అని యడిగినఁ గుచుమారుం డిట్లనియె.

వయస్యా! తొలుతం బురందరపురమున కరిగి యందలివిశేషము లేమియో తెలిసికొని తరువాత ధారానగరంబున కరుగుదము అని చెప్పిన నతం డొప్పుకొని యప్పుడే యారేవుగుత్తజేసినవర్తకుని రప్పించి కుచుమారుని కిచ్చినవిత్తమునకుఁ బదిరె ట్లతనికిచ్చి సంతోషపఱచెను.

తరువాతఁ గుచుమారుని వెంటఁబెట్టికొని చతురంగబలపరివృతుండై గోనర్ద్దియుఁడు ఆరేవు దాటి తొలుత బెస్తలున్నపల్లె కరిగి బలములనెల్ల దూరముగా నుండనియమించి కుచుమారుని కైదండఁగొని యాపల్లెవాండ్రవెంబడి సంచరించుచు వారినెల్ల రప్పించి యాయాగుణములు చూచుచు,

సీ. నెత్తిపైఁ గట్టిన నెత్తుట జొత్తిల్లు
మరకగుడ్డలఁ జూచి పరితపించె
పరిఘాంబువులనుండి పైకిఁదీసిన మేటి
జాలంబు గని యశ్రుజలము విడిచె
నొడలెఱుంగకయున్న యెడఁ బండుకొనఁబెట్టు
నులకమంచముఁ జూచి కలకఁ జెందె

కట్టులకై తెచ్చి కడఁబారవైచిన
  యోషధు ల్గాంచి నిట్టూర్పు విడిచె
గీ. వానినెల్లను గైకొని వాంఛతోడ
జాలరులఁ గౌఁగిలించి యుత్సాహమంద
నుతులఁ గావించె నలపురోహితుని బిలిచి
తెలిసికొని వెంట మిత్రుఁ డొందినశ్రమంబు.

మిక్కిలి పరితపించుచుఁ గుచుమారుని కుపకారముగావించిన బెస్తలగృహంబుల నంత విత్తబహుళంబై యొప్పునట్లు చేసి యతని కన్న ప్రదానాదుల నాదరించిన పురోహితుని బురోహితునిఁగాఁ జేసికొని యటనుండి పరివారసమేతముగాఁ బురందరపురంబున కరిగెనని యెఱింగించువఱకు వేళ యతిక్రమించినది. అవ్వలికథ పైమజిలీయందుఁ జెప్పం దొడంగెను.

## 160 వ మజిలీ.

### భైరవుని కథ.

ధారుణీపయోధరాగ్రహారమై యొప్పారు గిరితటంబను నగ్రహారమున గౌతముండను బ్రాహ్మణబ్రువుండు గలఁడు. వాఁడు కడుపవిత్రమగు ధాత్రీసురవంశంబునఁ బుట్టియు జనకంటకములగు పనులఁ గావింపుచుండుటంజేసి వాని నెల్లరు భైరవుండని పిలుచుచుందురు.

సీ. ఒకసారి కవినంచుఁ బ్రకటించి బెదరించుఁ
  బద్య మల్లుచు జానపములఁ జేరి
యొకతేపఁ గరిణీక మొనరించుఁ గాపువా
  రలనోరుగొట్టు లెక్కలను వ్రాసి
యొకపరి బేరియై యూరూరఁ దిరుగు వే
  ఱొకతేప మన్ను హాలికతఁ బూని

యొకమాటు రసవాదయుక్తులఁ బన్ని సం
తల కేగి యందు జూదంబులాడు
గీ. మాటలను మాయఁ గూలికి బాటగొట్టు
మృత్యువై పాంథులకు నిట్లు మెలఁగి మెలఁగి
యేదినంబున కాదినంబే యతండు
కళవళము జెందఁ గూడుగుడ్డలును లేక.
గీ. దేవళంబులలోపలి దీప మార్చి
భారతము నెత్తిబూని యబద్ధమాడుఁ
జేత నొకకాసు వెట్టినఁ జిచ్చువెట్టుఁ
దలఁకఁ డించుక బ్రహ్మహత్యకును వాఁడు.

ఆపాపాత్ముం డెట్టిపాపకృత్యములు సేయుచున్నను నిప్పచ్చర
ము వదలినదికాదు. వాఁడు ముచ్చులంగూడుకొని విచ్చలవిడి చౌర్యక్రి
యాదక్షుండై క్రుమ్మరుచుండ రాజభటులు వానింబట్టుకొని చెఱ
సాలం బెట్టిరి.

ఎట్లో తప్పించుకొని పారిపోయి గ్రామములు విడిచి తలపెంచు
కొని మహారణ్యసంచారము గావింపుచు నొకనాఁ డొకకాంతారాంత
రమునఁ బ్రొద్దుగ్రుంకుచుండ నాఁటిరాత్రి నివసింపందగిన నెల వేదియుని
యాలోచింపుచుండ దీర్ఘశాఖలచే దెసలనావరించియున్న యొకవృక్షం
బాసమక్షమునఁ దన్ను రక్షింపఁ బ్రత్యక్షంబైన భగవంతుఁడోయనఁ
గన్పట్టినది. విశాలంబగు తదంతికభూతలంబంతయుఁ దృణకంటకాదులు
లేకుండ బాగుచేయఁబడియున్నది. అందందు మెత్తనిపల్లవములు పుష్ప
ములు దళములు విష్టరములుగాఁ బరువఁబడియున్నవి. ఆవింత జూచి
భైరవుం డయ్యారే! ఇది మనుష్యులుసంచరించు ప్రదేశంబని తోఁచుచు
న్నది. ఈచెట్టుక్రిందకు వచ్చి గొప్పవారు రాత్రులఁ జల్లగాలి సేవింపు
చుందురుకాఁబోలు. ఏదియెట్లైన దీనిక్రింద వసించుట నీతికాదు. దీనిశా

ఖాంతరములనుండిసఁ బరమేశ్వరుఁడు కనుంగొనలేఁడు. కోటరమునవ
సించి యిందలివింతలఁ జూచెదంగాక యని నిశ్చయించి యొకానొక
తొఱ్ఱ శుభ్రముసేసికొని యందు వసించియుండెను. ఇంతలోఁ బ్రొద్దు
గ్రుంకినది. అప్పుడు—

గీ. వెల్గురాయనిజోడు వెన్నెలలఱేఁడు
పాలసంద్రంబుపట్టి పూఁపట్టె నుదయ
మేదినీధరకూటాగ్రసౌధసీమ
నిజకరావళి దెసల వన్నియల నిడుచు.

—♦ తి ర్య గ్జ ం తు మ హా స భ ♦—

క్రమంబున వెండిపూఁసినట్లు పండు వెన్నెలలు దెసల నిండియుండ
సింహ శార్దూల వరాహ శాఖామృగ భల్లూక ప్రముఖములగు నార
ణ్యకమృగంబులును అజగజాశ్వమూషకశునకమార్జారధేనువృషభప్ర
ముఖములగు గ్రామ్యజంతువులును సంతోషములుగా నాచెట్టుక్రిం
దకు రాఁదొడంగినవి. అందు ముందుగా జంబుకంబులు వచ్చి రాఁబోవు
మృగంబుల కెదురుబోయి మృగంబులఁ దీసికొనివచ్చి యుచితస్థానంబులఁ
గూర్చుండఁబెట్టుచుండెను. జాముప్రొద్దుపోవునఱకు నాప్రదేశమంతయు
మృగములచే నిండింపఁబడియున్నది.

గీ. తోఁక యాడించుకొనుచు నస్తోకవేగ
మడరఁ గేసరములు వాయుహతిఁ జలింప
వచ్చె హర్యక్షు మొకటి లేవఁగ మృగంబు
లెల్ల వలదంచు సంజ్ఞ గావించి యటకు.

అట్లువచ్చి యమ్మృగేంద్రంబు దనకై యమరింపఁబడియున్న పెద్ద
గద్దియం గూర్చున్నది. అప్పుడు మృగంబులెల్ల సంతోషారావంబులు
వెలయించుటయు నభినందించుచు జంబుకంబులు నిలువంబడి మహాత్మా!
భూమండలంబంతయుం దిరిగి గ్రామ్యమృగంబులకు నారణ్యకమృగంబు

లకుఁగూడఁ దమశాసనం బెఱిఁగించితిమి. ఆయాదేశంబులంగల మృగంబులెల్ల సంతసించుచు నేఁ డిటకుఁ దమతమ ప్రతినిధుల నంపినవి. కాని సిద్ధాశ్రమమందున్న మృగముయొక్కటియు నిక్కడికి రాలేదు.

మేము బిలువఁబోయినప్పుడే సిద్ధునియానతి లేనిదె మాకు మాయడవిదాటి పోవశముకాదని చెప్పియున్నవి. తక్కినదేశములనుండి సత్వంబులన్నియు వచ్చియున్నవని యెఱింగించి కూర్చున్నవి.

అప్పుడు మృగరాజు లేచి యిట్లుపన్యసించినది. మిత్రులారా! మనమందఱము నేఁ డిటకు సమావేశముమగుటకుఁ బ్రోత్సాహము గావించిన యీజంబుకంబుల నభినందించుచున్నాను. వినుండు. సృష్టికర్తయొక్కఁడే సర్వాధికుఁడు. సృష్టింపఁబడిన జంతువులన్నియు వానివాని బుద్ధిబలంబునంజేసి న్యూనాధిక్యములు వహించుచున్నవి. మనుష్యులవలెనే మనము సృజింపఁబడితిమి. కాని వారు మనల సృజింపలేదు. వారు మిగుల బుద్ధిబలము గలవారగుట మనలమించి భౌతికసృష్టిలో వారే ప్రధానుల మనిపించుకొనుచు మనలో లొంగనివానిఁ జంపుచు లొంగినవానిచేఁ బనులఁ గావించుకొనుచున్నారు.

మనలో సామాన్యజంతువునకుగలశక్తి వారిలో నూర్వురకు లేదు. నూర్వురఁ గాళ్లక్రిందవైచి చీమలవలె నలుపు సామర్థ్యముగల యేనుఁగులు ఒక్కనికి లొంగి తొత్తువలెఁ బనులుచేయుచున్నవి. ఇంతకన్నఁ జిత్ర మేదియైనను గలదా? ఇఁక గుఱ్ఱములు నెద్దులు మేకలు లోనగు జంతువులమాటఁ జెప్పనవసరములేదు. ఇందుకుఁ గారణము మన బుద్ధిమాంద్యము, పరస్పరవైరము. మనుష్యులఁ జూచి మనము నేర్చికొనవలసిన విషయము పరస్పరమైత్రియే. ఒకమనుష్యుఁడు మఱియొకమనుష్యుని జంపిన గొప్పయపరాధముకదా? మనలో నెలుకను బిల్లియుఁ బిల్లిని గుక్కయు లేళ్లను దోడేళ్లు నావులఁ బులులును భక్షింపఁ జూచుచుండును. జాతివైషమ్యము విడిచి యైకమత్యముగా మెలంగినచో నొక

రికి లొంగవలసినపని లేదు. ఆరణ్యకములు మనుష్యులఁ బ్రేమింపవు. గ్రామ్యములు లొంగియుండి వారిం బ్రేమించుచున్నవి. కావున వారిపైఁ గత్తికట్టి సాధించుటకు గ్రామ్యమృగముల యభిప్రాయము తెలిసికొనవలసియున్నది. మీమీయభిప్రాయము లెఱింగింపుఁడని పలికి సింహము కూర్చున్నది అప్పుడు బలీవర్దంబులు నిలువంబడి యిట్లు చెప్పినవి.

అక్కటా ! మాయిక్కట్లెన్నికంబులకును లేవు. వినుండు.

సీ. బలము చేరుటకు మందలఁగట్టి పొలములఁ
బెంట దోలుదు మగ్గి బ్రేలుచుండ
బదునుఁరా భూమి దున్నుదు మెల్లసస్యముల్
ఫలియింపఁ బలుమారు హాలముఖమున
వాడిజెక్కల ద్రొక్కి వరిగడ్డి విడిపోవ
ధాన్యముల్ నూర్తు ముద్దామలీల
నూర్చిన ధాన్య మానోగణంబులను గా
దులకుఁ దోలికొనిపోదుము గదయ్య

గీ. ఇన్నిపాటులుపడి ఫలియింపఁజేయఁ
జేరెడైనను ధాన్యంబు చేతితోడఁ
దినఁగఁ బెట్టరు పనికిమాలినది గడ్డి,
పొల్లు, దూగర, గాకయెప్పుడును జనులు.

అదియునుంగాక

ఉ. బండికిఁగట్టి మమ్ముఁ గడు భారము వైచి యొకండు ముందుఁ గూర్చుండి వడిన్వడింజన చొఛో యనుచుం జనకున్న వీపుపై
ఛండకశాగ్రభాగమున భళ్ళునఁ గొట్టుచు విచ్చి రక్తముం
గండబయల్పడం గరుణ గాంచఁడు సీ! మనుజుండు సేన్యఁడే ?

గీ. ఎట్టినీరసపడినట్టి యెద్దునైన
గట్టి యొంటెద్దుబండి కెక్కసముగాఁగ

జనుల నెక్కించి నడకున్నఁ జావమోదు
నయ్యయో! యేరులేరు మాకయ్యవినఁగ.

క. ఇలను దనంతటనేపడి
మొలచిన పచ్చికభుజించి మురువుగ బ్రతుకం
గల మిట్టి మాకు మనుజుల
కొలువేమిఁటికో యగమ్యగోచర మరయన్!

అచ్చువేసి విడిచినయెద్దు లెట్లు బలియునో చూచితిరా? స్వేచ్ఛ దిరుగనిచ్చిన మేమెల్లరము నాలఁబోతులవలె బలిసియుందుముగదా. రాత్రింబగళ్లు మాచే బనులు గొనుచు మమ్ము మిక్కిలి బాధలుపెట్టుచున్న మనుష్యులఁ దప్పక శిక్షింపవలసినదేయని యెద్దులు పల్కినవి. దున్నలు నామాటలే పలికినవి. ఆవులును గేదెలును నందుల కనుమోదించినవి. పిమ్మట మేకలు నిలువంబడి మృగేంద్రమా! మాకష్టములిట్టివని చెప్పఁజాలము. పశుమృగపక్షికీటకాదులలో మావంటి మెత్తని జాతి మఱియొకటిలేదు. మాయునికి గ్రామమందైనను నాహార మారణ్యకము. మునులవలె నాకలములు దిని యెవ్వరికిని వెఱపుగలుగఁజేయక సాధువృత్తి మెలంగుచున్నను మమ్మందఱు బలవంతమున జంపుచుందురు. అక్కటా మనుష్యుల పండువులు మాకు గండములు. వారి యుత్సవములు మాకాపత్సమయములు. దొరలరాక మాకవసానసమయము. వారి మసూచికములు మాకు మరణసూచకములు. అయ్యయ్యో! మనుష్యులకే కాక మెకాలకుఁగూడ మేమే లోకువ! అదియొకచేకాము. మాంసమాసింపని వేలుపులుగూడ బులులవలె మావపఁ దిన నాసించుచుందురఁట! ఇఁక మాకు సుకమెక్కడిది? రోగముల వలన మాకు మరణములేదు. బలవన్మరణమే మాకుశరణము. పుడమి నిర్మానుష్యము సేయించినచో మేము హాయిగా జీవింతుము. మీదయవలన మెకములేక మాజోలికి రావుగదా? మనుష్యులఁ బరిభవిం

పనలయునని మేకలు చెప్పినవిని గొఱ్ఱెలు నట్లు చెప్పినవి. పిమ్మట నేనుఁగులు లేచి,

మహారాజా ! నీరూపము మేము కలలోఁజూచినఁ బ్రాణము లు విడుతుము. అట్టినీవు దాక్షిణ్యము౯ాని మమ్మురక్షించి మీపక్షమే మని యడిగిన మేము ప్రతిపక్షులఁ జేరుదుమా ? మేము పెద్దదేహము గలిగియు బుద్ధిమాంద్యముచే మనుష్యులకు లొంగియుంటిమి. మాకా హారము వారిడనక్కఱలేదు అడవి రొట్టదిని జీవింపఁగలము. నల్లమం దువైచి మాబుద్ధిని మందపఱచుచున్నారు. మనుష్యులు మాకు శత్రు వులుగాని మిత్రులుగారు. అవశ్యము వారిఁ బరిభవింపవలసినదే యని యేనుఁగులు పలికినవి. హర్యక్షుంబు:

గీ. ఒడలు తోమిత్రోమి కడిగి కాళులువంచి
పిసిగి పిసిగి దువ్వి ప్రీతిజనులు
హరుల నాదరింతు రది హేతువుగ నవి
మనలఁ జేర వేమొ యనుఁడు హరులు.

నిలువంబడి సింహంబునకు మ్రొక్కుచు నిట్లుచెప్పినవి. మృగ ప్రభూ ! మనుష్యులు మాకుఁ జేయు నుపచారములన్నియు వారిపను లం జేయించికొనుటకు గాని మాయందలి యనుగ్రహమువలనఁగాదు. మనుష్యులు మమ్ము బండ్లకు గట్టియు బరువుమోయించియుఁ బొలముల దున్నించియు నెద్దులకన్న బెద్దగా బాధించుచున్నారు. మఱియు మ మ్మాడుగుఱ్ఱము మొగము జూడనీయక సర్వదాకట్టిపెట్టి మాచే బ్ర హ్మచర్యవ్రతంబు సేయించుచున్నారు. ఇంతకన్న నపకార మేమియున్నది? మేమడవిలో గడ్డి తిని బ్రదుకగలము. మనుష్యులపై మాకు జాలిలేదు. పరిభవించుటయే మాయభిప్రాయమని యశ్వములు పలికినవి. ఖర ములు నుష్ట్రములు నట్లే నరులయెడ ద్వేషము సూచించినవి.

లేళ్ళు పందులు మేకలవలెఁ దమ బలవన్మరణముగుఱించి దుః

ఖింపుచుం జెప్పికొనినవి. అప్పుడు హార్యక్షుంబు శునకములంజూచి మీాయాశయమెఱింగింపుఁడనవుడు శ్వానములు నిలువంబడి మ్రొక్కుచు నిట్లు చెప్పినవి.

దేవా! మమ్ము అల్పులమని తలంపక మృగంబులతోఁగూడఁ బ్రాతినిధ్య మిప్పించి యీసభకు రప్పించినందులకు వందనశతంబు లర్పించుచున్నాము. మాకు మనుష్యులేమియు నపకారము సేయకున్నను జాతి సాధర్మ్యమున మీాతోఁజేరక తీరదు. కాని యొండు వినుండు. మీాకు మొగమాటపడి యెదనొండు బెట్టుకొని యొకటిచెప్పుట సభ్యుని ధర్మముగాదు. మేము మనుష్యులు తిను నాహారము భుజింతుము. వానిని విడిచి మేమడవికివత్తుమేని మాకాహారమేది? క్రొత్తశాసనప్రకారము ఒకజంతు వొకజంతువును భక్షింపఁగూడదుగదా? అన్నమైన మాంసమైన మాకుఁ గావలయును అడవిలో రెండునుం దొరకవు మనుష్యులపై మేమెట్లు ద్వేషింతుము? ఈగుఱ్ఱములు నెద్దు గజంబులును నరులపై వైరమునూచించి పలికినవికాని వారు పెట్టెడుతిండి యడవిలో వానికిఁ దొరకునా? తమ పిల్లలవలెఁ జూచుకొని యాహారము పెట్టుచున్న మనుష్యులవిడిచి యడవికిఁబోవుట చెడుబుద్ధిగాని మంచిబుద్ధిగాదు. ఇట్లు పలికితిమని దేవర మాయందు వైరము బూనఁదగదు క్షమింపవలయునని శునకంబులు పలికినవి.

మార్జాలము లామాటలే యనువదించుచు మహాత్మా! నరులగృహములలో సంచరించుటకుఁ గుక్కలకు నిషేధమున్నదికాని మాకేమియు నాటంకములేదు. మహారాజుల యంతఃపురములు సూతికాగృహములుగాఁ జేసికొందుము. మనుజులు భుజించివిడిచినపదార్థములన్నియు మాపరములగును. గృహములలో స్వేచ్ఛగాఁ దిరుగుదుము వారి పాలు పెరుగు ద్రాగుచుందుము వారిపైఁ గత్తిగట్టి మీాతో నడవికి వచ్చి మేమేమిచేయుదుము. మీాకునమస్కారము క్షమింపుడు. క్షమిం

పుఁడు అని పలుకుచుఁ బిల్లి కూర్చుండెను.

అప్పుడు శార్దూలంబులు వ్యాళంబులు త్రిప్పుచు గంభీరస్వరంబున నిట్లు పలికినవి. మహారాజా! కుక్కలుఁ బిల్లులుదక్క తక్కిన గ్రామ్యమృగంబులన్నియు మనుష్యులపై ద్వేషించుట కంగీకరించినవి. తదుచ్ఛిష్టభోక్తలగునవి యట్లు పలుకుట వింతగాదు. వానితో మనకంత పనిలేదు. వృషభాశ్వములు వారివిడిచి మనలోఁ గలియుట కంగీకరించినవిగదా. ఎల్ల భూమియున్నకున్న నడవి బలియును. అరణ్యావృతము లగు గ్రామములసమీపముల మన మేఁగవచ్చును. అప్పుడు మనము మనుష్యులజయించుట సులభమని పెద్దపులులు పలికినవి యితరమృగం బులన్నియు నామాట కంగీకరించినవి.

అప్పుడు అగ్రాసనాధిపత్యము వహించియున్న సింహము నిలువం బడి వినుండు. వినుండు. తొందరవలదు. మనుష్యులు కడునేర్పరులు బుద్ధిబలముగలవారు వారిం బరాజితులఁగావించుట సామాన్యముకాదు. మనలో నైకమత్య మింకను గలుగలేదు. అండజములు సరీసృపములు కీటకాదులు కూడ మనలోఁ జేరవలయును. అప్పుడుకాని మనమీపనికిఁ బ్రయత్నింపరాదు. మఱియొకసభకు వానింగూడ రప్పింతము. ఇందుల కందఱు ననుమోదింపవలయునని సింహం బుపన్యసించినది. ఏకగ్రీవము గా నామాట కాసత్వంబు లంగీకరించినవి. ఆతీరుమానమునకు మార్జాల కుక్కురములు పరిహాసము గావించుచు లేచిపోయినవి. అంతలోఁ దెల్లవారుసమయమగుటయు నామృగంబులెల్లఁ దమతమ నెలవునకుఁ బోయినవి.

భైరవుం డాకోటరమున వసించి మృగసభావిశేషము లన్నియుం జూచుచుండెను. కాని వానిసంభాషణ మేమియుం దెలియలేదు. ఏమృగ మెప్పుడువచ్చి మీఁదఁబడి చంపునోయని యడలుచు నొంటిప్రాణముతో నాతో నంటుకొని కూర్చుండెను. తెల్లవారినతరువాత మృగములన్ని

యు దూరముగాఁబోయెనని నమ్మకము గలిగినపిమ్మట భైరవుఁడు మెల్లగా నాచెట్టుదిగి యొంటిప్రాణముతో నొకదారింబడి నడువసాగెను. ఏచెట్టుపైఁ బిట్ట పుట్టుచున్నను నేదియో మృగము మీఁదఁబడునని వెఱపుగదురఁ బరుగిడుచుండును. అట్లు వాఁ డమ్మహారణ్యమధ్యంబున నత్యంతసాధ్వసభ్రమితస్వాంతుండై తిరుగుచు నొకనాఁడు సాయంకాలంబునకు దైవికముగా సిద్ధకూటంబునకుఁ బోయి యందొకవృక్షాంతరంబున వసించి యారేయి వేగించెను.

---

## —♦ సిద్ధునికథ. ♦—

సూర్యోదయసమయంబున నతని కొకఘంటానాదంబు వినంబడుటయు నక్కజముతో నోహో! యిందు మనుష్యులుండిరా యేమి? లేనిచో నీధ్వని యెట్లుబయలువెడలెడిని? నా కాయుశ్శేష మింకనుం గలదుకాఁబోలు. అని తలంచుచు నారవంబు బయలువెడలుచున్న దెసకుఁ జూడ్కులు వ్యాపింపఁజేసెను. అల్లంతదూరములో శాఖాసమావృతదిక్తటంబగు వటవిటపియొండు కన్నులపండువు గావించినది.

దానిపొంత నిరంతరలతాంతమనోహరలతాంతరపరిశోభితంబగు పర్ణశాల విశాలమాలతీవేల్లితంబై యొప్పుచుండెను. తదంతికంబున శాఖాంతంబున వ్రేలంగట్టినఘంటిక నొకభల్లూకంబు గొట్టుచుండెను. ఆవింతజూచి భైరవుండు గడగడ వడంకుచు నయ్యో! మఱల నామృగంబులన్నియు నిందు వచ్చునుగాఁబోలు. నాఁడు రాత్రియగుటఁ జూడక విడిచినవి. నేఁడు చంపును. అదిగో మృగములరొద వినంబడుచున్నది. ఈయెలుఁగుబంటి యీగంట నెందుసంపాదించినదో అని యాలోచించుచు డిల్లవడి యాదెస చూచుచుండె నప్పుడు,

సీ. సమ్మార్జనము చేసెఁ జమరీమృగంబులు
చలితవాలప్రభంజనముచేతఁ

గరిపోతములు గరాగ్రమున నీరుగ్రహించి
కలయంపి వాకిటఁ గలయఁజల్లెఁ
గటిచయం బలికె వాకిలి వేదికల వల
పులపచ్చకస్తురి బురదఁ దెచ్చి
కరికుంభసక్తముక్తాఫలంబుల నేరి
కలయ సింగములు ముగ్గులుఘటించె
గీ. గీతములు బాడె శారికాకీరచయము
నెమళులు లొప్పుగ నాడెఁ బింఛములు విప్పి
యరుణుఁ డుదయింపకయమున్న యటకు వచ్చి
శాంతమతి సిద్ధు సత్తపశ్చర్యమహిమ.

మఱికొన్ని మృగంబులు భక్తివిశ్వాసములతోఁ గందమూలఫల కుసుమదళాదులం దీసికొనివచ్చి యప్పర్ణశాలయందు జపముసేసికొనుచున్న సిద్ధునిపాదమూలంబున నిడి తత్ప్రసాద మాకాంక్షించుచు మోడ్పుచేతులతో నాప్రాంతమున వసించినవి.

ఆమృగచేష్టలన్నియుం బరికించి భైరవుండు గుండెచెదర నందున్నసిద్ధుండు దనకుఁ గనఁబడమి నయ్యో! మృగోపద్రవంబు నన్ను విడువదు కాఁబోలు. నాఁ డెట్లో బయలుపడితిని. నేఁ డింక నాకుఁ జావు మూడినది. తప్పదు. కానిమ్ము. మృగంబు లిందన్యోన్యవైరంబులు విడిచి మైత్రితో మెలగుచున్నవి.

ఇదియేమిమహిమయో తెలియదు. ఏనుఁగకు సింహంబు గలలోఁ గనంబడినంతనే చచ్చునని చెప్పుదురు. ఆరెండుమృగము లెట్లు చెలగాటలాడుచున్నవో! అయ్యారే! కండూతివాయం బులి గంగడోలు నాకుచుండ ధేనువు మెడసాచి చూచుచున్నది. ఇంతకన్నఁ జిత్రమేమి? యనితలంచుచు నాతరుశాఖాంతరముల నణఁగి యొంటిప్రాణముతోఁ జూచుచుండెను.

మఱియు నంబరమణి గగనమధ్యంబలంకరింప మఱల నాఘంటా

నాదంబు వినంబడినది. భైరవుం డాదెసం గన్నులెత్తి చూచుచుండెను.

గీ. భూతిరుద్రాక్షమాలికాభూషితాంగుఁ
డురుజటాంచితమస్తకుం డొక్కసిద్ధ
యతివరుం డు కమండలూద్యత్కరుండు
జపము చాలించి యప్పర్ణశాలనుండి.

స్నానార్థము బయలువెడలి తటాకంబున కరుగుచుండ మృగ తండంబులెల్ల ముందునడచుచుండె. వృక్షశాఖాంతరమునుండి యవ్వింత జూచి భైరవుండు వెఱపుడిపికొనుచు సాహసముచేసి యాసిద్ధుండు తానున్న చెట్టుక్రిందుగాఁ బోవుచున్నసమయంబునఁ దటాలున నేలకు రికి పిరికితనంబున నతనిపాదంబులంబడి మహాత్మా! రక్షింపుము. రక్షింపుము. అని మొఱవెట్టికొనియెను.

దయాహృదయుండగు నయ్యతీశ్వరుండు వానిం గరుణావిలోకనంబుల నీక్షించుచు నీవెవ్వాఁడవు? ఎందుండివచ్చితివి? నీయుదంత మెఱింగింపుమని యడిగిన భైరవుం డల్లనలేచి యిట్లనియె.

మహాత్మా! నావృత్తాంత మాలింపుఁడు. గిరితటంబను నగ్రహారము నాకాపురము. నాపేరు గౌతముఁడందురు. నాతలిదండ్రులు చిన్ననాఁడే గతించిరి. దిక్కుమాలినవాఁడనై నేనక్కడక్కడ సంచరించుచు బ్రాహ్మణునికి విధాయకములైన విద్య లభ్యసించి వైరాగ్యప్రవృత్తితోఁ దిరుగుచుంటిని. ధనవిహీనుండనగుటయు నాకెవ్వరు బిల్లనిచ్చిరి కారు. అదియే నావైరాగ్యమును బలపఱచినది. నన్నందఱు బైరాగియని పిలువ మొదలుపెట్టిరి. క్రమంబున నాకాపేరే ప్రఖ్యాతియైనది. నేను బుట్టు బ్రహ్మచారినగుట యథావిధి బ్రహ్మచర్యవ్రతంబు చేయుచుఁ దీర్థయాత్రల సేవించుచు మహాత్ముల దర్శించుచు దేహయాత్ర నడుపుచుంటిని.

నాచిత్తము విరక్తిఁ జెందియున్నది ఎప్పుడును మీవంటి తపోధనుల నాశ్రయించి సేవింప నుత్సుకత్వము గలిగియుండును. నాచూడని

శైలములు నాచూడనితీర్థములు నరణ్యంబులు లేవు. బదరీవనంబుననుండఁగా నందలితాపసులు మీయుదంత మెఱింగింప సంతసముతో బయలుదేరి యీయాశ్రమముల కతికష్టముమీఁద మిమ్ముఁ జూడఁగంటిని కృతార్థుండనైతి. ఇఁక నా కీజన్మమునకుఁ గావలసినదేదియును లేదు. ఆజన్మాంతము మీశుశ్రూష చేయుచు మీపాదమూలమున దేహము చాలించెద నట్టివరంబు నాకుఁ బ్రసాదింపవలయును.

ఆహా ! మీమహానుభావత్వ మీసత్వంబులసేవయే ప్రకటించుచున్నది. ఇట్టివింత యెందును జూచియెఱుంగనని యాసిద్ధునిఁ బెద్దగా నుతియించుటయుఁ గాపట్యమెఱుంగని యమ్మహాత్ముఁడు వాని కభయహస్తమిచ్చుచు నోయీ ! ముముక్షుండవగు నీ వింతకంటె కేమియు నభ్యంతరములేదు. నీయిష్టమువచ్చునట్లు దపంబుసేసికొనుచుఁ గాలము గడుపుము. నేను స్నానముసేయఁ దటాకంబున కరుగుచున్నవాఁడ. అల్లదే పర్ణశాల యందుఁబోయి కూర్చుండుము. నేను రెండుగడియలలో వచ్చెదనని పలికిన విని వాఁడు సామీ ! నేనెంత విరక్తుండనైనను మృగములఁజూచిన నాహృదయము బెదరుచున్నది. ఎంతబోధించినను గుదురుపడకున్నది. మీసాన్నిధ్యంబుననుండఁబట్టి గట్టిగా మాట్లాడఁగలిగితిని కాని లేకున్న నోటినుండి మాటయే రానేరదు. దారిలో మృగసంఘము నుండి తప్పించుకొని వచ్చితిని. ఇందున్న క్రూరమృగములు నన్ను మ్రింగునని వెఱపుగలుగుచున్నది. మిమ్మువిడిచి నేనొంటిగాఁ బర్ణశాల కేగఁ జాలనని పలికిన నవ్వుచు యతి యిట్లనియె.

అడవులు పెక్కుతిరిగితినని చెప్పితి వేఁ? ఇంతపిఱికివాఁడ వెట్లుపోయితివి. ఇందు మృగములు నిన్నేమియుఁ జేయవు. విస్రంభముగా సంచరింపుము. స్నానముచేయుటకుఁగాక నాతోఁ దటాకమునకు రమ్ము. వెఱపుడిగింతునని పలుకుచు వాని వెంటఁబెట్టికొని తటాకంబునకుఁ బోయెను. మృగంబు లాయతి ననుగమించి యరిగి కాసారతీరంబున నిలువం

బడినవి. సిద్ధుండు స్నానముసేసి మధ్యాహ్నికక్రియలు నిర్వర్తింపుచుండ భైరవుండును దీర్ఘమాడి యేదియో జపించుచున్నట్లు ముక్కుబట్టికొని గొణుగుచుండెను.

క్రియావసానంబున సిద్ధుండు కమండులువున జలంబెక్కించికొని బయలుదేరెను. భైరవుఁడును జపము ముగించికొనినట్లుగా నడిపి యాయన వెంట నడుచుచుండెను. మృగములు గింకరులవలె లేచి ముందు నడుచుచుండెను. యతీశ్వరుఁడు పర్ణశాలలోఁ బ్రవేశించినంత మృగములు పరివేష్టించికూర్చున్నవి. తరువాత నయ్యోగి తదానీతంబులగు పదార్థంబులు భైరవునకుఁ గొన్నియిచ్చి తాను భక్షించి శేషము మృగములకుఁ బంచిపెట్టెను.

ప్రసాదమువలె నామృగము లొక్కటొక్కటిగావచ్చి స్వీకరించి పోవునవి. యతితో నాఁడు భైరవుఁ డిష్టాలాపములాడికొనుచు సుఖముగా వెళ్ళించెను. మఱునాఁడు భైరవుఁడు యతీశ్వరునిఁజూచి సామీ! అన్నిటికంటెఁ బ్రాణములు చాలతీపుసుఁడీ! నాకు భార్యాపుత్రాదులు లేరు శుద్ధవిరక్తుండ నిట్టినాకును జావనిన భీతిగలుగుచున్నది. ఒరుల మాట చెప్పనేల? వినుండు. నేను జపంబునకై కన్నుమూసినంత నీమృగములు నాపైఁబడి చంపునని వెఱపుగలుగుచున్నది. మీకడ నిజముదాచనేల ? జప మేమియుం దోచకున్నది. ఇంతకన్న వేఱొకప్రతిబోధ మేదియు నింకులేదు. ఇందుల కేదియేని ప్రతిక్రియఁ దెలియఁజెప్పుఁడని వేఁడుకొనుటయు నాసిద్ధుండు,

ఓయీ! నీవిందులకుఁ జింతింపకుము. నాకుంబోలె నీకుఁగూడ మృగములన్నియు వశములైయుండునట్లు తంత్ర మొకం డెఱింగించెదఁ బరిగ్రహింపుము. తద్వేత్తృత్వంబున మనుష్యుల మృగములఁజేయవచ్చును. మృగములు తొత్తులవలె స్వాయత్తములై పనులు గావింపఁగలవని పలుకుచు వానిదుర్వృత్తిఁదెలిసికొనలేక యాప్రక్రియ నాని కెఱింగించెను.

ఆవిద్య తెలిసికొని వాఁడు మిగులసంతోషించుచు మృగములన్నియు వశవర్తులై సంచరించుచుండ నిర్భయముగా నాపర్ణశాలయందు సిద్ధునిప్రక్కవసించి ముక్కుమూసికొని యేదియో జపించుచున్నట్లు నటించుచుఁ గొన్నిదినములు వెళ్ళించెను.

సిద్ధునకు వానియందు మంచిదయ కలిగినది. చనువుగలిగినపిమ్మట భైరవుం డొకనాఁడు సిద్ధునితో నార్యా! మీవంటితపశ్శాలులకుఁ గాంచనము చేయుప్రజ్ఞ గలిగియుండునని చెప్పుదు రదియెంతనిజము ? అని యడిగిన నతండు ఆయోగము నాకుఁ దెలియును. కాని దానితో మాకేమిప్రయోజనమున్నది? లోష్టము కాంచనము సమముగాఁ జూచువారముకాదా? అని చెప్పిన వాఁడు చేతులు నలుపుచు స్వామీ! దానితో నాకునుం బనిలేదు. కాని అది యెట్లగునో చూడవలయునని యభిలాషయున్నది. నూత్నవిద్యాభిలాషుఁడ నగు నే నాయోగ ముపదేశము గావింపవలయునని సాహసించి యడుగుచున్నాను. మీకుఁ బుత్రతుల్యుండనగుట నిట్టిమాట కోరితిని. అని యభిప్రాయము సూచించిన నయ్యతి ఓయీ! అహంకారమమకారగ్రస్థు లావిద్య స్వీకరింప నర్హులుకారు. స్వార్థపరుల కది చెప్పరాదు. నీబుద్ధివిశేషము గ్రహించి ముందు నీకావిద్య నుపదేశించెదనులే! అని సమాధానము చెప్పెను వాఁడును చిత్తము. చిత్తము. అని వినయ మభినయించుచు మఱికొన్నిదినము లరిగిన వెనుక మఱియొకసారి యాప్రస్తావము దెచ్చెను.

ఆమాటలలో వానిస్వార్థపరత్వము గ్రహించి కొంతకాల మరిగినంగాని యుపదేశింపనని సూచించెను. అప్పుడప్పు డడుగుచుండ నీమనసు పరిపక్వమునొందినట్లు లేదు. నిష్కామునకుఁగాని యది యుపదేశింపరాదు. విరక్తుండవై యడుగుమని పలుకుచుండును.

ఒకనాఁడు మధ్యాహ్నసమయంబున సిద్ధుండు భైరవయుక్తుండై తటాకంబున స్నానముచేయుచున్నసమయంబున నొకబ్రాహ్మణకుమా

రుఁ డాసరసిదరికకు జేరి సిద్ధేంద్రా ! పాహి పాహి మృగేభ్యః పాహి అని యాక్రోశించెను. మాభైషీః ఏహి ఏహి అని సిద్ధుండు ప్రత్యుత్తర మిచ్చెను. ఆభాష భైరవున కేమియుం దెలిసినదికాదు. నీ వెవ్వఁడవు? ఏ మిటికివచ్చితివి ? పో, పొమ్ము. ఇది రహస్యస్థలము పామరు లిందుండ రాదనిపలికిన విని యతండు బెదురుగమరల నయ్యో! నేను బ్రాహ్మణుఁడ విద్వాంసుఁడ ధారానగరమున కరుగుచు దారితప్పివచ్చితిని. శరణుజొచ్చి తిని. తపోధనులకుమాత్రము భూతదయ యుండవలదా? మీరహస్యము నకు నేనేమియు భంగము గలుగఁజేయఁజాలను. మృగములకు వెఱచు చున్నాను. రక్షింపుఁడు. అని వేడికొనియెను. అప్పుడు సిద్ధుండు రమ్ము భయములేదు. అని హస్తసంజ్ఞ గావించెను. ఆవిప్రకుమారుం డల్లన తటాకముదాపునకుఁ బోయి భైరవునకు సిద్ధునకు నమస్కరించి యూరగా నిలువంబడి వారి జపావసాన మరయుచుండెను.

అనంతర మాయతి కన్నులందెఱచి కమండులూదకము పూరించి యావిప్రకుమారునితోఁగూడ భైరవుండు వెంటరాఁ బర్ణశాలకరిగి ఫలా హారములచే వారిం దృప్తులంగావించెను. తరువాత వాఁడుకప్రకారము మృగములకుఁ బ్రసాదము పంచిపెట్టెను. ఆవింతయంతయుఁ గన్నులారఁ జూచి బ్రాహ్మణపుత్రుఁడు తపోమహత్వమునకు మిక్కిలి యక్కజ పడఁజొచ్చెను.

తనప్రక్క వినమ్రుండై కూర్చున్న యాయాచిస్నవానింజూచి సిద్ధుం డు వత్సా ! నీదేయూరు ? ఎందుఁబోవుచుంటివి ? నీవృత్తాంత మెఱిం గింపుమని యడిగిన నతఁడు మొగంబున భయభక్తివిశ్వాసములఁ బ్రసరిం పఁజేయుచు మహాత్మా ! భవదీయకటాక్షవీక్షణంబుల నాపై వ్యాపిం పఁజేయుటంజేసి నేను బవిత్రుండనైతి. నావృత్తాంతము చెప్పి నాచరిత్ర నుగూడఁ బవిత్రముచేసికొనెద నాలింపుఁడు.

నేనొక బ్రాహ్మణపుత్రుఁడ. జిన్నతనమునందె తల్లిదండ్రులు స్వర్గస్థులైనంత నిశాంతమునఁ బోషించువారు లేమింజేసి కాశీపురంబున కరిగితిని. అందు దత్తకాదిమిత్రులతోఁ గలిసికొని విద్యాభ్యాసము గావించితిని. వేయిమందిసహాధ్యాయులలో మే మేకువుర మచిరకాలము లో సమస్తవిద్యలలో ను త్తీర్ణులమైతిమి. మాతో వాదింపఁదగిన పండితు లెందున్నారని తలంచి ధారానగరంబున భోజభూభుజుని యాస్థానమున గొప్పపండితులున్నారని విని వారితోఁ బ్రసంగింప వేడుకజెంది తల యొకదారి నయ్యూరికిఁ బోవుచుంటిమి. దేశవిశేషములం దెలిసికొనుచు వత్సరమునాఁటికి నావీటికిఁ జేరుటకుఁ గడు వేర్పఱచుకొంటిమి.

నే నొకమార్గంబునంబడి పురనదీపక్కణారణ్యావిశేషంబులం జూచుచుఁ బోవుచుంటిని. యౌవనమదము కడుగర్వమును గలిగించును. ఈమార్గము కడుసంకటమైనది. దూరమునఁగాని గ్రామమేదియును లేదు. పోవలదని బయలుదేరునపు డొకపల్లెలోనివా రెంతచెప్పినను లక్ష్యముసేయక యాదారినే పోవ మొదలుపెట్టితిని. అక్కటా ! ఆప యనంబునంగల యిక్కట్టు చెప్పుటకుఁ బదిదినములు పట్టును. ఎడారి యును గాదు, అరణ్యముం గాదు, పాషాణకంటకాదులచే నావృతమై యున్నది. ఎంతదూరముపోయినను నీరు దొరకదు. పశుపక్షిమృగాదు లేవియుం గనంబడవు. మధ్యాహ్నసమయంబుల వైతరణీనదియుంబోలె నెండమావు లూరక ప్రవహింపుచుండును. వానింజూచి జలమని పెక్కు సారులు మోసపోయితిని.

నేను దెచ్చికొనిన ద్రవపదార్థములు పిండియు నైపోయినవి. నాలుగుదినములు ధైర్యముతో నడిచితిని. మార్గమంతయు నొకరీతిగానే యున్నది. కాళులు పొక్కులెక్కినవి. జవసత్వము లుడిగినవి. అను గామ డగానుండెను. నాలుగవదివసంబున రాత్రియెల్ల నొకరాతిపైఁ బండికొని

యైదవనాఁడుదయంబున లేవలేక లేచి నలుఘూలలు నూచితిని. యోజ
నదూరములో నొకతోపు కన్నులపండువు గావించినది. యోజ
నము మునుపు నాలుగుగడియలలో నడుచువాఁడ నప్పుడు సాయం
కాలమునకైన నందుఁ జేరఁగలనో లేదో యని యధైర్యము గలిగినది.
ఎట్టులో లేచి యడుగులు తడఁబడ నడువసాగితిని. మహాత్మా ! ఆతోట
రెండుక్రోశములదూరములోనే యున్నది. జాముప్రొద్దెక్కునప్పటి కెట్లో
దేహ మందుఁ జేర్చితిని. అది భగవంతునిమహిమగాని నాశక్తి గాదు.
తృణకాష్టజలసమృద్ధంబైన యాప్రదేశ మొక చిన్నపల్లెగా నున్నది.
అందు బ్రాహ్మణగృహ మొక్కటియే యున్నది. నే నప్పు డేదియుం దెలిసి
కొనఁజాలక నారికేళవృక్షచ్ఛాయములచే నావరింపఁబడి మెత్తనియాస్త
రణలచే నొప్పుచున్న యొకయరగుపైఁ బండుకొంటి మేను వివశమైనది.

కొంతసేపటికి నాకుఁ దెలివివచ్చి కన్నులం దెఱచిచూచితిని. నా
మొగంబున నీళ్లు చల్లఁబడియున్నవి. పదిరెండేండ్లప్రాయముగల యొక
బాలిక నాప్రాంతమున నిలువంబడి తాళవృంతముతో విసరుచుండెను.
నేను రెప్పలు విప్పుటఁజూచి యాబాలిక ఆర్యా ! దూరమునడచుటచే
నలయికఁ జెందినట్లుంటిరి. వంటయైనది. లేచివచ్చి స్నానముచేసి భుజిం
పుఁడు. మాతండ్రిగారు వైశ్వదేవముచేసి మీనిమిత్తము వేచియున్నా
రని పలికినది.

ఆపలుకు లమృతమువలె నాచెవులకు సోఁకినవి. మాటాడనే
రక వడగొట్టినది. లేవఁజాలను. దాహమిమ్మని సూచించితిని. అప్పు డా
చిన్నది వడిగా లోపలికిఁబోయి యరనిముషములోఁ దలిదండ్రులఁ దీసి
కొని వచ్చినది. ఆయజమానుఁడు నన్నుఁబిలిచి పలుకకున్న వెఱపుజెందు
చు నన్నుఁ బట్టుకొని లేవనెత్తి తనమేనికిఁ జేరవైచుకొని నాలుగుబిందెల
చల్లని నీటిచే నన్ను స్నానముచేయించెను. ఆహా ! పోయినప్రాణములు
మఱల నాదేహములోఁ బ్రవేశించినవి. చల్లనిచేఁటమజ్జిగ నానోటఁ బట్టి

చెను. అప్పుడు నాకు స్మృతివచ్చినది. ఆబాలిక నాకు విసరుచుండెను. అప్పుడు నేనాయనకు నమస్కరించుచు నన్ను బ్రతికించినందునకుఁ గృతజ్ఞత సూచించితిని.

ఆయజమానుఁ డడుగ మెల్లఁగా నావృత్తాంతమంతయుం జెప్పితిని. అతఁడు మిగులసంతసించుచు నన్ను లోపలికిం దీసికొనిపోయి మృష్టాన్నములచే సంతృప్తుంగావించెను పదిదినము లందు నాకు రాజోపచారములు గావించిరి. దేహమున బలముగలిగి యథాప్రకారముగా నొప్పుచుంటిని.

ఆబ్రాహ్మణునిపేరు బ్రహ్మదత్తుఁడు. చతుశ్శాస్త్రపారంగతుండై యొకమహారాజువలన నాగ్రామ మగ్రహారముగాఁగైకొని యందువసించి భూమి ఫలవతియగుట సకలసస్యములు ఫలింపఁజేయుచుండెను. తోటలునాటి కేదారములుగట్టి కాలువలు త్రవ్వించి యాభూమినంతయు బాగుచేయించెను. ఆబాలిక యాబ్రహ్మదత్తునికూఁతురు. దానిపేరు మల్లిక. ఆపాపనకు వేఱొకపనిలేమిం జేసి యాకన్నియకు సంతతము విద్యలు గఱపుచుండును. అప్పటికి తర్కవ్యాకరణములయందుఁ బాండిత్యము గలిగినది. కవిత్వము చెప్పఁగలదు. సంగీతము పాడఁగలదు.

ఒకనాఁడు బ్రహ్మదత్తుఁ డాచిన్నదానిచే శాస్త్రములలో నన్నుఁ గొన్నిప్రశ్నల నడిగించెను నాపాండిత్యము దెలిసికొనవలయునని యడిగినట్లు గ్రహించి యాప్రశ్నలకు సమాధానము చెప్పుచు నాకుఁగల విద్యాపాటవమంతయుఁ దేటపఱచితిని. బ్రహ్మదత్తుఁడు నాపాండిత్యమున కక్కజమందుచు నన్నుఁ బెద్దగాస్తుతించి నన్నామల్లికను బెండ్లిచేసికొమ్మని ప్రార్థించెను సిరిరాఁ వలదనువాఁడుండునా? నేను సంతోషముతో నంగీకరించితిని. ఒకశుభముహూర్తంబున బ్రహ్మదత్తుండు మల్లికను నాకిచ్చి మహావైభవముతో వివాహముగావించెను. కొన్నిదినము లందుండి మిత్రులవృత్తాంతము సెప్పి ధారానగరంబునకుఁ బయనమైతిని.

నన్నుఁ బోవలదని బ్రహ్మదత్తుండు బ్రతిమాలికొనియెను. మిత్రుల వెంటఁ బెట్టికొని సత్వరము రాఁగలనని చెప్పి యెట్టకే నావిప్రునొప్పించి బయలు దేరితిని. సుఖము కష్టమునకును గష్టము సుఖమునకును గారణమగు చుండునుగదా? పదిదినములు శ్రమపడి నడిచితిని. దైవికముగా మీా యాశ్రమము గనంబడినది. మార్గగమనశ్రమమంతయుఁ బటాపంచలైనది. ఇందలిసత్వంబు లన్యోన్యవైరంబులు విడిచి తిరుగుచుండుటంబట్టి యిది తపోధనాశ్రమంబని తలంచితినిగాని స్వభావజన్యమగు భయము వదలినదికాదు.

జన్మపావనంబైన మీాదర్శనంబైనది. కృతార్థుండనైతి. నాకింక కావలసినదేమియు లేదని స్తుతియించుచుఁ దనవృత్తాంతమంతయు నెఱింగించెను. సిద్ధుండు చారాయణవిద్యావైదుష్యమునుగుఱించి మిక్కిలి సంతసించుచుఁ బ్రస్థానత్రయమునందు నతనితో ముచ్చటించి తదీయాత్మవేతృత్వమును బ్రశంసింపుచు సంతతము వానితోనే గోష్ఠిసేయుచుండును. తపముసేసికొనుచున్న పుడుకూడ నవకాశముచేసికొని జ్ఞానమును గుఱించి యతనితో మాటలాడుచుండును.

కొన్నిదినములు గడిచినతరువాత సిద్ధునకుఁ దనవిద్య లతని కుపదేశముసేయవలయునని యభిలాష గలిగినది. భైరవునితోఁ జారాయణుఁడు వచ్చినది మొదలు యతి తిన్నగా మాటాడుటలేదు. వాఁడు కపటాత్ముఁడని గ్రహించుటచేఁ బ్రీతి మునుపే తగ్గినది. భైరవుఁడు చారాయణునం దీసుబూని వీఁడిక్కడినుండి యెట్లుపోఁగలఁడు? ఉపాయమేమి? యీా సిద్ధుండు వీనికతంబున నాతో మాటాడుటయే మానివేసెను. కాంచనయోగ ముపదేశింపుమని నేనడుగ నిదిగో యదిగోయని జరపుచుండెను. నిన్నరాతిరి నీకాయోగ ముపదేశించెదనని యారండాపుత్రునితోఁ జెప్పుచున్నాఁడు. అందులకు సరిపడిన నియమములు నాకడ లేవఁట. నేనుపదేశార్హుండఁ గానని టక్కుసేయుచున్నాఁడు. ఎట్టైనను రెండు

మూఁడుదినములలో వాని కావిద్య యుపదేశింపకమానఁడు. నాపడిన శ్రమయంతయు వ్యర్థమైనది. గెద్దవలె వచ్చి వీఁడావిద్దె తన్నుకొనిపోవు చున్నాఁడు. ఇందుల కంతరాయ మెట్లుకల్పింతును? అని ధ్యానించు చుండెను.

సిద్ధునకుఁ జారాయణునందుఁ బ్రేమానుబంధము క్షణక్షణము వృద్ధిబొందుచుండెను. భైరవునకు వారిద్దఱియందును గ్రోధ మభివృద్ధి నొందుచుండెను. ఎల్లి శుభముహూర్తము వశిత్వముపదేశించెదఁ గైకొనుమని సిద్ధుఁడు చారాయణునితో రహస్యముగాఁ జెప్పుచుండ భైరవుఁడు చాటుననుండి యాలించెను. వానికి మనంబున నాందోళనము జనించినది. అనేకోహలు పుట్టినవి. కొన్ని నశించినవి. కొన్ని పూర్వపక్షములైనవి. తలఁచితలఁచి చివర కొకవిధానము నిశ్చయము చేసికొని యెను. ఆరాత్రి నిద్రబోలేదు.

ప్రతిదినము సిద్ధుండు యామావశిష్టమగు త్రియామనులేచి తటాకమున కరిగి స్నానముచేసి పర్ణశాలకు వచ్చి జపముచేసికొనుచుండును. చారాయణుఁడు సూర్యోదయమువఱకుఁ దటాకమునొద్దనే నిత్యక్రియలు నిర్వర్తించి పిమ్మట సిద్ధునొద్దకువచ్చి కూర్చుండును.

నాఁడు సిద్ధుఁడు వాడుకప్రకారము స్నానముచేసివచ్చి ప్రాణాయామయోగంబున జపముగావింపుచుండెను. చారాయణుఁడు తటాకంబున కరిగెను. ఆయవకాశము గ్రహించి భైరవుఁడు పెద్దపాషాణమొకటి దెచ్చి సిద్ధుండు సూర్యోపాస్తికై భూమిజాగిలిబడి మ్రొక్కు చున్న సమయంబున పాషాణము సిద్ధునిశిరంబున గుభాలునఁ బడవైచెను. హా! పరమేశ్వరా! యని పలుకుచు గిలగిలఁ దన్నుకొని యతండు ప్రాణములు విడిచెను

పరమేష్ఠి వానిహృదయము ఇనుముతోనో చిట్టముతోనో చేసెను. కానిచో పరమదయాళుఁడై తనకెంతయో యుపకారముచేసి

యాదరించిన మహానుభావునిం జంపుట కాక్రూరాత్మునికెట్లు చేతులు వచ్చెనో తెలియదు. సీ, సీ, అట్టివానిపేరు దలంచుటయు మహాపాతకమే. కథాసందర్భంబునం జెప్పవలసివచ్చె. గోపా! వినుము. ఆసిద్ధుని పాటుజూచి యందున్న మృగములన్నియుం గన్నీరుగార్చుచు భైరవునకు వెఱచి దూరదూరముగా మూగికొనుచుం గొన్ని చారాయణుఁడున్న తటాకమునకు గుంపులుగాంబోయి యేదియో మొఱ్ఱపెట్టుకొనుచున్నట్లాక్రోశించినవి. ఆక్రొత్తవింతజూచి చారాయణుఁడు మది దిగులుదోప మృగములయార్పుల కేదియో కారణమున్నదని నిశ్చయించి నిత్యకృత్యములు సాంతముగాం దీర్చికొనుటకు మనసురాక తటాలునలేచి పర్ణశాలకుంబోయి మోడ్పుచేతులతో నేలంజాగిలిబడి బ్రహ్మరంధ్రంబు పగిలి రక్తప్రవాహము గారుచుండ దీర్ఘనిద్రాముద్రితనయనుండై యున్నయాయతిసత్తముం జూచి గుండె గుభాలుమన జేతనున్న కమండలువు జాఱవిడిచి హా! గురువరా! హా! కారుణికోత్తమా! హా తపోనిధానా! అని పలుకుచు నేలంబడిపోయి మూర్ఛిల్లెను. పెద్దతడవున కొడలుదెలిసి యతని మేనిపయింబడి మహాత్మా! నిన్నిట్లు చంపినవాఁడెవ్వఁడు? తండ్రీ! నీ వజాతశత్రుండవే నీ వెవ్వరి కపకారము చేసితివి? నీప్రభావంబున మృగము లన్యోన్యవైరంబులు విడిచి యాడికంబులు సేయుచుండ నీయందీసుబూనిన పాపాత్ముం డెవ్వఁడు? బాబూ! నీయుపన్యాసము వినిన నమృత మసహ్యమగుచుండునుగదా! అయ్యో! నీచావు గన్నులార చూచితిని నే నెంతపాపాత్ముండనో? చిరకాలము బ్రదికి చివర కిట్లు బలవన్మరణమునొందితివేమి సామీ! మొన్న నేదియో ప్రస్తావములో నే నిఁక నెంతకాలమో బ్రతుకను. నీకు వశిత్వాదివిద్య లుపదేశించెద నని చెప్పితి వింతలోం జావుమూడునని యనుకొనలేను తండ్రీ! హా! సిద్ధప్రవరా! కారుణ్యనిధీ! తపస్స్వరూపా! ఒకసారి నాతో మాటాడుము. నాదెసంజూడుము. అవసానోపదేశము సేయవా? ఆహా! మహా

నుభావులసాంగత్యము స్వల్పకాలమైనను దీర్ఘకాలప్రీతి గలుగఁజేయును గదా. అక్కటా! నాదారిని నేనుబోవక నీకడ కేలవచ్చితిని? ఆ! తెలిసినది. నానిమిత్తముననే నీ కీమరణము సంభవించినది. నాతో నీవు చనువుగా మాటలాడుచున్నావనియే వాని కసూయగలిగినది. భైరవా! యెందుబోయితివి? నీకితం డేమియపకారముచేసెను? నీవో నేనో కాక యితరు లెవ్వరున్నారు? నిష్కారణము గురుద్రోహి వైతివేమి? వీరిం జంపి యేమి మూటగట్టికొంటివి? సందియము లేదు. నీవే చంపితివి. అని భైరవు నుద్దేశించి పలుకుచుండ నాదాపునడాగియున్న భైరవుం డత్యంతభైరవుండై యందువచ్చి యేమిరా చారాయణా! ప్రేలుచుంటివి? ఈసిద్ధుని నేను జంపితినా? నీవు జూచితివా? నీవే చంపి నామీఁదఁ బెట్టుచుంటివి. తారతమ్య మెఱిఁగి మాట్లాడుము. ముందువచ్చిన చెవులకన్న వెనుకవచ్చినకొమ్ములు వాడిగలవను సామెతవలెను నీవువచ్చి నన్నాక్షేపించుచుంటివా? నాకంటె నీ కతండు దగ్గిరచుట్టమా? పో. పొమ్ము. నీవే చంపితివని గద్దించెను.

అప్పుడు చారాయణుఁడు కన్నీరుగార్చుచు నీమహానుభావుం జంపుటకు నా కేమియపకారము గావించెను? మనముగాక యితరులు లేరు. మృగములు రాయి నెత్తిమీఁదవైచి చంపనేరవు. నిన్న నీ వారాయిని తెచ్చుచుండ నేను జూచితిని. తప్పక నీవే చంపితివి. నీచా! నీ మొగము చూడఁగూడదు. నీకు యముఁ డెట్టినరకమిచ్చునో తెలియదు. మహాసాధువును నిష్కారణము జంపితివని క్రమక్రమప్రవర్ధమానంబగు కోపంబున నిందించుటయు వాఁడు, ఆఁ! ఏమీ నీ క్రొవ్వు! ఏమీ నీగరువము! నన్ను నీచా! యని సంబోధింతువా? యతిచావుమాట యటుండనిమ్ము. నీ బ్రదుకుమాట చూచుకొమ్ము. అనిపలుకుచు నంతకు పూర్వమే తనచేతిలోదాచియుంచిన యోషధిందీసి చారాయణుని శిరంబున రుద్ది యేదియో తా మెత్తు గట్టెను. అతం డప్పుడే యొకగాడిద

యైపోయెను. విధివిధాన మతిక్రమింప విధికే శక్యముగాదనిన-చో నితరులమాట జెప్పనేల.

క. చిరకాలజీవియగు న
ప్పరమతపోధనుని గురుని బలవంతముగా
శిరమున రాయిడి చంపిన
దురితాత్ముని కరుదె యవిహితుం బాధింపన్.

అని యెఱింగించి కాలాతీతమైనంత ననంతరవృత్తాంత మవ్వలి మజిలీయం దిట్లు చెప్పెను.

## 161 వ మజిలీ.

చారాయణుం డరిగినకొన్ని నెలలకు మల్లిక పుష్పవతియై మనోజ్ఞతేజంబునం బ్రకాశించుచుండెను. అల్లుఁడు వత్తునని చెప్పిన మితి దాటిన తరువాత బ్రహ్మదత్తునిభార్య దిక్కులి పరితపించుచుఁ గాకిఁగూసినఁ జారాయణుఁడు వచ్చునా అని ప్రశ్నమడుగును. పరదేశ మరుదెంచిన నతని వార్త లడుగుచుండును. సంతత మతనిరాకగుఱించియే చింతించుచు నొకనాఁడు భర్తతో నార్యా! కులశీలాదులం దెలియక మనము చారాయణునికిఁ బిల్లనిచ్చితిమి. అతండు పుస్తిగట్టి లేచిపోయెను. వానిగ్రామ మేదియో బంధువు లెవరున్నారో మనకుఁ దిన్నగాఁ దెలియదు. కేవలము విద్యనునమ్మి పిల్లనీయఁగూడదు. మల్లిక సిగ్గువెంపునఁ జెప్పదు కాని మాటునఁ గూర్చుండి యేదియో ధ్యానించుచుండును. ఏపేరవానికిచ్చినను నిల్లువదలకుండును. ఇప్పు డేమిచేయుఁదగినదని యడిగిన బ్రహ్మదత్తుం డిట్లనియె.

చారాయణుండు మహాపండితుండు. ఏమహారాజుసంస్థానములోఁ బూజింపఁబడుచుండెనో. రెండుమూఁడుదినములలో వచ్చిన లెస్సయే లేకున్న నేను ధారానగరంబున కరిగి యతనివృత్తాంతము దెలిసికొని వచ్చెద, మీరిందుండఁగలరా? అనిచెప్పిన నామె యంగీకరించినది.

మల్లిక యీమాటవిని తండ్రీ! మేముమాత్ర మొకసారి దేశవిశేష ములం జూడఁగూడదా? కూపస్థకూర్మమువలె నెల్లకాల మీయడవి నడుమ వసింపవలయునా? మమ్ముఁగూడఁ దీసికొనిపొండు అని బ్రతి మాలికొన్నది. అతం డంగీకరించి శుభముహూర్తంబునఁ గుటుంబముతో బయలుదేరి ధారానగరము మాళవదేశమందున్నదని తెలిసికొని యా దిక్కుగాఁ బోవుచుఁ గొన్ని దినంబుల కష్టాపథసత్రము జేరికొనియెను.

## —♦ అష్టాపథసత్రముకథ. ♦—

ఒకమహారణ్యమధ్యంబున నెనిమిదిదిక్కులనుండి వచ్చిన మార్గ ములు గలిసికొనినవి. అందొకపుణ్యాత్ముండు గొప్పసత్రమును గట్టిం చెను. దాని కష్టాపథసత్రమని పేరువచ్చినది. అందలిభూమి తృణకాష్ట జలసమృద్ధిగలిగి మధురరసఫలకుసుమదళబహుళములగు తరులతా గుల్మములచే నొప్పుచున్న యారామములచే మనోహరమై యున్నది. ఆసత్రమునకు మూఁడుయోజనములదూరములో గ్రామమేదియును లేదు. పాషాణకంటకదుర్గంబగు మార్గములచే వెలయుచున్నది. బాటసారులు మిక్కిలి దూరమునడిచివచ్చి యందు గొన్నిదినములుండి విశ్రాంతివహింతురు. అందు నాలుగువర్ణములవారికి భోజనసదుపాయ ములు చేయుదురు. ఏఁబదియాఱుదేశములవారు నాసత్రమున గూడి యుందురు. అన్నిభాషలు నన్నిదేశవిశేషములు నందు వినంబడుచుండును.

బ్రహ్మదత్తుం డాసత్రములోఁ గుటుంబముతో నొకగదిలోఁ బ్రవే శించెను. సత్రాధికారులు వారికిఁదగిన సదుపాయములు సేయుచుండిరి. సత్రాధిపతిం బొగడుచు ధర్మకర్తల నగ్గించుచు నుద్యోగస్థుల స్తుతియిం చుచు బ్రహ్మదత్తుండు కుటుంబముతోఁ గొన్నిదినము లందుండి దేశ విశేషములం దెలిసికొనెను.

ఒకనాఁడు రాత్రి పండువెన్నెలలు గాయుచుండెను. బ్రాహ్మణు లెల్లరు భుజించి సత్రముముందరి విశాలవితర్దికలపైఁ గూర్చుండి వింత

మాటలం జెప్పుకొనుచుండిరి. బ్రహ్మదత్తుండు వారిమాట లాలించుచు నోరగాఁ గూర్చుండెను. ఒక తార్కికునకు కవికి నిట్టి సంవాదము జరిగినది.

తార్కికుఁడు—కవీంద్రా ! నీవు ధారానగరంబునుండి వచ్చితి నని చెప్పితివికదా, భోజుండు కవికల్పభూజుండని చెప్పుదురు. ఆ వదాన్యుండు కుశలియై యున్నవాఁడా ? కవీంద్రులనేకాక తండితులగూడ సత్కరించునా ?

కవి—ఆరాజిప్పు డాయూరలేడు. కుపితుండై యరిగిన కాళిదాస కవిం దీసికొనివచ్చుటకై విదేశమున కరిగెనని చెప్పిరి. ఆయనకుమారుఁడు విద్యాంసుల నాదరించుచున్నాఁడు కాని పరీక్షలు లేవు. మీరేమైనఁ గవిత్వము సెప్పఁగలరా ?

తార్కికుఁడు—ప్రౌఢముగాఁ జెప్పలేను. అలవాటుచేయుచున్నాను. అబ్బా ! అది సహజముగానుండవలయునుగాని బలవంతముచేసిన విరసముగా నుండును. ఒకచరణము మాదిరిగా రెండవది కుదరదు. నే నొకశ్లోకము రచించితిని వింటిరా ?

కవి—ఇప్పుడు నిద్రవచ్చుచున్నది. రేపు వినియెదనులెండి. మఱి యేవేని విశేషములు చెప్పుదురు.

తార్కి—శ్లోకము వినుటకు నిద్రవచ్చుచున్నదా ? విశేషములకు నిద్రరాదూ ? పోనిండట్లె చెప్పెదవినుండు. పురందరపురవిశేషములు వింటిరా ?

కవి—ఆరాజకూఁతురు సరస్వతిమాటయేనా ? ఆమెకడ మీ తార్కికములు నాకవిత్వము నిలువవు. ప్రతిపండితుఁడు నామెకు మ్రొక్కవలసినదె. అవిశేషము చెప్పనక్కఱలేదు.

తార్కి—అయినది. వినుండు. కుచుమారుండనుపండితుఁ డామె నన్నివిద్యలలో నోడించి పెండ్లిచేయమనుచున్నాఁడు.

కవి—అందులకుఁ బ్రార్థనయేటికి ? ఆమె యట్టిప్రకటనమే

చేసియున్నదే.

తార్కి — అక్కడనే సందిగ్ధముగానున్నది బ్రాహ్మణుని పెండ్లి యాపుటకిష్టములేక కాంబోలు నేవియో ప్రతికూలములు సెప్పియాటంక ము గలుగఁజేయుచున్నది.

కవి — మీరు రంపుఁబోయితిరా?

తార్కి — గొప్పవివాహము జరగును సంభావన దొరకునని పోయితిని. ఏదియు లేకపోయినది.

ఆసంవాదము విని బ్రహ్మదత్తుఁడు ముందరికివచ్చి కవీశ్వరునితో నార్యా! మీరు ధారానగరమునుండి వచ్చుచున్నామని చెప్పితిరి. అందుఁ జారాయణుఁడను పండితుండు గనంబడలేదుగద. అతనిమిత్రులు దత్త కాదులు మహావిద్వాంసు లార్వురుండవలె. వారిపాడుక పురమంతయు వ్యాపించియేయుండును. వింటిరా? అని అడిగిన నేను మూఁడుదినములు మాత్రమే యందుంటిని. వారిపేరు వినలేదని చెప్పెను.

అప్పుడు వేఱొకప్రక్కం గూర్చున్న యొకబ్రాహ్మణకుమారుఁ డాప్రాంతమునకువచ్చి బ్రహ్మదత్తుని మొగము పరీక్షించిచూచి మీ రెవ్వరు? చారాయణుని దత్తకాదుల నడుగుచున్నారు. వారి నెఱుఁగుదురా యేమి? అని యడిగిన బ్రహ్మదత్తుం డిట్లనియె.

అయ్యా! చారాయణుఁడు మార్గవశంబున మాయింటి కతిథి గా రాఁగా నతనికి నాకూఁతురు మల్లిక నిచ్చివివాహము గావించితిని. దత్తకాదులు తనమిత్రులనియు ధారాపురంబునఁ దననిమిత్తము వేచి యుందురనియు వారిం గలిసికొని వేగముగా వత్తునని చెప్పి యరిగెను. చెప్పినమితి దాటినది. అతనిజాడ యేమియుం దెలియలేదు. అతని వెదకు చుఁ గుటుంబముతో బయలుదేరితినని తనవృత్తాంత మంతయుఁ జెప్పెను.

ఆకథవిని యావిప్రకుమారుండు సంతసించుచు నోహో! మీ

రు మాచారాయణునికిఁ బిల్లనిచ్చితిరా? అట్లైన మాకును బూజ్యులే. నే నామిత్రులలో నొక్కరుఁడను. నాపేరు ఘోటకముఖుఁడందురు. నామిత్రులందఱు నీపాటికి ధారానగరము చేరియుందురు. నాకు దారిలోఁ గొన్నివిఘ్నములు తటస్థించినవి. అందులకై క్రుమ్మఱుచుంటిని. ఒకమహాసీయునిభార్యను భైరవుఁడనువాఁడు హరించెను. వానినిమిత్తము తిరుగుచుంటిని. వాఁడిప్పుడు పురందరపురమున నున్నట్లు వార్తలు దెలిసినవి. మే మందుఁ బోగలము. మీరు తిన్నగా ధారానగరమున కరుగుఁడు. అందఱు నందుఁ గనంబడుదురని తనకథ నెఱింగించెను.

బ్రహ్మదత్తుండు ఘోటకముఖుం గౌఁగిలించుకొని ఆర్యా! నీ మాట చారాయణుఁ డెఱింగించియుండెను. నీవు గనంబడుటచే సగము విచారము వోయినది. నీమిత్రునిభార్యను జూతువుగాని రమ్ము. సర్వదా అతని నిమిత్తము విచారించుచుండునని పలుకుచు నతనిచేయిపట్టుకొని తనగదియొద్దకుఁ దీసికొనిపోయి పుత్రికతో నాతనిచారిత్ర మెఱింగించెను. మల్లిక ప్రీతిసూచకములగు చూపులచే నతనిం జూచుచు సిగ్గుపెంపున నేమియు మాటాడినదికాదు.

తదాకారలక్షణంబులు పరీక్షించి సంతసించుచు నామె యేమైనం జదివికొన్నదా? అని యడిగెను. నీమిత్రుఁడు చదువుపరీక్షించియే చేసికొనెనని యతం డుత్తరము జెప్పెను. పిమ్మట ఘోటకముఖుండు బ్రహ్మదత్తుని దనగదియొద్దకుఁ దీసికొనిపోయి భోజుంజూపుచు నీయుదారుని దార నరయుటకై తిరుగుచుంటిమని చెప్పుచు భోజునితో బ్రహ్మదత్తుని వృత్తాంత మెఱింగించెను.

అతండు భోజుండని ఘోటకముఖునికే తెలియనప్పు డితరులకెట్లు తెలియును. బ్రహ్మదత్తుండు గొప్పపండితుఁడు కవియని విని భోజుండు లేచి నమస్కరించె. అతని రూపలక్షణంబులు పరీక్షించి యెవ్వఁడోయొక దేశాధికారియని నిశ్చయించి తగినట్లాశీర్వదించెను. ఆరాత్రి

వారు చాలసేపు విద్యావిషయంబుల ముచ్చటించిరి. ఘోటకముఖుండు భోజునితో భైరవుండను తాంత్రికుఁడు పురందరపురములోనున్నట్లు వర్తమానము తెలిసినది. మన మందు పోవలయునని సూచించెను. ఆయన యందుల కంగీకరించెను.

మఱునాఁడు భోజుండును ఘోటకముఖుండును పురందరపురమున కరుగుచు బ్రహ్మదత్తుఁడున్న గదియొద్దకువచ్చి యతనితో ముచ్చటించుచు మల్లిక ప్రౌఢముగాఁ గవిత్వము చెప్పఁగలదని విని భోజుండు మిగుల నానందించుచుఁ బుత్రీ! నేను నీకుఁ దండ్రివంటివాఁడ. నాకడ సిగ్గుపడనవసరము లేదు. నాకుఁ గవులయందుఁ జాలప్రేమగలదు. ఏదీ? యొక్కశ్లోకము రచించి శ్రోత్రానందము గావింపుమని సాదరముగాఁ బలికెను.

అప్పు డాచిన్నది ఇంచుక తలవాల్చి మహాత్మా! స్త్రీవిద్య యల్పమైనను గొప్పగాఁ జెప్పికొందురు. మీవంటి మహావిద్వాంసులకడ నేనొక పండితురాలననియుఁ గవిననియుం జెప్పికొనఁగలనా! అయినను మీరు నన్నాదరించి యడిగినప్పు డుపేక్షించుట న్యాయముగాదు దేనిగుఱించి వర్ణింపవలయునో మీరే నిరూపింపుఁడు. నాశక్తికొలఁది శ్లోకము గావింతునని మృదుమధుర వాక్యములతోఁ బలికిన సంతసించుచు భోజుండు ముందుగా నీసమస్య నిచ్చి పూర్తిచేయుమనెను.

శ్లో॥ క్రియాసిద్ధిస్సత్వేభవతి మహతాంనోపకరణైః

ఆసమస్యను బ్రహ్మదత్తుండును భార్యయు ఘోటకముఖుండును మల్లికయుఁ బూర్తిజేసిరి.

బ్రహ్మదత్తుఁడు—

శ్లో. ఘటోజన్మస్థానంమృగపరిజనోభూర్జవసనో
వనేవాసః కందాదికమశనమేవంవిధగుణః ।
అగస్త్యః పాథోధిం యదకృతకరాంభోజకుహరే
క్రియాసిద్ధిస్సత్వేభవతి మహతాంనోపకరణైః॥

బ్రహ్మదత్తునిభార్య—

శ్లో. రథస్యైకంచక్రం భుజగనమితాస్సప్తతురగా
నిరాలంబోమార్గశ్చరణ వికలస్సారథిరపి।
రవిర్యాత్యేవాంతం ప్రతిదిన మపారస్యనభసః
క్రియాసిద్ధిస్సత్వేభవతి మహతాంనోపకరణైః॥

ఘోటకముఖుఁడు—

శ్లో. విజేతవ్యాలంకా చరణతరణీయోజలనిధిః
విపక్షఃపౌలస్త్యోరణభువిసహాయాశ్చకపయః।
పదాతిర్మర్త్యోసౌసకలమవధీద్రాక్షసకులం
క్రియాసిద్ధిస్సత్వేభవతి మహతాంనోపకరణైః॥

మల్లిక—

శ్లో. ధనుఃపౌష్పం మౌర్వీమధుకరమయీ చంచలదృశాం
దృశాంకోణో బాణస్సుహృదపిజడాత్మాహిమకరః।
స్వయంచైకోనంగ స్సకలభువనం వ్యాకులయతి
క్రియాసిద్ధిస్సత్వేభవతి మహతాంనోపకరణైః॥

మహాత్ములకుఁ గార్యసిద్ధి ప్రభావముచేతనే యగును. ఉపకరణములతోఁ బనిలేదు అని సమహార్థము. కుండయందు బుట్టి మృగములతోఁ గూడి యడవివసించెడు నగస్త్యుఁడు సముద్రమును గ్రోలెను. తాను మనుజుండై శ్రీరాముఁడు కోతులతోఁ గూడి సముద్రమున రాళ్లు తేలించి లంకను ముట్టడించి రావణుని సంహరించెను. ఒకచక్రముగలబండినెక్కి నిరాలంబమగు నాకాశమున కాళ్లులేని సారథితో సూరుఁడు తిరుగుచున్నాఁడు. కావున మహాత్ములకు సాధనము లవసరములేదని బ్రహ్మదత్తుఁడు భార్య ఘోటకముఖుఁడు చెప్పిరి. మల్లిక పుష్పధనుస్సు తుమ్మెదలనారియుం గలిగి స్త్రీల చంచలదృక్కులయొక్క వారచూపులు బాణములుగాఁ జేసికొని మన్మథుఁడు దేహములేనివాఁడైనను మూఁడులోక

ముల వ్యాకులపెట్టుచున్నాఁడు అని మల్లిక చెప్పినది.

ఆనాలుగుశ్లోకములలో మల్లికచేసినశ్లోకమే చాల రసవంతముగా నున్నదనితలంచి భోజుండు దాని కక్షరలక్ష లిచ్చుటకు మనంబున నిశ్చయించి యెల్లరు విన మల్లికను బెద్దగాఁ బొగడి మేము కొలఁదిదిన ములలో ధారానగరము వత్తుమనియు నప్పుడు తిరుగా దర్శనముచేయు దుమని చెప్పి బ్రహ్మదత్తుని యనుజ్ఞపుచ్చుకొని భోజుండు ఘోటకము ఖునితోఁగూడఁ బురందరపురమున కరిగెను.

బ్రహ్మదత్తుండు కుటుంబముతో ధారానగరంబునకుఁ బోయెను. అని యెఱింగించి యవ్వలికథ మఱల నిట్లు చెప్పఁదొడంగెను.

## 162 వ మజిలీ.

### —♦ పురందరపురము.

పురందరనగరాధీశ్వరుండగు హిరణ్యగర్భుండు ధర్మసందేహ మొండుతీర్పదలంచికొని సుప్రసిద్ధులగు పండితులను బండితప్రభువులను రమ్మని యాహ్వానపత్రికలు వ్రాయించెను. సభాదివసంబునకు నానా దేశములనుండి రాజులు కవిరాజులు తమతమ బిరుదములతో వచ్చి పుర ము నిండించిరి. దానంజేసి యాపట్టణ మప్పుడు బహుజనాకీర్ణమై రథహ స్తిపత్తిసంకులంబై భేరీపటహవేణువీణాదిమంగళవాద్యముఖరితంబై యొ ప్పుచుండెను.

భోజుండును ఘోటకముఖుండును దైవికముగా నాఁటికే యవ్వీ టికిం బోయిరి. వీధులలో జనులు గుంపులుగుంపులుగా మూగికొని సర స్వతిమాటలం జెప్పుకొనుచుండిరి. కొందఱు కుచుమారుని గుఱించి ముచ్చటింపుచుండిరి. ఒకచోటఁ గొందఱు శృంగారపురుషులు సరస్వ తీవివాహమును గుఱించి యిట్లు సంభాషించిరి.

ఒకఁడు—నేఁటితో నేదోయొకటి తేలఁగలదు. అతండు జామా తయో ప్రేతయో కాఁగలఁడు.

వేఱొకఁడు — అతఁడు కుసుమారుఁడు కాడని యెవ్వరు నిర్ధారణచేయఁగలరు ?

ఒకఁడు — నిర్ధారణకొఱకు కాదే యీసభ జరగుచున్నది.

ఇంకొకఁడు — గొప్ప గొప్ప మహారాజులు విద్వాంసులు చాలమంది వచ్చిరి. తిరిగి పరీక్షించుట కొడఁబడి విజయమందినచో జామాతయే లేనిచో ప్రేతయే యగును.

ఒకఁడు — అఱువదినాలుగువిద్యలయందుఁ బరిచయము గలిగిన భోజమహారాజు సరస్వతియవతారావతారమైన కాళిదాసకవితో వచ్చి యీసభాధిపత్యము వహించునఁట. నిజము తెలియునా ?

మఱియొకఁడు — ఏమీ ? భోజమహారాజే అగ్రాసనాధిపతి ? కాళిదాసకవికూడ వచ్చునా ? ఆహా ! ఆమహాసభ చూడవలసినదే. చోటు దొరకదేమో ముందుగాఁ బోవలయును.

ఇంకొకఁడు — చోటా ? భూమండలమందలి జనులందఱు వచ్చినను సరిపడును. మహారాజుగారు మంచియేర్పాటు చేయించిరి. ఆసభాభవనము మనపట్టణమంత యున్నది. ఎందుగూర్చుండినను సమముగాఁ గనంబడును.

మఱియొకఁడు — భోజుఁడును గాళిదాసకవియు వచ్చినచో నీపాటికీ దత్ప్రభ పట్టణమంతయు వ్యాపింపకుండునా? ఆమాట యెవ్వరును జెప్పుకొనుట లేదేమి ?

ఒకఁడు — వారు సభాసమయమునాఁటికిఁ దిన్నగా సభకే వత్తురు. ముందుగా వచ్చి కూర్చుందురా యేమి ?

మఱియొకఁడు — ఎట్లైనను ముందుగాఁబోయి యామహనీయుల దర్శనముసేసి కృతార్థులమగుదముగాక.

ఒకఁడు — ఇందలి నిజ మేమనియెదరు ? ఈరాజపుత్రిక విభూతిరాయనిఁ బతిగాఁ బడయ నిష్టములేక యట్లనుచున్నదేమో ? స్త్రీలచేష్టి

తముల నెవ్వఁడు గ్రహింపఁగలఁడు ?

మఱియొకఁడు—నిజముగాఁ గాళిదాసేవచ్చినచో నిజము బయ ల్పడకపోవునా ? ఆమహాకవిని గుఱించి యనేకకథలు చెప్పుకొనుచుం దురు. ఈకుచుమారునిమూలమున నాపుణ్యపురుషుల దర్శనము కలుగు చున్నదిగదా !

అని మాటలాడుకొనుచు నాపురుషులు నిష్క్రమించిరి. వారి మాటలు విని భోజుండు ఆహా ! మహానుభావుఁడగు కాళిదాసునిమూ లమున నాపేరుగూడ వాడుకపడినది. అట్టియుత్తముని నవమానపఱచిన నాపాపమునకు నిష్కృతి గలదా ? అందులకే యిట్టిదుఃఖములం గుడు చుచున్నాను. ఇఁక గాళిదాసకవి యుండు నెలవరయవలయునని యా లోచించుకొనుచు ఘోటకముఖుంజూచి ఆర్యా ! నీ వాపురుషులతో నేదియో మాటలాడుచుంటివి. విశేషము లేమైనం దెలిసినవియా? అని యడిగిన నతం డిట్లనియె.

కుచుమారుండు నామిత్రుఁడని మీ కెఱింగించితినికదా ? అతం డఱువదినాలుగువిద్యలు వచ్చినప్రోడ సరస్వతి నతఁడే జయించెను. చిలు కచేత వాదము చేయించెనఁట. ఆవిద్య మాకుఁగాక యొరులకు రాదు. అతం డేమయ్యెనో తెలియదు. మఱియొకఁడువచ్చి నేనే కుచుమారుం డనని చెప్పుచున్నాఁడఁట. అఱువదినాలుగువిద్యలు భోజునకు వచ్చునని కాళిదాసకవితోఁగూడ రమ్మని వార్తల నంపిరఁట. వారు వత్తురఁట. ఆవింత మనముగూడఁ జూడవలసినదే. ఆమాటలే వారు నాతోఁ జెప్పు చున్నారని పలికెను.

భోజుండు విషాదమేదురహృదయుండై వా రెక్కడవత్తురు ? వీ రికంటె వారు గొప్పవారా ఏమి ? అదియట్లుండె మీరుకూడ పండితు లేకదా ? ధర్మనిర్ణయము సేయునప్పుడు మీరును గొంతభారము వహిం పవలసినదే. పోవుదము పదుఁడు అని ప్రబోధించెను.

అని వారిద్దఱు ముచ్చటించుకొనుచుఁ బట్టణవిశేషములఁ జూచి

కొనుచు సభజేయుసమయము దెలిసికొని సభాకార్యదర్శియొద్దకుఁ బోయి పండితులమని చెప్పి యనుమతిపత్రికలం దీసికొని (టిక్కెట్టు) ముందుగనే సభకుఁ బోయి యొకచోటఁ గూర్చుండిరి.

ఆసభాభవనము సుధర్మవలెఁ గమనీయరత్నవితానకల్పితసోపానములచే విరాజిల్లుచున్నది. క్రమోన్నతమగు పీఠశ్రేణులచే (గేలరీలు) నొప్పుచు వేలకొలఁదిజనులు కూర్చుండుటకుఁ దావుగలిగియున్నది. క్రమంబున విద్వాంసులు విద్వత్ప్రభువులు పౌరులు ప్రేక్షకులు వేనవేలు వచ్చి సభ నలంకరించిరి. సభాభవనమంతయు జనులచే నిండింపఁబడి చిత్రితంబో యన నిశ్శబ్దంబై యుండెను.

అప్పుడు సరస్వతితంత్రియగు హిరణ్యగర్భుండు సమున్నతవిశాలంబగు నగ్రవేదికపై నిలువంబడి యెల్లరు విన నుచ్చస్వరంబున నిట్లుపన్యసించెను. సభ్యులారా! నాకొక ధర్మసందేహము గలిగి దానిం దీర్చుకొనుటకై మిమ్ముల నెల్ల రావించితిని. నాయందు దయయుంచి మీరెల్ల విచ్చేసినందులకు మీయెడ నేను గృతజ్ఞుఁడ నయ్యెద. మఱియుఁ జతుష్షష్టికళావిశారదుఁడగు భోజమహారాజుగారి నీసభాధ్యక్షునిగాఁ జేయఁదలంచి వారికి వర్తమానము సేసితిని. వారు గ్రామాంతర మరిగినట్లు వార్తవచ్చినది. కాళిదాసమహాకవియు నిప్పు డాభోజునియాస్థానమున లేఁడనియు నల్లాణభూపతియొద్ద నున్నాఁడని తెలియవచ్చుటచే నక్కడికి దూతలం బుచ్చితిని. ఆమహాకవి రాఁజాలనని తెలియపఱచెను. ఇప్పు డీసభాధ్యక్షు నెన్నుకొనవలసియున్నది. అందులకు సమర్థుఁ డెవ్వఁడో తెలియదు. సభాసదులే యట్టిసమర్థుని నిరూపింపవలయును. అతండు సెప్పినట్లు నడుచుకొనువారమని పలికి యొకపీఠంబునఁ గూర్చుండెను.

అప్పుడు కొందఱు విద్వాంసులు లేచి అయ్యా! గోవర్ధియుండను మహారాజు గొప్పవిద్వాంసుఁడు. అఱువదినాలుగువిద్యలు నేర్చిన ప్రోఁడ. భోజునికన్న నధికుండు. ఆక్షితిపతిని సభాధ్యక్షునిగాఁ జేయుఁడని చెప్పిరి. మఱికొందఱు మఱియొకనిఁ బేర్కొనిరి. అప్పుడు భోజుఁడు లేచి

దక్షిణహస్త మెత్తి మహారాజా! ధర్మసందేహమును గుఱించి వితర్కముపచ్చినప్పు డెఱుఁగినమాట చెప్పకతీఱునుకదా? ఘోటకముఖుండను మహాపండితుండు వచ్చియున్నవాఁడు. చతుష్షష్టికళాపాండిత్యము గలిగియున్నవాఁ డాతఁడే సభాపతిత్వమున కర్హుండని పెద్దకేక పెట్టెను.

హిరణ్యగర్భుండు వారివారిమాటలు విని సభ్యులచే నెన్నఁబడిన వారినందఱను ముందరకు రప్పించి వారిలో నధికవిద్వాంసుఁ డెవ్వఁడో వారినే యేరికొనుమని నిరూపించెను. అందు రత్నకిరీటకటకాదిభూషణభూషితుండగు గోనర్దీయుం జూచియు ఘోటకముఖుండు గుఱుతుపట్టలేడు. గోనర్దీయుఁడు ఘోటకముఖునిగుఱుతుపట్టి ప్రక్కనున్న కుచుమారుని గోకుచు, అదిగో ఘోటకముఖుఁడు నన్నుఁదెలిసికొనలేడు వానికే సభాధిపత్య మిప్పింతము ఎట్లుచెప్పునో చూతుముగాక అని మెల్లఁగాఁ బలికెను. ఎవ్వరు నెవ్వరిని నేరుకొనలేడు. అప్పుడు సరస్వతితండ్రి పూజ్యులారా! మీమహిమ మీకకాక యితరులకుఁ దెలియదు. అఱువదినాలుగువిద్యలు నెఱింగినప్రోడగాని యీసభాధిపత్యము వహింప సమర్థుఁడు కాఁడు. కావున నట్టివా రెందఱుండిరో చేతు లెత్తవలయునని పలికిన గోనర్దీయుఁడు ఘోటకముఖుండుమాత్రమే చేతు లెత్తిరి.

వారిద్దఱిలో నెవ్వని నధ్యక్షునిగాఁ జేయవలయునోయని యాలోచింపుచుండ గోనర్దీయుఁడు ఘోటకముఖుండే సమర్థుండని చేయెత్తి చెప్పెను. ఎల్లరు కరతాళములు వాయించిరి. రాజు లేచివచ్చి ఘోటకముఖుని మెడలోఁ బుష్పమాలికవైచి యగ్రపీఠమునఁ గూర్చుండఁబెట్టెను.

అప్పుడు హిరణ్యగర్భుండు అయ్యా! వినుఁడు. సరస్వతి నా కూఁతురు. విద్యలలో నామెను జయించినవానికి వివాహముచేయుదునని ప్రకటించితిని. కుచుమారుండను బ్రాహ్మణకుమారుండు వచ్చి చిలుకచేతనే నాకూఁతు నోడించెనఁట. ఆమె వానివిద్యాపాటవమునకు మెచ్చికొని చిలుకచేతనే ముత్యాలహారముపంపి నీవే నాభర్తవని తెలియఁజేసినదఁట. తరువాత నాశుకము మార్జారభక్షితమైన దనిచెప్పి యాతఁడు

నేను కుచుమారుండనని ప్రకటించెను. అతఁడు వీఁడు కాఁడని యనుమానము చెంది తిరుగా మఱికొన్ని ప్రశ్నములిచ్చి సమాధానము జెప్పుమని యడిగిన నందుల కితం డొప్పకున్నాఁడు. చిలుకచేతనంపిన ముక్తాదామం బితనియొద్ద నున్నది. కుచుమారుం డతఁడు కాఁడని దాదులు చెప్పుచున్నారు. ఈసందియము మీరే తీర్పవలయునని పలికి రాజు తనపీఠంబునఁ గూరుచుండెను.

అప్పుడు సరస్వతిసఖురాలొకతె నిలువంబడి ఆర్యులారా! ఈతఁడు చిలుకచేతఁ బ్రసంగింపఁజేసిన కుచుమారుఁడు కాఁడు. ఆతని నేను జూచితిని. వానిరూపలక్షణములు మనోహరములుగా నున్నవి. ఈతఁడే యాతఁడైనచోఁ దిరుగాఁ బ్రశ్నల నడుగ నేమిటికిఁజెప్పకుండెడిని? మే మిచ్చినప్రశ్నములకు సమాధానము చెప్పించిన నీతని మన్నింతుము. లేకున్న శిక్షింపఁజేయుఁడు మిదియే మారాజపుత్రిక యభిప్రాయమని చెప్పినది.

తరువాత సభాపతి నీవేమిచెప్పెదవని కపటకుచుమారు నడిగెను. వాఁడు లేచి నిలువంబడి గద్గదస్వరముతో నిట్లనియె. నేను జిలుకకు నావిద్యలన్నియు నుపదేశించితిని. తన్మూలమున సరస్వతి నోడించితిని. దైవికముగా నాచిలుక పిల్లిచేఁ జంపఁబడినది ఆమె నీవే నాభర్తవని యుపాహారము నాకుఁ బంపినది. గడియగడియకుఁ బరీక్షింపుచుండ నుత్తరము చెప్పుటకు నా కవసరములేదు. వాదమున జయమో యపజయమో యొకసారిగాక పలుమారు గలుగునా? ఇఁక పదింబదిగఁ జెప్పనవసరము లేదు. వారు ప్రకటించినరీతిగా నాసరస్వతి నోడించితిని ఇష్టముండిన బెండ్లిచేయుమనుఁడు లేకుండిన నాకనుమతి నిప్పింపుఁడు నాదారిని నేను బోయెద. తిరుగాఁ బ్రసంగించుట కొడంబడను. ఇదియే నేను జెప్పునది. అని పలికి యూరకుండెను.

సభాపతి—(నవ్వుచు) కుచుమారునిచే నోడింపఁబడితిని. ఈతఁ డాతఁడు కాఁడని రాజపుత్రిక చెప్పుచున్నది. ఇందుల కేమందువు?

కుచు—అది యిష్టములేనిమాట. కానని యామె యెట్లు నిదర్శనము చూపఁగలను?

సభాపతి—నీవు తిరుగాఁ బ్రసంగించుట కొండంబడనికారణముచేత-

కుచు—అది నా కవమానకరమని మానివేసితిని.

సభ—ఆమాట యేమియు సమంజసముగా లేదు. ప్రసంగాధిక్యంబున విద్యలకు మెఱుఁగువచ్చునుగాని త్రుప్పుపట్టనేరదు. పోనీ యామెగాదు మే మడిగెదము సమాధానము చెప్పెదవా?

కుచు—నే నెవ్వరికినిఁ జెప్పఁదలఁచుకొనలేదు. (సభాసదులందఱు పకపక నవ్వుచున్నారు.)

సభాపతి—నీవు చదివినవిద్యలన్నియుఁ జిలుక కుపదేశించుటచే మఱపుజెందితివేమో యాలోచించుకొని చెప్పుము.

కుచు—ఆమాటయు వాస్తవమే.

సభ—పోనీ, నీకుఁ గుచుమారుండని పేరున్నట్లు మీగ్రామస్థులచేఁ జెప్పించెదవా?

కుచు—చిత్తము. చెప్పింపఁగలను

సభా—ఆగ్రామ మేదియో చెప్పుమిప్పుడే వారినిందు రప్పింతును.

అనుటయు వాఁ డేమియుఁ జెప్పలేక తబ్బిబ్బుపడఁజొచ్చెను. అప్పుడు సభాపతి లేచి యిట్లుపన్యసించెను.

శ్లో॥ ఆబద్ధకృత్రిమసటాజటిలాంసభిత్తి
రారోపితో యదిపదం మృగవైరిణః శ్వా।
మత్తేభకుంభతటపాటనలంపటస్య
నాదం కరిష్యతి కథం హరియూథపస్య॥

కుక్కకు కృత్రిమకేసరములుగట్టి సింహవేషమువైచి సింహంబు గూర్చుండుస్థానమునఁ గూర్చుండబెట్టినంత, మదపుటేనుఁగుల గండస్థలముల వ్రక్కలుచేయు సామర్థ్యముగల సింహముగర్జించునట్లు గర్జింపఁ

గలదా? వినుండు. ఈతఁడు కుచుమారుఁడు కాఁడు. కుక్కకును సింహమునకు నెంత తారతమ్యము గలదో వీనికిఁ గుచుమారునికి నంత తారతమ్యము గలదు. కుచుమారుఁడు మహాపండితుఁడు. నే నెఱుఁగుదు. అతండు నామిత్రుఁడు వానిపేరు వినియే నే నిందు వచ్చితిని. మే మిర్వురము సహాధ్యాయులము. కాశిలో నొక్కగురువునొద్ద జదివికొంటిమి. (శుకసారికాప్రలాపనం) అనువిద్య మాకుఁగాక యొరులకుఁ దెలియదు. నామిత్రుఁడే రాజపుత్రిక నోడించినమాట వాస్తవము. వీని కీయౌన్నత్వంబు గలుగఁజేయుతలంపుతో నాతఁడు మఱుఁగుపడి వీని నిట్లుచెప్పుటకుఁ బ్రోత్సహించెనని తలంచెదను. వాని కీయైశ్వర్య మొకలెక్కలోనిది కాదు. వీఁడు వట్టిశుంఠ వీనికడ నేమియు సంస్కారము లేనియట్లు వీనిమాటలే చెప్పుచున్నవి. రాజపుత్రిక బుద్ధిమంతురాలు కావున నిజముగ్రహించి యొడంబడకున్నది. ఆవిద్వాంసురాలీమూర్ఖుని బెండ్లియాడుట సమంజసము కానేరదు. కుచుమారుఁడే తగినవాఁడు. వాని వెదకి తెప్పించుట యుక్తము. వీఁడు కుచుమారుఁడు కాఁడు కాఁడు అని ముమ్మారు పలికి కూర్చుండెను. అప్పుడు సభ్యులెల్లరు నతని వక్తృత్వ మగ్గించుచుఁ గరతాళములు గొట్టిరి.

తరువాతఁ గోసర్ధియుఁడు లేచి సభ్యులారా! సభాధ్యక్షుఁడు నిజముదెలిసికొనియెను. సత్యము చెప్పెను. వీఁడు గుచుమారుఁడు కాఁడు మిత్రద్రోహి. కృతఘ్నుండు. మహాపాపాత్ముఁడు. యథార్థము చెప్పెద వినుండు. వీఁడు కుచుమారునితో వంటజేయుటకై వచ్చిన బానిసవాఁడు. వీనిపేరు శంబరుఁడు. ఈదుర్మార్గుఁడు సరస్వతి తన్నుఁ బెండ్లియాడునని యాసజెంది నిద్రించుచుండఁ గుచుమారునితలఁ బెద్దశిలచే నలియఁ గొట్టి కందకములోఁ బారవైచెను అని పలికి కన్నుల నశ్రువులుగ్రమ్మఁ గంఠము డగ్గుత్తికబడ సవరించుకొనుచున్నంత ఘోటకముఖుండు ఆఁ! ఏమీ? నామిత్రుండు కుచుమారుఁడు మృతుండయ్యెనా? హా మిత్రమా! హా వయస్యా! అని పెద్దయెలుంగున దుఃఖింపుచుండెను. రాజును

సభ్యులు శోకారావములు వెలయింపుచుండ గోసర్దీయుఁడు హస్తసంజ్ఞచే వారించుచుఁ గొంతువు సవరించుకొని వెలువరుఁడు. వెలువరుఁడు. కుచుమారుండు బ్రతికియేయున్నవాఁడు. వినుండు. దైవికముగా నాఁడు పల్లెవాండ్రు వలవైచి వానిం బైకిదీసి తమపల్లెకుఁ దీసికొనిపోయి కాపాడిరి

తరువాతఁ గొన్నినెలల కతండు చక్కఁబడి యొకరేవులో నావికాధిపతియైయుండఁ గుచుమారునివివాహవార్త బ్రాహ్మణులు చెప్పిన విని పరివారముతో నే నిందువచ్చుచు దారిలో నతనిం గలిసికొని యథార్థము దెలిసికొని పరితపించుచు నాతనితోఁగూడ నిందువచ్చితిని. ఆపురుషసింహుఁ డీసభలోనే యున్నవాఁడు. అని తనప్రక్కనున్న కుచుమారుం జూపుచు,

మ. ఇతఁడే నిర్మలశేముషీవిజితవాగీశుండు నానాకళా
దృతపాండిత్యవిశేషసంభృతయశస్స్నోమావృతాశాంతుఁ డూ
ర్జితవిద్వజ్జనవందితాంఘ్రియుగుఁ డుర్వీదేవుఁ డాకారని
ర్జితమారుం డగు కుచుమారుఁడు గుమారీదత్తహారుం డిలన్.

సీ. అఱువదినాల్గువిద్యలు నాఱుశాస్త్రంబు
లును సొంతముగఁ బఠించినఘనుండు
సిద్ధాసిలబ్ధవశిత్వమహత్వాప్తి
తనవిద్య మెఱుఁగువెట్టినతపస్వి
వరకళాజితసరస్వతి సరస్వతివార్త
విని ప్రసంగింపవచ్చినసుబుద్ధి
చిలుకచేతనె కళల్ పలికించి నెఱిమించు
కలికి మెప్పించినలలితమూర్తి

గీ. శంబరునిద్రోహమునఁ జచ్చి శబరకరుణ
మఱల బ్రదికిన విప్రకుమారుఁ డంగ
జితసుమారుఁడు కుచుమారుఁ డితఁడెసుండి!
అరి గురుద్రోహి శంబరుఁ డతఁడుసుండి!

అని చదివినంత సభ్యులెల్లరు లేచి నిలువంబడి ఆమహానుభావుఁ డేడీ! కుచుమారుఁ డేడీ! అని కలకలము చేయఁ మొదలుపెట్టిరి. కొందఱతనిపైఁ బుష్పములు జల్లిరి. హిరణ్యగర్భుఁ డా సంకులము వారింపుచు గోనర్దీయుం గౌఁగిలించుకొని మహాత్మా! మీ రెవ్వరో నే నెఱుంగను. మీకు వర్తమానమైనఁ జేయలేదు. ఆపద్బంధువులై వచ్చి నాయిక్కట్టు బాపితిరి. నిజము దెలియఁజేసితిరి. మీకుఁ గృతజ్ఞుఁడనై యుండెదను. మీకులశీలనామంబు లెఱింగించి నాకు శ్రోత్రపర్వము గావింపుఁడని వేఁడుకొనియెను. గోనర్దీయుఁ డిట్లనియె.

రాజా! మే మేడ్వురము సహాధ్యాయులము. కాశిలో నన్నివిద్యలం జదివితిమని చెప్పితినిగదా? దిగ్విజయముకొఱకుఁ దలయొకదారిం బోయి దేశాటనము చేయుచుంటిమి. ఇందు మువ్వురము వచ్చితిమి. ఈ సభాధ్యక్షుండు ఘోటకముఖుఁ డొకఁడు నేనొకఁడ నీతఁడు కుచుమారుఁడు నీయల్లుఁడని చూపుచుఁ దమవృత్తాంతము కొంత వివరించెను.

హిరణ్యగర్భుండు మారసన్నిభుండగు కుచుమారుం జూచి సంతోషపారావారనిమగ్నుండై యతనిపాదంబులంబడి మహాపురుషా! రాహుగ్రస్తుండైన సూర్యుండువోలె మఱుంగువడి మాపురాకృతవిశేషంబునఁ జేసి యిప్పుడు మా కాలోకోత్సవము గావించితివి. మేము కృతకృత్యులమైతిమి. నాపుత్రిక మిమ్ము మునుపే వరించినది. రాజ్యలక్ష్మితోఁగూడ సరస్వతిం బరిగ్రహింపుఁడు అని పలుకుచు నొకపుష్పమాల యతనిమెడలో వైచెను. అప్పుడగ్రాసనాధిపతిగానున్న ఘోటకముఖుఁడు సంతోషము పట్టఁజాలక గద్దియ డిగ్గనురికి మిత్రులారా! వచ్చితిరా! అని పలుకుచు గోనర్దీయునిఁ గుచుమారునిఁ గౌఁగిలించుకొని యానందబాష్పములచే వారిం దడిపెను. వారును సంతోషముతోఁ బ్రత్యాశ్లేషము గావించిరి. అప్పుడు గోనర్దీయుఁడు వయస్యా! నిన్ను మేము గుఱుతుపట్టితిమి. నీవు మమ్మానవాలు పట్టలేకపోతివి. ఈసందేహము గుఱించి నీ వెట్లుచెప్పెదవో యని మేము నీతో మాట్లాడలేదు. నిజము

గ్రహించి చెప్పితివి. మనకుచుమారుఁడు పునర్జన్మము నెత్తెనని యావృత్తాంతము మరల వానితోఁ జెప్పెను. తాను రాజైనతెరంగును సంక్షేపముగాఁ జెప్పి మేమువోలె నీవుగూడ నింకను ధారానగర మరుగలేదా? దత్తకాదిమిత్రులు మననిమిత్తమై వేచియుందురు. నేను సింహాసన మెక్కియందుఁ బోవలయునని ప్రయత్నముచేయుచుండ నంతలోఁ గుచుమారుండు సరస్వతిని వివాహమాడుచున్నాఁడనువార్త విని యిందువచ్చితిని. కుచుమారునివివాహ మైనతరువాత మన మందుఁ బోవుదము. ఈరాజ్యములు మనమేడ్వురము సమముగాఁ బంచుకొనవలయును. అని పలికిన విని సంతసించుచు ఘోటకముఖుండు సుఖదుఃఖసములమగు మన కీభేద మేలకల్గెడిని? మనచారాయణుఁ డొకపండితపుత్రికం బెండ్లియాడి ధారానగరమున కరిగెను. నే నీపాటికి ధారానగర మరుగవలసినవాఁడనే. ఒకస్నేహితునిభార్య నొకతాంత్రికుఁడు హరించెను. వాని మూలమున దేశాటనము చేయుచుంటిని. ఆమహాసీయుని కులశీలనామములు నాకుఁ దెలియవు. ఆతఁడు సెప్పలేదు. నే నడుగలేదు. ఆకూర్చున్నవాఁడే యతఁడని నిరూపించిచెప్పెను. అంతలో భోజుండు వారికడకువచ్చి నమస్కరించుచుఁ దత్పాండిత్యముగుఱించి మిక్కిలి యగ్గించెను.

వారునలువురు జనాంతికముగా మాట్లాడికొనుచుండఁగాఁ గొంతసే పుపలక్షించి హిరణ్యగర్భుండు వారితో నార్యులారా! కాలాతీతమైనది. చెప్పవలసినమాటలం జెప్పితిరి. చేయవలసినవిధానము తేలినది. నిజము బయలుపఱచితిరి. ఇఁక నీశంబరుని కేమిశిక్షవిధింపవలయునో సభాధ్యక్షుఁడు చెప్పవలసియున్నది. ఆమాట వినుటకు సభ్యులు తొందఱపడుచున్నారని పలికిన విని ఘోటకముఖుఁడు మోడియుఁ బీఠమెక్కియెల్లరు విన వీఁడు మిత్రద్రోహి. పాపమునకు వెఱచువాఁడుకాఁడు. ఇట్టివాఁడుండిన లోకమున కపకారమగును. వీని కుఱిశిక్ష విధించుట యుచితము. వీఁడు తన కేమియుపకారముసేయుదువని కుచుమారు నడిగెనఁట. అతఁడు నామిత్రులతో నాలోచించి నీకుఁ దగినయుపకారము సేసెద

నని చెప్పెనఁట. అట్లుచెప్పినను విశ్వాసములేక పరమశాంతమూర్తి విద్యాస్వరూపుని జంప యత్నించిన యీకృతఘ్నుని కరుణింపరాదని పలికెను. సామాజికులెల్ల నది యుచితముచితమని యేకగ్రీవముగాఁ గేకలుపెట్టిరి.

కుచుమారుఁ డందుల కీయకొనక వీనితలిదండ్రులు చాలమంచి వారు. నాకు భోజనముపెట్టి సరస్వతీవృత్తాంతము చెప్పుచు సహాయముగా నావెంట వీని నంపిరి. జాగ్రత్తగాఁ గాపాడుమని చెప్పిరి. వీఁడు దుర్మార్గుఁడైనను వారింజూచి వీనిని మన్నింపుఁడని వేఁడుకొనుచున్నాను. వారింటగుడిచిన విశ్వాసము నన్నిట్లు చెప్పుటకుఁ బ్రేరేపించుచున్నది. ఏమి చేయుటకును మనము కర్తలముకాము. భగవంతుఁ డొకనివలన భయము గలుగఁజేసి మఱియొకనివలన నాభయము పోఁగొట్టుచుండును. అని యుక్తియుక్తముగా నుపన్యసించి వాని శిక్షింపకుండఁ గాపాడెను. అతని కృపాళుత్వ మెల్లరు స్తుతియించిరి. అంతటితో సభముగించి హిరణ్యగర్భుండు కుచుమార గోనర్దీయ ఘోటకముఖ భోజులకుఁ బ్రత్యేకము దనకోటలో విడిదలనియమించి యందుఁ బ్రవేశపెట్టి గౌరవింపుచుండెను.

ఆవృత్తాంతమంతయు సఖురాలివలన విని సరస్వతి మిగుల నానందించుచు మఱియొకచిలుకను విద్యలుగఱపుమని చెలికత్తెచేతికిచ్చి కుచుమారునొద్ద కనిపినది. కుచుమారుం డాకీరమును దువ్వుచు నస్తిమాలఁదగిలించి నవ్వుమాటలగా దానికి విద్యల నుపదేశించి పంపెను.

ఆచిలుక వెనుకటిచిలుకకన్నఁ బ్రౌఢముగా సరస్వతితోఁ బ్రసంగించి యోటుపఱచినది. అప్పుడప్పుడఁతి ప్రహర్ష సాగరమున మునుఁగుచుఁ దనసంతోషమును బత్రికాముఖముగా నతనికిఁ దెలియఁజేసెను.

హిరణ్యగర్భుండు శుభముహూర్తమున సరస్వతినిఁ గుచుమారునికిచ్చి వివాహము గావించెను. భోజుండు ఘోటకముఖుండును గోనర్దీయుఁడుఁ బెండ్లిపెద్దలై మహోత్సవములఁ బెక్కులు గావింపఁజేసిరి. వేడుకలతోఁ గొన్నిదినములు గడిపి ఘోటకముఖుం డొకనాఁడు

కుమారగోనర్దీయులతో మిత్రులారా! మీరిరువురు మహారాజులైరి. మీకతంబున మేము నట్టివారమే యగుదుము. మనమిత్రులు మననిమిత్తమై ధారానగరంబున వేచియుందురు. మీరా రందుఁ బోవుఁడు. భైరవుం డేకశిలానగరంబుదెస కరుగుచున్నాఁడని వింటిమి. ఈతండును నేను నందుఁబోయి వానివార్తఁ దెలిసికొని ధారానగరంబున కరుదెంతుము. ఈతఁడు మనకు నెనిమిదవమిత్రుఁడు. తానుగూడ నన్నగరమువచ్చి మనమిత్రులం జూతునని చెప్పుచున్నాఁడు. మనవేడుకలు చూచి చూచి రమ్మనలేక మొగమోటపడుచున్నాఁడు. మే మందుఁ బోవుటకు సమ్మతింపుఁడని కోరిన వారట్లకే యంగీకరించి రాభోజుండును ఘోటకముఖుండు నటఁగదలి యల్లాణక్షోణిపాలుని పట్టణంబునకుఁ బోయిరి.

అని యెఱింగించి మణిసిద్ధుండు మిగిలినకథ దరువాతిమజిలీయందుఁ జెప్పఁదొడంగెను.

## 163 వ మజిలీ.

### అల్లాణరాజుకథ.

శా. అల్లాణుండను భూమిపాలుఁడు వదాన్యత్వప్రభావంబునన్
ముల్లోకంబులఁ బేరుపొంది సతతంబున్ శంభుభక్తార్చనా
సల్లాపంబులఁ బ్రొద్దుపుచ్చుచును సంస్థానంబునం దార్యవి
ద్వల్లోకంబులు సత్కృతుల్ వెలయ నింద్రప్రాభవం బొప్పఁగాన్.

ఏకశిలానగరంబు రాజధానిగాఁ జేసికొని ధర్మంబునఁ బ్రజలం బాలింపుచుండెను. అతనికే భళ్ళానుండను నామాంతరము గలదు. అతఁడు సంతతము మహేశ్వరార్చన సేయుచుండును. సర్వవిద్యాలోలుండై కవీంద్రులఁ బండితులఁ బెద్దగా నాదరించును. శిబికర్ణదధీచుల మించినవదాన్యుఁడు నిత్యము పమగురమహేశ్వరుల నర్చించి యిష్టాపూర్తములచేఁ దృప్తిఁబొందింపుచుండును. ఏమహేశ్వరుఁ డేదికోరినను నిచ్చుట వ్రతముగా నియమము సేసికొనియెను.

ఆక్షితిపతి యర్ధాంగలక్ష్మి సువ్రత. ఆపతివ్రత యరుంధతికిఁ దప్పాలుపట్టఁగలదు. రూపంబున రతియు విద్యల భారతియు నామెం బోలఁజాలరు. ఆమెసుగుణంబులు వర్ణింప సామాన్యునికి శక్యముగాదు. ఆపుణ్యవతి పతికిఁ బ్రాణములోఁ బ్రాణమై నియమములకు సహకారిణియై వర్తింపుచుండెను.

ఒకనాఁడు పశుపతియను మహేశ్వరుం డతనియింటి కతిథిగా వచ్చెను. అతనిప్రాయము ముప్పదియేండ్లకు లోపుగా నుండును. రూపము సామాన్యమైనను తేజము విద్యావంతుఁడని సూచించుచుండెను. విభూతిరుద్రాక్షమండితప్రతీకుండై రెండవమహేశ్వరునివలె నొప్పుచుండెను. భల్లాణుం డాపశుపతినిఁ బశుపతిగాఁ దలంచి యథావిధిగా నర్చించి సుఫలము గోరునప్పుడు వాడుకప్రకారము నమస్కరించి యిట్లనియె.

మహాత్మా! నీవపరశివుండవలె మాయింటికి వచ్చి మమ్ముఁ గృతార్థులఁ గావించితివి. మీపాదరేణువు సోఁకి నేను కులజులతోఁ గూడఁ బవిత్రుండనైతిని. మీ కత్యంతప్రియంబైన కామ్యంబు వక్కాణింపుఁడు. అక్కార్యంబుదీర్చి నంత సుఫలంబు వడసెదనని ప్రార్థించిన విని యామహేశ్వరుం డించుక ధ్యానించి యిట్లనియె.

నరేంద్రా! కామితంబన మనంబునంబుట్టిన కోరికగదా? హృదయంబున ననేక సంకల్పములు గలుగుచుండును. వానినన్నియు బయలుపఱచిన వెఱ్ఱివాఁడందురు. ఆసంకల్పములలోఁ గొన్ని పుట్టినతోడనే నశించుచుండును. ఇప్పుడు మీరు నీ కామితమేమని నన్నడిగితిరి. మనంబునఁబుట్టిన యభిలాష మఱుగుపఱచి వేఱొకటి చెప్పుట న్యాయము కాదు. అట్టిదానిం దీర్చినఁగాని, మీవ్రతము సఫలముకానేరదు. ఇప్పుడు నాచిత్తమునంబుట్టిన యభిలాష యొరులతోఁ జెప్పఁదగినదికాదు. కావున మీకు సుఫలమిచ్చెద నాకనుజ్ఞ యిండు. పోయివచ్చెదఁ గామ్యముమాట యడుగవలదని పలికినవిని యానృపతిలకుం డిట్లనియె.

మహేశ్వరా! నే నొకదేశమున కధిపతిని మీకామితమే తీర్పఁ జాలనా! మీరు కోరినవస్తువు నాదేశమం దెందున్నను దెచ్చి యీయఁ గలను. సందియమందక కోరికొనుఁడు. అనియడిగిన నతండు నిట్టూర్పు నిగుడించుచు అయ్యో నే నేదియో కోరక మీతో నేను నిజమేమిటికి జెప్పితిని. నాకోరిక కడునీచమైనది. నాప్రారబ్ధమువలన నేఁడు నా కట్టియభిలాష గలిగినది. చెప్పుటకు వాకు రాకున్నది. మీ రూరక నన్ను నిర్బంధించుచున్నారు. నాకోరికవిని సీ, సీ, అని నామీఁద నుమియుదు రేమో? అసహ్య మసహ్య మపకీర్తి నేఁ జెప్పజాలనని చెవులుమూసి కొనియెను.

అప్పుడు రాజు మహాత్మా! నీవు పరమోత్తముఁడవు. మనంబున నొక్కటి వాక్కున నొకటి పెట్టికొని చెప్పుచున్నవాఁడవుకావు. నీహృదయము కడుపరిశుద్ధమైనది. నీకోరిక తీర్పక నేను భుజించువాఁడనుకాను. ఇప్పుడు పొద్దుపోయినది సంశయింపక నీయభీష్ట మెఱిఁగింపుము. ఎంతనీచమైనదైనను నిందింపక యొసంగెదనని బ్రతిమాలి కొనియెను.

అప్పుడా మహేశ్వరుండు మహారాజా! నన్నుఁ జెప్పుమని గట్టిగా నిర్బంధించుచున్నారు. ఇఁక చెప్పకతీరదు. వినుండు. ఆహారనిద్రామైధునక్రియలు జంతువులకు సహజములుగదా? నేను బ్రహ్మచారిని. భార్యలేదు. మీరు పెట్ట సంతుష్టిగా భుజించితిని. ఇప్పుడు తృతీయ పురుషార్థము నన్ను గట్టిగా బాధించుచున్నది. మీ రేమికావలయునని యడిగినంత నాచిత్తము సంభోగాయత్తమైనది. ఆమాట యెట్లు చెప్పఁ గలను. అది యసభ్యముకాదా? దానిం గప్పిపుచ్చి మఱియొకటి కోరుట కపటమగుచున్నది. ఈకోరిక మీ రెట్లుతీర్పఁగలరు? నాదారి నన్నుఁ బోనిండు. సిగ్గు సిగ్గు మహానుభావులు మీకడ నిట్టితుచ్ఛపుకోరిక కోరినందులకు నాతప్పు మన్నింపుఁడు. అనిపలికిన విని నరేంద్రుండు మందహాసము గావించుచు నిట్లనియె.

మహేశ్వరా! నీవు యథార్థవాదివి. నీమాటలు నాకు సంతోషమును గలుగఁజేసినవి. నీ వేమియు సంశయింపకుము. నీకోరిక తప్పక తీర్పించెద. పరాశరప్రభృతిమహర్షులు కామమునకు దాసులైరనుచో నితరులమాట చెప్పనేల? ఇందుఁ దప్పేమియు లేదు. వేశ్యాకాంతలు వివాహమాడక కన్యలైయుండుట మీవంటివారినిమిత్తమే? మాయూరఁ జక్కఁదనంబునఁ బేరుపొందిన వారసుందరులు పెక్కండ్రు గలరు. వారిలోఁ జక్కనిదానినొక్కతె రప్పించి నీయభీష్టము దీర్పించెద నంగీకారమేనా? అని యడిగిన నతం డిట్లనియె.

మహారాజా! నేను వేశ్యాకాంతంగాక కులకాంతం గోరుదునా? మఱియొకమాట జ్ఞాపకముంచుకొనవలయును. నీవు శాసనకర్తవు. నీయాజ్ఞ నెల్లరు శిరసావహింతురు. నేఁటిరాత్రి యొకవిటునియధీనములో నున్న వారాంగనం దీసికొనిరాఁగూడదు. కామము సర్వసాధారణము. ఇప్పుడు నే నెట్లుపరితపించుచుంటినో యావిటుఁడు తద్వియోగమున నట్లు పరితపింపఁగలఁడు. ఒరులబాధపెట్టి యనుభవించినసుఖము సుఖముకాదు. విమర్శించి రప్పింపుఁడని చెప్పెను.

ఆమహేశ్వరునియుపన్యాసమునకు మిగుల సంతసించుచు భళ్లా ఱుండు నీవుకోరినరీతినే కావించెద సంశయింపకుమని పలుకుచుఁ దన గృహంబున నొకగది యలంకరింపఁజేసి యనల్పశిల్పికల్పితంబగు హంసతూలికాతల్పంబున నతనిం గూర్చుండఁబెట్టి యుత్తమలక్షణోపేతయై యొకరి యాధీనములోలేని వారకాంతం దీసికొనివచ్చి యప్పగింపవలయునని మంత్రులకు నియోగించి తాను దేవతాగృహంబునకుఁ బోయెను.

మంత్రులు శృంగారపురుషులఁ గొందఱ వెంటనిడుకొని యాపురివేశ్యవాటికకుఁ బోయి యందొకచో నిలువంబడి యిందు రూపయౌవన విద్యావిశేషములచేఁ బేరుపొందిన వారసుందరు లెందఱుగలరు? వివరింపుఁడని యడిగిన నందొక విటప్రముఖుం డిట్లనియె. ప్రభువులారా! వినుఁడు మనపురంబునంగల వారాంగనల కచ్చరలు దాస్యముసేయఁ

బనికిరారు. చంద్రలేఖ, తారావళి, పద్మగంధి, మణిమంజరి, మధురాధర, విద్రుమోష్ఠి శరచ్చంద్రిక, హేమలత, నవమల్లిక, కాంతిమతి, లోనగు మగువలు ప్రముఖులు. కావలసిన వారిం దీసికొనివచ్చెదము. సెలవీయుఁడని యడిగిన మంత్రు లిట్లనిరి.

మా కెందఱో అక్కఱలేదు. మంచి చక్కని దొక్కఁటితయ చాలును. ఆకసంబడు పెద్దమేడ యెవ్వరిదని యడిగిన విటుండు, అయ్యా! అది చంద్రలేఖయిల్లు. అది రూపమునందు నాటపాటలయందును బ్రముఖురాలే. తీసికొనిరానా? అనిపలుకుచు వారియనుమతివడసి చంద్రలేఖ నక్కడకుఁ దీసికొనివచ్చెను. మంత్రుల కది నమస్కరించినది. దానిం జూచి సచివు లాశ్చర్యమందుచు వలసినంతద్రవ్య మిప్పింతుము నేఁటి రాత్రి నొకమహేశ్వరుని యాధీనములో నుండవలయు నిది రాజప్రీతికరమైనపనియని విటుముఖముగా నడిగించిన నవ్వేలయాలు రాజశాసనమునకు బద్ధులమే. నావిటుండు మంచముపై నున్నవాఁడు. వానితోఁ జెప్పి యంగీకరింపఁజేసివత్తు నంతవఱకునవకాశమీయుఁడని కోరికొనినది.

మంత్రులు పో, పొమ్ము, నీవు పనికిరావు. విటునియధీనములో లేనిబోగముచాన కావలయునని పలికిన బాబూ! తారావళి కాళిగా నున్నది. దానిం దీసికొనిపొండు అనిచెప్పి చంద్రలేఖ సెలవుపుచ్చుకొని వెళ్లిపోయినది. విటుఁడు తారావళియింటి కరిగి, మంత్రులసందేశ మెఱింగించి యక్కడకుఁ దీసికొనివచ్చెను. దానిఁజూచి మంత్రులు నేఁటిరాత్రి నీవువిడిగానుంటివేని కానుక లిప్పింతుము మాతో రమ్ము. పనియున్నదని యడిగించిరి. అది స్వామీ! నే నింతదనుక విడిగానేయుంటిని. ఇప్పుడే యొకపల్లవుఁడు తాంబూల మిచ్చిపోయెను ఈజేయి తీరికలేదని చెప్పినది. మంత్రులు విటునిపై నలుగుచు నీవు విటయుక్తలం దీసికొనిరావలదు వారివారియిండ్లకుఁ బోయి విడిగానున్న పడఁతిం దీసికొనిరమ్ము. వలసినంత ద్రవ్య మిప్పింతము. అనినియోగించి మంత్రు లందే నివసించిరి.

పిమ్మట నావిటుఁడు నీలవేణియింటికిఁ బోయిచూచిన నా వెలఁది భుజంగుఁడు తనతొడ శిరంబిడికొని యాలింప హాయిగా సంగీతము పాడుచుండెను. ఆవింతజూచి యతండు గిరుక్కున మఱలి యాచక్కి నున్న పద్మగంధియింటికిఁ బోయి తలుపుగొట్టెను. దానిం గళత్రముగా స్వీకరించిన రంగాచార్యులువచ్చి తలుపుతీసి యేమిపనియని యడిగిన నేమి యు లేదని యవ్వలికిఁ బోయెను. ఆచార్యు లనుమానము జెంది లోపలికిఁ బోయి పద్మగంధింజూచి యూరా! నీవెంతదానవు? ఎవ్వరు నాయిం టికి వచ్చుట లేదని ప్రమాణికము చేసితివే? ఇప్ప డాతుంటరి నీయింటి కింత ప్రొద్దుపోయి యేమిటికి రావలయును? పాపము వాఁడు నేను లేనను కొనెనుకాఁబోలు. నన్నుఁజూచి యేమియుమాటాడక యవ్వలికిఁ బోయె ను. వాఁడు వచ్చినకారణము జెప్పుమని నిర్బంధించెను.

పద్మగంధి—రామ రామ మీతోడు నేనేమియు నెఱుఁగను. వాఁడెవ్వఁడు?

ఆచార్యులు—వాఁడా? పోకిరీతనముగాఁ జెడ్డవేషమువైచి కొని యీవేశ్యవాటికలోఁ దిరుగుచుండెడి పారుబోతు. కనకాచలము మూలముగా మాయిరువురకు నొకప్పుడు ముష్టియుద్ధము జరిగినది. నాదాయ వాఁ డిందేల రావలయును?

పద్మగంధి—ఎందులకువచ్చెనో తెలియదు. నమ్మిన నమ్ముఁడు లేకున్న నే నేమిచేయుదును?

ఆచార్యులు—మఱియెవ్వరిని రానీయనని యేకదా! నావలన నిబ్బడిగా ధనముదీసికొంటివి? ఆతొత్తుకొడుకు నాయింటి కేమిటికి రావ లయునో చెప్పుము. ఈరాత్రికి నేను రాననుకొని రమ్మంటివి. మీసంగతి తెలిసికొనుటకై వెళ్ళినపని కాకున్నను సత్వరముగా వచ్చితిని. నేఁడు రాకున్న నెంతమోసము జరుగును?

పద్మగంధి—అబ్బా! నీవు మాదిట్టవు. నాయపరాధము గను పెట్టితివి. నీవిచ్చుబత్తెముతోనే జీవించుచుంటిమి. ఇష్టముండిన నుండుము లేకున్న పొమ్ము. మాయింటికి స్నేహితులు పరిచితులు వచ్చుచుందురు. మాటిమాటికి శంకలుసేసిన నుత్తరముసెప్పువారు లేరు.

అని కసరిపలికినది. ఆచార్యులు త్రాగియుండుటచే నొడలెఱుంగక కోపముతో నోసిరండా! ఎంతక్రొవ్వి పలుకుచుంటివి? పుట్టెడు మాన్యమమ్మి తెచ్చియిచ్చినసొమ్ము నీయబ్బగడించినదనుకొంటివా? అని పలుకుచు వీపుపై నొకగ్రుద్దుగ్రుద్దెను. అది మొఱ్ఱోయని యఱచినది. రాక్షసివంటిదానితల్లి యాకలహము విని వచ్చి ఓరి సిగ్గుమాలినకుక్కా! నాకూఁతుం గొట్టుచుంటివిరా? నీచేతులు మాడిపోను. దున్నపోతువలె నున్నావు. ఆవచ్చినవాఁడెవ్వఁడో చూపుము. వానిజుట్టో నీజుట్టో గొరిగించెదనని పలుకుచు నాయాచార్యుని జుట్టుపట్టుకొని వీథిలోనికీడ్చుకొని పోయి యేఁడీ! చూపుము. చూపుమని పెద్దకేకలు పెట్టుచుండెను. బాబో! చచ్చితిఁ జచ్చితినని యాచార్యు లఱచుచుండెను.

ఆప్రాంతమందున్న మంత్రు లాకోలాహలము విని దాపునకుఁ బోయి వాని నట్లుకొట్టుచుంటివేమని వేశ్యమాత నడిగిరి. అది బాబూ! ఎవ్వఁడోవచ్చి మాయింటివీధితలుపుఁ గొట్టెనంట. వాఁడెందులకుఁ గొట్టెనని వీఁడు నాకూఁతుం జావమోదెం జూడుఁడు. అని యావృత్తాంతము చెప్పినది. మంత్రులు నవ్వుచు, ఆతలుపుగొట్టినవాఁడు మేముపంపినవాఁడు మఱియొకఁడుకాఁడు పొండు పొండు తగవులాడకుఁడు అని మందలించి వారి నంపివేసిరి.

ఆవిటశిఖామణి యటనుండి మణిమంజరియింటికరిగి యది సరసునితో సొగటాలపాళియాడుచున్నదని దాదివలనవిని యందుండి మంజువాణియింటి కరిగెను. మంజువాణి తలుపుతీసి యోహో భావగారా! దారితప్పివచ్చితిరేల? మధురాధర జూచిన మోసమువచ్చుంజుఁడీ! అని

పరిహాసించిన నవ్వుచు నతఁడు ఓసీ! నీవలనఁ బనిగలిగియే వచ్చితిని. శుభకార్యము సద్యోఫలము. ఆలస్యముకాదు. ఈరాత్రి గాళీచేసికొనిరాఁగలవా? అని యడిగిన నప్పుడది భావా! యింతప్రొద్దుపోయివచ్చి యీమాటచెప్పెదవా? నేఁడు శివరాత్రియే యనుకొంటిని. రాజుగారిచేత సత్కృతుండగు నొకలింగధారి యిప్పుడేవచ్చి తాంబూలమిచ్చి లోపలికిఁబోయెను. గడియదాటినది. లేకున్న మాటదక్కుంగదా! పోనీ! యాయననడిగి రానాయేమి? అనుటయు నతఁడు అట్లైనఁ బెక్కండ్రఁ దీసికొనిపోవుదును. రాజశాసన మట్లులేదు. కాళీగానున్న వారాంగన కావలయునని పలుకుచు నటనుండి శరచ్చంద్రయింటికిఁ బోయెను. అది వయసుకానితో ముచ్చటలాడుచుండెను. పేర్కొల నాభుజంగుఁ డాయూరనున్న వారకాంతలగృహములన్నియుఁ ద్రొక్కిచూచెను. ఒట్టు పెట్టిన ట్లొక్కరితయు విడిగాఁ గనంబడలేదు. అతఁ డావార్త మంత్రులకుఁ దెలియఁజేసెను.

మంత్రులు ఔరా! ఇది వింతగానున్నది. వేయిగడపగలవేశ్యవాటికలో భుజంగసంగరహితయగు గణిక దొరకలేదే. మనమెవ్వతెనో తీసికొనివత్తుమని రాజు గంపెడాశతో నుండును. మనముపోవుటకు భుజింపఁడు. ఇప్పు డేమిచేయుదుము. అని విచారించుచు మఱలమఱల నావిటునంపి వారుగూడఁ బరీక్షించిచూచిరి. విడివెలయాలు దొరకలేదు. కపటముచేసి తీసికొనిపోయినచో రాజునకుఁ దెలిసిన శిక్షించును. యథార్థము సెప్పుటయే మంచిదని తలంచి మంత్రులు రాజునొద్ద కఱిగి యావృత్తాంతమెఱింగించిరి.

భార్యతోఁగూడ దేవగృహంబున శివపూజజేయుచున్న భల్లాణుం డావార్తవిని హాహాకారము సేయుచుఁ బుడమిఁబడి మూర్ఛిల్లెను. సువ్రత పతిపాటుజూచి వెఱపుతో లేవనెత్తి శైత్యోపచారములు సేయుచుఁ దెప్పిరిల్లి తనవంకఁజూచుచున్న భర్తతో మహాత్మా! ఇట్లకారణ

ముగాఁ బడిపోయితివేల ? మంత్రులుపంపిన పత్రికలో నేమియున్నది ? నిజముచెప్పుఁడని యడిగిన నయ్యోడయం డిట్లనియె.

తరుణీ ! నీతో నేమిచెప్పుదును ? మహేశ్వరునికోరికఁ దీరుపలేక యపరాధినైతిని. వారకాంత నర్పింతునని యతని శయ్యపైఁ గూర్చుండఁ బెట్టితిని. దేహధర్మములు దుర్భరములు. నేఁటితో నావ్రతవిఘ్నమైనది. ఇఁక నేను గుడువను. ప్రాయోపవిష్టుండ నయ్యెదనని భార్య కావృత్తాంత మంతయుం జెప్పెను.

ఆమె యించుకధ్యానించి ప్రాణేశ్వరా ! మీయర్థాంగలక్ష్మిని పశవర్తి నేనుండ మీకుఁ జింతయేటికి ? మహేశ్వరునికామితము దీర్చుట కితరాంగనలఁ బంపుటకు మీ కేమి యధికారమున్నది ? వ్రతవిఘ్నమగు నని విచారింపనేల ? నన్ను నియోగింపుఁడు. నే నతని యభీష్టము తీర్పదఁ దొల్లియిక్ష్వాకునిభార్య భర్తయనుమతి నతిథిని సత్కరింపలేదా ? అట్లే నేనునుగావించి కృతకృత్యురాల నయ్యెద నాజన్మము సార్థక్యము నొందఁగలదని ప్రార్థించినది.

ఆబోఁటిమాటలు విని యాక్షితిపతి యపరిమితానందము చెందుచు నత్తలోదరిం గ్రుచ్చియెత్తి మత్తకాశినీ ! నీపలుకులు మనుపలుకుల కనుకూలించియున్నవి. ప్రియురాలన నిన్నే చెప్పవలయును. పూర్ణముగా సంతోషించితిని. వెలయాండ్రు విడిగా లభించిరికారు. మఱియొకయువతిని వ్యభిచారమునకు నియోగించుట యధర్మము. వ్రతము విడువవలసిన సమయములో మంచియుపాయము చెప్పితివి. నీవుపోయి మహేశ్వరుని కామ్యమును దీర్పుము. నీకేమియు దోసములేదు. పొమ్ము. మఱియు రాజభార్యవని చెప్పఁగూడదు. వారాంగననని యే చెప్పుము. లేకున్న నతం డంగీకరింపఁడుసుమీ ! అని యుపదేశించి యంపెను.

సువ్రత పాతివ్రత్యభంగంబుకాదను దృఢనమ్మకముతో నూత్న భూషాంబరంబులు ధరించి కస్తూరిచందనచర్చితాంగయై మేవాసనిను

నలు దెసలవ్యాపింప నామహేశ్వరుఁడు పండుకొనియున్న గదిలోనికిం బోయి యతనికి నమస్కరించి మహాత్మా! నేనొక వారకాంతను. భల్లాణభూపాలునిపంపున మీకడకు వచ్చితిని. నావలన మీయభీష్టము దీర్చుకొనుమని పలుకుచు నెదుర నిలువంబడినది.

అతం డామె నెగాదిగఁజూచి మంచముడిగ్గనుటికి యామెపాదంబులంబడి నమస్కరించుచు దేవీ! నీవు వారకాంతనని చెప్పుచుంటివేల? పార్వతివలెఁ గనంబడుచుంటివే? అదిగో ఫాలనేత్రము. తెలియకుమీ? నేను భస్మమైపోయెదను అయ్యో! నీవెక్కిన సింహంబు నాపై తీక్ష్ణదృష్టులు వ్యాపింపఁజేయుచున్నది. తల్లీ! ఆదరింపవా? నీచేతనున్న త్రిశూలముజూడ వెఱపుగలుగుచున్నది. తుచ్ఛపుకోరిక కోరినందులకు నన్ను శిక్షింపవచ్చితివా? లోకమాతా! నీకు నమస్కారము. నాతప్పు మన్నింపుము. ఎఱుఁగక కట్టిమాట పలికితినని ప్రార్థించుచుండెను.

ఆమహేశ్వరుని పిచ్చిమాటలువిని రాజపత్ని వెఱఁగుపడుచు సౌమ్యా! నేను పార్వతినికాను లక్ష్మినికాను సరస్వతినికాను. ఒకవేశ్యకాంతను. రాజుగారిని నీవు కోరితివఁట. నాకు సొమ్మిచ్చి యీరాత్రి మీయొద్దకనిపిరి. ఇదియు నిజము. మీరు బ్రాహ్మణులు నేను సానిదానను. నాకు నమస్కరింపరాదు. వేగము మీయభీష్టము దీర్చుకొండని క్రమ్మఱఁబలికినది. అతండు బాబో! నీమాటలు మెత్తగానున్నవి. నీరూపము జూడ మహాశక్తివలెఁ గనంబడుచుంటివి. అమ్మా! నీవదనబిలము పాతాళమువలెనున్నది. నాలుక జ్వాలికవలె వ్రేలాడుచున్నది. నీచూపులు శూలములవలె నన్నుఁ బొడుచుచున్నవి. అంబా! నీభయంకరమూర్తి నుపసంహరింపుమని ప్రార్థించుచు కన్నులుమూసికొని పాదంబులం బడియెను.

అప్పు డామె అయ్యో! మహేశ్వరా! నీవు మహేశ్వరుండవగుటఁ బార్వతిరూపమున వచ్చితిని. నీకామ్యము దీర్చుకొనుము. లేకున్నఁ

గపటము చేసితినని రాజుగారు నన్ను నిందింపఁగలరు. అని ప్రబోధించు టయు నతఁడు మెల్లన కన్నులం దెఱచి మెఱపుతీఁగెవోలెఁ దత్తనుకాంతి మిఱుమిట్లుగొలుపఁ జూడఁజాలక అయ్యో తల్లీ! నీవేడి యుపసంహ రింపుము. శాంతురాలవుకమ్మని ప్రార్థించెను. సుప్రత యతనిమాటలు విని "అయ్యో! ఇదియేమికర్మము. నన్నుఁజూచి యితఁ డూరక వెఱచుచు న్నాఁడు. నాకు లేనిపోనిరూపులఁ గల్పించుచున్నాఁడు. నాకేమియుం దెలియదు. నే నేమిచేయుదును? ప్రాణనాథుండు నన్నుఁ గపటాత్మురా లని నిందించునేమో? వీనికి నేను వికృతరూపముగాఁ గనంబడుచున్నాను కాఁబోలు. ఈశ్వరమాయఁ దెలియ నెవ్వరితరము" అని ధ్యానించుచు నతని మఱియు మఱియుం బ్రోత్సాహపఱచినది.

ఆమెమాటాడిన శూలమువలె వానికి గుచ్చుకొనుచుండెను. అతఁడు కన్నులుమూసికొని తల్లీ! తల్లీ! రక్షింపుము. రక్షింపుమని వేఁడు టతప్ప వేఱొకమాట లేదు. ఈరీతిని వారిరువురు సంవాదముసేయుచుండ నింతలోఁ గోడికూసినది. అప్పుడా రాజు వారేమిచేయుచున్నారో చూడవలయునని యాగదిదాపునకు వచ్చి లోపలివాక్యము లాలించెను. దేవీ! నన్ను మన్నింపవా? నీవేడికి నాయొడలు మండిపోవుచున్నది. శాం తింపుము. అయ్యో! మహారాజా! నాకామితము దీర్తునని చెప్పి యిట్టి దారుణము సేసితివేల? మహాశక్తిని ప్రయోగింతువా? ఇదియా నీవ్రత పరాయణత్వము. నాకామితము దీర్చుటకంటెఁ బెద్దగా సంతసింతును ఈయాపద దాటింపుము. అని పెద్దయెలుంగున మొఱపెట్టుచుండెను.

ఆమాటలువిని రాజు వెఱవకుము వెఱవకుము. ఇదిగో నేను వచ్చుచున్నాను. అని గుభాలునఁ దలుపుదెఱచుకొని లోనికింబోయెను. సుప్రత మంచముదాపున నిలువంబడియున్నది. కన్నులుమూసికొని మహేశ్వరుం డామెపాదంబులదాపునఁ బడియుండెను. ఆ! ఆ! ఏమీ? ప్రేయసీ! అతిథిని భయపెట్టుచుంటివా? అట్లు వేఁడుచున్నాఁడేమి? అని

యడిగిన విని యామహేశ్వరుండు తటాలునవచ్చి యారాజుం గౌఁగిలించుకొని మహారాజా! నన్ను రక్షింపుము. ఈమె తేజము నామేను మండఁజేయుచున్నది. నీదరిఁజేరుటచేఁ గొంచెము చల్లఁబడినది నాకేమియు నక్కఱలేదు. నాదారిని నన్నుఁ బోనీయుఁడు అని పలికెను.

రాజు వానివీపుగొట్టుచు మహేశ్వరా! ఊరక వెఱచెదవేల? మహాశక్తి యెక్కడ? దివ్యమంగళవిగ్రహయగు నాయువతిం జూడుము. అభీష్ట మేమిటికిఁ దీర్చుకొంటివికావు? ఇది గణికాత్మజ- కన్నులం దెఱచి చూడుము. అనిపలికిన నతం డిట్లనియె.

అమ్మయ్యో! రెప్పలు బరువెక్కినవి. ఆమె తేజము కన్నులఁ దెఱవనీయకున్నది. అదిగో త్రిశూలము కదల్చుచున్నది. బాబూ! మహాశక్తినిఁ బ్రయోగించితి వెట్లుతాళఁగలను? రాజా! రక్షింపుము. మేను భగ్గున మండిపోవుచున్నది. అనిపలుకుచు గంగవెఱ్ఱులెత్తినవాఁడుంబోలె నిటునటు గంతులువేయుచుండెను.

రాజు వానింబట్టుకొని అయ్యో! ఇదియేమికర్మము? ఏమియు లేనిదే భ్రమపడుచుంటివేల? నిలు నిలు కన్నులెత్తి చూడుమని యోదార్చెను. అతఁడు కన్నులెత్తిచూచి బాబో! కన్నులుపోయినవి గ్రుడ్డివాఁడనైపోయితిని. చెడుకోరికకోరినందులకు నాకిట్టిశిక్ష విధించితివి. బుద్ధివచ్చినది. ఇఁక నెన్నఁడు నిట్టియభిలాషపడను. అని లెంపలువాయించుకొనుచుండెను.

మహేశ్వరా! ఇది గణిక. నేను రాజును. మేముగాక యిందెవ్వరునులేరు. ఆదిశక్తి యెక్కడనున్నదియో చూపుమనియడిగిన నతండు దేవా! వేశ్యనని నామంచముదాపునకువచ్చి నిలువఁబడిన యామెయే ఆదిశక్తి. పార్వతి భవాని దుర్గ త్రిశూలధారిణి అదిగో మొగమునుండ నేదియని యడిగెదవేమిటికి? వేగ మామెపాదరజంబుదీసి నామేనికి రాయుము. నామేను జల్లఁబడఁగలదు. లేకున్న గడియతాళలేనని బ్రతి

మాలికొనిన నామెకిమీఁ డేమియుఁదోఁచక యట్లు కావించెను.

అప్పుడా మహేశ్వరుని మేను వెన్నబూసినట్లు చల్లఁబడినది. అమ్మయ్యా! ఇప్పటికి బ్రతికితిని. తాపము తగ్గినది. చూపులు కనంబడు చున్నవి. ఆహా! దేవీ! నీమహత్మ్య మగ్గింప బ్రహ్మాదులకు శక్యము కాదు. నే నీమహారాజును దుచ్ఛకార్యము గోరినందులకు శిక్షింపవచ్చితివి. బుద్ధివచ్చినదని పలుకుచుఁ దత్పాదప్రాంతభూరజంబు మఱికొంత దీసికొని శిరమునకు నొడలికి రాచుకొని సంతసముతో మహారాజా! నే నిప్పటికిఁ బూతుండనైతిని. నా కనుజ్ఞయిమ్ము పోయివచ్చెదను. శివపూజాధురంధరుండవగు నిన్నిట్టికోరిక కోరవచ్చునా? తలంచుకొనిననాకే తప్పుగాఁదోఁచుచున్నది. దైవమువలననే నా కట్టిసంకల్పము పుట్టినది. నీవు ధన్యుఁడవైతివి. అని స్తుతియించుచు నామహేశ్వరుం డటనిలువక రాజు నాఁటి కుంకుమని బ్రతిమాలుకొనిన వినక యెందేనిం బోయెను.

రాజు సువ్రతపాతివ్రత్యప్రభావమున కచ్చెరువందుచుఁ బెద్దగా స్తుతియించి యాదరించెను.

సీ. సకలదేవమయంబు సాధ్వీలలామంబు
దేహంబు పావనతీర్థమట్లు
ప్రళయాగ్నికల్పంబు పతిదేవతాదీప్తి
దహియించు ఖలుల దుర్దాంత మగుచు
సాధుల కొదవించు సకలార్థములు పతి
వ్రత దివ్యసురభికైవడిని వడిని
శమమొప్ప నుభయవంశములఁ బూతముసేయు
సుసతీవతంస జహ్నుసుతలోలె

గీ. సమరు ప్రతికృతి పిడుగునకైన వజ్ర
మునకునైనను గాకోలమునకునైన

లేదు సతికిన్క కాటంక మేదియైన
కనలినఁ ద్రిమూర్తులకుఁ గడగడలుకావె ?

గీ. ఒకతె భాస్కరు నుదయింపకుండఁజేసె
నొకతె చల్లార్చె దావాగ్ని హోత్రు నొకతె
బ్రాహ్మణుని తేజమడఁచె దర్పంబడంగ
నేమి గావింపనోప దీభూమి సాధ్వి.

భల్లాణునిఁ బరీక్షింప నీశ్వరప్రేరితుండై యామహేశ్వరుఁ డట్లు కోరెనని కొందఱును, సహజకామాతిరేకంబున మహాపుణ్యాత్మునిఁ దుచ్ఛభోగంబుకోరుటచే ధూర్తవిప్రుండు పరాభవింపఁబడెనని కొందఱును పలుకఁజొచ్చిరి.

అట్టిసాధ్వీమణిం గూడికొని యల్లాణభూపాలుండు ధర్మంబున బ్రజలం బాలింపుచుఁ గవుల నాదరింపుచు దిగంతవ్యాప్తకీర్తియైయొప్పు చుండెను. భోజునిచే నవమానింపఁబడి కాళిదాసకవి నానాదేశములు దిరుగుచు నొకనాఁ డమ్మహారాజుగారికొలువుకూటంబున కరిగి యాత్మీయ తేజంబున కచ్చెరువందుచు సభ్యులు సూచుచుండఁ గుడిహస్తమెత్తి,

శ్లో॥ అల్లాణక్షోణిపాల త్వదహితనగరే సంచరంతీ కిరాతీ
కీర్ణాన్యాదాయ రత్నాన్యురుతరఖదిరాంగారశంకా కులాంగీ।
క్షిప్త్వా శ్రీఖండఖండం తదుపరి ముకుళీభూతనేత్రా ధమంతీ
శ్వాసామోదానుయాతైర్మధుకరనికరైర్ధూమశంకాం బిభర్తి ॥

ఓమహారాజా ! నీచేనోడింపంబడి పారిపోయిన శత్రురాజుల పట్టణమందు సంచరించుచున్న కిరాతకాంతలు అక్కడక్కడ దొరకిన రత్నములను జంద్రనిప్పులనుకొని పోగుచేసి వానిపై మంచిగంధపు సమిధలవైచి కన్నులమూసికొని యూదుచుండఁగాఁ దదీయశ్వాసానిల ముల కావరించుచున్న తుమ్మెదగుంపులనుజూచి యూదగాఁ బొదుచున్న

పోగయని భ్రాంతిపడుచుందురు. లోకోత్తరమైన యాశ్లోకమును విని యల్లాణుండు విస్మయము చెందుచు నక్కవిం గౌఁగిలించికొని మహాత్మా! నీపేరేమి? నన్నుఁ గృతార్థుం జేయ నరుదెంచిన నీకులశీలనామాదు లెఱింగింపుమని ప్రార్థించినఁ దనపేరు కాళిదాసనియు భోజునియాస్థానమున నుండువాఁడననియు దేశములు సూడ బయలువెడలితిననియుం జెప్పెను. అల్లాణుడు నిటలతఘటితాంజలిపుటుండై కవీంద్రా! మహేశ్వరపదాంభోజప్రియుండవగు నీప్రఖ్యాతి యిదివఱకే మాకు శ్రోత్రామృతమైయున్నది. మదీయపురాకృతసుకృతవిశేషంబునం జేసి నీవు నాకడ కరుచితివి. నేను గృతార్థుండ నైతి. నాసింహాసన మధిష్ఠించి నీ వీరాజ్యము పాలించుకొనుము. నీకు దాసుండనై పరిచర్య గావింతునని ప్రార్థించినఁ గాళిదాసు బ్రాహ్మణులకు రాజ్యమేల? మఱియు భార్యాపుత్రహీనుండ నే నేమిసేసికొందును? ఊరక వసించెద నన్నవస్త్రము లిచ్చినం జాలునని పలుకుటయు నతండు సంతసించుచు నతని కొకదివ్యభవనము గట్టి యిప్పించి తనతో సమానమగు గౌరవముతోఁ జూచుచు విద్యావినోదములతోఁ గాలక్షేపము సేయుచుండెను.

## సర్కస్సుకథ.

అల్లాణభూపతి సకలవిద్యాపరీక్షకుండను వాడుక యున్నది. ఒక నాఁ డమ్మహారాజు పేరోలగమున్న సమయంబున సింహశార్దూలాది క్రూరమృగంబులు కుక్కలవలె వెంటనంటి రా భైరవుండను తాంత్రికుఁ డరుదెంచి నృపతికి మ్రొక్కుచు దేవా! నేను మృగములచేఁ బరిజనుల చేతంబోలె నద్భుతవినోదకార్యంబులఁ జేయించెద. గొప్పగొప్పసంస్థానముల కరిగి నాయాటఁ జూపి పెక్కుబిరుదముల నందియుంటిని. ఆటకు సెలవీయుఁడు. విహావలనఁగూడ ననంతపారితోషికము లందఁగలనని ధైర్యముగాఁ బలికిన నయ్యొడయఁ డంగీకరించి నాఁటిరాత్రియే కాళిదా

సాదిమహాకవులతోఁగూడికొని పురబాహ్యోద్యానవనంబున నమరింపఁబడియున్న డేరాలోనికిం జని యావినోదము సూచుచుండెను.

సీ. గొఱ్ఱెపిపుస మేటిగుదెగాఁగ రెండుదూ
లములు వైచి తదంతరమున నొక్క
యేనుఁగ నెక్కించి దానిపై రెండుసిం
గముల నిల్పి తదగ్రకాయములను
జేర దూలమువైచి శ్రేణిగా దానిపైఁ
బులుల నావులను దుప్పులను నిల్పి
తచ్ఛిరంబులఁ బెద్దదారువు ఘటియించి
యుష్ట్రత్రయం బందు నొదుగనిల్పి

గీ. వానిచరమాంగముల వలమైనరెండు
దూలములువైచి యందుఁ గోతులను మహిష
ములను భల్లూకములను వర్తులముగాఁగ
నిలిపి నాట్యము సేయించె లలితఫణితి.

ఆవ్యూహచమత్కారము చూచి విస్మయముచెందుచు నల్లాఖుండు ప్రక్కనున్న కాళిదాసకవిం జూచి,

శ్లో॥ కవీంద్ర! పశ్య మేషోయ మల్పసారోపి ధైర్యయుక్ ।
వహత్యశేషజంతూనాం భారంమేరురివాఖిలం॥

కవీంద్రా! ఈగొఱ్ఱె స్వల్పబలముగలదైనను లోకముల మేరువు పర్వతము ధరించినట్లు ఈమృగముల బరువంతయు మోయుచున్నది. చూచితివా? అనిపలికిన విని కాళిదాసకవి యీక్రిందిశ్లోకమును జదివెను.

శ్లో॥ కిమేషో మేషోయత్సకలమృగభారంవహతితత
ద్విచిత్రం త్రైలోక్యస్థిరతర ధురంధారణ పటోః।
మహారాజశ్రీమన్మకుటతట భాస్వద్వరమణీ
ప్రభారాజత్పాదాంబుజయుగళ ధారాపురపతేః॥

త్రిభువనభారవాహకుండైన భోజునకు నీమృగములభారము వహించుట యొకచిత్రమా? అనిచెప్పుటయు నశ్వాణుండు వెఱగుపాటుతోఁ గవీంద్రా! ఈమేషము ధారానగరాధీశ్వరుండని పలికితివేల? అమ్మహారాజు శప్తుండయ్యెనా యేమి? నిజముచెప్పుము. అనుటయు సత్కవిశేఖరుం డది నాకునుం దెలియదు. దైవికముగా మీరడిగినప్రశ్నమున కట్టిసమాధానము నానోటినుండి యప్రియత్నముగా వచ్చినది. అనిచెప్పుటయు నాజనవల్లభుం డంతటితో నాయూట చాలింపుమని యాజ్ఞాపించి యేకాంతముగా వానిఁ దనయుంతికమునకు రప్పించుకొని యీమృగములన్నియు నెక్కడసంపాదించితివి? ఈసాధనము లెట్లు నేర్చితివి? అనియడిగిన భైరవుండు వీనినెల్లఁ బిల్లలుగానున్నప్పుడు సంపాదించి యూట నేర్పుచుంటినని యేమేమో బొంకెను.

వలసినంతద్రవ్య మిప్పించెద నాగొఱ్ఱెను మాకిత్తువా? అనియడిగిన నాబ్రతుకంతయు దానితోనున్నది. ఇయ్యఁజాలనని వాఁ డుత్తరము చెప్పెను. ఆవిషయమై వారిరువురకుఁ బెద్దసంవాదము జరిగినది. భైరవుఁడు రాజును వంచించుతలంపుతో నట్లేయిత్తునని చెప్పి కొన్నికానుకలంది యాతేయి వేకువజామున నొరులెఱుఁగకుండఁ బ్రయాణమగుచుండ రాజకింకరులు వోయి యూటంకపఱచి బలవంతమున నాగొఱ్ఱెను లాగికొనివచ్చి రాజున కర్పించిరి.

కాళిదాసకవి యాగొఱ్ఱెయొద్దకుఁబోయి నువ్వుచు మహారాజా! సత్కవికల్పభూజా! నీవిట్లు మేషమవైపోయితివేమి? నిన్నెవ్వ రిట్లు కావించిరి? భూభారం బెవ్వరిపైఁ బెట్టివచ్చితివి? అటఁ గవుల కాధారమెవ్వరు? ఏదోయనినంతమాత్రముననే యంచునిలువక విశ్వాసము లేక చిరకాలస్నేహము గణింపక లేచివచ్చిన యీకపటమిత్రునిఁ జూడ వచ్చితివా? తండ్రీ! నీ వజాతశత్రుండవే నిన్నెవ్వ రిట్లువంచించిరి? వదాన్యా! నన్నుఁజూడక రెండుగడియలు నిలువలేకుండువాఁడ విప్పు డెట్లు

పరమానందభరితుండ నగుదునని యడిగిన నతండు చిఱునగవుతో నీరా జ్యమే మీయధీనమనిన నన్నేమి యాచింపవలసిన వస్తువేమున్నది? అనుటయు భోజుండు దేవా! మఱేమియును లేదు. ఈమహాకవిచంద్రుండు నాకుఁ బ్రాణము. ఈతని నాకు దయచేయఁ బ్రార్థించుచున్నాను. మీకుఁ బ్రాణదానఫలంబు రాఁగలదని పలికిన నవ్వుచు నల్లాణుండు,

ఓహో! ఇదియా మీయాశయము. ఇందులకు నాసెలవేమిటికి? మీకు నేను బ్రేష్యుండఁగానే? మీయభీష్ట మెట్లో యట్లే కావించెద నని వినయవినమితోత్తమాంగుండై పలికెను.

తరువాత భోజుం డంజలిపట్టుకొని కాళిదాసకవితో,

శ్లో॥ గచ్ఛత స్తిష్ఠతో వాపి జాగ్రతస్స్వప్నతోపివా
మాభూన్మనః కదాచిన్మే త్వయావిరహితం కవే॥

ఆర్యా! నడుచుచున్నప్పుడును గూర్చున్నప్పుడును మేల్కొనునప్పు డును నిద్రబోవునప్పుడును నామనస్సు నీవియోగమును సహింపదు. నాతప్పులన్నియు మన్నించి ధారానగరంబునకు రావలయు. నీవులేనినగ రంబు నేను సొరనొల్లనని వేడుకొనియెను. అతండును బ్రేమానుబంధ బంధురములగు నృపతిమాటల కంగీకరించెను.

అల్లాణుండు భోజునకు గొప్పవిందు గావించెను. భోజుండు శుభముహూర్తమునఁ గాళిదాసు నొకపల్లకిపై నెక్కించి తాను పాద చారియై దండిపట్టుకొని నడుచుచు నాపురంబు బయలువెడలెను.

అని యెఱింగించి పిమ్మట నిట్లు చెప్పఁదొడంగె.

---

## 164 వ మజిలీ.

### యక్షుని కథ.

దత్తునివలనఁ దనయక్కయగు రత్నపదిక యున్నయిక్క యెఱింగినదిమొదలు సువర్ణపదిక యామెం జూచువేడుక పెచ్చుపెరుగఁ భర్తతో మనోహరా! మన మిప్పు డాయక్షశైలమునకుం బోవలయును మీమిత్రుఁ డాకథ యెఱింగించి మఱలఁ గనంబడలేదేమి? మనతో వచ్చి యాపర్వతమును జూపించునేమోయని యడిగిన సువర్ణనాభుండు ప్రాణేశ్వరీ! అతం డామాటచెప్పినతరువాత నిదిగోవత్తునని యెంగోపోయెను. తిరుగాఁ గనంబడలేదు. వానినిమిత్తము పట్టణమంతయు వెదకితిని. తక్కినమిత్రులం జేరలేదు. గోణికాపుత్రుఁడు రాజపుత్రునకు మిత్రుఁడై యున్నవాఁడని యాతఁడే చెప్పెను. వానింజూడ నేఁడు పోయితినికాని యంతఃపురములోనుండుటచే నావార్త వానికిఁ దెలియఁజేయువారే లేకపోయిరి. మఱల రేపు పోయిచూచెద. నామిత్రులందఱు వచ్చువఱకు నిందుండవలయును. తరువాత మీయక్కం జూడఁబోవుదము. గుఱుతులు వ్రాసికొంటినని చెప్పిన విని యమ్మగువ దిగులుదోఁప నిట్లనియె.

బుధప్రవరా! మేమిద్దఱ మేకగర్భజాతలము. చిరకాలముక్రింద ట విడిపోతిమి, దైవికముగ దానిసేమము దెలిసినది. కాలవ్యవధి సహింపఁగలనా? మీరే చెప్పుఁడు. నన్నక్కడఁ జేర్చి మీరు వెంటనే రావచ్చును. మీమిత్రులందఱును గలిసినవెనుక నంపఁ దీసికొనిరండు. బయలుదేరుఁడు. అని దైన్యముదోఁపఁ బ్రార్థించినది. అతం డంగీకరించెను.

వారిద్దఱు శుభముహూర్తమున నుత్తమతురగారూఢులై దత్తుఁ డెఱింగించినమార్గము ననుసరించిపోవుచు గుఱుతులుజూచుచు నుత్తరముగాఁ బోయిపోయి యేఱుల విమర్శించి మెట్టల దాటి వృక్షలతాదులఁ బరిశీలించుచుఁ దిరిగితిరిగి పదిదినముల కాశైలము గనుంగొనిరి.

మెలంగుచుంటివి బాబూ! అని దానిపైఁబడి యూరక దుఃఖించుచుండెను.

మఱియు మెడం దడుముచు మోము మూర్కొనుచుఁ జెవుల దువ్వుచు మెడ గోకుచు నిమిరినిమిరి దానిమెడలోఁగట్టిన తాయెత్తు నంటిచూచి లాగి పారవైచెను. అప్పు డామేష మదృశ్యమై భోజుండై నిలు నిలు మూర్ఖా! యెందుఁబోయెదవు? నీపీచ మడంచెదఁ జూడుమని పలుకుచు నలుమూలలుసూచి యెదుటఁ గాళిదాసకవిం గాంచి పులకాంచితశరీరుండై ఓహోహో! యీతఁడు నాప్రాణమిత్రుఁడు కాళిదాసకవియే! ఆహా! నేఁ డెంతభాగ్యము? నే నిక్కడి కెట్లువచ్చితిని? ఘోటకముఖుఁ డేఁడీ! మహాత్మా! రక్షింపుము. నాయపరాధము సైరింపుము. అని యాతనిపాదంబులఁ బడియెను.

అప్పుడు కాళిదాసకవి యతని లేవనెత్తి కౌఁగిలించుకొనుచు నరేంద్రా! అని కన్నీరుగార్చుచు డగ్గుత్తికతో,

శ్లో॥ స్నేహో హి వర మఘటితో నవరం సంజాత విఘటిత స్నేహః।
హృతనయనో హి విషాదీ నవిషాదీభవతి జాత్యంధః॥

స్నేహముకలిసి విడుచుటకంటెఁ గలియకుండుటయే శ్రేష్ఠము! నడుమఁ గన్నులుపోయినవాఁడు చాలవిచారించును. జాత్యంధున కేచింతయు నుండదు. మహారాజా! నీ వీతాంత్రికునిచేతిలోఁ జిక్కితి వేమి? నీవృత్తాంత మెఱింగింపుమని యడిగిన భోజుండునాకిది దిగ్భ్రమగానున్నది. ఇది యేదేశము? ఇది యేకశిలానగరముకాదా? అల్లాణభూపతియేకాఁడా దీనిం బాలించువాఁడు? మహాత్మా! నీ విందుంటివని విని పురందరపురము నుండి వచ్చుచుండ దారిలో మృగసమూహంబు సేవింప నెందేనింబోవుచున్న భైరవుండను తాంత్రికుండు మాకుఁ గనంబడియెను. వాఁడు స్త్రీలఁ జెఱపెట్టుచున్నాడని విని వాని శిక్షింపందలంచి తిరుగుచుంటిమి కావున వాఁడు గనంబడినతోడనే కోప మాఁగినదికాదు. పాపాత్మా!

నిలు నిలు, నీపీచ మడంచెద; లీలావతి నెందుదాచితివో చెప్పుమని యదలించుచు నడ్డముగా నిలువంబడితిని ఘోటకముఖుండు నడుముగట్టుకొని నాతో నిలువంబడి వాని మందలింపుచుండెను. దండధరుండనైయున్న నన్నుంజూచి మృగములు పారిపోవఁజూచెను. అంతలో వానిపరిజనులు మూఁగికొని మాతోఁ గలియఁబడుటకు నాయత్తపడిరి. చేత నాయుధము లేకున్నను వెఱవక మేఱురుపురము వెనుకకు మఱలక చేతనున్న కఱ్ఱలతో వారి నాపితిమి.

ఆతాంత్రికుఁ డెట్టనిగుడ్డతో నన్నుఁజూచుచు నేదియో పసరు నామీఁదఁ జల్లి నాకు స్మృతిలేకుండఁ జేసెను. అంతవట్టు జ్ఞాపకమున్నది. తరువాత నేమిజరిగినదియో నాకుఁదెలియదు. నామిత్రుఁడు నాపాటుజూచి చేయునదిలేక పారిపోయియుండును. ఇదియే నావృత్తాంతమని చెప్పిన విని కాళిదాసు కన్నీరుగ్రమ్మ వాఁడు గోట్రాగాఁజేసి యచ్చటికిఁ దీసికొనివచ్చి యాడించినవిధము మొదలగు వృత్తాంతమంతయు నెఱింగించెను.

అప్పు డల్లాణుం డుల్లమున సంతోషవిస్మయములు వెల్లివిరియ భోజునిఁ గౌఁగిలించుకొని మహానుభావా! కవిజనానీతంబులగు భవదీయయశోవిసరంబులు సంతతము మదీయకర్ణపర్వములు గావింపుచునేయుండెను. కాని దర్శనలాభం బెన్నండును గలుగలేదు. తాంత్రికుం డీరూపమున నాకు మహోపకార మొనరించెను. మీదర్శనము సేసి నేను గృతార్థుండ నైతిని. కింకరుండఁ బనులకు నియోగింపుము. పట్టభద్రుండవై యీకవిసార్వభౌమునితోఁగూడ నీరాజ్యము పాలింపుమని యత్యంతవినయముతోఁ బ్రార్థించిన భోజుం డిట్లనియె.

వదాన్యోత్తమా! ఇట్లనుటకు నీకకాక యొరులకు శక్యమా? ఇట్టివాఁడవగుటచే యీమహాకవి మీకడఁ జేరెను. మిమ్ము రాజ్యముకన్న నధికమైనవస్తు వొండు యాచించుచున్నాను. అది నాకు దయచేయుఁడు.

పరమానందభరితుండ నగుదునని యడిగిన నతండు చిఱునగవుతో నీరాజ్యమే మీాయధీనమునిన నన్నొందు యాచింపవలసిన వస్తువేమున్నది? అనుటయు భోజుండు దేవా! మతేమియునులేదు. ఈమహాకవిచంద్రుఁడు నాకుఁ బ్రాణము. ఈతని నాకు దయచేయఁ బ్రార్థించుచున్నాను. మీాకుఁ బ్రాణదానఫలంబు రాఁగలదని పలికిన నవ్వుచు నల్లాణుండు,

ఓహో! ఇదియా మీాయాశయము. ఇందులకు నాసెలవేమిటికి? మీాకు నేను బ్రేష్యుండఁగానే? మీాయభీష్ట మెట్లో యట్లే కావించెద నని వినయవినమితోత్తమాంగుండై పలికెను.

తరువాత భోజుం డంజలిపట్టుకొని కాళిదాసకవితో,

శ్లో॥ గచ్ఛత స్తిష్ఠతోవాపి జాగ్రతస్స్వప్నతోపివా
మాభూన్మనఃకదాచిన్మే త్వయావిరహితంకవే॥

ఆర్యా! నడుచుచున్నప్పుడును గూర్చున్నప్పుడును మేల్కొనునప్పుడును నిద్రబోవునప్పుడును నామనస్సు నీవియోగమును సహింపదు. నాతప్పులన్నియు మన్నించి ధారానగరంబునకు రావలయు. నీవులేనినగరంబు నేను సొరనొల్లనని వేడుకొనియెను. అతండును బ్రేమానుబంధబంధురములగు నృపతిమాటల కంగీకరించెను.

అల్లాణుఁడు భోజునకు గొప్పవిందు గావించెను. భోజుండు శుభముహూర్తమునఁ గాళిదాసు నొకపల్లకిపై నెక్కించి తాను పాదచారియై దండిపట్టుకొని నడుచుచు నాపురంబు బయలువెడలెను.

అని యెఱింగించి పిమ్మట నిట్లు చెప్పఁదొడఁగెను.

## 164 వ మజిలీ.

## యక్షునికథ.

దత్తునివలనఁ దనయక్కయగు రత్నపదికయున్నయిక్క యెఱింగినదిమొదలు సువర్ణపదిక యామెం జూచువేడుక పెచ్చుపెరుగఁ భర్తతో మనోహరా! మన మిప్పు డా యక్షశైలమునకుం బోవలయును మీమిత్రుఁ డాకథ యెఱింగించి మఱలఁ గనంబడలేదేమి? మనతో వచ్చి యాపర్వతమును జూపించునేమో యని యడిగిన సువర్ణనాభుండు ప్రాణేశ్వరీ! అతం డామాటచెప్పినతరువాత నిదిగో వత్తునని యెందో పోయెను. తిరుగాఁ గనంబడలేదు. వానినిమిత్తము పట్టణమంతయు వెదకితిని. తక్కినమిత్రులం జేరలేదు. గోణికాపుత్రుఁడు రాజపుత్రునకు మిత్రుఁడై యున్నవాఁడని యాతఁడే చెప్పెను. వానిం జూడ నేఁడు పోయితినికాని యంతఃపురములో నుండుటచే నావార్త వానికిఁ దెలియఁజేయువారే లేకపోయిరి. మఱల రేపు పోయిచూచెద. నామిత్రులందఱు వచ్చువఱకు నిందుండవలయును. తరువాత మీయక్కం జూడఁబోవుదము. గుఱుతులు వ్రాసికొంటినని చెప్పిన విని యమ్మగువ దిగులుదోఁప నిట్లనియె.

బుధప్రవరా! మేమిద్దఱ మేకగర్భజాతలము. చిరకాలముక్రిందట విడిపోతిమి, దైవికముగ దానిసేమము దెలిసినది. కాలవ్యవధి సహింపఁగలనా? మీరే చెప్పుఁడు. నన్నక్కడఁ జేర్చి మీరు వెంటనే రావచ్చును. మీమిత్రులందఱును గలిసినవెనుక నంపఁ దీసికొనిరండు. బయలుదేరుఁడు. అని దైన్యముదోఁపఁ బ్రార్థించినది. అతం డంగీకరించెను.

వారిద్దఱు శుభముహూర్తమున నుత్తమతురగారూఢులై దత్తుఁడెఱింగించినమార్గము ననుసరించిపోవుచు గుఱుతులుజూచుచు నుత్తరముగాఁ బోయిపోయి యేఱుల విమర్శించి మెట్టల దాటి వృక్షలతాదులఁ బరిశీలించుచుఁ దిరిగితిరిగి పదిదినముల కాశైలము గనుంగొనిరి.

రాత్రి దత్తునికిఁగనంబడినట్లె విద్యుత్ప్రభ వారికిఁ గనంబడినదికాని యప్పుడు పోలేక యారేయి నందు వసించిరి.

రాత్రియెల్ల సువర్ణపదిక నిద్రబోవక రత్నపదిక నెప్పుడుజూతును, ఎప్పుడు కౌఁగిలించుకొందు నెప్పుడు మాటాడుదునని తలంచుచు జాగరము జేసినది. సూర్యోదయ మైనది. చీఁకటు లంతరించినవి. బాలాతపముచే దిక్కులెల్లఁబడినవి. పక్షులు కులాయములవిడిచి నలుదెసలకుఁ బారుచుండెను. అప్పుడు సువర్ణపదిక సువర్ణనాభుని చెట్టఁ బట్టికొని యామెట్ట నెక్కుటకుఁ బ్రారంభించినది. దారి లేదు. విషమపాషాణకంటకాదులచే దుర్గమమైయున్నను జేతులతో నాని కొమ్మలఁబట్టికొనుచుఁ గొందెల దుముకుచు మెట్టల నెక్కుచుఁ బొదల దూరుచు జాముప్రొద్దెక్కువఱకు నెగఁబ్రాకి యతికష్టముమీఁదఁ యక్షాలయప్రాంగణవేదికకుఁ జేరిరి.

ఒడలు చీరికొనిపోయినది. మోమున రక్తము స్రవించుచున్నది. కట్టినవలువలు పీలికలైనవి. ఒకచో సువర్ణపదిక కాలుజాఱి పడినది. మోకాలునకు ఱాయితగిలి రక్తముగారుచుండెను. సోదరీదర్శనలాలసయగు నాసతి కావెతలేమియు నాటలేదు. ఆకుట్టిమము స్ఫటికమణిశిలచేఁ గట్టఁబడి సూర్యకాంతులు ప్రతిఫలింప మిఱుమిట్లుగొల్పుచున్నది. అలకాపురంబునంగల పుష్పజాతులన్నియు నందు నాటఁబడియున్నవి. షడృతువుల నందుఁగట్టిపెట్టిన ట్లన్నికాలముల పూవులు వికసించి వాసనల వెదజల్లుచున్నవి. ముహూర్తకాలమందు విశ్రమించినంత వారి యాయాసమంతయు నంతరించినది.

యక్షాలయమున ద్వారశాఖలుగా సమర్పఁబడిన రత్నములయందు లోపలివిద్యుద్దీపములు ప్రతిఫలించి రాత్రుల విశేషతేజము వ్యాపింపఁజేయుటచే నాగిరిక్రింద నొకచక్కి వసించినఁ గనంబడును. ఆ తేజమే లేనిచో నాయక్షాలయ మందున్నదని బ్రహ్మ తెలిసికొనఁజాలఁడు.

అందున్న రత్నకాంతులు పుష్పవాసనలు సువర్ణనాభునిహృదయ మునకు మిక్కిలి యక్కజము గలుగఁజేయ దాపునకుఁ బోయి పరీక్షిం చుచుండెను.

అప్పుడు సువర్ణపదిక మెల్లగా గుహాముఖద్వారంబున నిలువం బడి అక్కా! రత్నపదిక! అక్కా! రత్నపదిక! అని పెద్దయెలుంగున యక్షభాషతోఁ బిలిచినది. ఆధ్వనివిని రత్నపదిక తటాలున లేచివచ్చి తలుపుతీసి యెదురనున్న సువర్ణపదికంజూచి నీవెవ్వతెవనఁబోయి యం తలో అమ్మనేజెల్ల! నాముద్దుచెల్లెలు సువర్ణపదికయే. తల్లీ! యెట్లు వచ్చితివేయని గాఢాలింగనము సేసికొనియెను. సువర్ణపదిక నానందబా ష్పములతోఁ బ్రత్యాశ్లేషము గావించి సంతోషముచేఁ గంఠమురాక డగ్గుత్తికతో అక్కా! సేమముగా నుంటివా? బావ యేఁడి? నిన్నుఁజూచి మూఁడుసంవత్సరములైనది. ఇఁకఁ జూపు నోరకదేయనుకొంటిని దైవి కముగా వచ్చితినని చెప్పినమాటయే చెప్పుచు నడిగినమాటయే యడు గుచుండ రత్నపదిక యానందబాష్పములచేఁ జెల్లెలిశిరము దడుపుచు నిట్లనియె.

సహోదరీ! అక్కటా! నీకొఱ కెంత పరితపించుచుంటినను కొంటివి? మీబావయు నీమాట దలపెట్టినప్పుడెల్ల కన్నుల నీరునిం తురు. మే మిందుంటిమని యెవ్వరుచెప్పిరి? ఎచ్చటుండివచ్చితివి? అలకాపు రంబున మనబంధువులు స్నేహితులందఱు కుశలముగా నున్నారా? కుబే రధూర్తుఁ డేమిచేయుచున్నాఁడు? ఎన్నఁడైన మమ్ముఁ దలపెట్టునా? మే మిందుఁజేరి హాయిగా సుఖించుచున్నాము. ఈగుహామందిరము లోప లఁ బెద్దపట్టణమంత యున్నది. అలకాపురంబునంగల వింతవస్తువులు రత్నంబులు మీబావ తీసికొనివచ్చి యిందుంచిరి. నీవు దాపునలేనికొ దవతప్ప నేలోపము లేదు. నీ వప్పుడు మాతో రమ్మనిన సంగీతలాలసవై వచ్చితివికావు. మేమువచ్చినతరువాత జరిగినకథయంతయుఁ జెప్పు

మని యడిగిన సువర్ణపదిక యిట్లనియె.

మీరులేనినగరములో నేనుమాత్రము వసింతునా ? సంగీతా భ్యాసవ్యసనంబునం జేసి మీతో రానంటి. రాజరాజు మనకుటుంబముపై నీసుబూని యపరాధముల విమర్శింపఁడయ్యె. వానిబానిసవాఁడు నన్ను నిర్బంధింప నిష్టపడక వానియపరాధము తేనికిఁ దెలియఁజేయ వినుపించుకొనలేదు. మీ రెందుండిరో యెఱుఁగను. అప్పు డొకసిద్ధుని యుపదేశంబున నొకశైలమున కరిగి శంకరు నారాధించితిని. దైవవశమున నందువచ్చిన సువర్ణనాభుఁడను మహాపండితుం బెండ్లియాడితిని. వారి తో దేశములు దిరుగుచు ధారానగరంబునకు వచ్చితిమి. అందు వీరిమి త్రుఁడు దత్తకుండనువాఁడు మీశైలవృత్తాంతమంతయు నెఱింగించిన వచ్చితిమని పలుకుచు అక్కా! వారన్నట్లే చేసితిని. మీయక్కం జూచిన తోడనే నామాట మఱచిపోవుదువని యాక్షేపించిరి. నాభర్త వాకిటఁ బుష్పవాటీవిశేషములఁ జూచుచున్నారు. వచ్చి యాతిథ్యమిమ్మని చెప్పి న సంతసించుచు నాకాంత లేచి యర్ఘ్యపాద్యాదులుగొని ద్వారముఖం బునకుఁ బోయి సువర్ణనాభు నాదరించుచు లోపలికి రమ్మని చెల్లెలిచేఁ జెప్పించినది.

సువర్ణనాభుండు మందిరాంతరమ్మున కరిగి రత్నపదికఁజూప భా ర్యతోఁగూడ నందలివిశేషములన్నియుఁ జూచుచు విభ్రాంతినొందుచు నయ్యవస్థ స్వప్నగతంబని తలంచుచుండెను. రత్నపదిక వారిరువుర మృ ష్టాన్నములచే సంతృప్తులం గావించినది. ఇష్టాలాపములచే వారు నాఁ టిదివసము దృటిగా వెళ్లించిరి. దివసకరుం డపరగిరిపరిసరము సేరు నంత యక్షుం డాకాశమార్గంబున నొకమయూరమును జేతంబూని యాత్మీయనివాసమున కరుదెంచెను.

రత్నపదిక సువర్ణపదికతోఁగూడ భర్తయొద్దకుఁ బోయి పాద్య మిచ్చి ముసిముసినగవులు వెలయింపుచున్న సువర్ణపదికం జూపుచు నిది

యెవ్వతెయో యెఱుఁగుదురా? అని యడిగిన నతం డామెం జూచి యో హోహో! సువర్ణపదికవా! యెప్పుడువచ్చినది? ఎట్లువచ్చినది? మ గని సంపాదించినదా? ఏమి? యని పలుకుచు దగ్గరకుఁ జేరదీసికొని గారవించెను.

సువర్ణపదికయు నతనికి నమస్కరించుచుఁ దనవృత్తాంతమంతయు నెఱింగించినది. యక్షుండు మందహాసముగావించుచు నాపండితుండేఁడీ? ఇందున్నవాఁడా? అని యడిగిన రత్నపదిక పుష్పవాటికలోనున్నవారని చెప్పినది. సువర్ణపదిక పోయి తీసికొనివచ్చినది. అతండు యక్షునకు నమస్కారము గావించెను. యక్షుండు నారించుచు మీరు భూసురులు పండితప్రవరులు మీరు మాకు వందనీయులు మే మాశీర్వచనపాత్రులమని పలికిన సువర్ణనాభుండు భూసురలకన్న దివిజు లెక్కువవారుకారా? మనుష్యులకు దేవతలు వంద్యులని యుక్తియుక్తముగా ననువదించెను.

ఆవిషయమై యిరువురకుఁ గొంతసేపు ప్రసంగము జరిగినది. అందు సువర్ణనాభుని విద్యాపాటవము తేటపడుటయు యక్షుఁడు మిగుల సంతసించుచు నతనిఁ బెద్దగా గౌరవించి యర్చించెను. సువర్ణపదిక యక్షునితో బావా! నీవు నిత్యము నెందుఁబోవుచుందువు? నీవు తీసికొనివచ్చిన మయూర మెక్కడిది? వింత లేమని యడిగిన నతం డిట్లనియె.

మీసందడిలో నామాట చెప్పుట మఱచిపోయితిని. నేను భూమియంతయుఁ దిరిగి వచ్చుచుందును. వినుము. నేఁడొక యరణ్యమార్గంబున వచ్చుచుండ నొకచోట మృగముల నాడించువాఁ డొకఁ డీనెమలి కాలిత్రాడు జారిపోయిన నది యెగిరి వృక్షాగ్రముల వసించినది. దానిం బట్టికొనలేక విసిగి చంపుటకు రాళ్ళు విసరుచుండఁ జూచి దీని నెత్తుకొని తీసికొనివచ్చితిని. ఇదియే దీనికథ. పెంపుడిదో యడవిదో నాకుఁ దెలియదు. దీనిం దెచ్చినవేళ మంచిది. మిమ్ముఁ జూడఁగంటిమి. నీకుఁ గానుక

గా నిచ్చెదఁ గైకొనియెదవా? యని యడిగిన సంతసించుచు సువర్ణపదిక దానిం దీసికొనివచ్చి విమర్శించుచు నీలకంఠమా ! నీ వభిఖ్యచే శంకరుం బోలితివి. బర్హాముఁవిప్పి తాండవముసేయుము. అని పలుకుచు నాహా ! భగవంతుఁడను చిత్రకారుఁడు దీని కెన్నిరంగులువైచెనో! అని వింతగాఁ జూచుచు నది బెదరకున్న మెడ నువ్వి దువ్వి మెడకుఁ గట్టఁబడియున్న తాయెత్తును సడలించినది.

అప్పు డామయూర మొకసుందరియై నిలువంబడినది. అయ్యువతీవతంసకును జూచి రత్నపదికయు సువర్ణపదికయు వెఱఁగుపడుచు సమీపించి యిట్లనిరి. తల్లీ! నీ వెవ్వనియిల్లాలవు? నీపే రేమి? ఇట్టినికూధపురూపు ధరించియుంటివేల ? నీయుదంత మెఱింగింపుమని యడిగిన నాప్రోయాలు నలుమూలలు సూచుచు విభ్రాంతితోఁ గాంతలారా ! మీ రెవ్వరో నే నెఱుంగ నకారణవాత్సల్యముతో నన్ను బ్రతికించితిరి. మీకడ నిజము దాచరాదు. వినుండు. నేను ధారానగరాధీశ్వరుండైన భోజమహారాజు భార్యను. నాపేరు లీలావతి యందురు. నే నభాగ్యవశంబున భర్తకెడమై యడవిలోఁ గ్రుమ్మరుచు ఘోటకముఖుండను విద్వాంసునియాశ్రయమున నరుగుచుండ నొకతంత్రజ్ఞుని మాయామహిమచే మయూరమునైతినని తనకథయంతయు నెఱింగించెను.

ఆవృత్తాంతము విని యక్షుండు గుండెపైఁ జేయివైచుకొని అబ్బా ! రండాపుత్ర! నీవెట్టిక్రూరుఁడవురా? నీకడనున్న మృగములన్నియు నిట్టివేకాఁబోలు ! నిన్ను వెదకి పట్టికొని శిక్షింతును చూడుము.

తల్లీ ! లీలావతి ! మహానుభావుండైన కాళిదాసుం బాలించుచున్న భోజభూభుజుని యిల్లాలవా ? అయ్యారే ! మే మెంత ధన్యులము. నీపాదధూళిసోకి మాయిల్లు పవిత్రమైనది. అమ్మా ! నీకు వచ్చినభయము లేదు. నిన్నుఁ బ్రాణపదముగాఁ జూచుచుఁ దీసికొనిపోయి నిన్ను నీభర్తతోఁ గూర్తుము అని యూఱడించెను.

సువర్ణనాభుం డావార్త విని అమ్మా! నీకు సహాయముచేసిన వాఁడు ఘోటకముఖుండంటివి. అతఁడు నామిత్రుఁడు. తరువాత నతం డేమయ్యెనో యెఱుంగుదువా? యని యడిగిన నామె నాకేమియుం దెలియదు. కుక్కలు తఱుముకొనిపోయి కఱచినవి. నేలంబడిపోయెను. పిమ్మట నే నోడలు తెలియక నెమలినైపోవుటచేఁ బూర్వస్మృతి తప్పిన దని చెప్పి మీరెవ్వరు? కాళిదాసు నెఱిఁగినట్లు మాట్లాడుచున్నారు. వారితో మీకుఁ బరిచయ మెక్కడ కలిగినది? మీవృత్తాంతము చెప్పి యానందింపఁజేయుఁడని వేఁడిన సువర్ణపదిక తమవృత్తాంతమంతయు నెఱింగించినది.

ఆకథ విని లీలావతి వారిరువురం గౌఁగిలించుకొని పడఁతులారా! మీరు దేవతలు. మీదర్శనముచేసి మనుష్యులు కృతార్థులగుదురు. నేను ధన్యురాలనని పొగడుచు భోజునివృత్తాంతము మీ కేమైనఁ దెలిసినదియా? యని యడిగిన యక్షుండు రేపు వోయి తెలిసికొనివచ్చెద నీవు విచారింపవలదని యాదరించెను.

రత్నపదిక యారాజభార్యను గుహాంతరమునకుఁ దీసికొనిపోయి యందలివింతలన్నియుం జూపెను. మనుష్యలోకములో నట్టియలంకారము లుండవు కావున వానింజూచిన విభ్రమము గలుగకమానదు. వా రారాత్రి విందు లారగించి గుహాప్రాంగణమందున్న స్ఫటికశిలావేదికపైఁ గూర్చుండి యిష్టాలాపము లాడికొనుచున్నసమయంబున రత్నపదిక భర్త కిట్లనియె.

మనోహరా! ఇక్కందరమందిరము మనుష్యులు తెలిసికొనఁ జాలరనియు నేకాంతప్రదేశమనియుం జెప్పితిరే? ధారానగరంబున వీరిమిత్రుఁ డెవ్వఁడో చెప్పెనఁట! వాని కెట్లు తెలిసినది? మీరు నాతో నన్నమాట యసత్యమా? అనియడిగిన యక్షుండు తరుణీ! మఱచితివా? నాఁ డొకబ్రాహ్మణుఁడు దారితప్పి రాత్రివేళ మనయింటికి రాలేదా?

వానింజూచి నీవు సిగ్గున లోపలికిఁ బోయితివి జ్ఞాపకములేదా ? తరువాత వాని నాఁడుదానిగా శపించితిమి. ప్రార్థింప సంవత్సరమే యాఁడుతన ముంఘునట్లు కరుణించితిని. ఆతండే వీరి కీవార్త చెప్పియుండును. అనిపలుకుచు సువర్ణనాభునితో నార్యా! మీతో మాయున్నయిక్క ఱెఱింగించినవాఁడు ఏమయ్యెను ? ఆఁడుది కాలేదా ? అనియడిగిన నతండు హాహాకారము గావింపుచు నిట్లనియె.

అయ్యో ! నామిత్రుఁడు సంతోషాతిశయంబున శాపప్రవృత్తి మఱచి మీ తెఱం గెఱింగించె నది మన కుపకారమైనది. అతండు స్త్రీయైపోయినది యెఱుంగక పెద్దతడవు వెదకితిని. ఎందునుం గనంబడలేదు. ఆహా ! దైవనియోగము. అఖండపాండిత్యధురంధరుండగు నామిత్రుఁడు దత్తుం డిప్పుడు మత్తకాశినియై పూర్వస్మృతిలేక చరించుచున్నాఁడా ? కట్టా ! ఆయిక్కట్లు వాని కెట్లుపాయును. మహాత్మా ! అతనిమూలమున నేకదా మనమందఱము గలిసికొంటిమి. నన్నుఁబట్టి యాతండును మీ కాప్తుండయ్యెను. తచ్ఛాపవిముక్తిఁ గావింపవలయునని వేఁడుకొనియెను.

రత్నపదిక యాతఁడా ? అయ్యో ! పాపము స్త్రీయైపోయెనా ? అట్టిహితుండు మఱియొకఁడు మనకు లేఁడు. వానిం గాపాడక తీరదు. వేగమ శాపనివృత్తిఁ గావింపుఁడని నిర్బంధించినది. సువర్ణపదికయు నామాటయే బలపఱచినది. అట్లుచేయుట కతం డంగీకరించెను. ఆరేయి సుఖముగా వెళ్లించిరి.

మఱునాఁడు యక్షుఁడు వానికపరిశారము బయలుదేరి యామంత్రజ్ఞుఁడుచేయు కపటంబులం దెలిసికొనుటకై యాతఁడున్న యరణ్యమునకుం బోయి ప్రచ్ఛన్నముగా మృగములను బక్షులను బరామర్శింపుచుఁ గావలివారలు సూడకుండ నొకచిలుక నెట్లో పట్టికొని చేతిపై కెక్కించుకొని నాఁడు పెందలకడ నింటికివచ్చి సువర్ణపదికం జీరి బాలా !

యీవేళ నీ కీకీరమును దెచ్చితిని. దీనింగూడ స్త్రీని గావింతువా ? యని పరిహాస మాడుటయు సువర్ణపదిక యాచిలుకనందికొని ముద్దాడుచుఁ గీరమా ! నీవుగూడ మయూరమువలె మనుష్యకాంతవు కావుగద ! అవును. సందియమేలా ? ఇదిగో మెడకుఁ దాయెత్తు గట్టఁబడియున్నది. అనిపలుకుచు నాతాయెత్తు లాగిపారవైచినది.

దివ్యమంగళవిగ్రహము సర్వావయవసుందరము గలిగి యక్షకాంతల సిగ్గుపఱచుచు నొకసుందరి వారిముందర నిలువంబడినది. పదునాలుగేఁడులప్రాయము చక్కని మొగము సంపూర్ణలావణ్యము గలిగి మెఱయుచున్న యాబాలికారత్నమును జూచి వెఱఁగుపాటుతో లీలావతి పుత్రీ ! నావలె నీవుగూడ నాకపటాత్మునిచేతిలోఁ బడితివా? అయ్యో! చిన్నదానవు. తలిదండ్రులచాటుదానవు. నీపేరేమి ? ఎవ్వనిభార్యవు ? నీవృత్తాంతము చెప్పుము. వీనిచే నెట్లుచిక్కితివి? అనియడిగిన నాచిన్నది తెలతెల్లపోయి చూచుచు నిట్లనియె.

దేవీ ! ఇప్పుడు నామది భ్రమజెందుచున్నది. ఇది స్వప్నమా ? నిజమా ? ఇది యేదేశము ? నే నిక్కడి కెట్లువచ్చితిని ? మాతలిదండ్రు లేరీ ? అడవిలోఁ గ్రూరాత్ముఁ డెవ్వఁడో మమ్ము వెఱపించెనే. అమ్మా ! నాపేరు మల్లిక. బ్రహ్మదత్తుండను విప్రునికూఁతురను. చారాయణుఁడను పండితునిభార్యను. నాభర్త నన్ను వివాహమాడి తనమిత్రుల దత్తకాదులంజూడ ధారానగరంబున కరిగి వెండియు రాఁడయ్యె నాయననిమిత్తమై నాతలిదండ్రులు నన్ను వెంటఁబెట్టుకొని ధారానగరంబున కరుగుచుండ దారిలో నొకక్రూరుఁడు మా కడ్డమై యదలించెను. అంతవఱకు జ్ఞాపకమున్నది. తరువాత నేమిచేసెనో యేమైతిమో తెలియదని తనకథ యంతయుం జెప్పినది.

సువర్ణనాభుం డావార్తవిని యేమేమీ ! నీవు చారాయణుని భార్యవా ? ఆతండు నామిత్రుఁడు. అన్నన్నా ! యెట్టియాపదం జెందితివి?

నీతల్లిదండ్రులుగూడ వానికట్టులోఁ బడియున్నారు. నీవు చింతింపకుము. మేము ధారానగరంబున కరుగుదుము. నామిత్రునితోఁ గూర్తుము అని యూఱడంబలికి యక్షేంద్రా! ఆపాపాత్మునొద్దనున్న మృగములన్నియు నిట్టివేసుఁడీ! మీరువోయి మఱికొన్ని మృగములం బట్టుకొని రావలయు నీయుపకారము సేయవలయు వాని శిక్షించుచుపాయ మరయవలయు నని ప్రార్థించెను.

సువర్ణపదికయు రత్నపదికయు లీలావతియు నామల్లికకుఁ దమ బంధుత్వము దెలియఁజేసి యాదరించి యూఱడించిరి.

ఆమఱునాఁడుదయంబున యక్షుండు వెంజీయు బయలుదేరి యాభైరవుఁడున్న యడవికిఁబోయి తిరోహితుండై వాఁడు చేయుపనులఁ బరీక్షించి చూచుచుండెను. ధారానగరమునఁ గాళిదాసుం గౌరవించు నిమిత్తము గొప్పసభ జరగుననియు నప్పటికి మృగములతోఁగూడ నీవువచ్చి వినోదములఁ జూపించి గొప్పకానుకలంది పొమ్మని భోజన్మృ పాలునిమంత్రు లాభైరవున కాహ్వానపత్రిక నంపిరి.

ఆభైరవుం డంచుల కామోదించి నాఁటిమధ్యాహ్నము బరువు మీసెడుగాడిద నొకదానిమెడలో వేఱొకతాయెత్తును గట్టి మేకను గావించి దీనింగోసి నేఁడు కూరగావండుమని వంటవాని కర్పించెను. వాఁడు దానింగోయుటకుఁ జెట్లమాటునకుఁ దీసికొనిపోయెను. ఆమార్పులన్నియుం జూచుచున్న యక్షుం డావంటవానిం జేరి యోరీ! నీ కీరత్నకంకణ మిచ్చెద నీమేకం జంపక నాకిత్తువేయని యడిగిన వాఁడు కనుసన్న సేయుటయు రహస్యముగా నాకడియము వానికిచ్చి యామేక నెత్తికొని గగనమార్గంబునఁ దనయింటికిం బోయెను.

వానిసవాఁడు వేఱొకమేకను స్వల్పవిత్తమునకుఁ గొని కోసి వండి భైరవున కాహారముగా నిడియెను. యక్షుం డామేకతో నెలవునకరిగి యంత నందఱు మూఁగికొని వీఁడెవ్వఁడో యని యాలోచించుచు మెడ

లోనియోషధి లాగిపారవైచిరి. ఆమేష మొక్క చక్కనిపురుషుండై నిలువంబడి నలుమూలలు సూచి హా పాపాత్మా! ఎంతపని జేసితివిరా? ఛీ, ఛీ, నీ వేనరకమునకుఁ బోవుదువో గురుద్రోహీ! దయాసింధువగు నిమ్మహాత్ముశిరంబు పగుల నెట్లు పాషాణమువైచితివిరా? కృతఘ్నా! కనంబడవేమి? యెందుఁబోయితివి? అయ్యో! నాగురువు నాదైవము బలవన్మరణమునొందె నతనికళేబర మేమిసేసితివిరా? అని యూరక దుఃఖించుచుండెను. సువర్ణనాభుండు విమర్శించిచూచి యోహో! వీఁడు నామిత్రుఁడు చారాయణుఁడు. వానిచేతిలోఁ బడెనా? అయ్యో! పాపము మల్లిక వీఁడు ధారానగరమున కరిగెనని చెప్పినది. ఈయంతరాయ మెఱుఁగడు. చారాయణా! నాదెస జూడుము. నే నెవ్వఁడనో యెఱుఁగుదువా? ఎవ్వనినో నిందించుచుంటివి? వాఁడెవ్వఁడు? నేను నీమిత్రుఁడ సువర్ణనాభుఁడనని పలికినతోడనే యతండు కన్నులెత్తిచూచి యౌరా! ఏమిచిత్రము! నీ వెక్కడినుండి వచ్చితివి? తక్కినమిత్రు లెందుండిరా? అని పలుకుచు సువర్ణనాభుని గాఁగిలించుకొని హృదయంబునఁగల ప్రీతిని వెల్లడించెను.

పిమ్మట సువర్ణనాభుండు మిత్రమా! నీవృత్తాంతము కొంత మేము నీభార్యవలన వింటిమి. ఆవాల్గంటి యిందున్నది. మీయిద్దఱు నొక్కని చేతిలోనే చిక్కి యొక్కచోటనే యుంటిరి. అని యక్షునివలన రక్షింపఁబడినవిధ మెఱింగించెను. తనభార్యవృత్తాంతము విని చారాయణుండామెం జూచుటకు మిక్కిలి తొందరపడియెను. ఇంతలో నావార్తవిని మల్లిక గుహాముఖంబునకువచ్చి భర్తంజూచి సిగ్గుచే దాపునకుఁ బోలేక కన్నీరుగార్చుచు దుఃఖించినది

చారాయణుండు తటాలున నారమణిం గాఁగిలించుకొని యక్కునం జేర్చికొని కన్నీరుమడుచుచు సాధ్వీ! నీ తెఱంగు వింటిని. నన్ను వాఁడు గాడిదం జేసి బరువు మోయించుచుండెను. చంపుటకై మేకం జేసెను.

క్షణము దాటిన శాకఘటంబునం జేరువాఁడనే. యక్షుండు రక్షించె. నీకును నాకునుగూడ నాయనయే తండ్రి. దుఃఖింపకుము. మీతలిదండ్రులఁగూడ దీసికొనిరాఁగలండని యోదార్చుచు యక్షకాంతల బంధుత్వము దెలిసికొని లీలావతివృత్తాంత మాకర్ణించి పరమానందభరితుండై యాభైరవునికథయంతయుం జెప్పి వాని సంహరించుటకుఁ దోడ్పడుమని యక్షుం బ్రార్థించెను.

యక్షుండు చారాయణునిమాట విని బాబూ! వాఁడు మంత్రతంత్రముల నెఱింగినవాఁడు. వానిచేతఁజిక్కినేని నాపనికూడ పట్టఁగలఁడు. వానిని బరిభవించు తెఱఁగు మఱియొకటి గలదు వినుము. వాఁడు పదిదినములలో ధారానగర మరుగఁగలఁడు. కాళిదాసుం గౌరవించునిమిత్తమై పెద్దసభ జరగునఁట. ఆసభకు వీఁడు పోవుచున్నాఁడు మనముగూడ నాఁటి కవ్వీటికిఁబోయి వీనిదుర్నయమంతయు నారాజున కెఱింగించి యానృపతిచే వాని శిక్షింపఁజేయుద మిదియే నాకుఁ దోఁచినయూహ. మీరుగూడ నాలోచింపుఁడని పలికెను. అందఱు నందుల కొప్పుకొని ధారానగరమ్మునకుఁ బోవ ముహూర్తము నిశ్చయించుకొనిరి.

ఈలోపల నాభైరవుం డెందున్నాఁడో? యావీటి కరుగుచున్నాఁడో లేదో చూచివచ్చెదనని పలికి యమ్మఱునాఁడు యక్షుండు మఱల వాఁడున్న యడవికింబోయెను వాని పరివారమంతయు ధారానగరంబునకుఁ బోవుచుండెను. నడుమనడుమ నివసించుచుండిరి.

మేకనమ్మి రత్నకంకణముసంపాదించి మఱియొక మేకమాంసము పెట్టెనని వేఱొకపరిచారకుఁడు భైరవునితోఁ జెప్పి యాతప్పు పట్టియొప్పగించెను. భైరవుఁడు క్రోధభైరవుండై బానిసవానిని శిక్షించి అక్కటా! ఎవ్వఁడో నామృగములరహస్యము దెలిసికొని వెనువెంటఁ దిరిగి మృగములఁ బశులం దీసికొనిపోవుచున్నాఁడు. తెలిసికొనలేకపోయితిని. అక్కటా! ఆబ్రాహ్మణబ్రువునిమాంసము దిని కసిదీర్చికొంటిననుకొంటి,

తప్పినది. అని వానింబట్టికొనుటకు రహస్యముగాఁ బెక్కండ్రగూఢచారుల నియోగించి పట్టియిచ్చినవానికి గొప్పపారితోషికమిత్తునని దెలియఁ జేసెను.

ఆరహస్యము యక్షుం డెఱుఁగఁడు. తిరోహితుండుగాక మెల్లఁగా మృగములతో నడుచుచున్నసమయంబున వాని వెంట నడుచుచుండెను. గూఢచారుం డొకఁ డతనిఁబట్టికొని భైరవుని కర్పించి వీఁడే మేషచోరుఁడు వెంటవెంటఁ దిఱుగుచున్నాడని తెలియఁజేసెను. అప్పుడు భైరవుఁడు కోపముతోఁ దొత్తుకొడుకా! మృగముల నెత్తికొనిపోవుచున్నావా? నీపని యిఁకఁ జూచుకొమ్ము అనిపలుకుచు గట్టిగఁబట్టికొని నెత్తిపై మందురుద్ది తాయెత్తుగట్టి పెద్దగాడిదం గావించెను.

యక్షుం డైననేమి? యింద్రుం డైననేమి? ప్రారబ్ధ మనుభవింప వలసినదేకదా! భైరవుం డట్లు పెక్కండ్ర మృగములఁజేసి తనకుఁ బెద్దకానుక దొరకునని యాసతో నామృగసమూహముతోఁగూడ ధారానగరమున కరిగెను.

యక్షుం డానాఁడును రాలేదు. మఱునాఁడును రాలేదు. మూఁడవనాఁడును రాలేదు. యక్షపత్ని మిక్కిలి దుఃఖించుచు సువర్ణనాభునితో నార్యా! నాభర్త యెంతపనియున్నను వరుసగా రెండురాత్రుల కన్న నెందును నిలువడు? ఏదోయాటంకము గలిగినది. ఆపాపాత్ముఁడు వారింబట్టుకొని బంధించెనుకాఁబోలు. అయ్యో! దైవమా! నే నేమిచేయుదును. మహాత్మా! యుపాయ మాలోచింపవా? అని శోకించుచుఁ బలికిన నూఱడింపుచు సువర్ణనాభుఁ డిట్లనియె.

తల్లీ! నీవు విచారింపకుము. యక్షుం డెందున్నను వెదకి తీసికొని రాఁగలము. మఱియు వాఁడు మృగములతోఁగూడ సభాదివసంబునకు ధారానగరంబున కరుగునని నీభర్త చెప్పియున్నాఁడు. మనమందఱము నాఁటి కందుఁ బోవుదము. అన్నికార్యములు దీరఁగలవని చెప్పెను. ఆ

మాట కందఱు నేకగ్రీవముగా నంగీకరించిరి. మంచిముహూర్తమున బయలుదేరి యందఱును కొన్నినాళ్ళకు ధారానగరంబు చేరిరి.

అనియెఱింగించువఱకు వేళ యతిక్రమించినది. తదనంతరోదంతం బవ్వలిమజిలీయందుఁ జెప్పఁదొడంగెను.

---

## 165 వ మజిలీ.

---

భోజరాజపుత్రుండు చిత్రసేనుఁ డొకనాఁడు గోణికాపుత్రుని తో నేకాంతప్రదేశమునఁ గూర్చుండి యిట్లు సంభాషించెను. మిత్రమా! పూర్వజన్మకర్మఫలంబులు కడువిచిత్రములు సుమా! సుఖమిళితమైన దుఃఖము దుఃఖమిళితమైనసుఖము గలుగుచుండును కాని కేవల మేది యొకటి చిరముగానుండదు. చారుమతిసంయోగంబు సంతోష దాయకంబు. దాన నానందింపుచుండ నిపు డొకదుర్వార్త వినంబడినది. అది పరమరహస్యమైనను నీ వాప్తుండవుగావునఁ జెప్పుచుంటి వినుము. నాచెల్లెలు రుక్మిణిచరిత్రము శంకాస్పదమై యున్నది. అది గర్భవతియై నట్లు తెలియవచ్చినది. వెనుక దానిగుట్టుమెక్కి యొకపురుషుఁ డుద్యాన వనములోనికివచ్చెను. ఆపరీక్షకై నేనుబోయినఁ జారుమతిం జూపుచు నిదియే వచ్చినదని బొంకినది. స్త్రీలెఱింగినమాయలు బృహస్పతికిని శుక్రాచార్యునికిఁగూడఁ దెలియవని శాస్త్రములు చెప్పుచున్నయవి. మా తండ్రి దాపునలేకపోవుటచేత నీభారము నామీఁదఁ బడినది. చారుమతి మోహములోఁబడి నే నొండు విచారించితినికాను. ఇప్పు డేమిచేయఁదగి నది? యుపాయ మేమి? ఈయల్లరులువినినఁ దండ్రిగారు చాల కోపిం తురు. వయస్యా! కర్తవ్య మెఱింగింపుమని యడిగిన గోణికాపుత్రుఁ డిట్లనియె.

రాజపుత్రా ! సోదరీగర్భకారణుం డెవ్వండో తెలిసికొని వానికే యామానవతినిచ్చి వివాహము గావింపవలయు. రుక్మిణి సామాన్యని వరింపదు. రాజకన్యలకు గాంధర్వవివాహం బుత్తమముకాదే? మఱియు మీతండ్రిగారివార్త మఱలం దెలిసినదా ? మొన్నటిజాబులోం జాలదాపునకు వచ్చితిమని వ్రాసిరే. కాళిదాసమహాకవి నందలముపై నెక్కించి తాను పల్లకీతో నడిచివచ్చుచున్నారంట కాదా ? తరువాతివార్త లేమని యడిగిన రాజపుత్రుం డిట్లనిమె.

మొన్నటివార్తకన్నం గ్రొత్తవార్త లేమియుం దెలియవు. నేండో రేపో రాంగలరు. వత్తురనిన నాకు గుండెలు కొట్టుకొనుచున్నవి. అని మాటాడుకొనుచున్నసమయంబునం బ్రధానామాత్యుం డరుదెంచి రాజపుత్రు నాశీర్వదింపుచు భర్తృదారకా ! మహారాజుగారు రేపుసూర్యోదయమునకు వత్తుమని యిప్పుడే వార్తనంపిరి. వెనుక వారువ్రాసినప్రకారము పట్టణమంతయు నలంకరింపంజేసితిమి. నానాదేశభూపతులకు నాహ్వానపత్రికల నంపితిమి. పండితులు కవీంద్రులు వేనవేలు వచ్చియుండిరి, వచ్చుచున్నారు.

భైరవుండను మృగవినోదకారుని వారే రప్పింపుమని వ్రాసియున్నారు. వాండును వచ్చి తోటలో విడిసియున్నాండు. నాటకులు పాటకులు లక్షోపలక్షలు వచ్చుచున్నారు. వెనుక సంగీతముపాడిన చేడియ సపరివారముగా వచ్చినది. మహాసభాదివసంబున నారకయే సంగీతముపాడి యాకాళిదాసకవి యాశీర్వచనమునకుం బాత్రురాల నగుదునని తెలియంజేసినది. మఱియు గోవర్ధియుండు కుచుమారుండు లోనగు విద్వత్ప్రభువులు వచ్చియున్నారు. వారందఱకుం దగిననెలవు లేర్పఱచితిమి. పట్టణమంతయుం గ్రొత్తవారిచే నిండింపంబడియున్నది. రేపుప్రొద్దున్న మేళతాళములతో వారికి మన మెదురేగవలయును. మీరుగూడ రావలయునని నివేదించిన సంతోషించుచు రాజపుత్రుం

డంగీకారము సూచించుచు మంత్రి నభినందించెను.

గోణికాపుత్రుఁడు గోనర్దీయునిఁ గుచుమారుని రాజులంటివి- వారియుదంత మెఱుఁగుదువా ? అని యడిగిన మంత్రి పేరులుమాత్రము వినియుంటిని. వారియుదంతము నాకేమియుం దెలియదని యుత్తరమిచ్చెను. రాజపుత్రునకుఁ జేయఁదగినకార్యములన్నియు నెఱింగించి ప్రధాని యరిగెను. పిమ్మటఁ జిత్రసేనుం డా రాత్రియెల్ల రుక్మిణీగర్భధారణముగుఱించియుఁ జారుమతీసంబంధము గుఱించియు రాజు విని యేమనునో యను వెఱపుతో నాలోచించుచు నిద్దురబోవఁడయ్యెను.

మఱునాఁ డరుణోదయముకాకమున్న మంత్రిసామంతహితపురోహితప్రముఖులు మంగళవాద్యములతోఁ బట్టభద్రగజంబు నలంకరించి తీసికొని యూరిబయలనున్న యుద్యానవనమున కరుగుచున్నారు. దేవర విచ్చేయవలయునని యమాత్యప్రేరితుండగు పరిచరుం డెఱిగింప సంభ్రమముతో రాజపుత్రుండు దివ్యాలంకారభూషితుండై మిత్రులతోఁగూడ బయలుదేరి సామంతవర్గముం గలసికొని నగరబాహ్యోద్యానవనంబునం దదాగమనం బభిలషించుచున్నంత భేరీఝాంకారధ్వనులు వినంబడినవి. అప్పుడు,

సీ. బంగారురతనాలపల్లకీ యెక్కించి
          కాళిదాసుఁ గవీంద్రవరాళికలిత
పాదభాసురు దండిబట్టుచు నొకచేత
          నొకచేతఁ జామరం బొగిధరించి
విసరుచు భోజుండు గసవు ముల్లును దాయి
          మిఱ్ఱుపల్లముల రొంపియు గణింప
కోరిమితోఁ బాదచారియై యరుగుచు
          వైదికు లిరుగడల్ స్వస్తిచెప్ప
గీ. దైవముబోనుల సద్భక్తిభావ మలరఁ
          బూజసేయుచుఁ దనగ్రామమునకు విభుఁడు

దీసికొనివచ్చె నతనిఁ దద్విధము జూచి
జనము లాహా యటంచు సంస్తవము సేయ.

అట్లు కాళిదాసకవితోఁగూడ నిజనగర బాహ్యోద్యానవనంబు సేరి యందు మహావైభవముతోఁ దమరాక వేచియున్న మాత్రిసామంతపండితపురోహితప్రభృతులఁ గాంచి ప్రహర్షాంచితస్వాంతుఁడై వారినెల్ల వేలువేల నభినందించుచుఁ బుత్రుం గౌఁగిలించుకొని సేమం బడిగి బ్రాహ్మణులకు నమస్కరించి యాశీర్వచనంబు వడసి మంత్రులతోఁ దనయభిలాషప్రకారము గావింపవలయునని యానతిచ్చెను.

కాళిదాసకవియుఁ బల్లకీదిగి కొందఱకు నమస్కరించుచుఁ గొందఱ నమస్కారంబు లంది దీవించుచు భోజుండు తనకుఁగావించిన యపూర్వసపర్యావిశేషమునుంగూర్చి పెద్దగా నుపన్యసించెఁ దదనంతరంబ.

సీ. ఒకవంక దర్శనోత్సుకతఁ బౌరులు మూఁగి
కొనుచుఁ గోలాహలధ్వనులు సేయ
నొకయెడ మాగధప్రకరము ల్వందిబృం
దమ్ములు విజయనాదములు నెఱప
నొకచాయ రాగంబు లొలయఁ గానలయగా
యనగాయనీగాననినద మమర
నొకచక్కి సామంతసుకవిమంత్రిపురోహి
తవిహితప్రకరమున్ తగభజింప

గీ. భద్రదంతావళేంద్రంబుపైఁ గవీంద్ర
మండనునిఁ గాళిదాసుఁ గూర్చుండఁజేసి
మ్రోల గాణిక్యనృత్యవిస్ఫురణగ్రాల
సభకుఁ గొనిపోయి రూరేగి సచివు లతని.

సభాభవనద్వారంబున గజావరోహణంబు గావింపఁజేసి జయ

జయధ్వానములతో ననర్ఘరత్నసింహాసనమునఁ గాళిదాసుం గూర్చుండఁబెట్టి భోజుండు పుత్రుఁ డొకవంకఁ దా నొకచక్కి నిలువంబడి వింజామరలు విసరుచుండి రట్టియెడ,

సీ. విరివాన గురిపించి రురుభక్తి సభ్యులు
మొరసెఁ దూర్యధ్వనుల్ ధరఁ జెలింపఁ
గవిశిఖామణులు శ్లోకములు పెక్కు రచించి
వినుతించి రురుకళావిభవ మమర
గాంధర్వవిద్యాప్రగల్భంబు గాన్పింప
గాయకుల్ బాడిరి హాయి మీఱ
వారాంగనాతాండవములు గన్నులపండు
వుగ నొప్పె నభినయస్ఫురణ వెలయ

గీ. హారతుల నిచ్చి రెలమిఁ బుణ్యాబ్జముఖులు
వందిబృందమ్ము జేసెఁ గైవారములను
గాళిదాసకవీంద్రశేఖరుఁడు సభ న
నూనసింహాసనాసీనుఁ డైనయపుడు.

అప్పుడు భోజుండు సభ్యులదిక్కు మొగంబై యార్యులారా! నాదేశంబంతయు నీదేశికోత్తమున కిచ్చివేసితిని. ఇదిమొద లితండే దేశాధిపతి. ఇతటినుండియు నితనియాదేశమునఁ బ్రజలు వర్తిల్లుదురుగాక యని ప్రకటించిన విని సభ్యులెల్లరు నోహో హో! యని యానృపతి వితరణమును వినుతించిరి. అప్పుడు కాళిదాసు లేచి నిలువంబడి,

శ్లో॥ నాహం భూధూర్వహో రాజన్ నాహం సత్పాలనేక్షమః
క్షత్రియస్త్వం సమర్థస్త్వం స్వీకురుష్వపునర్భువం॥

కం. ఏ నీధాత్రీభారము
బూని ప్రజలఁ బ్రోవఁజాల భూవర! నీకే
దీనిం గ్రమ్మఱ నిచ్చితిఁ
గానఁ దదీయోరుభరము గైకొను మనఘా!

అని పలుకుచు నప్పటికిఁ గరతాళములతో సెబాసు ! భళా ! యనుమాటలు బయలుదేరినవి. ప్రజాభిప్రాయము ననుసరించి భోజ భూపతి తిరుగా ప్రజాపాలనమున కంగీకరించెను. అప్పటికిఁ గాలాతీత మగుటయు సంతటితో సభ ముగించుచుఁ బ్రతిదినము నొక్కొక్కవినో దము ప్రదర్శించునట్లు నిశ్చయించి తమతమ నెలవులకుఁ బోయిరి.

అని యెఱింగించునవఱకు వేళ మిగిలినది. అవ్వలికథఁ బైమజిలీయం దిట్లు చెప్ప మొదలుపెట్టెను.

## 166 వ మజిలీ.

సువర్ణనాభుండును జారాయణుండును మల్లిక సువర్ణపదిక రత్న పదిక లీలావతి మొదలగు సఖులతో ధారానగరంబున కరుదెంచి యొక చో వసించియుండిరి. పురుషులుమాత్రము సభకుఁబోయి విశేషములు చూచి యింటికివచ్చినతోడనే మల్లికయు సువర్ణపదికయు వారిం జేరుకొని లీలావతీరత్నపదికలు దూరదూరముగానుండి విచారముఖంబులతోఁ జూచుచుండ నార్యులారా ! సభ యెట్లుజరిగినది? కాళిదాసుం గౌరవిం చిరా? భైరవునివార్తదెలిసినదా ? వానివృత్తాంతము దెలిసికొనివచ్చితిరా? అని యడిగినఁ జారాయణుం డిట్లనియె.

భోజుండు మిగుల తేజశ్శాలి. శౌర్యవంతుఁడు. మంచివక్త. ఆహా! రూప మానేచనకమైయున్నది. వదాన్యత యనన్యసామాన్యమే ! కాళి దాసకవినిఁ దనసింహాసనముపైఁ గూర్చుండఁబెట్టి పట్టభద్రుం గావించి రాజ్య మిచ్చివేసెను. అతం డంగీకరింపక తిరుగా నిచ్చి నీవే పాలింపవల యు నే నర్హుండఁగానని యుపన్యసించెను. దాతృప్రతిగృహీతల యౌదా ర్యమును సభ్యులు స్తుతియించిరి. గోణికాపుత్రుఁడు రాజపుత్రునకు మి త్రుఁడై యంతఁ బెద్దయై తిరుగుచున్నాఁడు. గోనర్దీయుఁడు కుచుమా రుఁడు ప్రభువేషములతోవచ్చి సభ నలంకరించిరి. అప్పుడు మే మొకరి నొకరు పల్కరించికొనుట కవకాశము లేకపోయినది. దినమున కొక

వినోదము జూచుట కేర్పాటుచేసిరి. సోమవారము విద్వత్ప్రసంగము, మంగళవారము వాహ్యాళి, బుధవారము గానసభలు, గురువారము భైరవుని మృగములయాట జరగునంట. వీనినిమాత్రమే వ్రాసికొనివచ్చితిమి. రేపు మామిత్రులతోఁ గలిసికొని భైరవునిమర్మయము రాజున కెఱింగించి శిక్షింపఁజేయుదుము. భైరవుండున్న తోటలోనికింబోయి చూచితిమి మృగములు పక్షులు పలురకములుచాలగలవు. వానిలోమన వారుందురు. మీరు విచారింపవలదని పలికిన విని సువర్ణపదిక యిట్లనియె.

మాబావ యక్షుండు పక్షియో మృగమో యైయుండఁ బోడుటకు నాకు నోరెట్లువచ్చును? రేపటిగానసభకు నేను బోవఁజాలను. పిమ్మట విచారింతముగాక. వారిం దీసికొనివచ్చుదనుక యేవినోదమునకుం బోఁగూడదు. మఱియు నీలీలావతినిగుఱించి యేమియాలోచించితిరి ? ఈమహాసాధ్వి మీరు భోజనివార్తలు సెప్పుచుండ నూరక దుఃఖించుచున్నది. ఆవినోదములలో నీమెగూడఁ బాలుగొనవలసినదేకదా? అన్నిటికంటె ముం దీమె కుపకారముసేయవలయును. అని చెప్పిన విని యామె కన్నీరు దుడిచికొనుచు నిట్లనియె.

బిడ్డలారా! నేను వట్టిపాపాత్మురాలను. నాపూర్వకృతము కడు చెడ్డది. నాకు మీ రేమియు నుపకారము సేయఁజాలరు. నాభర్త నాయందేదియో యనుమానముజెంది యడవులకుఁ ద్రోయించెను. నేను మొండికట్టియనుకావున జీవించితిని. ఇప్పుడు నాసుగుణ మేమిపరీక్షించి మహారాజు నారాక కంగీకరించును? మఱియుఁ బ్రతికియుంటినని వినినఁ జెప్పినవారిపయిఁ గుపితుండగును. నామాట యటుండనిచ్చి యక్షువిముక్తికె ప్రయత్నింపవలయును. అతండు కడుదయావంతుఁడు అనిచెప్పిన విని చారాయణుఁ డిట్లనియె.

తల్లీ ! నీవల్లభుఁడు భవద్వియోగమున కెల్లపుడు దుఃఖింపుచున్నట్లు ప్రజలు చెప్పుకొనుచున్నారు. అట్టి యుత్సవసమయమందుఁగూడ

నతని మొగము చిన్నబోయియున్నట్లు మేము గనిపెట్టితిమి. నీవిషయమై పశ్చాత్తాపము చెందియున్నవాఁడు. నీకు తప్పక భర్తృసమావేశము గలుగఁగలదు. అని పలుకుటయు నామె యుల్లమురంజిల్ల నార్యా! నా కట్టిభాగ్యము పట్టునా? నేనంతపుణ్యాత్మురాలనా? యనుచు సంతోషమును సూచించినది.

అప్పుడు చారాయణుండు తల్లీ! నగరిలో నీకు నమ్మకమైనవా రెవరైన నుండిరా? వారిం బేర్కొనుము. వారితో మైత్రిచేసి తన్ముఖముగా రాజుగారి హృదయాశయము దెలిసికొందము. అనుటయు రాజపత్ని సాపత్నిపుత్రికయగు రుక్మిణి తనకు హృదయస్థానమనియుఁ దన్నుగుఱించి యాచంచలాక్షియే చింతించుచుండుననియుఁ దనరాక నాకోకస్తని కెఱింగింపవచ్చుననియుం జెప్పినది. మఱియు నారుక్మిణి కాంతరంగికసఖురాలు రేవతియను యువతికడకుఁబోయి మాట్లాడిన నగరిలోని విశేషము లెఱుంగవచ్చును. అనిచెప్పిన విని చారాయణుండు సంతసించుచు గుఱుతులడిగి యాయింటికిం బోయి దానితో నిట్లుసంభాషించెను.

చారా — రేవతీ! నీతో నా కొకపనిగలిగి వెదకికొనుచు వచ్చితిని. నిన్నుఁ జూచినతోడనే నాకార్య మీడేఱునని తోఁచుచున్నది.

రేవ — అయ్యా! తమ రెవ్వరు? ఏయూరు? నావలనఁ దమకుఁగావలసినపని యేమియున్నది?

చారా — నేనొక బ్రాహ్మణుఁడ. పండితుఁడ. కాశీనివాసుఁడ. ఈయూర విద్వత్సభలు జరగునని విని ప్రసంగింప వచ్చితిని. నీవలనఁ గావలసినపని మఱేమియును లేదు. నిన్నొకమాట యడుగఁదలంచితిమి.

రేవ — (లేచి నమస్కరించుచు) పండితోత్తమా! కించిజ్ఞురాలనగు నన్నడుగవలసినమాట యేమున్నది? అవశ్యము తెలిసినది వక్కాణించి కృతకృత్యురాల నగుదును.

ఆహా! నీసుగుణంబులు నేవినినవానికన్న మిన్నగానున్నవి. బ్రా

హృణభక్తి నీయందు మూర్తీభవించియున్నదని చెప్పిరి. అందులకే నీ కిట్టి రాజావలంబనము గలిగినది. రాజపుత్రిక నీకు ప్రాణమిత్రమంట సత్యమేనా ?

రేవ—అవును. ఆమెకు నాయందనుగ్రహమే సన్నింత మీరు పొగడుట కర్హురాలనుగాను. కింకరురాల. కర్తవ్యమునకు నియోగింపుఁడు.

చారా—మఱేమియును లేదు. రాజుగారికి నలుగురుభార్యలని వింటిమి. పెద్దభార్య లీలావతి యెందున్నదో యెఱుఁగుదువా?

రేవ—(నోరుమూసికొని) బాబూ! అది రహస్యము. ఎఱిఁగి యున్నను నామాట జెప్పకొనఁగూడదు. ఇప్పు డామెప్రస్తావముతో మీ కేమిపనిగలిగినది ?

చారా—పనిగలిగియే యడుగుచుంటిని. ఇక్కడ యితరులెవ్వరును లేరు. నిజము చెప్పవలయును.

రేవ—(మెల్లగా దిక్కులుసూచుచు) రాజుగారి కేమిటికో కోపమువచ్చి యామె నడవికిఁబంపి చంపించిరఁట. ఇది పరమరహస్యము. నే నంటినని యెవ్వరితోఁ జెప్పఁగూడదు.

చారా—అయ్యో! పతివ్రతాశిరోమణియగు నామెయందును దప్పులు గణించెనా ? ఆమె సేసిన యపరాధమేమో నీకుఁ దెలియునా?

రేవ—ఏమియును లేదు. వెఱ్ఱియనుమానము. ఆమెపురాకృతము.

చారా— ఆమెను జంపించినపిమ్మట సమ్మనుజపతిహృదయ మెట్లున్నది ?

రేవ—చచ్చినతరువాత ననురాగము పెరుఁగునుకాదా ? ఆయన యేభార్యయొద్దకుం బోక లీలావతియంతఃపురమందే యెప్పు డామెనుగూర్చి దుఃఖింపుచున్నాఁడని తెలిసినది.

చారా—ఇప్పు డామె బ్రతికివచ్చిన సతం డంగీకరింతునా ?

రేవ—చచ్చినవారు బ్రతుకుటెట్లు ? మీ రామెవిషయమై గ్రుచ్చి గ్రుచ్చి యడుగుచున్నారు. ఆమె బ్రతికియున్నదా యేమి ? బ్రతికియున్నచో రాజుగారిమాట చెప్పఁజాలనుగాని మారుక్మిణి ప్రహర్షసాగరంబున మునుఁగఁగలదు.

చారా—నే నామాటయే వింటిని. ఆమెయు నట్లే చెప్పినది. అందులకే నీకడ కరుదెంచితిని. అదియే నీవలనఁ గావలసినపని.

అనుటయు రేవతి యుబ్బుచు నేమేమీ ! ఆమె యన్నట్లే యన్న దంటివి. ఆమె యెందున్నది ? ఎట్లుబ్రతికినది ? ఆమెవృత్తాంతము చెప్పిన మీకు పదివేలనమస్కారములఁ గావింతును. ఈవార్త మారుక్మిణి వినినఁ దనజన్మావధిలో నింతసంతోషము మఱియొకటిఁ బొందనేరదు. నిజ మెఱింగింపుఁడని ప్రార్థించినది. అతఁడు మెల్లగా నామె బ్రతికేయున్నది. నూఱేండ్లు బ్రతుకఁగలదు. ఈపురమునందే యున్నది. ఈరహస్యము నీకుఁ జెప్పిరమ్మన్నది. తరువాతకృత్యమునకు నీవును నీసఖురాలు రుక్మిణియునుఁ బ్రమాణములు. అనిచెప్పిన నప్పడతి బాబూ ! మీ రింటనుండుఁడు. రుక్మిణి కీశుభవార్త సెప్పివచ్చెద ననిపలికి యత్యంతవేగముగా నంతఃపురమున కరిగి యీవృత్తాంతము రుక్మిణి కెఱిఁగించినది.

ఆఁ ! ఆఁ ! ఏమీ ! ఈమాట సత్యమే ! అని రుక్మిణి విస్మయసంతోషము లభినయించుచు నావార్త చెప్పినందులకుఁ దనచేతిరత్నకంకణము దానికిఁ గానుకగానిచ్చుచు నామె యెందున్నదో నీవు స్వయముగాఁబోయి చూచివచ్చి చెప్పుము. నాకు నమ్మకము కుదురకున్నది. అని తొందరపెట్టుటయు నాసుందరదన యమందగమనంబున నాధరణీబృందారకునికడ కరుదెంచి వందనముసేయుచు పదుఁడు. పదుఁడు. నాకయ్యిందువదనం జూపుఁడు అని పలికినది. అతండు రేవతిని వెంటఁబెట్టుకొని తనయింటికిం దీసికొనిపోయి లీలావతియెదురం బెట్టెను.

రేవతి లీలావతింజూచి పాదములఁ బ్రాలి గోలుగోలున నేడువఁ దొడంగినది. ఆమె దానినిలేవనెత్తి కన్నులనీరుఁ గ్రమ్మ నమ్మా! యిది రుక్మిణి క్షేమముగానున్నదా? రాజభార్యలు సుఖులై యుండిరా? విశేషము లేమి? విచారింపకుము. రాజుగారివార్తలెట్టివి యెఱింగింపుమని యడిగిన నది కన్నీరుదుడిచికొనుచు నిట్లనియె.

అమ్మా! రుక్మిణి సంతతము నిన్నుఁగూర్చియే విచారించుచుండును. రాజభార్యల కానందముగాక యేమి? నిన్నడవికంపినదిమొదలు మేదినీపతి నీసదనము వదలియుండలేదు. తొందరపడి నిన్నుఁ జంపించి పశ్చాత్తాపముచెందుచున్నట్లు చెప్పికొనిరి. కాళిదాసకవినిఁ దీసికొనివచ్చు నెపంబున రాజుగా రూరువిడిచి దేశములు దిరిగి తిరిగి మొన్ననే యిందువచ్చిరి. వచ్చినదాదిగా నీయంతఃపురమందే యున్నారని విన్నాను. ఇంతవఱకు రాజభార్య లెవ్వరు నాతేనియొద్దకుఁ బోవలేరు. పోవుటకు వెఱచుచున్నారు. అనియెఱింగించినది.

అప్పుడు లీలావతి మెల్లగా రాజు పశ్చాత్తాపము చెందియున్నాఁడని చెప్పితివి. అది యెంతనిజమో యేకాంతముగా నాభూకాంతుచెంతకరిగి తెలిసికొనిరావలయు. ఇందులకు నీకంటె నా కాప్తులు లేరు. రుక్మిణిం గౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొంటినని చెప్పుము. తరువాతకర్తవ్య మాలోచింతముగాక. అని నియోగించుటయు రేవతి లీలావతికి నమస్కరించి చారాయణు ననుజ్ఞగైకొని తొలుత రుక్మిణియంతఃపురమునకుఁబోయి యావార్తనంతయుఁ జెప్పినది.

రుక్మిణి మురిపెంపువెంపున వివశయై యంతలోఁ దెప్పిరిల్లి ముప్పిరిగొనువేడుకతో నామెపంపు గావింపుమని నియోగింప సమయమరసి యాసరసిజానన భూజానియంతఃపురమున కరిగి రహస్యముగా నందలి విశేషములన్నియుఁ దెలిసికొనివచ్చి లీలావతి కిట్లు విన్నవించినది.

అమ్మా! నీక్షేమవార్త విని రుక్మిణి బ్రహ్మానందము జెందుచు

నప్పుడే యింపు రావలయునని తలంచినది. ఎట్టకే నామె నందాపి భూపా లుని శయ్యాగృహసమీపంబున కరిగితిని. అతఁ డందులేఁడు. నీపడక గదిలో నీపర్యంకముపైఁ బవ్వళించి నీచిత్రఫలకము జూచుచు హా! ప్రేయసీ! హా! లీలావతి! హా! సతీలలామ! నిన్ను నిరపరాధినిఁ బరి భవించితిని. పాపాత్ముఁడ నే నేనరకమునకుఁ బోవుదునో! అక్కటా! తొలుత నీవు నన్నుఁ బరిణియమగుటకు నడవులలో నెన్నియోయిడు ములం గుడిచితివి. నడుమ నేమిసుఖించితివో గడియలాగైనది. తుదకు నిన్నడవులపాలు సేసితిని. ఈశయ్య నీతో నెన్నఁడుసుఖించితినో! ఆహా! మోహనాంగీ! నాతో మాటాడవా? కోపమా! ఓరీ! భైరవా! నా ప్రియురాలి నేమిచేసితివిరా! మూర్ఖా! నీపని నీకఁ బట్టించెదఁ జూ డుము. ఈసందడిలో నీమాట మఱచితిని. నీమాట కింకను వ్యవధియు న్నది కాఁబోలును. అంతవఱకు నిలువనేల నిప్పుడేపోయి వానిం బరిభ వింతునా? అని లేచి కత్తిదూసి యంతలో మఱల నయ్యసి వరలోఁ జొనిపి వాఁడు తాంత్రికుఁడు ఇంతలోఁ దొందరపడనేల? వెనుకటివలెనే యాలోచింపక చేసితిమేని ప్రమాదము రాఁగలదు. అనిపలుకుచు వెండియు శయ్యపైఁ బండుకొనిరి.

అమ్మా! భైరవుఁ డెవ్వఁడు. ఆకథ నాకేమియు నర్థమైనదికాదు. అనిచెప్పిన లీలావతి ముప్పిరిగొనుమురిపెముతో నిట్లనియె. ఏమీ! ఆ మూఢునిదుర్నయ మాయనకుఁ దెలిసినదా! ఔను. ఆబ్రాహ్మణకుమా రుండు చెప్పియుండునేమో? రేవతీ! నీమాటవలన నానోములు ఫలిం చునట్లేయున్నవి. అని దానితోఁ దగురీతి ముచ్చటించెను.

రేవతియుఁ బెద్దతడ వందుండి తదామంత్రణంబువడసి రుక్మిణి యొద్దకరిగి జరగినవృత్తాంతమంతయుఁ జెప్పినది.

రుక్మిణి యామెంజూచుటకు కాలవ్యవధి సహింపక రేవతితోఁ ద న్నామెయొద్ద కప్పుడే తీసికొనిపొమ్మని చెప్పినది. రేవతియు నుద్యా

నవనంబునకుఁ బోవుసమయంబున చుఱియొకశకటంబుదెచ్చి యందుఁ గూర్చుండఁబెట్టి యొరులెఱుంగకుండ లీలావతియున్న భవనంబునకుఁ దీసికొనిపోయిరి.

లీలావతియు యక్షకాంతలును మల్లికయును రుక్మిణిరాక విని యామెనుజూచుట కత్యంతసంతోషము జెందుచుండ నయ్యండజయానవచ్చి లీలావతియడుగులంబడి దుఃఖించినది. రాజపత్ని పుత్రికం గ్రుచ్చి యెత్తి కన్నీటిధారచేఁ దచ్చిరంబు దడుపుచు అమ్మా! దుఃఖింపకుము. నాకొఱకుఁ బరితపించుదానవు నీవొక్కరితవే. దైవప్రతికూలదినముల లో మన మేమిచేయఁగలము. ఎప్పటికైన మంచిదినములు రాకపోవు నా? వీరు యక్షకాంతలు. నాతోఁగూడ నిడుములం గుడుచుచున్నారు. ఈరత్నపదిక భర్తయే నన్నాభైరవధూర్తునివలన విడిపించి రక్షించెను. ఉపకారమునకుఁ బోవ నపకారమైనట్లు మానిమిత్తమతం డెందో చిక్కువడెను. వీరికతంబున నే నీయూరు సేరఁగలిగితిని. అని తనవృత్తాంతము కొంత కొంత వివరించినది.

యక్షకాంతలసౌందర్యమునకు రుక్మిణియు రుక్మిణిచక్కఁదనమునకు యక్షకాంతలును నక్కజము జెందుచు నొండొరులు స్నేహము గలుపుకొని ముచ్చటింపఁజొచ్చిరి. ఆసమయంబున లీలావతి రేవతితో జనాంతికముగా నోసీ! రుక్మిణి మొగము వేఱొకలాగున నున్నదేమీ! పెండ్లియైనదా యేమి? దౌహృదచిహ్నములు గనంబడుచున్నవే! యని మెల్లగా నడిగిన నది యించుకసిగ్గుతోఁ దలయూచుచుఁ దల్లీ! నీతో నేమని చెప్పుదును. నాటకములో నిది యొక యంతర్నాటిక. నీకూఁతురు గంధర్వప్రాయుఁడగు నొక దివ్యపురుషుని గాంధర్వవివాహమునఁ బరిగ్రహించినది. ఆగంధర్వుండు గంధర్వుండేమై మఱలఁ గనంబడలేదు. అని యావృత్తాంతంబు సంక్షేపంబుగా నెఱిగించినది.

లీలావతి యీచరితము విని అమ్మా! అతం డెవ్వఁడో తెలిసి కొనలేదా? ఎందుఁబోవును? వాని కులశీలనామంబు లడుగలేదా? ఇది వినినవారు పరిహసింపకమానరు. కాని రుక్మిణియం దేమియు దోసము లేదు. దైవికముగా సంపర్కము గలిగినవానినిఁ బరిగ్రహించుట దూష్య మెట్లగును. ఆదివ్యపురుషుండు పుత్తునైనఁ జూచుటకు రాకుండునా?

అని సమాధానముగాఁ బలికినది. రేవతి అమ్మా! ఆతని కులశీలనామంబులఁ దెలిసికొనలేముగాని వానిచిత్రఫలకము వ్రాసికొంటిమి. ఇదిగో చూడుము. అని యొకప్రతిబింబ మామె కందిచ్చినది. లీలావతి తదీయరూపలావణ్యాదివిశేషంబుల కచ్చెరువందుచు రుక్మిణి చాల చదువుకొన్నది. సామాన్యుని వరించునా? అనుకూలవాల్లభ్యంబే లభించినదని సంతసించినది.

అంతలోఁ బ్రొద్దుపోవుటయు రుక్మిణి వారలెల్లరకుఁ జెప్పి తల్లికి నమస్కరించి యెల్లి మరల వత్తునని చెప్పి గూఢముగా బండియెక్కి యింటికిఁ బోయినది. లీలావతిచేతినుండి యాచిత్రఫలకమును మల్లిక యందుకొని వింతగాఁ జూచుచు యక్షకాంతలచెంత నిడినది. వారును దానిసొరునకు వెఱఁగందుచుండ సువర్ణనాభుం డదియందుకొని రో హోహో! వీఁడు మాదత్తుఁడు, దత్తుఁడు అని కేకపెట్టెను. చాయాయనుండు జూచి ఔను. ఇది దత్తునిరూపమే. దీని నెవరుతెచ్చిరని యడిగిన మల్లిక, రాజపుత్రికసఖురాలు రేవతి లీలావతి కిచ్చినదని చెప్పినది. ఆ మాటవిని సువర్ణనాభుండు ఓహో! ప్రేయసీ! దత్తుఁడన నెవ్వఁడో యెఱుంగుదువా? మనకు మీయక్కయు బావయు నున్న యుక్కనెఱింగించిన పుణ్యాత్ముఁడు. నాప్రాణమిత్రుండు. వాఁ డెందెందో మున్ధరిమై శాపఫలం బనుభవింపుచున్నాఁడు. వానిం దెలిసికొనవలయును. అని పలికెను.

ఆమాట విని రత్నపదిక కన్నుల నీరునించుచు నయ్యో! పాప మాతఁడా? వాని శాపప్రవృత్తినిమిత్తమై నాభర్త యెంతయో విచారించెను. తనపాటు తనకు తెలియక పెరవారింగురించి చింతించెను. అయ్యో! ఇంక నెన్నినాళ్లిందుందును. చెల్లీ! సువర్ణపదికా! వారి విముక్తింగూర్చి నీభర్త యేమనుచుండెను. అనుటయు సువర్ణపదిక నాలుగు దినములలో నన్నియుఁ జక్కఁబడునని యక్కకు నోదార్చినది.

వారి సంభాషణములన్నియు విని లీలావతి దత్తునియుదంత మంతకుమున్న కొంతకొంత వినియున్నదగుట రాజపుత్రికవరించినవాఁడు దత్తుఁడేయని నిశ్చయించి యావృత్తాంత మప్పు డెవ్వరికిం జెప్పినది కాదు.

మఱునాఁ డరుణోదయంబున లేచి చారాయణసువర్ణనాభులు తత్పురప్రధానదేవాలయగోపురంబున కరిగి తత్కుడ్య భాగంబులు పరీక్షించి సువర్ణనాభాదులు వెనుకవ్రాసిన వ్రాఁతలక్రింద గోనర్దీయుఁడు నుఁ గుచుమారుఁడు ధారాపురంబున కరుదెంచినట్లు వ్రాసినవ్రాఁతలఁ జూచిరి. అప్పుడు ప్రభుచిహ్నములతో నున్నవారే తమమిత్రులని నిశ్చయించి వెదకికొనుచుఁ దిన్నఁగా వారివిడిది కరిగిరి.

వారు నివసించియున్న గృహప్రాంగణంబు భేరీపటహాదిమంగళధ్వానములచే ముఖరితం బగుచున్నది. విచ్చుకత్తులం బూని రాజభటులు పారా యిచ్చుచుండిరి. ఆవైభవమంతయును జూచి మిగుల సంతసించుచు వారిరువురుఁ దమరాక ప్రభువులకు నివేదింపుఁడని ద్వారికులఁ గోరికొనిరి. ప్రతీహారులు లోపలికిఁ బోయి బ్రాహ్మణులంట, ఇరువురు విద్వాంసులంట మీదర్శనమునకై వచ్చిరంట, ద్వారదేశమునఁ బ్రతీక్షించియున్నారు. సెలవేమని యడిగిన వారు ప్రవేశపెట్టుఁడని యాజ్ఞాపించుటయు రాజకింకరులు వారిం దీసికొనిపోయి ప్రభువులయెదుట నిలిపిరి.

ఓహోహో!! ప్రాణమిత్రులే! అనుధ్వానంబులు నింగి

ముట్ట పరస్పరాలింగితాంసులై సంతోషబాష్పస్తంభితగద్గదికకంఠులై యొక్కింతతడ వేమియు మాటాడనేరక యెట్టకేఁ దెమల్చుకొని సుఖాసనోపవిష్టులై ప్రహర్షమును బ్రకటించిరి. అప్పుడు కుచుమారుండు మిత్రమా సువర్ణనాభా! నీ వుత్తరదేశారణ్యముల తుదిఁజూచి వచ్చితివా? అందు విశేషములేమైనం గనంబడినవా? ఈచారాయణునితో నెందుఁ గలిసికొంటివి? ఇం దెప్పుడువచ్చితిరి? యెఱింగింపుఁడని యడిగిన సంక్షేపముగాఁ దమవృత్తాంతము జెప్పుచు మీ రీప్రభుత్వ మెట్లుసంపాదించితిరని యడిగిన వారును దమకథనంతయు నెఱింగించిరి.

అప్పుడు సువర్ణనాభుండు మిత్రులారా! మనస్నేహితులలో దత్తుఁడను ఘోటకముఖుఁడనుందక్క తక్కినవారమందఱము నిందుఁ జేరితిమి. గౌణికాపుత్రుఁడు రాజపుత్రునకు మిత్రుండై వర్తించుచున్నట్లు నిన్నసభలో మీరును జూచియేయుందురు. మనయందఱకన్న ముందే దత్తుఁ డీపత్తనంబుఁ బ్రవేశించినాఁడు. వెనుక నే నతనితోఁ గలిసికొని మాట్లాడితిని. ఆక్షణమందే యెందోబోయి తిరుగాఁ గనంబడలేదు. యక్షశాపోపహతి యువతియై యతఁడు పరిభ్రమించుచుండవలెను. వారిరువురజాడయే మన మెఱుంగవలసియున్నది. మఱియు మనకుఁ బరమోపకారియైన యక్షుండు భైరవశిక్షితుండైనట్లు తలంచుచుంటిమి. మనుష్యుల మృగములుగను పక్షులుగను జేయు తంత్ర మామాంత్రికుఁ డెఱింగియున్నవాఁడు. వాఁడు పరమతపోనిధియగు సిద్ధునిం బరిమార్చి మనచారాయణుని గార్ధభముగావించిన క్రూరుండు, చారాయణు నత్తమాములును గనంబడుటలేదు. వీరెల్ల నక్కపటాత్మునిచేఁ జిక్కిరనియెంచి యిందరుదెంచితిమి. మనమందఱమునుఁ గలసి భోజనృపపురందరునకు వానిదుర్ణయ మెఱింగించి శిక్షింపఁజేయవలయును. అనిపలికిన విని కుచుమారుం డిట్లనియె.

అయ్యయ్యో! ఆసిద్ధుం బరిమార్చినవాఁడు వీఁడా! అక్కటా!

అమ్మహానుభావుని చరిత్రమంతయును నేను జదివితిని. ఈమాలిక తదస్థి జాలమే. తత్ప్రభావంబుననే వశిత్వవిద్యాప్రౌఢిమ సంపాదించితిని. ఆభైరవునిఁ బరిభవించుట నాకు గోటిలోనికాని. అందుల కెవ్వాని నాశ్రయింప నవసరము లేదు. అదియట్లుండెఁ బురందరపురములో ఘోటకముఖుండు మమ్ములం గలసికొనియెను. ఒకస్నేహితునిపనిమీఁదఁ దిరుగుచుంటి నని మాతో నప్పుడు చెప్పెను. ఆస్నేహితుండు భోజుండైనట్లు మాకిప్పటికి తెల్లమైనది. ఆమిత్రుండు భోజుండని ఘోటకముఖుండును నెఱుంగఁడు. వానివృత్తాంతము భోజునకుఁ దెలిసియుండును. అతనిసడిగిన సంతయుం జెప్పఁగలఁడు. అని యుపన్యసించెను.

అప్పు డాగోనర్దీయుఁడు మల్లికాప్రభృతయువతీమతల్లికల నప్పుడే యక్కడకుఁ దీసికొనివచ్చుటకై శిబికాశకటాదియానములతోఁ బెక్కండ్ర రాజభటులతో మిత్రుల నంపి వారినెల్లఁ దమ నెలవునకు రప్పించికొనియెను. అని యెఱింగించువఱకు.

## 167 వ మజిలీ.

భోజభూపతి లీలావతిమందిరమందే వసించి యామెం దలంచుకొని దుఃఖింపుచుండెను ఆపరితాపము చెప్పికొనఁదగిన యాంతరంగిక మిత్రుఁ డెవ్వఁడును లేఁడు. కాళిదాసకవి నవమానించుటంజేసి మునుపటివలె నాయనతోఁ జనువుగా మాటలాడుటకు సిగ్గుపడుచుండును. వేడి నిట్టూర్పుల నిగుడింపుచు శయ్యపై దొర్లుచుండ నతనిగాత్రంబు నొకపత్రిక నొత్తుటఁయు నదియేమియోయని యెత్తిచూచెను. అం దిట్లు వ్రాయఁబడియున్నది.

రాజా! నీవు విదేశమున కరిగినవెనుక నీసంతానము గంతువిలాసములకులోనై ప్రవర్తించెను. నీకుమారుం డొకవారకాంతతో సంతత

మంతఃపురము విడువక క్రీడాభిరతుండై రాజకార్యముల విమర్శింపఁడయ్యె. నీకూఁతురు రుక్మిణికి నెలతప్పెనని చెప్పుకొనుచున్నారు. ఈ రెండువిషయములం బరీక్షించిన నీకే తెలియఁగలవు. నీ కాప్తులమగుట నట్లు తెలుపుటకుఁ జింతిల్లుచున్నాము.

ఆపత్రికంజదువుకొని ధాత్రీపతి కలుద్రావినకోఁతివలెఁ జికాకు వడుచు నక్కటా! నా కింటికివచ్చిన నన్నియు దుఃఖములే కలుగుచున్నవి. అందులకే పెద్దలు సంసార మతిగహనమని చెప్పిరి. నాసంస్థానమందు దుర్మార్గులు పెక్కండ్రు గలరని తోఁచుచున్నది. వెనుక లీలావతినిగుఱించియు నిట్లే వ్రాసిరి. ఇదియు నసత్యమేయని తలంచెదను. నరులసూయాపరులుగదా? అని తలంచుచున్నసమయంబునఁ బ్రతీహారి చనుదెంచి దేవా! ముఖ్యాదూత్యుండు వచ్చియున్నాఁడు. ప్రవేశమునకు సెలవా? యని యడిగి తదనుజ్ఞఁగైకొని యతనిం బ్రవేశపెట్టెను.

ప్రధాని నమస్కరించుచు పర్యంకముదాపుననున్న పీఠముపైఁ గూర్చుండి దేవరవా రస్వస్థులైయున్నట్లు కనంబడుచున్నారు. ఇదియంతయుఁ బయానపుబడలిక గావలయును. అని సమయోచితముగాఁ బల్కరించుటయు నాపుడమిఱేడయ్యెడు శయ్యపైఁగూర్చుండి పయనమన నేల? జన్మయే బడలిక. కానిమ్ము, నేనులేనప్పుడు చిత్రసేనుండు రాజకార్యముల నేమైన విమర్శించెనా? పండితుల నాదరించెనా? వానిప్రవర్తన మెట్లున్నదో సత్యము జెప్పుము. మఱియు సందేహాస్పదములైన యభియోగము లేమైనం దేఁబడినవా? అనియడిగిన నించుక జడుపు దోఁప నాప్రధాని యిట్లనియె.

దేవా! దేవరయరిగినది మొదలు భర్తృదారికునకు శరీరములో నస్వస్థత కలిగినది. దానంజేసి సంతతము శుద్ధాంతమునందే వసించియుండిరి. రాజకార్యము లంతగా విమర్శించుట కాయన కవకాశము గలిగినదికాదు. తగురీతి మేమే పరిష్కరించుచుంటిమి. దేవరవలె పండిత

సత్కార మెవరు సేయఁగలరు? అదియట్లుండ నొకనాఁ డొకపురుషుండు తురగమెక్కి వచ్చుచు నెఱుఁగక యో యెఱిఁగియో భర్తృదారికవిహరించు నుద్యానవనములోనికిం బోయెను. ద్వారపాలకు లాటంకపఱచినను నిలువఁడయ్యె. ఆవార్త నామెకుం దెలియఁజేయ నాహయంబెక్కి వచ్చినది మచ్చెకంటిగాని పురుషుండుగాఁడని తమ్ము గద్దించి యాతనిఁ దన బండిలో నెక్కించుకొని యంతఃపురమునకుఁ దీసికొనిపోయినదని వాండ్రు మాతోఁ జెప్పిరి. ఆవిషయము విమర్శింప మేము కుమారరాజుగారిని బ్రార్థించితిమి. ఆయన సోదరీనికాయంబున కరిగివచ్చి యది యాఁడుదియే యని నిర్ధారణసేసిరి. ప్రతీహారులు మఱికొందఱు రాజభటులు ఘోటకారూఢుఁడు పురుషుఁడేగాని స్త్రీగాదని వాదించుచున్నారు. ఇదియే దేవరయరిగినవెనుక జరిగిన యభియోగసందేహము. అని చెప్పినవిని యజ్ఞనపతి తనమతిం బత్రికావిషయము సత్యమేమోయని సందేహ మంకురింపఁ గలంకముజెందుచు నొక్కింతతడవు ధ్యానించి కానిమ్ము ఆ విషయ మానక విమర్శింతముగాక యిప్పుడు నీవు వచ్చినపని యేమో చెప్పుమని యడిగిన నాప్రగ్గడ యిట్లనియె.

మహారాజా! నేఁడు విద్వత్సభ జరుగుటకు నియమించితిమి. దూరదేశములనుండి మహాపండితులును గవీశ్వరులును బెక్కండ్రు వచ్చియున్నారు. కొందఱు కాళిదాసకవితోఁ బ్రసంగించుటకు నుత్సాహపడుచున్నారు. కాళిదాసకవి సరస్వతియపరావతారమని యెఱుంగక యతనికి శాస్త్రములేమియు రావనియు కవిత్వముమాత్రము చెప్పఁగలఁడనియు వాదించుచున్నారు. దేవరవారాసభకు విచ్చేసి వాదిప్రతివాదుల నిరూపింపవలయును. మాధ్యస్థుల నేర్పఱుపవలయును. అని యెఱింగించిన భోజుండు నిమీలితనయనాంభోజుండై అయ్యో! నేఁడే తత్ప్రసంగము పెట్టితిరా? నామనసు దిరముగాలేదు. భైరవునిమాట యేమైనది? అనుటయు నతండు భైరవునిమాట ఇఁక మూఁడుదినములలో.

జరుగును. విద్వత్సభకు మీరు రానిచో సమంజసముగా నుండదు. ఎట్లయినను దయచేయక తీరదని బలవంతపెట్టెను. నృపతి యంగీకరించి యాసభాసమయంబునకు పోయి సభ నలంకరించెను.

అందొకమూల కుచుమార గోనర్ధీయ చారాయణ సువర్ణనాభ గోణికాపుత్రులును మఱొకవైపున దిండి భవభూతి శంకరప్రభృతిమహాకవులును భోజునకు ప్రక్కనున్నపీఠముపైఁ గాళిదాసమహాకవియును నాప్రాంతములయందు నానాదేశాగతవిద్వత్కవులును గూర్చుండిరి. అప్పుడు భోజుండు లేచి విద్వద్బృందమునకెల్ల నమస్కరించుచు మద్భాగ్యవశంబున నేఁ డీసభకు మహావిద్వాంసులెల్లరు విచ్చేసి నన్నుఁ గృతార్థుం గావించిరి. మీమీప్రసంగముల విని శ్రోత్రానందము గావించికొనియెదంగాక. మీ రన్యోన్యము మత్సరగ్రస్థులుగాక విద్యావైభవములు దేటపడఁ బ్రసంగింపఁ గోరుచున్నాఁడను. ఎవ్వరెవ్వరితోఁ బ్రసంగింపనభిలాషగలిగియున్నదో ప్రకటించినచో నందులకుం దగినమాధ్యస్థనేర్పఱతుము. అనిచెప్పి కూర్చుండెను.

అప్పుడు కుచుమారుండు లేచి మహారాజా! మేము కాశీపురంబునఁ జదువుకొంటిమి. మీసంస్థానపండితుల ప్రఖ్యాతి విని వారితోఁ బ్రసంగింప వేడుకగలిగి వచ్చితిమి. మే మేమ్వురము సహాధ్యాయులము. మా కన్నివిద్యలయందును బాండిత్యము గలిగియున్నది. ఇందు మేమేవుర ముంటిమి. మాలో నెవ్వరితోనైనను సరియే మీసంస్థానపండితులలోఁ బ్రముఖునిఁ బ్రసంగించుటకు నియమింపవలయును. ఇదియే మా యభీష్టమని పలికిన విని శంకరకవి లేచి యిట్లనియె.

అయ్యా! నీమాటలు గడు గర్వభూయిష్ఠములై యున్నవి. కాశీపురమునుండి ప్రత్యేకము భోజభూజానియాస్థానమునఁ గవులతో ముచ్చటింప నుత్సుకతఁజెంది వచ్చితిమని చెప్పితివి. నీయుత్సాహము వీరుదీరుపఁగలరు. కాళిదాసకవిప్రవరుప్రభావము మీరు వినినచో నింత

దూరము రాకుందురుగదా ? అతండు విద్యలసృష్టించిన మహానుభావుం డు. ఈసంస్థానపండితులలో నతండే ప్రముఖుండు. అతఁడే మీకు ప్రతి వాదిగా నుండఁగలఁడు. మాధ్యస్థుని మీరు కోరుకొనుఁడు. అనిపలికి కూర్చుండెను.

ఆమాటవిని గోనర్ధియుఁడు లేచి విద్యాస్వరూపుండగు కాళిదాస కవిసార్వభౌమునిమహిమను మే మిదివఱకే వినియుంటిమి. భూమండల మంతయుఁ దద్యశోవిసరములు వ్యాపించియున్నవి. ఆయనతోఁ బ్రసం గింప మేముకాదు వాణీధవుండైన సమర్థుండుగాఁడని చెప్పఁగలము. ఆయనకు మావిద్యాపాటవము జూపి మెప్పుబడయవచ్చితిమి గాని గెలు పుగొనుటకుఁ గాదు అందులకే యనుజ్ఞనీయ వేఁడుచున్నాము. అని పలుకుటయు సభాసదు లామాటలువిని కాళిదాసకవి యిందుల కేమని ప్రత్యుత్తరమిచ్చునో యని చూచుచుండిరి.

అప్పుడు భోజుండు లేచి కుచుమారగోనర్ధీయాదిపండితులచరి త్రము లోకాతీతమైనది. కాళిదాసమహాకవి త్రిభువనైకవంద్యప్రభావ సంపన్నుఁడు. వారు ప్రసంగింప మాధ్యస్థముసేయుటకుఁ దగినవిద్వాం సుం డుండవలదా ? భారతియో భారతీపతియో కావలయు, నట్టిసమ ర్థుండు దొరకువఱకు నావాదము నిలుపుమని కోరుచున్నాను. తక్కిన పండితులు ప్రసంగింపవచ్చునని యానతిచ్చెను. తదానతి శిరసావహించి గోనర్ధీయాదు లేమియు మాటాడలేదు.

తరువాత నితరపండితులప్రసంగములు చాల జరిగినవి. వెక్కం డ్రకు బిరుదములు కానుకలు వేనవేలు పంచిపెట్టిరి. సభ ముగిసినతరు వాత భోజుండు గోనర్ధీయకుచుమారులఁ బ్రత్యేకముగాఁ బ్రశంసింపు చు మిమ్ము నేను బురందరపురములోఁ జూచితిని. జ్ఞాపకమున్నదా ? అని యడిగినఁ గుచుమారుండు మిమ్ముఁజూచినప్పుడే తెలిసికొంటిమి. అప్పుడు మీకులగౌరవనామముల మఱుఁగుపఱచితిరి. మీతో మామి

త్రుండగు ఘోటకముఖుండు వచ్చెంగదా? అతఁ డేమి రాలేదేమి? ఎందైనం బంపితిరా? అతఁడును దత్తకుఁడును దక్క తక్కినవారము గలిసికొంటిమి. వానివృత్తాంత మెఱింగింపుఁడని యడిగిన నయ్యొడయుండు స్మృతినభినయించుచు నయ్యో' అప్పరమపవిత్రు స్నేహపాత్రుఁ బరార్థపరు నీసభలో స్మరింపక నేను గృతఘ్నుండ నైతింగదా? (జనాంతికముగా) నొకపాపాత్మునిమూలమున నేను స్మృతిచెడి రూపాంతరము వహించియుండిన నాతం డెందుఁబోయెనో తెలిసికొనలేకపోయితిని. అప్పుణ్యాత్ముం డెందుఁ జిక్కుపడియెనో తెలియదు. ఈపాటి కీవీఁటికి రావలసినవాఁడే యని విచారము సూచించెను.

అప్పుడు సువర్ణనాభుండు రహస్యముగా మహారాజా! మృగసమూహములతో వినోదములఁ జూపుటకై వచ్చి మీతోటలో విడిసిన భైరవుండు కడుదుర్మార్గుఁడు. గురుద్రోహి. మనుష్యులఁ బశుపక్షిమృగాదులఁ గావించి వంచించుచున్నాఁడు. వానియొద్దనున్న జంతువులన్నియు నట్టివే. మాకుచుమారుఁడు వానిం బరిభవింపఁగలఁడు. మీరు వాని మృగవినోదములఁ జూచుటకై ప్రత్యేకము రప్పించితిరి. తత్పరిభవము మీకసమ్మతమేమోయని తలంచి చెప్పకుంటిమి. మాయాప్తులఁ బెక్కండ్రఁ బక్షులనో మృగములనో చేసి త్రిప్పుచున్నాఁడు. వానిని శిక్షించి వానియొద్దనున్న పశుపక్షిమృగంబుల వశపఱచుకొనవలయునని తెలిపిన విని భోజుండు వానిచరిత్రము మీకునుం దెలియునా? అందఱికన్న నన్నెక్కుడుగాఁ బరాభవించెను. వానిని శిక్షించుటకే యిందు రప్పించితిని. వానియాటనాఁడు మన మందులకుఁ దగినప్రతీకారము యోజింతము. ఇప్పుడు వెల్లడింపకుఁడు. పారిపోవఁగలడు. అని పలుకుచు నప్పటికిఁ జాలప్రొద్దుపోవుటచే వారినెల్ల సగౌరవముగా విడిదల కనిపి తా నంతఃపురమున కరిగెను. అందుఁ గ్రమ్మఱ లీలావతీవియోగ విషాదంబు హృదయంబున నావేశించినది. ప్రధానుం డెఱింగించినవిష

యంబులంబట్టి రుక్మిణీచిత్రసేనుల చారిత్రములు కళంకపాత్రములైనట్లు నిశ్చయించుకొని చిరాకుపడఁజొచ్చెను. మంచముపైఁ బండుకొని ధ్యానించుచూడ ననేకవిషయములు జ్ఞాపకము వచ్చినవి. అంతలో నిద్ర బోయెను.

గోనర్దీయాదిమిత్రులు గోణికాపుత్రునితోఁ గూడికొని తమ విడిదలకుం బోయిరి. గోణికాపుత్రుఁడు వారివారిచరిత్రముల విని విస్మయసంతోషంబులు వెల్లివిరియ దత్తునిగుఱించి తా నెఱింగినకథయంతయుఁ జెప్పెను. దత్తుఁడు యక్షశాపంబున స్త్రీరూపము వహించియున్నవాఁడు. ఇందో యెందో వెదకి వానిం దెలిసికొనవలసియున్నది. యక్షుండు వానిశాపము గ్రమ్మఱింపఁగలఁడని సువర్ణనాభుఁడు పలికెను.

యక్షుండు భైరవశిక్షితుండైనట్లు చెప్పితివిగదా. ఆమాటయే నిక్కమైనచో నిప్పుడేపోయి యాభైరవునిఁ బరిభవింతము రండు. రేపటి వఱకు నిలువనేల? తృటిలో వానిం బంధించెదనని కుచుమారుండు పలికిన గోనర్దీయుండు తొందరవలదు. వానియాట జూచి సమయోచితముగాఁ గావింతముగాక. ఘోటకముఖునిమాట యేమి? రాజు తనకేమియుఁ దెలియదనుచున్నాఁడు. వాఁడుగూడ పనిచేతఁ జిక్కలేదుగదా? అనుటయు నన్నియు రేపు తేలునుకాదా? తొందరవలదని గోణికాపుత్రుఁడు చెప్పెను.

వారట్లు మాట్లాడుకొనుచుండఁగాఁ జిత్రసేనుఁడు శకటమెక్కి యక్కడికివచ్చి దౌవారికునివలనఁ దనరాక గోణికాపుత్రునకుఁ దెలియఁజేసెను. గోణికాపుత్రుఁడు తొందరగా ద్వారదేశమున కెదురువోయి రాజపుత్రుం దోడ్తెచ్చి యుచితాసనాసీనుం గావింపుచుఁ దమ తమమిత్రులకథయంతయుం జెప్పి యన్యోన్యమైత్రి గలుగఁజేసెను.

రాజపుత్రుఁడు వారినెల్ల నగ్గించుచు నేనిదివఱకు దత్తుని నీగోణికాపుత్రుని నెఱుంగుదును. మీచరిత్రములు వీరివలన వింటిని. దత్తుఁడు

కొన్ని దినములుమాత్రము నాయొద్దనుండి తరువాతఁ గనంబడలేదు. ఎందుఁబోయెనో తెలియదు. గోణికాపుత్రుఁ డందులకే విచారించు చున్నాఁడు. అని యతనిగుఱించి ప్రస్తాపించెను గోణికాపుత్రుండు చిత్ర సేనునితో మిత్రమా! విపులునొద్దనుంచి ప్రత్యుత్తరమువచ్చినదా? గణికాపుత్రికలవార్త లేమైనం దెలిసినవియా? విపులుఁడు గావించిన దుర్నయమునకుఁ బ్రతిక్రియఁ జేసితీరవలయు. నామిత్రులు గోనర్దీయ కుచుమారులు చెరియొక దేశమునకు నధికారులు చతురంగబలములతోఁ బోయి వాని బంధించి రాఁగలరు అనిచెప్పిన రాజపుత్రుం డౌను ప్రత్యుత్త రము వచ్చినది. నీకుఁ జెప్ప లేదు కాఁబోలు నీసందడిలో మఱచితిని.వినుము.

మనము వ్రాసినపత్రికకు జడుపుజెందుచు నత్యంతవినయముతోఁ బ్రత్యుత్తరమిచ్చెను. ఆగణికాపుత్రిక లెవ్వరో తానెఱుఁగఁడఁట. తనదే శమం దెచ్చటనున్నను జూపినచో మనముసేసినశిక్షకు బాధ్యుఁడగు నఁట. వచ్చి వెదకికొనుమని వ్రాసెను. ఆవెంట నే కొందఱదూతల నంపుఁ బంపితినని యావృత్తాంతము చెప్పెను.

గోణికాపుత్రుండు ప్రస్తావముమీఁద మాతల్లి లీలావతి యిందు న్నదని చెప్పుటయు నతండు వెఱఁగుపాటుతో మాతల్లి లీలావతియే! యెట్లువచ్చినది? బ్రతికియున్నదా? అనియడుగుచుఁ దనకుఁ జూపుమని కోరికొనియెను. స్త్రీసంఘమధ్యంబున నుండుటచే నప్పుడు పోవుటకు సమయముకాదని సువర్ణనాభుఁడు చెప్పెను. మఱునాఁడైనను జూపిం పకతప్పదని బ్రతిమాలికొని రాజపుత్రుం డింటికిఁ బోయెను. వా రట్లు పెద్దతడవు ముచ్చటలాడికొనుచు నాదివసము వెళ్లించిరి.

అని యెఱింగించునంతఁ గాలాతీతమైనది. తరువాతికథ పైమజిలీ యం దిట్లు చెప్పఁనొడంగెను.

## 168 వ మజిలీ.

### ఘో ట క ము ఖు ని క థ.

మఱునాఁడుప్రొద్దుట గోనర్దీయ, కుచుమార, గోణికాపుత్ర, సువర్ణనాభ, చారాయణులు మిత్రులేవురును నాయింటిచావడిలోఁ గూర్చుండి దత్తకఘోటకముఖుల రాకనుగుఱించి ముచ్చటించుకొనుచుండఁగాఁ బ్రతీహారి చనుదెంచి దేవా! ఘోటకముఖుండను బ్రాహ్మణుఁ డొకండు బండిమీఁద నిరువురుస్త్రీలతో వచ్చి వాకిట నిలువంబడియెను. మీదర్శనము సేయఁగోరుచున్నాఁడు. సెల వేమనవుఁడు నైదుగురును దటాలున లేచి మాప్రాణమిత్రుఁ డేఁడీ? అనిపలుకుచు గుమ్మమునొద్దకుఁ బోయిరి.

అతండు వారింజూచి మోము వికసింప నోహోహో! నేటికిఁ గృతకృత్యుండనైతినని పలుకుచు వారిం గౌఁగిలించుకొనియెను. వారును బ్రత్యాశ్లేషము గావించి లోనికిఁ దీసికొనిపోయిరి. అప్పుడు గోణికాపుత్రుఁడు బండిమీఁదనున్న యాఁడువాండ్రెవ్వరని యడిగిన నయ్యో! వారిమాట మఱచితినే! వారు రతిమంజరీచిత్రసేనలను వేశ్యాపుత్రికలు. ఔరా! నీతోఁ గ్రొత్తగాఁ జెప్పుచున్నానే. అందొకతె దత్తుని భార్య. ఒకతె నీభార్య. పాపము వాండ్రు మనమూలమునఁ జాలయిడుములం గుడిచినారని చెప్పుచుండఁగనే గోణికాపుత్రుండు ఆఁ! ఏమేమీ! రతిమంజరీచిత్రసేనలే యని పలుకుచుఁ దటాలున లోనికింబోయి బండిలోనున్నవారిద్దఱం గాంచి తద్దయుం బ్రీతి నబలలారా! వచ్చితిరా? మీనిమిత్తమై భూమి తలక్రిందు సేయఁదలంచుకొన్నాము. కానిండు. లోపలికి రండు. మనవారందఱు నిందున్నారని పలికిన నక్కలికులు కనుఁగొలకుల నశ్రుజలకణికలు రాల నతనిం జూచుచుఁ హృద్గతంబగు శోకమును వెలిబుచ్చిరి. వారి నూఱడింపుచు గోణికాపుత్రుండు లోపలికిఁ దీసి

కొనిపోయి సరస్వతీప్రముఖయువతీమతల్లికలతో వారి తెఱం గెఱింగించి పరిచయము గలుగఁజేసెను.

ఆయంతఃపురకాంతలు వారిసోయగము వింతగాఁ జూచుచుఁ దమకుఁగలబంధుత్వము వారికిఁ దెలిపి వారివృత్తాంత మడిగి తెలిసికొని తదీయమనస్థైర్యమున కాశ్చర్యపడఁజొచ్చిరి. కుచుమారుండు ఘోటక ముఖుంజూచి వయస్యా! నీవు నాఁ డామిత్రునితోఁ గూడికొని పురందర పురమునుండి యరిగితివిగదా! ఎందెందు సంచరించితివి? ఏమేమివింతలఁ జూచితివి? సవిస్తరముగాఁ జెప్పుము. నీతో వచ్చినపురుషుఁ డెవ్వఁడో తెలిసికొంటివా? యని యడిగిన ఘోటకముఖుం డిట్లనియె.

మిత్రులారా! నాతోవచ్చినపురుషుఁ డెవ్వఁడో నాకిప్పటికిని దెలియదు. ఏకశిలానగరంబున కరుగుచుండ నొకయరణ్యమధ్యం బున భైరవుఁడను తాంత్రికుఁడు మాకుఁ గనంబడియెను. ఆపురుషుని భార్యను హరించినమాయావి వాఁడేయని తెలిసికొని మేము నిలునిలు మని పలుకుచు వాని కడ్డమై యాఁపితిని. వాఁడు తనపరివారమును గేక పెట్టెను. పదుగురు దుడ్డుకఱ్ఱలుతీసికొని మాపైకి వచ్చిరి. మేము నిరా యుధులమగుట వారికి వెఱచి పారిపోవఁ బ్రయత్నించుచున్నసమయంబున నాక్రూరాత్ముఁ డాపురుషునిఁబట్టికొని నెత్తిపై నేదియో పసరు రుద్దెను. అంతవట్టు చూచితిని. తరువాత నతండు గనంబడలేదు. వాఁడు నామీఁదికి వచ్చునని యటుచూడక డొంకలమాటుగా నవ్వలికిఁ బోయితిని. ఒక కుడుంగముచాటున ఘోటక మొకటి మేయుచుండెను. అది వానిమృగ సంఘమునుండి తప్పించుకొని యందు మేయుచున్నది. దానింజూచి వే ఱొకయుపాయము దోఁపక గుఱ్ఱము నెక్కుపాటవము గలదు కావునఁ దటాలున దానిపై నెక్కి కళ్ళెము జీను లేకుండఁగ నేనడిపింపఁదొడంగితిని. ఆహయంబు రయంబున నంతఁగనంబడినమార్గంబునంబడి పోవఁదొడం గినది.

వాఁడు వెనుకనుండి తఱిమికొనివచ్చునని వెఱపుతో మిక్కిలి వేగముగాఁ దోలితిని. అదియుఁ బశ్చిమోత్తరముగాఁ బోయి పోయి యా యడవిలో నొకగుడిసియొద్ద నిలువంబడినది. అప్పటికి జాముప్రొద్దున్నది. నాకు దాహమగుచున్నది కావున నాకుటీరమునందు మనుష్యు లుందు రనితలంచి గుఱ్ఱముదిగి తలుపుదగ్గరకుఁ బోయి లోపల నెవ్వరండో యని యఱచితిని. ప్రతివచన మేమియు వినఁబడలేదు. తలుపునకు బీగములేదు. త్రోసినంతనే తెఱువఁబడినది. లోపలికిఁబోయి నలుమూలలు చూచితిని. ఎవ్వరుఁ గనంబడలేదు. స్వల్పముగా సామాగ్రి యున్నది. తిన్నగాఁ బెరటి లోనికిం బోయితిని. అప్రాంతమం దొకనూయి యున్నది. తోడికొనుటకుఁ జేద యున్నది. దానితో నీళ్ళుచేదుకొని యమృతోపమానంబులగు తజ్జ లంబులు కడుపునిండఁ ద్రావితిని. తిరుగా లోపలికివచ్చి నలుమూలలు పరికింప నొకగది బీగమువేయఁబడియున్నది. ఇందలివా రెందుఁబోయిరో యని యాలోచించుచు వాకిటకు వచ్చితిని. ఆయశ్వ మందే నిలువంబడి యున్నది. నన్నుఁజూచి సకిలించినది.

అప్పుడు నేను దానిదాపునకుఁ బోయి మోము దువ్వుచు లక్షణ ములు పరిశీలింపుచుండ దానిమెడలో నేదియో తాయెత్తు గనంబడినది. దానిం ద్రెంపి పారవైచితిని. ఆగంధర్వం బంతలో నదృశ్యమై యొకముస లమ్మయై నిలువంబడినది. ఆమెం జూచి నేను వెఱఁగుపడుచు, అవ్వా! నీ వెవ్వతవు? ఇట్లు గుఱ్ఱమువై యుంటివేల? నీవృత్తాంతము సెప్పుమని యడిగిన నాయవ్వ యిట్లనియె.

బాబూ! ఈకుటీరము నాదే. ఈప్రాంతభూమి తృణకాష్టజలస మృద్ధి గలిగియున్నది. మేము సారస్వతబ్రాహ్మణులము. నాభర్తతో నే నీకుటీరమునఁ బెద్దకాలము కాపురముసేసితిని. పశువుల మేపుకొనుచు వ్యవసాయముచేసి జీవించువారము. నాభర్త చనిపోవునప్పటికి నాకొక కూఁతురుగలదు. దానికి మూఁడేండ్లున్నవి. భర్తృమరణానంతరము కూడ

నే నీయిల్లువిడువక యిందే కాలక్షేపము సేయుచుంటిని. నాపేరు రాధ యండ్రు. నాపుత్రికపేరు మిత్రవింద. నే నాబాలికను బ్రాణముపోలికఁ జూచుకొనుచు హృదయంబునం బెట్టుకొని కాపాడుచుంటిని. నాకూన మిక్కిలి చక్కనిది. దినదినప్రవర్ధమాన యగుచుఁ బండ్రెండేండ్లప్రాయము వచ్చునప్పటికి మిక్కిలి లావణ్యముగలిగి ప్రకాశింపఁజొచ్చినది.

నాపుత్రికకు యౌవనాంకూరమైనది మొదలు తగినభర్త యెవ్వఁడు దొరకునని యాలోచించుచుంటిని. దైవమే యన్నియుం గూర్చును. కూడినవానిం జెఱచుచుండును. వరాహద్వీపాధిపతి బ్రాహ్మణప్రభువు వేటకై యొకనాఁ డీయడవికి వచ్చెను. గొప్పగాలివాన పట్టినది. బలములన్నియుఁ దలయొకదెసకుఁ జెదరిపోయినవి. ఇంతలోఁ జీకటిపడినది. మెఱపులు మెఱయుచుండెను. ఆవెలుఁగునఁ దడిసికొనుచు నెట్లో యాతఁడు మాకుటీరమున కరుదెంచి యెవరయ్యా! లోపలనని యఱచెను. నా కింకను నిద్రపట్టలేదు. నేను బోయి తలుపుతీసితిని. కట్టిన గుడ్డలన్నియుఁ దడిసినవి. వజవజ వణఁకుచుండెను.

నన్నుఁజూచి యతండు అమ్మా! యీరాత్రి మీయింట వసించి చలిఁ బాపుకొనియెదఁ గొంచెము తావిచ్చెదవా? అని యడిగెను. రండు రండు నిశ్శంకముగా వసింపుఁడు. అని పలుకుచు నాయొడయని లోనికిఁ దీసికొనిపోయి కట్టుకొనుటకుఁ బొడిగుడ్డలిచ్చి కాచుకొన నిప్పురాజవైచి వేడినీళ్లుపెట్టి వంటఁజేసి పాలు పెరుఁగు మీఁగడతోఁ దృప్తిగా భోజనము పెట్టితిని. పండుకొన మంచ మిచ్చితిని.

ఆనృపతి యప్పు డపరిమితసంతోషము చెందుచు నవ్వా! నేఁడు నీవు నాకు మంచియుపకారము గావించితివి. ఆజన్మాంతము నిన్ను మఱువను. నీ వొంటిగా నీయరణ్యమధ్యమున నుండనేమిటికి? నీకుఁ బిల్ల లెందఱు? నీయుదంత మెఱిగించి నాకు శ్రోత్రానందము గావింపుమని యడిగిన నే నిట్లంటిని

అయ్యా! జన్మభూమి యెంతసంకటమైనదైనను విడువ బుద్ధిపుట్టునుకదా? మా కిక్కడ స్వర్గఖండమువలె నున్నది. మాకుఁ జాలపశువులు గలవు. వానికిఁ గావలసినంతపచ్చిక యున్నది. మాకుసరిపడిన ధాన్యములు ఫలించును. ఒకరితో మాకుఁ బనిలేదు. నాకు మిత్రవింద యను కూఁతురు గలదు. దానికిఁ బెండ్లిచేయవలసినసమయము వచ్చినది. అనుకూలుఁడగు వరుఁడు దొరకవలయు నిదియే నాకుఁగలిగిన చింత. ఇందులకై మీకు శక్యమైన సహాయముచేయుఁడని పలుకుచు నావృత్తాంతము చెప్పితిని.

ఏదీ? నీకూఁతురు. ఎన్నియేండ్లున్నవి? అనియడిగినఁ బండుకొని నిద్రబోవుచున్నది. యౌవనోదయ మగుచున్నది. చక్కఁదనముగుఱించి నేను జెప్పనవసరములేదు. చూచిన మీకే తెలియఁగలదు. అని పలుకుచు అమ్మాయీ! మిత్రవిందా! లేచి యిటురా, అని పిలిచితిని. అది యంతకుముందే లేచి మాసంవాద మాలించుచు నాగదిలోఁ గూర్చున్నది నామాట విని ఇదిగో వచ్చుచున్నానని యించుకసిగ్గుదోఁప వచ్చి యొక్కప్రక్క నిలువంబడినది. దీపము వెలుఁగున దానిసోయగము చూచి యతం డక్కజపడినట్లు నాకుఁదోఁచినది.

బాలా! పోయి పండుకొనుము. రేపు జూచెదనులే యని పలుకుచు నవ్వా! నీకూఁతురు మంచిచక్కనిది. మిత్రవిందయేకదా? యేకృష్ణుఁడో వచ్చి పెండ్లియాడఁగలఁడు. ఇందులకై నీ వాలోచింపవలసినపనిలేదని పలుకుచు నతండు నిద్రఁబోయెను. అతని కులశీలనామాదులేమియు నప్పటికిఁ దెలియవు. మఱునాఁడు సూర్యోదయము కాకపూర్వమే యతని వెదకికొనుచు జతురంగబలములు నాకుటీరమునొద్దకు వచ్చి చక్రధరభూపాలుఁ డిందువచ్చెనా? అని యడిగిరి.

వారిమాటలచే నతండు ప్రభువని తెలిసికొని విస్మయము జెందుచు వారెవ్వరో నాకుఁ దెలియదు. రాత్రి యొకపురుషుండు జడికొట్టి

యిందువచ్చెను. పండుకొనియున్నవాఁడు ఇంకను లేవలేదు. అని చెప్పితిని. వాండ్రు తొందరపడుచు మహారాజుగా రిందున్నారా? అని యందఱు నందు మూఁగికొనిరి.

అంతలో నతండు లేచెను. నేను మిత్రవింద చేతనే యతని కుపచారములు సేయించితిని. బాబూ! చెప్పనేల? నాకూఁతురు చక్కఁదనంబున కతఁడు వలచి మూఁడుదినము లందుండి కదలఁడయ్యెను. తదీయహావభావవిలాసాదు లతనిహృదయము నాకర్షించినవి. నే నది యెఱిఁగి యక్కురంగనయనను సంతత మతనియంతికముననే యుండ నియమించితిని. మిత్రవిందతో సరససల్లాపములాడుచుఁ జివర కొకనాఁడు మిత్రవిందను దనకుఁ బెండ్లిచేయుమని నాతో సూచించెను. నేను ప్రహర్షసాగరమున మునుఁగుచుఁ బుష్పములతో మిత్రవిందం దీసికొనిపోయి యతనితొడపైఁ గూర్చుండఁబెట్టితిని. అతండు గాంధర్వవిధి నా వధూరత్నమును స్వీకరించెను. అప్పుడే యప్పడఁతిఁ దనగ్రామమునకుఁ దీసికొనిపోయెను. నేనును దానితోఁబోయి కొన్నిదినము లందుండి వెండియు నింటికివచ్చితిని.

నాకూఁతురు మిత్రవింద వరాహపురంబున భర్తతో స్వర్గసౌఖ్యము లనుభవింపుచుండెను. దానికి జాంబవతి యనుకూఁతురుమాత్రమే యుదయించినది. అది యట్లుండె నన్నందు రమ్మని యెంతయో నిర్బంధించుచున్నదికాని నా కీభూమి విడిచిపోవ నిష్టము లేకున్నది. అప్పుడప్పుడుపోయి చూచి వచ్చుచుందును. ఈనడుమ గడ్డము తలయుం బెంచుకొని జటలతో మహర్షివలె నొప్పుచున్న యొకదుర్మార్గుఁడు పశువులును బక్షులును మృగములును పలురకము లొప్పుచుండ నీయడవిలో నొకనాఁడు బసజేసెను. నే నతనియొద్దకుఁబోయి నమస్కరించుచు మహాత్మా! ఈయరణ్యమంతయు నాది. నేను గుత్తకుఁ దీసికొన్నాను. నాకుఁ జాలపశువులు గలవు. మాపచ్చికయంతయు మీపశువులు

మేయుచున్నవి. కావున నొకటి రెండు దినములకంటె మీరిందుండఁదగదు. అని వినయముతోఁ బ్రార్థించినఁ గన్నులెఱ్ఱజేయుచు నాజటాధారి నన్నుఁ జూచి యోసీ! అడవి యొకరు పెంచినదికాదు. అందఱకు సమానముగు నధికారము గలిగియున్నది. నాశక్తి యెఱుంగక యిట్లు పలుకుచున్నావు. నేనిందు నాయిష్టమువచ్చినన్నిదినము లుండు వలదనుటకు నీవెవ్వతె వని గద్దించి పలికెను.

అప్పుడు నేను మెల్లఁగా స్వామీ! యీయరణ్యముపై మీ కధికారము గలిగియున్నచో మీపశువులపై మృగములపై నా కధికారము గలిగియున్నదని చెప్పిన మీకుఁ గోపమువచ్చునేమో? భగవత్సృష్టి యందఱకు సమానముగదా? అని ప్రత్యుత్తరమిచ్చితిని. అప్పు డాయనకు నాపైఁ బెద్దకోపము వచ్చినది. ఏదియో పసరు నానెత్తిపై రుద్దినన్నొక గుఱ్ఱముగాఁ జేసెను. తరువాతిచర్యలన్నియు స్వప్నప్రాయములుగా నున్నవి. ఇంచుకించుక తెలివితో వానిబారి తప్పించుకొనివచ్చి పారిపోవుదమని ప్రయత్నించుచుండఁగా నింతలో మీరువచ్చి నన్నిక్కడికిఁ దీసికొనివచ్చితిరి. మీకరుణావిశేషంబునం జేసి స్వస్వరూపము గైకొంటి లేనిచో వారువమునై యుండవలసివచ్చును. కృతార్థురాలనైతి నిదియే నావృత్తాంతమని యెఱింగించిన విని నేనాశ్చర్యమందుచు నవ్వా! వాఁడు మహాపాపాత్ముఁడు. స్త్రీలను జెఱపెట్టుట కించుకయు వెఱవఁడు. ఒక పతివ్రత నట్లే కావించెను. వానినిమిత్తమే తిరుగుచుంటిమి. నామిత్రునిగూడ నిట్లే కావించెనుకాఁబోలు. నన్నవమానించునని మాటునకుఁ బోయితిని నీమూలమున నతనిచేతఁ జిక్కకుండ నిందు రాఁగలిగితిని. ఆక్రూరుండు ఇంక నెందఱను బరిభవించునో తెలియదు. పాపము నామిత్రుఁడు వాని తాంత్రికమెఱుఁగక చిక్కుకొనియెను. శూరుల కెఱింగించి వాని శిక్షింపఁజేసెద. వాని చేష్టలు తెల్లమైనవని పలుకుచు మఱియు నిట్లంటిని.

అవ్వా! నీయుల్లుఁడు రాజుగదా? నీ వావరాహపురంబున కరిగి యాతని సుఖింపక యిం దొంటిగా నుండ నేమిటికి? అని యడిగిన నామె బాబూ! చెప్పలేదా? నాపశుబలము జూతువుగాని రమ్ము, నా దొడ్డి యీప్రాంతమందే యున్నది అని పలుకుచు నన్ను వెంటఁబెట్టికొని యచ్చటి కనతిదూరములోనున్న మందలోనికిఁ దీసికొనిపోయినది.

ఆమెంజూచి యందున్న పెద్దపెద్దయావులు దూడలు గిత్తలు అంభారవంబులు గావింపుచు దాపునకువచ్చి యామెను నాకుచు ముట్టె లతోఁ బొడుచుచు వియోగశోకమును వెలిబుచ్చినవి. ఆమెయు వాని నెల్ల గోకుచు ముద్దుపెట్టుకొనుచుఁ గొన్నిటిఁ బేరులుపెట్టి పిలుచుచు దాపునకు రప్పించుకొని కొన్నిటి పొమ్మని పేరులతోఁ జెప్పిన దూర ముగాఁ బోయినవి. ఆవింత నాకుఁ జూపుచు నాయవ్వ బాబూ! ఈ పశుమోహమే నన్నిచ్చటినుండి కదలనీయకున్నది. వీనిఁ బిల్లలగాఁ జూచుకొనుచున్నానని చెప్పినది.

అప్పుడు నేను అవ్వా! నీమాట సత్యమే. పశుపత్నిసుతాలయ ములు ఋణానుబంధరూపములని పెద్దలు చెప్పుచుందురు. పోనీ నీయు ల్లుఁడు భాగ్యవంతుఁడుగదా? ఇం దీగుడిసె దీసి మంచియిల్లు గట్టికొన రాదా? అని యడిగిన నామె నాచేయిపట్టికొని తన గుడిసెయొద్దకుఁ దీసికొనిపోయి దానిలో నొకమూలఁ జాటుగా నమరింపఁబడియున్న చిన్నతలుపు తీసి నేలసొరంగము జూపినది. దానిలోనికి దిగితిని. ఆహా! లోపల మిక్కిలి విశాలముగానున్నది. ఇంద్రభవనమువలె విరాజిల్లు చున్నది. వింతవింతవస్తువులు గలవు.

వాని వాని వేలువేల నిరూపించి చూపుచు నార్యా! ఇది మహారణ్యప్రదేశ మగుటయు నొంటిగా నుండుటంబట్టి వట్టి పేదదాని వలెఁ గనంబడుదును ఈగుడిసెజూచి నాజోలి కెవ్వరును రారు. నాపశు ధన మెవ్వరు దీసికొనిపోవఁజాలరు. బలవంతముననఁగాని దొంగతనమునఁ

గాని దేనినేని తోలికొనిపోయినచో నాపశు వెందున నిలువదు. వెంటనే పారిపోయివచ్చి మందలోఁ గలియును. ఒకయె ద్రాక్షపండు మూఁడుమాసము లెండోయుండి వచ్చినది. నాయింటనున్న వస్తువులు కుబేరునింట లేవు. నాయల్లుఁడీవైభవమంతయుఁ జూచినతరువాతనే నాపిల్లను నేసికొనియెను. చాల వింతవస్తువు లాతఁడు తనగ్రామమునకుఁ దీసికొనిపోయెనని చెప్పినది.

ఆపాతాళగేహాలంకారములు చూచి నేను విస్మయము చెందుచు నామెచెప్పినమాటలు విని ఆహా! అవ్వా! నీవు పైకిఁజూడ వెఱ్ఱిదానివలెఁ గనంబడుచుంటివి. నీవైభవము పెద్దది. నీగుట్టు తెలిసికొని దుర్మార్గులెవ్వరైన బాధింతురేమో? ఈరహస్యము నాకుఁ జెప్పినం జెప్పితివి కాని యితరుల కెన్నఁడును జెప్పరాదుసుమీ? అనవుఁడా యవ్వ నవ్వుచు నిట్లనియె.

సౌమ్యా! నీయింగితాకారచేష్టలఁ బరిశీలించి యీగుట్టు చూపితినిగాని యితరులకుఁ జెప్పుదునా? నాఁడు మాయల్లుఁడు చక్రధరునకుఁ జూపితిని నేఁడు నీకుఁ జూపితిని. నాకూతురుగూడ బాగుగా నెఱుఁగదు. నీవు విద్వాంసుఁడవు చాలమంచివాఁడవని తోఁచినది. నన్ను రక్షించితివి. నీకొక యుపకారము చేయుతలంపుతోనే రహస్యము నివేదించితిని. అని పలుకుచు నాకవాటము మూసి యంతలో వంటజేసి తృప్తిగా భోజనము పెట్టినది. రెండుమూఁడుదినము లందుండి నేను ధారానగరమునకుఁ బోవలసియున్నది. మఱియు నాతాంత్రికుని శిక్షింపఁజేయవలసియున్నది. మిత్రులఁగలిసికొని యుపాయ మాలోచించెద. పోయివచ్చెద ననుజ్ఞయిమ్ము. నా కేదియో యుపకారము సేసెదనంటివి.

ధనముతో నాకు నిమిత్తములేదు. మామిత్రులిర్వురు మహారాజులై యున్నవారు. వారిధనమంతయు నాయిచ్చవచ్చినట్లు వాడుకొనవచ్చును. నీయుపచారమునకుఁ జాల సంతోషించితిని. కృతజ్ఞతకు మెప్పువచ్చెనని పలికిన నాయవ్వ యిట్లనియె.

మీరు మహావిద్వాంసులు. దేశమే మీధనము. నేను మీకు ధన మిచ్చుదానను గాను. వరాహపుర మిక్కడికిఁ బదియోజనములదూరము లో నున్నది. అదీవికి రెండుయోజనములుమాత్రమే సముద్రము దాట వలసియున్నది. నిన్నక్కడికిఁ దీసికొనిపోయి నీవు సేసినయుపకారము మాయల్లునితోఁ జెప్పి వారికిని మీకును మైత్రి గలుపవలయునని యభిలాషయున్నది. ఇదియే నాతలంపు. నాలుగుదినములలో బోఁగలమని పలికిన విని నేను గ్రొత్తవింతలం జూచుతలంపుగలవాఁడనగుట నామెమాట నంగీకరించి నాఁడే పయనము సాగింపుమని కోరితిని.

అప్పు డామె మందయొద్దకుఁబోయి రెండుకున్నపోతుల వెంటఁ బెట్టుకొనివచ్చినది. వానివీపుపై మెత్తనియాకులుఁ జిగుళ్ళును జీనులాగునఁ గట్టినది. ఒకదానిపైఁ దానెక్కి రెండవదానిపై నన్నెక్కుమన్నది. నాకుఁ బక్కున నవ్వువచ్చినది. అంతకన్న వేఱొకసాధనము లేక పోవుట నట్లుచేయక తప్పినదికాదు. ఆకొండలలోఁ బాదచారియైపోవుట చాలకష్టమఁట. యముఁడంతటిమహాత్ముఁడు దాని యానసాధనముగాఁ జేసికొనియె. మనమాట లెక్కయేమని దానిపై నెక్కితిని. మిత్రులారా! నే నేమనిచెప్పుదును ? గుఱ్ఱములు నేనుఁగుల నెక్కినప్పుడుగూడ నంత సౌఖ్యము గలుగలేదు.

అవ్వ ముందునడుచుచుండ నేను వెనుకఁ బోవుచుంటిని. కుదుపు కొంచెమైన లేదు. చాలవేగముగా నడుచుచుండెను. ఏమియు నదలింప నవసరములేదు. మెట్ట లెక్కునప్పుడు పూర్వకాయము వంచుచుఁ బల్లమునకుఁ దిగునప్పుడు చరమకాయము వంచుచు మాకేమియు నాయాసము లేకుండ నడుచునవి. మూఁడుదినము లట్లు పయనముసాగించి సముద్రతీరముననున్న యొకపల్లె చేరితిమి. ఆమె యొకపల్లెవానిఁజీరి వరాహపురంబునకు నోడగట్టుమని నియోగించినది వాఁ డప్పుడే యొకచిన్నప్రవహణము సన్నాహముసేసి తీసికొనివచ్చెను. మేము పెందలకడ భోజనము

చేసి యోడ యెక్కితిమి. ప్రొద్దుగ్రుంకకపూర్వమే యవ్వలియొడ్డు చేరితిని. వెంటనే యొకబండియెక్కి వరాహపురమున కరిగితిమి. ఆనగరము మహోన్నతములగు సౌధములచేతను సమస్తవస్తుపూర్ణములగు విపణిమార్గములచేతను బ్రకాశింపుచున్నది. రాజమార్గంబునం బోయిపోయి రాజుగారికోట చేరితిని. ఆయవ్వ నందఱు నెఱింగినవారగుట దౌవారికు లేమియు నాటంకముసెప్పలేదు. కక్ష్యాంతరములు గడిచి తిన్నగా లోపలి భవనమునకుం బోయితిమి. తల్లివచ్చుచున్నదనువార్త విని పుత్రిక మిత్రవింద కొంతదూర మెదురువచ్చినది. ఆమె నన్నుజూచి యించుకతొలంగిన వలదు వలదు. ఈయన మన కాంతరంగికబంధువుండు. అర్చనీయుండు. పాద్యము దెమ్మని పలుకుచు నాయవ్వ కుమారితచేత నా కుపచారములు చేయించినది.

నా కించుకమాటుగా నిలువంబడి మిత్రవింద అమ్మా! యింత వేగిరము వచ్చితివేమి? రెండునెలలవఱకు రావనుకొన్నాము వారెవ్వరు? అనియడిగిన నామె పుత్రికతో భైరవుండు తనయడవికి వచ్చుటయుం దన్ను గుఱ్ఱముగాం జేయుటయు నేను విడిపించుటయు లోనగువృత్తాంతమంతయు నెఱింగించినది. మిత్రవింద యురముపైం జేయి వైచికొనుచు హా! హంత! యెంతగండము గడిచినది? నే నేమిచేయుదును. నీవు చెప్పినమాట వినవు. నీ కా యడవిలోనే చావుమూడినది. ఇట్టి యైశ్వర్యమనుభవించుచున్నను నాబుద్ధికి స్థిమితము లేదు. నీకొఱకే చింతించుచుందును. నిన్ను వాండు గుఱ్ఱముగాం జేసెనుగాని, చంపిన నేమిచేయుదువు? వలదనువారెవ్వరు? ఇప్పుడైన బుద్ధిగలిగి యాకాపుర మెత్తిపెట్టి యిక్కడికి రమ్ము. అని యేమేమో మందలించినది.

అవ్వ పుత్రికమాటలు విని కానిమ్ము. ఏదోయొకటి చేయుదము. నీభర్త యూరనున్నాండా? అనియడిగిన పుత్రిక లేరు. వారిమిత్రుండు విపులుండు వర్తమానముసేయ మహాపురంబున కరిగిరి. రేపు రాంగల

రని చెప్పినది. జాంబవతికి వివాహ మొక్కడనైనఁ గుదిరినదియా ? ఈ యేఁడు చేయుతలంపు గలదా ? అనియడిగిన నామె యుత్తరవయసువచ్చినది. చేయ కేమి ? తగినవరుఁడు కనంబడుటలేదు. పలుచోటులు చూచిరి. విద్యయుండిన రూపములేదు. రూపమున్న విద్య సున్న. ధనముతో మనకుఁ బనిలేదు. అని యావిషయముగుఱించి ముచ్చటించుకొనిరి. తరువాత నేదియో గుజగుజలాడుచు నన్నాయవ్వ లోపలికిఁ దీసికొని పోయినది.

అంతలో భోజనమునకు లెమ్మని పరిజనులు వచ్చి చెప్పిరి. పలు రకముల పిండివంటలతో నే నారాత్రి భోజనము సేసితిని. రాజోపచారములు గావించిరి. హంసతూలికాతల్పంబునం బండుకొన నియమించిరి. నామంచముదాపునఁ గూర్చుండి యాయవ్వ యిష్టాలాపముల నాడుచుండ నారాత్రి సుఖముగా వెళ్లించితిని.

మఱునాఁడు మంగళగీతములచే మేల్కొంటిని. పరిజను లనేకోపచారములు సేయుచుండిరి. అంతలో నవ్వవచ్చి కుశలప్రశ్న చేయుచు మాయల్లుఁడు నేఁటిమధ్యాహ్నమునకే వత్తురట. ఇప్పుడే వార్తవచ్చినది నామనుమరాలిఁ జూచితిరా ? జాంబవతీ ! ఇటురా. అనిపలుకుచు నొక చిన్నదానిం బిలిచినది. అప్పు డొకబాలిక యచ్చరముచ్చెకంటిపోలిక నొప్పుచు నాప్రక్కవచ్చి నిలువంబడినది. తద్రూపాతిశయంబు నాకు మోహాతిరేకము కలుగఁజేసినది. తదవయవంబులన్నియు సాముద్రికశాస్త్రలక్షణలక్షితంబులైనవి. తత్సౌందర్యవిశేషంబు పరిశీలింపుచుండ నాయవ్వ మనుమరాలితో జాంబవతీ ! ఆయన మంచిపండితుఁడు నమస్కరించుము. అనుటయు నాబాలిక చేతులెత్తి మ్రొక్కినది. అనుకూలభర్తృలాభసిద్ధిరస్తు అని యాశీర్వదించితిని. ముసిముసి నగవులు నవ్వుచు నాబాలిక యవ్వలికిఁ బోయినది.

ఇంతలో గ్రామాంతరమునుండి యొకఘటకుం డరుదెంచెను. మిత్ర

వించ భర్త కెదురువోయి పాదములుగడిగి శిరంబుపైఁ జల్లుకొనుచు స్వాగతమడిగి నిలువలేక తనతల్లిరాక యెఱింగించినది. ఆప్రభువు మందహాసము గావించుచు ఏమీ! నీతల్లియేవచ్చినదా! పశువు లేమగునో గదా! అని పరిహాసమాడుచుండ నయ్యో! దాని కెట్టిగండముగడిచిన దనుకొంటిరి. ఘోటకముఖుండను పుణ్యాత్మునివలన విముక్తినొందినది. ఆయనగూడ నిందువచ్చిరని యాకథయంతయుఁ జెప్పినది.

ఆవార్తవిని యతం డామె కట్లుకావలసినదే! ఈసారియైన నిందుందు నేమో యడిగితివా? ఆపండితుం డెందున్నవాఁడు. అని యడుగుచుండ నాయువ్వ నన్నతనియొద్దకుఁ దీసికొనిపోయి యీపుణ్యాత్ముఁడే నన్ను రక్షించినవాఁడని యెఱింగించినది.

రాజు నాకు నమస్కరించుచు నతం డడుగ వెండియు నావృత్తాంతము భైరవునివృత్తాంతమును జెప్పితిని. ఆతఁడు నన్ను మిగుల గౌరవించుచు విద్యలలోఁ గొంతముచ్చటించి నేనిచ్చిన ప్రత్యుత్తరమున, కచ్చెరుపడఁజొచ్చెను. తరువాత మేమిరువురము నొకపంక్తినిగూర్చుండి భుజించితిమి. భుజించునప్పు డతనిభార్య ప్రక్కనిలువంబడి తాళవృంతమున విసరుచు మనోహరా! విపులుఁడు మీ కంతయవశ్యకముగా రమ్మని వార్తనంపఁ గారణ మే మనవుడు నతం డిట్లనియె.

లోకమంతయు స్త్రీప్రచారముతోఁ గూడికొన్నది వినుము. విపులుఁడు నిష్కాముండైనను మతంగయోగినిప్రోత్సాహమున నిరువురవారకాంతల వరించి వారిని బలవంతమున రప్పించుకొనుటయు నయ్యంగన లంగీకరింపక యల్లరిచేసి యెట్లో భోజునిపుత్రునకుఁ దెలియఁజేసిరి కాఁబోలు. భోజపుత్రుండు చిత్రసేనుఁడనువాఁడు విపులున కిట్టిసందేశమును బంపెను.

రాజా! రాజు ప్రజల న్యాయాన్యాయంబుల విచారించి దుర్జనుల శిక్షించి సజ్జనుల రక్షించుచుండవలెను. నీ వామాట మఱచిపోయి

యిరువురు వారవనితల బలవంతముగఁ జెఱపట్టితివఁట. అది యెంతపాపము. సీతను జెఱపట్టినరావణుం డేమయ్యెనో యెఱుంగుదువా? నీ వీజాబు చూచినతక్షణము వేశ్యాపుత్రికల నిరువురను విడిచివేయుము. అట్లు వెంటనే మాకుఁ దెలియఁజేయుము. నీయుత్తరము రానిచో నుత్తరకాలమందే నీపై యుద్ధము బ్రకటించుచున్నాము. నీరాజ్య మన్యాక్రాంతము గావింతుము. అని జాబువ్రాసి విపులునొద్ద కనిపెనఁట. విపులుఁడు భోజునికంటె దుర్బలుఁడగుట నాపత్రికం జదివికొని భయపడుచుఁ బ్రత్యుత్తర మిట్లు వ్రాసి పంపించెనఁట.

మహారాజా! నాశత్రువు లెవ్వరో మీకట్టివార్త తెలియపఱచి యున్నారు. వేశ్యాపుత్రికల నిరువుర నేనెన్నఁడును దీసికొనిరాలేదు. వారు నాదేశములో లేరు. మీకు నామాటయందు విశ్వాసము లేనిచో మీదూతలం బంపి వెదకింపుఁడు. అట్టివేశ్యలు నావిషయమం దెందున్నను మీరుచేసినశిక్షకుఁ బాత్రుండనగుదును. అని భోజునకుఁ దెలియఁజేసి వెంటనే యతండు నాకు వర్తమానముసేసెను.

నేనుబోయి పనియేమని యడిగిన జరగినకథయంతయుం దెలియఁ జేయుచు నేను మతంగయోగిమూలమున బలవంతముగా నిరువురగణికాపుత్రికలఁ జెఱదెచ్చినమాట వాస్తవము. గడచినదానికి వగచినఁ బ్రయోజనము లేదు. ఇప్పుడు వీరినివిడిచితినేని నాయక్రమకార్యము వెల్లడి కాకమానదు. వెలయాండ్రుగదా? యని రప్పించితిని. వాండ్రు కులస్త్రీలకన్న నెక్కుడుపరితాపము చెందుచున్నారు. కావున మీరు వీరిని మీదేశమునకుఁ దీసికొనిపోయి కొన్నిదినములు కాపాడవలయును. ప్రస్తుతోపద్రవము దాటినపిమ్మటఁ గర్తవ్య మాలోచింతముగాక. నీవు నాకు మిత్రుఁడవు. ఈసమయంబున నీయుపకారము గావింపుము. నీకడ నుండినచోఁ బరమేశ్వరుఁడు దెలిసికొనఁజాలఁడు అని ప్రార్థించెను.

అక్రమమైనను మిత్రునికార్యము సేయఁదగినదని తలంచి యతని

మాట కడ్డుసెప్పక యంగీకరించి యావారకాంతలనిరువుర నిక్కడికిఁ దీసికొనివచ్చితిని. వారు చావడిగదిలో నున్నారు. అని యారాజు భార్యకుఁ జెప్పెను.

ఆమాటలు విని మిత్రవింద ఓహో! మీసాధుత్వము మిక్కిలి కొనియాడఁదగియున్నదిగదా? విపులునిఁ జేసినపనికి మందలింపక యను మోదించి యాసుందరుల నింటికిఁ దీసికొనివచ్చితిరా? చాలు; చాలు. ఈవార్త వినిన భోజుండు మిమ్ముఁగూడ నపరాధిగా నెంచి మీపైఁ గత్తి కట్టకమానఁడు. మీమర్యాద యెల్లరకుఁ దెల్లమగును. అదియునుంగాక,

శ్లో॥ కర్తా కారయితాచైవ ప్రేరక శ్చానుమోదకః
సుకృతే దుష్కృతేచైవ చత్వారః సమభాగినః॥

పుణ్యపాపములు చేసినవాఁడును, జేయించినవాఁడును, ప్రేరకుఁడు, ననుమోదించినవాఁడును సమముగాఁ దత్ఫలమును బంచుకొందురని పెద్దలు చెప్పుదురు. పూర్వ మొకబ్రాహ్మణుఁడు వాచాదోషంబు ననే యతిహత్యాపాప మనుభవించె నాకథ నా కొకపండితుం డెఱింగించెఁ జెప్పెద నాలింపుఁడు.

## కౌశికుని కథ.

కౌశికుండను బ్రాహ్మణుఁడు ఒకనాఁ డొకసన్యాసిని భిక్షకై నిమంత్రించెను. తనకు వాడుకగాఁ బెరుఁగునుం బాలును దెచ్చుచున్న గొల్లదానితో నోసీ! రేపు మాయింట యతిభిక్ష జరగును. నీకు నిబ్బడిగా సొమ్మిచ్చెదను. నీరుగలువకుండ గట్టిపెరుఁగు తోడుపెట్టి తెమ్మనిచెప్పి యంపుటంజేసి యాగొల్లది యట్లే మంచిపెరుఁగు ముంతలోఁ దోడుపెట్టి యది గంపలోఁబెట్టి పైన గుడ్డ మూతవైచి తెచ్చుచుండెను. గాలిచే నాగుడ్డ పెరుఁగుముంతమూతినుండి తొలంగినది. ఆకసమున నాసమయమున నొకగరుడపక్షి తెల్లత్రాచుం బట్టికొనిపోవుచుండెను. ఆపాము గరళము గ్రక్కినది. ఆవిషము దైవికముగావచ్చి గొల్లదితెచ్చుచున్న

పెరుఁగుముంతలోఁ బడినది. ఆవిషము నించుకయు గొల్లది యెఱుంగదు. ఆపెరుఁగుముంత కౌశికుఁ డందుకొని చాల సంతోషించుచు దాని కెక్కువగా సొమ్మిచ్చి తరువాత యథాశాస్త్రముగా నాసన్యాసి నర్చించి పిండివంటలతో భోజనముపెట్టెను. కడపట నాపెరుఁగు వడ్డించెను. దానిరుచికి మెచ్చుచు యతీశ్వరుఁడు మఱికొంచె మెక్కువగాఁ బుచ్చుకొనియెను. అతనినాలుక పూచియుండుటచేఁ బుంజుపడియున్నది. భుజించినకొంచె మునేపునకే యాయతి విషముఘూటుతగిలి పరమపదించెను.

యతిచావు జూచి గృహపతి యపరిమితముగా దుఃఖించుచుఁ దత్కారణము దెలియక పరిపరిగతులఁ దలంచుచు గ్రామస్థులసహాయమునఁ దద్దేహము గంగార్పితముగావించెను. ఆయతిహత్యాపాతకము నెవరనుభవించునట్లు వ్రాయవలయునో తెలియక సంశయించుచుఁ జిత్రగుప్తులు యమధర్మరాజ నడిగిరి. అతం డావిషయము విమర్శించి సందియమందుచు ధర్మకర్తల నడిగెను.

ధర్మకర్తలు తత్పాపభర్తలగుఱించి వితర్కించి కౌశికుఁడు శ్రోత్రియుఁడు. శ్రద్ధాభక్తిపూర్వకముగా యతిభిక్ష గావించెను. గొల్లది తెచ్చినపెరుఁగులో విషముగలిసిన ట్లెట్లుతెలిసికొనఁగలఁడు? కావున నతని కీపాపము విధించుట యుచితముగాదు. గొల్లది కులోచితాచారప్రకారము తోడుపెట్టి మూతవైచి తట్టలోఁబెట్టి పెరుఁగు తీసికొనివచ్చినది. గుడ్డ గాలిచేఁ గదలి యెగురుట యెఱుఁగదుగదా! ఇందు దానిలోప మేమియున్నది. చెప్పినరీతిగాఁ దెచ్చియిచ్చుటచే నీపాపము గొల్లదానికి విధించుట యుక్తముగాదు.

ఆచ్ఛాదనవస్త్రమును ముంతమూతినుండి కదల్చినవాయువున కీయఘము విధింతమన్నఁ జలన మతనికి సహజము కావున నట్లుచేయుట తప్పు. విషముగ్రక్కిన సర్పమునకే యీదోష మర్పింతమన్న గరుడపక్షిచేత నొక్కఁబడి యది యట్లు చేసినది. అస్వతంత్రుఁడు పాపభర్త

కానేరఁడు. ఈదోసము గరుడపక్షిమూలమున వచ్చుటచే నతనికే విధిం తమనిన సర్పమునుదినుట దానికిఁ దప్పుగాదు. ఈపాప మెవ్వరికివిధిం పవలయునో మాకునుం దెలియలేదని ధర్మకర్తలు సెప్పిరి.

అప్పుడు యముఁడు సంశయడోలాయితహృదయుండై యాపాప మెవ్వరిపేరను వ్రాయవలదని చిత్రగుప్తులకుఁ జెప్పి వైకుంఠమునకుం బోయి శ్రీమహావిష్ణునికడ నివేదించెనఁట. అమ్మహాత్ముండు గొప్పసభ చేసి యాధర్మసూక్ష్మము చెప్పుఁడని మహర్షుల నడిగెనఁట. దేవతలు మహర్షులుగూడ నాసందేహము తీర్పలేకపోయిరి. శ్రీమన్నారాయ ణుఁడు లోకములు తిరిగి పెద్దల నరసి యీధర్మసూక్ష్మము దెలిసికొన వలసియున్నది. ప్రస్తుత మెవ్వరికిని విధింపవలదు. దూతలంబంపి మూఁడు లోకంబులంగల పెద్దలతో విచారించి తగినవిధి నాచరింపుమని యముని కాజ్ఞ యిచ్చెను. యముండును ధర్మసూక్ష్మము గ్రహించుటకై తన దూతల లోకములఁ ద్రిప్పుచుండెను.

వైకుంఠములో సభజరగినప్పుడు గరుత్మంతుఁడావార్తవిని కుల స్థులకెల్ల నీయపకీర్తివచ్చినదని పరితపించుచు నీదోస మాపతగమునకు ఘటింపఁజేయుదురేమో యని మిక్కిలి వెఱచుచుండెను. ఆవార్త గరుడ పక్షిజాతికెల్లం దెలిసినది. భూలోకములో నొకవృక్షశాఖలవసించి రెండు గరుడపక్షు లామాటలే చెప్పుకొనుచు నిలిపి నిలిపి చివర కీదురితము మనపక్షికే విధింతురేమో యని చింతించుచుండెను.

ఆసమయమున దైవికముగా నాచెట్టుక్రిందఁ బండుకొనియున్న యొకబ్రాహ్మణుఁడాపక్షివాక్యము లాలించి యాభాష తాను జదివి యున్నవాఁడగుట దదర్థముగ్రహించి తనతోనున్న రెండవబ్రాహ్మణుని కాకథయంతయుం జెప్పుచు నీవిషయము దేవతలు మహర్షులు సెప్పలేక పోయిరఁట నన్నడిగిన నేను జెప్పుదునుకాదే యని పలికిన విని రెండవ వాఁడు నీ విందుల కేమిచెప్పెదవు? ఆపాప మెవరికి విధింతువని యడి గిన నతం డిట్లనియె.

ఎవ్వరికిని విధింపను. విషముఁగలిపినపెరుఁగును బరిశీలింపకుండ నాసన్న్యాసికిఁబోసిన యజమానుఁడే యాపాపము భరింపవలయును. వస్తుశోధనము సేయవలదా? గరుడపక్షి యించుకయు భరింపనర్హము గాదని కచ్చితముగాఁ జెప్పెను. విధివశంబున నామాట లాకసంబున నాప్రాంతముగాఁబోవుచున్న యమదూతలు విని యూపాఱుం బట్టికొని యమునియొద్దకుం దీసికొనిపోయి యతం డాడినమాటల నివేదించిరి.

అప్పుడు యముఁడు తిరుగా నీ వట్లుచెప్పితివా? అనియడుగుటయుఁ జెప్పితిని. అట్లుచేయుటయే విధియని నిర్భయముగాఁ బలికెను. అప్పు డాధర్మరాజు దధిపూర్ణఘటంబుల రెంటిఁ దెప్పించి యొకదానిలో గరళముగలిపించి చూపి వానితారతమ్యము చెప్పుము. దేనిలో విషముగలిపితిమో యెఱింగింపుమని యడిగిన నాబ్రాహ్మణుఁడు చూచి చూచి తెల్లపోయి సత్యము చెప్పలేకపోయెను.

అప్పుడు యముండు వానిపై నలుగుచు ధర్మసూక్ష్మము గ్రహించుట కష్టము. తెలియనప్పుడు ఇదమిద్ధమని నిరూపింపరాదు. అసత్యముగా దోషారోపణము జేసినవాఁడు తత్ఫలం బనుభవింపవలసియున్నది. కావున పాఱుఁడా! నీవుసెప్పినది యసత్యమైనది. తత్ఫలఁబు నీ వనుభవింపుము. నీకు విధించితినని పలుకుచుండఁగనే యమదూత లతని నిరయంబునకుఁ దీసికొనిపోయి యాఫలము గుడిపించిరఁట.

ప్రాణేశ్వరా! ధర్మ మింతసూక్ష్మములో నున్నది. నిష్కారణ మాఁడువాండ్రఁ బాధించినపాతకము మీరుగూడఁ బంచికొందురేమో యని వెఱచుచున్నాను. అని మిత్రవింద చెప్పినయుపన్యాసము విని రాజు మందహాసము గావించుచు నిట్లనియె.

శ్లో॥ శోకారాతి పరిత్రాణం ప్రీతి విస్రంభ భాజనం
కేనరత్న మిదంసృష్టం మిత్రమిత్యక్షరద్వయం ॥

సాధ్వీ! మిత్రకార్య మెట్టిదైనను దీర్పవలయునని శాస్త్రములు

ఘోషించుచున్నవి. అందులకు నాకేమియుఁ బాతకములేదు. మఱియు నాతరుణుల యభిప్రాయము ననుసరించి యుపకారము గావించెదనని సమాధానము సెప్పెను. వారిసంవాద మాలించుచు నే నేమియు మాటాడక భుజించుచుంటిని.

అప్పు డాయువ్వ యల్లునితో మీ రీవిషయము తగవులాడ నేల ? ఘోటకముఖుండు మహాపండితుండు. ఆయన నడిగి యేది న్యాయమో యట్లు కావింపవలయునని చెప్పినది. రాజు నాదిక్కు మొగంబై, ఆర్యా! నేఁజెప్పినమాటలలో నన్యాయ మున్నదా? అని యడిగిన నే నది సమంజసముగానున్నది. ఆగణికలయుదంతము దెలిసికొని వారి యాప్తులం జేర్చుట యుచితమని పలికితిని

భోజనానంతరము విశ్రమించినతరువాత రాజు నన్ను వెంటఁబెట్టికొని యాగణికలున్నగదిలోనికిఁ దీసికొనిపోయెను. మిత్రవిందయుఁ దల్లియు నంతకుముందే యందువచ్చి యాసుందరులతో ముచ్చటించుచుండిరి. రాజు వారిం జేరి మీ దేదేశము, ఎవ్వనిభార్యలు, విపులుఁ డే మిటికి మిమ్ము బంధించెను, మీవృత్తాంత మెఱింగింపుఁడని యడిగిన నమస్కరించుచుఁ జిత్రసేన యిట్లనియె.

మహాశయా! మాజన్మభూమి పాటలీపుత్రము. మేము రతినూపురయను వేశ్యపుత్రికలము. నాపేరు చిత్రసేన; దీనిపేరు రతిమంజరి. నాభర్త దత్తుఁడను విద్వాంసుఁడు; దీనిభర్త గోణికాపుత్రుఁడు. మేము తల్లి సంపదల విడిచి గోణికాపుత్రువెంట ధారానగరమున కరుగుచుండ మతంగయోగిని దుర్బోధముచే విపులుఁడను రాజు మమ్ము బలవంతముగా గోణికాపుత్రునికిఁ దెలియకుండఁ దననగరమునకు రప్పించుకొని తన్ను వరింపుమని నిర్బంధించెను.

మేము బ్రాహ్మణుల సొత్తులమైతిమి, మగనాలులము, వేశ్యాధర్మముల విసర్జించితిమి. మమ్మువరించుట నీకుఁ దగదని యెంతచెప్పినను

వినక తనతోఁ గలియమని మమ్ముఁ బెక్కుబాములం బెట్టెను వెల యాండ్రకు నీతియెక్కడదని యాక్షేపించెను. మమ్ముఁ గారాగారప్రా యమైన నికాయంబున నుంచి నిర్బంధించెను. మే మొప్పుకొనలేదు. త రువాత నేమిటికో మీ యిక్కడికిఁ దీసికొనివచ్చితిరి. ఇదియే మాకథయు ని యాజవరా లెఱింగించుచుండఁగనే నేను మేనుఝల్లుమన నోహో! వీరు నామిత్రులకళత్రములని మనవృత్తాంతమంతయు నతని కెఱింగించితిని.

నాపేరు ఘోటకముఖుండని విని యావనితారత్నములు మేను లుప్పొంగ నేమీ! నేఁ డెంతసుదినము. మీపేరు గోణికాపుత్రుండు చెప్పు చుండఁ బలుమారు వింటిమి. మహాత్మా! మీ రిక్కడి కెట్లువచ్చితిరి? మీయుదంత మెఱింగింపుఁ డనవుఁడు నాకథ వారికి వెండియుఁ జెప్పితి ని. రాజపత్ని వారివృత్తాంతము విని జాలిపడుచు మిమ్ము మీభర్తల యొద్ద కనిపెద విచారింపవలదని యోదార్చినది. నాఁడు ఇష్టగోష్ఠీవినో దములతోఁ గాలక్షేపము గావించితిమి.

అని చెప్పినని చెప్పువఱకు వేళ యతిక్రమించుటయు మణిసిద్ధుం డవ్వలికథ తదనంతరనివాసప్రదేశంబున నిట్లు చెప్పుచుండెను.

---

## 160 వ మజిలీ.

### మదాలసకథ.

చక్రధరనరనాయకునిపత్ని మిత్రవింద చాల గుణసంపత్తిగలది. నే నమ్మఱునాఁడే యింటువచ్చుటకుఁ బయనమైతిని. తనతల్లి కుపకా రము గావించితినని నన్ను మిక్కిలి పొగడుచు నారాజపత్ని నన్నట నుండి కదలనిచ్చినదికాదు. దినమున కొకరకము పిండివంటలు సేయుచు నా కత్యంతగౌరవము గావించినది.

ఒకనాఁ డవ్వతో నీకూఁతురు మదాలసవంటి గుణసంపత్తిగలిగి యున్నదని పలికిన విని యారాజపత్ని మదాలసవృత్తాంత మెట్టిదో చెప్పుమని కోరుటయు నే నక్కథ వారి కిట్లు చెప్పితిని.

వినుండు పూర్వకాలంబున శత్రుజిత్తను రాజు పరాక్రమశాలియై పుడమిం బాలించుచుండెను. నృపతికి ఋతుధ్వజుండను మహావీరుండు కుమారుఁడుగా నుదయించెను. ఆరాజపుత్రుఁడు బుద్ధిచే బృహస్పతిని రూపంబున మన్మధుని జ్ఞానంబునఁ గపిలుని విక్రమంబున శుక్రునిం దిరస్కరించుచు సమానవయోబుద్ధివిక్రమసారులగు నృపకుమారులతోఁ గూడికొని—

సీ. వితతస్వరంబు లుప్పతిలంగ వీణగై
కొని పాడు హాయిగాఁ గొంతసేపు
మధుర ప్రబంధనిర్మాణక్రియారత
స్వాంతుఁడై యలరారుఁ గొంతసేపు
దర్శనాగతతపోధనజనారాధనా
కుతుకాత్ముఁడై యుండుఁ గొంతసేపు
సకలశాస్త్రార్థప్రసంగసక్తిదలిర్పఁ
గోవిదావళిఁ గూడుఁ గొంతసేపు
గీ. నాగరథసైంధవారోహణప్రచార
గురువిహారము లొనరించుఁ గొంతసేపు
క్రూరమృగముల వేటాడుఁ గొంతసేపు
మానినీభోగవిముఖుఁడై తేనిసుతుఁడు

తదీయక్రీడాభిరతి నెఱింగి బ్రహ్మక్షత్రియవైశ్యపుత్రులు దూరదేశములనుండి వచ్చి యతని నాశ్రయించి తిరుగుచుందురు. వచ్చినవారినెల్ల నాదరించుచు నారాజకుమారుండు వారికి క్రీడావిశేషంబులఁ గల్పించి యాడించుచుండును. అశ్వతరుండను నాగేంద్రునికుమారు

లిరువురు మిక్కిలి చక్కనివారు తరుణవయస్కు లతనివాడుక విని బ్రాహ్మణపుత్రవేషధారులై యరుదెంచి యతని నాశ్రయించిరి.

ప్రియదర్శనులైన నాగకుమారుల నాదరించుచు రాజకుమారుండు తనకు విస్రంభపాత్రులగు మిత్రులలోఁ జేర్చికొని క్రీడించుచుండెను. ప్రతిదినము నాగకుమారులు రాత్రులఁ బాతాళలోకమున కేగుచుఁ బ్రొద్దుపొడువఁగనే వచ్చి యతని నాశ్రయించి యుత్సవములలోఁ బాల్గొనుచుందురు. వారికి రాజపుత్రునందు ప్రీతి దినదినాభివృద్ధి వడయుచున్నది.

రాజపుత్రుఁడు నాగకుమారులు లేక భుజంపఁడు. స్నానము సేయఁడు. మంచిపుట్టంబులఁ గట్టఁడు. మాల్యాను లేపనాదుల ధరింపఁడు. అట్లు వా రన్యోన్యప్రేమానుబంధపూర్వకమగు సౌహార్దముతో మెలఁగుచుండిరి.

ఒకనాఁ డశ్వతరుండు మర్త్యలోకమునుండి వచ్చిన కుమారులం గాంచి పుత్రులారా! నిత్యము మీ రెక్కడికి పోవుచుంటిరి? రాత్రులు దప్ప పగలు మీ రిందుఁ గనంబడరేమి? అని యడిగినఁ దండ్రికి నమస్కరించుచు నాగకుమారు లిట్లనిరి. జనకా! పుడమి ఋతుధ్వజుండను రాజపుత్రుండు మాకు మిత్రుండయ్యె. నతనిసుగుణంబులు శేషుండు వర్ణింపఁజాలఁడు. అతండు మామనసు లాకర్షించెను. వినయసంపన్నుండు. తద్వియోగంబు సైరింపఁజాలమని యతనివృత్తాంతము చెప్పిరి.

ఆకథ విని యశ్వతరుం డాహా! అట్టిసుగుణసంపన్నునిఁ గుమారునిగాఁ బడసినతండ్రి యదృష్టమేమి? పరోక్షమున నెవ్వరిగుణంబులు స్తుతియింతురో యతండే ధన్యుఁడు. అట్టిసుగుణఖని కేదేని యుపకారము సేయుతలంపు గలిగినది. మీనిమిత్తమె తదభీష్టము తీర్తు. మఱియు మనయింటనున్న ధనకనకవస్తువాహనాదులలో నేదికోరినను నిత్తునని పలికిన నవ్వుచుఁ గుమారు లిట్లనిరి.

నీ వెవ్వతెవు? ఈపుర మెవ్వరిది? నీపేరేమి? అని యడిగిన నప్పడఁతి యేమియు మాటాడక యామేడలోనికిఁ బోయినది.

అతం డాగుఱ్ఱమునుదిగి దాని నొకచోటఁ గట్టిపెట్టి తానుగూడ నాచేడియవెంట నామేడ యెక్కెను. ఆసౌధాంతరమున రత్నపర్యంక మునఁ బండుకొనియున్న యొకచిన్నది యతనికన్నులం బడినది రసాతల దేవతయోయనఁ బ్రకాశించుచున్న యాసుందరింజూచి రాజనందనుఁడు డెందము కందర్పభల్లముల కెల్లయై పొరటిల్లఁ బరవశుండయ్యెను.

అభినవమన్మథుండనందగు నృపనందనుని యందముజూచి యప్డె లేచి యాచిగురుఁబోఁడి చిత్తవిభ్రమము నొందినది లజ్జావిస్మయలోల ములగు చూపులచే నతనిఁ జూచుచు నాహా! ఈ సుకుమారుఁడు మరుఁడా? పురందరకుమారుఁడా! విద్యాధరుఁడా? గంధర్వుఁడా? కిన్న రుఁడా? కృతపుణ్యారతియగు నరుఁడా? అని యాలోచించుచు నిట్టూర్పు నిగుడించుచు కామశరాహతచిత్తయై మూర్ఛవోయినది.

బాలా! వెఱవకుము వెఱవకుము. అనిపలుకుచుఁ దోలుత నతని చేతఁ జూడఁబడినపడఁతుక తాళవృంతముబూని విసరుచుండెను. రాజ పుత్రుఁడు మీరెవ్వరు? ఈనగర మెవ్వరిది? ఒంటిగా నిందుంటిరేల? అనియడిగిన సఖురా లిట్లనియె.

మహాభాగ! ఈగజయాన విశ్వావసుండను గంధర్వరాజు కూఁతురు. దీనిపేరు మదాలస. ఈయలసగమన యుద్యానవనములో విహరింపుచుండఁ బాతాళకేతుండను దానవుఁ డీమానిని నెత్తుకొనివచ్చి యిందు దాచెను. రాఁబోవు త్రయోదశినాఁడు వాఁడు ఈచేడియం బెండ్లిగూడ మహూర్త ముంచుకొనియెను. ఆవార్తవిని యీకార్తస్వ రగాత్రి యాత్రము నొందుచు మరణప్రయత్నము గావింపుచుండ సురభి యరుదెంచి యాయుద్యమము వారించుచుఁ గొన్నిరహస్యము లెఱింగిం చినది. నేనీమె సఖురాలను. నాపేరు కుండలయంద్రు. ఈమె నిన్నుఁజూచి

మోహవివశయైనది. నీ వెవ్వఁడవు? నీవృత్తాంతము చెప్పుమని యడిగిన నతం డిట్లనియె.

కాంచనగాత్రీ! నేను శత్రుజిత్తను ధాత్రీపతి పుత్రుండ. నాపేరు కువలయాశ్వుఁ డందురు. వరాహరూపము ధరించి గాలవమహర్షిని భయపెట్టుచున్న రాక్షసుం దరిమికొనివచ్చితిని. వాఁడు గోతిలోఁబడి యదృశ్యుఁడయ్యెను. వెదుకుచు వానివెంట వచ్చుటచే నా కీలోకము మీరునుఁ గనంబడితిరని తనవృత్తాంత మెఱింగించెను.

ఆకథవిని కుండల ఓహో! నీవు భూమండలాఖండలుఁడవగు కువలయాశ్వుఁడవా? అందులకే నిర్దుష్టమగు మదాలసహృదయము నిన్నుఁ జూచి చెదరినది. నిన్నే పెండ్లియాడుమని సురభి యెఱింగించినది. తద్వచనమున కన్యథాత్వము గలుగునా? నీవు దీనిం బరిగ్రహింపుము. ఇది దేవప్రోక్తము. అని పలుకుచుఁ గులుకుచున్న యావధూవరులకు గాంధర్వవిధానంబునఁ బాణిగ్రహణ మహోత్సవము జరపినది.

మఱియుఁ గుండల తపోవనంబున కరుగుచు మదాలసహస్తం బతనిహస్తంబునం బెట్టి యిట్లుపన్యసించినది. రాజపుత్రా! అమితప్రజ్ఞ గల పురుషులుగూడ నీకుఁ జెప్ప నేరరనుచో నాఁడుదాన నామాటల యం దేమిసార ముండెడిని? అయినను నాకు నీకోకస్తనియందుఁగల ప్రీతియే యిట్లు చెప్పుటకు నన్నుఁ బ్రోత్సాహపఱచుచున్నది. పతిచేత సర్వదా భరింపఁబడుచుండుటచే భార్య యనంబడుచున్నది. ధర్మార్థకామసిద్ధికి భార్య భర్తకు సహాయురాలగును. భార్యావిహీనుఁడు పురుషార్థములఁ బొంద నేరఁడు. భార్యాభర్తలు పరస్పరానురాగయుక్తులై రేని అదియే ధర్మార్థకామముల సంఘటనము. దేవతాతిథిభృత్యవర్గంబుల మన్నించుటకు భార్యయే ముఖ్యము. ఈమె కనుముద్దరాలు. పెద్దలకడ మసలి యెఱుంగదు. ఈముద్దియం దిద్దుకొని యెల్లప్రొద్దుల విడువక తద్దయుం బ్రీతిఁ జూచుచుండుము. అని యుపదేశించి కుండల యేగినది.

పిమ్మట నాకొమ్మను హయమ్మునై నెక్కించుకొని రయమ్మున నతండు భూలోకంబున కరుగుచుండం దెలిసికొని చతురంగబలములతోఁ బాతాళకేతుఁ డడ్డగించెను నిలు నిలుమని పలుకుచుఁ దదనుచరులు శర వర్షముఁ గురిపించిరి. రాజపుత్రుఁడు నవ్వుచు నారిసంధించి త్వష్ట్రాస్త్రము వారిపైఁ బ్రయోగించుటయుఁ గాపిలతేజంబు సగరపుత్రులవలె నయ్యస్త్రంబు పాతాళకేతునితోఁ గూడ రక్కసులనెల్ల భస్మముగావించినది.

తరువాతఁ గువలయాశ్వుండు నిర్భయముగాఁ దనపురంబున కరిగి జరిగినకథయంతయుఁ జెప్పి మదాలసం జూపెను శత్రుజిత్తు పుత్రుం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణము గావించుచు మిక్కిలి సంతోషించెను.

కువలయాశ్వుండు ఉద్యానవనపర్వతసానువులయందు భార్యతో విహరించుచు గొంతకాలము సుఖముగా వెళ్లించెను.

కొన్నిదినము లరిగినతరువాత నొకనాఁడు శత్రుజిత్తు పుత్రుఁ గాంచి వత్సా! నీవు ప్రతిదినము నీయశ్వమెక్కి యరుగుచు బ్రాహ్మణుల రక్షింపవలయును. తపోధనబాధకుల వెదకి పరిభవింపవలయును. దుర్బుద్ధులగురక్కసు లక్కడక్కడ డాగియుందురు. వారిబాధ లేకుండఁ గాపాడుమని యుపదేశించిన సంతసించుచుఁ గువలయాశ్వుం డాయశ్వ మెక్కి యనుదినము పూర్వాహ్ణమున భూమిదిరిగివచ్చి తండ్రికి నమస్కరించుచు మిగిలినవేళలయందు మదాలసతోఁ గ్రీడింపుచుండెను.

పాతాళకేతునితమ్ముఁడు తాళకేతుఁడనువాఁడు కడుమాయావి. యమునాతీరంబున నొకయాశ్రమము గల్పించుకొని యందు ముని వేషము వైచికొని తపము సేయుచున్నట్లభినయించుచుండెను. ఒకనాఁడు రాజపుత్రుఁడు ఋష్యాశ్రమములఁ దిరుగుచు నతనియొద్దకుఁ బోయి మహర్షి యనుకొని నమస్కరించుచు మహాత్మా! మీకు రాక్షసబాధ యేమియును లేదుగదా! నిర్విఘ్నముగాఁ దపంబు సాగుచున్నదియా? అని యడిగిన నక్కపటాత్ముండు మౌనముద్ర విడిచి యిట్లనియె.

రాజపుత్రా! నీవంటిశూరుండు మాకు రక్షకుఁడైయుండఁ దపోవిఘ్న మెట్లగును? లెస్సగా జరగుచున్నది. మఱియు నిన్నొక్కటి యాచించుచున్నవాఁడ లేదనక యిత్తువనియే తలంచెదను. వినుము. నేనొక యజ్ఞము సేయఁదలఁచుకొంటిని. అందులకు ధనము కావలయు. దక్షిణాప్రధానములగు వారుణేష్టులు పెక్కు లాతంత్రమునఁ జేయవలసియున్నవి. కావున నీమెడనున్న కంఠాభరణము నాకిమ్ము. దాన జన్మము పూర్తియగును. మఱియు నేను జలంబున మునింగి వారుణేష్టులఁ గావించుచుండెద నప్పుడు నీవు తీరమున వసించి దనుజబాధ బొరయకుండఁ గాపాడవలయు నిదియే నాకోరికయని పలికిన సంతసించుచు నారాజసూనుఁ డోహో! యిందుల కింతవినయమేల? ఇదిగో కంఠభూషణము గైకొనుఁడని పలుకుచుఁ దీసి వానిచేతంబెట్టి మహాత్మా! నేను ధనుర్ధరుఁడనై నీయాశ్రమసమీపమున నుండెద. నీవు నిర్భయముగా వరుణు నారాధింపుము. అంతరాయము రాకుండఁ గాపాడెదనని చెప్పెను.

ఆకపటయతి యతఁడు చూచుచుండ జలంబున మునింగి క్రమంబున నవ్వలకుఁజేరి పోయి పోయి తిన్నగా శత్రుజిత్తునొద్దకుఁ బోయి స్త్రీసమక్షమున నిట్లు తెలియఁజేసెను. నీవు కువలయాశ్వుని తండ్రివేనా? పాప మతఁడు గుఱ్ఱమెక్కి ఋష్యాశ్రమముల సంచరించుచుండ నొక దానవుం డతనితోఁ బ్రచండభండనము గావించి పలాయితుంజేసి వెనువెంటఁ దఱిమికొనివచ్చి నాయాశ్రమమునెదుట నేను చూచుచుండ శూలముపుచ్చుకొని కడుపులో గ్రుచ్చి గతాసుం గావించెను. హరిహరీ! మీ కెట్టిదారుణపువార్త చెప్పుచుంటిని?

ప్రాణోత్క్రమణసమయంబున నీకుమారుఁడు నాకీకంఠాభరణ మిచ్చెను. అతనిహయము నాదానవుఁడు తీసికొనిపోయెను. అందున్న తాపసు లతని దేహసంస్కారమును గావించిరి. సమలోష్టకాంచనులమగు మా కీయాభరణముతోఁ బనియేమిటికి? నీవు గైకొనుము. అని

పలుకుచు నామెండన మందుఁ బొరవిడిచి యతఁ డరిగెను.

ఆమాటలు విని యందున్నవారెల్ల హాహాకారము గావింపుచు మూర్ఛవోయిరి. మదాలస భర్త మృతినొందెనను వార్త వినుచుండఁగనే కరవాలఖండితరంభాతరుకాండంబుఁబోలె నేలంబడి యసువులం బాసినది. కువలయాశ్వునితలిదండ్రులు కొంతసేపటికి తెప్పిరిల్లిరి. మదాలస చావువిని మఱియును దుఃఖించుచున్న భార్య నోదార్చుచు శత్రుజిత్తు ఇట్లనియె.

సాధ్వీ! భూతములయొక్క యనిత్యత దెలిసికొనినఁ గుమారుని నిమిత్తము కోడలినిమిత్తము మనము విచారింపవలసినపనిలేదు. కుమారుఁడు బ్రాహ్మణార్థమై ప్రాణములు వదలెను. కోడలు భర్తనిమిత్తము మేను బాసినది. ఈయిద్దఱిమరణములు స్తోత్రపాత్రములై యున్నవి. క్షత్రియుఁడు సంగరంబునఁ జచ్చుటయు స్త్రీ సహగమనము సేయుటయుఁ గోటియాగములు చేసినకన్న నధికపుణ్యప్రదమని యార్యులు సెప్పుదురు. వారికొఱకు విచారింపఁదగదని ధైర్యము గఱపుచు వారి కూర్ధ్వదైహికక్రియలు నిర్వర్తించి సద్గోష్ఠితోఁ గాలక్షేపము గావింపుచుండెను.

తాళకేతుండు యమునాజలంబు వెడలి యొద్దున కోదండధారియై యోరిమితోఁ గాచుచున్న కువలయాశ్వుంజూచి తలయూచుచు నిట్లనియె. రాజపుత్రా! చిరకాలమునుండి యభిలషించుచున్న కార్యము నెఱవేఱినది. కృతార్థుండనైతిని నాపని నాకైనది. నీ విఁక నింటికిం బోవచ్చునని పలికిన మహాప్రసాదమని వినయమభినయించుచుఁ గువలయాశ్వుం డశ్వమెక్కి నిజపురంబున కరిగెను. నగరరాజమార్గమునఁ జనుచున్న యతనిం జూచి జనులుకొందఱు మనంబున దుఃఖించుచు మోమున విన్నదనంబు దోఁపఁ దలవంచుకొనిరి. కొందఱు మోదము వికసింప నొండొరులఁ గౌఁగిలించుకొనుచు సంతోషమును వెలిబుచ్చిరి మఱికొందఱు విస్మయముగాఁ జూచుచుండిరి. కొంద ఱతని మూఁగికొని వెనువెంట నడుచు

చుండిరి. పౌరులలీలలు జూచి యతండు డోలాయితహృదయుండై యెవ్వరి నేమియు నడుగక తిన్నగాఁ దండ్రిగారియింటికిఁ జని జనకుని పాదంబులంబడి నమస్కరించెను.

తండ్రి యతనిం గౌఁగిలించుకొని కన్నీటిచే శిరంబుదడుపుచు గద్గదకంఠముతోఁ జిరంజీవ! అని యాశీర్వదించెను. తల్లియు బంధువులు శోకమును వెలిపుచ్చుచు నాతని నాశీర్వదించిరి. అందున్నవారెల్లఁ దన్ను వింతగాఁ జూచుచుండ రాజకుమారుండు వెఱఁగుపడుచుఁ దండ్రీ! నేఁడు నన్ను మీరందఱు క్రొత్తగాఁ జూచుచున్నారేమి? విశేషము లేమైనం జరగినవియా? నాప్రాణనాయకి మదాలస సేమముగా నున్నదా? అని యడిగిన దుఃఖించుచు రాజు పుత్రున కాతెఱంగంతయు నెఱింగించెను.

రెండుగడియ లేమియు మాటాడక స్థబ్ధుడై కన్నులుమూసికొని పిమ్మట నిట్లుతలంచెను. ఆహా! ఆమహాసాధ్వి నామరణము వినినతోడనే ప్రాణములు విడిచినది. నాకతంబున మృతినొందిన యాసతీమణి వార్తవిని నేనిట్లే బ్రతికియుంటి. నాకంటెఁ గృతఘ్నుం డెందైనం గలఁడా? నేను క్రూరుఁడ ననార్యుఁడఁ బాపాత్ముండ దయాశూన్యుఁడ నని పెద్దగా నిందించుకొని యాసుందరిం దలంచుకొని దుఃఖించుచు మనంబును దృఢపఱచుకొని మోహమును విడిచి వేడినిట్టూర్పు నిగుడింపుచు నిట్లుతలంచెను. నానిమిత్తమై యమ్మత్తకాశిని దేహమును బాసినదని తలంచి నేనును సమసెదంగాక, దాన నామెకు వచ్చెడు లాభ మేమి యున్నది? అది స్త్రీలకు యశస్కరము కాని పురుషులకుఁ గాదు. అట్లు చేసితినేని లోకులు నిందింతురు. హా! ప్రియా! హా! ప్రియా! అని దెసలు ప్రతిధ్వను లిచ్చునట్లు ప్రతిదినము రోదనము చేసెదంగాక. అదియు నపకీర్తిహేతువే. సజ్జనులు నన్నుఁజూచి నవ్వకమానరు. పోనీ శోకజడుండనై దీనుండనై సిగ్గువిడిచి మలినాంగుఁడనై వెఱ్ఱివాఁడుం బోలెఁ దిరుగుదున్న శత్రువులు లోకువసేసి పరిభవింతురు. శత్రువధ

యుం బితృశుశ్రూషణము నాకు ముఖ్యవిధులు; కావున నే నింతటినుండి యు స్త్రీభోగము విడిచెదను. ఇందువలన నాలలనకువచ్చిన లాభము లేదుకాని నాకొఱకుం బ్రాణములు విడిచిన యప్పడంతివిషయమై యీమాత్రమైన కృతజ్ఞత చూపవలదా ? ఇంక నేవనికిం బోక యుదాసీనుండనై యుండెదనని తలంచి భార్యకుం దిలోదకములిచ్చి యిట్లు ప్రతిజ్ఞ గావించెను.

"నాప్రియురాలగు మదాలస నానిమిత్తమై ప్రాణములు విడిచినది కావున నే నింక నీజన్మమున మఱియొకస్త్రీని వివాహమాడను. సత్యముగాం జెప్పుచున్నాను." అని ప్రతిజ్ఞజేసి కువలయాశ్వుం డదిమొదలు స్త్రీభోగవిముఖములగు పనులు గావింపుచున్నాండు. వయస్యులతోంగూడికొని శృంగారరహితములగు కృత్యములనే జేయుచున్నాడు. తండ్రీ! అతనికి మన మేమిచ్చినను సంతోషము గలుగదు. అతనిప్రియురాలు మదాలసను దీసికొని యిచ్చితుమేని పూర్తిగా సంతోషించును. ఆపని మనకు శక్యముగాదని చెప్పిన విని నవ్వుచు నశ్వతరుం డిట్లనియె.

పుత్రులారా ! అశక్యమని యేకార్యమును బ్రయత్నింపక విడువరాదు. శక్యమనియే తలంచి ప్రయత్నింపవలయును. కర్మఫలము దైవమందున్నది. దున్నక భూమి ఫలింపదుగదా! నే నందులకుం బ్రయత్నించి యమ్మహాత్మున కొప్పినయుపకారము గావించెదం, దపంబునకు సాధ్యముకానిది లేదు, తపంబున విశ్వామిత్రుండు సృష్టికిం బ్రతిసృష్టి గావించెనని పలుకుచు నప్పుడ బయలుదేరి హిమవద్గిరిపరిసరంబునం బ్లక్షావతరణంబను తీర్థంబున సరస్వతీదేవింగూర్చి తపంబు గావించెను.

శ్లో॥ యేర్థానిత్యాయేచ నశ్యంతిచాన్యే యేర్థాస్థూలాయేచ సూక్ష్మాతిసూక్ష్మాః। యేవాభూమౌ యేంతరిక్షేన్యతోవా తేషాందేవి! త్వత్త ఏవోపలబ్ధిః॥

భూమియందు నాకాశమందు నితరస్థలములయందున్న స్థూల

సూక్ష్మవస్తుజాలమునకెల్ల నీవే ప్రధానురాలవు. నీవలననే సృష్టిస్థితిలయములు జరుగుచున్నవని పలుకుచు సరస్వతి నారాధించుటయుఁ దద్భక్తివిశ్వాసములకు సంతోషించి భాషాదేవి ప్రసన్నురాలై నీ కేమి కావలయునని యడిగిన నాపన్నగేంద్రుఁడు దేవీ! నాకుఁ గంబళుఁడను మిత్రుఁడు గలఁడు. మాయిరువురకు స్వరసంబంధముగల సంగీతవిద్య యంతయు వచ్చునట్లనుగ్రహింపుము. అని కోరిన మెచ్చుకొని భాషాదేవి భుజగేంద్రా! మీ కట్టివిద్య ప్రసాదించితిని. గానకళలో మిమ్ము మించినవారుండరు. మీగానము శ్రోత్రానందముగానుండునని వరం బిచ్చి వాణీదేవి యంతర్ధానము నొందినది. తదనుగ్రహసంప్రాప్త సంగీతవిద్యావిశేషులై శేషకులావతంసుఁడగు కంబళుఁడు నశ్వతరుఁడును మనోహరముగాఁ బాడుచు నొకనాఁడు కైలాసమున కరిగి భవానీశంకరులు వనవిహారము చేయుచున్నసమయంబున నీగాయకు లిరువురు కంఠములు మేళగించి హాయిగాఁ బాడి యాదంపతుల కత్యంతసంతోషము గలుగఁజేసిరి.

శంకరుఁడు వారిసంగీతము విని మెచ్చికొని దాపునకుఁ బిలిచి మీ కేమికావలయునో కోరికొనుఁడని యడిగిన నశ్వతరుండు మ్రొక్కుచు మహాత్మా! మదాలసయను గంధర్వపుత్రిక అసత్యభర్తృమరణవార్త విని మృతినొందినది. ఆసుందరిని నాకుఁ బుత్రికగా నుదయించునట్లు చేయవలయును. ఆమె మృతినొందునప్పటి కేప్రాయమం దేరూపున నెట్లుండెనో యట్లే యొప్పుచు జాతిస్మరణ గలిగియుండవలయును. ఇది యే నాకోరికయని తెలిపిన మహేశ్వరుండు నాగేంద్రా! అట్లే జరగును. వినుము. నీవు పితృపూజ గావించునప్పుడు శుచివై మధ్యపిండము భక్షింపుము. నీనడుమువడగనుండి యప్పుడతి యథారూపప్రాయముగా నుదయింపఁగలదు. అనిచెప్పినఁ బరమానందభరితహృదయుఁడై మహేశ్వరునకు నమస్కరించుచు వారిరువురు రసాతలంబున

కరిగిరి.

అశ్వతరుండు యథావిధిం బితరుల నారాధించి మదాలసం దలం చుకొని మధ్యమపిండమును భక్షించెను. అంతలోనే తన్నిశ్వాసము నుండి మదాలస యుదయించినది. ఆరహస్య మెవ్వరికిం జెప్పక య శ్వతరుం డామె సంతర్గృహంబునం బెట్టి కాపాడుచుఁ గుమారుల కిట్ల నియె.

వత్సలారా! లోకోపకారియగు నారాజపుత్రు నొకసారి మన నగరమునకుఁ దీసికొనిరండు. తదభీష్టము నెఱవేర్తునని పలికిన సంతసిం చుచు వారిరువురు వాడుకప్రకారము మఱునాఁ డారాజధాని కరిగి కువలయాశ్వునితో నాటలాడి యాడి కథాంతరమున మిత్రమా! చిర కాలమునుండి మేము మీయింటికి వచ్చుచుంటిమి. నీతో నాడుచుంటి మి. నీవొక్కసారియు మాయింటికి రావైతివి. తప్పక నేఁడు రమ్మని కోరుచున్నాము. అని ప్రార్థించిన నారాజనందనుం డిట్లనియె.

మిత్రులారా! నాగేహము మీగేహముగాదా? ఇందు నాకు న్న ధనవాహనవస్త్రాదికములన్నియు మీవే. నన్ను మీయింటికిఁ దీసి కొనిపోయి యేమియ్యఁదలఁచికొంటిరో యిందే యీయుఁడు మీవలనఁ గైకొనియెదఁగాక. విప్రనందనులారా! మీరు నాయెడ భేదబుద్ధి దలంపవలదు. నాగృహమందు మమత్వము బూనుఁడు. ఎన్నఁడు నిట్టి భేదబుద్ధిలో మాటాడవలదని నాపై నొట్టుపెట్టుచున్నాను. మీకు నాపైఁ గల ప్రేమ యెఱుంగుదును. మఱియు,

శ్లో॥ ఉపచారఃకర్తవ్యోయావద నుత్పన్నసౌహృదాః పురుషాః
ఉత్పన్నసౌహృదానాముపచారః కైతవం భవతి.॥

ఎంతవఱకు స్నేహము కలియదో యంతవఱకే యుపచారము. కలిసినపిమ్మటఁ జేయునుపచారము కైతవమగునని యార్యులు సెప్పు దురు. అనిపలికిన విని యించుక ప్రణయకోపము చెందుచు నాగకు

మారు లిట్లనిరి.

రాజపుత్రా! నీవనినట్లుకాక మాకు నీయెడ వేఱొకబుద్ధి లేదు. నీ చారిత్రము మేమెఱింగింప మాతండ్రి కువలయాశ్వుఁ జూడవలయు నిందుఁ దీసికొనిరండని పలుమారు చెప్పియున్నాఁడు. అందులకై రమ్మంటిమని పలికినంతఁ గువలయాశ్వుం డాసనమునుండి లేచి తండ్రిగారేమనిరి? ఓహో! నే నెంతధన్యుండను. అని యభివాదనము గావించుచు నమ్మహాత్ముండు నన్నుఁ జూడఁగోరెనా? ఆమాట చెప్పితిరికారేమి? తదానతి మనము శిరసావహింపవలసినదే. పోదము లెండు వారి యానతి నించుకయువ్యతికరము చేయుట నాతలంపుగాదు. అని పలుకుచు నానాగకుమారులవెంట నగరాంతికమందున్న గోమతీనదితీరమున కరిగి వయస్యులారా! మీయిల్లెందున్నదని యడిగెను.

ఇందేయున్నది రమ్ము అని వా రతనిచేయి పట్టుకొని గోమతిలో మునింగి పాతాళలోకమునకుఁ దీసికొనిపోయిరి. నాగలోకమందు వారివేషములు మాఱినవి. పడగలయందుఁగల మణులచేఁ బ్రకాశింపుచున్న యక్కుమారులఁగాంచి కువలయాశ్వుం డయ్యారే! మీరూపము లిట్లు మాఱినవేమి? మీరు నాగకుమారులా? బ్రాహ్మణులుకారా? అని విస్మయముచెందుచు నడిగిన వారు వయస్యా! మేము విప్రకుమారులము కాము. అశ్వతరుండను నాగేంద్రుని పుత్రులము. మా తండ్రి దేవతలకుఁగూడ వందనీయుఁడు. చాలప్రజ్ఞ గలవాఁడని యాత్మీయవృత్తాంత మెఱింగించిరి.

రాజపుత్రుఁడు సంతసించుచుఁ బాతాళలోకవిశేషములన్నియుం జూచుచుఁ బోవుచుండెను. బాల్యయౌవనకౌమారప్రాయములతో నొప్పుచున్న నాగకన్యకలు క్రీడించుచుండిరి. వీణావేణుస్వనమనోజ్ఞమగు గానము వినంబడుచుండెను. వారుమువ్వురు క్రమంబున వీధుల నతిక్రమించి సౌధంబుల దాటి కక్ష్యాంతరంబులు గడిచి యశ్వత

రుండున్న సదనంబున కరిగిరి.

అందు హారకుండలకేయూరాదివిభూషణభూషితుండై దివ్యమాల్యాంబరధరుండై రత్నపర్యంకమున వసించియున్న యశ్వతరుం జూపుచు మిత్రమా ! యీతఁడే మాజనకుఁడని యెఱింగించిరి. ఆయైశ్వర్యవిశేషములన్నియుం జూచుచు రాజపుత్రుండు విస్మయసముద్రములో మునిఁగి విభ్రాంతి జెందుచుఁ దానెవ్వఁడో యెందుల కందువచ్చెనో మఱచి కొంతసేపునకుఁ దెరపితెచ్చుకొని యానాగేంద్రునిపాదంబులకు సాష్టాంగనమస్కారము గావించెను.

అశ్వతరుం డతని గ్రుచ్చియెత్తి శిరస్సాఘ్రాణించుచు నాశీర్వదించి వత్సా! రాజపుత్ర! నాపుత్రులు నీచారిత్ర మెఱింగింప నాలించితిని. నీసుగుణంబుల నీపరోక్షమందు వారు పొగడుచుందురు. గుణవంతుని దేవతలు పితరులు మిత్రులు అర్థులు వికలులు బంధువులు చిరకాలము జీవించునట్లు కోరుచుందురు. ఆహా! గుణవంతునిదే జన్మ. శత్రువులైనను మిత్రులగాఁ జూచుచుందురని యతనిఁ బెద్దగాఁ బొగడి పుత్రులతో నతని కిష్టమగు సత్కారమును గావింపుఁడని నియోగించెను.

రాజపుత్రుఁడు వలదనుచుండ మనుష్యలోకదుర్లభములగు వస్తువులుదెచ్చి యతనికి విందులుగావించిరి. కువలయాశ్వుఁడు మనసున నిష్టము లేకున్నను బన్నగులప్రీతికొఱకై వారిచ్చిన యాతిథ్యమును సంతోషముతో నంగీకరించెను. మఱియొకనాఁడు ఇష్టగోష్ఠివినోదములచేఁ గాలక్షేపము చేయుచుండ,

అశ్వతరుఁడు — రాజపుత్రా ! నీకు నేను దండ్రివంటివాఁడ. చిరకాలమునకు మాయింటికి వచ్చితివి. మాయింటనున్న ధనకనకవస్తువాహనవిశేషములలో నేదేని గోరికొనుము నీ కర్పించుచున్నాను.

రాజపుత్రుఁడు — మహాత్మా ! నేను తండ్రిచాటువాఁడను. మీరీపాతాళలోకమువలె మాతండ్రి వేయోండ్లనుండి భూమండలము పాలించు

చున్నాఁడు. మాయింట నన్నివస్తువు లున్నవి. ద్రవ్యములేనప్పుడు యాచించుట యుచితముగాని సంపూర్ణముగానున్నప్పుడు ఇమ్మనియడుగుటకు నోరెట్లువచ్చును. మీయనుగ్రహమువలన నాకన్నియుం గలవు నీ పాదదర్శనమైనది. అంతకన్న నాకుఁ గావలసిన దేమియు లేదు.

అశ్వతరుఁడు—వత్సా! నావలన రత్నాదికము స్వీకరించుట కిష్టములేకున్నఁ బోనిమ్ము. నీకుఁ బ్రియమైనదేదేని కలిగినచో నడుగుము. ఒసంగెదను.

రాజపుత్రుఁడు—పన్నగేంద్రా! నా కేకోఁకయు లేదు. నీపాద ధూళిచే మదీయశిరంబు పవిత్రముచేసితివి. పరిష్వంగసుఖంబు గూర్చితివి. ఇంతకన్న నధిక మేదిగలదు. అయినను గోరమంటివి కావున నడిగెద వినుండు. పుణ్యకర్మసంస్కారము నాహృదయము నెడఁబాయకుండునట్లనుగ్రహింపుము. సువర్ణమణివస్తువాహనాద్యైశ్వర్య మంతయు స్వకృతసుకృతవృక్షముయొక్క ఫలంబని యెఱుంగనగు.

అశ్వతరుఁడు—వత్సా! నీవనినట్లు సంపదలు పుణ్యఫలములే. నీబుద్ధి యెప్పుడును ధర్మము నాశ్రయించియుండునట్లనుగ్రహించితినైనను నీవు మాయింటికివచ్చి మనుష్యలోక దుర్లభమైనవస్తు వేదేని తీసికొనిపోకుండ నరుగుట లెస్సగాదు. నీకును బొందశక్యముగాని దేదేని కలిగిన నడుగుము. ఇచ్చెదను.

రాజపుత్రుఁడు—వినమ్రుండై సాభిలాషముగాఁ బన్నగపుత్రుల మొగము జూచుచున్నాఁడు.

నాగకుమారులు— తండ్రీ! యితనికామ్యము మీరు దీర్పఁదలంచికొంటిరేని మే మెఱింగింతుము వినుండు. ఇతనిప్రియురాలు మహాసాధ్వి మదాలస యితనియసత్యమరణవార్త విని ప్రాణములు వదలినది. అమ్మదవతిం దీసికొనివచ్చినచో నితనికి సంతోషము. మఱియొకవస్తువు వలన నితండు తృప్తిఁబొందఁడు.

అశ్వతరుఁడు—బిడ్డలారా! భూతములతో వియోగమును బొందినవారి నెవ్వరినైనఁ దీసికొనిరాఁగలరా? స్వప్నములోఁ గనంబడు నట్లుచేయుమనినఁ జేయుటకు లేక మాయామదాలసం జూపుమనినఁ జూపెదను. ఇట్టిప్రజ్ఞ నాకుఁ గలదు.

రాజపుత్రుఁడు—(ఇంచుకసిగ్గుతో) మహాత్మా! నాప్రియురాలిని మాయామయినైనఁ జూపిన మిగుల సంతోషింతునుగదా? అట్లనుగ్రహింపుము.

అశ్వతరుఁడు—వత్సా! మాయామదాలసం జూడ నీకు వేడుక గలదేని యట్లేచూపెదను. అభ్యాగతుండు బాలుండైనను గురువుగాఁ దలంచి పూజింపఁదగినది. అనిపలుకుచు నేవియోమంత్రములం జదివి పుత్రులారా! లోపలికిఁబోయి మదాలసం దీసికొనిరండు. పొండని పలికి యామె నంను రప్పించి రాజపుత్రునకుం జూపుచు నిది నీభార్యయగు మదాలస యగునా కాదా? యని యడిగెను.

అతం డామెంజూచి మోహ మాపఁజాలక సిగ్గువిడిచి హా! ప్రేయసీ! హా! ప్రేయసీ! అని దుఃఖించుచు మీఁదఁబడఁబోయెను. నాగేంద్రుండు ఆఁ! ఆఁ! రాజపుత్రా! ముట్టకుము. ముట్టకుము. ఇది మాయామదాలసయని చెప్పలేదా? ముట్టినచో నంతర్ధానము నొందఁగలదు. అని వారించినఁ గువలయాశ్వుండు తత్పాదమూలంబునంబడి గోలుగోలున నేడువఁదొడంగెను.

అప్పు డామదాలస యిట్లుతలంచెను. ఆహా! ఈరాజపుత్రునకు నాయందే మోహ మున్నది. ఈపన్నగేంద్రుండు నన్ను మాయామదాలసయని యీయనకుఁ జూపెను. లోకమంతయు మాయగాక సత్యమేమియున్నది. పంచభూతసమ్మేళనమే దేహము. అని యాయువతి తలంచుచుండెను.

నాగేంద్రుం డతని లేవనెత్తి రాజపుత్రా! యీపద్మనేత్ర మా

యాగాత్రియని యెఱింగియు నింతమోహ మందుచుంటివేమిటికి ? సత్య మైన మదాలస వచ్చినచో నెట్టిముదమందెదవో అనియడిగిన నతం డక్కటా ! నా కట్టిభాగ్యము పట్టునా ? ఇఁక నీజన్మమునకు లేదు. అని యామెవంక యూరక జూచుచుండెను. ఇఁక మాయ నుపసంహరింపనా? అని పలికిన నతండు మహాత్మా ! నామోహము తీరకున్నది. మఱికొం చెము సేపు నిలుపుటకు నీకు శక్తిలేదా? అనిబ్రతిమాలికొనియెను. చూడు చూడుము. ఇఁక రెండుగడియ లాఘఁగలను. అనుటయు రాజపుత్రుఁడు మహాత్మా! నీయాతిథ్యమునకు మిక్కిలి సంతసించితిని. ఈబోటి నొక్క మాట నాతో మాటాడింపలేవా? బ్రహ్మకూకటి ముట్టెదనని ప్రార్థించెను.

నాగేంద్రుఁడు నవ్వుచు ముట్టకుండ మాటాడుము. అనుజ్ఞ యిచ్చితినని పలికిన నతండు దాపునకుఁ బోయి కలికీ ! ఒక్కముద్దుపలు కు పలుకుము. నాదెసజూడక కన్నులు మూసికొనియెదవేమి ? తెలిసి నది. తెలిసినది. నన్నుఁ గృతఘ్నునిగాఁ దలంచి చూడకుంటివా ? అగు నామాట సత్యమే ! నాయసత్యమరణము విని నీవు మృతినొందితివి. నీ సత్యమరణము విని నేను దేహము విడువనైతి. కృతఘ్నుండగానా? అని యూరక యున్మత్తాలాపము లాడుచు మహాత్మా ! పన్నగేంద్ర ! నా ప్రియురాలు నాతో మాటాడినదికాదు. నే నేమిచేయుదును. ఇఁక మాయనుపసంహరింతువుకాఁబోలు. అయ్యో ! ఈవిరహ మెట్లుభరించు వాఁడ. శాంబరీమదాలసం జూచినంత నావంత మఱింత పెరిఁగినది కాని తఱుగలేదు. అని దుఃఖించుచుండెను.

నాగేంద్రుండు మెల్లన నతనిలేవనెత్తి యూఱడించుచు రాజ పుత్రా ! నీవు ప్రాజ్ఞుండవయ్యు నిట్లు పరితపించెద వేమిటికి? వినుము. నీ పరితాపము నాపుత్రు లెఱింగింపఁ దపంబుగావించి మహేశ్వరునివరము వలన నీలలనం బుత్రికగాఁ బడసితి నీ వింక చింతింపకుము. ఇది మాయా మదాలస కాదు. నీభార్యయే యని యావృత్తాంతమంతయు నెఱింగించెను.

ఆవార్తవిని యతం డమృతహ్రదంబున మునింగినట్లు పరితుష్టి నొందుచుం దటాలునంబోయి యాయిందువదన చేయిపట్టికొని అన్నన్నా! ప్రాణేశ్వరీ! నే నింతపరితాపము చెందుచుండ నిజము తెలియఁజేయ కూరకుందువా? అనిపలుకుచు నక్కునం జేర్చికొని యుపలాలించెను.

తరువాత నాగకాంతలు వచ్చి యచ్చిగురుంబోఁడిసోయగము జూచి సిగ్గుపడఁజొచ్చిరి. కువలయాశ్వుండు నాగేంద్రుఁడు తననిమిత్తమై పడినయిడుమ లుగ్గడించుచు మహాత్మా! పరోపకారపరుఁడవన నిన్నే యనవలయును. నా మొగ మెట్టిదో యెఱుఁగక కుమాళ్లు చెప్పి నంతమాత్రముననే పెద్దప్రయత్నము సేసి నాదుఃఖమంతయుఁ బోఁగొట్టితివి. ఎన్నిజన్మములెత్తినను నీఋణము దీర్చికొనఁజాలను. భవదీయపాద సేవకుఁడనని చెప్పికొనుచుందునని పెద్దగా స్తుతియించి తదనుమతి వడసి భార్యతోఁగూడ భూలోకమునకువచ్చి నిజపురంబు ప్రవేశించి తలిదండ్రులకు మ్రొక్కి మదాలసం జూపుచు జరగినయుదంత మంతయు నెఱింగించెను.

అతనిజననీజనకు లాకథవిని ప్రహర్షవివశమానసులై కోడలిం గౌఁగిలించుకొని వినుతించుచుఁ గుమారు నభినందించుచుఁ బెక్కులుత్స వములు గావించిరి. కువలయాశ్వుండు మదాలసను విడువక క్రీడాశైలములయందు నుద్యానవనములందును సైకతప్రదేశములయందును నామెతో విహరింపుచు మన్మథసామ్రాజ్యపట్టభద్రుండై క్రీడింపుచుండెను.

కొంతకాలమునకు శత్రుజిత్తు స్వర్గలోక మలంకరించుటయుఁ బ్రధానులు గువలయాశ్వుని రాజుగాఁజేసిరి. కువలయాశ్వుండు ధర్మంబున రాజ్యంబుగావింపుచుండఁ గొండొకకాలంబునకుఁ దత్పత్ని యంత ర్వత్నియై తొలుత మగశిశువుం గనినది.

కువలయాశ్వుఁ డాబాలునకు జాతకర్మానంతరము విక్రాంసి

యను నామకరణము వ్రాసెను. ఆపేరునకు భృత్యులెల్లఁ బరమానంద భరితులైరి. మదాలస నవ్వుచుఁ బరిహాసముసేసినది. మఱియొకనాఁడు మదాలస బంగరుడోలికలో వెల్లకితలం బడుకొని రోదనము చేయు చున్న బాలకుని జోకొట్టుచు నిట్లు బోధించినది.

తాతా! నీవు కేవలము పరమాత్మవు. నీకుఁ గల్పనగా నీపేరు పెట్టఁబడినది. పంచభూతాత్మకమైన యీదేహము నీవుకావు. ఎందుల కేడ్చెదవు. నీగుణములన్నియు వికల్ప్యములు. నీయింద్రియములందు భూతము లావరించియున్నవి. అన్నాంబుపానాదులచే భూతము లెనుగును గాని నీకు వృద్ధిక్షయములు లేవు నీవు కంచుకప్రాయమై నశింపఁబోవు చున్న యీదేహమునందు మమత్వము వహింపకుము. మదమాత్స ర్యాది దుర్గుణజనితములగు శుభాశుభరూపములైన కర్మలచే నీకంచు కము నీపైఁ గట్టఁబడినది. తండ్రియనియుఁ దనయుఁడనియు నీవనియు నేననియు భూతసంఘమును మన్నించుచుంటిమి. మూర్ఖుఁడు దుఃఖములఁ బోఁగొట్టుకొనుచు భోగములు సుఖముగలుగఁజేయునని తలంచును. పరమమూర్ఖుఁడాదుఃఖములనే సుఖములని తలంచును. ఎముకలుగనప అచుట నవ్వులని వర్ణింతురు. కల్మషయుక్తమగువపను బ్రకాశించు కన్ను లని పొగడుదురు. దుర్మాంసపిండంబులఁ గుచంబులని నుపమానములు గల్పించి స్తుతియింతురు. రతి కాస్పదయగు స్త్రీ నిరయము కాదా?

శ్లో॥ హాసోస్థిసందర్శనమక్షియుగ్మ మత్యుజ్వలం తత్కలుషం వసాయాః
కుచాదిపీనం పిశితం ఘనంచ స్థానంర తేః కింనరకోనయోషిత్॥

అని యిట్లు మదాలస నిత్యము నబ్బాలకునికి బోధింపుచుండ నతండు పెద్దవాఁడై తనుపదేశప్రభావంబున గార్హస్థ్యధర్మ మనుష్టిం పక విరక్తుండై తపోవనంబున కరిగెను. మఱికొంతకాలమునకు మదా లస మఱియొకకొమరునిం గనినది. కువలయాశ్వుం డతనికి సుబాహుండని పేరుపెట్టెను. అప్పుడుగూడ నాచేడియ నవ్వినది. పిమ్మట నాబాలుండు

దినదినాభివృద్ధి వహింపుచుండఁ బెద్దవానికివలె వీనికిని దత్త్వోపదేశము గావించి ప్రాయమురాఁగానే తపోవనంబున కరుగఁ జేసినది. తరువాత మూఁడవసంతానమున కతఁడు అరిమర్దనుండని పేరుపెట్టుచుండ నవ్వుచు నాపూర్వుంబోఁడి వానికిని దత్వంబెఱిఁగించి విరక్తుంగావించినది. పిమ్మట నాలుగవకుమారుం డుదయించెను. వానికి నేమో పేరుపెట్టఁబోవుచుఁ గువలయాశ్వుండించుక నవ్వవెలయింపుచున్నమదాలసంజూచి ప్రేయసీ! నేను పేరుపెట్టినప్పుడెల్ల నవ్వుచుంటివి. విక్రాంతుఁడనియు సుబాహుఁడనియు నరిమర్దనుఁడనియు శోభస్కరములైన నామములు పెట్టితినని తలంచుచుంటిని. క్షత్రబంధువుల కీపేరులు యోగ్యములై యున్నవి. పరాక్రమమును సూచించుచున్నవి. వీనిగుఱించి యెందులకు నవ్వితివో చెప్పుము. మఱియు నీనాలుగవబాలున కేమిపేరుపెట్టెదవో నీవే నిరూపింపుము. నేనుగూడ నవ్వి పరిహాసము సేయలేనేమో చూతము. అనిపలికినవిని మదాలస మహారాజా! నీయాజ్ఞవడువునఁ గావించెదను. వీని కలర్కుఁడని పేరుపెట్టితి నట్లె లోకమున వాడుకఁబొందఁగలఁడని పలికినఁ గువలయాశ్వుండు పకపకనవ్వుచు మదాలసా! ఇట్టిపేరు పెట్టితివేమి? అలర్కుఁడన నర్థమేమియో చెప్పుమని పరిహాసము సేసెను. అప్పుడు మదాలస రాజా! నేనుబెట్టినపేరు సార్థమైనదికాదు. వ్యావహారికనామమున కర్థమేమియుండును? మీరుపెట్టినపేరు లపార్థములు. వినుండు. నేనేచెప్పెద. క్రాంతి యనఁగా నొకదేశమునుండి మఱియొక దేశమున కరుగుట. అంతటను నిండియున్న దేహేశ్వరుఁ డొకచోటనుండి మఱియొకచోటున కెట్లుపోవును. కావున నీపేరు నిరర్థకమని నాయభిప్రాయము. సుబాహునామము అమూర్తుఁడైన పురుషున కెట్లుచెల్లును? మూఁడవపుత్రునకు నరిమర్దనుఁడని పేరుపెట్టితిరి. అదియు నిరర్థకమే. వినుండు. మణులనుగ్రుచ్చిన సూత్రమువలె సర్వశరీరములయందు నున్నవాఁ డొక్కపురుషుఁడే. అట్టివానికి శత్రులెవ్వరు? మిత్రులెవ్వరు?

భూతములు భూతములనే మర్దించును. అమూర్తు నెట్లు మర్దింపఁగలరు. కావున మీాను పెట్టిన మూఁడుపేరులు నర్థశూన్యములైనవి కావా ? నేను బెట్టిన వ్యవహారికనామమున కర్థమేమిటికి ? అలర్కుఁడని సంజ్ఞార్థమే యుంచఁబడినది. అని యుక్తియుక్తముగా ననువదించిన విని యాభూపాలుండు సంతసించుచు మదాలస వైదుష్యమును బెద్దగా మెచ్చుకొనియెను.

మదాలసయు నాబాలునకుఁగూడ వెనుకటిబాలురకువలె జోలపాడుట జూచి కువలయాశ్వుఁడు తరుణీమణీ ! ఇదియేమికర్మము? నాకు సంతతిలేకుండఁ జేసెదనాయేమి ? ముగ్గురపిల్లలను సన్యాసులఁ జేసి యడవుల కనిపితివి. ఒక్కనినైన నుండనీయవా ?

నీకు నామాట వినుతలంపు గలదేని నా కిష్టముగా నీబిడ్డకు రాజనీతి యుపదేశింపుము. కర్మమార్గప్రవర్తకునిగాఁ జేయుము పితృదేవతలు తిలోదకములంది వంశాభివృద్ధి గోరుచుందురు. గృహస్థుండు సర్వజనోపకారి కాడే. కావున నాకుఁ బ్రీతిగా వీనికి రాజధర్మముల నెఱింగించి ప్రవృత్తిమార్గనిరతుం జేయుమని కోరినఁ బతివచనమును ద్రోయఁజాలక యంగీకరించి యుప్పొంగుచుఁబోఁడి యలగ్కున కిట్లుజోలపాడినది.

పుత్రా ! నీతండ్రికి సంతోషముగానఁ గర్మల నాచరింపుము. మిత్రుల కుపకారముచేయుము. శత్రువుల పీచమడంచుము. శత్రుశూన్యుఁడవై యేకాతపత్రముగా భూమి పాలింపుము. న్యాయముగాఁ బ్రజలఁ బాలింతువేని సుఖోపభోగ్యంబగు ధర్మఫల మందఁగలవు పర్వములయందు బ్రాహ్మణుల నర్చించి ధనప్రదానమునఁ దృప్తి బొందింపుము. బంధువుల కోరికలు తీర్పుము. సర్వదా పరహితమును గోరుచుండుము. పరస్త్రీలదెసకు మనసు పోనీయకుము. జన్నములు గావించి దేవతలను భూమిదేవతలను నాశ్రితులను దృప్తినొందింపుము. వీరుఁడా ! యుద్ధములచే శత్రువులను కామములచే స్త్రీలను సంతోషపెట్టఁగలవు.

బాలుఁడవై బంధువులకును కుమారుఁడవై గురువులకును యౌవనవంతుఁడవై కులస్త్రీలకును వృద్ధుఁడవై వనచరులకును సంతోషము గలుగఁజేయుమువుగాత. రాజ్యముచేయుచు మిత్రుల మురియఁజేయుము. సాధువుల రక్షింపుచు దుష్టులగు వైరుల నిగ్రహింపుము. గోబ్రాహ్మణరక్షకై మృత్యువును బొందుము. అని యుపదేశించినది.

అయ్యలర్కుం డట్లు నిత్యము తల్లిచే బోధింపఁబడుచు వయసుచేతను బుద్ధిచేత నభివృద్ధి నొందుచుఁ గౌమారప్రాయంబున నుపవీతుండై యొకనాఁడు మదాలసకు నమస్కరించి యిట్లనియె. అంబా! ఆముష్మికసుఖంబుకొఱకు నేనిప్పు డేమిచేయఁదగినదో యుపదేశింపుమని యడిగిన జనని యిట్లనియె వత్సా! నీవు పట్టాభిషిక్తుండవైనది మొదలు ప్రజల రంజింపఁ జేయవలయును. నృపుల కిదియే ముఖ్యధర్మము. మూలచ్ఛేదకములగు సప్తవ్యసనముల విసర్జించి మంత్రముల వెల్లడిగానీయక శత్రువులవలనఁ దన్ను రక్షించుకొనవలయును మంత్రుల దుష్టాదుష్టచర్యల నరయుచుండవలయును. చారులవలన శత్రుమర్మములఁ దెలిసికొనుచుండుము. రాజు మిత్రుల నాప్తుల బంధువులనైన నమ్మియుండఁగూడదు. కార్యావసరముబట్టి శత్రువునైన నమ్మినట్లభినయింపవలయును. రాష్ట్రకోశవృద్ధిక్షయముల విమర్శింపుచుండవలయును. తొలుత హృదయశత్రువులగు కామక్రోధాదుల జయించి పిమ్మట బాహ్యశత్రులపై దాడివెడలవలయును.

కామమువలనఁ బాండురాజును క్రోధమువలన ననుహ్రాదుఁడును లోభమువలనఁ బురూరవుఁడును మదమువలన వేనుఁడును మానమువలన ననాయువును అమర్షవలన బురంజనుండును జెడిపోయిరి. రాజు పురుగు దారువునుదొలిచినట్లు తెలియకుండ శత్రువును వంచింపవలయును. పిపీలికవలె సంపాదించి అగ్నివలె వెలుఁగుచు శాల్మలీబీజమువలె నడఁగి వృద్ధిబొందవలయును. నరపాలుఁడు ఇంద్రసూ

ర్యచంద్రయమవాయువులచిహ్నములఁ ధరించి ప్రజలఁ బాలింపవలయును. లోభమువలనఁగాని కామమువలనఁగాని యర్థమువలనఁగాని యెవనిమనసు ధర్మమును వీడకుండునో యారాజు స్వర్గమును బొందఁగలఁడు. ఉత్పథమును బొంది ధర్మచ్యుతులైన ప్రజల స్వధర్మనిరతులం జేసిన నరపతి యిహపరసుఖంబుల నొందఁగలఁడు న్యాయముగాఁ బ్రజలఁ బాలించినరాజు తత్సుకృతమును బంచుకొనుచు అని తల్లి పుత్రునకు రాజనీతియంతయు నెఱింగించినది మఱియు నతండడుగ వర్ణాశ్రమధర్మంబులును సదాచారప్రకారంబులోనగు విశేషంబు లెన్నియో యెఱింగించినది.

అలర్కుం డట్లు తల్లిచే శిక్షితుండై క్రమంబున సంప్రాప్తయౌవనుండై దారపరిగ్రహంబు గావించి పుత్రులంగని యాగములుచేసి పితృశుశ్రూష గావింపుచుండె. ఋతుధ్వజుండును బెద్దకాలము రాజ్యముజేసి వార్ధకంబున నలర్కుం బట్టాభిషిక్తుం గావించె. మదాలసయు భర్తతోఁగూడఁ దపోవనంబున కరుగుచు నలర్కుం జీరి చివరమాట యిట్లు చెప్పినది.

వత్సా! ఈయుంగరము నీవ్రేల నుంచుకొని యుద్ధమువలనఁగాని బంధువియోగమువలనంగాని సమస్తవిత్తనాశనకరమగు విపత్తు సంభవించినప్పు డీయుంగరమును జిదియఁగొట్టి దీనిలో నిమిడ్చియున్న పత్రికలోని సన్ననిలిపితో నొప్పుశాసనమును జదివికొని తదుక్తరీతిఁ గావింపుము. అని యుపదేశించి యంగుళీయకమిచ్చి పుత్రుం దీవించి యాకాంచనగాత్రి భర్తతోఁ దపోవనంబున కరిగినది.

అలర్కుండును బట్టభద్రుండై ప్రజలఁ బ్రజలపోలికం జూచుచుఁ బెద్దకాలము రాజ్యముగావించెను. ధర్మార్థకామాసక్తుండగు నయ్యలర్కున కనేకవత్సరంబు లొకదినమువలె వెళ్లినవి. విషయసుఖంబుల ననుభవింపుచున్న యతనికి వైరాగ్యోదయమైనదికాదు. ధర్మార్థోపార్జ

నముంకుఁ దృప్తియుఁ దీరినదికాదు.

వనంబునఁ దపోవృత్తి వర్తించు సుబాహుండు సోదరుని రాజ్యపాలనవిధానంబు దెలిసికొని యతండు విషయాసక్తుండగుటకుఁ జింతించుచు నించుక యాలోచించి తిన్నగాఁ గాశీరాజునొద్దకుఁ బోయి యిట్లనియె.

దేవా! నేను గువలయాశ్వుని పెద్దకుమారుండ. నేను జిన్నతనము నందు మతిచెడి దేశాంతర మరిగితిని. నాకు రావలసినరాజ్యంబు నా తమ్ముఁడు అలర్కుం డనుభవించుచున్నాఁడు. జ్యేష్ఠానుక్రమంబున ననుభవించుట న్యాయము. నీవు వాని నుందలించి నారాజ్యము నాకిప్పింపుమని ప్రార్థించిన నయ్యేకిమీఁడు అలర్కునొద్ద కప్పుడే యొకదూతం బంపించెను. అతండు రాజవాచకం బిట్లు చెప్పెను.

ఉ. చిన్నతనంబునందు భ్రమజెంది వనంబుల సంచరించి నీ
యన్న సుబాహుఁ డిప్డు శరణాగతుఁడై భజియించె నన్ను సం
పన్నుఁడ వౌట రాజ్య మది వానిది వానికి నిచ్చు టొప్పుఁ గా
కున్న నిను న్మహాస్త్రముల నొంచి సుబాహు మహీశుఁ జేసెదన్.

అని చెప్పుటయు నావార్తవిని యలర్కుండు మందహాసము గావించుచు నేమీ? కాశిరాజునకు నేనంత దేలికగాఁ గనంబడుచుంటి నా? నాయన్న వచ్చి సౌహార్దంబున నన్ను రాజ్యమడిగిన నీయకుందు నా? ఆతనినేల శరణుకొందవలయుఁ గాశీరాజునకు నేను వెఱచి రాజ్యమిచ్చువాఁడను కానని చెప్పుము. నాయన్న వచ్చి యాచించిన నిత్తునని ప్రత్యుత్తరము బంపెను.

ఆమాటవిని సుబాహుం డోహో! యభిమానముగల క్షత్రియుం డొరుల దేహీ యని యాచించునా? అందులకు నే నొల్లనని పలికెను. అప్పుడు కాశిరాజు చతురంగబలపరివృతుండై యలర్కుపురము ముట్టడించి సామదానభేదోపాయంబులఁ దత్సైన్యసమూహ

ముల వశపఱచుకొని దుర్గముల నాసరించెను.

అలర్కుండప్పుడు తనబలంబు క్షీణించుట తెలిసికొని విషాదమే దురహృదయుండై చీకాకుపడుచు నేమిచేయుటకుం దోఁచక తటాలునఁ దల్లిమాట జ్ఞాపకము వచ్చుటయు శుచియై తన[వ్రే]లినున్న యుంగరము జిదియఁగొట్టి సూక్ష్మాక్షరములతో నందున్నశ్లోకముల నిట్లు చదివెను.

శ్లో॥ సంగస్సర్వాత్మనాత్యాజ్య స్సచేత్త్యక్తుం నశక్యతే
స సద్భిస్సహ కర్తవ్య తస్సంగస్య భేషజం
కామస్సర్వాత్మనాహేయో హాతుంచే చ్ఛక్యతె న సః
ముముక్షాం ప్రతికర్తవ్య స్సైవ తస్యాపి భేషజం॥

సర్వవిధములచేతను సంగము (జనులతోఁ గలిసియుండుట) విడువఁదగినది. అది విడుచుటకు శక్యముకానిచో సత్పురుషులతోఁ జేయుము; అదియే దానికిమందు. అన్నివిధములఁ గామము (కోరిక) విడువఁదగినది. అది విడుచుటకుశక్యముకానిచో ముక్తినిగుఱించి చేయుము; అదియే దానికివైద్యము. అనియున్న రెండుశ్లోకములు పలుమారు జదివి తదర్థముగ్రహించి సంగమువిడువలేకున్న సత్సంగముసేయుమని చెప్పినది. అదియే యిప్పుడు కర్తవ్యము. అని నిశ్చయించికొని యలర్కుండు తిన్నఁగా దత్తాత్రేయాశ్రమమున కరిగి యతనిచరణంబులఁబడి మహాత్మా! రక్షింపుము, రక్షింపుము. దుఃఖసముద్రములో మునిఁగియుంటి నా దుఃఖము బోఁగొట్టి రక్షింపుమని ప్రార్థించెను.

దత్తాత్రేయమహర్షి నవ్వుచు నరేంద్రా! నీదుఃఖము తృటిలోఁ బోఁగొట్టెదను. ఆదుఃఖ మెందులకువచ్చినదో లెస్సగా విచారించిచెప్పుము. నీవెవ్వఁడవు? దుఃఖ మెవ్వరికి? అంగాంగిభావ మెఱిఁగి పలుకుమని చెప్పిన నలర్కుం డాలోచించి యాలోచించి విమర్శించి తనలోఁదానే నవ్వుకొని యిట్లుపలికెను. మహాత్మా! నేనాకాశమును భూమియు నుదకము వాయువు తేజమునుం గాను. తత్సంఘమందుఁ బ్రవేశించి సుఖ

మనుభవింపుచుంటిని. ఈభూతపంచకమునకు సుఖాసుఖంబులన నెట్టివి? శరీరమే నేనుకానిచో తజ్జన్యములగు సుఖదుఃఖములు నాకెట్లుకలిగెడిని? తెలియకయే యిట్లుపలికితిని. నేను శరీరముకంటె భిన్నుండనని నీరాజ్యముతో నాకేమిసంబంధమున్నది. కావున నాకు శత్రుండును మిత్రుండును లేఁడు. సుఖము దుఃఖము లేదు. పురము కోశము దుర్గము లేదు. ఘటీకుంభకమండలుగతంబగు నాకాశ మొక్కటేయై పెక్కురీతులం గాన్పించునట్లు సుబాహుండు కాశీపతియు నేనునుంగూడ శరీరములచే భిన్నులముగాని యాత్మచే నొక్కరమే. మునీంద్రా! నీకరుణావిశేషంబునం జేసి నాయజ్ఞానంబు బాసినది. సంసారంబు మమత్వమూలంబని తెలిసికొంటినని పలికిన విని దత్తాత్రేయుం డిట్లనియె.

వత్సా! నాప్రశ్నవలననే నీకు జ్ఞాన ముదయించినది. నీవనినట్లు సంసారమునకు మమత్వమే మూలమైయున్నది. ఈసంసారవృక్షమునకు నేను అనుమాటయే విత్తనము. నాదియనుట మొదలు. గృహక్షేత్రాదులు శాఖలు. దారపుత్రాదులు పల్లవములు. ధనధాన్యాదికమాకులు. పుణ్యపాపములు పూవులు. దుఃఖములు ఫలంబులు. విధిత్సయే భృంగపంక్తి. మూఢసంపర్కము నీరుపోత. ఈతరువు హృదయంబున మొలిచియున్నది దీనిం బ్రాజ్ఞులు జ్ఞానకుఠారంబున నఱుకుదురు. అని దత్తాత్రేయుం డతనికి విజ్ఞానప్రకారంబంతయు నెఱింగించెను. మఱియు యోగప్రవృత్తి ప్రాణాయామలక్షణము అణిమాదిసిద్ధులు యోగధర్మములు ప్రణవలక్షణము లోనగు విశేషములన్నియు నా మహాత్ము నడిగి తెలిసికొని యలర్కుండు తదామంత్రణంబువడసి సుబాహుండు గాశీరాజు నున్నచోటికింబోయి నవ్వుచు సోదరుండు వినఁ గాశీపతి కిట్లనియెను.

కాశీంద్రా! రాజ్యకాముకుండవై వచ్చితివి. నీయిచ్చవచ్చినట్లను భవింపుము. లేదా సుబాహునకిమ్ము. అద్దాని నేను విడిచితినని పలికిన

విని కాశీరా జిట్లనియె. అలర్కా! యుద్ధముచేయకయే రాజ్యమువిడిచితి వేమి? ఇది క్షత్రధర్మమే. క్షత్రియుఁడు మరణభయమును విడిచి శత్రువులపై శరవర్షము గురిపింపవలయుఁగాని పారిపోవనగునా? అని యధిక్షేపించిన విని యలర్కుం డిట్లనియె.

నరేంద్రా! నాకును బూర్వ మిట్టిబుద్ధియే యుండునది. ఇప్పుడు నాచిత్తవృత్తి పూర్తిగా మాఱిపోయినది. నీదాడికి వెఱచి దత్తాత్రేయమహర్షి చరణంబులు శరణుజొచ్చితిని. ఆమహాత్ముండు నాకుఁ దత్త్వోపదేశము గావించి నిజం బెఱింగించెను. నాకు శత్రువులు మిత్రులును లేరు. ఇంద్రియముల జయించితి, సంగముల విడిచితిని.

శ్లో॥ సోహం న తేరి ర్నమమాసిశత్రుః సుబాహురప్యేషనమేపకారీ
దృష్టంమయా సర్వమిదంయథాత్మా హ్యన్విష్యతాంభూప
రిపు స్త్వయాన్యః॥

భూపా! నీకు నేనును నాకు నీవును శత్రువులముకాము. సుబాహుఁడు నాకేమియు నపకారము సేయలేదు. నేను నాయాత్మవలె నే బాహ్యప్రపంచకమంతయుం జూచుకొనుచున్నాను. నీవు మఱియొక శత్రువును వెదకికొనుము. అని పలికిన విని విస్మయముచెందుచుఁ గాశీరాజు సుబాహుంజూచి రాజపుత్రా! మీతమ్ముఁడు రాజ్యము విడిచెను. మన ప్రయత్నము కొనసాగినది. పట్టభద్రుండవై ప్రజలం బాలింపుమని పలికిన సుబాహుం డిట్లనియె.

నరేంద్రా! నే నేపనికై నిన్ను శరణునొందితినో యాపని తీరినది. నాకు రాజ్యమేల? ఇఁక నాకు సెలవిమ్ము పోయివచ్చెద ననిపలికినఁ గాశీపతి నవ్వుచు నిట్లనియె. నీ వేపనికై వచ్చితివి? ఆపని యెట్లుతీరినది? నాకేమియు విడిపోకున్నది. ఎఱిఁగింపు మనవుఁడు సుబాహుం డిట్లనియె. మాతమ్ముఁడు అలర్కుండు మాతల్లిపాలుత్రాగియు విషయసక్తుండై రాజ్యభోగంబుల ననుభవింపుచు నివృత్తిమార్గము దెలియకున్నాఁడని

విచారించి దుఃఖము గలుగఁజేసితినేని వైరాగ్యము జెందఁగలఁడని నిశ్చయించి నిన్నిట్లాశ్రయించితిని. నీవును నాయభీష్టమువమువుగఁ గావించితివి. మాతమ్ముఁడు ప్రవృత్తిమార్గము విడిచి విరక్తుండై యుత్తమమార్గ మవలంబించె నిదియె నాయభీష్టము. తలఁచినకార్య మైనదని చెప్పిన నతండు తదీయవిజ్ఞానప్రవృత్తినిగుఱించి పెద్దగా స్తుతిజేసెను.

అలరుఁడును జ్యేష్ఠపుత్రుడు ధాత్రీరాజ్యపట్టభద్రుం గావించి యన్నతో తపోవనంబునకుఁ బోయెనని యావృత్తాంతమంతయు నెఱింగించి మిత్రవింద యాను దాలసవంటిదని స్తుతియించితిని. ఆకథవిని మిత్రవిందయు నవ్వయు వెఱఁగుపడి మనుపన్యాసము పెద్దగా మెచ్చుకొనిరి.

మిత్రవింద మదాలసగుణములోఁ దనకు సహస్రాంశమైన లేదని పలికినది. నేను వారితోఁ గలిసిమెలిసి యిష్టాలాపములాడుచుఁ గొన్నిదినంబు లందుండి యిచ్చటికిఁ బయనమైతిని. ఒకనాఁడు అవ్వ నాకడకు వచ్చి ముచ్చటించుచు నిట్లనియె. ఘోటకముఖా! నీముఖము జూచినప్పుడే దైవికముగా నామనుమరాలిని నీకిప్పింపవలయునని బుద్ధిపుట్టినది. అందులకే నీకు నాగుట్టు జూపితిని. అందులకే నిన్నిచ్చటికిఁ దీసికొనివచ్చితిని. నాకూఁతురు కూఁతు నీకిచ్చుట కంగీకరించినది. అల్లునకు నచ్చఁజెప్పితిని. అందఱకు నిష్టముగానున్నది. పెండ్లికూఁతురు నీవిద్యావైభవము చూచి యుఱ్ఱూటలూగుచున్నది. కావున జాంబవతి నీవు ధర్మపత్నిగాఁ బరిగ్రహింపుము. ఈదీవి కధిపతి కాఁగలవు. నాయల్లుఁడు నీయభిప్రాయము దెలిసికొనిరమ్మనియెనని చెప్పినది.

జాంబవతిం జూచినది మొదలు నాహృదయము దానియందు లగ్నమైయున్నది. వారు నాకుఁజేయు నుపచారములంబట్టి యించుక యాసదీపింప సంశయడోలిక యెక్కి యూఁగుచుంటిని. అవ్వ నాసందియము తీర్చినది. మనంబునంబొడమిన సంతసము దెలియనీయక మందహాసముతో నవ్వా! నీవు పెద్దదానవు. నాశ్రేయము కోరుచుంటివి. నీమాట

కాదనఁగలనా ? నీయిష్టమెట్లో యట్లే కావింపుమని తెలిపితిని.

ఆమెహోయి యల్లునకవ్విధము రెఱింగింప నతండు నాసవిధమున కరుగుదెంచి యార్యా ! యాచ్ఞాభంగదోషంబు గలుగునని యీతఁ దనుక నాయభిలాష వెల్లడించితినికాను. ఇప్పుడు కులజులతోఁగూడ నేను గృతార్థుఁడనైతి. నాసుతం బరిగ్రహింపఁ బాత్రుండవని స్తుతి యించుచు శుభముహూర్తంబున జాంబవతి నాకిచ్చి వివాహము గావించెను. తగినకన్యకదొరకినప్పు డొండొరుల ననుమతిబడయకయే వివాహమాడవచ్చునని మనము మొదట నిశ్చయించుకొంటిమి. కనుక మీ రెవ్వరును లేకున్నను మీయనుమతి పడయక జాంబవతిం బరిగ్రహించితిని. దివ్యోపభోగంబు లనుభవింపుచుఁ గొన్నిదినంబు లందుంటిని. అప్పుడప్పుడు పోయి గణికాపుత్రికలతో మాట్లాడి వచ్చుచుంటిని. వారందరు తమ్ము మీయొద్దకుఁ దీసికొనిపొమ్మని బ్రతిమాలికొనుచుండిరి. జాంబవతికి నందున్న సమయము సంగీతవిశేషంబులనెల్ల నెఱింగించిరి.

నేనొకనాఁ డానృపతితోఁ జెప్పి యొప్పించి చిత్రసేనారతి మంజరుల వెంటఁబెట్టికొని బయలుదేరితిని. సముద్రముదాటువఱకుఁ బెక్కండ్రుపరిజనులు తోడవచ్చిరి. దేశవిశేషములం జూచికొనుచు నీ నగరంబు నిన్నరాత్రికిఁ జేరితిమి. రాత్రి సత్రములో బసజేసితిమి. మీ పేరులు రాత్రి యాసత్రములోనే వినంబడినవి. నేఁటియుదయమున లేచి వీరిని బండియెక్కించి మీయునికిఁ దెలిసికొనుచు నిందువచ్చితిని. ఇదియే నావృత్తాంతమని ఘోటకముఖుం డెఱింగించెను.

ఆవృత్తాంతమును విని మిత్రులందఱు సంతసించుచు ఘోటకముఖుండుగూడఁ బ్రభుస్థాన మలంకరింపఁగలఁడని ప్రశంసించిరి. అప్పుడు కుచుమారుఁడు నాఁడు నీతోవచ్చిన పురుషుఁడెవ్వఁడో నీ వెఱుఁగవైతివి. అతఁడే భోజమహారాజు. అతండు భైరవునితంత్రములోఁ జిక్కికొనియె నని చెప్పితివి. ఎట్లు బయల్పడియెనో తెలియదు. మాతో నావిషయ

మేమియుఁ జెప్పలేదుకాని వానివలన నిడుములం గుడిచితినని మాత్ర మెఱింగించెను. ఆభైరవుఁ డిప్పు డీయూర నున్నాఁడు. వానిమృగముల యాట రేపు సాగింతురు. వాని నప్పుడు పరిభవింపఁదలంచికొంటిమి. వాఁడు మనచారాయణునిఁగూడ మృగమును జేసెనని యాకథయంతయు నెఱింగించెను.

అతండు భోజుండని విని ఘోటకముఖుండు విస్మయసాగరమునం దేలియాడెను. అతనిభార్య లీలావతి యిందేయున్నదని చెప్పినంతఁ గలిగినసంతోష మిట్టిదని చెప్పఁజాలను. వెండియు వార లొండొరులకథ లొండొరుల కెఱిఁగించికొనుచు వారు వారు పడినయిడుములు దలంచుకొని యడలుచు నాదివసము పర్వసమయముగా వెళ్లించిరి.

అని యెఱింగించి యతిపంచాననుం డవ్వలికథ మఱల నిట్లు చెప్ప మొదలుపెట్టెను.

## 170 వ మజిలీ.

### — మిత్రసమ్మేళనము. —

నాఁడు భైరవుని మృగములయాటఁ జూచుటకు నియమించిన దివసము. అయ్యాటకుఁ దగిననెలవు పురమందిరము అది మిక్కిలి విశాలముగానున్నది. స్త్రీలనిమిత్తమై ప్రత్యేకముగా గదులు గట్టఁబడి యున్నవి. అయ్యాటఁజూచుటకు మల్లికయు రత్నపదిక సువర్ణపదిక మొదలగు మగువలుకూడ నభిలషించి కోరుటయుఁ గుచుమారుఁ డంగీకరించి స్త్రీలనందఱను దీసికొనిపోవుటకు నేర్పాటు గావించెను.

రాజభార్యలు రుక్మిణి మొదలగు నంతఃపురకాంతలుగూడ నావేడుకఁజూచుటకుఁ బోవుదురని విని చారుమతి దానుగూడ వత్తునని చిత్రసేనుం గోరికొనినది. ఆమెయందలి ప్రేమచే నతం డనుమోదించి స్త్రీవేషముతోఁ వచ్చినచోఁ దండ్రికిఁ దెలియునని వెఱచి చారుమతికిఁ

బురుషవేషముఁ వైచి యాయాటకుఁ దీసికొనిపోయి మారుమూలగాఁ గూర్చుండెను.

భోజుండును గాళిదాసకవితోఁ గూడ నియమితకాలమునకు స్యందనమెక్కి యాపండితులున్న మందిరయునకుఁ బోయి వీధిని నిలువంబడి లోపలికి వర్తమానము పంపెను. స్త్రీలను బ్రత్యేకముగాఁ దీసికొనిరమ్మని గోణికాపుత్రునకు నియమించి తక్కినవారు భోజకాళిదాసకవుల ననుగమించి రంగస్థలమున కరిగిరి. అందుఁగూర్చున్న వెంటనే తన్నుఁ జూచి చిఱునగవు మొగంబున వెలయించుచున్న ఘోటకముఖుంజూచి భోజుండు ఓహోహో ! మీరెవ్వరు ? నావెంటఁ బెక్కులు చిక్కులు పడుచు దేశాటనము గావించిన పరమోపకారి ఘోటకముఖులా ? ఎప్పుడువచ్చితిరి? అని లేచి యాలింగనము సేసికొనియెను. మీ రాపదగుడిచియుండ లేచిపోయిన కృతఘ్నుఁడ ఘోటకముఖుఁడనే. ఆపాపాత్ముని చేతిలోఁ బడితి రెట్లు తప్పించికొని వచ్చితిరి ? అనియడిగిన నిప్పు డేమియు మాటాడవలదు వీఁడే యాక్రూరాత్ముఁడు. వీనిం బంధించునిమిత్తమే యీయాటఁ బెట్టితిమి. అంతయుఁ దరువాతఁ జెప్పెదఁ జూచుచుండుమని తత్కాలోచితములగు మాటలచే నతనికి సంతోషము గలుగఁజేసెను.

భోజునకు వామభాగమునఁ గాళిదాసకవియుఁ గుడివైపునఁ గుచుమారుఁడును దరువాతఁ దక్కినవారుం గూర్చుండిరి. స్త్రీలు గూర్చున్న చోటునకు దాపునఁ జిత్రసేనుఁడు పురుషవేషముతోనున్న చారుమతితోఁ గూర్చుండెను. విద్యుద్దీపములచే రంగస్థలమంతయుఁ బట్టపగలువలె నొప్పుచుండెను. స్త్రీలకుఁ బురుషులందఱుఁ గనంబడుచుండిరి. రాజభార్య లెవ్వరును రాలేదు. రుక్మిణిమాత్రము రేవతితో వచ్చి లీలావతి ప్రక్కను గూర్చున్నది రాజకుటుంబమువారిందప్ప నితరుల నాయుబ లోనికి రానీయరు. లీలావతి భర్తనుఁ గాళిదాసకవిని జూచి నమస్కరింపుచు,

లీలావతి—ఆహా! నే నామహానుభావులసేవ జేసి యెంతకాలమైనవో తిరుగా నీజన్మమున నా కట్టిభాగ్యము పట్టునా? అని కన్నీరు విడుచుచున్నది.

సరస్వతి—దేవి! ఘోటకముఖు లీదినమున మిమ్ముఁ దప్పక భర్తతోఁ గూర్తునని చెప్పలేదా? మఱచితివా? మీనిమిత్తమై వారు పడినశ్రమయంతయు వినియుఁ బరితపించెద వేమిటికి? తప్పక మీకు నేఁడు భర్తృసమాగమము కాఁగలదు.

మదయంతి—అక్కా! సరస్వతీ! ఆతఁడే కాళిదాసకవిచంద్రుఁడు. ఆహా! ఆమహానుభావునికథలం జెప్పికొనుటయేకాని దర్శనము సేసియుండలేను. నేఁడు కృతార్థులమైతిమిగదా!

సరస్వతి—(భోజకాళిదాసకవుల నిరూపించిచూచి నమస్కరించుచు) అయ్యిరువురు దేవసదృశులు; త్రిభువనవిఖ్యాతయశులు; నావివాహముతగవులో నానృపతికూడ నుండిరఁట.

రత్నపదిక—మాచరిత్రమంతయుఁ జూడకుండఁగనే రచించిన రహస్యవేది అతఁడే కాళిదాసు. అయ్యో! నాభర్త వారిదర్శనము సేయవలయునని యెంతయో కుతూహలపడువారు. ఎందుండిరో తెలియదు. ఏమిజరగునో అని యశ్రువులు విడుచుచున్నది.

సువర్ణపదిక— ఈప్రయత్నమంతయు నందులకే కాదా? సంతోషసమయము వచ్చుచున్నది. విచారింపకుము.

సరస్వతి—మనపండితుల దండితనము వింటిరా? మొన్నటి సభలోఁ గాళిదాసకవితోఁ బ్రసంగించుటకుఁ గాలుదువ్విరఁట.

మదయంతి—అది యౌవనమదము తొలిప్రాయమునందుండుటచే నట్టిపంకము గలుగును.

మల్లిక—ప్రసంగించిన నెవ్వరు గెలుతురో?

లీలావతి—మీభర్త లెంతదిట్టలైనను విద్యామహిమచే నతనికి

సాటిరారనుకొందును.

సరస్వతి—మహిమమాట జెప్పలేను కాని విద్యలకుఁ దీసి పోవరు.

రత్నపదిక — అమ్మయ్యో! ఆమహానుభావునకు సాటి మూఁడు లోకములలో లేరని చెప్పఁగలను. మాహృద్గతాభిప్రాయములఁగూడఁ జూచినట్లు వర్ణించెను.

రుక్మిణి—అదియే యాకవిశిరోమణియందున్న విశేషము. ఎంత రహస్యమైనవిషయమైనను సమస్యగా నిచ్చినచో యథార్థము తెలియు నట్లు పూర్తిచేయును.

సరస్వతి—అది దైవశక్తి; పాండిత్యప్రగల్భము కాదు.

రుక్మి— రేవతీ! నాయన్న యాపండితులతోఁ గలిసి కూర్చుం డక మారుమూలగాఁ గూర్చుండెనేమో?

రేవతి—ఏమో తెలియదు. తండ్రిగారియొద్ద భయముకాదా?

రుక్మిణి—ఆతనిప్రక్కఁ గూర్చున్నపురుషుఁడు మన మెఱిఁగియు న్నవాఁడుంబోలెఁ గనంబడుచున్నాఁడు. చూడుము.

రేవతి—అగునగు నతఁడే నీహృదయచోరుఁడు.

రుక్మిణి—(జనాంతికముగా) ఈమాట ముగియులోపల నందుఁ జని వానివృత్తాంత మరసి రావలయును.

రేవతి—అట్లే పోయివచ్చెద, నదిగో గంట మ్రోఁగుచున్నది. మృగములతో వాఁడు ప్రవేశించునుగాఁబోలు.

మల్లిక—అడిగో అడిగో మెడలకుఁ దొడలకుఁ జేతులకు గంటలు గట్టికొని వచ్చుచున్నాఁడు. వాఁడేకాఁబోలు భైరవుఁడు. అగును. వాఁడె వాఁడె నాఁడు చూచితిని. గడ్డము జటలు పెంచుకొని యున్నాఁడు వాఁడే. ఓరీ! క్రూరాత్ముఁడా! నాతలిదండ్రుల నేమృగము చేసితివో చెప్పరా! అని నిందించుచున్నది.

రత్నపదిక—ముందు వాఁడును వానివెనుక మృగము లాసన్నని దారివెంబడి యావువెనుక లేగలువచ్చుచున్నట్లు వచ్చుచున్నవి. వానిఁ గఱవవుకాఁబోలు !

మల్లిక— బాబో ! పెద్దపులులు సింహములుగూడ వానివెంట దూడలులాగున వచ్చుచున్నవి. వానిఁ జంపవుకాఁబోలు !

సువర్ణపదిక—కఱచినచో మనవంటివాఁడే, కఱవకుండుటయేవింత.

మల్లిక—అక్కా ! చూడు చూడు. చేతితో బెత్తముబట్టుకొని యెట్టుత్రిప్పిన నామృగము లటుతిరిగి యాడుచున్నవి.

సరస్వతి— కుచుమారునిముందఱ నీనిమాటలు సాగవు ఇవ్వా డేమిచేయునో చూడుము.

మల్లిక—ఏమి మీభర్తగారిబడాయి ! మీతో నేమిచేయుదు నని చెప్పిరి ?

సరస్వతి—ఒక్కమృగమునైన వానికిఁ జెప్పినట్లు వినకుండఁ జేయుదురు. చూచుచుండుఁడు.

రత్నపదిక—మీభర్తకారుణ్యమున మావారు బంధవిముక్తు లయ్యోనేని చాల సంతోషింతుముగదా !

మదయంతి—అక్కా ! నీభర్తగారిమెడలోఁ దెల్లగా మెఱయు చున్న దదేమి ?

సరస్వతి—అదియే యాసిద్ధుని యస్థిమాల. దానిమూలమున మంచిచమత్కారము జరగును చూచుచుండుము.

మదయంతి—అది సింహముకాఁబోలు. తోకయాడించుచుఁ గుక్కవలె వానివెనువెంటఁ దిరుగుచున్నది ఇంతకుము న్నిట్టిమాటలు పెక్కులు చూచితిమి. క్రూరమృగముల బోనులలోఁబెట్టి తీసికొని వచ్చువారు. ముహూర్తకాలము నిలిపి యంతలోఁ దీసికొనిపోవుచుందు రిది కడుచోద్యముగానే యున్నది. అయ్యో ! అక్కా ! చూడు మా సింహముపైఁ గరిపోత మెక్కి యాడుచున్నది.

సరస్వతి—(నవ్వుచు) అదిగో! కుచుమారులు లేచుచున్నారు. ఇఁక వానిపని మట్టమగును.

అని యవనికాంతరమున స్త్రీలు సంభాషించుచుండిరి. ఆట కొంతవఱకు జరగినతరువాతఁ గుచుమారుఁడు లేచి యామృగముల దాపునకుఁ బోయి మెడలోనున్న యస్థిమాలను జేతంబూని మృగములకుఁ జూపుచు హుంకారము గావించెను. అప్పుడందున్న మృగములన్నియు నాతనియొద్దకు వచ్చి వినయ మభినయించుచు నిలువంబడినవి.

భైరవుఁడు చేతనున్న బెత్తముం జూపుచు రమ్మని యొకభల్లూకమును బిలిచెను. పోయినదికాదు. దానితో నొకదెబ్బకొట్టినంత బొబ్బపెట్టుచు వానిమీఁదఁబడి రక్కినది. అంతలోఁ గుచుమారుఁడు పిలిచినంత నతనిచెంతకుఁ బోయి నిలిచినది. మెండియు వాఁడు వ్యాఘ్రమును బెదరించిన నది గాండ్రునని యఱచుచుఁ గఱవఁబోయినది. ఈరీతి మృగములెల్ల దిరుగఁబడి వానిం గఱవఁబోయిన వెఱచుచు వాఁడు బారిపోవ ప్రయత్నించెనుగాని దారిలేదు. మృగములే యడ్డముగానున్నవి. క్రూరసత్వంబులేకాక యశ్వములుగూడ చెంతకుఁబోయినఁ దన్నుచుండెను.

వాఁడు హస్తమెత్తి మహారాజా! ఈతఁడెవ్వఁడో ప్రయోగము గావించెను. మృగములు చెప్పినట్లు వినుటలేదు. నేనేమిచేయుదును? రక్షింపవలయు, నివియే నన్ను భక్షించునట్లున్నవి అని ప్రార్థించెను. అప్పుడు చారాయణుఁడు వానిదాపునకుఁ బోయి యోరీ! భైరవా! నన్నెన్నఁడైనఁ జూచితివిరా! నాముఖముజూచి చెప్పుము. అని యడిగిన వాఁడు గడగడ వడంకుచు నాకేమియు జ్ఞాపకములేదని యుత్తరము జెప్పెను. అల్లనాఁడు సిద్ధునితల రాయితోఁ బగులఁగొట్టితి వదియైన జ్ఞాపకమున్నదా? అనవుఁడు చాలు చాలు నన్నెవ్వరోయనుకొని భ్రాంతిపడుచుంటివి అని గద్దించెను.

నిన్ను నే నెఱుంగుదును. భైరవుండవు. గురువుంజంపిన మహా

పాపాత్ముండవు. ఛీ! మూఢా! నీమొగముచూడ మహాపాతకమని నిందింపుచుండ ఘోటకముఖుం డరుదెంచి యేమిరా ద్రోహీ! నాఁడు ఆసుదానిం జెఱపట్టితివి జ్ఞాపకమున్నదా? అని నిందించెను అట్లు తలయొకమాటయాడి తిట్టుచుండ వాఁ డేమిచేయుటకుం దోఁచక ఇదిగో వచ్చెదనని యొకమూలనుండి పెళ్ళఁబోయిన గోఁతు లాటంకపఱచినవి. కుక్కలు తఱిమినవి. గుఱ్ఱములు తన్నినవి. వాఁ డిటునటు పరుగులిడు చుండ సామాజికులు నవ్వసాగిరి.

అప్పుడు కుచుమారునిచేఁ జెప్పఁబడి యొకభల్లూకము వాని నొకచెంపకాయ గొట్టి జుట్టుపట్టికొని వంచి లాగికొనివచ్చి కుచుమారుని పాదమూలమునఁ బడవేసినది.

కుచుమారుఁడు వానిశిరము కాలితోఁ దన్నుచు గురుద్రోహీ! పరమతపోనిధియగు నాసిద్ధుం బరిమార్చి యేమిమూటఁగట్టుకొంటివి? యముఁడు నీ నిమిత్తమై క్రొత్తనరకము గట్టించుచున్నాఁడు. పదపద. నీ విఁక నీభూమిలో నుండఁదగినవాఁడవు కావు. ఎందఱనెన్నిద్రోహములు సేసితివి. సీ! సీ! కీటకాదులలోఁగూడ నీవంటి నీచజన్మములేదని మీఁద నుమ్మివైచి బాలిశా! ఈమృగములన్నియు నెవ్వరో నిజము జెప్పుము. లేకున్న నిదిగో మృగములచేత నీపనిపట్టించెదనని పలికిన వాఁ డేమియు మాటాడక జీవచ్ఛవములాగున పడియుండెను.

అప్పుడు వానిపాదములకుఁ జేతులకు నిగళములు దగిలింపఁజేసి మృగములన్నిటినిఁ బరిశీలించి మెడలలోఁ గట్టఁబడియున్న తాయెత్తుల లాగివైచినంతఁ గొన్ని పురుషులుఁ గొన్ని స్త్రీలునై, నిలువంబడినవి. సభ్యులెల్లరు విస్మయము జెంది చూచుచుండిరి. అప్పుడు వారు అంబా! తాతా! అక్కా! అన్నా! అని యాక్రోశించుచుండిరి.

వారిలో యక్షుండు నలుమూలలు సూచుచు దీపప్రభావిశేష ముల కచ్చెరువందుచు నది స్వర్గమాయని విభ్రాంతిఁ జెందుచుండ

సువర్ణనాభుండు సమీపించి మహాత్మా! నన్నెఱుంగుదువా? సువర్ణపదిక భర్తను సువర్ణనాభుండ. మావదినయు నిందేయున్నదని పలుకుచుం గౌఁగిలించుకొనియెను. ఈసభ యెవ్వరిది? నే నిక్కడి కెట్టువచ్చితిని? అని యడిగిన సువర్ణనాభుండు ఇది భోజరాజుగారిసభ. అతఁడే మహారాజు. అతఁడే కాళిదాసు. వారే నామిత్రులు. వీఁడే భైరవుండు బాధింపఁబడెను.

అని యావృత్తాంతమంతయు నెఱింగించుటయు నాయక్షుండు చేతులెత్తి భోజకాళిదాసకవులకు నమస్కరించుచు చారాయణునితో వారందఱు సేమమా భైరవుని బాధించుట లోకోపకారము. మల్లికతల్లిదండ్రులు వచ్చిరా? అనుచుండఁగ నే బ్రహ్మదత్తుఁడును భార్యయు నందువచ్చి తమకథ యెఱింగించిరి. మల్లికయు నందేయున్నదని విని ప్రహర్షపులకితగాత్రులై భోజునకుం దమ్మెఱింగించి భైరవుఁడు గావించిన యవమానము దెలియఁజేసిరి. భైరవవంచితులగు వారినెల్ల భోజుండు ఆదరించి పీఠస్థులఁ గావించి వారివారివృత్తాంతము లడిగి తెలిసికొనియెను. ఆకథలు విని సభ్యులు నాటకముచూచినదానికన్న నెక్కుడుగా సంతోషించిరి. సువర్ణనాభుండు యక్షుంజూపుచు నీతఁడే మనకు పరమోపకారి. ఈతఁడే మనకెల్ల వంద్యుఁడు. అని యాతనికథ యెఱింగించుచు మనకాళిదాసకవి యీదంపతులకథయే మేఘసందేశముగా రచించెనని చెప్పెను.

అప్పుడు భోజుండుయక్షునిఁ బెద్దగాగౌరవించుచు ఘోటకముఖునితో జనాంతికముగా నిందు లీలావతి లేదేమి? అని యడిగిన నవ్వుచు మహారాజా! లీలావతి నంతకుముందే యక్షుండు రక్షించెను. మీవీట మామిత్రులయింట నున్నది. మీయభిమత మెఱింగింపవలయునని వారు నిరీక్షించుచున్నారని యాకథ యెఱింగించెను. అప్పుడు భోజుండు యక్షుంగౌఁగిలించుకొని మహాత్మా! నీవు మనుష్యాతీతుఁడవు. మాతోఁ గలిసి

మెలసి తిరుగుచు మాకుపకారములు గావించితివి. ఎల్లకాలము కృతజ్ఞుల మైయుండెదము. నీవు లేకున్నఁ జారాయణుఁడు భైరవునికిఁ బిండివంట యైపోయెడివాఁడే యని స్తుతిఁజేయుటయు యక్షుండు మహారాజా! మేము మిమ్ముఁ జూచుటకై మిక్కిలి యుత్సాహమందుచుంటిమి. కాళిదాసవిరచిత మేఘసందేశము వినినది మొదలు నా కాకవియందు నత్యంత భక్తివిశ్వాసములు గలిగినవి. దైవికముగా దత్తుఁడు మాయింటికి రాఁబట్టి యిందఱఁ జూచుభాగ్యము పట్టినదని చెప్పఁగా నతండే కాళిదాసకవి, యేమియు నెఱుఁగనివాఁడుబోలె నందుఁ గూర్చున్నవాఁడని చూపిన యక్షుండు వోయి యతనిపాదంబులఁబడి స్తుతియింపుచుండెను.

ఆసందడిలో గోణికాపుత్రుఁడు చిత్రసేనునొద్దకుఁ బోయి పురుషవేషముతోనున్న చారుమతిం జూచి ఇడిగో మనదత్తుఁడు దత్తుఁడు అని కేకపెట్టెను. అందఱు నచ్చటికివచ్చి చూచి మిత్రమా! మాటాడవేమి? ఇందు రహస్యముగాఁ గూర్చుంటివేల? అని యడుగుచుండ నెవరికిని సమాధానము జెప్పక రాజపుత్రుని మఱుఁగుఁజేరెను.

అప్పుడు సువర్ణనాభుండు వీఁడు దత్తుఁడుగాఁడు. పోలిక యట్లున్నది. దత్తుఁడు స్త్రీరూపముతోఁ దిరుగుచున్నాఁడు. యక్షశాపము మాట మఱచితిమి. వానినే పట్టుకొనవలసియున్నది. అనిపలుకుచుఁ గాళిదాసుతో ముచ్చటించుచున్న యక్షునితో మహాత్మా! నీవలన మాకనేకోపకారములు జరగినవి. దత్తునిఁ బురుషునిఁ జేయవా? యెందున్నవాఁడో చెప్పవా? అనియడిగిన యక్షుఁడు కాళిదాసుం జూపుచు మాచరిత్రము చూడకయే రచించిన మహాభావుండు మనచెంత నుండఁగ, దత్తుఁ డెందుండెనో నేను జెప్పవలయునా? ఆతఁడే యెఱిఁగింపఁగలఁడు అని ముకుళితకరకమలుండై ప్రార్థించినఁ గాళిదాసకవి ముసిముసినగవులు నవ్వుచు రాజుగారి మొగము జూచుచు నీక్రిందిశ్లోకము చదివెను.

శ్లో॥ దత్తకో పుత్రికాగర్భ దత్తకో చిత్తజోపమః
యక్షశాపాభిభూతస్తై జామాతైవ స్నుషా భవత్ ॥

మన్మధునిబోలియున్న దత్తకుఁడు భోజరాజపుత్రికకు గర్భము చేసి యక్షశాపమువలన నాడుదియై చిత్రసేనునకు భార్యగానున్న వాఁడు. అందువలన నల్లుఁడే కోడలయ్యెనని సమస్య పూర్తిచేసెను.

ఆశ్లోకమును విని యందఱు తెల్లతెల్లఁబోయి చూచుచుండిరి. రాజుగారికి బాగుగా విడిపోయినదికాదు. అప్పుడు గోణికాపుత్రుఁడు సంతోష మభినయించుచుఁ బెద్దయెలుఁగున నాకుఁ దెలిసినది. ఈరహస్య ము నాకుఁ దెలిసినది. అని కేకలుపెట్టుచు మనము చూచినవాఁడే దత్తుఁడు. స్త్రీరూపముతోనుండి చిత్రసేనునిప్రోత్సాహమునఁ బురుషవేషము వైచికొని వచ్చెను. శాపాభిభూతుండగుట పూర్వస్మృతి లేదు. అని యారహస్య మెఱింగించెను. అప్పుడు రాజపుత్రునివెనుక నొదిగియున్న చారుమతిం బట్టుకొని గోణికాపుత్రుఁడు యక్షునొద్దకుఁ దీసికొనివచ్చి వీఁడే మామిత్రుఁడు. నీశాపమున నిట్లున్నవాఁడు. శాపవిమోచనము గావింపుమని ప్రార్థించెను. అప్పుడు యక్షుం డీశ్లోకమును జదివెను.

శ్లో॥ కాంతాస్యజ్ఞానతఃపూర్వాం మద్రహస్య ప్రశంసనాత్
కాళిదాస ప్రసాదేన పురుషోభవదత్తక॥

అని చదువుచుండఁగనే అదేవేషము అదేరూపము వెలయ నాదత్తుండున్మత్తత వదలి నిజరూపవిద్యాపాటవంబులు దేటపడ నోహో హో! నామిత్రులందఱు నిందేయున్నారు. ఎప్పుడువచ్చితిరి? నే నింత దనుక నిద్రఁబోవుచున్నానుకాఁబోలు నేమియు జ్ఞాపకము లేదేమి? అని యడిగెను.

మిత్రులందఱు నతనిం గౌఁగిలించుకొని సౌహార్దము దెలుపుచు నీయక్షకాళిదాసులమూలమున నీయాపద దాటితివి. నీవృత్తాంతము చాలఁగలదు. ఆనక దెల్పెదము అని తత్సమయోచితముగా సంభాషించిరి.

తెరలోనుండి మల్లిక తల్లిదండ్రులఁ జూచి నిలువలేక అమ్మా! తండ్రీ! అమ్మా! అమ్మా! అని యఱచుచు నీవలకు రాఁబోయినది.

యక్షపత్ని భర్తంజూచి నిలువలేక హా ప్రాణనాథా! అని పిలుచుచు బయటకుఁ బోఁదొడంగినది. సరస్వతి వారి వారించినది.

రుక్మిణి లీలావతితో నమ్మా! ఆతఁడే నాభర్త. అన్నన్నా! యెంతయో వెదకించితిని. ఇక్కడి కెట్లువచ్చిరో తెలియదని చెప్పిన విని లీలావతి యావిశేషములన్నియుఁ జూచుచుండుటంబట్టి తెలిసికొని పుత్రీ! నీయదృష్టము ఫలించినది. నా కంతయుం దెల్లమైనది. నీభర్త దత్తకుఁడు యక్షశాపంబున నాఁడుదియై నీతో స్నేహముసేసెను. సంవత్సరము ముగిసినతరువాతఁ బురుషుఁడయ్యెను. యక్షశైలవృత్తాంతము సువర్ణపదికకుఁ జెప్పుటచేఁ దిరిగి స్త్రీయైపోయెను. మీయన్న చిత్రసేనుఁ డామెను స్వీకరించెను. ఇప్పుడు కాళిదాసకవీంద్రుఁ డావిషయమై (జామాతైవస్నుషా భవత్) అని శ్లోకముగాఁ జదివెను. నీవు వినలేదు. నీబుద్ధి యాదత్తునిమీఁద నున్నది. తరువాత గోణికాపుత్రుఁడు వచ్చి కపటదత్తుని దీసికొనిపోయి యక్షునిచే శాపనివృత్తి గావింపఁజేసికొనియెను. ఇదియే నీనిరహస్యము. నీవువరించినవాని ప్రతిబింబము జూచి సువర్ణనాభుఁడు నాఁడే దత్తుఁడని చెప్పెను. అని యావిశేషములన్నియుం జెప్పినది.

అమ్మయ్యో! ఇదియా కారణము? తల్లీ! నారహస్యము సభలో వెల్లడియైనదాయేమి? ఈసంగతివిని మాతండ్రిగా రేమనిరి? సభ్యులు పరిహాసమాడిరా? నే నాదెస జూడలేను. అని రుక్మిణి యడిగిన నీవు చేసినపని తప్పుకాదు. నిజ మెఱింగి వారే సమాధానపడియెదరని తల్లి యోదార్చినది.

భోజుండు వారివారి చరిత్రములన్నియు విని యందఱ గౌరవించుచుఁ దగిననెలవులు నియమించి పంపి తా నాకాళిదాసకవితోఁగూడ పండితకవులవెంట వారినివాసముల కరిగెను. రుక్మిణీప్రభృతియువతులును వారివెనుకనే యానివాసదేశంబు జేరిరి. భైరవుం గట్టిపెట్టి రాజభటులు కారాగారంబునం బెట్టిరి.

భోజమహారాజు ఆచావడిలో నాపండితులతో నాంతరంగిక సభ గావించి లేచి నమస్కరించుచు నిట్లనియె. మహాత్ములారా! ఇందున్నవారు జగత్పండితులు. యక్షుండు దేవతావిశేషుఁడు. ఇట్టివారికడ యథార్థము జెప్పినచో నేనుగావించిన పాతకము వాయఁగలదు. వినుండు. ఈకాళిదాసకవిసార్వభౌముండు త్రిలోకపూజ్యుండు. నాకు బహిః ప్రాణము. ఈతనివిడిచి నేను క్షణకాలము నిలువలేను. ఇట్టివిస్రంభపాత్రుని విమర్శింపక బాలిశులుపన్నిన కపటవ్యూహమునఁ జిక్కి నిష్కారణము నవ్వలఁ బొమ్మంటి; నయ్యనుమానముననే మహాసాధ్వీలలామము నడవిపాలు గావించుకొంటిని. ఆపాతకము ననుభవించుచు స్థానభ్రష్టుండనై దేశములఁ దిరిగితిని. భైరవునిచే మేషముగాఁ జేయఁబడితిని. చివర కీమహాత్మునిచేతనే విముక్తి నొందితిని. నాఁడు నన్నితండు విడిపించనిచో నీపాటికిఁ బరలోక మలంకరించువాఁడనే. మహాత్ము లపకారికే యుపకారము సేయుదురు. నాకట్టియుపకారము గావించి నాప్రార్థనల నంగీకరించి తిరుగా నాయింటికి విచ్చేసెను. నాకు లీలావతీవియోగదుఃఖముతోపాటు రుక్మిణీచిత్రసేనుల యసభ్యప్రవర్తనములు నాహృదయమును మిక్కిలి వేధింపఁదొడంగినవి. ఆచింతలుగూడ నీదివ్యజ్ఞానసంపన్నుఁడు వదలఁజేసెను. దత్తకుండు నాకల్లుఁడు, కోడలు నయ్యోనని యెఱింగించెఁగదా? యక్షుండే యీనాటకమునకు సూత్రధారుండు. ఈనాటకకథ యందఱకుఁ దెలిసినవిషయముగానఁ దిరుగా వక్కాణింప నేమిటికి? దత్తుండు నా కల్లుఁడయ్యెను. ఘోటకముఖుఁడు ప్రాణస్నేహితుఁడు. గోణికాపుత్రుండు నాకుమారునికి మిత్రుఁడు. గోనర్దీయ కుచుమారులు రాజబంధువులు. సువర్ణనాభుండును దేవతుల్యుఁడు. యక్షుండు మనకందఱకు వంద్యుఁడు. నేఁ డిందఱుక్రొత్తమిత్రులననుమ నిలిచి సంభాషింప నొనగూడినది. ఇంతకన్న భాగ్య మేమియున్నది. నా ప్రాణనాయకి లీలావతినిఁగూడఁ జూచితినేని యిట్టిసుదినము నాకు మఱి

గొకటి యుండదు. అని పలుకుచుండఁగనే యాప్రాంతమందుండి యీ యుపన్యాసమువినుచున్న లీలావతి హా! ప్రాణనాథా! నేను ధన్యురాల ధన్యురాల. నీచే నిట్లు స్మరింపఁబడుచుంటినని పలుకుచు నతని పాదంబులం బడినది. భోజుండు ప్రమోదకంటకితశరీరుండై సంతోషాశ్రువులచేఁ దచ్ఛిరంబుఁ దడుపుచు లేవనెత్తి పెద్దగా గౌరవించుచుఁ దాను జేసినతప్పు మన్నింపుమని వేఁడుకొనియెను. అప్పుడు లీలావతి,

> క. పతి తన్ను సుగుణవతి యని
> స్తుతియించుటకంటెఁ గలదె సుందరికిఁ బ్రియం
> బతులవ్రతములు దానము
> లతిశయముగఁ జేయుసుకృత మగుఁ బతి మెచ్చన్.

మీరు నన్నిందఱిలో మెచ్చికొనుటచే నేను ధన్యురాలనైతిని. ఈపండితులు నాకు సోదరులై యాదరించిరి. యక్షుండు తండ్రియై రక్షించె. యక్షకాంతలు తల్లులై మన్నించిరని తనవృత్తాంతమంతయు నెఱింగించినది. అంతలో రాజపుత్రికయగు రుక్మిణియు పాదకటకంబులు ఘల్లురనిమ్రోయ నల్లన తల్లివెనుక వారినికటంబునకుఁ బోయి భర్తకు మ్రొక్కి తండ్రికి నమస్కరించి పండితులకుఁ గేలుమోడ్చి యేదియో చెప్పఁదలంచి సిగ్గుచే మాటరాక దత్తునిమో ముపలక్షించుటయు నానన్న యెఱిఁగి యాపండితుఁడు లేచి యిట్లనియె.

మహారాజా! భగవంతుని యఘటితఘటనాసామర్థ్యము మీకు వేఱ చెప్పనక్కఱలేదు. నేను యక్షశాపదుఃఖితుండనై యొందో. పోవుచుండ నీమెగుఱ్ఱము కళ్లెముద్రెంచికొని నాకిడకు వచ్చుట భగవత్ప్రేరితముగాదా? అది మీయశ్వమని యెఱుంగక యెక్కితిని. ఆ హయంబు రయంబున నీమెయుద్యానవనమునకుఁ దీసికొనివచ్చుటకు దాని నేఁ దోలితినా? నేను శాపంబునఁజేసి యాఁడుదాననైతినని యీమె యేమియు నెఱుంగదు. విద్యాగ్రహణలాలసయై నన్నుఁ దన యం

తఃపురమునకుఁ దీసికొనిపోవుట తప్పుగాదుగదా? దౌవారికులమాట విని నీకుమారుఁడు నన్నుఁ బరీక్షింపవచ్చుటయు న్యాయమే. నన్నతండు మోహింప నాయింగితమువదనువున నతని మందలించుటయు సమంజసమే. శాపాంతమున నేను బురుషుండనై యుంగాంగమేళనం బొనరించి యున్న నన్నుఁ బతిగావరించుట యేమితప్పో చెప్పుఁడు. అని తనయుదంతమంతయు నెఱింగించి రుక్మిణి నిర్దోషురాలని యెల్లరకుఁ దెలియునట్లుపన్యసించెను.

అప్పుడు భోజుఁడు పుత్రికం జేరఁదీసి గారవించుచుఁ దల్లీ! నీవిందులకు వగవంబనిలేదు. అప్రయత్నముగనే జగత్పూజ్యుండగు పండితుఁడు నీకు భర్తయయ్యె. ఇది నీయదృష్టము. అని బుజ్జగించిపలుకుచుఁ గూఁతునకుఁ బ్రీతిఁగలుగఁజేసెను. పిమ్మట రత్నపదిక వచ్చి యక్షునకు మ్రొక్కుచు వియోగదుఃఖమును బ్రకటించుచు నతనిమన్ననలం బడసినది.

తరువాత మల్లికవచ్చి తల్లిదండ్రులం గౌఁగిలించికొని దుఃఖించుచుఁ దనకు యక్షదంపతులు గావించిన యాదరణము లుగ్గడించుచుఁ బతిముఖనిహితదృష్టియై యున్నంత భోజభూపతి యాసతీతిలకము పాండిత్యమహత్వము గవిత్వప్రౌఢియు ననన్యసాధారణములని స్తుతియించెను.

అప్పుడు రతిమంజరీచిత్రసేనలు వచ్చి వారిముంగట నిలువంబడుటయు గోణికాపుత్రుండు వారుపడినయిడుములన్నియు నుగ్గడింపుచు పెద్దగా నగ్గించెను. దత్తుం డామత్తకాశినులం జూచుచు నోహో! నా బాల్యస్నేహితురాలు చిత్రసేనయే. అయ్యో! నానిమిత్త మెన్నికష్టముల పాల్పడితివి? ఎట్టియైశ్వర్యము విడిచివచ్చితివి. అని కొనియాడుచుఁ దత్కాలోచితములగు మాటలచే నయ్యువిదలకు సంతోషము గలుగఁజేసెను.

అప్పుడు భోజభూభుజుండు వారినందఱం గలయంగనుంగొని వారువారుపడిన కష్టములు తిరిగినదేశములు చూచినవింతలు ప్రత్యేకముగా వెంకియు నడిగి తెలిసికొని యోహో! నేఁడు మహోత్సవదివసము. వియోగముబొందినవారందఱము గలిసికొంటిమి. ఇట్టి సంతోషము గలుగఁజేయువాసరము మఱియొకటి యుండదు. అని యుపన్యసించుచు మీరందఱు నిందుండి నాకానందము గలుగఁజేయుచుండవలయును. గోనర్దీయకుచుమారులు రాజ్యభారవాహకులు కావున వచ్చుచుం బోవుచు నుండురు. యక్షుండు మాకుఁ బ్రత్యక్షదైవము. దర్శనపాత్రులముగాఁ జేయుచుండవలయునని ప్రార్థించుటయు నందుల కందఱు ననుమోదించిరి.

గోనర్దీయకుచుమారులు మారాజ్యములు మాయొక్కరివేకావు. మేమేమ్వరము పంచుకొనవలసినవారమే. మీమూలముననే మాకీయైశ్వర్యములు గలిగినవి. మిమ్ము మేము ప్రభువుగా మిత్రుగా దైవముగా భావించుకొనియుందుము. మీరాజ్యము స్వరాజ్యముగానే యెంచికొందుమని తగురీతి నుత్తరము జెప్పిరి. అంతటితో సభ చాలించిరి.

భోజుండు లీలావతి నప్పుడే తనయంతఃపురమునకుఁ దీసికొని పోయెను. ఆమె పండితకుటుంబమును వెంటఁబెట్టికొనిపోయి పెద్దగా నాదరించినది. అమ్మఱునాఁడే భోజుండు దత్తకుఁడు తనకు జామాతయని ప్రకటింపుచు వివాహమహోత్సవవిశేషములు నిర్వర్తించెను. దత్తుఁడు చిత్రసేనను రెండవభార్యగా స్వీకరించెను. గోణికాపుత్రుండు విద్యారూపశీలసంపన్నయగు తదాస్థానకవి శంకరునిపుత్రికం బెండ్లియాడి రతిమంజరిని రెండవభార్యగాఁ గైకొనియెను యక్షుండు రత్నపదికతో మూఁడునెల లయ్యుత్సవవిశేషముల నానందించుచుఁ బిమ్మటఁ దమశైలమునకుం బోయెను.

భైరవున కెట్టిశిక్ష విధింపవలయునని మఱియొకనాఁడు గొప్ప

సభ గావించిరి. వాఁడుచేసిన దుష్టక్రియలనెల్ల విమర్శింపుచు నిట్టిదుర్మార్గుఁడు జీవించియుండినచో లోకమున కపకారముజరుగునని నిశ్చయించి సామాజికులు వాని కురిశిక్షయే విధించుట కర్హమని యేకవాక్యముగాఁ బలుకుటచేఁ బట్టణమంతయు నూరేగింపుచు నొకనాఁడు వాని నురిఁదీసిరి.

మఱియు నీసప్తమిత్రులును బ్రభుపుత్రుండగు పాంచాలునిచే క్లుప్తముగా రచింపఁబడిన కామశాస్త్రములోని సప్తాధికరణములు నొక్కొక్కటి నొక్కొక్కఁడు ప్రత్యేకముగా రచించిరి.

అందుఁ జారాయణుఁడు సాధారణాధికరణము సువర్ణనాభుండు సాంప్రయోగికము ఘోటకముఖుండు కన్యాసంప్రయుక్తము గోనర్దియుఁడు భార్యాధికారికము గోణికాపుత్రుండు పారదారికము దత్తకుండు వైశికాధికరణము కుచుమారుండు ఔపనిషదికమును వ్రాసి కామశాస్త్రప్రవక్తలలో నగ్రగణ్యులైరి.

చ. ఇరువురు రాజులైరి మఱియిద్దఱు రాజుల కల్లురైరి యొ
క్కరుఁడల రాజమిత్రుఁడనఁగాఁ దగె నొక్కఁడు యక్షకన్యకం
బరిణయమయ్యె శ్రోత్రియకుమారిక నొక్కఁడు పెండ్లియాడె నీ
ధరఁ దగె సప్తమిత్రచరితంబు విచిత్రకథాస్పదంబుగాన్.

గోపా! (జామాతైవ స్నుషాభవత్) అల్లుఁడే కోడలయ్యెను. అని నీవడిగిన ప్రశ్నమునకు నీకథ సమాధానము జెప్పినదా? అనిచెప్పిన ముప్పిరిగొనుసంతోషముతో వాఁడు స్వామికి మ్రొక్కుచు మహాత్మా! ఇట్టి గూఢార్థముగల యాశ్లోకము వారి కెట్ల[illegible] రెండు మాటలతోఁ జెప్పెదరేమో పోయి వారి [illegible]యర్థము చెప్పవలయునని తలంచితిని. అయ్యావసథంబు దాటి చాలదూరము వచ్చితిమి. పోనిందు మంచికథ వినుట తటస్థించినది. తలవనితలంపుగా భోజకాళిదాసకవుల కథలుగూడ నిందుఁ గూడినవని యుబ్బుచు నయ్యతిశిఖామణివెంటఁ గావడి మోయుచు నవ్వలిమజిలీ చేరెను.

చ. పరమదయాసమగ్ర వృషభధ్వజ భక్తజనప్రసక్త శం
కర గిరినందినీహృదయకంజ దివాకర వాసవాదిని
ర్జరగణమస్తకస్థగితరత్న విచిత్రవిభాలసత్పదాం
బురుహ మహేశ! పాపహర! భూధరమందిర! చంద్రశేఖరా!

క. నీగురుకృప నీయష్టము
భాగము రచియించినాఁడఁ బావనమతి నో
యోగినుత! చేయు మీకృతి
నాగగనమణీంద్రతారకమై వెలయుంగన్.

గద్య. ఇది శ్రీమద్విశ్వనాథ సదనుకంపాసంపాదిత కవితావిచి
త్రాత్రేయమునిసుత్రామగోత్రపవిత్ర మధిరకులకలశజల
నిధి రాకాకుముదమిత్ర లక్ష్మీనారాయణపౌత్ర కొండ
యార్యపుత్ర సోమిదేవీగర్భశుక్తిముక్తాఫల
విబుధజనాభిరక్షిత సుబ్బన్నదీక్షితకవి
విరచితంబగు కాశీయాత్రాచరిత్ర
మను మహాప్రబంధమున
అష్టమ భాగము
సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ

శ్రీవిశ్వనాథార్పణమస్తు.

# విషయసూచిక.


| మజిలీ. | | పుట. |
|---|---|---|
| 142 | దత్తునికథ | 2 |
| 143 | భోజునికథ | 13 |
| 144 | రుక్మిణికథ | 27 |
| 145 | గోణికాపుత్రునికథ | 48 |
| | జారకథ | 50 |
| | రత్నవర్తకులకథ | 59 |
| 146 | రతినూపురకథ | 69 |
| 147 | చిత్రసేనారతిమంజరులకథ | 78 |
| 148 | మతంగయోగినికథ | 86 |
| 149 | చింతామణికథ | 94 |
| 150 | అగ్నిశిఖునికథ | 115 |
| | మాతంగునికథ | 117 |
| 151 | డాకినీదేవతకథ | 133 |
| 152 | దత్తశాపవిముక్తికథ | 142 |
| 153 | యక్షిణీగానముకథ | 158 |
| | సువర్ణనాభునికథ | 163 |
| | సువర్ణపదికకథ | 167 |
| 154 | కుచుమారునికథ | 172 |
| | సిద్ధునిస్వీయచరిత్ర | 176 |
| 155 | సరస్వతికథ | 180 |
| 156 | శంబరునికథ | 190 |
| 157 | పల్లవాంధ్రకథ | 197 |
| 158 | గోనర్దీయునికథ | 208 |
| | దేవభూతికథ | 213 |
| 159 | మదయంతికథ | 222 |
| 160 | భైరవునికథ | 233 |
| | తిర్యగ్జంతుమహాసభకథ | 235 |
| | సిద్ధునికథ | 242 |
| | చారాయణునికథ | 249 |
| 161 | అష్టాపథసత్రము | 257 |
| 162 | పురందరపురము | 263 |
| 163 | అల్లాణరాజుకథ | 275 |
| | సర్వస్వుకథ | 289 |
| 164 | యక్షునికథ | 295 |
| 165 | మజిలీ— | 308 |
| 166 | మజిలీ— | 313 |
| 167 | మజిలీ | 324 |
| 168 | ఘోటకముఖునికథ | 332 |
| | కౌశికునికథ | 346 |
| 169 | మదాలసకథ | 351 |
| 170 | మిత్రసమ్మేళనము | 382 |

బ్రహ్మశ్రీ మధిర సుబ్బన్నదీక్షితకవి కృతగ్రంథములు.

# కాశీమజిలీకథలు

| రు. అ. పై. | |
|---|---|
| 1—8—0 | 1 భాగము. వరప్రసాదుల కథగలది. |
| 1—8—0 | 2 భాగము. అదృష్టదీపుని కథగలది. |
| 1—12—0 | 3 భాగము. మందారవల్లి కథగలది. |
| 1—12—0 | 4 భాగము. విజయభాస్కరుని కథగలది. |
| 1—8—0 | 5 భాగము. శంకరుని కథగలది. |
| 1—12—0 | 6 భాగము. భోజుని కథగలది. |
| 1—12—0 | 7 భాగము. విభీషణుని కథగలది. |
| 1—12—0 | 8 భాగము. దత్తకాదుల కథగలది. |
| 1—12—0 | 9 భాగము. విక్రమార్కుని కథగలది. |
| 1—12—0 | 10 భాగము. నారదుని కథగలది. |
| 1—12—0 | 11 భాగము. ప్రహ్లాదుని కథగలది. |
| 1—12—0 | 12 భాగము. పుండరీకుని కథగలది. |
| 0—12—0 | అనుబంధము. (కాదంబరి) కాదంబరీ మహాశ్వేతల కథ. |

ఒక్కొక్క పుస్తకముగా తెప్పించుకొనుటకంటె 2, 3 కలిపి తెప్పించుకొనినచో పోస్టుచార్జీ తగ్గును. మేము అట్టివారికి కొంత సహాయము చేయుచుందుము.

వలయువారు:—

మధిర సుబ్బన్న దీక్షితకవి అండ్ సన్,

ఉల్లితోటవీధి, రాజమండ్రి. అని వ్రాయవలెను.